ఓం అంఆ



మాతృశ్రీ
జీవిత మహోదధిలో తరంగాలు

శ్రీ విశ్వజననీ పరిషత్
జిల్లెళ్ళమూడి
గుంటూరు జిల్లా.

మాతృశ్రీ
జీవిత మహోదధిలో
తరంగాలు

'రవిహ'

శ్రీ విశ్వజననీ పరిషత్
జిల్లెళ్ళమూడి - 522 113
గుంటూరు జిల్లా, ఆంధ్రప్రదేశ్

మాతృశ్రీ జీవిత మహోదధిలో తరంగాలు
సర్వస్వామ్య సంకలితము
శ్రీ విశ్వజననీ పరిషత్
జిల్లెళ్ళమూడి - 522 113
ఫోన్ - 08643 - 27324

ప్రతులు : 1000

మూల్యం :
సాదా ప్రతి : రూ. 150/-
లైబ్రరల్ ప్రతి : రూ. 160/-

శ్రీ హైమవతీదేవి 60వ జయంతి ఉత్సవాలు
26-11-2002

డి.టి.పి. :
కుమ్మమూరు హరికుమార్
విజయవాడ.
ఫోన్ - 0866 - 442521
&
అగ్ని గ్రాఫిక్స్
ఎ.వి.అప్పారావు రోడ్,
రాజమండ్రి - 533 103.
ఫోన్ : 432980

కవర్ పేజి :
గణేష్ గ్రాఫిక్స్
డోర్ నెం: 25-18-77, బిహైండ్ శివాలయం స్ట్రీట్
సంపత్‌నగర్, గుంటూరు 522 004. ఫోన్ : 321573

నేను నేనైన నేను



మాతృశ్రీ


ఓం అంఆ

యయా శక్త్యా బ్రహ్మా

కమలనయనః ఫాలనయనః

జగత్ స్రష్టుం పాతుం

ప్రళయ ముపనేతుంచ కుశలా :।

యయా వ్యాప్తం విశ్వం

వసతి ఖలు యస్యాం జగదిదం

నమామ్యాద్యాం దేవీం

ముకుళితకరస్తా మభయదామ్ ॥

- శ్రీ పన్నాల రాధాకృష్ణశర్మ

ఓం అంఆ

ముందుమాట

బొప్పూడి రామబ్రహ్మము
అధ్యక్షులు, శ్రీ విశ్వజననీ పరిషత్,
జిల్లెళ్ళమూడి.

ప్రేమమూర్తి, వాత్సల్య పయోనిధి, మహాకారుణ్య రూపిణి అయిన అమ్మ రూపధారిణియై మనలందరిని అనుగ్రహించటానికి అవనిపై అవతరించినది. ఆమె కథ భాగవతము, సకల కళ్యాణ గుణ విశేషములు తెలియపర్చు సంఘటనలతో కూడినది అమ్మ జీవితము. అట్టి జీవితమునందలి కొన్ని షన్నివేశములు 'జీవిత మహోదధి తరంగాలు'. అమ్మ స్వయంగా దీని పారాయణ ప్రాశస్తమును గురించి చెప్పి, సుందరకాండ పారాయణ ఫలితము యీ గ్రంథ పారాయణవలన లభించునని అన్నారు. అమ్మ తన అవతారం గురించి చెబుతూ, "నా జీవితంలో మీకేదయినా మంచిదనీ, నలుగురూ అనుసరించదగినది ఉన్నదనీ అనిపిస్తే, దానిని సందేశంగా తీసుకోండి" అన్నారు. అమ్మ నోటి వెంట తాలు మాటరాదు. ఆమె కర్మలన్నీ దివ్యములు. మనకు జ్ఞాన ప్రభోదకాలు. అందలి తత్త్వమును మనము గ్రహించగలిగితే జన్మరాహిత్యమే గదా! గీతాచార్యుడు

"జన్మ కర్మ చమే దివ్యమేవం యోవేత్తి తత్త్వ తః
త్యక్తాదేహం పునర్జన్మనైతి మామేతిసోஉర్జున !!

అమ్మ వాక్యాలు ఉపనిషత్సారాలు. అమ్మ ఒక్కొక్క సందర్భములో ప్రశ్నించి, జవాబులు రాబట్టే పద్ధతి మన విచారధోరణిలో మార్పు తెస్తుంది. ఈ పుస్తక పఠనము మనకు జ్ఞానాన్ని ప్రసాదించుతుంది. సంసారమనే జలధిని దాటించగలది జ్ఞానమే గదా! "సర్వం జ్ఞానప్లవేనై వవృజినం సంతరిష్యసి" **(గీత 4-36)** అని గదా!

ఈ పుస్తకాన్ని పారాయణ చేయటం వలన మనలో సర్వం దైవనిర్ణయం వలన, జరుగవలసిన తరుణంలో జరుగతాయి అని మనస్సుకు స్థిర నిర్ణయమవుతుంది. **"అందరూ, అన్నీ కాలంమీదనే ఆధారపడ్డయ్"** "నాగుల చవితి" అధ్యాయంలో శ్రీ మహాభాగవతము నందలి

ఉ॥ వాయువశంబులై యెగసి వారి ధరంబులు మింటగూడుచుం
బాయుచునుండు కైవడి. బ్రపంచము సర్వము'గాలతంత్రమై
పాయుచు, గూడుచుండు నొక భంగి, జరింపదు కాలమన్ని యుం
జేయుచునుండ, గాలము విచిత్రము దుస్తరమెట్టి వారికిన్.

ప్రధమ స్కంధం 1-209

పై విషయము గ్రంధ పారాయణవలన మనకు లభ్యమవుతుంది.

సర్వజ్ఞ, ఆపదుద్ధారిణి, అవ్యాజ కరుణామూర్తి అయిన అమ్మ కధలు, మన ప్రశాంత జీవనానికి పునాదులవుతాయి.

పూర్వము మూడు భాగాలుగ ప్రచురించిన "జీవిత మహోదధి తరంగాలు" ఒకే పుస్తకంగా, పారాయణ కనుకూలంగా ముద్రించి అందజేస్తున్నాము. విరివిగా ఆర్తితో, శ్రద్ధాభక్తులతో పారాయణ చేసి, అమ్మకృపకు అందరూ పాత్రులవాలని ఆకాంక్షిస్తూ --

అమ్మ సేవలో

బొప్పూడి రామబ్రహ్మము

జిల్లెళ్ళమూడి

26-11-2002

ప్రేరణ

'భిన్నత్వం లేని మనస్తత్వమే దైవత్వం'

'తన పిల్లల వరకే పరిమితంగా ఉంటే పామరత్వం. అందరి యందూ ఉంటే భగవంతుడు.'

'మన బిడ్డయందు ఏమి చూస్తున్నామో అందరి యందూ దానిని చూడడమే బ్రహ్మస్థితిని పొందడం.'

'పరిమితమైన మమకారం మానవత్వాన్ని సర్వత్రా ఉండే మమకారం మాధవత్వాన్ని గుర్తింపచేస్తుంది.'

అయిదు నిండు సంవత్సరాలు. అహర్నిశమూ అమ్మ పాద సన్నిధిలో ఉన్నాను. ఈ కాలంలో కొన్ని లక్షల మందికి అమ్మ అనిర్వచనీయమైన వాత్సల్యామృతాన్ని పంచడం నేను స్వయంగా చూచాను. తన రక్త మాంసాలు పంచుకుని జనించిన ముగ్గురు బిడ్డలు పొందే ఆదరణనూ గమనించాను. ఆ అనురాగ ప్రసారంలో న్యూనతాధిక్యములు లేవు. ఆ వీక్షణలో విచక్షణ లేదు. ఆ ఒడిలో అందరూ సమమే; అందరూ సుతులే, ఆ ఒడి మమతల గర్భగుడే కాక - సమతల పెద్దబడి కూడ. అక్కడ వయోభేదంగాని, జాతి, మత, కుల వర్ణ భేదం గాని ఏమీ లేవు.

అమ్మ-తాను సకల చరచరాలకు అమ్మను - అంటూ అమ్మ అంటే ఆద్యంతరహితమయినదీ, అన్నిటికీ ఆధారమయినదీ అని వివరిస్తూ - అడ్డు లేనిదనీ స్పష్టపరిచింది. అందుకే అమ్మను చేరటానికి ఏ వ్యక్తిత్వమూ అడ్డు కావడం లేదు.

'గుణభేదమే లేని నాకు కులభేదమేమిటి?' అన్న అమ్మ ప్రశ్నలో భిన్నత్వం లేని మనస్తత్వమే ప్రస్ఫుటమవుతున్నది.

సకల సద్గుణ సంపన్నులతో పాటు పరమ దుర్మార్గులూ అమ్మ అవ్యాజమయిన ప్రేమకు పాత్రులవుతున్నారు. పండితుని నుండి పాకీపిల్ల వరకూ అందరూ అమ్మ అమృత కరస్పర్శననుభవిస్తున్నారు.

శుక్ల శోణితాలకేది కులమో అదే నా కులమన్న విశిష్ట ప్రకటనతో

అమ్మ, వినిర్మల హృదయ వైశాల్యం సకల సంకుచిత పరిమితులకూ, పరిధులకు అతీతమై అమ్మ, మానవతా సీమల నధిగమించింది.

'అన్నీ తనే అనేటటువంటి మనస్తత్వం భగవంతుడు' అన్నది అమ్మ. మేమంతా ఎవరమో-చెప్పమని అడిగినప్పుడు 'మీరంతా నేనే, మీదంతా నేనే, ఇదంతా నేనే' అన్నది. మీరు సాక్షాత్తూ రాజరాజేశ్వరమ్మా అంటే - 'మీరు కానిది నేనేదీ కాదు నాయనా' అన్నది. 'మీలో నన్ను చూచుకోనప్పుడుగదా చిక్కు?' అని మరొకసారి ప్రశ్నించింది. భక్తుల ప్రసక్తి వచ్చినప్పుడు అంతా నేనే అనుకుంటున్నప్పుడు ప్రత్యేకించి భక్తులెవరూ? అని అడిగింది.

వికలమూ, భయ విహ్వలమూ అయిన యావజ్జగతికీ 'అందరికీ సుగతే' నని కరుణ పొంగులువార హామీయిచ్చినప్పుడు అందుకు మేము ప్రార్థన అయినా చేయాలిగదమ్మా అని అడిగితే- 'మీ చేత ఆ ప్రార్థన కూడా చేయించుకోవాల్సింది నేనేగా'- అని అడిగింది.

లోకం మీదా జీవితం మీదా విసిగిన జీవి - దేహం నుండి విముక్తిని ప్రసాదించమని అర్థిస్తే- 'శరీరం ఎట్లా చెప్పి యివ్వలేదో, అట్లాగే తీసుకుంటాను ... నాకు అవసరమయినప్పుడు' - అన్నది.

లోకంలో సహస్రముఖాలవిజృంభించే దుర్మార్గమూ దౌష్ట్యమూ చూడలేక బాధపడిన కోమల హృదయుడొకడు లోకగమనంలో మార్పు తీసుకొని రమ్మని వేడుకున్నప్పుడు. 'మార్పు అవసరమని నాకు తోచినప్పుడు తప్పక మారుస్తాను'-అన్నది.

'నేను నేనైన నేను' అన్నది. అప్పటికీ మనకు అర్థం కాకపోతే 'అన్ని నేనులు నేనైన నేను' అన్నది. 'ఈ సృష్టి అనాది' అని ఆగలేదు. 'నాది' అనీ అన్నది.

సుగంధ ద్రవ్యాలన్నీ నీకోసమే పుట్టినాయమ్మా, అంటే-'అయితే దుర్గంధమో?' అని ప్రశ్నించింది.

2 దారిద్ర్యాన్ని గురించి బాధపడే బిడ్డతో 'దారిద్ర్యాన్ని కూడా నేనే నాన్నా-' అని ఓదార్చింది.

సంసారంలో ఒడుదుడుకుల గురించి వాపోతూ అనుగ్రహించమని ప్రార్థిస్తే - ఒడిదుడుకులు కూడా నా అనుగ్రహం వల్లనే' అని ఊరడించింది.

భక్తితో అశుద్ధం మీద పువ్వువేసినా తనను పూజించినట్లే అన్నది. ఏ పాదాలు పట్టినా తన పాదాలు పట్టినట్లేనన్నది. ఏ నామం స్మరించినా తన నామం జపించినట్లేనట. ఏ మూర్తిని కొలిచినా తనను పూజించి నట్లేట. ఔను-అన్ని రూపాలూ తనవే కనుక రూపరహితుడు. అన్ని గుణాలూ తనవే కనుక గుణరహితుడు.

'ఎదుటి వారిలో దైవత్వాన్ని చూస్తున్నంతసేపూ మనలో దైవత్వం కలుగుతుంది' అనీ 'నాలో మీరు మానవత్వం చూస్తారు; మీలో నేను దైవత్వం చూస్తా' ననీ అన్నది అమ్మ.

'సర్వ సంకల్పాలూ తానైతే యితరుల మనసులోది తెలుస్తుంది' అన్నది. 'హృదయం తెలుసుకోవడానికి వాక్కుతో పనిలే'దన్నది. అమ్మకు అందరి హృదయాలూ అవగతం అనటానికీ-అందరి మనసులనూ చదవగల దనటానికి- సందేహం ఏమీ లేదు. అందుకు నిదర్శనాలు వేల కొలది ఉన్నాయి.

'కనిపించేదంతా ఆత్మయే' అన్నది. 'నా దృష్టిలో అంతా జీవమయమే జడమేమీ లే'దని అన్నది. 'అన్నీ ఒకటిగా కనపడటమే జ్ఞాన'మన్నది. 'జ్ఞానమే బ్రహ్మ'మనీ అన్నది.

నిరంతరం అమ్మ చరణసన్నిధిలో ఉంటూ - అమ్మ ప్రతి మాట విన్నాను. ప్రతి కదలికా కన్నాను. అమ్మ దైవత్వానికి వాక్కుతో యిచ్చిన నిర్వచనాలన్నీ అమ్మ ఆచరణలో ఉన్నవే. అమ్మ అందించిన నవీన శాస్త్ర మంతా అమ్మ అపూర్వానుభవ సంజనితమే. ఇక మన పురాణాలూ శాస్త్రాలూ వివరించిన అవతార లక్షణాలన్నీ అమ్మలో ప్రస్ఫుటంగా కనిపించాయి. అమ్మలో సర్వజ్ఞత్వం చూచాను. సర్వశక్తిమత్వం చూచాను. సర్వనియామకత్వం చూచాను. పంచభూతాలపై అధికారం చూచాను.

అమ్మలో అవ్యాజమూ, అనిర్వచనీయమూ అయిన అనురాగం చూచాను. అసామాన్యమూ, అపారమూ అయిన కరుణను చూచాను. అలౌకికమూ అమలినమూ అయిన త్యాగం చూచాను. ఆ దృష్టిలో సూర్యుని వేడిమినీ, చంద్రుని చల్లదనాన్నీ చవి చూచాను. ఆ పాదాల్లో సర్వతీర్థాలనూ, ఆ కరాల్లో సర్వఔషధాలనూ చూచాను. ఆ సన్నిధిలో కల్ప వృక్షాలనూ కామధేను వులనూ చూచాను. అమ్మ విశ్వవిరాడ్రూప సందర్శనం చేశాను. అమ్మ దైవం

అనటానికి విశిష్టమయిన అవతారమూర్తి అనటానికి నా కేమీ సందేహం లేదు.

ఎందరో సోదరులు అమ్మ అనుగ్రహం వలన అనేక అనుభవాలు పొందారు. అమ్మను అనేక రూపాల సందర్శనం చేశారు.

'అమ్మా-గాయత్రీ, యిక్కడున్నావా?'

'అమ్మ సాక్షాత్తు రాజరాజేశ్వరీదేవి.'

'త్రేతాయుగంలోని సీతయే కలిలో అనసూయ.'

'అమ్మ లేకుండా జిల్లెళ్లమూడి రాముడు లేని అయోధ్యవలే ఉంది.'

'ఇప్పుడు చిట్టెమ్మ వయ్యావు కిట్టమ్మా-'

'అమ్మా - నీవు కైలాసం నుండి దిగివచ్చిన పార్వతివా?'

'అమ్మ అంటే బమ్మే.'

'అమ్మ కథే అవని గాథా.'

'అవనే అనసూయమ్మ కాదా?'

'అమ్మా - నీవు ఏసయ్యవా? ఏసయ్యను కన్న మరియమ్మవా?'

'రామునిలోని ధర్మదీక్షా, కృష్ణునిలోని సర్వ సామర్థ్యమూ బుద్ధునిలోని కారుణ్యమూ, క్రీస్తులోని సహనమూ, అన్నీ ప్రేమలో సంగమించి ప్రేమమూర్తి అమ్మగా యీ పృథ్వీస్థలిపై అవతరించింది.'

అసంఖ్యాతమయిన సోదరుల అద్భుత అనుభవాలు విన్నాను. అయితే - అమ్మలో అనితరసాధ్యమూ, అద్భుతమూ, అలౌకికమూ అయిన దైవలక్షణాలతో పాటు మన యీ చర్మ చక్షువులకు అనేకమయిన సామాన్య మానవ లక్షణాలు కూడా కనిపిస్తాయి. వాటితో మనచే దాగుడు మూతలు ఆడిస్తుంది అమ్మ. ఈ మానవతా మాధవత్వ విచిత్ర సమ్మేళనం వలన అమ్మ జీవితం అడుగడుగునా పరమరమణీయమై - పరమాద్భుతమై నన్ను ఆకట్టుకుంది. అమ్మ జీవితంలో ప్రతిక్షణమూ విలువయినదే. అమ్మ పలికే ప్రతి మాటా అర్థవంతమే. అమ్మలోని ప్రతి కదలికలోనూ ఎంతో ప్రయోజనమూ, ప్రబోధమూ ఉన్నాయి. అందుకే అమ్మ 'నా గాథ వెలలేని గాథ' అన్నది.

అమ్మ మూర్తి ఎంత మనోజ్ఞమో - వాక్కు ఎంత మార్దవో పేతమో, సందేశమూ అంత విశిష్టమూ, విలక్షణమూ విప్లవాత్మకమూ అయి ఉంది.

పాపం, పుణ్యం లేవన్నది. మంచీ చెడ్డలు లేవన్నది. జన్మలు లేవన్నది. త్రికాలాలు లేవన్నది. ప్రాపంచికమనీ, పారమార్థికమనీ భేదం లేదన్నది. పురుష ప్రయత్నమూ, దైవానుగ్రహమూ అని రెండు లేవన్నది. జగత్తూ బ్రహ్మలు రెండు కావన్నది. అన్ని వేళలా అన్నిటి యందూ ఒకేదాన్ని చూడడమే ఏకాగ్రత అనీ, ఆ సమాన స్థితియే సమాధియనీ క్రొత్త నిర్వచనాల నిచ్చింది.

ఇంత ప్రశస్తమయిన జీవిత చరిత్ర వ్రాయడం చాలా అవసర మనిపించింది. అమ్మను అడిగాను. 'నా జీవితమబద్ధం; చరిత్ర బద్ధం' అన్నది అమ్మ, అబద్ధమంటే - ఏ శాసనానికి బద్ధం కాక పూర్తి స్వాతంత్ర్యం కలదనీ, అద్యంతరహితమూ అపరిమితమూ అయిన అమ్మకు యీ రూపమూ ఈ సంసారమూ యివన్నీ అబద్ధం కాక మరేమవుతాయి. అనుకొని 'దానిని చరిత్ర బద్ధం చేయాలమ్మా' అన్నాను అమ్మ అంగీకరించింది.

ఆసక్తితో ఉత్సాహంగా విషయ సంగ్రహణ ప్రారంభించాను. అమ్మ జీవితంతో సంబంధం కలిగిన అనేకులను సంప్రతించాను. అనేక సంగతులు సంగ్రహించాను. జీవితమంతా అత్యద్భుతంగానూ అపూర్వ రమణీయంగానూ ఉన్నది.

ఎంత తెలుసు ననుకున్నా-ఇంత మహనీయమూ మహిమాన్వితమూ అయిన జీవితంలో మనకు అందని విషయాలెన్నో ఉండవచ్చును! అందు వలన-అవకాశం లభించినపుడెల్లా అమ్మను పదేపదే అర్థించాను. జీవిత మహోన్నత శిఖరాలు చూపించమని, అమ్మ అనుగ్రహించింది. మహోన్నత శిఖరాలేకాదు, సముద్రపు లోతులూ చూపింది. వెలుగు వెల్లువలే కాదు, చీకటి కోణాలు చూపించి చీకటే వెలుతురున కాధారమన్నది. సుఖమయ ఘట్టాలేకాదు. బాధాపూరిత ఘట్టాలూ వివరించి 'బాధే భగవంతుడు నాన్నా' అన్నది. ఐతే 'నీవు బాధల భగవంతుడివా?' అన్నాను. చరిత్ర కరుణామయమ్మై రమణీయమూ రసవత్తరమూ అయింది.

ఎన్నో క్రొత్త విషయాలు: ఎన్నో అనితరసాధ్య మహిమలు; ఎన్నో అపూర్వ సంఘటనలు; ఎన్నో అనుపమ సంభాషణలు; అసామాన్యమయిన

జీవితం సామాన్యులకు ఏమి అర్థమవుతుంది? అలౌకికమూ, కాలాతీతమూ అయిన శక్తి లౌకికులకు ఎట్లా అవగాహన మవుతుంది?

అది జీవితంగాదు. మహోదధి అనిపించింది. అందులో తరంగం వెంట తరంగం! అన్నీ మహోన్నతాలే. అన్నీ మహిమాన్వితాలే. అన్నీ మధుర మధురాలే. మరి-యీ మహోదధిలోనిది జలం కాదు. అమృతం.

నాకు భయ మావహించింది. ఈ జీవితాన్నా నేను అక్షర బద్ధం చేద్దామనుకున్నదని, మహాసాగరాన్ని యీదాలని చేసే నా ఉద్యమానికి నాతే సిగ్గువేసి నా ప్రయత్నం విరమించుకున్నాను. కానీ, అమ్మ జీవితకాలంలో ఉన్న మనమంతా అదృష్టవంతులం, అపద వచ్చినా, అవసరం వచ్చినా అమ్మ దగ్గరకు వస్తున్నాము. అమ్మను చూస్తున్నాము. ఆ ప్రేమ ననుభవిస్తున్నాము. మనశ్శాంతినీ ఆనందాన్నీ పొందుతున్నాము. ముందుకాలంవారు మనం మూర్తి నుండి పొందుతున్న ఆనందం చరిత్ర నుండి అయినా పొందాలి. కనుక చేతనయినంత వరకు మన అనుజులకు యీ దివ్యచరిత్ర అందించడము పరమ ధర్మమని పించింది.

అందువలననే ఈ విషయ సంగ్రహణమూ, రచనా నా తపను అయింది. ఈ తపస్సులో స్వార్థమూ, పరమార్థమూ రెండూ ఉన్నాయను కుంటున్నాను.

అమ్మ అనుగ్రహమూ, ఆశీర్వచనమూ నేను ఎంతగా పొందానను కున్నా - ఈ రచన విషయానికి వచ్చేసరికి నేను అశక్తుడనై పర్వతాలను పరమాణువులు గానూ, జలనిధులను జల బిందువులుగానూ మాత్రమే చూపించగలుగుతున్నాను.

ఇందుకు అమ్మా, సోదరులూ నన్ను క్షమించాలి. అమ్మ ఎట్లాగూ క్షమిస్తుంది. మరొకటి తెలియదు కనుక. సోదరులు కూడ నన్ను మన్నించాలని మరొకసారి వేడుకుంటున్నాను.

జిల్లెళ్ళమూడి

15-1-68

- రచయిత.

అమ్మ

వేదాంతవనంలో ఒక పారిజాతం పరిమళించింది. ఆధ్యాత్మిక సారస్వతంలో ఒక నవీన పదకోశం ప్రభవించింది. సాధకులకు మార్గం సుగమమైంది. ముముక్షువులకు మోక్షమే చేరువయింది. సర్వజనుల ఆధివ్యాధుల కొరకు దివ్యౌషదం లభించింది. ఇహపరముల కొరకు స్వర్ణవారధి నిర్మాణమయింది. వీటన్నిటికి కారణమెవరు?

ఒక అబల! సామాన్య మానవాంగన. రెండే కాళ్ళూ! రెండే చేతులూ! ఒకే తల. సామాన్య మానవ దేహానికి అతీత లక్షణా లేవీ మన ధర్మచక్షువులకు దృశ్యమానం కావు. కాని ఆ మనస్సు ఎంత గంభీరమో ఎవరు కొలవగలరు? ఆ హృదయ మెంత మార్దవమో ఎవరు చెప్పగలరు? పరిమితమయిన తద్రూపంలో దాగిన అనంతశక్తిని ఎవరు ఊహించగలరు? ఆ కన్నులలో జ్వలించే సూర్యకోటి ప్రభల నెవరు అభివర్ణించగలరు? ఆ కన్నుల నుండి జాలువారే కోటి చంద్రుల చల్లదనాన్ని ఎవరు వివరించగలరు? ఆమె చూపించే ఆదరణకూ, అనురాగానికీ ఎవరు విలువ కట్టగలరు?

ఆమె నేడు జిల్లెళ్ళమూడిలో ఒక చిన్న మంచంమీద కూర్చుని అందరిచే 'అమ్మ' అని పిలువబడుతూ లోకంలో నలుమూలలా ఎందరి చేతనో ప్రేమించ బడుతూ, ఉపాసింపబడుతూ, ఆరాధింపబడుతూ ఉన్నది.

మరి యీమె ఎవరు? ఈమె చరిత్ర ఏమిటి? ఈమె జననమెక్కడ? ఎప్పుడు? జననీ జనకు లెవరు? బాల్య మేమిటి? గురు వెవరు? సాధన ఉన్నదా? ఏ మార్గం? పరిణామక్రమ మేమిటి? - ఇవన్నీ సామాన్యమానవ మస్తిస్కంలో కలిగే సందేహాలే.

వీటికి సమాధానమే యీ చరిత్ర.

వ్యక్తుల పరిచయము

1. అమ్మ	: అనసూయాదేవి
2. నాన్నగారు	: శ్రీ బ్రహ్మాండం నాగేశ్వరరావు
3. తాతగారు	: సీతాపతి
4. అమ్మమ్మ	: రంగమ్మ
5. బామ్మ	: అమ్మ అత్తగారు, నాన్నగారి తల్లి (కనకమ్మగారు)
6. అమ్మ మామగారు	: శ్రీ బ్రహ్మాండం సుబ్బారావు
7. మరిడమ్మ	: సీతాపతిగారి మేనత్త
8. వెంకట సుబ్బారావు	: రంగమ్మగారి తండ్రి (మాతామహుడు)
9. జానకమ్మ	: రంగమ్మగారి తల్లి (అమ్మకు అమ్మమ్మ)
10. చిదంబరరావుగారు	: సీతాపతిగారి బావ, మేనమామ
11. భారతి	: చిదంబరరావుగారి పుత్రిక
12. అన్నపూర్ణమ్మ	: చిదంబరరావుగారి భార్య
13. లోకనాథం (బాబాయి)	: నాగేశ్వరరావు(నాన్నగారు) తమ్ముడు
14. రాఘవరావు(మామయ్య)	: అమ్మ అన్న

విషయ సూచిక

మాతృశ్రీ జీవిత మహోదధిలో తరంగాలు

1. అవతరణ

1923 మార్చి 28వ తేదీ ——————

రుధిరోద్గారి, చైత్రశుద్ధ ఏకాదశీ, బుధవారం, అరుణోదయ కాలం...

చెన్నకేశవస్వామి ఆలయంలో జేగంటలు మ్రోగుతున్నాయి. పక్షులు ప్రపంచానికి మేలుకొలుపులు పాడుతున్నాయి. జగతి చీకటి ముసుగు కప్పుకొని కాంతులు ప్రసవించడానికి నొప్పులు పడుతున్నది. మందమలయానిలాలు ఉపచారం సల్పుతున్నాయి. దేవాలయం నుండి బయలుదేరిన మంగళవాద్యాలు లోకానికి శుభ సందేశమిస్తున్నాయి.

ఆ సమయంలో మన్నవలో ఒక సామాన్య గృహాన ఒక సాధారణమైన ఆడపిల్లయై అమ్మ ఆవిర్భవించింది.

అమ్మ పుట్టినపుడు కాళ్ళూ చేతులూ మెలిక వేసుకొని ఉన్నది. తెల్లగా, తెలుపులో గోధుమరంగుగా ఉన్నది. ఏ మాత్రమూ కదలిక లేదు. ప్రాణమున్నదా, - లేదా అని అనుమానం కలిగి పురుడు పోయటానికి వచ్చిన మంత్రసానులలో ఒకతె అయిన 'పిచ్చికోటి' అమ్మను కదిలించి చూచి -

'ఈ పిల్ల కూడా పోయిందేమో.... ఈ 'రంగమ్మ తల్లి దురదృష్ట వంతురాలు. ఈ సంవత్సరంలో నలుగురు పిల్లలను పాతర పెట్టింది'.

-అని తనలో అనుకుంటూ ఉండగానే కళ్ళుమూసుకుని పడుకున్న అమ్మమ్మ చివాలున లేచి కూర్చుని కళ్ళు తెరచి అమ్మ వంక చూచింది. తాను పడుతున్న బాధనంతా అమ్మ ముఖంలో చూచి ఆశ్చర్యపోయి అమ్మను తన గుండెలకు హత్తుకుని ' ఈ పట్టి నాకు దక్కేనా?' అని ఆలోచనలో మునిగిపోయే టప్పటికి శరీరం కొయ్యబారింది.

మంత్రసాని చూచి, భయపడి, పెద్దగా కేకవేసి తాతగారితో-

"నాయనా- పిల్లలేకాక నీ భార్య కూడా ఋణం తీర్చుకున్నది. పాపం, ధర్మరాజు వంటి వాడివి."

అని అమ్మ వంక చూచి--

"ఏమమ్మా! మా అమ్మ ప్రాణాలు తీయడానికి పుట్టావా?"

--అంటూ ఉండగా అమ్మ నవ్వుముఖంతో ఏడుపు సాగించింది. అమ్మమ్మ కదిలింది.

మంత్రసాని 'గొల్లనాగమ్మ' అమ్మ భూమిమీద పడగానే బొడ్డు కొయ్య డానికి చాకు, దారం తీసుకొని-బొడ్డుకు ఎన్ని చుట్లు చుట్టినా మామూలు దారం మిగిలింది. 'ఇంత పెద్దదారమెక్కడిది?'- అని విసుక్కుంటూ బొడ్డు కోయ డానికి చాకు పట్టుకున్నది. చాకు చాలా పొడవుగా త్రిశూలం మాదిరిగా కనపడుతూ చేతికి అమరలేదు. ఆశ్చర్యంతో బొడ్డువంక చూడగానే బొడ్డులోని బుడుపు శంఖంవలె కనుపించింది. కానీ, యింకా తరచి చూచేటప్పటికి బొడ్డు కమలంవలె, అతి కోమలంగా, అందులో ఎవరో సర్వాలంకార శోభిత అయిన ఒక స్త్రీ నిలబడినట్లు కనపడింది. మంత్రసాని 'యీ పిల్ల పుట్టడమే గాలితో పుట్టింది. ఎన్నాళ్లకు నయమౌతుందో' అని అనుకుంటూ ఉండగానే కమలంలో ఉన్న రేకులు ఊగుతూ, అందులో ఉన్న బొమ్మ గిరగిరా తిరుగుతూ కనుపించింది.

తన కళ్ళు తిరుగుతూ ఉన్నవేమోనని మంత్రసాని కళ్ళు మూసుకొని కూర్చున్నది. కొంతసేపటికి కళ్ళు తెరవగా - కొద్ది దారమూ మామూలు చాకూ కనిపించాయి. అప్పుడు బొడ్డు కోసింది.

ప్రక్కనున్నవారు 'యింత ఆలస్యమయిందేమి'టంటే--

'కళ్ళు తిరిగాయి' అని చెప్పింది. కాని ఆమె మనసు మాత్రం అదృశ్య మయిన ఆ దృశ్యంమీదనే లగ్నమయింది.

అంతలో తాతగారు 'ఇంతకీ నక్షత్రం ఏమిటో చూద్దాం అని పంచాంగం తెరవగానే, అదే పేజీలో - చైత్ర శుద్ధ ఏకాదశీ, బుధవారం, ఆశ్లేషా నక్షత్రం, నాల్గవ పాదం, వర్జ్యం - అని ఉన్నది.

'శాంతి చేయించవలసిన నక్షత్రం' అనీ, తెనాలిలో వాళ్ళ మామగారికి 'ఉత్తరం వ్రాసి కనుక్కోవా'లనీ అనుకుంటూ అటూ యిటూ పచారు చేస్తుండగా అమ్మ ఏడుపు వినపడింది.

'ఫరవాలేదు. ధ్వని బాగానే ఉన్నది. వీళ్ళు చెబుతున్నంత భయమేమీ ఉన్నట్టులేదు' అనుకుంటూ గడియారం వంక చూడగానే గడియారం ఆగిపోయి ఉంది. గం. 4.30 ని.లకు.

'అయినా, యిది యేమిటి? పుట్టేటప్పుడు ఉన్న టైం యిదేనా? నా బ్రతుకు చక్రం కూడా యింతేనా?' అని తాతగారు అనుకున్నారు.

అంతలో మంత్రసాని వచ్చి -

'అయ్యా! దండమండీ - ఈ పూటకు అదృష్టవంతుడివే అన్నది.

'అదే నేనూ అనుకుంటున్నా. మరోపూటను గురించే సమస్య. నా బ్రతుకే సమస్య అయి కూర్చున్నది' అని తాతగారు విచారంతో తల వంచుకుని 'గ్రామం మెరక చేస్తున్నారు' అనుకుంటూ ఉండగా కన్నీరు రెండు బొట్లు రాలి పాదాలమీద పడ్డాయి. నీటి బొట్లవంక చూడగానే పురిటింట్లో ఉన్న బిడ్డ కనపడ్డది. ఆశ్చర్యపడి కళ్లు పెద్దవి చేసి తరచి చూచారు. 'ఇది అంతా నా భ్రమా!...' అనుకుంటూ అమ్మమ్మ దగ్గరకు వెళ్ళి చూస్తూ నిలుచున్నారు. అమ్మమ్మ కళ్ళు మూసుకుని పడుకున్నది. కాని ఆమె మనస్సులో యేదో ఒక బరువైనది తనకు మించినది ప్రక్కలో ఉన్నట్లు తోచి 'వారు వస్తే, బాగుండును. ఈ సంగతి వారికి చెప్పకుండా'మని అనుకుని కళ్ళు తెరవగానే తాతగారు ఎదుటనే ఉన్నారు. ఉభయులకూ ఒకేసారి కన్నీళ్ళు వచ్చాయి.

అమ్మమ్మ తాతగారిని పిల్లను చూడమన్నట్లుగా తల ఊపింది. అదే సమయంలో అమ్మ కదిలి ఒకసారి తాతగారి వైపూ, ఒకసారి అమ్మమ్మ వైపూ తల త్రిప్పి చూచింది.

అమ్మమ్మ అమ్మను డొక్కలోకి లాక్కుని - 'ఇది ఏమాత్రపు బాకీయో యీ బిడ్డనయినా ఎవరయినా పెంచుకుంటే బాగుండును' అని అనుకుని తాతగారిని అడిగింది.

'నక్షత్రం చూచారా? మా నాన్నగారికి జాబు వ్రాయరూ?'

'జాబు వ్రాస్తే - మన జాతకాలు మారుస్తారా?' అని నిట్టూర్పు విడిచి తాతగారు అన్నారు, 'అన్ని కాన్పులకూ యీసారికి తేడా కనపడుతున్నది.'

అంతలో మంత్రసాని వచ్చి-

'రంగమ్మతల్లీ! ఇంతకూ బిడ్డ నోటిలో రొమ్ము పెట్టావా?' అని అడిగింది.

'నా పాలు పాపాలు నాగాం' అన్నది అమ్మమ్మ బాధగా.

'ఇప్పుడివ్వమ్మా - తర్వాత నేను పెంచుతాను' అని నాగమ్మ సలహా యిచ్చింది.

అమ్మమ్మ అమ్మ ముఖంవంక చూచి పాలివ్వటానికి ప్రయత్నిస్తూంటే తాతగారు అన్నారు.

'జాగ్రత్త! అతి సున్నితంగా ఉంది పిల్ల. పోనీలే... శరీరానికి వున్న సున్నితత్వం ఆయుర్దాయానికి లేకుండా ఉంటే...'

అమ్మ- మెలికపడ్డ కాళ్లను కొంచెం పైకి యెత్తగానే గజం పొడవువున్న కాళ్లలాగా కనిపించాయి.

'బ్రతకని బిడ్డ బారెడు' అనుకుంటూ అమ్మ చేతులు తీసుకుని తన చేతిలో పెట్టుకునేటప్పటికి అమ్మచేతి వ్రేళ్లు తళుక్కున సూర్యకిరణాలలాగా కనిపించాయి. వెంటనే అమ్మమ్మకు తనకు తెలియకుండానే ఏడుపూ నవ్వూ పెద్దగా వచ్చాయి. ఇల్లంతా కాంతులతో నిండి... అమ్మ మురికిగా కనిపించింది.

కొన్ని నిమిషాలకు అమ్మమ్మ తెప్పరిల్లి నవ్వూ, ఏడుపూ ఆపుకుని.

'నాగాం! బిడ్డకింకా నీళ్లు పొయ్యలేదేం?' అని అడిగింది.

'నీకు చీరే కట్టకపోతే బిడ్డకు నీళ్లేమిటమ్మా?'

'ఇంతకూ అమ్మ పుట్టి యెంతసేపయింది? అమ్మ అంటున్నాను, అమ్మాయి పుట్టి-'

'కాకేమమ్మా? ఆరుగంటలవుతున్నది.'

అని అమ్మమ్మను లేవతీసి కూర్చోపెట్టి చీరె కడుతూ అమ్మవంక చూచింది. అమ్మ నాగమ్మ వంక చూచింది.

'నీ బిడ్డ కళ్లు తెరిచింది. ఎండ తీక్షణంగా ఉంది. నాకేదో తెలియని

ఆనందంగా ఉంది. ఇందాక ఒకటి జరిగింది. అప్పటినుంచీ నాకు బలే సంతోషంగా ఉంది.'

అని నాగమ్మ అమ్మమ్మకు చీరె కట్టి అమ్మను చేతులలో పెట్టుకొని -

'మా అమ్మకు నీళ్ళు పోస్తారా?' అంటూ వంటయింటి వైపు వెళ్ళింది.

'పురిటిబిడ్డ నీ వంటయింటి వైపుకు తీసుకువచ్చావు, ఇదంతా మైలపడిపోదూ? నేను నీళ్ళు తోడియిస్తాను. పద -' అంటూ బామ్మ ఆవు పంచితం చల్లి అమ్మను స్నానం చేయించి చేతులలోకి తీసుకుని ముఖంలోకి చూస్తూ-

'అమ్మా!! మూడోతరం ఆడపిల్లవు పుట్టావా? ఒళ్ళు తుడవాలంటేనే భయంగా ఉంది. చేతులూ కాళ్ళూ ఎక్కడ ఊడి వస్తాయో...' అంటూ తాతగారి వంక చూచి...

'అన్నయ్యా! తెల్లగా ఏకులా ఉందిరా' అన్నది.

'వాళ్ళు దృఢంగా ఉండి ఏం ఒరిగించారు? అంతా ఋణ సంబంధ మేగా!' అని తాతగారు అనగానే బామ్మచేతిలో ఉన్న అమ్మ ప్రశాంతంగా నిద్రపోతూనే 'బ్రతకటం ఋణమే'గా అన్నట్టు తాతగారికి వినిపించింది. 'కాని అమ్మాయి ఎట్లా అంటుంది? నా భ్రమలే...' అని సరిపుచ్చుకున్నారు.

మధ్యాహ్నం పన్నెండయింది.

బామ్మ అమ్మను తీసుకువచ్చి అమ్మమ్మ ప్రక్కలో పడుకోబెట్టింది. అంతలో యిరుగుపొరుగు వచ్చి బామ్మను.

'ఏమమ్మా-కోడలు పుట్టిందా?' అని అడిగారు.

'ఎందుకులేమ్మా-ఇది వరకు అనుకున్నది అయిందా ఇది అవటానికి! ఈ పిల్ల యీడు కూడా కాదు. చాలా చిన్నది.'

బామ్మ ఆడబిడ్డ 'వెంకట సుబ్బమ్మగారు' అందుకుని---

'తప్పకుండా యీపిల్ల నీ కోడలే అవుతుంది. పది సంవత్సరాల తేడా ఎంత తేడా? రాసిపెట్టి ఉంటే తప్పక అవుతుంది' అన్నది.

'ఆ మాటకు వస్తే - ప్రతిదీ అంతేగా? అయినా బ్రహ్మాండం వారి యింటికి నేను వచ్చాను. చాలులే...'

'ఉన్నన్నాళ్ళు ఉండి తీరా గరుడగుడ్డ కట్టేనాడు పురుడు వచ్చింది. ఇద్దరం (కల్యాణపు) పీటల మీద కూర్చునేవాళ్ళం. ఈ సంవత్సరమే మీ అన్నయ్య (మన్నవ కృష్ణశర్మగారు) దేవాలయ ధర్మకర్త కావటమూ, ప్రతిష్ట చేయటమూ, రాజ్యలక్ష్మీ యంత్రం వేయటమూ... మౌనస్వామివారు మా యిద్దరినీ పీటలమీద కూర్చోమనటమూ... ఆయన వాక్కు యిట్లా ఫలించింది' అని వెంకటసుబ్బమ్మ గారు విచారపడ్డది.

'ఇవ్వాళ కొత్త ఏమున్నది? మన్నవ వారికి ఎప్పుడూ పురుళ్ళూ, సూతకాలేగా?' అని కొంచెంసేపాగి---

'ఇంతవరకూ బిడ్డకు పాలు యివ్వలేదు' అని బామ్మే అమ్మకు మొదటిసారిగా పాలు ఇస్తూ-

'నావి పథ్యపుపాలే, జబ్బుచేయవు గదా...' అన్నది అమ్మమ్మతో.

'నీ పాలకేమమ్మా? సత్యమయిన పాలు, నిత్యము నీ పాలే యివ్వమ్మా-' అని అమ్మమ్మ అడిగింది.

'నా పిల్లవాడి పాలు తరిగిపోతయ్‌గా' - అప్పుడు లోకనాధం బాబాయి పసివాడు.

'నీ పిల్లవాడికి పాలు నే నిస్తాను. నా పిల్లకు నీవు యివ్వు-' అని అమ్మమ్మ ప్రాధేయపడింది.

' నా పాలు నీ పిల్ల భరించగలదు. కానీ, నీపాలు నా పిల్లవాడు భరించలేడు. అంటే నీ పాలు వాతప్పాలు' అంటూ బామ్మ అమ్మకు పాలిస్తూ ఉండగా ఈ పిల్ల తన పిల్లేననిపించింది. వెంటనే ఔనన్నట్లు అమ్మ తలవూపింది. బామ్మకు తన మనస్సులోని ఊహ ప్రకారమే తలవూపుతున్నదా? అనిపించి ఆశ్చర్యం కలిగి... మళ్ళీ బలహీనత వలన మెడలు ఊపుతున్నదిలే... అని సమాధానం చెప్పుకున్నది.

అమ్మను అమ్మమ్మను పక్కలో పడుకోబెట్టి -

'ఇంతకూ ఆముదం కుడిపారూ?' అని అడిగి-

'ఆముదం పోయలేదు. కడుపులో మురికిపోలేదు. తలవూపుతూంది. అయినా ఒక గంట వుండి కుడుపవచ్చునులే..' అని పొట్ట తడిమి చెక్కిళ్ళు పట్టుకొని...

'పడుకో తల్లీ పడుకో' మని-

'పిల్లవైపు తిరిగి పడుకో' మన్నది అమ్మమ్మతో.

'పిల్లవైపు నే తిరిగిన వాళ్లంతా పోయారు. పిల్ల నా వైపు తిరిగితే నన్నా బ్రతుకుతుందేమో..'

'నీ వీపు పిల్లకు కనపడకూడదమ్మా! అసలే వెన్నెమ్మ కథ తెలుసుగదా..' అని పిచ్చికోటిని అమ్మమ్మ దగ్గర కూర్చోపెట్టి బామ్మ వెళ్లింది.

2. నామకరణం

ఆవిర్భవించిన నాలుగో రోజున అమ్మ కొయ్యబారి పోయింది. కాళ్ళూ చేతుల్లో కొంచెమైనా చలనంలేదు. శరీరమంతా నల్లకప్పు వేసింది. జబ్బేమీ కనుపించలేదు. ప్రాణం పోలేదు. కానీ మామూలు స్థితిలో లేదు.

తల్లీ తండ్రీ దిగులుపడ్డారు. సంతానం గురించి చింతతో వారి శరీరాలు శుష్కించాయి.

అమ్మను చూడడానికి వచ్చేవారికి విధీ విరామమూ లేదు. ఎవరు వచ్చి ఏమి చేస్తారు? --ఏమి చేయగలరు?

రోజులు గడచిన కొద్దీ అమ్మమ్మ విచారం హద్దులు దాటింది. తన కర్మను నిందించుకున్నది. తన సంతానయోగ్యత గురించి వాపోయింది. ఏమేమో ఆలోచనలు ఆమె మనసును కలవరపెట్టాయి. ఆలోచించినకొద్దీ ఆమెలో బాధా, దుఃఖమూ మితిమీరాయి. ఎప్పుడూ అమ్మను చూస్తూ, కన్నీరు కారుస్తూ ఉండేది.

దుఃఖానికి చరమదశ సంతోషం అన్నట్లు పదవ రోజు ఉదయం, 'ఏమీ ఫర్వాలేదు..' అని అమ్మమ్మకు వినిపించింది.

ఎక్కడ నుండి వినిపించిందీ అర్థం కాక అమ్మమ్మచుట్టూ చూచింది. ఎవరూ కనిపించలేదు. తాను కాక అమ్మ మాత్రమే ఉన్నది. అమ్మాయి ఎట్లా మాట్లడగలదు?- అనుకున్నది.

'దిగులుపడకు..' మళ్ళీ వినిపించింది. తనలో నుండే తనకు వినిపించినట్లుగా తోచింది. ఇక, అమ్మమ్మ ఆశ్చర్యానికీ ఆనందానికీ అవధుల్లేవు.

వెంటనే తాతగారిని పిలిచి 'రేపు పురిటి చమురు పోయిస్తారా?' అని అడిగింది.

'ఇంతకూ పిల్లకు ప్రాణముందా?' తాతగారు సందేహం వెలిబుచ్చారు.

'మన అమ్మకు ఏ ఆపదా లేదు. లేస్తుందని తోస్తున్నది. నేను ఏడుస్తూ

ఉంటే నాలోనుంచి ఏవో ధ్వనులు వినపడుతున్నయ్, ఫర్వాలేదని...' అని అమ్మమ్మ ధైర్యం చెప్పింది.

'సరే, నీ యిష్టమూ, నీ ధైర్యమూ-అంత కంటే నాకు కావలసినదే మున్నది? రేపు కులాసాగా ఉంటే శాంతి చేసుకుందామా?' తాతగారు సలహా అడిగారు.

'శాంతీ వద్దూ, ఏమీ వద్దు. శాంతి తాత్కాలిక మనశ్శాంతి కోసమేగా, అసలు శాంతి కలుగదుగా?'

'సరే ఎట్లా అయితే అట్లా అవుతుంది. నక్షత్రం తిరిగే లోగా చేసుకుందాంలే' అని తాతగారు వెళ్ళారు,

అమ్మను పురిటిస్నానం చేయించేందుకు గ్రామంలో ఉన్న 500 యిళ్ళకు చెప్పివస్తే అనుకోకుండా 108మంది 108 బిందెల నీళ్ళు తెచ్చారు. 108 బిందెలలో 108 చెంబుల నీళ్ళు తీసి అమ్మకు స్నానం చేయించారు.

అమ్మను ఒక జల్లెడలో పడుకోబెట్టి పిల్లలను కావలి ఉంచి పెద్ద వాళ్ళందరూ ఎవరి పనులమీద వారు వెళ్ళారు. పిల్లలు కూడా ఒక్కొక్కరే ఆడుకోను వెళ్ళారు. అంతలో ఒక పెద్ద నల్లకుక్క వచ్చి అమ్మ తలవద్ద కొంచెం సేపు కూర్చుని పాదాల చెంతకు వచ్చి పాదాలపై తన ముట్టెను పెట్టి పడుకుని పది నిమిషాలు హాయిగా నిద్రపోయింది.

అంతలో అందరూ వచ్చారు. పెద్దగా అరచి కుక్కను బయటకు తోలారు; కుక్క లేవలేదు. కొట్టారు; కుక్క కదలలేదు. అందరూ ఏమి చేయడానికి తోచక ఆందోళన పడుతుండగా - అమ్మ కాలు కదిలింది. కుక్క లేచి జల్లెడచుట్టూ ప్రదక్షిణ చేసి వెళ్ళిపోయింది.

'ఈనకాచి-నక్కలపాలు అన్నట్లు - ఎంతో అన్యాయం అయి పోయేది...' అని అనుకొన్నారు కొందరు.

కుక్క తిరిగి పది నిమిషాలలో అమ్మ మంచం దగ్గరకు వచ్చి అమ్మ కక్కిన పాలు నాకి మంచానికి అయిదు జానల దూరంలో పడుకుని కనులు తెరచి అమ్మవంక చూస్తూ ప్రాణాలు వదిలింది. కుక్క ముఖంలో తేజస్సు తగ్గలేదు. అంతకు ముందు ఏ జబ్బూ లేదు. అందరూ ఆశ్చర్యచకితులయినారు.

27వ రోజున బారసాల; హోమశాంతి, సకల దానాలతో, నవగ్రహ జపాలతో-శాంతి పూర్తి అయింది. ఆశ్లేషా నక్షత్రం కనుక-ఏపేరు పెడితే బాగుంటుంది అని అందరూ ఆలోచించి ఆలోచించి నిర్ణయించిన పేరు తాతగారు అనుకోకుండా కుంకుమ పళ్లెంలో వ్రాశారు. ఆ నామకరణం జరిపిన సుముహూర్త బలమో, ఆ అక్షరాలలోని పవిత్రతా బలమో, ఆకర్షణో-మరేమిటో నేడు యావజ్జగతికీ ఆ అక్షరాలు-చిరస్మరణీయమయినాయి; ఆ అక్షరాలు మంత్రమై మననీయమయినాయి; మధురమై అమృతోపమానమైనాయి,

ఆ అదృష్టవంతమైన అక్షరాలు -- "అనసూయ". అక్కడ కూర్చున్న అందరూ ఒకేసారి అనుకోకుండా "మన అమ్మపేరు అనసూయ" అన్నారు. తాతగారూ, అమ్మమ్మా ఎవరికి వారు అమ్మపేరు ఎప్పుడూ యిలాగే ప్రతి ధ్వనిస్తే బాగుంటుందని అనుకున్నారు. ఆ పుణ్యదంపతుల ఆశయం నెరవేర టానికి ఎంతోకాలం అవసరం లేకపోయింది. మరి, వారి సంకల్పబలం అటు వంటిది. కాకపోతే, జగజ్జననికే జననీజనకులయ్యే పరమ అదృష్టం, మహాభాగ్యం వారికెట్లా కలుగుతుంది?

నామకరణం సందర్భంగా అమ్మమ్మకు బంధువులు 13 నవర్ల బంగారం చదివించారు. బామ్మా, అమ్మమ్మగారి అమ్మ 'జానకమ్మగారు', అమ్మ పెద్దమేనత్త అన్నపూర్ణమ్మగారూ కలిసి హారతి యిచ్చారు. అందరూ అమ్మ శిరస్సుపై ఆశీర్వచనపు అక్షతలు చల్లారు. ఆ సమయంలో అక్కడ వున్న నాన్న గారు కూడా అక్షతలు చల్లారు. అప్పుడు నాన్నగారి వయస్సు 10 సంవత్సరాలు.

పీటల మీద నుంచి లేచేటప్పుడు దృష్టి దోష పరిహారార్థం బామ్మ-ఎఱ్ఱ నీళ్ళు తీసి కొబ్బరికాయ కొట్టింది. కొబ్బరికాయలో మొక్క మొలిచి-పైకి పచ్చగా కనిపించింది. అది చూచి అపశకునంగా భావించి - అందరూ భయపడు తుండగా - ఒక పెద్ద మిడత హోమగుండంలో నుంచి అమ్మమీద వాలి-తిరిగి అగ్నిగుండంలో పడ్డది. పడీపడగానే పెద్దమెరుపు మెరిసింది. అక్కడ మెరిసినా - అందరి కళ్లలో ఒక్కసారి చీకట్లు ముసిరాయి.

అందరి మనసులూ ఆలోచనా నిమగ్నమైనాయి.

తాతగారికి ఏవేవో ఆలోచనలు మెదిలాయి.

ఒకసారి అమ్మ జననానికి పూర్వం-తాతగారు చింతచెట్టు క్రింద కూర్చుని ఉండగా-వారి మనోనేత్రానికి ఒక బాలిక కనుపించింది. పరిశీలనగా చూచేలోపల ఆ బాలిక చెన్నకేశవస్వామిగా, రాజ్యలక్ష్మి అమ్మవారుగా రూపాంతరం పొందింది. ఆయన విస్మితులై పులకితాంగులవుతుండగా బాలికగా రూపం దాల్చింది.

మరోసారి తాతగారికి ఒక స్వప్నం వచ్చింది. అందులో ఒక ముత్తైదువ - తన యింటిలోని సామాను అంతా బయట పడేసి నట్టింట ఒక కుర్చీ వేసుకుని కూర్చున్నది. ఆమె నొసటన పెద్ద కుంకుమబొట్టు ఉన్నది. 'ఎవరు నీవు? అని అడిగితే, 'అమ్మను' అన్నది.

తాతగారు ఆ రెండు సంఘటనలూ పురోహితునికి చెబుతుండగా - అమ్మమ్మ-తన అనుభవం కూడా వివరించింది.

అమ్మ అమ్మమ్మగర్భాన చేరినప్పటి నుండీ అమ్మమ్మకు భూభారం మోస్తు న్నంత బరువుగా ఉండేదట. కవలపిల్లల కలుగుతారేమోనని, ఏదయినా జబ్బు వల్ల నేమోననీ, లేక పిల్లలు అందరూ పోయిన దిగులుతో-మానసికబలహీనత యేర్పడి-అట్లా అనిపిస్తున్నదేమోనని-సరిపుచ్చుకొన్నదట.

అమ్మ పుట్టినప్పటి నుంచీ జరిగిన విచిత్ర సంఘటనలన్నీ కూడా-అందరూ కలిసి కూడబలుక్కున్నారు. అన్నీ విని-పురోహితుడు కూడా విస్తుపోయాడు.

3. "ఇంకా అనేక విచిత్రములు జరుగును"

అమ్మ జన్మించిన 29వ రోజు సాయంకాలం వేడుక నిమిత్తం ముత్తయిదువలతో మంగళవాద్యాలతో 'కామేశ్వరమ్మ బావి' దగ్గరకు అమ్మమ్మ వెళ్ళింది. నూతిలో చేదవేసి చేయవలసిన వేడుకలన్నీ చేసి బిందెతో నీళ్ళు చంకన బెట్టుకొని మేలిముసుగు వేసుకొని ఊరేగింపుతో అమ్మమ్మ తిరిగి యింటికి బయలు దేరింది.

ఇంటి సమీపానికి రాగానే ఉయ్యాలలో ఉన్న అమ్మ పిలిచినట్లు అమ్మమ్మకు పెద్దకేక వినపడింది. అమ్మమ్మ ఉయ్యాల వద్దకు వచ్చి చూస్తే అమ్మ నిద్రపోతున్నది. ముత్తయిదువులు ఎవరిండ్లకు వారు వెళ్ళిన తర్వాత అమ్మమ్మ మళ్ళీ ఉయ్యాల దగ్గరకు వచ్చింది. అమ్మ ప్రక్కన డొక్కనానుకుని తేలు పడుకుని ఉన్నది. తల్లి బిడ్డ మీద వేసినట్లుగా అమ్మ చెయ్యి తేలుపొట్ట మీద వేసి ఉన్నది.

ఆ దృశ్యం చూచి భయవిహ్వల అయిన అమ్మమ్మ -

"అమ్మో! పిల్ల పక్కలో తేలు. ఎవరర్రా అక్కడ? తొందరగా రారేం?"

-అని కంపితకంఠంతో అరుస్తూ కలిగిన మనసుతో పిల్లను, తేలును, గుడ్డలను కలిపి తీసుకొని బుజాన వేసుకున్నది.

అమ్మమ్మ కంఠంలోని కంపనం హస్తాల్లోకి వ్యాపించగా అమ్మ క్రింద పడ్డది.

భయం మితిమీరి, మతిశూన్యమై, చైతన్యం కోల్పోయి అమ్మమ్మ అమ్మమీద పడ్డది. తేలు గుడ్డను కరుచుకొని అట్లాగే ఉన్నది.

అంతలో అమ్మలక్కలందరూ యింట్లోకి ప్రవేశించి...

"అయ్యో? పిల్లా తల్లీ యిద్దరూ పోయారు...'

-అని ఉచ్చైస్స్వరంతో కేకలు పెట్టారు.

భజంత్రీలూ లోపలకు వచ్చి-

"ఎవరని నిర్ణయించేదిరా..."

అనే కృతి సన్నాయిపై పాడుతూ అమ్మమ్మ చెవుల వద్ద వినిపించారు.

ఆ నాదస్వర మాధుర్యంలోని మహిమో, ఆ గీతంలోని భావ ప్రభావమో, మరి ఏ శక్తి ప్రేరణవల్లనో, ఏ అనుగ్రహ వీక్షణ వల్లనో-అమ్మమ్మ చివాలున లేచి కూర్చున్నది. అమ్మను తీసుకుని చేతిలో పట్టుకున్నది.

కాని అమ్మమ్మకు స్మృతి లేదు. జరుగుచున్న వేడుక గుర్తులేదు. శోకతప్తమయిన మనసులో తేలు వేసిన ముద్రమాత్రమే స్పష్టంగా ఉన్నది. పొత్తిగుడ్డలలో తేలును వెదుకుతూ అమ్మమ్మ తాతగారి కోసం వీధిలోకి పరుగెత్తింది. తాతగారప్పుడు మన్నవ సమీపాన ఉన్న దొప్పలపూడి వెళ్ళారు.

మన్నవ గ్రామ మునసబుగారయిన పులిపాక నారాయణగారూ, యింకా యితర పెద్దలూ గుమిగూడారు.

పిల్ల పోయింది కాబోలు, కరణంగారి భార్యకు మతిపోయిందని కొందరూ, అమ్మకు చిన్నబిడ్డ నొప్పి వచ్చిందని కొందరూ-అనుకుని ఒకరిది ఒకరికి తెలియకుండా అనేక విధాల చికిత్సలు చేశారు.

అంతలో షేక్ నల్లఖాసింసాహెబ్ వచ్చి అందరినీ అవతలకు పంపించి మునసబుగారి చేతిలో వున్న అమ్మను తీసికొని అమ్మమ్మను చేయి పుచ్చుకొని యింటికి తీసుకువచ్చి అమ్మను అమ్మమ్మ చేతికి అందించి 'పాలివ్వమ్మా' అన్నాడు.

గుడ్డలో తేలు గుడ్డలోనే ఉన్నది. ఆ గుడ్డనే చేతికి తీసుకుని ఆ గుడ్డలోనే అమ్మను ఒడిలో వుంచుకుని అమ్మమ్మ పాలిస్తూ ఉన్నది. తేలు మెల్లగా ప్రాకి అమ్మపాదం మీద కెక్కింది. ఎక్కి, పాదం అడుగున కరుచుకుని పడుకున్నది.

అమ్మమ్మ అమ్మకు పాలిస్తూ తేలును చూడలేదు. పాలిచ్చి ఉయ్యాలలో పడుకోబెట్టి గుడ్డ కప్పబోగా తెల్లని పాదం మీద నల్లని తేలు మెరుస్తూ కనుపించింది.

అమ్మమ్మ ఉలిక్కిపడింది. ఆపాదమస్తకం భయంతో గజగజలాడింది.

ఒకప్పుడు ఒక జ్యోతిష్కుడు అమ్మమ్మతో 'నీకు పూర్వజన్మలో మార్జాల హత్యాదోషం ఉన్నది. అందువల్ల నీకు పిల్లలు కలిగినా దక్కరు' అని చెప్పాడు.

అప్పటి నుండి అమ్మమ్మ భీతమనస్కయైనది. అందుకు తగినట్లుగా అమ్మను గర్భాన ధరించిన తర్వాత ముగ్గురు పిల్లలు మరణించారు. దానితో అనుక్షణమూ అమ్మగూడా ఏమవుతుందో - నన్న సందేహమూ, భయమే.

'ఏదో పంపకం, ఎవరో చేతబడి చేశారు' అంటూ అమ్మమ్మ బైటికి పరుగెత్తింది.

అంతలో మరిడమ్మతాతమ్మ యాజిలి నుంచి వచ్చి ఆ కేకలు విని సరాసరి ఉయ్యాలవద్దకు పరుగెత్తి అమ్మపాదం వంక చూచి చచ్చిఉన్న తేలును తీసివేసి--

'ఇందుకేనా యీ గందరగోళమంతా? బిడ్డకళ్ళు తెరిచి చూస్తూ ఉంటే, అట్లా అరుస్తారేం? అమ్మా! అదేమిటో... అది ఎందుకు వచ్చిందో... పుట్టిన పదకొండవ రోజుననే పెదతాతమ్మను పంపింది...'

అని అంటూ ఉండగా గొల్లనాగమ్మ వచ్చి...

'పుట్టినప్పటి నుండి అన్నీ చావులుగానే ఉన్నాయి. ఆ చావులు గూడ విచిత్రపు చావులు' అన్నది. మరి... అమ్మ అమ్మమ్మ గర్భాన జేరినప్పటి నుండీ పుట్టిన 28వ రోజు లోపల కుటుంబంలోనూ, బంధువులలోనూ కలసి 11 గురు మరణించారు.

నాగమ్మ అమ్మమ్మ వద్దకు వెళ్ళి-

'నీ బిడ్డ బ్రతికున్నది, రా...'

అని రెక్క పట్టుకుని యింటిలోనికి తీసుకువచ్చింది.

మరిడమ్మ తాతమ్మను చూచి అమ్మమ్మకు దుఃఖం పెల్లుబికి పెద్దగా ఏడిచింది.

'ఏం భయం లేదమ్మా - నీ పిల్లకు ఏం ప్రమాదం రాలేదు.'

అని అనబోయి 'నీ పిల్ల వంశపావని... లేకపోతే యిన్ని చావులు రావు' అంటూ అమ్మమ్మను దగ్గరకు తీసుకుని ధైర్యం చెప్పింది.

రాత్రి 8 గంటలకు తాతగారు దొప్పలపూడి నుండి యింటికి తిరిగి

వచ్చారు. మార్గమధ్యంలోనే సాయంకాలం జరిగిన విషయమంతా విని ఆదుర్దాగా యింటికి వచ్చినా.. ఆందోళన అంతా ఉపశమించి, అతి ప్రశాంతంగా ఉన్న గృహవాతావరణం చూచి వారు ఆశ్చర్య ఆనందాలతోపాటు మనశ్శాంతినీ పొందారు.

తాతగారు భోజన సమయాన రోజూ ఒక పిల్లికి భోజనం పెట్టేవారు. ఆ రోజు ఆ పిల్లి అన్నానికి రాలేదు. రాని విషయం విస్మరించి తాతగారు భోజనం చేశారు. అమ్మమ్మ వచ్చి...

'ఇదేమి కారణమో... రోజూ వచ్చే పిల్లి రాలేదు...'

అని మళ్ళీ సంశయంతో భయంతో విచలిత అయింది.

'ఋణం తీరితే అన్నీ అంతేలే...'

...అంటూ తాతగారు ఉయ్యాలవద్దకు వచ్చారు.

పిల్లి ఉయ్యాలలో పడుకుని సర్పాకృతిలో తోక పైకి యెత్తి గిలకలపైగా వాల్చి అమ్మ ముఖం వంక చూస్తూ ఉన్నది. అది అట్లా పడుకుని అరగంట అయినా, ఈ లోపల అమ్మమ్మ అటు వచ్చినా, ఎవరూ దానిని గుర్తించలేదు.

తాతగారు దానిని చూచి విభ్రాంతుడయి...

'అమ్మాయి పక్కలో పాముర్రా...'

అని కేక వేశారు. దీపం తీసుకువద్దామనుకునీ, పాము కరిచివున్న బిడ్డ దీపం చూడకూడదనే సందేహంతో దీపం తీసుకురాలేకనూ, సందేహం నివారణ చేసుకోలేకపోయారు. తరచి చూడగా సర్పమని ధృవపడి పడగ ఆడినట్లే కనిపించింది. తాచుపామేనని అనుకుంటూ ఉండగా మళ్లీ కట్ల పాముగా స్ఫురించింది.

అంతలో మెరుపు మెరిసింది. ఆ వెలుగులో అమ్మా, పిల్లీ వివరంగా కనుపించారు. తాతగారి గుండె కుదుట పడింది.

త్వరత్వరగా అమ్మమ్మవద్దకు వెళ్ళి భోజనం చేస్తున్న అమ్మమ్మతో 'ఆదుర్దా లేదులే. పాము కాదులే తొందరగా భోజనం చేసిరా, పిల్ల యేడుస్తుందేమో...'

అని తాతగారు చెబుతుండగా పూర్తిగా వినకుండానే పాము, పిల్ల తప్ప మరోమాట వినిపించుకోనని అమ్మమ్మ వెరపుతో నిశ్చేష్ట కాగా, చేతిలో ముద్ద తెలియకుండానే క్రింద పడిపోయింది. తాతగారిని తదేకదృష్టితో చూస్తూ ఉన్నది.

'ఎందుకురా నాయనా-కేక వేశావు?'

– అంటూ వచ్చిన తాతమ్మ అమ్మమ్మస్థితినీ, తాతగారినీ చూచి ఏమీ అర్థంకాక కొంచెం నీళ్ళుతెచ్చి అమ్మమ్మ ముఖం మీద చల్లి తెరుచుకున్న కళ్ళు మూసి తాతగారిని కారణం అడిగింది.

తాతగారు జరిగినదంతా ఆమెతో చెప్పి ఉయ్యాల దగ్గరకు తీసుకుని వెళ్ళారు. ఉయ్యాలలోని పిల్లిని చూపించి చేతితో తట్టారు. పిల్లి లేచి ఉయ్యాల దిగి అరుస్తూ ఉయ్యాల చుట్టూ ప్రదక్షిణం చేసింది. తోక తాతగారికి ఆనించి అరగంట అరిచింది. మచ్చుమీద కెగిరి కళ్ళూ ముఖమూ అమ్మవైపు పెట్టి ఒకే అరుపు ఆపకుండా పావుగంట అరిచింది. ఆ తర్వాత ఉయ్యాలలోకి దూకి అమ్మపాదాల మీద తన మూతి నానించి ఒకసారి శ్వాసపైకి లాగి మరొకసారి పెద్ద ధ్వనితో శ్వాసను లాగుతూ అమ్మ పాదాల మీదనే ప్రాణం వదిలింది.

ఆ అద్భుత విషయం చూస్తూ తాతగారూ తాతమ్మ విస్మయంతో స్తబ్ధులైనారు. కొంతసేపటికి తాతగారు అమ్మతో–

'మన కొంపకు ఏదో ఆవరించినట్లే ఉన్నది. దీన్ని బట్టి చూస్తే వాళ్ళ అమ్మ గండం గూడా ఖాయమేనని తోస్తున్నది. నక్షత్ర బలం దెబ్బ తీసేటట్లుగా ఉన్నది. అందులో వర్జ్యం. అన్నీ విసర్జించమన్నట్లుగా, అందరినీ విసర్జించేటట్లుగా ఉన్నది. కానివ్వు - ఏదయితే అది అవుతుంది...'

– అని అంటూ పంచలోకి వెళ్ళి మంచం మీద పడుకున్నారు.

అంతలో ఇంటికెదురుగా వున్న మంత్రిప్రగడ రాజమ్మగారు అడిగింది...

'ఏం సీతాపతీ... అప్పుడే పడుకున్నావ్?'

ఆలోచనలో మునిగి పోయిన తాతగారు నిరాశతో...

'ఇక ఇదే పడకేమో...' అన్నారు.

రాజమ్మగారు సరాసరి వంటయింట్లోకి వెళ్లింది. గోడకు ఆనుకుని విస్తరిముందు కూర్చున్న అమ్మమ్మను చూచింది. కాని ఆమె స్థితిని గమనించక తన ధోరణిలో...

'జరిగిపోయిన దానికి బాధ ఎందుకు? ఇంతవరకు బాగున్నాం కదా..'

అని అమ్మమ్మ చెయ్యి పట్టుకుని కదిలించింది. అమ్మమ్మలో చలనం లేదు. ఆమెకు ఏమీ వినిపించడంలేదు. అమ్మ మాత్రమే కనిపిస్తూ ఉన్నది.

అమ్మమ్మ స్థితిని చూచి ఏమీ అర్థంగాక అడిగింది.

'ఏమిటి మరిడమ్మక్కయ్యా యిదంతా?'

అప్పుడు జరిగినదంతా తాతమ్మ చెప్పింది. సాయంకాలం జరిగినదంతా రాజమ్మగారు చెప్పింది. ఇద్దరూ కలిసి అమ్మమ్మ ముఖచిహ్నాలు గమనిస్తూ ఉన్నారు.

అది మూర్ఛా, నిద్రా, అపస్మారమా- అని దీర్ఘంగా ఆలోచిస్తూ ఉండగా అమ్మమ్మ ముఖంలో-

ఉయ్యాలలోని అమ్మ అమ్మమ్మ ఒడిలో పడుకుని పాలు త్రాగుతూ ఉన్నట్లూ అమ్మమ్మ తల పడగ ఆకృతిలో అమ్మకు గొడుగు పట్టినట్లూ కనబడి-

'ఇంకా అనేక విచిత్రములు జరుగును.'

అన్న మాటలు వినబడ్డాయి. ఆ దృశ్యమూ, శబ్దాలూ తాతమ్మకేగానీ రాజమ్మగారి కేమీ కనబడలేదు; వినబడలేదు.

అంతలో అమ్మమ్మ కొంచెం కదలి---

'అమ్మా! అమ్మా! ఎందుకు పుట్టావమ్మా?'

-అంటూ అటూ యిటూ కదిలి కళ్ళు తెరిచింది.

అప్పటికి సరిగ్గా అర్ధరాత్రి 12 గంటలయింది.

అమ్మమ్మ నెమ్మదిగా లేచి తాతగారి దగ్గరకు వెళ్లింది. తాతగారు నిద్ర పోతున్నారు. అమ్మమ్మ తాతగారికి నమస్కారం చేసి ఉయ్యాల దగ్గరకు వచ్చింది.

చచ్చిన పిల్లి ఉయ్యాలలో అట్లాగే ఉన్నది. అమ్మమ్మ దీపం వెలుగులో పిల్లిని చూచి భయపడి పిల్లిని తట్టింది. అది లేవలేదు. మెడపట్టుకొని బయటకు తీసి క్రింద పడుకోబెట్టి గాఢనిద్రలో ఉన్నదని భావించింది.

బాహ్యస్మృతి లేకుండా కూర్చున్నకాలంలో అమ్మమ్మకు ఆలోచనలు అంతరించి ఆదుర్దా అణిగిపోయి అశాంతి తొలగిపోయి మనసు నిశ్చలమయింది.

వెంటనే అమ్మమ్మ తాతమ్మ దగ్గరకు వచ్చి ఆశ్చర్యంగానూ, అమాయకంగానూ అడిగింది..

'చూచావా నాయనమ్మా..? పిల్ల పక్కలో పిల్లి పడుకున్నది.'

తాతమ్మ అంతకుముందే అమ్మమ్మ ముఖంలో కనుపించిన విచిత్ర దృశ్యం అంతర్వనికపై అవలోకిస్తూ ఉన్నది. అమ్మమ్మ లేవడము గుర్తించకనే గుర్తిస్తున్నది. ఇటు యీ పిలుపూ, అటు ఆ చిత్రమూ రెండూ గమనిస్తున్నది. ఇది వింటున్నది; అది కంటున్నది. ఈ స్థితినే సహజసమాధి అంటారు.

రాజమ్మగారు అక్కడనే మామూలుగా నిద్రపోతూ ఉన్నది. అమ్మమ్మ రాజమ్మగారిని నిద్రలేపి పన్నెండున్నర అయిందని చెప్పింది.

ఆమె ఉలిక్కిపడి లేచి నిద్రమత్తున తక్కిన వివరాలేమీ అడక్కుండానే యింటికి వెళ్ళింది.

అమ్మమ్మ అమ్మను పక్కలో పడుకోబెట్టుకొని మంచంమీద పడుకున్నది.

కొద్ది క్షణాల పిదప తాతమ్మకూడ లేచి అన్నీ గమనించి ధ్యాన నిమగ్న అయింది. ఆమెకు అనుదినము రాత్రివేళల అట్లా గడపటమే అలవాటు.

తెల్లవారుజామున నాలుగున్నరకు లేచి తాతమ్మ పిల్లిని తీసుకువెళ్ళి మురుగుకాలువ కట్టక్రింద పారవేసింది.

అమ్మమ్మకు పిల్లి చనిపోయినట్లు తెలీదు. ఎవరూ అమ్మమ్మకు ఆ విషయం చెప్పడానికి సాహసించలేదు.

4. అప్పగింత

అమ్మ పుట్టిన ముప్పదియవ రోజు నుండి మరిడమ్మ తాతమ్మ అమ్మను మేలుకొలుపులతో లేపుతూ జోలపాటలతో నిద్రపుచ్చుతూ ఉన్నది. గొల్లనాగమ్మ రోజూ ఉగ్గుపోస్తూ పాలు పడుతూ ఉన్నది.

అమ్మకు రెండు నెలలు నిండి మూడవ నెల వచ్చింది. ఆ రోజు పూర్ణిమ. ఆ మరునాడు మరిడమ్మ తాతమ్మ యాజలి వెళ్ళాలి. అందువలన అమ్మచేత ముద్దకుడుములు యిప్పించి వెళ్ళదామనుకున్నది. అందుకోసం బియ్యం నీళ్ళలో పోసి అమ్మను పడుకోబెట్టిన ఉయ్యాల దగ్గరకు వచ్చింది. ముడుచుకున్న అమ్మ చేతులు ఎంతో ముద్దుగా ముచ్చటగా ఉన్నాయి. లేత తమలపాకులవలె అతి కోమలంగానూ, గులాబిరేకులవలె అందంగానూ ఉన్నాయి.

'ముత్తయిదువులకు ముద్దలు పెడతావా, అమ్మా... అంటూ ఆ చేతులు ముద్దు పెట్టుకుంటూ తెల్లవారుజామున నాలుగున్నర నుండి ఆరున్నర వరకు అమ్మతో ఆటపాటలతో తాతమ్మ కాలం గడిపింది.

అంతలో నాగమ్మ వచ్చింది.

నాగమ్మ చేతిలో అమ్మను ఉంచుతూ...

'నేను రేపు యాజలి వెళతాను. ఈ రోజు ముద్ద కుడుముల వేడుక చేసి అమ్మను నీ చేతిలో పెడతాను. తల్లిదండ్రులకు పిల్ల పుట్టినట్లే లేదు. కొంత కాలం గడిస్తే యేదయినా మార్పు వస్తుందేమో... అందాకా నీవు పెంచవలసిందే. మీయింటి దగ్గరనే నీళ్ళు పొయ్యి, పాలు పట్టు. రోజూ ఒకసారి అమ్మకూ నాయనకూ చూపించు...'

అని తాతమ్మ అమ్మను నాగమ్మకు అప్పజెప్పింది.

అమ్మను అందుకున్న నాగమ్మ హర్షపులకిత అయింది.

తాతమ్మ నానబోసిన బియ్యం బుట్టకు వడవేసి పని చేసే ఖాదర్‌బీని పిలిచి బియ్యంలో పోటు వెయ్యమని చెబుతూ రోటిలో బియ్యంపోసి జల్లెడ కోసం లోపలకి వెళ్లింది. తాతమ్మ మాట ఖాదర్‌బీకి వినిపించక ఏదో పని

చేసుకుంటూ ఉన్నది. తాతమ్మకు ఇంట్లోకి దంపుడుపోటు వినిపిస్తూ ఉన్నందున ఖాదర్‌బీయే దంపుతున్నదని అనుకున్నది. జల్లెడ తీసుకుని బయటకు రాగా ఖాదర్‌బీ కనిపించలేదు. పోటు శబ్దం మాత్రం వినిపిస్తూనే ఉన్నది. బియ్యం మెదిగి ఉన్నాయి. జల్లెడపట్టనవసరం లేకుండా పిండి తయారై పోసిన బియ్యానికి మించిన పిండి వచ్చింది. ఆశ్చర్యంతో తాతమ్మ రోటికి చెవి ఆనించి విన్నది. రోటిలో నుంచే శబ్దం వినిపించింది.

ఆశ్చర్య ఆనందాలతో మునిగిపోయిన తాతమ్మ తాను దైవ స్వరూపంగా కొలిచే తన గురువుగారయిన 'మల్లెల రత్తమ్మగారు' తనకు ఆ విధంగా సహాయ పడ్డదని భ్రమించింది.

ఎనిమిది గంటలవేళ అమ్మమ్మ చల్లచేసి వెన్నచెయ్యి అమ్మపాదాలకు రాచింది. వెన్న రాస్తూ-ఇక నయినా వెన్ను చలవ చేసుకో అమ్మా-అని ఆ చేతినే అరికాలుకు కూడా రాచి తనకు తెలియకుండా ఆ చేతిని తన కళ్లకు అద్దుకున్నది.

నాగమ్మ అమ్మను స్నానం చేయించి లోపలకు తీసుకువచ్చి పడుకోబెట్టి వెళ్లింది. అమ్మకు బొట్టు పెడదామని అమ్మమ్మ రాగా అమ్మ ముఖాన బొట్టు ఎఱ్ఱగా మెరుస్తూ ఉన్నది. నాగమ్మ నడిగితే తాను పెట్టలేదన్నది. తాతమ్మను అడగగా--

'నీకూ అనుభవమయిందీ? వెనుకటికి సక్కుబాయికి కృష్ణపరమాత్మ సహాయం చేసినట్లుగా మనకు మల్లెల రత్తమ్మగారు సహాయ పడుతున్న దేమో...'నని చెప్పింది.

తాతమ్మ బెల్లం తరిగి పొయ్యిమీద పెట్టింది. ఎంతకూ కట్టెలు మండక పోవడం వలన విసుగుతో పొయ్యిలో నీళ్ళుపోసి 'అన్నీ ఆ తల్లే చేసుకుంటుంది-' అని గిన్నెపై మూతపెట్టింది. రాజరాజేశ్వరి పేరుతో ముత్తయిదువుకు పెట్టుకొని అక్షతలు వేసుకుందామని దొడ్లోకి వెళ్లి తులసిదళాలూ పువ్వులూ కోసుకు వచ్చింది.

ముత్తయిదువుకు పిలవబడిన ఆమె పేరు కాకుమాను లక్ష్మాయమ్మ. ఆమె అంధురాలు. చూడలేదు కాబట్టి పిల్లను చేతికి ఇవ్వమని అడిగింది.

అమ్మమ్మ చేతికి అందించింది. ఆమె అమ్మను ముద్దు పెట్టుకోబోగా మెరుపు మెరిసినట్లయింది. అమ్మ కన్నుల నుండి కిరణాలు ఆమె కన్నుల్లో గుచ్చుకున్నాయి. ఆ కాంతిలో అయిదు సంవత్సరాల బాలిక కనుపించింది. చేతిలో పిల్ల చేతిలోనే ఉన్నది. లక్ష్మాయమ్మ ఆశ్చర్యపోయింది; ఆనందపడ్డది. కొన్ని క్షణాలకు స్తిమిత పడి అన్నది--

'అమ్మా! మరిడమ్మా! నీ సన్నిధికి వచ్చిన వేళ ఎంత మంచిదమ్మ! ఎంత అదృష్టం! నీ శక్తివల్ల ఒక దివ్యదర్శనం అయింది!'

అదే స్థితిలో యింకోమెట్టు పైగానే ఉన్న తాతమ్మ-

'ఉదయం నుండి అన్నీ దివ్య దర్శనాలే. అమ్మ దయవల్ల అంతా చిత్ర విచిత్రంగానే జరుగుతున్నది.'

-అంటూ పొయ్యిమీద ఉన్న గిన్నెపై మూతదీసి చూచింది. పాకంవచ్చి ఉన్నది. పొయ్యి సన్నగా మండుతూ ఉన్నది. తల్లిదయను స్మరిస్తూ అత్యంతా నందంతో తాతమ్మ చలిమిడి చేసింది. వంటచేసి నివేదనకు పదార్థాలన్నీ గురువుగారి పటం దగ్గరకు తెచ్చి పెట్టుకున్నది. పిల్లనుకూడా తీసుకురమ్మన్నది. అమ్మమ్మ అమ్మను చేతిలో పెట్టుకొని దేవతార్చన దగ్గరకు వచ్చింది.

తాతమ్మ ఉదయం నుండీ జరిగిన విచిత్ర సంఘటనలన్నీ స్మరించు కుని, అవి అన్నీ తన గురువుగారి మహిమలేనని అమ్మమ్మకు చెబుతూ ఉన్నది.

'కావు, కావు-'మంటూ కాకులు పడిపోయిన గోడమీదుగా కట్టిన పట్టాలపైగా ఎగిరి లోపలకు వచ్చాయి.

కాకులు 'కావు, కావు' మనటంలో..

తాతమ్మ చెప్పే మాటలు నిజం 'కావు' అనీ,

అమ్మతో తమను 'కావు' మని అంటే రక్షించమనీ కావచ్చు.

తాతమ్మ ముత్తయిదువు పాదాలకు పసుపురాచి ముఖాన బొట్టు పెట్టింది. తనకు ఆ అర్హత లేకపోయినా పిల్లకు బదులు తాను చేస్తున్నాననీ, ఆ తల్లిదయ చేయిస్తున్నదనీ చెబుతూ, చలిమిడిమీదనూ యితర పదార్థాల

మీదనూ మూతలు తీసి అభిఘరించి-అన్నమూ, నెయ్యీ తీసుకొని అగ్నిహోత్రంలో వెయ్యటానికి వెళ్ళగా ఒక కాకి అన్నమూ, ఒకకాకి చలిమిడీ ముట్టుకున్నాయి. ఒడిలో అమ్మను పెట్టుకు కూర్చున్న అమ్మమ్మ కొట్టగా అవి తడబడి బయటకు పోను దారిలేక ఒక కాకి అమ్మమ్మ నెత్తిమీద తన్ని క్రింద పడ్డది. చచ్చినట్లున్నది. కాని ప్రాణం పోలేదు. రెండవ కాకి ప్రక్కనే ఉన్న భోషాణం మీద వాలి కళ్ళు తెరచి తల ప్రక్కకు తిప్పి అమ్మవంకనే చూస్తూ ఉన్నది.

అంతలో తాతగారు వచ్చి పట్టాను విప్పి కాకులను బయటకు తోలారు. ఒకటి ఎగిరిపోయింది. కాని రెండవది అట్లాగే పడుకున్నది. తాతగారు దానిని తీసుకుని పశువుల చావడిలో పెట్టి బుట్ట కప్పారు.

అమ్మమ్మ లేచి 'మనకు అన్నీ అపశకునాలే.' అనుకుంటూ అమ్మను ఎత్తుకుని గదిలోకి వెళ్ళి ఉయ్యాలలో పడుకోబెట్టింది.

తాతమ్మ అందరికీ భోజనాలు పెట్టింది. సాయంకాలం వేడుకకు కావలసిన పనులన్నీ చక్కబెట్టింది. ముత్తయిదువులను పిలవడానికి యింటి ఎదురుగా ఉన్న మహాలక్ష్మమ్మను పిలిచి వూళ్ళోకి పంపింది.

సాయంకాలం ఆరు గంటలకు వేడుక ప్రారంభమయింది.

అమ్మమ్మ మనసులో- 'ఇదే నా చివరి వేడుక' అని తోచింది. 'ఇదే మిటి? ఇట్లా అనిపిస్తున్నది?' అని అనుకుంటూ ఉండగా.

'ఔను, నీవు చూడగల చివరి వేడుక ఇదే-' అని వినిపించింది.

'ఎవరివీ మాటలు?'- అని చుట్టూ చూస్తే-పేరంటాళ్ళ సందడే గానీ మరేమీ కనుపించలేదు; మళ్ళీ ఏమీ వినిపించనూ లేదు.

అంతలో అమ్మమ్మ చెల్లెలు 'సౌభాగ్యమ్మగారు' నంబూరు నుండి వచ్చి అమ్మను ఎత్తుకుని అమ్మమ్మను కుర్చీలో కూర్చొనబెట్టి అమ్మమ్మ చేతిలో అమ్మను పెట్టింది.

భజంత్రీలు సన్నాయి వాయిస్తూనే లోపలకు వచ్చారు. కొంతకాలం కృతులు వాయించిన పిమ్మట నాగస్వరం వేయటం ప్రారంభించారు. అదే

సమయంలో పాములవాడు బిక్షాటనకు వచ్చి పాముల నాడిస్తున్నాడు. అమ్మమ్మ ఒడిలో వున్న అమ్మ తల పాముపడగలాగ ఆడుతున్నది. ఆ కదలిక పాట తెలిసిన వారు తృప్తిగా తలవూపుతూ వున్నట్లు ఉన్నది. అమ్మమ్మమాత్రం ఆ వూపు జబ్బు లక్షణమని బాధపడ్డది.

బారసాలనాడు వచ్చిన బంధువులందరూ ఆనాడు కూడా ఉన్నారు. బామ్మకూడ వచ్చింది. అందరి మనస్సుల్లోనూ కారణం తెలియకుండానే సముద్రపు పోటులాగా ఒక దుఃఖపు కెరటం పెలుబికింది. అయిదు నిమిషాల అనంతరం దానంతట అదే అంతరించి పోయింది కూడ.

బామ్మ అమ్మచేతికి చలిమిడి ముద్దను యిచ్చి మొదటి ముద్దను తానే తీసుకున్నది. రెండవముద్ద అమ్మ అమ్మమ్మగారైన చంద్రమౌళి జానకమ్మగారికి యిచ్చింది. ఆ ముద్ద అమ్మయే స్వయంగా చేతితో తీసుకుని యిచ్చింది. ఆ అద్భుతం అమ్మమ్మ మాత్రమే గమనించింది. ఇంత చిన్న పిల్లకు ఎట్లా సాధ్యం అయిందీ-- అని విస్తుపోతూ మూడవసారి ఏమి చేస్తుందా-- అని పరిశీలించింది. ఆసారి చేతికి అందిస్తేనే యిచ్చింది. ఆ ముద్దను అమ్మ సౌభాగ్యమ్మగారికి యిచ్చింది. నాలుగవ ముద్దను వెంకట సుబ్బమ్మగారికి యిచ్చింది. అయిదవ ముద్దను గంగరాజు జానకమ్మగారికి యిచ్చింది.

అమ్మకు హారతి యిచ్చి అక్షతలు వేసి ఎట్టినీళ్ళు తీసి లోపలకు తీసుకువెళ్ళారు. తక్కిన వారందరకూ బామ్మా, అమ్మమ్మా వేడుకలు జరిపారు. పేరంటం పూర్తి అయింది. ముత్తయిదువులు యిళ్లకు వెళ్ళారు.

ఆ రాత్రి ఏడున్నరకు గొల్లనాగమ్మను పిలిచి-

'ఈ రోజు మంచిది. పండు వెన్నెల. నిండు తిథి. అమ్మాయిని యింటికి తీసుకువెళ్ళు. రోజూ రెండుసార్లు తీసుకువచ్చి చూపించి పోతూ వుండు-'

అని చెప్పి తాతమ్మ అమ్మను నాగమ్మ ఒడిలో పెట్టింది.

ఆ క్షణంలో దుఃఖభారంతో తాతమ్మ సర్వావయవాలూ కంపించినా, అంతఃకరణం శోకసాగరమే అయినా-కుడికన్ను వెంట ఒకే ఒక్క అశ్రుకణం జారి అమ్మ భ్రూకుటిలో పడ్డది.

ఆ బిందువులో-అప్పుడే అవతరించిన కృష్ణుని వసుదేవుడు తన బొమ్మున కడ్డంగా పట్టుకుని ఆ నడిరేయి కాటుక కురిసే చీకటిలో వ్రేపల్లెకు ప్రయాణం చేస్తున్న పురాణ సంఘటన దృశ్యమై అంతలోనే అదృశ్యమయింది. ఆ క్షణానికి ఆ దృశ్యానికి సమన్వయం కుదుర్చుకోలేక ఏమీ అర్థంగాక తాతమ్మ అయోమయమై అమ్మవంక చూచింది.

అమ్మను తన ఒడిలో పెట్టగానే కోటి కొండలు ఒకేసారి తనమీద పడ్డట్లయి అంతలోనే బొన్నబెండులాగా అతి తేలిక అనిపించగా నాగమ్మ 'ఇదేమిటి?' అనుకుంటూ అమ్మవంక చూచింది.

అమ్మ ఆ రెండు నల్లగుడ్లనూ రెండు కంటి చివరలకూ పోనిచ్చి రెప్ప వేయకుండా యిద్దరనూ చూస్తూ ఉన్నది.

ఆ చూపు మరీ విచిత్రమనిపించి వారి దృష్టి అట్లా నిలబడిపోయిన క్షణంలో అమ్మ రెండు కళ్ళల్లోనూ నల్లగుడ్లు మామూలు స్థానాల్లోకి వచ్చాయి ఏమీ తెలియనట్టు అమాయకంగా అతి నిర్మలంగా, నిర్లిప్తంగా శూన్యంలో చూస్తూ ఉన్నట్లున్నది.

వేడుక సమయంలో అమ్మకు నల్లగాజులు వేయించారు. బంధువులు 'గొల్లగాజులా?-' అని హేళనచేయగా-'గొల్లయింటికే పోతున్నదిగా-' అని అమ్మమ్మ విషాదస్వరంతో సమాధాన మిచ్చింది.

నాగమ్మ పెట్రోమాక్సులైటుతో బంధువులతో సంతోషంగా అమ్మను యింటికి తీసుకు వెళ్ళింది.

ఇంటి ముందుకు పోగానే పెద్ద త్రాచు ఆడుకుంటూ అమ్మను ఎత్తుకుని ఉన్న నాగమ్మ ముందుకు వచ్చి పడగను ముందుకు వంచి సాష్టాంగ నమస్కారం చేసినట్లుగా పడుకున్నది.

ఇరుగూ పొరుగూ కొట్టటానికి కట్టెలతో రాగా తళుక్కున మెరసి పాము అదృశ్యమయింది.

పాము తప్పించుకు పోయిందనీ, మంత్రకట్టు పాము అనీ, యిది ఏదో కొత్తరకం పాము అనీ తలా ఒక రకంగా భావించారు.

అమ్మను లోపలకు తీసుకువెళ్లి మంచంమీద పడుకోబెట్టారు. అమ్మ ఏడవటం ప్రారంభించింది.

అంతలో నాగమ్మ యింటి కెదురుగా ఉన్న చాకలి లక్ష్మయ్య ఉయ్యాల మంచం తెచ్చి యిచ్చి- 'ఈ మంచంమీద చాలా మంది పడుకున్నారు. చలవ కలిగింది..' అని చెప్పి దూలానికి కట్టాడు. అమ్మను అందులో పడుకోపెట్టారు. అయినా ఏడుపు మానలేదు.

అందులో నుండి తీసి మెత్తగా పక్కవేసి మళ్లీ మంచంమీద పడుకో పెట్టారు. ఏడుపు ఎక్కువయింది.

నాగమ్మకు విసుగుపుట్టి వాకిట్లో గంగరావి చెట్టుకు తన చిరిగి పోయిన నీలిరంగు చీరను కట్టి దానిలో పడుకోబెట్టింది.

'ఇన్నింట్లోకి నా చిరిగిపోయిన కోకే సుఖంగా ఉందా అమ్మా?-' అని నాగమ్మ తనలో తాను మురిసి పోయింది.

ఔను, మహా విచిత్రం-సర్వ ఐశ్వర్యాలకు అధిపతి అయిన పరమేశ్వరు నికి పరమదరిద్రులంటేనే ప్రేమ ఎక్కువ!?

5. మాతృత్వ ప్రకటన

ఎనిమిదవ మాసంలో - పారాడుతూ పారాడుతూ నాగమ్మ తింటూన్న కంచంలో మెతుకులను అమ్మ నోటిలో పెట్టుకున్నది. అదే అన్నప్రాశన.

'తప్పు, తప్పు, వద్దు'--- అంటూ నాగమ్మ గబగబా వచ్చి అమ్మ నోటిలోని మెతుకులు తీసివేయటానికి విఫలయత్నంచేసి, అమ్మను తీసుకు వెళ్ళి-ఉయ్యాలలో పడుకోబెట్టింది.

నాగమ్మ 'తప్పు-వద్దు' అనడంలో-బ్రాహ్మణ బాలిక గొల్ల యింట్లో అన్నం తినడం ఆచార విరుద్ధమని గానీ, అమ్మ అన్నం తినటం 'తప్పు' అని గానీ, అమ్మను అన్నం తిన 'వద్దు' అని గానీ నాగమ్మ ఉద్దేశం కాదు.

ఏది ఏమయినా, అన్నంకోసం-అమ్మ చేసిన మొదటి ప్రయత్నమే వారించబడింది.

అదీగాక--అన్ని వేడుకలూ ఎంతో ఉత్సాహంతో జరిపే తాతగారి సాంప్రదాయిక కుటుంబంలో - అమ్మకు అన్నప్రాశన జరుపబడలేదు-ఎందు వల్లనో? మరి తల్లిదండ్రులు అన్నప్రాశన జరుపలేదని అమ్మ భోజనం మాని వేసిందో, అమ్మకు భోజనం అవసరంలేదని గుర్తించి-ఆ తల్లిదండ్రులు ఆ వేడుకను విస్మరించారో-అనూహ్యం.

అమ్మ సంవత్సరన్నర వరకు నాగమ్మ యింట్లోనే పెరిగింది. వాళ్ళు పాలు పడితే త్రాగేది. పాలకోసం గానీ, అన్నంకోసం గానీ ఎప్పుడూ అడగలేదు.

మరిడమ్మ, తాతమ్మ-యాజలి నుంచి వచ్చి నాగమ్మను-

'నేను వచ్చానుగా, అమ్మాయిని నేను అట్టే పెట్టుకుంటాను. రోజూ మరి కొంచెం సేపు నీవు యిక్కడనే ఉండి వెళ్ళుతూ ఉండు. సరిపోతుంది' అని కోరింది.

నాగమ్మ అమ్మను తీసుకువచ్చి వారి యింటి వద్ద దించింది. కాని తన పెన్నిధిని ఎవరో దోచుకున్నట్లు బాధపడ్డది. తాను ఎంత ప్రేమగా చూచినా, తనకు ఎంత మమకారం ఉన్నా - తన బిడ్డ కానందువల్లగదా - అని విలపిస్తూనే

అమ్మను తిరిగి అప్పజెప్పింది. అయినా ఏదో అనిర్వచనీయమయిన, అభేద్య మయిన, అతిబలవంతమయిన అనుబంధం నాగమ్మను ఎక్కువ కాలం వారి యింటి వద్దనే గడిపేటట్లు చేసింది.

నాగమ్మ దుఃఖోపశమనం కోసమేమో-అమ్మ కూడా ప్రతి దినమూ కొంచెం సేపయినా నాగమ్మ యింటి వద్దకు తీసుకువెళ్ళనిదే ఊరుకొనేది కాదు.

ఇంటిలో మరిడమ్మ తాతమ్మ-ఎల్లప్పుడూ సత్కాలక్షేపం చేస్తూ ఉండేది. ఆమె-యోగాభ్యాసానికి, ధ్యానానికి అవసరమయిన కాలంలో తప్ప మిగిలిన సమయంలో- యిరుగు పొరుగు వారిని జేర్చుకొని తత్త్వవిచారణ చేస్తూ నయినా ఉండేది. లేక పురాణ కథలకు సంబంధించిన పాటలు పాడుతూ నయినా ఉండేది. ఆమె తత్త్వవిచారణలో ఎంత నిష్ణాతురాలో, యోగాభ్యాసంలో ఎంత అనుభవజ్ఞురాలో అంత గొప్ప గాయకురాలు. కమ్మని కంఠమూ, చక్కని పాటా. ఆమె ఏ పని చేస్తున్నా పాటలు పాడుతూనే ఉండేది. ఉచ్ఛ్వాస నిశ్వాసాలవలె ఆమెకు పాట సహజమైపోయింది. ఆమె ఏమి పాడుతున్నా శ్రోతలు మంత్రముగ్ధులయ్యేవారు.

ఆమెలోని మరొక ప్రత్యేకత-ఆమె సహనం, కుటుంబ నిర్వహణలో ఆమె ప్రదర్శించే సహనానికి-సరిహద్దులు లేవు. ఎవరికి ఏ వేళలో ఏమి కావలసివస్తే-అది తయారు చేసి పెట్టేది. ఎటువంటి క్లిష్టపరిస్థితిలోనూ-ఆమె కష్టపడడముగానీ, విసుగుపడడంగానీ జరుగలేదు.

అరవయేటనే పతివిహీన అయి, సంతానహీన అయిన ఆమె అందరి సంతానాన్నీ ఆత్మసంతానంగానూ, అందరి సంతృప్తినీ ఆత్మసంతృప్తిగానూ భావించి- అనేకులకు సేవ చేసింది.

ఈ తత్త్వ విచారణానురక్తీ, యోగాభ్యానమూ, పురాణకథా కాలక్షేపమూ, విశాల హృదయమూ, సేవానక్తీ, త్యాగబుద్ధీ-అమ్మకు మరిడమ్మగారి నుండి సంక్రమించినవని అనడానికి వీలు లేకపోయినా - అతి బాల్యదశ నుండి అహర్నిశమూ ఆమె పక్కలోనో, పక్కనో, ఒడిలోనో, బడిలోనో పెరిగిన అమ్మకు ఆ గుణాలు సంప్రాప్తించినవని అనేకులు ఊహించడానికి అవకాశం లేకపోలేదు.

మరిడమ్మగారి ప్రతిమాటనూ, చేతనూ అమ్మ గమనిస్తూ ఉండేది; అన్నీ అర్థమవుతూ ఉండేవి. రెండు సంవత్సరాలయినా నిండని వయస్సులోనే- పెద్దవాళ్లకువలె వదనమండలం ఎల్లప్పుడూ గంభీరతా ముద్రితమై ప్రశాంతమై తేజోవిలసితమై ఉండేది.

ఒక రోజున చిదంబరరావుగారు బాపట్ల నుండి మన్నవ వచ్చారు. ఒక చెయ్యి తలక్రిందా, మరోచెయ్యి గుండెమీద పెట్టుకొని, వెల్లకిలా పడుకుని, ఏదో ఆలోచిస్తున్నట్లు ఆకాశంలోకి చూస్తూ నిశ్చలమై ఉన్న అమ్మను చూసి అనుకున్నారు.

'చల్లనిమూర్తి-మంచి యోచనా...' అని

అనుకుంటూనే అమ్మను పైకెత్తుకుని ముద్దు పెట్టుకుని అంతలోనే గుండె కలుక్కుమని ఉలిక్కిపడి 'ఎవరినీ అలవాటు చేసుకోకూడదు. చేసుకుంటే ఫలితం విచారమే' అనుకుంటూ అమ్మను క్రిందకు దించివేశారు.

లోగడ-అమ్మకంటే ముందు జన్మించిన లక్ష్మి అనే అమ్మాయిని - చిదంబరరావుగారు ఎక్కువగా అలవాటు చేసుకున్నారు. కానీ-ఆమె చని పోయింది. ఆ దుఃఖం-వారిని అమితంగా క్రుంగదీసింది.

19 నెలల వయస్సులో-అమ్మ-ఒక రోజు సాయంకాలం అయిదున్న రకు-తమ యింటి ఎదురుగా ఉన్న మంత్రిప్రగడ రాజమ్మగారి యింటికి - చిట్టి-చిట్టి అడుగులు వేసుకుంటూ వెళ్లింది. వారి దొడ్డిలో వున్న దానిమ్మ చెట్టు క్రింద -పద్మాసనం వేసుకుని కూర్చుని - నల్లగ్రుడ్లు పైకి పోనిచ్చి - అరమోడ్పు కన్నుతో ధ్యాన్య నిమగ్న అయింది.

అంతలో మంచినీళ్ల బావికి వెళ్లిన రాజమ్మగారు వచ్చి అమ్మను చూచి, పద్మాసనం గమనించక - అమ్మకు చిన్నబిడ్డ నొప్పి వచ్చిందని భావించి భుజంమీది వున్న బిందెడు నీళ్ళూ అమ్మమీద కుమ్మరించింది. కాని అమ్మలో మార్పు లేక పోయేటప్పటికి భయపడి బిందెనక్కడనే పారవేసి, అమ్మను భుజాన వేసుకుని వారి యింటికి తీసుకువెళ్లింది. అమ్మ పద్మాసనం అట్లాగే ఉన్నా-దానిని ఎవరూ పట్టించుకొనక వైద్యునికోసం కబురు పంపించారు. మన్నవ కృష్ణశర్మగారు వచ్చి-ఉల్లిపాయలూ, జిల్లేడురసమూ తీయించి

ముక్కులలో పోయించారు. అయినా - ఫలితం లేపోయింది. ఏమి చేయడానికీ తోచక-బంధుజనం చుట్టూజేరి, చిందులు త్రొక్కుతూ ఉన్నారు. ఒక అరగంట గడిచిన పిమ్మట అమ్మ జాగ్రత్తలోకి వచ్చింది. మొదట అది అంతకుముందు వాడిన మందుల ప్రభావమని అనుకున్నా--అమ్మ అప్పుడు నడలించిన పద్మాసనం చూచి చుట్టూ ఉన్న జనం విస్తుపోయి అమ్మవంక గుడ్లప్పగించి చూచారు. అప్పుడు అమ్మ ముఖంలోనూ, కన్నుల్లోనూ రోగ లక్షణాలకు బదులుగా ద్యోతితమయిన ఉజ్జ్వల కాంతి రేఖలు-వారిని ఆశ్చర్యచకితులను చేశాయి.

తర్వాత కొద్దిరోజులకే అమ్మమ్మ అమ్మను తీసుకుని తెనాలి వెళ్ళింది. అక్కడ కూడ ఒక దానిమ్మచెట్టు క్రింద ఎడమ కాలును ముందుకు చాచి, కుడికాలును వెనక్కు మడతవేసి, దానిమ్మపువ్వు చేతిలో పట్టుకుని,శ్వాస ఆపివేసి నల్లగుడ్డు లోపలకు పోనిచ్చి, చేపనిద్రలాగా, అరమోడ్పు కన్నుతో కూర్చున్నది.

ఆ స్థితిలో అమ్మను పెదతల్లి అన్నపూర్ణమ్మగారు చూచి- 'ఏమిటి?'- అనుకుంటూ ఉండగానే అమ్మ జాగ్రత్తలోకి వచ్చింది.

'ఎమిటమ్మా అట్లా కూర్చున్నావు?' కుతూహలం ఆగక - ఆమె అడిగింది.

'శాంభవీముద్రలే..' నిర్లిప్తంగా చెప్పింది అమ్మ.

అన్నపూర్ణమ్మ గారు ఆశ్చర్యపోయింది. మాటలే సరిగా పలుకని ప్రాయంలో 'శాంభవీముద్రట, పైగా మాటేగాదు, అభ్యాసమున్నూ'

'నీ కెవరు చెప్పారమ్మా?'

'మరిడమ్మ తాతమ్మ.'

'చెప్పిందా?-చేస్తుంటే చూచావా?'

'చేస్తుంటే చూచాను. అడగ్గా చెప్పింది.'

పట్టలేని ఆనందంతో అన్నపూర్ణమ్మగారు అమ్మమ్మను పిలిచి--

'రంగమ్మ తల్లీ-పోయిన పిల్లలు పోయినా యింతవరకు అదృష్ట వంతురాలవమ్మా. ఈ బిడ్డ చాలు...'

విషాదాచ్ఛాదితమైన హాసంతో అమ్మమ్మ అన్నది.

'బిడ్డ తెలివితేటల మీదనే తల్లి తృప్తి పడదుగా, పనికిమాలిన వాళ్ళయినా వాళ్ళూ బిడ్డలే గదా-అట్లా అయితే యీ బిడ్డను చూచుకుని తృప్తిపడినా వాడిని చూచి దుఃఖపడవలసిందేగా...'

అని రాఘవరావు మామయ్య అల్లరిని తలుచుకుని విచారించి అమ్మను దగ్గరకు తీసుకుని...

'ప్రొద్దుటి నుండి పాలు త్రాగలేదు. అడగనన్నా లేదు...'

-అని పాలు పట్టింది.

అమ్మమ్మ తిరిగి మన్నవ ప్రయాణమయి-ఒంటెద్దు బండిలో రైల్వే స్టేషన్‌కు వెళ్ళుతూ ఉన్నది. దారిలో బండిని ఆపి బండివాడు పండ్లుకొని తేవడానికి కొట్టు వద్దకు వెళ్ళాడు. అంతలో కాషాయ గుడ్డలు ధరించిన ఒక వృద్ధుడు వచ్చి అమ్మమ్మతో--

'నీ బిడ్డ భగవంతుడు. నీకు యిక జన్మ లేదు' అని చెప్పి గబగబా వెళ్ళి పోయాడు.

ఆ మాటలకు అమ్మమ్మ నివ్వెరపోయి, ఆలోచించుకుంటూ ఉండగా - ఎదురుగా వచ్చే బండి తగిలి 'కాడి పైకిలేచి' అమ్మమ్మా-అమ్మా పడబోయారు-కాని పడలేదు. మళ్ళీ కాడి మామూలుగా ఎద్దు మెడమీదనే ఉన్నది.

అంతలో బండివాడు పండ్లుకొనుక్కు వచ్చి అమ్మమ్మకు యిచ్చాడు. అమ్మ-అందులో రెండు పళ్ళు తీసుకుని - బండి వాడికి యిచ్చింది. బండివాడి కళ్ళల్లో ఆనందం, కృతజ్ఞతాభావం వెల్లివిరిశాయి. వెంటనే వాడు చిన్నపిల్ల అని కూడా ఆలోచించకుండా రెండు చేతులూ కలిపి నమస్కారం చేశాడు.

బండి స్టేషను చేరింది.

అమ్మమ్మ - అమ్మ చెయ్యి పట్టుకునే-బ్రిడ్జి ఎక్కుతూ ఉంది. కానీ మధ్యలో-అమ్మ-అమ్మమ్మ చేతిని తప్పించింది. అమ్మమ్మ ముందు వెళ్ళుతూ ఉన్నది. అమ్మ వెనుక నడుస్తూ ఉన్నది. దారి ప్రక్కన ఒక గుడ్డి ఆమె. ఆమె కుంటి కొడుకు, యిద్దరు గుడ్డి కూతుళ్ళు కూర్చుని అడుక్కుంటూ ఉన్నారు.

వారిని అమ్మ చూచింది. హృదయం కరుణారసప్లావితమయింది. దగ్గర ఎంత డబ్బు ఉన్నా యిత్తునే-అనుకున్నది. అమ్మమ్మను అడగడానికి సంకోచించింది. వెంటనే చేతికి ఉన్న బంగారుగాజు తీసి, ఆ భిక్షుకి చేతిలో ఉంచింది.

అమ్మమ్మ కేక వినిపించింది. అమ్మ గబగబా పరుగెత్తుకుని వచ్చి, అమ్మమ్మ చెయ్యి పట్టుకుంది.

అమ్మమ్మ స్థిమితపడి 'నన్ను ఎప్పుడు వదిలావమ్మా?' అని అడిగింది.

'నన్ను వదిలి నీవే ముందు వెళ్లా.-'వన్నది అమ్మ తలగోక్కుంటూ గోముగా.

అంతలో-రైలు బండి కూత వినిపించింది. అమ్మను చంకన వేసుకుని అమ్మమ్మ చకచకా వెళ్లి బండి ఎక్కింది. అమ్మ మేనమామ చంద్రమౌళి సీతారామయ్యగారు వచ్చి రెండు టిక్కెట్లు తెచ్చి అమ్మమ్మ చేతిలో ఉంచారు.

బండి సాగింది.

అమ్మమ్మ రెండు టిక్కెట్లు చూచుకొని అమ్మతో-

'నిన్నుకూడా పెద్దమనిషి క్రింద లెక్కవేసినట్లున్నాడు మామయ్య' అని నవ్వుకొన్నది.

'ఎవరి కోసమో, ఎందుకు తెచ్చాడో_' అని అమ్మా నవ్వింది.

పెట్టెలో ఒక వైపున ఒక ఉద్యోగి టిక్కెట్లు పరీక్షిస్తున్నాడు. అంతలో ఎవరో గొలుసు లాగారు. బండి ఆగింది. ఒక యువతి ఆ పెట్టెలోకి వచ్చింది. ఆ యువతి పేరు శాంతమ్మ. ఉద్యోగిని చూచి ఉలిక్కిపడి_ మళ్లీ దిగబోయింది.

అంతవరకూ అమ్మమ్మ ప్రక్కన కూర్చున్న అమ్మ అమ్మమ్మ ఒళ్లోకి వెళ్లి కూర్చుని ఆ స్థలంలో శాంతమ్మను కూర్చోమని కోరింది.

ఆమె కూర్చున్నది కాని, ఆమె మనసులోని భయమూ, గుండెలోని దడా-కన్నుల్లోనూ, ముఖంలోనూ స్పష్టంగా కనిపిస్తున్నాయి.

అమ్మమ్మ అమ్మను ఒళ్లో నుండి క్రిందకు దించి 'ప్రక్కన కూర్చో అమ్మా-కాలు నొప్పిగా ఉన్నది' అన్నది.

'టిక్కెట్టు లేనివాళ్ళు కొంచెమయినా స్థలం ఆక్రమించకూడదమ్మా..'

ఆ చిన్న నోటి నుండి వచ్చిన ఆ పెద్దమాటకు-శాంతమ్మ ఉలిక్కి పడింది.

'నీకు టిక్కెట్టు లేకపోవడ మేమిటమ్మా? ఇదిగో...' అని అమ్మమ్మ ఒక టిక్కెట్టు అమ్మకు యిచ్చింది.

'ఇది నాది కాదమ్మా-ఆమెది'అంటూ అమ్మ దానిని శాంతమ్మకు యిచ్చింది.

అంతలో ఉద్యోగి వచ్చి శాంతమ్మ ముందు నిలుచున్నాడు. ఆమె టిక్కెట్టు చూపింది. ఏమీ తెలియని ఉద్యోగి ఏమీ గ్రహించకుండానే ముందుకు సాగి పోయాడు.

బొటబొటరాలే కన్నీటితో శాంతమ్మ అమాంతం అమ్మను తన గుండె లకు అదుముకున్నది.

అమ్మమ్మ 'ఏమిటి' అన్నట్లు ఆమె వంక చూచింది. ఆమె తన దీనావస్థ నంతనూ వెళ్ళబోసుకుని - టిక్కెట్ లేని ప్రయాణం విషయం వివరించి అన్నది-

'భగవంతుడే రక్షిస్తాడని అనుకున్నాను. మధ్యలో యీ చిట్టితల్లి రక్షిస్తుందనుకోలేదు.'

వెంటనే ప్రక్కన కూర్చుని అంతా గమనిస్తున్న ఒకామె అన్నది.

'రక్షించిన వాళ్ళే భగవంతుడని ఎందుకు అనుకోకూడదు?'

సంభాషణ జరుగుతూనే ఉన్నది. అమ్మమ్మకు నిద్రపట్టింది. అమ్మ తన చేతికి ఉన్న బంగారు గాజు తీసి శాంతమ్మ చేతిలో పెట్టి.

'అవసరాలకు వాడుకో అమ్మా..' అన్నది చిన్నగా.

బండి మోదుకూరు స్టేషనులో ఆగింది. ఆమె అక్కడ దిగాలి- కాని ఆ గాజును ఏమి చేయడానికీ, ఏమి అనడానికి అర్థంగాక అమ్మ వంక చూచింది.

అమ్మ 'వెళ్ళు' అన్నది చిన్నగానే. కాని ఆ ధ్వనిలో ఆజ్ఞ ఉన్నది. ఆ ఆజ్ఞను తిరస్కరించే బలం ఆమెలో ఎక్కడిదీ?

నిడుబ్రోలు స్టేషనులో బండి దిగగానే ప్లాటుఫారం మీదనే తాతగారూ,

మోతాదూ, వెట్టివాడూ కనబడ్డారు.

అమ్మను ఎత్తుకుంటూ అమ్మమ్మ అమ్మ చేతులవంక చూచింది. రెండు గాజులు లేవు. ఆదుర్దాగా తాతగారితో చెప్పింది.

తాతగారు మాత్రం నిర్లిప్తంగా 'పోతే పోనీలే-పిల్ల అయినా భద్రంగా ఉన్నది. ఈ రోజుల్లో డబ్బు కోసం ఏమయినా చేస్తారు.'

అని ఎద్దుల బండి ఎక్కించారు.

బండి మన్నవ వైపు బయలుదేరింది. పొన్నూరు ఊరి బయటకు వెళ్ళేటప్పటికి, అమ్మ-మలవిసర్జనకు వెళ్ళాలని అన్నది.

అమ్మమ్మ అమ్మను బండి దించి కూర్చోబెట్టింది.

తిరిగి అమ్మమ్మ అమ్మను బండి ఎక్కించే సమయంలో అమ్మ అన్నది.

'ఇక్కడ బాగున్నది. ఇక్కడ ఉందాం...'

'ఇక్కడ యిల్లు లేదుగా, ఎట్లా ఉంటాం?'

'అయితే మీరు వెళ్ళండి. నేను యిక్కడనే ఉంటాను'

'మరి నీకు యిల్లు వద్దా?'

'కావాలా?' అని అమ్మ నవ్వేసింది.

'అమ్మ లేకుండా చిన్నపిల్లలు ఉండవచ్చునా?'

'ఏం? నీవు లేనప్పుడు నేనే అమ్మనై ఉంటాగా...'

'ఏం మాటలమ్మా! తాలుమాట లేదు.'

'తోలునోరు కాదుకదూ! అందుకని తాలు మాటలేదు.

ఔను... ఆ శరీరం రక్త మాంసాదులతో నిర్మితమే అయినా ప్రతికణమూ ఎట్లా దివ్యమయినదో, అట్లాగే పలికిన ప్రత్యక్షరమూ సత్యమయినది. ఏ ఒక్కటీ పొల్లుమాటగానీ తాలు మాటగానీ ఆ నోటి నుండి బయలువెడలదు.

ఆ ముద్దుమాటల్లోని మురిపానికి మాత్రమే అమ్మమ్మ ముగ్ధురాలై అమ్మను ఎత్తుకుని ముద్దు పెట్టుకొని బుజ్జగించి బండి ఎక్కించింది.

బండి సాగింది.

6. అమ్మమ్మ అంతిమయాత్ర

అమ్మకు మూడవ సంవత్సరం...

కార్తీక శుద్ధ ఏకాదశీ, రాత్రి పదిన్నర అయింది.

అమ్మకు జ్వరం మండిపోతున్నది. పక్కలో అమ్మమ్మ పడుకున్నది. మరిడమ్మతాతమ్మ వచ్చి చూచింది. అమ్మమ్మ చెక్కిళ్ళు కన్నీట తడిసి ఉన్నాయి.

'మౌనస్వామివారు క్రొత్తగా వేసిన రాజ్యలక్ష్మీ యంత్ర ప్రభావం వలన అన్ని జబ్బులూ నయమవుతున్నాయట. నీకు దిగులెందుకు? అమ్మాయిచేత మనం కూడా ప్రదక్షిణాలు చేయిద్దాం.

...అని తాతమ్మ అమ్మమ్మకు ధైర్యం చెప్పింది.

ఒక మౌనస్వామివారు కొంతకాలం మన్నవలో ఉన్నారు. వారు అష్ట సిద్ధులూ పొందినవారు. అరచేతుల రాపిడి మాత్రం చేతనే కుంకుమ సృజించే వారు. ఆ కుంకుమ ప్రభావం వలన సర్వరోగాలు నివారించబడేవి. వారు లేనప్పుడు కూడా వారి శక్తివలన ఆ గ్రామస్థులకు మేలు చేకూర్చవలెనన్న అభిలాషతో రాజ్యలక్ష్మీ అమ్మవారి విగ్రహం క్రింద ఒక క్రొత్త యంత్రాన్ని వేశారు. ఆ దేవాలయానికి ప్రదక్షిణ చేస్తే సమస్త వ్యాధులూ సమసిపోతాయని ఆ గ్రామ జనుల విశ్వాసం.

తాతమ్మ మాటలు విని జ్వరంతో పడుకున్న అమ్మ చివాలున లేచి కూర్చుని అన్నది...

"అది రాజ్యలక్ష్మీ యంత్రంకాదు; ! రాజరాజేశ్వరీ యంత్రం."

ఆ పలుకెంతో శాంతంగానూ స్పష్టంగానూ ఉన్నది. తాతమ్మ ఆశ్చర్యంతో ఆలోచనలో పడ్డది. కానీ అమ్మమ్మ అన్నది.

'చిన్న పిల్లకు పెద్ద ఆలోచన లెందుకమ్మా?'

అమ్మ తొణకకుండా వెతుక్కోనకుండా అన్నది.

'పెద్దవాళ్ళు చిన్న ఆలోచనలు చేస్తున్నారు కనుక.'

'సరేలే_ అన్నీ నీకే_' అంటూ అమ్మమ్మ అమ్మ తలను తొమ్ముల్లో దాచుకుని పమిట కప్పింది. ఆ పమిటలో నుండే అంతర్వాణిలా పలికింది...

'ఔను; అన్నీ నావే కనుక_'

అప్పుడు అమ్మ చెప్పిన మాటలు ఎవరి మనసుకూ పట్టలేదు. కాని 1958లో దేవీ నవరాత్రులలో అమ్మ మన్నవ వెళ్ళినప్పుడు మన్నవ కృష్ణశర్మగారు ప్రభృతులకు ఆ యంత్రం చూపి ఋజువు చేసింది.

అది రాజరాజేశ్వరీ యంత్రమే;

గ్రామస్థులాశ్చర్య పోయారు.

రాజ్యలక్ష్మీ అమ్మవారి విగ్రహం క్రింద రాజరాజేశ్వరీ యంత్రం!

అమ్మకు 2 సం. 9వ మాసంలో అమ్మమ్మకు మగ పిల్లవాడు పుట్టి చనిపోయాడు. తర్వాత నాలుగు నెలలకు అమ్మమ్మ మరల గర్భవతి అయింది. కానీ అయిన నాలుగు నెలలకే విఫలమయినందున అమ్మమ్మ ఎప్పుడూ చింతాక్రాంతయై ఉండేది.

అందువల్ల అమ్మ పెంపకం బాధ్యత పూర్తిగా మరిడమ్మ తాతమ్మ వహించక తప్పలేదు. రోజూ శ్రద్ధగా అమ్మకు అన్నం పెట్టడం ప్రారంభించింది. ఎందువల్లో అన్నం శరీరతత్వానికి సరిపడలేదు. పెట్టిన అన్నం పెట్టినట్లే విసర్జింప బడేది. తాతగారు తెనాలిలో డాక్టర్ సాంబయ్య గారివద్ద హోమియో వైద్యం చేయించారు. కానీ ఫలితం ఏమీ లేకపోయింది.

ఒకనాడు ఒక ఘోషాయి వచ్చి అమ్మకు మందు యిస్తానని ఒక వనమూలికను అమ్మ మెడలో కట్టబోయాడు. ఆ మూలికను అందుకుని అమ్మ చటాలున నోట్లో పెట్టుకున్నది.

'ఆ మూలికను తినవద్దు; తింటే చచ్చిపోతారు.'

...అని ఘోషాయి గబగబా పెద్దగా అరిచాడు.

'నీవు చెప్పినట్లు చచ్చిపోతే నీ మూలిక పని చేసినట్లే, లేకపోతే నీ మాట అబద్ధం. ఆయుర్దాయ మున్నవాడిని యివి చంపుతాయా?

ఆయుర్దాయం లేనివాడిని యివి బ్రతికిస్తాయా? ఆయుర్దాయం తీరినవాడు మందులతో ఎట్లా బ్రతకడో ఆయుర్దాయం వున్నవాడు అట్లే చావడు.'

అమ్మ నవ్వుతూ నెమ్మదిగా చెబుతూ ఆ మూలికను నమిలి మ్రింగింది. విచిత్రం! ఆ మూలిక అమ్మను ఏమీ చేయలేదు. ఘోషాయి ఆశ్చర్యపోయాడు.

అప్పుడు అమ్మ వయస్సు 3 సం. 9 మాసాలు.

అమ్మమ్మ మళ్లీ గర్భవతి అయింది. అమ్మమ్మకు జ్వరమూ దగ్గూ ప్రారంభమయినాయి. మూడవ మాసంలో వంటయింటి మధ్యలో ఉన్న మట్టిగోడ పడగొట్టించి అమ్మమ్మ రాతి గోడ కట్టించింది. ఆ పని తాతగారికి యిష్టం లేదు. అప్పటి నుండి అమ్మమ్మకు జబ్బు ఎక్కువయింది. తాతగారికి అనుమానం ప్రబలింది. తెనాలిలోకానీ, బాపట్లలోకానీ సరిఅయిన వైద్యం చేయించాలనే ఉద్దేశంతో అమ్మమ్మగారి అమ్మ అయిన జానకమ్మగారి కోసం తెనాలి కబురుచేశారు. ఆమె వచ్చింది. అమ్మమ్మను బాపట్ల తీసుకు వెళ్లటానికి నిశ్చయమయింది.

మేనా వచ్చి వాకిలి ముందు ఆగింది.

అమ్మమ్మ యిల్లంతా సర్దింది. అన్నీ తాతగారికి అప్పజెప్పింది. అమ్మకు నగలు చేయించడానికి ఎంత బంగారం ఉన్నదీ, ఏ కంసాలికి ఎంత యిచ్చిందీ వివరాలు చెప్పింది. తాతగారికి నమస్కరించింది. గడప దాటుతూ ఉన్నది- ఎవరో తుమ్మారు. తాతగారు గతుక్కుమన్నారు.

'కాసేపుండి బయలుదేర వచ్చునులే...' అన్నారు తాతగారు. అమ్మమ్మ లోపలకు వెళ్లింది.

గ్రామ జనం అధిక భాగం అక్కడనే ఉన్నారు. అందరికి అమ్మమ్మ తిరిగి రాదనే భావం బలంగా ఏర్పడింది. అందరి మనసుల్లోనూ, కన్నుల్లోనూ, మాటల్లోనూ తాతగారి యందు సానుభూతీ, పిల్లల యందు కరుణభావమూ స్ఫురించాయి.

'ఇది కూడ నా మెడకు కట్టి పోతుందేమో, ప్రతి తరానికీ తప్పదు కాబోలు...'

...అని తాతమ్మ కూడా విచారగ్రస్త అయింది.

అమ్మ తాతగారి కలవరం గుర్తించింది. తాతమ్మ కలతను గమనించింది. గ్రామ జనుల మనోగత భావాన్నీ అర్థం చేసుకున్నది. కాని అమ్మ హృదయంలో భయ దుఃఖాలకు తావు లేకపోయింది. మనసు నిర్వికారంగానూ, నిశ్చలంగానూ ఉన్నది.

అమ్మమ్మ పాదప్రక్షాళనం చేసుకుని, కొన్ని క్షణాలు విశ్రమించి తిరిగి ప్రయాణ సన్నద్ధురాలయింది. చాకళ్ళు మేనా సిద్ధపరిచారు. అమ్మమ్మ తాతగారి వద్దకు వచ్చింది. శోకం లోలోపల పొంగుతున్నది. బలవంతాన అణుచుకోవడంలో వణికే పెదవుల బిగబడుతూ, శుభ్రకపోలాలను అశ్రుసిక్తం చేయటానికి కరుణతో సంకోచపడుతున్న కందోయితో ఒక క్షణం తాతగారి ఎదురుగా నిలబడ్డది. చంకలో అమ్మను తాతగారికి అందించింది. ఎందుకో క్షణక్షణానికీ వెల్లువవలె ఉద్ధృతమౌతూ దుఃఖం ఉబుకుతూంది. తన కంటినీరు తాతగారి కంటపడకూడదనే ఉద్దేశంతో - శోకంతో సంకుల సమరం చేసి విఫలయై- మొదలు నరికిన చెట్టువలె దెబ్బతిన్న పిట్టవలె--అమ్మమ్మ తాతగారి పాదాల మీద వాలి పోయింది. శోకం కట్టలు తెంచుకున్నది. తాతగారి కన్నులూ వినీలమై ఆషాఢపయోధరాలై అమ్మమ్మ తలను తడుపుతున్నాయి.

తాతగారి చంకలో ఉన్న అమ్మ తన చిన్నచేతితో తాతగారి కన్నీరు తుడుస్తూ - 'తప్పు నాన్నా... అమ్మను లేవమను' అన్నది.

కారే కన్నీరు తుడుచుకుని అమ్మను ప్రక్కనే ఉన్న చాపమీద కూర్చోబెట్టి- రెండు భుజాలూ పట్టుకుని అమ్మమ్మను లేవతీసి, ఆమె తలను తన గుండెలకు హత్తుకుని...

ఫర్వాలేదు..... నయమవుతుంది. అయినా నీదేమున్నది? 'నా కళత్ర యోగం మంచిదయితే నీకు తగ్గుతుంది...'

- అని ఓదారుస్తూ కన్నీరు తుడిచి...

"అమ్మాయి కోసమయినా ఊరుకో - లేకపోతే అది బెంబేలు పడుతుంది.'

- అని అమ్మ వంక చూచారు.

వటపత్రశాయిలా అమ్మ తలక్రింద చెయ్యిపెట్టుకొని పడుకుని ఆకాశం వంక చూస్తున్నది. ఆ వదనంలో ఏ విధమయిన మార్పూ లేదు. ఆ కన్నులతి ప్రశాంతంగా ఉన్నాయి.

అమ్మ కిదేమీ అర్థం గాలేదని తాతగారు సంతోషించి అమ్మను తీసుకుని ఎత్తుకుని అమ్మమ్మ చెయ్యి పట్టుకుని మేనా వద్దకు నడిపించుకు వెళ్ళారు.

దుఃఖోపహతురాలయిన అమ్మమ్మ భారంగా నడుస్తుంటే...అక్కడ చేరిన జనుల హృదయాలు ఆర్ద్రమైపోయాయి.

అమ్మమ్మ మేనాలోకి ఎక్కింది. ఒక క్షణం తాతగారి ముఖంలోకీ ఒక క్షణం అమ్మవంకా చూచి చేతులు చాపింది. తాతగారు అమ్మను అందించారు.

కొబ్బరికాయ కొట్టి మేనా ఎత్తుకున్నారు.

అమ్మను రొమ్ములకు అదుముకొని అమ్మమ్మ సర్వం మరిచిపోయింది.

దారి పొడుగునా అమ్మమ్మకు భర్తను గురించి కన్నా కుమారుని గురించి కన్నా అమ్మను గురించిన ఆలోచనే.

'అమ్మా, నేను పోతే నీవు ఎక్కడ ఉంటావమ్మా?'

'అంతటా...'

'అంటే?'

'ఎక్కడయినా నమ్మా...'

'అంటే?'

'మీరెక్కడ ఉంచితే అక్కడ.'

'అట్లా కాదమ్మా... ఎవరివద్ద ఉంటావో చెప్పు...'

'అందరివద్దనూ ఉంటానమ్మా.'

'సరిగా చెప్పమ్మా...'

'ఎవరివద్దనైనా సరే... మీ యిష్టం.'

'నా పిచ్చి తల్లీ...' అని అమ్మనుదుటి మీద అమ్మమ్మ ముద్దు పెట్టుకొని అన్నది...

'ఎవరైనా అంటే... వాళ్ళు నిన్ను సరిగా చూడవద్దూ?'

'నేను వారిని సరిగా చూడాలిగా...'

'కాదమ్మా. పెద్దవాళ్ళే సరిగా చూడాలి.'

'అది కాదమ్మా - సరిగా చూచిన వాళ్ళే పెద్దవాళ్ళు.'

ఆ మాట వినేటప్పటికీ అమ్మమ్మ మనసు చివాలున గతంలోకి దూసుకు వెళ్లింది. రెండేళ్ళ క్రితం ఒకసారి పొన్నూరులో 'నేనే అమ్మనై ఉంటాగా' - అన్న అమ్మ మాట స్ఫుటంగా వినిపించింది.

అమ్మమ్మ ఆలోచనా ప్రవాహంలో ప్రయాణం చేస్తూ ఉంటే - హఠాత్తుగా మేనా ఆగింది.

ప్రక్కనే ములుకుదురు గ్రామంలోని చెన్నకేశవస్వామి దేవాలయంలోని ధ్వజస్తంభపు చిరుగంటలు గాలికి కదిలి మ్రోగుతున్నాయి. చాకళ్ళు చెప్పులు విప్పి చేతులు జోడించి నమస్కరిస్తున్నారు. అమ్మమ్మ కూడా అంజలి ఘటించి అటు చూచింది.

దేవాలయ గోపురం మీద అమ్మ! తన వంకనే చూస్తూ నవ్వుతూ చేతులు చాపింది. ఆ చేతులు చాపడం తల్లి పిల్లకోసం చాపినట్లుగా ఉన్నది. ఒక క్షణం పాటు అమ్మమ్మ నిశ్చేష్ట అయింది. తెప్పరిల్లి ఒడిలోకి చూచుకున్నది. అమ్మ మామూలుగానే ఒడిలో పడుకుని ఉన్నది.

మేనా సాగింది.

అమ్మను చూచుకుంటూ... ఏవేవో జ్ఞాపకాలు తనను ముంచెత్తుతుంటే.

'లేక లేక యీ నలుసు బ్రతికితే, చూచుకోవడానికి లేకుండా యీ చావు యిప్పుడే వస్తుందా?'

...అని విచారిస్తూ ఉండగా మేనా బాపట్లలో చిదంబరరావుగారి యింటి ముందు ఆగింది.

చిదంబరరావుగారు ఎదురు వచ్చి అమ్మ నెత్తుకుని లోపలకు తీసుకు వెళ్ళారు.

మరునాటి నుండి డాక్టర్ దేశిరాజు అప్పారావుగారి వద్ద చికిత్స ప్రారంభమయింది.

క్రమంగా రెండు నెలల్లో అమ్మమ్మ ఆరోగ్యంలో మంచి మార్పు కలిగింది. అందరికీ ధైర్యం వచ్చింది?

అమ్మ విషయంలో మాత్రం ఎవరికీ శ్రద్ధ కనుపించలేదు. అమ్మ అన్నం తిన్నదీ లేనిదీ కూడ ఎవరూ గమనించలేదు. శ్రద్ధ కలిగిన తాతమ్మ నిజామాబాదు వెళ్ళింది. తాతగారికి అమ్మమ్మను గురించిన దిగులు తప్ప మరో ధ్యాస లేదు.

అయినా కాలగమనానికి ఏమీ నిరోధం లేదు.

అమ్మకు నాలుగవ సంవత్సరం వెళ్ళిన రెండు మాసాలకు ఒక రోజున...

చిదంబరరావుగారికి వాడుకగా ముత్తాయిపాలెం నుండి కట్టెలు తెచ్చివేసే మంగతాయారు అన్నపూర్ణమ్మ గారిని డబ్బులు అవసరమని అడిగింది. ఆమె లేవన్నది. తాయారు వెళ్ళిపోయింది.

'చిల్లర డబ్బులే గదా అత్తయ్యా, ఏ గూట్లోనయినా చూడకపోయావా, దొరికేవేమో - పాపం, ఎంతో అవసరం అయితే కానీ తాయారు అడగదత్తయ్యా...'

అమ్మ సలహా చెప్పింది, అడగకుండానే.

'చిన్న పిల్లకు నీ కెందుకు?' అని విసుక్కుంటూనే అన్నపూర్ణమ్మగారు వెళ్ళి వెతికింది. ఒక గూట్లో మూల దొరికాయి.

'నీవే యిచ్చిరా! వెళ్ళు- అంత జాలిగలదానవు...' అని డబ్బులు అమ్మకు యిచ్చింది.

తాయారును వెతుక్కుంటూ అమ్మ బయలు దేరింది. ఒక చిల్లరకొట్లో తాయారు అప్పుకోసం వర్తకుని ప్రాధేయపడుతున్నది. వర్తకుడు కసురు కుంటున్నాడు. తాయారు కన్నీళ్ళ పర్యంతమయింది.

'మీరే యివ్వకపోతే యింకా ఎవరిస్తారు?' అన్న తాయారుతో-

'అందరికీ ఎవరిస్తారు?- ఆ దేవుడే..'

...అని హేళనగా సమాధానం చెబుతూ ఉండగా అమ్మ పరుగెత్తుకు వెళ్ళి తాయారు దోసిట్లో డబ్బులు పోసింది.

వర్తకుడు ఆశ్చర్యంతో కొయ్యబారి పొయ్యాడు.

తాయారు ఆనందంతో నిశ్చేష్ట అయింది. అప్పటి దాకా కనుగొలుకుల్లో నిలిచిన నీరు జలజలా రాలింది. అమ్మను అమాంతంగా ఎత్తుకుని - కావలసిన వెచ్చాలు కొనుక్కున్నది.

' మా యింటికి వస్తావా? - వెళ్దాం..' అని అమ్మను అడిగింది. ఎప్పటి నుండో తాయారుకు అది తీరని కోరిక.

అమ్మ ఆ నాడు సరే నన్నది.

పట్టలేని సంతోషంతో అమ్మను యింటికి తీసుకువెళ్ళి... తాయారు గబగబా వేరుసెనగకాయలు ఒలిచి అమ్మ ఒడిలో పోసి, బెల్లంగడ్డ చేతికిచ్చి వాకిట్లో ఆడుకొనమని చెప్పి తాను యింట్లోకి వెళ్ళి వంటపనిలో నిమగ్న మయింది.

తాయారుకు చెప్పకుండా అమ్మ మెల్లమెల్లగా నడిచి సముద్రపు ఒడ్డుకు వెళ్ళింది. గ్రుడ్డివెన్నెల సముద్రం మీద పరుచుకున్నది. చిన్న చిన్న అలలు ఒడ్డున తిరిగే అమ్మ మృదు పాదాలు స్పృశించాలనే తవనతో ఎంత ముందుకు వద్దామనుకున్నా మధ్యలోనే కరిగిపోతున్నాయి. చేరలేని వేదనతో అవి చేసే ఘోషకు సానుభూతిగా వాయువు శ్రుతికలుపుతున్నది.

అంతలో ఒక జాలరి అమ్మవద్దకు వచ్చాడు.

చిన్న పిల్ల... ఒంటరితనం... ఒంటి నిండా సొమ్ములు... చూచిన జాలరి మనసులో దౌష్ట్యం తలయెత్తింది.

లాలనగా అమ్మను ఎత్తుకున్నాడు. మాటలతో బుజ్జగిస్తూ బొడ్డులో దాచుకున్న జామపండును తీసి తినిపిస్తూ సొమ్ములు ఒలుచుకున్నాడు. అన్నీ

కలిసి బాగా బరువుగా ఉన్నాయి. 'ఎంతో డబ్బు వస్తుంది. తన దారిద్ర్యం తీరుతుంది'- అని సంతోషించాడు.

కాని- 'యీ పిల్ల ఎవరితోనయినా చెబితే... తాను దొరికితే... యీ సొమ్ముతో బాటు తన ప్రాణం కూడా దక్కదు'- అని భయపడ్డాడు.

కనుక 'యీ పిల్లను నామరూపాలు లేకుండా చేయాలి' అన్న క్రూరమయిన ఆలోచన మొలకెత్తటమూ, వేళ్ళు తన్నుకొని మహావృక్షమై, తన హృదయమంతా పరుచుకోవటమూ ఒకే లిప్తకాలంలో జరిగాయి.

అమ్మ మౌనంగా చూస్తూ ఉన్నది. భయంతో కేకలు వేయలేదు. దుఃఖంతో శోకాలు పెట్టలేదు. ద్వేషంతో తిరగబడలేదు. జామపండు తిని పిస్తున్నప్పుడు ఎట్లా వున్నదో-సొమ్ములు ఒలుచుకుండేటప్పుడూ అంత స్థిమితం గానూ వున్నది.

అయినా ఆ దుర్మార్గుని ఆలోచనలో మార్పు లేదు. ఆ హృదయంలో క్రౌర్యానికి తప్ప కరుణకు స్థానం లేదు. స్వార్థం దయాధర్మాలను నొక్కివేసింది.

రెండు చేతులా అమ్మను ఎత్తి సముద్రంలోకి బలంగా విసరివేశాడు.

ఒక మెరుపు మెరిసింది. ఆ మెరుపు కాంతిలో సముద్రమే కాదు... జగత్తంతా ఒక్కసారి తళుక్కుమన్నది. కత్తిఝుళిపింపు లాంటి ఆ కాంతికి కరుడు కట్టిన జాలరి గుండెలోని చీకటిరాశి ఛిన్నమైపోయింది.

'అమ్మా--' అని ఒక్కసారి కెవ్వున కేకవేసి... ఏమీ అర్థంకాక ముందుకు పరుగెత్తాడు. ఏమీ కనిపించక ఆవేశంతో సముద్రపు లోతుల్లోకి వెళ్ళాడు. కెరటాలు కసిగా నిర్దయగా అతడిని పడవేశాయి. అతడు ఊపిరాడక ఉక్కిరిబిక్కి రయ్యాడు. అప్పుడు 'రెండు చేతులు' నీటి నుండి లేవతీసి పైకెత్తి విసరి వేశాయి. అతడు ఒడ్డున పడ్డాడు.

కళ్ళు తెరిచేటప్పటికి అమ్మ మామూలుగానే కూర్చున్నది. కాని ఆ ముఖంలో, కన్నుల్లో వెలిగే జ్వాలను అతడు చూడలేకపోయాడు.

అమాంతం వెళ్లి అమ్మ పాదాలమీద పడి వెక్కివెక్కి ఏడిచాడు.

అమ్మ అతడి వీపు రాస్తూ...

'లే నాన్నా - ఎందుకు?' అన్నది ఏమి తెలియనట్లు.

'తప్పుచేశానమ్మా... నా తప్పు కాయమ్మా...' అంటూ లేచి కూర్చుని చెంపలు వాయించుకుని అక్కడనే రాసిపోసి వున్న సొమ్ములు తీసి అమ్మకు ఒక్కొక్కటే అలంకరిస్తుంటే.. అమ్మ అన్నది...

' నీవు ఒలిచింది నీ సొమ్మే నాయనా. నీవు బ్రతికి వచ్చావు. 'అంతే చాలు. నా కదే సొమ్ము. నీకిదే సొమ్ము. తల్లికి బిడ్డ సొమ్ము. బిడ్డకు డబ్బు సొమ్ము.'

జాలరి ఆ మాటలు వినక నగలన్నింటినీ పూర్తిగా అమ్మకు అలంకరించాడు. బ్రతిమాలి అమ్మను యింటికి తీసుకువెళ్ళి తొడమీద కూర్చోబెట్టుకుని గోరుముద్దలు తినిపించి ఆ రాత్రి తన ఇంట్లోనే పడుకోబెట్టుకున్నాడు.

తెల్లవారిన తర్వాత అమ్మ ప్రయాణమయింది. జాలరి తాను తోడు వచ్చి యింటివద్ద దించుతానన్నాడు.

'నేను వచ్చేటప్పుడు నీవు వచ్చావా? వచ్చిన తర్వాతనయినా నీవు ఏం చేశావు? ఎప్పుడూ రక్షణ, శిక్షణలు ఒకరివే. నాకు మాత్రం నీ యింటిలో భక్షణ జరిగింది.'

-అని చెప్పి బయలుదేరి అమ్మ తాయారు యింటికి వెళ్ళింది.

తాయారు రాత్రంతా అమ్మకోసం వెతికి వెతికి ఒక్కతే యింటికి వెళ్ళి ఉంటుందని సమాధానపడ్డది. కాని మళ్ళీ అమ్మను చూచి ఆశ్చర్యపోయింది.

'రాత్రి ఎక్కడ ఉన్నావమ్మా.'

జరిగినదంతా దాచి-రాత్రి జాలరి యింటిలో పడుకున్నానని చెప్పి బయలుదేరింది. తాయారు ఆ పూటకు అమ్మను తన యింటిలో ఉంచుకుని మధ్యాహ్నం నుండి తీసుకువెళ్ళి చిదంబరరావుగారి యింటివద్ద దించుతానన్నది.

కాని అమ్మ ఆగక తాతగారింటికి వచ్చింది. వచ్చేటప్పటికి పదిన్నర అయింది. సరాసరి లోపలకు వెళ్ళి మంచంమీద నిద్రపోతున్న అమ్మమ్మను చూచి మేడమీదకు వెళ్ళింది.

చిదంబరరావుగారు ఆ పూటనే మద్రాసు నుండి వచ్చి భోజనంచేసి కోర్టుకు వెళ్ళారు.

అమ్మ ఆ రాత్రి యింట్లో లేదనిగానీ, ఎక్కడికో వెళ్ళిందనిగానీ ఎవరూ గమనించలేదు; ఏమీ అడగలేదు.

అమ్మమ్మకు ఏడవ నెల వచ్చింది. డాక్టరుగారి శ్రద్ధ వల్లగానీ, మందుల శక్తివల్లగానీ అమ్మమ్మ ఆరోగ్యం పుంజుకున్నది.

ఆ నాడు శ్రావణ అమావాస్య, ఉదయం ఏడు గంటల సమయం. అమ్మమ్మ తాతగారిని అడిగింది.

'నాకు కొంచెం తగ్గింది కదా, యింటికి వెళదామా?'

అంతలో అమ్మమ్మగారి తండ్రి వెంకట సుబ్బారావుగారు తెనాలి నుండి ఫోను చేశారు. అమ్మమ్మకు ఎట్లా ఉన్నదని.

కులాసాగా ఉన్నట్లు సమాధానం చెప్పారు.

అలవాటు ప్రకారం డాక్టరుగారు వచ్చి చూచి వెళ్ళారు. మామూలుగానే మందు పంపారు. అమ్మమ్మ ఆ మందు తీసుకున్నది. మరుక్షణం నుండి కడుపులో బాధ మొదలయింది.

మధ్యాహ్నం ఒకటిన్నర అయింది. బాధ ఎక్కువయింది. అమ్మమ్మ మెలికలు తిరుగుతున్నది. అందరూ చుట్టూ చేరారు. ఎవరేమి చేస్తారు?

డాక్టరుగారు వచ్చారు. నొప్పికి మూలం ఆయనకు తెలియలేదు. ఏదేదో ఆలోచించారు. ఏవేవో మందులు యిచ్చారు. ఫలితంలో మార్పు లేదు.

సాయంకాలం నాలుగయింది. అమ్మమ్మ తానిక బ్రతకనని స్పష్టంగా చెప్పింది.

కోర్టు నుండి చిదంబరరావుగారు వచ్చారు. తెనాలి మళ్ళీ ఫోను చేశారు. అమ్మమ్మకు ప్రమాదంగా ఉన్నదని.

చిదంబరరావుగారు అమ్మమ్మ పక్కలో కూర్చుని గద్గద కంఠంతో అడిగారు. 'ఏమమ్మా! ఏం చేస్తావు?'

'నేను చేసేదేమున్నది? మీరు మాత్రం చేయగలిగిన దేమున్నది? బ్రతికిద్దామనే యిక్కడకు తీసుకువచ్చారు. డాక్టరుగారూ, మీరూ శాయశక్తులా కృషిచేశారు. నాతే రోజులు లేవు. కానీ...'

అంతలో నొప్పి పొర్లు ఎక్కువయిందేమో... అమ్మమ్మ ఒక్క కేక పెట్టి చుట్టలు చుట్టుకుపోయింది. చిదంబరరావుగారు అమ్మమ్మను ఒళ్ళోకి తీసుకున్నారు. బాధతో నల్లపడిపోయిన అమ్మమ్మ ముఖం చూస్తుంటే -- వారి కన్నులు నీటికుండలయినాయి.

'ఆయన అమాయకుడు. ధర్మరాజులాంటివాడు. పిల్లవాడు అల్లరివాడు. పిల్లకేమో నోట్లో నాలుక లేదు. ఎవరు ఎట్లా బ్రతుకుతారో...'

ఆయాసంతో చెప్పలేక చెప్పలేక అమ్మమ్మ ఒక్కొక్క మాటే చెబుతున్నది.

'నీ కెందుకమ్మా - యిప్పుడిదంతా...'

'ఈ నా చిట్టితల్లి బ్రతికితే...' అంటూ దగ్గరనే వున్న అమ్మను అమాంతం దగ్గరకు లాక్కుని... గుండెలకు హత్తుకుని బావురుమన్నది.

చిదంబరరావుగారు అమ్మను అమ్మమ్మ దగ్గర నుండి తన వద్దకు లాక్కుని...

'ఏమీ మాట్లాడక పడుకో...' అని బ్రతిమాలారు.

'బ్రతికితే కూడూ గుడ్డా ఉన్నచోట యివ్వండి. మొత్తం నా బంగారం దానికే యివ్వండి...'

అంతలో బాపట్ల వెంకట్రావుగారు లోకల్‌ఫండు డాక్టరుగారిని తీసుకు వచ్చారు. డాక్టరుగారు పరీక్షించారు. వైద్యంలో పొరబాటు జరిగింది... అని తేల్చి అప్పటికే పరిస్థితి చెయ్యి జారిపోయిందని నిర్ణయించి డాక్టర్ అప్పారావు గారి మీద న్యాయశాస్త్రరీత్యా చర్య తీసుకోవచ్చునన్నారు.

అంత దుఃఖంలో ఉన్నప్పటికీ తాతగారు కలుగజేసుకొని...

'ఎవరిమీదనూ ఏ చర్యలూ అవసరం లేదు. ఇదంతా నా విధి. పిల్ల పుట్టినప్పుడే అనుకున్నాను...' అని సర్దివేశారు.

జానకమ్మగారు తెనాలి నుండి డాక్టర్ తుమ్మలపల్లి హరినారాయణ గారిని పిలిపిస్తే బాగుంటుందన్నది. సీతాపతి తాతగారు తెనాలి వెళ్ళటానికి స్టేషన్‌కు వెళ్ళారు.

అమ్మమ్మ మామయ్యనూ, అమ్మనూ దగ్గరకు పిలిచి - వారి రెండు చేతులూ దగ్గరకు తీసుకుని ముద్దు పెట్టుకుని ఆ రెండు చేతులూ కలిపి చిదంబరరావుగారి చేతుల్లో పెట్టి...

'ఆయనగారు ఉన్నారా?' అని అడిగింది.

'లేరమ్మా - ఆ చెప్పేది ఏమిటో మాకు చెప్పమ్మా...'

'వారికి చెప్పేమాట మీకెట్లా చెప్పేది?'

అమ్మమ్మ స్వరంకూడ హీనదశకు వచ్చింది. కన్నుల్లో కాంతి పలుచ బడింది. అమ్మనూ, మామయ్యనూ లోపలకు తీసుకువెళ్ళి అన్నం పెట్టారు.

'ఆయన్ను పిలవండి...'

అమ్మమ్మ అవసానదశను గుర్తించి స్టేషనుకు మనిషిని వరు గెత్తించారు.

మనిషి చేరేలోపలనే బండి కూతవేసి సాగింది.

రాత్రి ఎనిమిదన్నర గంటలకు 'లేరా, లేరా, రాలేదా...' అంటూ అమ్మమ్మ కన్ను మూసింది-- శాశ్వతంగా.

చుట్టూ ఉన్న జనం గొల్లుమన్నారు.

7. ఎప్పటిదీ సాధన?

డాక్టరుగారి కోసం బయలుదేరిన సీతాపతితాతగారు తెనాలి చేరక ముందే అమ్మమ్మ చనిపోయిందన్న పిడుగుపాటులాంటి కబురు తెలిసి కుప్పలా కూలిపోయారు.

మరునాటి ఉదయం రైలుకు తాతగారు వారి మామగారైన వెంకట సుబ్బారావుగారితో కలిసి తెనాలి నుండి బాపట్ల వచ్చారు. వాకిట్లోకి రాగానే లోపల నుండి ఒక్కసారి కెవ్వున శోకం వినిపించి తాతగారు స్మృతి తప్పి చిటికేశ్వరపు చెట్టుక్రింద పడిపోయారు. వారూ వీరూ చేరి చన్నీళ్ళు ముఖాన చల్లి లేవతీసి కొంచెం మజ్జిగ పట్టి దుఃఖోపశమనార్థం వ్యర్థ ప్రయత్నం చేస్తూ ఏవో మాటలు చెప్పి లోపలకు వెళ్ళారు.

అంతకుముందు నుండి ఎంతగా ఊహిస్తున్నప్పటికీ ఆ దుఃఖపు వెల్లువ ధాటికి తాతగారు తట్టుకొన లేకపోయారు. కంటివెంట ఒకే ధార కారుతూ ఉన్నది. అమాయకుడయిన తాతగారినీ, ఆ అశ్రుధారనూ చూచిన బంధువులు మరింతగా బాధపడ్డారు.

అమ్మమ్మ కళేబరం పూర్తిగా ఆచ్ఛాదితమై నేలమీద పడుకోబెట్టబడి ఉన్నది. తాతగారు వచ్చి ప్రక్కన నిలుచున్నారు. అమ్మమ్మ ముఖంమీద వస్త్రం తొలగించబడింది.

ఆ ముఖం నిర్మలమై దరహాస విలసితమై ఉన్నది. ఆ పెదవులు తనను చూచే నవ్వుతూ ఉన్నట్లు ఉన్నాయి. ఔను! ఆమె ఎంత అదృష్టవంతురాలు! హాయిగా వెళ్ళిపోయింది. తాను నిర్భాగ్యుడు. ఈ పిల్లలూ సంసారం ఎట్లా? తాను ఒంటరిగా ఎట్లా బ్రతకగలడు?

ఆలోచనా భారంతో తాతగారు నిశ్చేష్టులయినారు. వెంకట సుబ్బారావు గారు తాతగారి ప్రక్కకు వచ్చి భుజాలు పట్టుకుని నిలుచున్నారు. తన చేతులు ఎవరో నరికివేసినట్లు, తన కాళ్ళు ఎవరో విరగగొట్టినట్లు, తన హృదయాన్ని ఎవరో కొల్లగొట్టినట్లు, తన మనసును ఎవరో చితక పొడిచినట్లు, తనను

ఎవరో మహాసముద్రంలోకి విసలినట్లు తాతగారు దుర్భర శోకాకులమయినారు.

అంతలో చిదంబరరావుగారు అమ్మను ఎత్తుకుని అక్కడకు వచ్చారు. అమ్మను చూచి తాతగారు మరీ విచలితులయినారు. అమాంతం అమ్మను ఎత్తుకుని తన గుండెలకు హత్తుకొని.

'మీ అమ్మ చచ్చిపోయిందమ్మా...'

అని వెఱ్ఱికేక వేశారు.

అమ్మ నిశ్చలంగా తాతగారి కన్నుల్లోకి చూస్తూ ఉన్నది.

'ఇక మీకు అమ్మ లేదమ్మా...'

తాతగారి కన్నులు కురిసే నీటిధారలను అమ్మ తుడుస్తూ ఉన్నది.

'మనను అన్యాయం చేసి పోయిందమ్మా..'

అమ్మ నిర్లిప్తంగా తాతగారి చెక్కిళ్ళూ గడ్డమూ నిమురుతూ ఉన్నది. అమ్మకు అసలు విషయం అర్థం కాలేదనుకొని తాతగారు--

'మీ అమ్మ పోయిందమ్మా.'

అని పెద్దగా అక్షరమక్షరం ఒత్తి పలికారు. అమ్మ చిన్నగా అడిగింది...

'ఎక్కడికి నాన్నా...?'

'ఔను; ఎక్కడికి...?' తాతగారు గొణుక్కున్నారు.

'అసలు ఎక్కడ నుంచి వచ్చింది నాన్నా... అమ్మ...?'

'చచ్చిపోయిందమ్మా... మీ అమ్మ చచ్చిపోయింది.'

అమ్మకు అర్థం కాలేదనుకుని తాతగారు వివరంగా చెప్పటానికి ప్రయత్నించారు.

'చచ్చిపోవడమంటే...?'

తాతగారి గడ్డం పట్టుకుని తన ప్రక్కకు తిప్పుకుని తాతగారి కళ్ళల్లోకి నిశితంగా చూస్తూ అమ్మ అడిగింది.

'మీ అమ్మ పోయిందమ్మా...'

'ఇదిగో మా అమ్మ పోలేదు. మా అమ్మ యిక్కడనే ఉన్నదిగా--'

అమ్మ అమ్మమ్మ మృతదేహాన్ని చూపించింది. అమ్మ కంటి వెంట ఒక చుక్క నీరయినా రాలేదు. ముఖంలో మార్పూ లేదు. అందరూ అమ్మ అమాయకత్వానికి ఆశ్చర్య పోయారు. నిజం తెలిస్తే అమ్మ భయపడుతుందని ఊహించి వెంకట సుబ్బారావుగారు తాతగారి నోరు మూసి--

' మీ అమ్మ నిద్రపోతున్నదమ్మా...' అన్నారు.

'నిద్రపోతుంటే వీళ్ళందరూ ఎందుకు ఏడుస్తున్నారు? అమ్మ రోజూ నిద్రపోతూనే ఉన్నదిగా.. మరి, రోజూ ఏడవటంలేదేం?'

వెంకట సుబ్బారావుగారింకేం సమాధానం చెప్తారు?

చిదంబరరావుగారే మళ్ళీ అమ్మను తాతగారి చంకలో నుండి తీసుకుని తాతగారిని కూడా పిలుచుకుని మేడపైకి వెళ్ళారు.

'అసలు చచ్చిపోవడమంటే ఏమిటి తాతయ్యా?' అమ్మ చిదంబరరావు గారిని అడిగింది. వారు ఏమని చెప్పాలా అని ఆలోచిస్తున్నారు.

అంతలో మళ్ళీ అమ్మే అడిగింది--

'అసలు వీళ్ళు ఎక్కడ నుంచి వస్తారు తాతయ్యా?'

'తల్లి గర్భం నుంచమ్మా...'

'అయితే తల్లులందరి గర్భాల్లోనూ ఎప్పుడూ పిల్లలుంటారా?'

'ఉండరు.'

'మరి. తల్లి గర్భంలోకి ఎట్లా వస్తారు?'

'దేవుడు పంపిస్తాడు.'

'పోవడమంటే ఎక్కడకు పోతారు?'

'శ్మశానంలోకి.'

'మరి శ్మశానంలోకి తీసుకువెళ్ళకపోతే ఉన్నట్లేనా? అయితే అమ్మను

యిక్కడనే ఉంచేద్దాం.'

'ఏం ప్రశ్నలమ్మా యివి?'

'చెప్పు తాతయ్యా - ఎక్కడకు పోతారు?'

'దైవంలోకి..'

'ఎందుకు?'

'వాడి యిష్టం.'

'దైవం పంపిన మనిషి దైవం యిష్టం ప్రకారం దైవంలోకి పోతే మధ్యలో మనకు ఏడుపెందుకు తాతయ్యా?'

అంత దుఃఖ సమయంలోనూ చిదంబరరావుగారు పకపకా నవ్వి అమ్మను ఎత్తుకుని బుగ్గలపై ముద్దుపెట్టుకుని..

'ఎవరు చెప్పారు నీకీ వేదాంతం?' అన్నారు.

తాతగారు తన దుఃఖంమాట మరచిపోయి అమ్మవంక ఆశ్చర్యంగా చూచారు.

'నీవు చెప్పు నాన్నా - మనకెందుకు ఏడుపు?'

'మరి మీ అమ్మ పోయిందిగా...'

'అసలు.. నాన్నా-- ఎవరూ మా అమ్మ? పోయింది మా అమ్మా? ఈ శరీరం మా అమ్మా..? ఈ శరీరమే అయితే పోలేదు. పోయిందే మా అమ్మ అయితే-దానిని యిదివరకూ చూడలేదు. మరెందుకూ ఇక బాధ?'

అంతలో తాతగార్లిద్దరికీ క్రింది నుండి పిలుపు వచ్చింది. వారు వెళ్లారు. అమ్మ అక్కడనే ఉంటానన్నది.

మధ్యాహ్నం అయింది. అమ్మమ్మ మృతదేహాన్ని స్నానం చేయిస్తున్నారు. బాపట్ల వెంకట్రావుగారు పైకి వచ్చి..

'రా అమ్మా.. అమ్మను తీసుకువెళుతున్నారు. ఇక కనబడదుగా. చూద్దువుగాని, రా..' అని క్రిందకు తీసుకువచ్చారు. ఇద్దరూ తాటిచెట్టు క్రింద నిలబడ్డారు.

అమ్మమ్మను మంత్రోక్తంగా స్నానం చేయించారు. ఆ కళేబరానికి ఏవేవో అలంకారాలు చేస్తూ ఉంటే అమ్మ సన్నగా నవ్వుకున్నది.

చరమయాత్రకు సర్వసన్నద్ధమై సమలంకృతమై ఉన్న ఆ శరీరానికి అందరూ నమస్కారాలు చేసి సజలనేత్రాలతో, బరువు గుండెలతో వీడ్కోలు చెప్పారు. అమ్మను నమస్కరించమన్నారు. అమ్మ కదలబోతుండగా ఒక తాటి మట్ట రాలి అమ్మ నెత్తిపై పడ్డది.

వెంకట్రావుగారు తల పైకెత్తి చూచారు. పైన ఎవరూ లేరు; ఎవరూ మట్టను కొట్టలేదు. మట్ట ఎండనూ లేదు; పండనూ లేదు. కాని మట్ట రాలింది.

'కారణ మేమిటి?' అని వెంకట్రావుగారు అనుకుంటుంటే....

'అకారణమే కారణం' అని అమ్మ చిన్నగా అంటూ చిట్టి చిట్టి అడుగులు వేసుకుంటూ వెళ్లి మోకాళ్ళు నేలకు ఆనించి అమ్మమ్మ రెండు పాదాలకు నమస్కరించింది.

ఆ దృశ్యాన్ని చూచిన అసంఖ్యాక నేత్రాలు జలజలా స్రవించాయి.

అమ్మమ్మకు ఫోటో తీస్తేకాని-శవాన్ని కదిలించడానికి వీలులేదని రాఘవరావు మామయ్య నేలమీద బోర్లపడుకుని ఏడిచి పట్టుపట్టాడు.

ఫోటోగ్రాఫర్‌ను పిలిపించారు. ఫోటోకోసం అమ్మమ్మను కుర్చీలో కూర్చోబెట్టారు. తల ప్రక్కకు వాలిపోతుంటే - తాతగారు కుర్చీ వెనుక నిలుచుని తల పట్టుకున్నారు.

ఫోటో తీయగానే అమ్మమ్మను కుర్చీ నుండి లేవతీసి వాహనం అధిరోహింప చేస్తుండగా - వెంకట్రావుగారు అమ్మను మేడపైకి తీసుకువెళ్ళారు. అమ్మ మామూలుగా కిటికీలో కూర్చుని అంతా చూస్తూ ఉన్నది.

'నారాయణ.. నారాయణ...' అంటూ కళేబరాన్ని ఎత్తుకున్నారు.

మమకారాలలో, అనురాగాలతో, అనేక లౌకిక అనుబంధాలతో అప్పటిదాకా అనేకులకు అత్యంతమూ ప్రీతిపాత్రమయిన ఒక వ్యక్తి కొద్దిక్షణాల్లో అగ్నిజ్వాలల్లో దగ్ధమై భస్మమై శాశ్వతంగా రూపరహితమై పోబోతున్నది. ఒక్కసారి

గొల్లున వెల్లువవలె శోకనాదం పెల్లుబికి ఆ పరిసరాలను కలచివేసింది.

కళేబరంపైన పసుపూ, కుంకుమా, పూవులూ చల్లుకుంటూ అందరూ బయలు దేరారు. తాతగారు మూర్తీభవించిన శోకంలా యాంత్రికంగా నడిచారు.

గగనమండలంలోకి నిర్లిప్తంగా దృష్టులను సారిస్తున్న అమ్మను పిలిచి వెంకట్రావుగారు అన్నారు...

'ఇదిగో... అమ్మ పోతున్నదమ్మా...'

ఆకాశంలోని దృష్టిని అవనిమీదకు దించి అమ్మ అన్నది.

'అమ్మే కాదు; అందరూపోతున్నారుగా...'

'అంతా సమానమే?!'

'అయితే - ఆమె పడుకునీ, వాళ్ళు నడిచీ - అంతేగా భేదం...?'

' అంతే కాదు - వాళ్ళు నడుస్తున్నారు; ఆమెను మోస్తున్నారు.'

'అయితే మేము మన్నవ నుంచి వచ్చేటప్పుడూ మోశారుగా...'

'అది కాదమ్మా పిచ్చి తల్లీ - మనందరిలో ఉన్న శక్తి - ఇప్పుడు ఆమెలో లేదు. అందుకని ఆమె పోయిందంటున్నా...'

'కాసేపు ఆమె పోయిందంటారు. కాసేపు ఆమె పోతున్నదంటారు. ఇంతకూ ఆమె అంటే శక్తియా? శరీరమా?'

'ఏమోనమ్మా - నీ ప్రశ్నలకు నేను సమాధానం చెప్పలేను. మీ తాతయ్య చెప్పవలసిందే..'

ఏవో కబుర్లు చెబుతూ వెంకట్రావుగారే సాయంకాలం దాకా అమ్మ వెంట ఉన్నారు. చీకటి పడగానే అమ్మను యింట్లోకి తీసుకురాగానే...

దీపపువత్తి ఒక మూరపొడవుపైగా వెలుగుతున్నట్లు అనిపించింది. అందులో అమ్మమ్మ కనిపించింది. వెంటనే చిదంబరరావుగారిని పిలిచి.

'అమ్మ కాలిపోతున్నది తాతయ్యా...' అన్నది.

' ఎక్కడమ్మా... ఏదీ...'

ఆ దీపపు వత్తిలోకి నిశ్చలంగా చూస్తూ ఆ సాయంకాలం శ్మశానంలో జరిగిన సంఘటన యావత్తునూ వివరంగా అమ్మ వర్ణించింది. ఎప్పుడూ ఆ శ్మశానం చూడని, ఆనాడు ఆ వైపుకు అసలే వెళ్ళని అమ్మ ఆ దృశ్యం వర్ణిస్తుంటే చిదంబరరావుగారు అమితాశ్చర్యంతో అమ్మవంక చూస్తూ ఉండిపోయారు.

అమ్మమ్మ చనిపోయిన నాలుగవ రోజున చిదంబరరావుగారు పెంచిన పిల్లి కూడ చరమాంకంలోకి చేరింది. దొడ్లో బాదంచెట్టు క్రింద మృత్యువును ఆహ్వానిస్తూ ఉన్నది. దానిని అమ్మ చూచింది. చిదంబరరావు గారిని పిలిచింది.

'తాతయ్యా - పిల్లి ఎందుకిట్లా పడుకున్నది?' అమ్మ అడిగింది.

'చావుకు సిద్ధమయిందమ్మా...'

మరణయాతనతో పిల్లి శరీరం మొత్తం కదులుతున్నది. పొట్ట ఎగురుతున్నది. ముక్కులు అదురుతున్నాయి.

'ముక్కులు ఎందుకిట్లా వున్నాయి తాతయ్యా?' అంటూ పిల్లి ముక్కు దగ్గర వేలు పెట్టి అమ్మ తలవంచింది. అమ్మ ప్రతిబింబం పిల్లి కన్నుల్లో కనుపించింది.

'ఇదేమిటి తాతయ్యా-నేను పిల్లి కండ్లలో కనబడుతున్నాను. పిల్లి నా కండ్లలో కూడా కనబడుతుందా? పిల్లి కండ్లలో నన్ను నేను చూచుకుంటున్నాను కాని నా కంటిలో నన్ను నేను చూచుకోలేనా?'

'లేకేమమ్మా! నీ కండ్లేగా పిల్లి కళ్ళల్లోకి చూస్తున్నది...'

ఔను తాతయ్యా... చూచేది కన్నులయినా గుర్తించేది గుర్తుగా. ఆ గుర్తు 'నేను' అన్నమాట. కాని నా బొమ్మ సరాసరి నా కండ్లలో ఎందుకు కనపడకూడదు?'

అని అమ్మ అడుగుతూ ఉండగా పిల్లి శ్వాస ఆగిపోయినట్లు అమ్మ గుర్తించింది. ఆ క్షణంలోనే పిల్లి కన్నుల్లో అమ్మ మసకేసింది.

'ఏమయింది తాతయ్యా?'

'పిల్లి చచ్చిపోయిందమ్మా...'

'ఇదా చచ్చిపోవటమంటే.. శ్వాస ఆగిపోవడమా?'

'శ్వాస ఆగితే ప్రాణం పోతుందమ్మా...'

'అందరికీనా?'

అని అమ్మ అడుగుతూ తన ముక్కు దగ్గర వేలు పెట్టుకుని చూచు కుంటూ శ్వాసను బంధించింది. చిదంబరరావుగారు చూస్తూ ఉండగానే అమ్మకూ లోకానికి సంబంధం విచ్ఛిన్నమై అమ్మ నిర్వ్యాపార అయింది.

'ఏమిటీ?' - అని చిదంబరరావుగారు ఆలోచిస్తుండగానే అమ్మ జాగ్రత్తలోకి వచ్చింది. రాగానే మళ్ళీ వేలు నాసికవద్ద పెట్టుకున్నది. తత్క్షణమే శ్వాస నిలిచిపోయింది.

చిదంబరరావుగారు మొదట గాభరాపడినా అనుక్షణమూ అమ్మనూ, అమ్మ మాటనూ, అలౌకికతనూ, అమ్మలోని సముజ్జ్వల ధీశక్తినీ, అద్భుత చైతన్యాన్నీ అవలోకిస్తున్నందున... అతి సులభంగా అమ్మ పొందిన సమాధి స్థితినీ, శరీరంపై అమ్మకు గల అధికారాన్నీ అర్థంచేసుకుని ఆశ్చర్యమూ ఆనందమూ పొందారు.

'ఎక్కడిదీ జ్ఞానం? ఎప్పటిదీ సాధనా?!' - అనుకుంటూ.

జ్ఞానస్వరూపిణి అయిన అమ్మకు జ్ఞాన సముపార్జన ఏమిటి?

సాధ్యమే తానయిన అమ్మకు సాధన ఎందుకు?

8. అవనియే ఆరాధ్య దైవం

అమ్మమ్మ అంత్యక్రియలకు మన్నవ వెళ్ళి వచ్చిన తర్వాత బాపట్లలో అమ్మ రోజూ భావన్నారాయణస్వామి దేవాలయానికి వెళ్ళేది. అదే వేళకు పంగులూరి శేషతల్పశాయి గారి కుమార్తె అనసూయా, మాధవపెద్ది కాళిదాసుగారి కుమార్తె నాగలక్ష్మీ వచ్చేవారు. ఆ దేవాలయ ఆవరణలోని పొగడ చెట్టు క్రింద ముగ్గురూ కొన్ని గంటల కాలం గడపటం వారి అలవాటు.

వారిద్దరూ అప్పుడప్పుడు గుడిలో కొబ్బరి కాయలు కొట్టేవారు. అమ్మ మాత్రం ఎప్పుడూ కొట్టలేదు.

ఒక రోజున నాగలక్ష్మి అడిగింది.

'ఎప్పుడు ఒక్క టెంకాయన్నా తెచ్చుకోవేం?'

'మట్టి తెచ్చిందిగా...' పంగులూరి అనసూయ పరిహాసంగా అన్నది.

'ఏమి చేసేది? నేను టెంకాయ ఎవరిని అడిగేది? అడిగినా యిస్తారో, యివ్వరో...'

-అంటూ అమ్మ క్రింద చూచింది. తన పాదాల వెంట యిసుక లోపలకు వచ్చింది.

'అయితే కొబ్బరికాయ తెచ్చిన వారి వెంట యీ యిసుక రాదా?' అంటూ వారి పాదాల వంక చూచింది. వారి పాదాలకూ యిసుక ఉన్నది.

'అసలు పాదాలకు యిసుకగానీ, మట్టిగానీ ఎందుకు అవుతుంది?' అని వారిని అమ్మ అడిగింది.

' నేల మీద నడుస్తాం కనుక.'

'నేల పై నడవని వారెవరయినా ఉంటారా?' అని అమ్మ అడుగుతూ ఉండగా అందరూ కలిసి దేవాలయ ప్రాంగణం దాటి వచ్చారు.

మనుషులధిక భాగం నేలపై ననే నడుస్తున్నారు. ఏ కొందరో కార్లలోనో, సైకిళ్ళపైనో తిరుగుతున్నా - అవీ నేలపైనే నడుస్తున్నాయి. పశువులన్నీ నేలపైనే

నడుస్తున్నాయి. వృక్షాలు చెట్లపై వాలి ఉన్నా - చెట్లు భూమి ఆధారంగానే ఉన్నాయి.

వాటి అన్నింటిని గురించి వారికి వివరిస్తూ అమ్మ లోపలకు వచ్చి - కొన్ని పూలూ, తులసిదళాలూ కోసుకుని దేవాలయంలోనికి వెళ్ళింది. అర్చకుడు అన్యకార్య నిమగ్నుడై ఉన్నందున తెచ్చిన పూలూ, దళాలూ నేల మీద పెట్టి అమ్మ మౌనంగా నిలుచున్నది.

అర్చకుడు చూచి 'అయ్యో అయ్యో...' అని అరుస్తూ

'క్రింద పెడతావేం? తప్పు కాదూ. అమ్మవారి పూలు క్రింద పెట్టవచ్చునా?' అన్నాడు.

'చెట్టు క్రిందనే మొలిచింది కదా అని క్రిందనే పెట్టాను. తప్పు అని తెలియలేదు. అయితే చెట్టు క్రింద మొలవడం కూడా తప్పేనా?' అమ్మ అడిగింది.

ఆ ప్రశ్నకు ఆ అర్చకుడు సమాధానం చెప్పేవాడో, చెప్పలేనివాడో గాని- అంతలో చాలా మంది లోపలకు రావడంతో అర్చకునికి ఆ పరీక్ష తప్పింది.

స్నేహితురాండ్రు ముగ్గురూ బయటకు వచ్చి మండపంలో కూర్చున్నారు. వారిద్దరూ అమ్మకు ఒక కొబ్బరిచిప్ప యిచ్చారు. ఆ చిప్పను ముక్కలు ముక్కలు చేసి—

'చూశారూ... ఒకటే అనేకమయింది' అన్నది.

'ఔను' అన్నారు వారిద్దరూ. వారికి అందులో విశేషమేమీ కనుపించ లేదు. అమ్మ కూడా ఆనాడు వారికి అంతకంటే వివరించి చెప్పలేదు.

చీకటి పడింది. వారిద్దరూ యిళ్ళకు వెళదామన్నారు. అమ్మ యింకా కొంచెం సేపు అక్కడనే ఉంటానన్నది. వారు వెళ్ళిపోయారు.

'కొబ్బరికాయ అంటే ఏమిటి? కొబ్బరికాయ ఎందుకు కొట్టాలి?' అమ్మ ఆ మండపంలో కూర్చుని గుళ్ళోకి వచ్చే ప్రతి మనిషినీ అడిగింది.

కుంటి ప్రశ్న గుడ్డి ప్రశ్న - అనుకుంటూ, అందరూ వెళ్ళిపోయారు. ఏ ఒక్కరూ నిలబడి సమాధానం చెప్పకపోయినా, కనీసం అందుకు ప్రయత్న మయినా చేయలేదు.

ఆ రాత్రి ఆవరణలో స్థానాచార్యులుగారు రామాయణం పురాణం చెప్పారు. అందులో అంతా ధర్మ ప్రబోధమే.

పురాణ ప్రవచనం సమాప్తం కాగానే - అమ్మ ఆచార్యులవారి వద్దకు వెళ్లింది.

'ఆచార్యులుగారూ...'

'ఏమమ్మా?'

'ధర్మమంటే ఏమిటి? చేసేది ధర్మమా? చెప్పేది ధర్మమా? చూచేది ధర్మమా? అసలు ధర్మమంటే ఏమిటి?' అమ్మ గబాగబా అడిగేసింది.

'చిన్న పిల్లవు, నీ కెందుకమ్మా యీ ప్రశ్నలు?' అంటూ శ్రోతలు పలికే ప్రశంసావాక్యాల శ్రవణంతో తన్మయమౌతూ ముందుకు సాగిపోయారు. 'అడిగే ప్రశ్నకు సమాధానం యివ్వాల్సిన ధర్మం మీకు లేదా?' అన్న అమ్మ ప్రశ్న ఆ పెద్దల పలకరింపుల్లో ఆయనకు చేరనేలేదు.

అమ్మ తిరిగి వెళ్లి మండపంలో కూర్చున్నది. అంతలో బావట్ల సుబ్బారావు గారు వచ్చారు. ఆయన అమ్మను చూచి-

'ఏమమ్మా? ఇంతసేపున్నావేమిటి?-చాలా పొద్దుపోయింది. ఎనిమిద యింది. మీ యింట్లో నవరాత్రి పూజకదా, మీ మేనత్తగారు కలశం పెట్టలేదూ?'

'పెట్టారు గాని - నేను ఒకటి అడుగుతాను చెబుతారూ?'

'అడుగమ్మా...'

'ఇద్దరం కలిసి పొగడచెట్టు క్రింద కూర్చుందాం, పదండి...'

ఇద్దరూ వెళ్లి చెట్టు క్రింద కూర్చున్న తర్వాత అమ్మయే ప్రారంభించింది.

'దేవునికి పూజచేసే పసుపు, కుంకుమ, దేవునికి పెట్టే సొమ్ములు, కట్టిన గుడ్డలు, పెట్టే నివేదనలు, యీ పాత్రలు, యీ పళ్లాలు - వీటి పుట్టుక ఎక్కడ? తయారెక్కడ?'

'పసుపు భూమి నుండే. కుంకుమ అంటే పసుపుతో తయారయినదే కాబట్టి కుంకుమా భూమినుండే. సొమ్ములంటే వెండీ, బంగారాలే కదా. అవీ

భూమి నుండే. గుడ్డలు నూలు నుండీ, నూలు ప్రత్తి నుండీ, ప్రత్తి భూమి నుండీ. నివేదన లంటే అన్నం, కూరలూ, కాయలూ, పండ్లూ - అన్నీ భూమి నుండే. ఇక పాత్రలూ, పళ్ళాలూ అంటావా? - అన్ని లోహాలూ భూమి నుండే.'

'ఇంతకూ ఆ పూజ చేయించుకునే దేవుడు ఎక్కడ పుట్టాడు?'

'గుళ్ళో ఉన్న విగ్రహాలా?' సుబ్బారావుగారికి సందేహం కలిగింది.

'విగ్రహాలంటే దేవుడు కాదా?'

'కాకేం? కాకేం? దేవుడే...' సుబ్బారావుగారు నసిగారు.

'మరి, నేను దేవుడంటే-గుళ్ళో ఉన్న విగ్రహాలా అంటారేం?'

'చిన్నపిల్లవు-నీకెందుకూ యీ దేవుడూ దయ్యాలూ? వెళ్ళు వెళ్ళు యింటికి....'

సుబ్బారావుగారు యింటికి వెళ్లిన తర్వాత అమ్మ తిరిగి వచ్చి మండ పంలో పడుకున్నది. అంతలో చిదంబరరావుగారి గుమాస్తా అయిన ముక్తినూతలపాటి శ్రీరాములుగారు వచ్చారు. వెంట కొందరు స్నేహితులున్నారు. ఈ సమయంలో అమ్మను చూచి ఆశ్చర్యంతో...

'ఎందుకమ్మా యిక్కడ ఉన్నావు? పోదాంపద...'

అని ఎత్తుకుని ముద్దుపెట్టుకుని స్నేహితులతో అన్నారు.

'తల్లిలేని పిల్ల. చాలా బుద్ధిమంతురాలు, అల్లరి చేయదు.'

'ఇంకా ఏం? నీకు పిల్లలు లేరుగా. పెంచుకో' స్నేహితులు సలహా యిచ్చారు.

'చాలా పొద్దు పోయిందమ్మా. ఇంటికి వెళ్ళుదాం, పద...' శ్రీరాములు గారు అమ్మను ఎత్తుకోబోయారు.

అమ్మ యింకా కొంచెంసేపు అక్కడనే ఉంటానన్నది. శ్రీరాములు గారు మళ్ళీ అడిగారు.

'బుద్ధిమంతురాలిని అన్నారుగా. మీరు చెప్పినట్లు వినక పోయినా అంటారా? బుద్ధిమంతురాలంటే యేమిటండీ? బుద్ధి కలిగిందనా? బుద్ధిలేని

వారు ఉండరుగా. కుక్కకు కూడా బుద్ధి వున్నది' అని శ్రీరాములుగారి వెంట ఉన్న వారి పెంపుడు కుక్కను చూపించింది అమ్మ.

"బుద్ధి అంటే గుణమమ్మా..."

'గుణం లేనివీ ఉండవుగా. అన్నిటికీ గుణాలున్నాయిగా."

'ఈ అమ్మాయి చాలా అసాధ్యురాలుగా ఉన్నదే!' స్నేహితులు విస్తు పోయారు.

'నీకు కానీ యిస్తానుగాని కొట్టు మూతవేయబోతున్నారు. ఏమయినా కొనుక్కొచ్చుకో...పో...' శ్రీరాములుగారు జేబులో చెయ్యి పెట్టారు.

"నేనూ కానివ్వ మనే అంటున్నాను."

శ్రీరాములుగారు కానీ తీసి యివ్వబోయారు. అమ్మ చేయి చాపలేదు.

"తీసుకో.' అని శ్రీరాములుగారు చేతిలో పెట్టబోయారు.

'నేను సంభాషణ కానివ్వమంటున్నాను' అని అమ్మ వివరంగా చెప్పింది.

స్నేహితులు పకపకా నవ్వి అన్నారు...

'కవిగారి మనుమరాలు కదూ...'

అందరూ బయలుదేరారు. అమ్మ కూడా శ్రీరాములు గారి చిటికెన వ్రేలు పట్టుకొని బయలుదేరింది. కొంతదూరం వెళ్ళి చూచుకుంటే శ్రీరాములు గారి వెంట అమ్మ కనుపించలేదు.

'అమ్మా యేదీ?' అని శ్రీరాములుగారు స్నేహితులను అడిగారు. ఎవరూ అమ్మ ఎప్పుడు ఎటు వెళ్ళినదీ గమనించలేదు.

అమ్మ తిరిగి దేవాలయానికి వచ్చి తిన్నగా గర్భాలయంలోకి వెళ్ళి ఒక మూల నిలుచున్నది. అర్చకుడు అమ్మను చూడక తలుపులు వేసి వెళ్ళిపోయాడు.

అమ్మ రాజ్యలక్ష్మి అమ్మవారి విగ్రహం దగ్గరకు వెళ్ళి---

ఆయన దేవుడంటే విగ్రహాలా?- అన్నాడే? దేవుడు వేరూ, విగ్రహాలు వేరా? విగ్రహాలే దేవుడా?'

-అని ఆలోచించుకుంటూ - విగ్రహం కళ్ళకు పెట్టిన డిప్పలను లాగి వేసి కన్నుల కోసం చూచింది; కనుపించలేదు. కట్టిన గుడ్డలు విప్పదీసింది; రాయి మాత్రం మిగిలింది. రాతికి పూసిన రంగులు చేతికి జిడ్డుగా తగిలాయి. అమ్మ పిలిచింది; రాయి పలకలేదు. కదిలించింది; కదలలేదు.

'అమ్మవారు అన్నీ ఉన్నప్పుడు ఒక రకం, తీసినప్పుడు యింకొక రకం-ఈ అలంకారమేనా దేవుడు?'

-అని అమ్మ తనలో తానే అనుకుంటూ--

ఈ సొమ్ములు చేసినవాడు దేవుడా? ఈ చీర దేవుడా? ఈ రాయి చెక్కినవాడు దేవుడా? వీటినన్నిటిని 'దేవుడనుకొన్నవాడు దేవుడా? అసలీ పదార్థాలన్నీ యిచ్చిన భూమి దేవుడా? ఈ భూమిని కూడా ఎందుకు పూజచేయకూడదు? భూమి అన్నిటకీ ఆధారం కదా?'

అని తనలో తానే ప్రశ్నించుకున్నట్లు, అమాయకమయిన యీ లోకాన్నీ, ప్రజల మూఢత్వాన్నీ ప్రశ్నిస్తూ-ఒక మూలన ఉన్న మట్టిలో గుప్పెడు చేతికి తీసుకుని, ఆ మట్టివంక తదేకంగా చూస్తూ--

'అమ్మా-నీలో పుట్టి నీలో పెరిగి నీలో లయమయ్యే వస్తువులన్నిటికీ పూజచేస్తూ నిన్ను గుర్తించనివ్వకుండా చేస్తున్నావా?

దున్నినా తన్నినా సహిస్తున్నావు. మంచీ చెడూ విభేదం లేకుండా అన్నిటినీ భరిస్తున్నావు. నీ గుండెల్లో ఎన్ని అగ్ని పర్వతాలున్నాయో! వాటిని నీలోనే దాచుకుని పైకి నిశ్చలంగా కనుపిస్తూ యీ సర్వజగత్తుకూ ఆహారం యిచ్చి పోషిస్తున్నావు.

కొందరు మూర్ఖులు నీ కోసం దారుణ రణ మారణహోమాలు చేసి నీ అనుగు బిడ్డల కుత్తుకలు కోసినా, నీ రమణీయ శరీరం రక్తసిక్తం చేసినా, నీ గుండెలను గొడ్డలితో వ్రయ్యలు చేసినా - ఈషణ్మాత్రమూ చలించవు; వారిని నిరసించవు; వారిని నిందించవు. వారిని దండించవు. పైగా ఆ దుర్మార్గులకు నీ చల్లని ఒడిలో స్థానమిచ్చి సేద తీర్చి...

అమ్మలో ఆవేశమూ, ఆవేదనా పొంగి పోయాయి. కొంచెం సేపు మౌనంగా భూమివంక చూస్తూ-

'ఎందుకమ్మా నీ కీ సహనం? ఎవరు గుర్తిస్తారు నీ ఔదార్యం? నీ హృదయం ఎవరికి అర్థమౌతుంది?'

కొన్ని క్షణాలు మళ్ళీ మౌనంగా ఉండి-

'ఔను; ఎవరికోసమూ కాదు. ఎవరి ప్రశంసల కోసమూ కాదు. అది నీ గుణం; అది నీ ధర్మం; అది నీ మహోత్తమ మహోదార విశిష్ట విశాల వినిర్మల హృదయ స్వభావం. ఆ హృదయంలో నిరంతరం అంతర్వాహినియై సముత్తుంగ తరంగితమై ప్రవహించే మధుర మధుర మమతామృత స్రవంతీ ప్రభావం...'

సానుభూతితో నిండిన హృదయంతో అమ్మ నేలపై సాష్టాంగపడి కౌగిలి కందని భూమిని కౌగిలిలో యిముడ్చుకోవాలని తన గుండెలను తన బాహువులతోనే గట్టిగా బంధించుకుని అన్నది---

'అమ్మా! నిస్వార్థమూ, నిరుపమానమూ అయిన నీ చరిత్ర ఎంత పవిత్రమయినది? త్యాగభరితమూ, రాగసహితమూ అయిన నీ జీవితం ఎంత దివ్యమైనది? అందుకే యీ సర్వ జగత్తుకూ నీవే మాతృమూర్తి వంటాను. ఈ విశాల విశ్వమంతటిలోనూ నీవే సహనదేవత వంటాను. ఈ సమస్త జనులూ నిన్నే పూజించాలంటాను; అహరహమూ నిన్నే ఆరాధించాలంటాను.' //

9. దాగుడు మూతలు

"ధరిత్రీ! ధరిత్రీ!

సర్వ జగద్ధాత్రీ!

చరాచర సకల జీవ జనయిత్రీ!!'

-అని స్తుతిస్తూ ఆ రాత్రి అమ్మ దేవాలయంలోనే తెల్లవార్చి ఎనిమిదిన్నరకు ముఖద్వారం వద్దకు వచ్చింది. అదే సమయానికి అర్చకుడు రంగాచార్యులు తలుపులు తెరిచాడు. ఎదురుగా అమ్మ నిలుచున్నది. తేజో విలసితమూ రమణీయమూ అయిన ఆ ముఖమూ, నేత్రద్వయమూ తళుక్కుమని అతని దృష్టి నాకర్షించాయి. ప్రశాంత సుందరమూ, ప్రసన్న దరహాస భాసురమూ అయిన ఆ మూర్తితో పాటు అనంతకాంతి వెల్లువ అతని హృదయాన్ని నింపివేసింది. క్షణంలో తాను నిత్యమూ ఆరాధించే రాజ్యలక్ష్మీ అమ్మవారు తనను కరుణించి సాక్షాత్కరించిందని భావించాడు. ఆ అద్భుత దృశ్యవీక్షణతోనూ, అపూర్వ భావావేశంతోనూ అప్రతిభుడై పోయాడు. విద్యుద్ఘాతం తగిలినట్లు మేను పులకించింది. శరీరం మీద అధికారం కోల్పోయి మంత్రబద్ధుని వలే సోలిపోయి అమ్మపాదాలపై వాలిపోయాడు. అమ్మ మృదుకరంతో అతని శిరోపరిభాగాన్ని ఒక్కసారి స్పృశించింది. అంతే-అతడు ఏలోకానికి వెళ్ళాడో... ఏ ఆనందరసార్ణవపు లోతులను పరిశోధిస్తున్నాడో... అతని మనసులో లోకగమనమూ లేదు. దేహంలో యీషణ్మాత్రం చలనమూ లేదు.

మెల్లగా అమ్మ బయటకు వెళ్ళింది.

రంగాచార్యులు కళ్ళు తెరిచాడు. ఎదుట అమ్మ కనుపించలేదు. వెంటనే ఆలోచన కలిగింది. తాను పొందిన దర్శనం సత్యమా, భ్రమా అని

గబగబా రాజ్యలక్ష్మీ అమ్మవారి విగ్రహం వద్దకు పరుగెత్తాడు. విగ్రహపు రెండుపాదాలూ గట్టిగా పట్టుకున్నాడు.

'నిజమయిన దర్శనమిచ్చావు తల్లీ!' అని తన్మయుడై పోయాడు. కన్నీటి ధారలతో అమ్మవారి పాదాలభిషిక్తమైనాయి.

అంతలో దేవాలయ ధర్మకర్త దేశిరాజు రంగారావుగారు వచ్చారు. వస్త్రవిహీనమై, అలంకార రహితమై ఉన్న విగ్రహాన్ని చూచారు.

'ఏం రంగాచార్యులుగారు! ఈ రోజు దిగంబరోత్సవమా?' వ్యంగ్యంగా ప్రశ్నించారు.

రంగాచార్యులు తలయెత్తి చూచాడు. నిజమే! ఏమిటీ ఇది? ఇందుకు కారకులెవరు? -భక్తిభావంతో వివశుడై ఉన్న అతనిలో భయోత్పాతం కలిగింది. స్వేద ధారలతో శరీరం తడిసిపోయింది.

కానీ వెంటనే సంబాళించుకొని వినమ్రుడై చెప్పాడు.

'లేదండీ-ఇవాళ తిరువెంగళాచార్యులుగారు వస్తానన్నారు. వారి కోసమే చూస్తున్నాను. ఇంకా రాలేదు.'

పారవశ్యం వలన శరీరం స్వాధీనంలో లేకపోయినా, లేచి వెళ్ళి యింకొక చీర తీసుకువచ్చి కట్టాడు. ఆభరణాల కోసం అన్వేషించినా కనుపించలేదు.

'అమ్మా! ఈ రాతిలో నుండి అలంకారంతో సహా నాలో ప్రవేశించావా? ఇక యిది వట్టి రాయేనా? ఇది కారణంగా నా ఉద్యోగం పోయినా నీవు మాత్రం నాలోనే ఉండమ్మా! నాకళంకం పోయేటట్టుగా అలంకారానికి సొమ్ములివ్వమ్మా! అదీ గాక యిట్లా నిన్ను నేను చూడలేనమ్మా!'

-అని దీనుడై ప్రార్థిస్తూ ఉండగా సొమ్ములున్న స్థలం మనసులో స్ఫురించింది. వెంటనే అక్కడకు వెళ్ళిచూచాడు. సొమ్ములు దొరికాయి. పట్టలేని సంతోషంతో వాటిని తీసుకువచ్చి అమ్మవారికి అలంకరిస్తూ-

'ఎప్పుడూ యిట్లాగే కాపాడుతూ ఉండు తల్లీ!'

అని వేడుకుంటూ ఉండగా ధర్మకర్త వచ్చి చూచి....

'ఏమోయ్! దొంగిలించింది తెచ్చి పెడుతున్నావు. నీకు రావలసినది లెక్క చూచుకో...' అన్నారు.

'నాకు రావలసినది తరువాత చూద్దాం. మీ సొమ్ములు లెక్క చూచుకొనండి.'

'అర్చకుని దొంగతనాన్ని అమ్మవారు కూడా పట్టుకోలేదు. అందుకనే యింట్లో దొంగను ఈశ్వరుడయినా పట్టుకోలేడు - అని సామెత.'

రంగాచార్యులు ఆ మాట లేమీ వినిపించుకోకుండా--

'నాకీ ఉద్యోగం పోయినా సరే -నీ రూపు మాత్రం మరపురాకుండా చేయమ్మా...'

-అని నమస్కారం చేసి బయటకు నడిచాడు.

'ఈ వెళ్లడం యిక యిట్లాగే వెళ్లవోయ్...' రంగారావుగారు ఆదేశించి వెళ్లిపోయారు.

రంగాచార్యులు మనసంతా అమ్మనే నింపుకుని బరువుగా అడుగులు వేసుకుంటూ దేవాలయ ప్రాంగణం దాటి వచ్చాడు. ఎదురుగా అమ్మ నిలుచుని ఉన్నది. తాను దర్శించిన అమ్మవారి పోలికలు అమ్మ ముఖంలో గమనించి కొన్ని క్షణాలు తదేక దృష్టితో అమ్మవంక చూచాడు. కాని ఆ అమ్మయే యీ అమ్మాయని గుర్తించలేక పోయాడు. మానవుడు మాయాబద్ధుడు కదా!

'నీవు ఎవరమ్మాయివి?' సామాన్యంగా ప్రశ్నించాడు-

'ఎప్పుడు ఎక్కడ ఉంటే వారి అమ్మాయిని.' మహోన్నతమయిన సమాధానం యిచ్చింది.

'అయితే-యిప్పుడు నీవు మా అమ్మాయివా?' అమాయకమయిన ప్రశ్న.

'అనుకుంటే- కానా?'

'మా అమ్మను చూచాను యీ వేళ. మా అమ్మ నీకు కనబడ్డదా? మా అమ్మ సామాన్యం కాదు' అని కన్నులు మూసుకొని పరవశుడై పోయాడు.

'ఎవరూ మీ అమ్మ? మా యమ్మా!?'

-అంటూ అమ్మ ప్రక్కకు తప్పుకున్నది.

కన్నులు తెరిచిన రంగాచార్యులుకు అమ్మ కనుపించక- అమ్మ ముఖంలో అమ్మవారి పోలికలూ, అమ్మ మాటల్లోని అర్థ గాంభీర్యమూ స్ఫురణకు

వచ్చి -

'ఒక వేళ యీ అమ్మాయి ఉదయం దర్శనమిచ్చిన అమ్మయేమో...' అనే భావం అతని మనసులో ప్రభవమై దృఢమైనది.

అదృశ్యమయిన అమ్మను అన్వేషిస్తూ ప్రక్క వీథి వెంట శివాలయం దాటి పరుగెత్తనారంభించాడు. నోరి సుబ్రహ్మణ్యశాస్త్రి గారింటివద్ద కొద్ది దూరంలో అమ్మ కనిపించింది. రంగాచార్యులు పరుగు వేగం హెచ్చించాడు. అమ్మ రైల్వే స్టేషన్ మలుపు తిరిగి స్టేషనుకు ఎదురుగా ఉన్న నేరేడు చెట్టు క్రింద కూర్చున్నది.

రొప్పుతూ రోజుతూ దగ్గరకు వెళ్ళి-రంగాచార్యులు అడిగాడు-

"అమ్మా? నిన్న నాకు కనుపించింది నీవేనా? నిజం చెప్పు...'

'నిన్నా మొన్నా-నీకు కనుపించినది? నీవు నిజం చెప్పు...' అమ్మ తిరిగి ప్రశ్నించింది.

'పొరబడ్డానమ్మా? తెల్లవారుజామున...'

'తెల్లవారుజామున కనబడ్డానా? నిజం చెప్పు-అయితే నీవు నా సొమ్ములూ కాజేయడానికి వచ్చావా, గుడిలో అమ్మ వారివి కాజేసినట్లు...'

రంగాచార్యులు ఉలిక్కిపడ్డాడు. గుండె గబగబ లాడింది. కన్నులు విస్ఫారితాలై అమ్మవైపు కేంద్రీకృతమయ్యాయి.

'అమ్మా! అమ్మా! పొరపాటు పడ్డాను. కనబడ్డది ఎనిమిది గంటలకమ్మా. ఈ సంగతి ఎవరికీ తెలీదు. గుడిలో జరిగిన విషయం నీ నోటివెంట ఎట్లా వచ్చిందమ్మా? ఆ కనపడ్డది నీవేనా? ఆ రాతిలో వున్న యంత్రం నీవేనా? నిన్ను నేనర్థం చేసుకోలేదు. ఎవరూ అర్థం చేసుకోలేరు...'

-అంటూ అమ్మ పాదాలపై బడి....

'మాయ కప్పకమ్మా-మాయ కప్పకమ్మా'

-అని రోదిస్తూ...

'రోజూ వచ్చే అమ్మను గుర్తించలేక పోయాను. ఒకనాడు కొట్టడానికి

చేయి కూడా ఎత్తాను. ఎందుకిట్లా చేయిస్తున్నావో...

'అమ్మా! నన్ను తొందరగా నీలో కలుపుకో తల్లీ!'

అతని ప్రార్థన ముగిసేసరికి అమ్మ పోలికలు మారి అమాయకపు పిల్లవలే కనబడుతూ బ్రతిమాలింది.

"నాయనా! నా కాళ్ళమీద పడి నన్ను 'అమ్మా! అమ్మా!" అంటావేమి? నేను చిన్నపిల్లను. చిదంబరరావు గారి బావమరిది కూతురిని. మా అమ్మ పోతే యిక్కడ ఉంటున్నాను. నేనేదో అమ్మవారి దర్శనం చేసుకుందామని అప్పుడప్పుడు గుడికి వస్తుంటాను. నన్ను 'అమ్మాయి' అను నాయనా. నేను నీ వనుకునే 'అమ్మ'ను కాను."

ఆ మాటలు వింటూంటే రంగాచార్యులుకు నిజమే ననిపించింది. అదంతా తన భ్రమ అనుకుని అమ్మను వెళ్ళమన్నాడు.

అమ్మా, రంగాచార్యులూ యిద్దరూ ఎవరిదారిని వారు వెళ్ళారు. దారి పొడుగునా రంగాచార్యులుకు.

'నీకేం ఫర్వాలేదు. నీ ఉద్యోగం నీకు వస్తుంది' అని వినిపించింది.

అమ్మ యింటికి వెళ్ళుతూ దారిలో ఆసుపత్రి దగ్గరలో ఉన్న పున్నాగ చెట్టుక్రింద పూలు ఏరుకుని వెళ్ళి అమ్మ వారి పూజా మందిరం దగ్గర నేలమీద పెట్టింది.

ఆ రాత్రి అమ్మ యింటికి రాకపోవటం ఎవరూ గుర్తించలేదు. అందుకు కారణం వారి యింటిలో జరిగే నవరాత్రి ఉత్సవాల సందడి కావచ్చు.

'క్రిందపెడతావేం?' అని అన్నపూర్ణమ్మగారు అమ్మను కొట్టబోయి.

'దొడ్లో గులాబీపూలు కోసుకురా' అని ఆజ్ఞాపించింది.

అమ్మ దొడ్లోకి వెళ్ళి గులాబీలు కోసుకువచ్చి వినయంగా అడిగింది.

'ఎక్కడ పెట్టమంటావు అత్తయ్యా?'

' నీ నెత్తిన పెట్టుకో...'

అమ్మ ఆ పూలను తల్లో పెట్టుకున్నది. అన్నపూర్ణమ్మగారు చూచి కోపంతో అరిచింది--

'అందుకేనా పూలు తెమ్మన్నది?'

'పెట్టుకోమంటేనేగా పెట్టుకున్నది. పూలు తెమ్మంటే తెచ్చాను. పెట్టుకో మంటే పెట్టుకున్నాను. తెలియంది అడిగాను. చెప్పింది చేశాను.'

పురోహితుడయిన ప్రఖ్యా సుబ్బయ్యగారు అప్పుడే వచ్చి ఆ సంభాషణలో అమ్మ యిచ్చిన సమాధానానికి ముగ్ధుడై..

'ఆ అమ్మాయి నెత్తిన పెట్టుకున్నా దోషం లేదమ్మా. ఆ అమ్మాయి బాల కదూ? పిల్లలకు దోషం లేదు. పూజ చేయవచ్చు.'

కొన్ని క్షణాలు అమ్మ వంక చూచి వారే అడిగారు.

'అమ్మగారూ! నిన్న యీ అమ్మాయి గుడి మండపం దగ్గర కనపడ్డ దమ్మా. మీకు ఏమవుతుంది? ఎవరో పెద్దవాళ్లతో మాట్లాడుతున్నదే!'

'అన్నం పెట్టమని అడగటమే రాదు. మీరు ఎవరిని చూచి అను కున్నారో...'

'లేదమ్మా- యీ అమ్మాయే. స్పష్టంగా చూచాను. ఏదో విశేషమున్నదని చెప్పుకుంటుంటే విన్నాను.'

అన్నపూర్ణమ్మగారికి ఆ సంభాషణ వినడం విసుగనిపించి సుబ్బయ్య గారిని త్వరగా పూజ మొదలు పెట్టమని కోరింది. కాని సుబ్బయ్యగారి దృష్టిని అమ్మలోని అలౌకికత ఆకర్షిస్తున్నది. పూజయినా ఆరంభించడానికి మనస్కరించలేదు. ఆ విషయమే అన్నపూర్ణమ్మగారికి చెప్పారు. ఆమెకు కోపం వచ్చి అన్నది.

'మీరు కాకపోతే యింకొకరు వస్తారు.'

సుబ్బయ్యగారికి ఒక ఆలోచన తట్టి వెంటనే లేచిపూజకుపక్రమించారు. ఎదురుగా అమ్మ కూర్చున్నది. లలితా సహస్రనామ స్తోత్రం ప్రారంభించారు. మనసూ దృష్టీ ధ్యానమూ అమ్మ మీద; చేతిలోని పూలు కలశంమీద. ఆ రోజు

సుబ్బయ్యగారు వివశులై పూజచేసి అమ్మ వంకనే చూస్తూ కొబ్బరికాయ కొట్టి హారతి యిచ్చారు.

పూజ పూర్తి కాగానే అమ్మ బయలుదేరి దేశిరాజు రంగారావుగారింటికి వెళ్లి వాకిట్లో అరుగుమీద కూర్చున్నది. రంగారావుగారు యింట్లోకి వెళ్ళుతూ అమ్మను చూచి...

"ఎవరమ్మా, నీవు?"

"వారికి అమ్మ పెద్దముత్తయిదువ" వలే కనిపించింది.

"నేను రంగాచార్యులుగారి బంధువును."

"ఆయన నీ కేమవుతారమ్మా?"

"కొడుకు అవుతాడు. అంటే వాళ్ల అమ్మా నేనూ అక్కాచెల్లెలు వరుస."

"నీవు ఇప్పుడు వాళ్ల ఇంటి నుంచి వస్తున్నావా అమ్మా?"

"కాదు, వాళ్ల యింటికి వెళ్ళుతున్నాను. ఎవరో వాడి ఉద్యోగం తీసివేశారట. వాడు చాలా మంచివాడు; యోగ్యుడు. ఆ గుడికి వాడిచేత అర్చకత్వం జరిపించుకునే యోగ్యత లేదు.."

అమ్మ స్పష్టంగా చెప్పింది.

ఆ మాటలు రంగారావుగారికి ఆకాశవాణివలెనూ, ఎవరో అదృశ్యదేవత పలికినట్లుగానూ వినిపించాయి. వెంటనే తన నిర్ణయం మార్చుకుని రంగాచార్యులుకు యివ్వవలసిన జీతంకంటే పది రూపాయిలు ఎక్కువ తీసుకుని గొడుగు చేతపట్టుకుని దారిలో పూలూ, పండ్లూ కొనుక్కుని సరాసరి రంగాచార్యులు యింటికి వెళ్లి క్షమార్పణ చెబుతూ పైకం చేతిలో పెట్టి వేడుకున్నారు.

'ఈ పూలూ, పళ్ళూ తీసుకుని అమ్మవారికి పూజ చేసి, నివేదన చెయ్యి-'

రంగారావుగారు వెళ్లిపోయారు. కానీ యిదేమీ అర్థం కాని రంగాచార్యులు నిశ్చేష్టుడై అలాగే నిలబడి ఉండగా కిటికీలో గుండా వీధిన పోతున్న అమ్మ కనుపించింది.

"అమ్మా-" అని ఒక్క పరుగున వీధిలోకి వచ్చాడు.

ఎవరున్నారు?- ఎందరో వీథి క్రిక్కిరిసి నడుస్తున్నారు. అందులో అమ్మ లేదు.

నైరాశ్యోపహతుడై వెనక్కు తిరిగి విలపించాడు--

"అమ్మా! ఈ బిడ్డతో నీకీ దాగుడుమూత లేమిటమ్మా? నీ దర్శనం సంపూర్ణంగానూ, శాశ్వతంగానూ ప్రసాదించమ్మా! నేనీ ఊయల ఊగలేనమ్మా! నాకీ మాయను తొలగించమ్మా' నన్ను నీ ఒడిలోకి తీసుకో అమ్మా!"

'ఇప్పుడు నీవు నా ఒడిలోనే ఉన్నావు నాన్నా. నా ఒడి విడిచి ఎవరూ ఎక్కడకూ పోలేరు.'

రంగాచార్యులుగారికి అదృశ్యవాణి వినిపించింది.

10. అందరికీ సుగతే

అప్పుడే ప్రొద్దుగూకింది. అందాకా మూలమూలల నక్కి ఉన్న తమస్సు లోకాన్ని కబళించడానికి సమాయత్త మౌతున్నది.

అమ్మ ఒక్కతే వీథివెంట నడుస్తున్నది.

అయిదు సంవత్సరాల అమ్మ, విరిసీ విరియని మనసు కలిగి ఉండాల్సిన బాలిక-- జీవితంలోని నిమ్నోన్నతాలూ, లోకంలోని న్యూనతాధిక్యాలూ... సర్వమూ చవిచూచిన పరిపూర్ణమైన అనుభవం కలిగిన పెద్దముత్తయిదువవలె ఆలోచనా నిమగ్న అయినట్లు ఆకాశంలోకి అవలోకిస్తూ గంభీరవదన అయి మందగమన అయింది.

వెళ్లి వెళ్లి యూనియన్ ఆఫీసువద్ద మఱ్ఱిచెట్టు క్రింద ఆసీనకాబోయింది అమ్మ.

ప్రస్తుతం ఆ స్థలంలో మునిసిపల్ ట్రావెలర్సు బంగళా ఉన్నది.

'ఏ అమ్మాయ్! నీ పేరేమిటి?'

ఎక్కడ నుండి వెంబడించాడో- ఒక పోలీసు అమ్మ వెనుకనే నడచి వచ్చాడు.

అమ్మ పలక లేదు. పదిసార్లు పిలిచాడు. అమ్మ వినిపించనట్లే ఉన్నది. అతనికి విసుగేసింది. కోపం వచ్చింది. శ్రుతిపెంచిన కంఠంతో---

'ఏ అమ్మాయ్!' -- అని కేక వేశాడు.

అమ్మ మెల్లగా ముఖమెత్తి అతనివంక చూచింది. ఆ దృష్టిలో నిర్లిప్తత మినహా మరే భావమూ వ్యక్తం కాలేదు. ముద్దులు మూటకడుతూ, మురిపాలు ఒలకపోస్తూ ఉన్నది.

ఆ అందం అతనికేమి అర్థమవుతుంది? -- మనసులో ఏమయినా ఆర్ద్రత ఉంటేనేగా?

ఆ నయన యుగళిలో భాసించే నిర్లిప్తతకానీ, వదన మండలంలో

దీపించే ప్రశాంతత కానీ అతనిలో ఏ ముద్రనూ వేయలేకపోయాయి. మరి సంస్కారహీనమూ, పాషాణ సదృశమూ కదా అతని హృదయం!

'నీ పేరేమిటి?' అతని కంఠంలో నుంచి కర్కశత్వం గర్జించింది.

'పిలిచావుగా! అదే నా పేరు, అబ్బాయ్?' పెనతుఫానులో సయితమూ చలించని ఒక చిన్న మొక్కవలె నిశ్చలంగానూ, నిర్భయంగానూ, నిర్లిప్తంగానూ, శాంత గంభీర స్వరంతో అమ్మ యిచ్చిన సమాధానంతో అతడు విస్తుబోయాడు. అంతకంటేను అతనిని విస్మితుడిని చేసింది -- అమ్మ సమాధానంలోని చివరిమాట.

'అబ్బాయట!'

అబ్బాయని అపరిచిత వ్యక్తిని ఎవరినయినా, ఎవరయినా, సాంఘిక వ్యత్యాసాన్ని బట్టి అనవచ్చును. గానీ -- యీ పిలుపులో ఆ ధ్వని లేదు.

మరి, తన వయస్సెక్కడ? ఆమె వయస్సెక్కడ? అందుకే అడిగాడు.

'అబ్బాయి ఏమిటి?'

వెంటనే అమ్మ ప్రశ్నించింది --- 'అమ్మాయి ఏమిటి?'

'నీవు అమ్మాయివి కనుక.'

'నీవు అబ్బాయివి కనుక.'

'ఏయ్, నేను పోలీసును.'

'ఏయ్, నేను అనసూయను.'

'ఏయ్, జాగ్రత్త! నీకు జైలు కావాలా?'

'జైలు కొడతావా? అప్పుడే వద్దులే...'

ఖైదు (కారాగార) అనే అర్థంలో అతడు 'జైలు' అన్నాడు. జయజయ ధ్వానాలూ అన్న అర్థంలో అమ్మ 'జైలు'నుపయోగించింది. ఈ శబ్ద చమత్కారం అతనికి అర్థం గాక 'ఆ' అన్నాడు. అమ్మ వెంటనే మెల్లగా 'ఈ' అన్నది. అతనికి మరీ అయోమయమై --

2

'ఏమిటి అంటున్నావు? ఈ-- అంటావేమిటి?' అన్నాడు.

' నీవు 'ఆ' అంటేను దాని తరువాత 'ఈ' కదా అని అన్నా.'

" 'ఆ' తర్వాత 'ఈ' అని నీకెవరు చెప్పారు."

'ఎవరూ చెప్పలేదు. శబ్దాలు పుట్టింది పలకటానికేగా! ఎవరయినా చెప్పినా అర్థం చేసుకుంటేగా? తనంతట తాను పలికినా ఎవరయినా చెప్పితే పలికినా - వీటన్నిటినీ గ్రహించే శక్తి ఒకటే-'

ఆ వివరణలను వినే సహనం అతనిలో ఎక్కడున్నదీ? ఆ మాటల్లోని మాధుర్యాన్ని ఆస్వాదించేందుకు సంస్కారం కావద్దూ?

'ఒకటేనా? చూద్దాం -- ఆ ఒకటేమిటో?' అంటూ చెయ్యి పట్టుకుని అమ్మ సుందరకంఠసీమ నలంకరించియున్న పులిగోరు పట్టుకు లాగాడు; అది రాలేదు. గట్టిగా గుంజాడు; రాలేదు. అటు యిటూ మెలివేశాడు; రాలేదు.

అతనికి ఏమి చేయాల్సినది స్ఫురించలేదు. చుట్టూ చూచాడు ఎవరయినా వస్తున్నారేమోనని. కనుచూపు మేరల ఏ వ్యక్తీ కనుపించలేదు. కానీ, అతనిలోనే ఏదోశక్తి ఉరిమినట్టయింది. తత్ఫలితంగా మనసులో సంచలనమూ, అవయవాలకు కంపనా, దేహమంతా స్వేదస్రావమూ ఆరంభమయ్యాయి.

అమ్మ మాత్రం స్థాణువువలె నిర్వికారంగా నిలుచున్నది.

'ఎవరీ అమ్మాయి? ఏమిటీ పరిస్థితి?'

ఆ ప్రశ్నలకు సమాధానం అతనికి లభించలేదు. అంతకంటే అతనిని కలవరపరిచింది---

'ఏం చేయాలిప్పుడు?' అన్న సమస్య.

తాను ఎంతటి బాధ అనుభవించడానికయినా అమ్మలో ఎంత సహనమున్నదో-తన బిడ్డలబాధ చూచేటప్పుడు అంత అసహనమూ ఉన్నది. అందుకనే వెంటనే అతని సమస్యను పరిష్కరించింది.

'నీ చెయ్యి నొప్పిపుడుతుంది. నేను యిస్తాను. కానీ, ఒక సంగతి అడుగుతాను. చెప్తావా?'

'ఆ చెప్తా - యిస్తానంటే చెప్తా.'

అతనిలో ఆశ చావలేదు. బహుశా, అతనిలోని యీ ఆశే అతను అనుగ్రహింపబడటానికి ఆధారమేమో! ఒకే గుణం ఒకనిని పాతాళానికి పంపించి, మరొకనిని ఊర్ధ్వలోకానికి చేరుస్తుంది.

'ఎందుకివ్వను? మాట అంటే ఏమిటో ఎపుడన్నా విన్నావా? - అర్థం తెలుసునా? మాట అంటే మారుమాటలేని మాట. ఆ మాటనే మంత్రమంటారు. ఉత్తములకు మంత్రం మామూలు. వారి మారుమాటలేని మాటకు సంఘంలో ఏ తంటా లేదు. చాలా తంటాలు పడుతున్నా మంటారే, వారు నీలాంటి మారుమాట గలవారే - ఇంతకూ చెప్తావా?'

అమ్మ మెడలో నుండి పులిగోరు తీసుకుని చేతిలో పెట్టుకుని అడిగింది--

'ఇక చెప్పు-'

'అడుగు--'

'చెయ్యి పట్టు--'

అతడు చెయ్యి పట్టాడు. అమ్మ అతని అరచేతిలో పులిగోరు పెట్టి- 'ప్రమాణపూర్తిగా చెప్పు-' అన్నది.

అతడు సంకోచంగా అమ్మవంక చూచాడు.

'ప్రమాణమంటే భయం లేదులే. ప్రమాణాలకు చాలా అర్థాలు ఉన్నాయి. ప్రస్తుతం ఇక్కడ మనస్ఫూర్తిగా అని. నీకు ప్రమాణం నేనేలే.'

అమ్మ మాటలకు ఆశ్చర్యపోతూ అమ్మ ముఖంలోకి చూస్తూ 'అడుగు' అన్నాడు.

'అసలు నీ ఉద్యోగ మేమిటి? వివరించి చెప్తావా నాయనా..'

'ఆఁ - ఎవరు ఏ లోపాలను చేసినా కనిపెట్టడం; వారిని పట్టుకుని జైలులో పెట్టడం.'

'లోపమంటే...?'

'దొంగతనం చేసినా, ఒకరు ఒకరిని కొట్టినా, చంపినా... యింకా చాలా వున్నాయిలే. నీకర్థం కావు.'

'ఇప్పుడు నీవు చేసిన దేమిటి? ఇది దొంగతనం కాదా? నిన్నెవరు పట్టుకుంటారు? ఇంకొక పోలీసు పట్టుకుంటాడా? లేక, అందరూ యింతే చేస్తారా? మీకు తప్పులేదని వదిలిందా ప్రభుత్వం.'

మృదువయిన అమ్మ కంఠంలో కాఠిన్యం పలికింది. ఆశ్చర్య చకితుడూ, భయకంపితుడూ అయి అతడు అమ్మ ముఖంలోకి చూచాడు. అతి సుందర మైన అమ్మ ముఖంస్థానే అరుణోదయ కాంతి గోచరించింది. అతడు దిగ్భ్రమ చెందాడు.

కొన్ని క్షణాలు గడచిన పిమ్మట ఆ కాంతి పలుచబడి అమ్మ ముఖం కనుపించింది. వణికే చేతిలోని పులిగోరు అమ్మ మెడలో వేసి మారుమాట లేక అమ్మను ఎత్తుకుని తన యింటికి తీసుకువెళ్ళాడు.

అతడి పేరు మస్తాన్. అతని కబురు మీద ఆ రాత్రి కొందరు పోలీసులు అతని యింటిలో సమావేశమయ్యారు. మస్తాన్ ఉర్దూలో వారికి జరిగిన సంఘటన చెబుతూ సంభాషణలోని అమ్మ మాటను తప్పు చెప్పాడు. అమ్మ వెంటనే ఆపి---

'నే నదేనా అన్నది? అబద్ధమాడుతా వేమి? ఉన్నది ఉన్నట్లు చెప్పు. కాదు, కాదు; ఉన్నది ఉన్నట్లుగా చెప్పలేవు కూడా. జరిగింది జరిగినట్లు చెప్పు--' అన్నది.

అమ్మ మాటలు విని అందరూ బిత్తరపోయారు. అమ్మ కేదో మహత్తరమయిన శక్తి ఉన్నదని భావించారు. అందులో ఒకడు--

'జరిగింది నీవు చెప్పమ్మా' -- అన్నాడు.

అమ్మ అన్నీ వివరించి చెప్పింది. అతడు అమ్మ మాటలను కొన్నింటిని వ్రాసుకున్నాడు. ఇద్దరు పోలీసులూ ఆ రాత్రి 12 గంటలకు అమ్మను తిరిగి తీసుకువచ్చి వారి యింటి వద్ద దించి వెళ్ళారు. అమ్మ ఆ రాత్రి అరుగుపైననే పడుకుని తెల్లవారి యింట్లోకి వెళ్ళింది. ఎవరూ పలకరించలేదు. ఎవరి పనుల మీద వారు ఉన్నారు.

అమ్మ మేడమీద ఒక గదిలో కూర్చుని ఉండగా ఉదయం 10 గంటల సమయంలో చిదంబరరావుగారు--

'అమ్మా అనసూయా? అన్నం తిందువుగాని రావూ...' అని అడిగారు.

'ఆ - కలిలేదు.'

' ఏ కలి లేదు?'

' ఈ కలిలో నా కాకలి లేదు.'

'మనసు సునిశితమూ, మాటలు చురుకూ...' అనుకుంటూ చిదంబర రావుగారు దిగిపోయారు.

అమ్మ కిటికీలో గుండా క్రిందికి చూస్తూ కూర్చుండగా...

'అమ్మా; మధూకరం...' అంటూ ఒక బిచ్చగాడు వచ్చి వాకిట్లో నిలుచున్నాడు.

అమ్మ గబగబా దిగి వచ్చి వంటమనిషి రాఘవమ్మ గారిని 'ఎవరో ఒక ముసలివాడు మధుకరానికి వచ్చాడు. కొంచెం అన్నం పెడతారా?' అని అడిగింది.

'ఇది బ్రాహ్మణ గృహం. భోజనం చేస్తున్నారు. అటు పోయి రమ్మని చెప్పు-'

'పోనీ నాకు పెడతారా?'

భోజనం చేస్తున్న చిదంబరరావుగారు--

'అమ్మాయి అన్నం అడుగుతున్నది. ఎవడో మధుకరానికి వచ్చాడు. వాడికోసం వంక పెట్టినట్లున్నది.'

చెయ్యి కడుక్కుంటూ చిదంబరరావుగారు...

'వంక ఎందుకు? ఒక ఆకులో పెట్టి యివ్వండి' అన్నారు.

'రోజూ అంతే చేస్తుంది. పెట్టిన అన్నం తీసుకువెళ్లి కుక్కలకూ, పందులకూ, కాకులకూ పెడుతుంది.'

చెయ్యి కడుక్కుని ఆ మాట వినిపించుకోకుండానే ఛిదంబర రావుగారు వెళ్లిపోయారు.

దర్వాజ పట్టుకుని అమ్మ నిలబడే ఉన్నది. రాఘవమ్మగారు తన పనిలో నిమగ్నమయి ఉన్నది. గంట గడిచింది.

అమ్మ బయటకు వచ్చి చూచింది. మునలివాడు లేడు. వాడిని వెదుకుతూ అమ్మ వీధివెంట వెళ్లింది. ఈలోగా వాడు పది యిళ్ళు తిరిగినా అన్నం దొరకలేదు. అమ్మ అతనిని బ్యాంకువద్దకు తీసుకువెళ్లి - తన మెడలో ఉన్న బంగారపుతాడు, మొలన ఉన్న బంగారపు బిళ్ళా యిచ్చి -

'తాకట్టుపెట్టి డబ్బు తీసుకో' - అన్నది.

అతడు సందేహించినా - అమ్మ ధైర్యం చెప్పింది. అతడు డబ్బు తీసుకున్నాడు. అతనిని ఒక చిల్లరకొట్టు వద్దకు తీసుకువెళ్లి వెచ్చాలు యిప్పిస్తూ-

'ఇక నేను వెళ్లనా...' అని అడిగింది అమ్మ.

'పోకమ్మా...' అని ముందు అన్నా మళ్లీ ఆలోచించి...

'సరే-వెళ్లమ్మా, నేను కొనుక్కుంటానులే' అన్నాడు.

'డబ్బు వృధా చేసుకోకు. బియ్యం కొనుక్కుని మూడు కలిపిన కూర చేసుకుని ఎన్నాళ్లయినా తినవచ్చు.'

'ఎంత డబ్బమ్మా, కొద్దేగా...'

అతని దీనస్థితిని చూచి కరుణించి వంటిన ఉన్న బంగారు వస్తువులు తీసియిచ్చి, ఆ డబ్బును వృధా చేయవద్దని అమ్మ చెప్తుంటే -- అమ్మనే మోసం చేయడానికి అవలీలగా నిస్సంకోచంగా అసత్యమాడాడతడు. కానీ అమ్మ కోపగించుకొనలేదు.

'నీవు చెప్పకపోయినా బ్యాంకు వాళ్ళు చెప్తారు. ఎంత మొత్తం యిచ్చినదీ. ఇచ్చిన డబ్బుతో బియ్యమూ, ఉప్పూ, మిరపకాయా, చింతపండూ, కట్టెలూ కొనుక్కో...'

అనిచెపుతూ దయాప్రపూర్ణ అయిన అమ్మ - మృదువుగా అడిగింది-

'నీకు చేసి పెట్టటానికి ఎవరయినా ఉన్నారా?'

'ఎవరూ లేరమ్మా. నేను వేదాంతంలో పడి భార్యనూ పిల్లలనూ వదిలేసి ఒక గురువుగారిని ఆశ్రయించాను.'

'సరే - అని అన్నీ రేపు చెపుదువుగానిలే. డబ్బు జాగ్రత్తగా వాడుకో. అందులో నేనేమీ మళ్ళీ తీసుకోనులే.'

అమ్మకు డబ్బును గురించి ఎంత జాగ్రత్త! ఆధ్యాత్మిక విషయాలలో ప్రతి చిన్న విషయం గురించి ఎంత శ్రద్ధ తీసుకుంటుందో, ప్రాపంచిక వ్యవహారాలకూ అంత విలువనూ యిస్తుంది అమ్మ - ఆధ్యాత్మిక మనీ, ప్రాపంచిక మనీ అమ్మకు భేదం లేదు కనుక!

'ముసలివాడివి - రాత్రిళ్ళు జాగ్రత్త! తేళ్ళూ పాములూ తిరుగుతుంటాయి.'

అమ్మ యింటికి వచ్చి కొంచెం సేపు మేడమీద కూర్చుని మళ్ళీ మఱ్ఱి చెట్టు వద్దకు బయలుదేరింది. దారిలో చిదంబరరావుగారు కనుపించి -

'ఎక్కడకమ్మా?' అని అడిగారు.

'ఏలూరు కాంతమ్మగారింటికి.'

సత్యస్వరూపిణి అయిన అమ్మ అసత్యమాడేసి చిన్నగా నవ్వుకుంటూ ముందుకు సాగింది.

'తొందరగా రామ్మా! మీ నాన్న మన్నవ నుంచి యీ బండికి ఏమ యినా దిగాడా?'

'లేదు.'

'నీ కోసం నేను వచ్చేదా? నీవే వస్తావా?'

'నా కోసం మీ రేమీ మానుకోవద్దు. నా కవసరమయితే నేనే వస్తాను.'

అమ్మ మఱ్ఱిచెట్టు క్రిందకు వెళ్ళింది. అంతకు ముందే పోలీసు లిరువురూ అక్కడకు వచ్చి ఉన్నారు. ఆ రెండో పోలీసు పేరు - అంకదాసు.

వారిరువురూ రోజూ అమ్మను ఆ మఱ్ఱిచెట్టు క్రిందనో, రైల్వేస్టేషన్‌కు

అవతలగా ఉన్న అద్దంకివారి తోటలోనో కలుసుకునేవారు. వారికి మొదట అమ్మ చెప్పినమాట 'మారు మాటలేని - మాట' మంత్రమయింది. వారు దానిని మనఃపూర్వకంగా అనుష్ఠించడం ప్రారంభించారు. అంటే వృత్తి ధర్మాన్ని నిష్ఠగా అనుసరించ నిశ్చయించుకున్నారు.

ఒక రోజున మస్తాను 'అమ్మా! ఈ వచ్చీరాని మాటలతో మాకు నీతి నిజాయితీ వ్యక్తపరచి, ధర్మం బోధించి మమ్మల్ని తరింప జేయడానికి వచ్చావా అమ్మా!'

అంటూ వివశుడై గద్గద స్వరంతో--

'నాకు సమయం వచ్చే - నా మనసు నీ మెడలోని పులిగోరు మీదకు పోయింది.'

' ఆ నీతి నిజాయితీయే దేవుడు.'

ఆ పోలీసులిద్దరూ ఆశ్చర్యంగా అమ్మవంక చూచారు.

'ఔను.' అమ్మ స్థిరపరచింది.

'మేము తప్పక దేవుని ఆరాధిస్తాము..' వారిద్దరూ అమ్మ పాదాలు తాకి ప్రమాణం చేశారు.

ఆ రాత్రి వారిద్దరూ తొమ్మిది గంటల సమయంలో అమ్మను యింటి వద్ద దించి పరవశమయిన మనసులతోనూ పులకెత్తిన శరీరాలతోనూ యిళ్ళకు వెళ్ళారు.

అమ్మ యింటికి వచ్చేటప్పటికి చిదంబరరావుగారు భాగవతపఠనం చేస్తూ అమ్మ రాకను గమనించలేదు. అమ్మ సరాసరి మేడమీదకు వెళ్ళి తాటాకు చాపమీద పడుకున్నది.

రాత్రి 10 గంటలకు చిదంబరరావుగారు మేడమీదకువచ్చి దీపం ముందు బాదమాకులు పోసుకుని విస్తళ్ళు కుట్టటం ప్రారంభించారు. అంతలో అమ్మ లేచి వచ్చి ఆకులు తొడిమలు తీసి అందిస్తూ ఉండగా అమ్మను తేలు కుట్టింది.

చిదంబరరావుగారు గబగబా లేచి తేలును వెదికారు. ఆకులలో కనిపించింది.

'తాతగారూ! తేలు నాకు కనబడలేదేమి?' అని అమ్మ అడిగింది.

'అన్ని ఆకులలో ఏమి కనబడుతుంది? అందులో కీనీడ...'

'కీనీడ అంటే ఏమిటి, తాతగారూ?'

'దీపం చుట్టూ చీకటేగా, దానినే కీనీడ అంటారు..'

'చీకటి పోగొట్టే దీపం చుట్టూ చీకటా? వెలుతురు కాధారం చీకటా?' అమ్మ ఫకాలున నవ్వింది.

చిదంబరరావుగారు వరండాలో మంచం వేసి అమ్మను పడుకో మన్నారు. అమ్మ వెళ్ళి పడుకున్నది. పైకి చూచింది. చంద్రుడు దినదినమూ క్షీణిస్తూ కనుపించాడు. వెంటనే చిదంబరరావుగారిని కారణం అడిగింది.

'వచ్చేది అమావాస్య కదా...'

'జగత్తును చల్లని వెన్నెలతో నింపివేసే చంద్రునికి కూడా కృష్ణపక్షమా? క్షీణదశా? ఎవరికీ నిరాటంక అభివృద్ధికి అవకాశంలేదా? ఉచ్ఛ నీచ దశలు అనివార్యమా?'

అమ్మ ప్రశ్నమీద ప్రశ్న వేస్తుంటే - చిదంబరరావుగారు ఆశ్చర్యంగా వింటూ మంచం మీదకు వచ్చి కూర్చుని అమ్మ పాదాలు ఒడిలో పెట్టుకొని...

'అమ్మా అన్నం తిన్నావా?' అని అడిగారు.

'అన్నం పుట్టినందుకు తింటారా? తినేందుకు పుడతారా?'

'పుట్టినందుకే తింటారమ్మా. పుట్టినవాడల్లా తినాలిగా?'

'మరి అమ్మ పోయినప్పుడు 'దాని అన్నం లేదు భూమి మీద. పోయిం' దంటిరే. అన్నం ఉంటేనేగా వచ్చింది. అన్నం వుండడమంటే ఎక్కడ నుండి తెచ్చుకుంటుంది?'

'భగవంతుడు వారి కర్మకొద్దీ పెడతాడమ్మా.'

'వారికి కర్మ ఎక్కడ నుండి వస్తుంది?'

'చేసిన దానిని బట్టి-'

'ఎవరు చేసింది?'

'మనం చేసుకున్న దానిని బట్టి మనకు వస్తుంది.'

'భగవంతుడేమీ అంటనివాడు.'

'అన్నీ చేసేవాడు - వాడికే అంటకపోతే మనకేమి అంటుతుంది?'

'అన్నీ చేసేవాడు కనుకనే అంటదు.'

'అంటనట్లు ఋజువేమిటి? అసలు వాడు ఎట్లా ఉంటాడు?'

చిదంబరరావుగారు పకపకా నవ్వి-

'ఎట్లా ఉంటాడా... నీవల్లే వుంటాడులే పడుకో---'

చిదంబరరావుగారు యిక సంభాషణ సాగించలేక పోయారు. అమ్మ కూడా నవ్వి అడిగింది.

'నా వల్లే అంటే పొట్టిగానా? చిన్నగానా? గౌను వేసుకుంటాడా?'

ఇంకా యీ ప్రశ్నలు కొనసాగనిస్తే తన ఓటమిని ఎక్కడ ఒప్పుకొనవలసి వస్తుందోనని చిదంబరరావుగారు...

'అన్నీ రేపు చెపుతాలే. నిద్ర పట్టించుకో అమ్మా.'

- అని వెళ్ళిపోయారు. కానీ అమ్మకు నిద్ర పట్టలేదు.

మరునాడు అమ్మ మామూలుగా మఱ్ఱిచెట్టు క్రిందకు వెళ్ళింది. అక్కడ పోలీసులు లేరు. అద్దంకివారితోటకు బయలుదేరింది. దారిలో వారిద్దరూ కలిశారు.

తోటలోకి వెళ్ళగానే మస్తాన్ తన పై ఉత్తరీయం తీసి నేలపై పరిచాడు. అమ్మ కూర్చున్నది. మస్తాన్ మహమ్మదీయ ఆచారంలో నమస్కారం చేశాడు. అంకదాసు సాష్టాంగ నమస్కారం చేశాడు.

వారు తెచ్చిన పంచదారబూంది అమ్మ చేతిలో పెట్టారు. అమ్మ

పొట్లాలు విప్పదీసింది. ముగ్గురూ కొంచెం సేపు మౌనంగా కూర్చున్నారు. మస్తానూ, అంకదాసూ కళ్ళు మూసుకుని ధ్యాననిమగ్నులై అయిదు నిమిషాల తర్వాత కళ్ళు తెరిచారు. పొట్లాములో బూంది లేదు. ముసలమ్మ దానిని తినినట్లు వారిద్దరికీ కనిపించింది. వారికి భయమూ ఆనందమూ రెండూ కలిగాయి. వాటితోపాటు దుఃఖమూ ఆవేశించింది.

అంకదాసు అమ్మ పాదాలమీద వాలి శోకరుద్ధ కంఠంతో-

'ముసలమ్మగా కనిపించా వెందుకమ్మా? అసలు నీ వెవరమ్మా?' అని వేడుకున్నాడు.

'నాకేమీ తెలియదు నాన్నా, మీరు కళ్ళు మూసుకున్నప్పుడు ఎవరైనా ముసలమ్మ వచ్చి తిన్నదేమో...'

వారి కనులకు అమ్మ గంతలు కట్టే ప్రయత్నం ఆరంభించింది.

'నిజమే-తిన్నది నీవు కాదు; ఒక ముసలమ్మే. కానీ ఆ ముసలమ్మ రావడమూ, వెళ్ళడమూ రెండూ చూడలేదు. మరి, ఆ ముసలమ్మ ఎవరు?' - అని మస్తాను సందిగ్ధంలో పడ్డాడు.

'ముసలమ్మ ఎవరో కాదు; అమ్మే-!' అంకదాసు నమ్మకం అది.

'అమ్మ నే నెరుగ నంటుంటే మనం అమ్మేనంటే ఎట్లా? అమ్మ అబద్ధమాడుతుందా?'

'అమ్మ మనసు మోసం చేస్తున్నది.'

'అమ్మకు మోసం తెలుసునా?'

'పోనీ మాయ కప్పుతున్నది.'

'అది దైవలక్షణం.'

'అయితే, అమ్మ దైవమేనేమో. లేకపోతే, యీ అయిదు సంవత్సరాల పిల్ల చూట్టూ మన మీ తిరగడమేమిటి? ఈ స్వల్పకాలంలో మనకీ అనుభవా లేమిటీ?'

అంకదాసులోని అభిప్రాయం క్షణక్షణానికీ బలపడుతున్నది.

'అమ్మ దైవమవునో కాదో కానీ, అమ్మ కనపడ్డప్పటి నుంచీ నాలో పెద్ద మార్పు వచ్చింది. ఏనాడూ ఎవరికీ దణ్ణం పెట్టని నాకు పదేపదే దణ్ణం పెట్టబుద్ధి పుడుతున్నది. లోగడ అన్నీ తప్పుడు పనులే చేసేవాడిని; ఇప్పుడు వాటిమీద విముఖత కలిగింది. సంసారమన్నా, భార్య అన్నా, సంతానమన్నా విసుగువస్తున్నది. ఎప్పుడూ అమ్మనే చూస్తూ కూర్చోవాలనిపిస్తున్నది. అమ్మ ఎప్పుడూ మనవద్దనే ఉండదాయే. మనం ఎక్కడుంటే అక్కడ అమ్మ ఎట్లా కనబడుతుంది?'

'మన మనేది పోయి అంతా అమ్మ అయితే...'

'అంతా అమ్మ అయితే యిక అమ్మను చూసేదేమున్నది? అంతా అమ్మ అయితే - మరి ఆనందానికి తావెక్కడ? అమ్మ అమ్మగానూ మనం పిల్లలుగానూ ఉన్నప్పుడే ఆనందం. ఇదే పెద్దలు చెప్పే జీవన్ముక్తి లక్షణం. ఇదే భక్తి.'

అమ్మ ఆ సంభాషణతోనూ, వారిద్దరితోనూ ఏమీ సంబంధంలేనట్లు నిర్వికారంగా కూర్చున్నది.

వారి ఆలోచనల్లో మాటల్లో ఎప్పుడు ప్రొద్దుక్రుంకిందో కూడా వారు గమనించలేదు. కాని చూట్టూ ఎటు చూచినా చీకటి చిక్కగా ఉన్నది. వెంటనే అమ్మను తీసికొని బయలుదేరారు.

దారిలో రైలు పట్టాల కివతలగా పది గజాల దూరంలో ఒక ముసలి వాడు ఎదురుపడి ఎగాదిగా అమ్మవంక, వారిద్దరివంక చూచి, అమ్మను తెరిపార చూచి అమ్మ పాదాలపై సాష్టాంగ పడ్డాడు. ఎంతసేపటికీ లేవలేదు.

అమ్మపాదాలపై బరువుగా వుంటుందేమోనని - మస్తాను అతనిని రెక్క పట్టుకుని లేవతీశాడు. ఆశ్చర్యం! అతనిలో చలనం లేదు. నోటివెంట నురుగు చారలున్నాయి. శరీరమంతా చల్లగా ఉన్నది. నాడి చూచాడు: అందలేదు. అతడు చచ్చిపోయినట్లు నిశ్చయించుకున్నాడు.

'ఇది వరకు యితనిని ఎరుగుదువా, అమ్మా?' మస్తాను అడిగాడు.

'నిన్న అతను భిక్షాటనకు వచ్చినప్పుడు యిద్దరమూ కలసి బజారుకు వెళ్ళాము. అదే పరిచయం.'

'ఆ పరిచయమే యీ అదృష్టానికి మూలం. ధన్యుడయ్యాడు. నీ పాదా లపై ప్రాణాలు వదిలాడు.'

మస్తాను అమ్మతో అని అంకదాసు నుద్దేశించి.. 'అమ్మ ఆజ్ఞ యిస్తే- జరగవలసినది జరుపుతాము...'

'అప్పుడే 6-30 అయింది. ఉన్నది మీరిద్దరు. త్వరగా చేయండి. ముందు మీరిద్దరూ వెళ్ళి కట్టెలు కొనుక్కురండి. ఈలోగా నేను యింటికి వెళ్ళి కనిపించి వస్తాను. ఒక వేళ రాలేకపోతే ఏమి చేయాలో అది మీరే చేయండి.'

'నీ పాదాలపై ప్రాణం విడిచినందున యితని శరీరం కూడా ముక్తి పొందిందమ్మా. పూర్వం పురాణాల్లో లేని విశేషాలు నీచరిత్రలో కనపడాలమ్మా - కనపడుతూనే ఉన్నాయనుకో దుష్టశిక్షణలేని అవతారం. అందరికీ రక్షణే!'

'శిక్షణ కూడా రక్షణే నాయనా!- నేను వెళ్ళివస్తా.'

'త్వరగా రా అమ్మా?'

అమ్మ బయలుదేరే ముందు - 'నీవు లేకున్నా నిన్ను గుర్తించడానికి నీవు ధరించిన ఆకృతి ఉన్నది' అంటూ శవాన్ని ముద్దు పెట్టుకున్నది.

అమ్మ యింటికి వెళ్ళేటప్పటికి అందరూ భోజనం చేస్తూ ఉన్నారు. వెళ్ళగానే అమ్మ కూడా లేచి తనకు పెట్టిన అన్నం తీసుకువచ్చి మామూలుగా పెట్టే పందికి పెట్టి దొడ్డివాకిలిన పరుగెత్తింది.

శవం వద్ద ఎవరూ లేరు. అమ్మ వెళ్ళి శవాన్ని నిమురుతూ కూర్చున్నది. మస్తానూ, అంకదాసూ కట్టెలు తీసుకువచ్చి-చూస్తూ నిలుచున్నారు.

అంతలో శవం కదలినట్లయింది. ఆశ్చర్యంగా కళ్ళు నలుచుకు చూచారు.

'అమ్మా! తాత కదలినట్లున్నాడే' మస్తాను సంశయం వెలిబుచ్చాడు.

'కదిలేది కదలదా నాయనా?'

'ఏమిటమ్మా యిది? మాది యిందాకటిది భ్రమా? ఇప్పటిది భ్రాంతా? లేక చంపి బ్రతికించావా? - ఏమిటమ్మా?' మస్తాను సందేహంతో సతమత మయ్యాడు.

అమ్మ ఏమీ మాట్లాడలేదు.

'చావు కాదేమో, సమాధియేమో...' అంకదాసు ఊహించడ మారంభించాడు.

'-సమాధి అంటే..'

'..అంటే బాహ్యస్మృతులు తప్పి పరమాత్మలో లగ్నం కావటం.'

'అంటే అమ్మ తనలోకి పిలుచుకుని తిరిగి బయటకు పంపించిందన్న మాట.'

'మనం ఎన్ని అనుకుంటున్నా అమ్మ మాట్లాడడంలేదు.'

'అమ్మ విధానమే అట్లా ఉన్నది. చచ్చిపోయాడంటే చచ్చిపోయాడన్నది. సంస్కారం చేస్తామంటే కట్టెలు తెమ్మన్నది.'

అంకదాసు కొన్ని క్షణాలు ఆలోచించి అమ్మను అడిగాడు-

'అమ్మా! ఈ సంఘటన కర్థమేమిటమ్మా? ఆ ముసలి వానిమీద ప్రేమ వలన, చచ్చిపోయినా బ్రతికించావా? అతని చేతన స్థితిలో మార్పు లేకపోయినా భ్రమలు కలిగించి, మాకేమీ తెలియదని తెలియజేస్తున్నావా? లేక- చనిపోయిన అతనిని పునర్జీవుని చేయడం ద్వారా మాలో విశ్వాస జ్యోతిని వెలిగిస్తున్నావా? లేక మరేమయినా ప్రయోజనం ఉద్దేశించావా?'

మస్తాను మనసులో కూడా అలలు అలలుగా ఏవేవో భావాలుద్భ వించాయి.

'ఇతడు ఏమీ తెలియనివాడు; ఏమీ సాధన చేయనివాడు. ఇతడు యాచించింది ముష్టికాని ముక్తికాదు. ఉదరపోషణకు తంటాలుపడే వాడికి ఉత్తమగతులా? ఎంతటి భాగ్యం; భాగ్యమన్న పదం యిందుకు తగదు. మరేమనాలి? ఏమో.. ఏమో...?'

మస్తాను మాటలు అంకదాసు చెవి దూరలేదు. అతడు మరో లోకంలో ఉన్నాడు. అతని దృష్టి అమ్మ వంకనేగానీ, అతడు అవలోకించింది - కొండలూ, కోనలూ, అడవులూ, అంభోధులూ, నదులూ, నిధులూ, మనుషులూ, జంతువులూ, పక్షులూ, పురుగులూ... ఎన్నో ఎన్నెన్నో.

అతని శరీరం జలదరించింది. మనసు వివశమైంది. క్రమేణా దృశ్యం అదృశ్యం అయింది. మనసు మామూలై ఆలోచన అరంభమయింది. కృష్ణుడు యశోదకు చూపిన దృశ్యం స్మృతిలో మెదిలింది.

'ఆ కృష్ణుడే యీ అమ్మా?' అన్న ప్రశ్న అతని మనసులోనిదయినా...

'నిజమేనా అమ్మా? నిజమేనా?' అని పెద్దగా అరిచాడు.

అమ్మ ఎప్పుడు చెప్పింది కనుక యీసారి మాత్రం చెబుతుంది? అతడే మళ్ళీ...

'నీవెవరో చెప్పమ్మా? ఎఱుక చెయ్యమ్మా' అని అరిచి అరిచి...

'ఆ! - ఎఱుక అయింది. ఆ ఎఱుకే నీవు. ఆ నాటి కృష్ణుడే యీనాటి అమ్మ. అవతారాలు వేరుకావచ్చు కాని శక్తి ఒకటే; లక్షణాలు ఒకటే సందర్భాలూ, సంఘటనలూ భిన్నం కావచ్చు కాని ప్రయోజనం ఒకటే.'

కొన్ని క్షణాలు మౌనంగా ఉండి, ఆలోచనలో మునిగిపోయి ఒక సుదీర్ఘమయిన నిశ్వాసం వదలి...

'దయామయీ! ఈ అల్పునిపై యింత కరుణ ఎందుకమ్మా! నేను చాలా దుర్మార్గుడినమ్మా. నేనే నాడూ భగవంతుని పూజించలేదు. దైవ చింతనయినా లేదు, భక్తి అంటే ఏమిటో తెలీదు. మరి, నాపై అవ్యాజమయిన యీ దయామృతవర్ష మేమిటమ్మా! ఈ అద్భుత దర్శన మేమిటమ్మా? భక్తి లేనివారి కయినా ముక్తి ఉన్నదని చెబుతున్నావా? యోగ్యతా యోగ్యతల ప్రసక్తి లేదని నీ భావమా? పతితులూ పరమ దుర్మార్గులూ కూడా పరుసవేదిలాంటి నీ దివ్యస్పర్శలో పావనులౌతారా-ఏమమ్మా మాట్లాడవేమమ్మా? పలుకవమ్మా...'

అని అమ్మను ప్రశ్నిస్తూ ప్రాధేయ పడ్డాడు.

అంకదాసు మాటలు వింటూ ఉన్నాడు. కాని మస్తానుకు తనలోని జీవం లేచి అమ్మలో లీనమవుతున్నట్లుగా, నీటిలో వేసిన మట్టిగడ్డలా తాను కరిగిపోతున్నట్లుగా ఉన్నది.

కొన్ని నిమిషాలు అట్లా గడిచిన పిమ్మట అంకదాసు అమ్మపాదాల

మీద నుంచి లేచాడు. మస్తాను అమ్మను అడిగాడు...

'అజ్ఞానులకు జ్ఞానం ఎట్లా కలుగుతుంది?'

' మీకు కలిగినట్లుగానే...'

'మాకు నీ దయవల్ల కలిగిందమ్మా.'

'అందరికీ ఒకరి దయవల్లనే. జ్ఞానమూ, అజ్ఞానమూ... రెండూ.'

అంతలో ముసలివాడు లేచి కూర్చున్నాడు. అంకదాసు ఆనందమూ, ఆశ్చర్యమూ పట్టలేక అడిగాడు...

'తాతా? ఏ సంజీవితో నీవు బ్రతికావు?'

'అమ్మే సంజీవి. జీవన సంజీవని'- అని మస్తాను అమ్మవంక చూచాడు.

అమ్మ ఆ ముసలివాని వీపు నిమురుతూ...

'నాయనా మంచినీళ్లు త్రాగుతావా?' అని అడిగింది.

అతడు బలవంతాన కన్నులు తెరిచి, హీనస్వరంతో...

'ఇంకేమీ వద్దమ్మా, ఈ అనుభవం చాలు. అమ్మా! ఎంత విచిత్రమయిన అమ్మవమ్మా!' అని అమ్మ రెండు పాదాలూ గట్టిగా పట్టుకుని ఆవేశపడుతూ...

' నీ విచ్చిన డబ్బు కూడా నా కవసరం లేదు. కొంత ఖర్చయింది. అదీ ఒక తప్పు చేయడానికి...'

' తప్పు చేశావా?'

'నీకు తెలియదా అమ్మా! అందుకే యిచ్చి వచ్చావుగా. త్రాగి మాంసం తినాలని కొనుక్కున్నానమ్మా. చేసుకోవటం చేతకాక పారవేసుకున్నాను.'

'నాయనా నా దగ్గరకు తెచ్చుకోలేక పోయావా - చేసిపెట్టే దాన్ని. పచ్చిది కూడా తినవచ్చు కదా - ఎందుకు పారవేసుకున్నావు? నాకు తెచ్చి పెట్టక పోయవా - నేను తినేదాన్ని.'

అని అమ్మ అంటూ వుండగానే, అమ్మ చేతిలో కనుపించిన మాంసపు

ముక్కను చూచి ఉలిక్కిపడి అంకదాసుమీద పడ్డాడు. అంకదాసు అతనిని పట్టుకు కూర్చోబెట్టి...

'ఎవరి అనుభవం వారిది. ఒకరికి ఇచ్చిన అనుభవం మరొకరి కివ్వదు. ఎదురుగుండా ఉన్నా ఏమీ కనుపించదు.'

అని మస్తానుతో అని ఆ ముసలివాని నుద్దేశించి...

'తాతా అసలు ఏమి జరిగింది?' అని అడిగాడు.

'చీకట్లో వస్తుంటే. దారిలో త్రాచుపాము కాటు వేసింది. మంత్రం వేయించుకుందామని స్టేషనుకు పోదామనుకుంటూ ఉండగా అమ్మ ఫలానా చోట ఉన్నదని వినిపించింది. ఇక్కడకు బయలుదేరాను. దీపం చూస్తే ప్రమాదమనీ, చీకటిలో దారి కనిపించకనూ యాతన పడుతుంటే - దీపం లేకనే దారి కనుపించింది. సరాసరి అమ్మ వద్దకు వచ్చాను. ఆ తర్వాత మీకూ తెలుసు.'

'అసలు యిందుకు మొదలెక్కడ తాతా?'

'నిన్ననే అమ్మ దర్శనమయింది; దయ చూపింది. కాని నేనే పాపిష్టి వాడిని. పాడుపని చేశాను. అదీగాక అప్పుడే అమ్మ హెచ్చరించింది. పాము కరుస్తుందని. కాని నేను నమ్మలేదు. రాత్రి నేను చనిపోయినట్లును అమ్మ బ్రతికించినట్లును కల వచ్చింది. అప్పుడూ నేను అమ్మను అర్థం చేసుకోలేదు. కానీ- మూఢుణ్ణీ అమ్మ కరుణించింది. అమ్మకు ప్రేమించడమూ కరుణించడమూ సహజం కాని మన అర్హతను బట్టి కాదని ఇప్పుడు తెలుసుకున్నాను.'

ఆ ముసలివాని కథనూ వ్యధనూ వింటున్న మస్తానుకు తన గత జీవితం యావత్తూ ఒక్కసారి వచ్చి కనులముందు నిలుచున్నది. దుఃఖం పొంగి పొరలింది. ఆవేశం అణచుకోలేక...

'నీవే అట్లా అనుకుంటే ఎట్లా? నీవు మంచిపనులు చేయక పోయినా చెడ్డపనులు చేసి వుండవు. నేను చేసినవన్నీ పాపాలే. చేసుకున్న భార్యను అగచాట్లపాలు చేశాను. తమ్ములను అన్యాయం చేశాను. మరి, నేను ఏమి

పుణ్యం చేశానని అమ్మ నాకు కనుపించింది? నేనేమి భక్తుడనని అమ్మ నన్ను కరుణించింది? - అమ్మకు మన మంచి చెడ్డలతో నిమిత్తం లేదన్నమాట. అదీగాక అన్నీ అమ్మే చేయిస్తున్నప్పుడు యిక మనం చేసే పాపమేమున్నది. ఒక వేళ మనం పాపం చేసినా అమ్మ దర్శనమయిన తర్వాత దానికి స్థానమేది? సూర్యోదయం అయిన తర్వాత చీకటి ఉంటుందా?'

శోకోధృతం వలనా, భావావేశం వలనా మస్తాను కంఠం రుద్ధ మయింది.

సజల నయనాలతో ప్రక్కన నిలుచున్న అంకదాసు పెద్దగా 'లీలావతీ! లీలావతీ!' అని కేకలు వేశాడు.

'నా పేరు అనసూయ నాయనా...'

'లోకంలో యిన్ని పేర్లు ఉండగా ఆ పేరునే నీవు ఎందుకు కోరు కున్నావమ్మా? ఆ పేరుకు అర్థమేమిటమ్మా?'

అమ్మ ఏమి చెపుతుందోనని ముగ్గురూ అమ్మ వంక చూస్తూ ఉన్నారు. తెల్లచీర కట్టుకుని తెల్ల రవిక తొడుక్కుని సొమ్ములూ ముఖాన బొట్టు కూడా లేకుండా తల విరబోసుకుని పద్మాసనం వేసుకుని అమ్మ కనుపించింది.

'రాగద్వేషాసూయలను పారద్రోలేదే అనసూయ; అదే అనసూయత్వం; ఈ అనసూయతత్వం.'

అంకదాసుకు అర్థంకాక మళ్ళీ అడిగాడు. ఇంటికి వెళ్ళిన తర్వాత తాను చెపుతానన్నాడు మస్తాను.

'అమ్మనే చెప్పనీయవోయ్. నీవు చెప్పినా యిట్లా ఉండదు. ఆ ధ్వని మధురం. ఆ తత్వమే అమ్మ అయి వివరిస్తుంది. కనుక అర్థం కావటం సులభం.'

'ఈ వివరణ చాలా అందంగానూ, ఆనందంగానూ ఉన్నదమ్మా.'

అని మస్తాను అంటూ ఉండగా ఆ ముసలివాడు...

'అమ్మోయ్!' అని అరిచాడు.

'ఏమిటి?' అన్నది అమ్మ నెమ్మదిగా.

'పాము! పాము! నిన్ను చుట్టేస్తున్నది. కరుస్తుంది... కరుస్తుంది' అని గాభరాగా అరిచాడు.

భయం వలన మనసు చెడిపోయిందని - వారిద్దరూ భావించారు.

తాతకు - ముందు పాము అమ్మను చుట్టేస్తున్నట్లూ తర్వాత అమ్మ పాము రూపంగా మారిపోయినట్లునూ కనబడ్డది. ముఖం మాత్రం మామూలు గానే ఉన్నది. వెంటనే అతనికి భయం తగ్గి భక్తి కలిగి-

'నీవు సాక్షాత్తు దైవానివే నమ్మా!' అన్నాడు.

ఆ మాటలు విన్న అంకదాసు మస్తానుతో అన్నాడు.

'అతడు ఏమి చూస్తున్నాడో మనకు కనపడడం లేదు. నీకు కలిగిన అనుభవాలు నాకు లేవు. నా అనుభవాలు నీకు లేవు. మొదటి రోజున అమ్మ వయస్సుకు మించిన చురుకుగా కనుపించింది. ఆ మరురోజున అసాధారణ వ్యక్తి అనిపించింది. క్రమేణా దైవత్వం ప్రస్ఫుటమయింది. ఇంతకూ నేననేదే మిటంటే... అమ్మ దగ్గరకు తలా ఒక కారణంతో చేరినా అనుభవాలు వేరయినా ఫలితం ఒకటే.'

'మనం, చూడకపోయినా భావి ప్రపంచం అమ్మ దివ్యలీలలు పూర్తిగా చూడగలుగుతుంది. లోకంలో ప్రతి ఒక్కడూ అమ్మను దైవంగా గుర్తించి తరించాలని నా ఆశయం.'

అని కోరుకున్న మస్తానుతో అంకదాసు అన్నాడు-

'అమ్మ అనుకుంటే ఎందుకుకాదు? అమ్మను గుర్తించటానికయినా తరించటానికయినా అమ్మ అనుగ్రహమే కదా కారణం. ఇంకో తమాషా చూచావా! అమ్మ యిదంతా ఒకసారిగానే చూపిస్తే మనం ఏమయ్యే వాళ్లమో- అందుకే గుజ్జనగూళ్లు పెట్టినట్లు చేసింది.'

'కాదు, కాదు, పుట్టగానే వేలు నోట్లోపెట్టి ఆముదం కుడపటం నేర్పుతారు. గుజ్జనగూళ్లదాకా పోయావే? అదే స్థితి మనది' - అని మస్తాను చెప్పాడు.

తాతకూ మనసులో అనేక ఆలోచనలూ... అమ్మ తనకు పాముగానే ఎందుకు కనుపిస్తున్నది? ఇందాక పాపై ఎందుకు కరిచింది? వారు తన ప్రక్కనే ఉన్నా తనకు కనుపించినట్లు వారి కెందుకు కనుపించలేదు? తనలో కలిగే భయమూ ఆనందమూ రెండూ వారికి కలుగుతున్నట్లు లేవు. దీనికి కారణమేమిటి? తనకు కనుపించేది నిజం కాదా?

అదే విషయం అమ్మను అడిగాడు, అమ్మ చెప్పింది...

'నీకు ఏది తోస్తే అది నిజం నాన్నా, నీకు కనపడ్డదాన్ని బట్టేగా నీకు తోచేది. నీకు కనుపింప జేసేదీ, నీకు తోచేదీ, నీవు చెప్పేదీ - అన్నీ ఒకటే.'

ఆ మాటల సారం అతనికి బోధపడినా, పడకపోయినా-ఆనందంగా శిరఃకంపన చేస్తూ-

'ఎప్పుడూ యిలా పాముగానే దర్శనమీయమ్మా! మరొక రూపంతో కనుపించినా గుర్తించలేనేమో.'

వెంటనే మస్తాను అన్నాడు-

'అదేమిటోయ్! అప్పుడు ఆ శక్తి యిచ్చే ఆ దర్శనమిస్తుంది.'

'ఇప్పుడు అమ్మ చెప్పినది అన్నీ అమ్మేననా? చెప్పేదీ, చేసేదీ, చూసేదీ - అన్నీ అమ్మేననా?' అని అంకదాసు అడిగాడు.

'దానినే మనోవాక్కాయ కర్మలా అంటారు' అని మస్తాను చేర్చాడు.

'ఇటీవల స్థానాచార్యులుగారు యీ మూటి గురించీ చాలా వివరించారట' అన్నది అమ్మ.

మస్తాను అమ్మ మాటలకు అడ్డు వచ్చి అన్నాడు...

'అవి యింత వివరంగా ఎందుకుంటయ్యమ్మా? నీవు మూడు మూడు చేసి, మూటిని ఒకటిచేసి, ఆ ఒకటీ ఏమిటో చెప్తావు! చూపిస్తావు. అది మరెవరికి సాధ్యమవుతుంది? అది నీ సొమ్ము.'

'సొమ్ము ఏమిటయ్యా? సొమ్ము అమ్మ కాదూ?' అంకదాసు కసురుకున్నాడు.

'అవును. మాటల్లోకి వచ్చేటప్పటికి తొట్రుపాటు వస్తూనే ఉంటుంది.' మస్తాను సిగ్గుపడ్డాడు.

అప్పటికే తెల్లవారవచ్చింది. అమ్మ లేచి యింటికి బయలు దేరి - చెప్పింది -

"నేను రేపు మన్నవ వెళుతున్నాను. ఎప్పుడు వస్తానో. నేను ఎక్కడ ఉన్నా మీ అమ్మ మీకే ఉన్నది - తాతను చేయి పట్టుకొనండి.'

'ఇకను కనపడవా అమ్మా!' అంకదాసు బావురుమన్నాడు.

'ఏడుపెందుకు? ఎక్కడున్నా అమ్మ ఉన్నదిగా-' మస్తాను ధైర్యం చెప్పాడు.

'అంతటా ఉన్న అమ్మ - వెళ్ళి వస్తానంటున్నది-'

'రూపం పరిమితం కానీ శక్తి అనంతం.' మస్తాను ఆ మాట అంటుండగానే ఒక్కసారిగా అన్ని దిక్కులూ అరుణోదయ కాంతితో వెలిగి పోయాయి.

'దీనినే జీవన్ముక్తి అంటారు. అంటే జీవముండగానే ముక్తి పొందడం' అని అంకదాసు వివరణ ప్రారంభించబోతుంటే-

'దీని వివరణ చెప్పేదిగాదు. అనుభవించేది. ఈ అనుభవం ఎన్ని శాస్త్రాలు చదివితే కలుగుతుంది? మనం అనుభవించేదే నోటితో చెప్పలేక పోతున్నాము కదా?'

'చెప్పేది అనుభావం. తనలో ఉద్భవించేది అనుభవం' - అని చెబుతూ అమ్మ బయలుదేరింది.

తాత దీనవదనుడై అడిగాడు -

'ఇంతకూ నా గతి యేమిటి?' - అని.

'వాళ్ళ గతే నీ గతి. అందరికీ సుగతే-' అమ్మ యిచ్చిన హామీ విని వారు హర్షపులకిత గాత్రులయ్యారు.

వెంటనే మస్తాను జేబులోని కలమూ, కాగితమూ తీసుకొని- 'అందరికీ సుగతి' అని వ్రాసుకున్నాడు.

అమ్మ ఆ మాట అంటుండగా అంకదాసుకు ఒక దృశ్యం కనుపించింది. అందులో అమ్మ అందరినీ ఒడిలో వేసుకుంటున్నట్టుగా ఉన్నది. ఆ దృశ్యం అంకదాసు మస్తానుకు వివరించాడు. అత్యల్ప వ్యవధిలో అనేకాద్భుతాలు చూచిన మస్తాను అందుకేమీ విస్తుపోక అన్నాడు-

'ఆశ్చర్యమేమున్నది? వడేసిలాగి ఒడిలో వేసుకుంటుంది. ప్రపంచమంతా ఆ ఒడిలో వాలాలి. తప్పదు - అమ్మా! తెల్లవారకుండా ఉంటే బాగుండును! అయినా, యిందాక తెల్లవార వచ్చిందనుకుంటే యింత ప్రొద్దున్న దేమిటీ?'

'మనకు ఎంతవరకు చెప్పదలచుకుంటే, అంతవరకూ ప్రొద్దు ఉంటూనే ఉంటుంది.'

అని అంకదాసు అంటూ ఉండగా అమ్మలేచి రెండడుగులు ముందుకు వేసి వెనక్కు వచ్చి చిన్న పరికిణా, చిన్న చొక్కాతో మామూలుగా చిన్నపిల్లవలే తాత చెయ్యి పుచ్చుకుని అన్నది-

'మీరు ముగ్గురూ అటు వెళ్లండి, నేను యిటు వెళ్తుతా.'

'అట్లా ఎందుకమ్మా? నీవు మాతో అయినా రా-లేదా మేము నీతో అయినా వస్తాం' అని అంకదాసు వేడుకున్నాడు.

'మనలాంటి వాళ్ళు యింకా ఎంతమంది ఉన్నారో మూలమూలలా-' అని మస్తాను వారించాడు.

'అవును. ఈ మూడు రోజులకే యింత చరిత్ర జరిగిందే! భూమి మీదకు వచ్చి అయిదు సంవత్సరాలాయె. ఎంతమందిని తరింపజేసిందో-' అని అంకదాసు లెక్కవేస్తుంటే.

'పుట్టుకముందు లేదూ? ఇది తెలిసింది. అది తెలియంది' అని మస్తాను పూర్తి చేశాడు.

'తెలియంది తెలియటానికే నాన్నా..' అని అమ్మ వెళ్లింది.

'ఏమిటి? అమ్మ అవతారమా...' అనుకుంటూ వారు ముగ్గురూ మరొక వైపు వెళ్లిపోయారు.

11. శబ్దమంజరి

పోలీసు లిద్దరినీ, పునరుజ్జీవితుడైన తాతనూ ఒక దిక్కుగా పంపి అమ్మ ఆస్పత్రి ప్రక్కగా వెళ్ళుతుండగా కాంపౌండరు కృష్ణమాచారి కనబడి--

'అమ్మాయ్: ఎక్కడ నుంచి వస్తున్నావు?' అని అడిగాడు.

లోగడ అమ్మమ్మకు జబ్బు చేసినప్పుడు వైద్యం చేసిన డాక్టరుగారి వద్ద ఆయన పనిచేశాడు. అందువల్ల అమ్మను ఎఱిగి ఉన్నాడు.

'మా డాక్టరు గారింట్లో నిన్ను గురించి ఏమిటో వింతగా చెప్పు కుంటున్నారమ్మా. ఇప్పుడెందుకో ఆ మాటలు గుర్తు వచ్చి నిన్ను చూడాలను కున్నాను. అనుకోగానే నీవు కనబడ్డావు."- విస్ఫారిత నయనాలతో అమ్మను చూస్తూ చెప్పాడు కృష్ణమాచారి.

'ప్రొద్దున్నే ఆస్పత్రికి వెళ్ళుతున్నారేమిటి?'

'మీ అమ్మగారి కేసులాంటి కేసు వచ్చింది. రాత్రి ఆ కేసు చేస్తున్నంతసేపూ నీవే గుర్తుకు వచ్చావు. డాక్టరు గారింట్లో నిన్ను గురించి విన్నప్పటి నుండీ నాలో కలిగిన భావాలన్నీ కలిసి రాత్రి నిన్ను ధ్యానింపచేశాయి. ధ్యానమే కాకుండా దర్శనం కూడా అయింది.

'అవును నాయనా! ధ్యాసే ధ్యానం.'

'నాకు ఆధ్యాత్మిక చింతన అంటే చాలా యిష్టమమ్మా. కానీ ఉదరపోషణ నిమిత్తం చేసే యీ ఉద్యోగం వలన సాధనకు ఏ విధమయిన అవకాశమూ లేకుండా పోయింది.'

-అని వాపోయే కృష్ణమాచారితో అమ్మ అన్నది-

'ఆ యోగ్యత కలిగినప్పుడు మీరు చేసే సాధన చతుష్టయ సంపత్తి వలన కలిగే ఫలితమే మన యీ సంభాషణ.'

'అమ్మా! నన్ను కరుణించావమ్మా!' అని ఆ వీధిలోనే అమ్మ పాదాలకు సాష్టాంగ నమస్కారం చేసి యింటికి వెళ్ళి శూలనొప్పి వచ్చి--

'అమ్మా!' అంటూ అంతిమశ్వాస వదిలాడు.

అమ్మ యింటికి వచ్చి సరాసరి లోపలకు వెళ్ళింది. అప్పుడే యింటిలోని వారు నిద్రలేస్తూ ఉన్నారు. పనిమనిషి వాకిలి చిమ్ముతూ ఉన్నది.

'ఎక్కడ నుండి అమ్మాయ్ - వస్తున్నావు?' పనిమనిషి అడిగింది.

సమాధానం చెప్పకుండా అమ్మ లోపలకు వెళ్ళుతుండగా చిదంబర రావుగారు లేచి మేడ దిగి వస్తూ -

'ఎక్కడున్నావమ్మా - నిన్న సాయంకాలం నుంచి కనబడలేదూ-'

'ఏలూరు కృష్ణమూర్తితో ఆడుకుంటూ నిద్రవస్తే వారింట్లోనే పడుకున్నా.'

రాత్రి అన్నం తిన్నావా?'

'ఆకలి వేయలేదు.'

'రోజూ ఆకలిగా లేదని, ఆకలి వేయడం లేదనీ అంటావు. ఆకలి వేయడం లేదా? ఆకలి అని అనుకోవడం లేదా?'

అమ్మ ఒక్క క్షణం ఆగి చిదంబరరావుగారి ముఖంలోకి చూచి జవాబేమీ యివ్వకుండానే సరాసరి వంటయింట్లోకి వెళ్ళి, అంట్లు సరిచేసుకుంటున్న వంటమనిషిని చూచి-

'రాఘవమ్మగారూ- మీకు పనికిరాని అన్నముంటే కాస్త పెడతారూ?'

'పెడతానమ్మా...' అంటూ గిన్నెలు సవరించుకుంటూ-

'నే పెట్టేదేమున్నదీ? తీసుకో- గిన్నెలో ఉన్నది.'

ఒక బాదం ఆకు తీసుకువచ్చి గిన్నెలో అన్నం పెట్టుకుని అమ్మ దొడ్లోకి వెళ్ళింది. రోజూ ఒక వరాహానికి అన్నం పెట్టటం అమ్మ అలవాటు. ఆ రోజు ఆ వరాహం అక్కడ లేదు. ఎక్కడకు వెళ్ళిందా... అని ఆలోచిస్తూ ఉండగా అది వచ్చింది. అమ్మకు క్రిందటి రెండు రోజులూ అంకదాసూ, మస్తానులతో గడిచిపోయాయి. అందువల్ల వరాహానికి అన్నంపెట్టలేదు: కనీసం కనుపించ లేదు. ఆ దిగులూ, దైన్యమూ, ఆర్తీ ఆ కళ్ళల్లో స్పష్టంగా చూచిన అమ్మ వరాహాన్ని దగ్గరకు పిలిచింది. గబగబా అమ్మ పాదాల వద్దకు వచ్చి ముట్టె పాదాలమీద

ఆనించి అఘ్రాణించి కన్నులు పైకెత్తి అమ్మ ముఖం వంక చూచింది. కన్నులు జలజలా స్రవించాయి. జాలిగా, ప్రేమగా, లాలనగా అమ్మ వరాహం వీపు నిమిరి విస్తరి ముందుకు లాగి దగ్గర కూర్చుని అన్నం కలిపి పెట్టింది. ఆకలితో దహించుకుపోతున్న దానిలా వరాహం గబగబా అన్నం తినడం ప్రారంభించింది. అంతలో ఎక్కడ నుంచో పిల్లలన్నీ వచ్చి తల్లి పొదుగులో దూరాయి. కొన్ని పాలు తాగుతూ ఉన్నాయి. కొన్ని వాటిలో అవి ఆడుకొంటున్నాయి. ఒకటి ఎగిరి అమ్మ ఒడిలో కూర్చున్నది.

అంతలో చిదంబరరావుగారు అటు వచ్చి అమ్మను చూచి పరమాశ్చర్యంతో కేకవేసి--

'ఏమిటి? పందులతో ఆడుకుంటున్నావా? నిన్ను కూడా పందిపిల్ల అంటారు.'

'అంటే తప్పేమి ఉంది తాతగారూ - మనం వంట యింట్లో ఉంటాము. అవి పాకీదొడ్లో ఉంటాయి. మనకు వంటిల్లు ఎంతో వాటికి పాకీదొడ్డీ అంతే.'

అంటూ అమ్మ లోపలకు వెళ్ళింది. మన్నవ నుంచి సీతాపతితాతగారు రైలు దిగి అప్పుడే వచ్చారు. అమ్మను చూచి చేతులు చాచారు. అమ్మ తాతగారి చేతుల్లో వాలిపోయింది.

తాతగారు అమ్మను ఎత్తుకుని.

'అమ్మా! మన్నవ పోదాం వస్తావా?'

'మన్నవలో ఎవరున్నారు?'

'మనమే ఉందామమ్మా - ఎవరెందుకూ?'

'అన్నం ఎవరు వండి పెడతారు?'

'ఎవరెందుకమ్మా -మనమే వండుకుందాం.'

15 'తాతమ్మ రాదా?'

తాతమ్మంటే మరిడమ్మగారు. సీతాపతితాతగారి మేనత్త. రంగమ్మ అమ్మమ్మగారి సంవత్సరీకాలకు నిజామాబాద్ నుండి వచ్చింది.

'నీకెందుమ్మా యివన్నీ?'

'నాకు తాతమ్మ కావాలిగా-'

'పోనీలే... నీవు మీ తాతమ్మ దగ్గరుండు-'

అమ్మ ఏమీ మాట్లాడక తాతమ్మవంకా, తాతగారివంకా చూస్తూ ఉన్నది.

'అత్తయ్యా - నీవు వస్తేకానీ అమ్మాయి రాదట. మరి, నీవు వస్తావా?' అని తాతగారు అడిగారు.

తాతమ్మ మూడుతరాల నుండీ తల్లి లేనిపిల్లలకు పరిచర్యలు చేస్తూనే ఉన్నది. విసుగువల్ల కాదు కానీ - ఇప్పుడు కూడా యీ పిల్లలకు తానే బాధ్యత వహించినట్లయితే సీతాపతిగారు యిక పెళ్ళి చేసుకోరనే ఉద్దేశంతో---

'సంవత్సరీకాలకు వస్తాను. బారుకు వుండి వండిపెట్టలేను. నీకు నిండా 40 సంవత్సారాలు లేవు. నీవు పెళ్ళి చేసుకుంటే పిల్ల కాపురానికి వచ్చేదాకా వండి పెడతాను. చేసుకోపోతే యిప్పుడే రాను. ఏడేళ్ళప్పుడు ముండమోసి యీ కాపురాలన్నిటికీ ఎందాక చేస్తాను?'

తాతగారు పెళ్ళికి పూర్తిగా విముఖంగా ఉన్నారు. వారి అభిప్రాయాన్ని తాతమ్మకు స్పష్టపరిచారు.

'ఏమయినా సరే నేను చేసుకోను.'

'ఏమయినాసరే తాతమ్మ లేనిది నేను రాను.'

అంతలో చిదంబరరావుగారు వచ్చి వారివాదన విన్నారు. గతం జ్ఞప్తికి వచ్చింది. రంగమ్మగారు మనసులో మూర్తీభవించింది. కన్నులు సజల మయ్యాయి. విషాదపూరిత కంఠంతో అన్నారు.---

'పదవమ్మా - ప్రస్తుతం పద. అందరం వెళదాం. మన కళ్ళ యెదుట పుట్టి పెరిగిన దాని 'కర్మ' కూడా మనం చూడవలసి వచ్చింది.'

'ఈ సంవత్సరీకాలు కాస్తా అయిపోతే పిల్లల నిద్దరినీ తెనాలి పంపేస్తా...' విసుగుతో, విరక్తితో తాతగారు చేసుకున్న నిర్ణయం వెలిబుచ్చారు.

అమ్మ మరిడమ్మగారి కంఠం కరుచుకుని---

"నేను తెనాలి పోను" అన్నది.

'ఏం చేసేదమ్మా? మన యిద్దరకూ యెడబాటు రోజులు వచ్చినయ్.'

'ముందు నేనూ, మా అక్కయ్యా (అన్నపూర్ణమ్మగారు) వెళతాం. మీరంతా కలసి రెండు రోజులలో రండి...'

అని తాతగారూ, అన్నపూర్ణమ్మగారూ మన్నవ వెళ్ళారు. చిదంబర రావుగారు భోజనం చేసి కోర్టుకు వెళ్ళారు.

అమ్మ వంటయింట్లోకి వెళ్ళి రాఘవమ్మగారిని అడిగింది.

'కొంచెం అన్నం పెడతారూ?'

' ఆ... ఆకులు తెచ్చుకో...'

అమ్మ ఆకులు తీసుకు వచ్చింది. కాని రాఘవమ్మగారు భోజనం చేస్తూ ఉన్నందున అమ్మయే ఆకులో అన్నం పెట్టుకుని దొడ్లోకి పరుగెత్తింది. పడుకున్న వరాహం అమ్మను చూచి ఆనందంతో - ఎవరైనా యింటికి వస్తే ప్రేమతో పలకరించినట్లు దగ్గరకు వచ్చింది.

అమ్మ తాను తెచ్చిన అన్నం దానికి పెట్టింది. అది అన్నం తినకుండా అమ్మ నానుకుని పడుకున్నది. పిల్లలు వచ్చి తల్లిదగ్గర పాలు త్రాగుతూ ఉన్నాయి. అమ్మ ఒక చేత్తో దాని వెన్ను రాస్తూ మరొక చేతితో దానిచేత అన్నం తినిపించింది. అన్నం తిని అది హాయిగా నిద్రపోయింది. తొమ్మిది పిల్లలలో అయిదు నిద్రపోతుంటే - నాలుగు పాలు త్రాగుతున్నాయి. మిగిలిన తొమ్ములకూ పాలు చేపుకుని ఉన్నాయి. అమ్మ చిన్న గ్లాసు తీసుకుని వచ్చి రెండు తొమ్ములు పిండింది. అమ్మ పాలు పిండుతూ వుంటే వరాహం ఎంతో తృప్తిగా, తీసికో మ్మన్నట్లుగా చూస్తూ ఉంది. గ్లాసు నిండిన తర్వాత కూడా తొమ్ములు స్రవిస్తూ ఉన్నాయి. అమ్మ వెంటనే నోరు పెట్టి రెండు తొమ్ముల నుండి రెండు గుటకలు పాలు త్రాగింది.

'అమ్మాయ్! అనసూరీ-'

చిదంబరరావు తాతగారి పిలుపు విని అమ్మ గబగబా లోపలకు

వచ్చింది. తాతగారు ఆంధ్రపత్రిక చదువుకుంటున్నారు.

'ఏమిటి తాతగారూ - పిలిచారు!'

'ఏమీ లేదమ్మా - ఏమి చేస్తున్నావో నని, కూర్చో-'

అమ్మ కూర్చున్నది. తాతగారు పత్రికలో నిమగ్నమై పోయారు.

'ఏమిటి తాతగారూ - అంత దీక్షగా చదువుతున్నారు?'

'ఆంధ్రపత్రిక'

'అంటే?'

'ఆంధ్ర అంటే దేశం...'

'అంటే దేశపత్రికా? పత్రిక అంటే...'

'పత్రం అమ్మా-'

అంటే పచ్చడి నూరుకునేదా?

'ఊం..........'

'అది అక్కడే ఉన్నదీ...' అని తాతగారికి వినపడకుండా చిన్నగా-

'అది అక్కడే ఉన్నది. మీరిక్కడే ఉన్నారు...' అంటూ నవ్వింది.

తాతగారు ఆ మాటలూ, నవ్వూ - ఏమీ వినలేదు. పత్రికా పఠనంలో అంతగా సంలీనమైపోయారు. వారి గాఢత్వాన్ని భంగపరుస్తూ అమ్మ అడిగింది-

'ఆ పెద్దపెద్ద అక్షరాలు ఏమిటి తాతగారూ?'

'ఆంధ్రపత్రిక'

'ఆ అక్షరాలేనా ఆంధ్రపత్రిక అంటే?'

'నీకు మీ తాత వెంకయ్యగారిలా వేపకాయ అంత వెర్రి ఉంది.

"మీరు కొలిచారా?"

అంటూ దొడ్లోకి పరుగెత్తి వేపకాయ తెచ్చి-

"ఇట్లాగే ఉంటుందా? ఇంత వుంటుందా? వెర్రి అంటే ఇదేనా?"

"వెఱ్ఱి అంటే నీ మాటల వలె ఉంటుంది."

"వెఱ్ఱిని గుర్తు పట్టాలంటే మన దగ్గర ఏముండాలి?"

"తెలివి ఉండాలి."

"ఏది తెలిసికోవలెనన్నా అవసరం తెలివేగా - తెలివితో తెలుసుకుండేది తెలివి. మరి, వెఱ్ఱితో..' అని అమ్మ మెట్లు దిగివెళ్ళి బాదంచెట్టు క్రింద కూర్చున్నది.

'ఆ-ఏమిటీ?' అని చిదంబరరావుగారు కళ్ళు పెద్దవి చేసి అమ్మను చూచి పేపరు ముడిచి వేసి ముసిముసి నవ్వులు నవ్వుకుంటూ వెళ్ళారు.

"అమ్మాయ్ - తలనొప్పిగా ఉందమ్మా. అమృతాంజనం తెచ్చిపెట్టు - బోషాణం మీద ఉంది" అని తాతమ్మ కేకవేసింది.

"పాము... పాము."

దొడ్లో నుంచి కేకలు-చెట్లకు నీళ్ళు పోస్తూ నౌకరు నారాయణ ఆ చెట్లలో పామును చూచి కేకలు వేస్తూ కఱ్ఱ కోసం పరుగెత్తాడు.

అమ్మ దొడ్లోకి వెళ్ళింది.

పెద్ద పడగ... గోధుమవన్నె... కోడెత్రాచు. అమ్మ చూచి లోపలకు వెళ్ళింది అమృతాంజనం కోసం. నారాయణా, చిదంబరరావుగారూ కఱ్ఱ తీసుకుని చెట్టువద్దకు వచ్చారు. పాము కనుపించలేదు.

'ఇదేదో మామూలు పాము కాదు. దేవతా సర్పం. నాగేంద్రుడు...' అని తాతగారు తాతమ్మవద్దకు వచ్చి అన్నారు.

అమ్మ అమృతాంజనం డబ్బా తీసుకుని, కొంచెం అమృతాంజనం కణతలకు రాచుకున్నది. మంటలెత్తి కళ్ళవెంట నీళ్ళు కారాయి అమ్మకు.

అదే సమయంలో రాఘవరావుగారూ (మామయ్య), నాగేశ్వరరావు గారూ (నాన్నగారు) వచ్చారు.

అమ్మ కళ్ళ మంటలతో చిదంబరరావుగారి వద్దకు వెళ్ళి-

'ఈ మందు ఎవరు చేశారు? ఎందుకు?' అని అడిగింది.

'తలనొప్పి తగ్గిస్తుందమ్మా-'

'కళ్ళు మంటలు పుడితేగాని తలనొప్పి తగ్గదా? ఒకటి తగ్గాలంటే మరొక బాధ రావాలా?... దీనిని చేసిందెవరు తాతగారూ?'

'నాగేశ్వరరావు పంతులుగారు.'

అమ్మ అమృతాంజనం తెచ్చి తాతమ్మ కిచ్చి-

'ఇందాక వచ్చిన పాము పేరేమిటి అన్నావు తాతమ్మా-' అని అడిగింది.

'నేను కాదమ్మా - మీ తాతయ్య అన్నారు నాగేంద్రుడని.'

-అంటూ 'నాగేంద్రా' అని నాన్నగారిని పిలిచింది. తాతమ్మకు నాన్న గారిని ఆ పేరుతో పిలవడం అలవాటు.

అమ్మ అనుకున్నది - అంతా నాగేంద్రమయం. నిద్ర లేస్తూనే నాలుగు దిక్కులా అదే నామం వినిపిస్తున్నది. ఒక వైపున బావ (నాగేశ్వరరావు), మరో వైపున ఆంధ్రపత్రిక (దాని సంపాదకుడు నాగేశ్వరరావుగారు), మరో వైపున త్రాచుపాము (నాగేంద్రుడు), మరో వైపున అమృతాంజనము (దానిని చేసినదీ నాగేశ్వరరావుగారు) - అంతా నాగేంద్రమయం.

ఆ భావనతో మనసంతా ఆనందమయం కాగా- దొడ్లో బొగ్గుతో ముఖం కడుక్కుని 'ఇవ్వాళ మన్నవ ప్రయాణమేమో...' అనుకుంటూ లోపలకు వచ్చేటప్పటికి మన్నవ నుంచి నల్ల ఖాసిం సాహెబ్ వచ్చి ఉన్నాడు.

అమ్మను చూచి ఆనందంతో అమాంతం ఎత్తుకుని--

'మన ఊరు రావా అమ్మా - నీ కోసం గొల్ల నాగమ్మ ఏడుస్తున్నది. ఊరు చిన్న బోయింది.'

అంటూ తాతమ్మ వంక తిరిగి-

'అసలు... నాలుగు బజార్లకూ మన యిల్లు మధ్యకావటమూ యిల్లు తాళం పెట్టి దీపం పెట్టకపోవటమూ వలన ఊరే పాడు బెట్టినట్లయింది' అన్నాడు.

'అందుకే నేనూ మీ కరణంగారికి చెపుతున్నాను. మళ్ళీ ఆ యింట్లో

దీపం వెలిగించమనీ-'

'మరి మా అదృష్టం ఎట్లా ఉన్నదో... కరణంగారు రేపు ఉదయమే తీసుకురమ్మన్నారమ్మా...'

అమ్మ ఖాసిం చంకలో నుండి దిగి దొడ్లోకి వెళ్లింది. అంతలో పాకీ మనిషి ప్రక్కనందు తలుపు తీసి దొడ్లోకి వచ్చింది. రాఘవమ్మగారు పాకీమనిషిని చూచి--

'అక్కడ గుడ్డలు ఆరవేసి ఉన్నాయి. అవి విప్పిందాకా దానిని దొడ్లోకి రావద్దని చెప్పండి-' అని కేక వేసింది.

ఆ మాటలు విన్న పాకీ మనిషి ఎవరిచేతనూ చెప్పించుకోకుండానే వెనక్కు తగ్గింది.

'గుడ్డలకూ పాకీమనిషికీ చాలా దూరం ఉన్నది గదా - ఎందుకీమె యింత కఠినంగా అరుస్తుంది?'

- అమ్మ అనుకుంటూ ఉండగానే "ఇక రమ్మనమనండి-" అని రాఘవమ్మగారి కంఠం వినిపించింది.

పాకీ మనిషి లోపలకు వస్తూండగా తట్టలోని చీపురు వాకిలి తలుపుకు తగిలింది. ఆ శబ్దం వినిపించింది రాఘవమ్మగారికి. ఆమె వంటికి తగిలి నట్లయింది ఆ చీపురు. గిరుక్కున వెనక్కు తిరిగింది.

'ఎక్కడ పాకీది?'

'పాకీదెందుకు వచ్చిందో ఆ పనే చేస్తున్నది.' అమ్మ జవాబిచ్చింది.

అంతలో పాకీ మనిషి తిరిగి వచ్చింది.

'నీకు కళ్ళు పోయినయ్యా? కళ్ళు కనపడడంలా? అన్ని చోట్లా చిమ్మి వచ్చిన చీపురు తలుపుకేసి కొట్టావా...?'

రాఘవమ్మగారు గబగబా అరిచింది.

'ఇక్కడ చిమ్మినదైతే తగిలినా పరవాలేదా?'

-అని అమ్మ ఫక్కున నవ్వింది.

రాఘవమ్మగారికి కోపం వచ్చి అన్నది-

'తెలియనిదానివి తెలియనట్లుండమ్మాయ్-'

'తెలియనట్లే ఉన్నదిగా-'

'ఎవరికి?'

'తెలియనిదానికి తెలియకపోవటమే వృత్తి. తెలుసుకుండే దానికి ప్రతిదీ తెలుసుకోవటమే.'

వారి సంభాషణ వింటూ పాకీమనిషి ఎదాగుండె పడి నిలుచున్నది. కన్ను లెర్రచేసి రాఘవమ్మగారు పాకీమనిషి వంక చూచింది.

'నేనేమీ చేయలేదు దొరసానీ-' ఆ కంఠంలో వేడికోలు ఉన్నది.

'సరే, యిక వెళ్ళు-' రాఘవమ్మగారు గద్దించింది.

పాకీమనిషి వెళ్ళింది. పాకీమనిషి నడిచినంత మేరా పసుపునీళ్ళు చల్లి ఆ తలుపును కూడా శుద్ధి చేసింది.

ఆ తర్వాత రెండు రోజుల వరకూ పాకీమనిషి రాలేదు. దానిని గురించిన ఆందోళనా, ఆదుర్దా గంటగంటకూ ఎక్కువైనాయి.

'పాకీది పనికిమాలినదైనా దానిని గురించిన ఆందోళన మాత్రం మహా పవిత్రంగా ఉన్నది.' - అనుకున్నది అమ్మ.

చిదంబరరావుగారు పాకీమనిషి కోసం నలుగురిని పంపారు. రాఘవమ్మగారికి మరొక ఆలోచనయే లేదు.

అమ్మ ఒక చీపురూ, సీనారేకుడబ్బా తీసుకుని పాకీదొడ్డి బాగుచేసి వచ్చింది.

అంతలో రాఘవమ్మగారికి దొడ్లోకి వెళ్ళడం అని వార్యమయింది. అసహ్యపడుతూ, ముఖం చిట్లించుకుంటూ, ముక్కులు మూసుకుంటూ లోకాన్నంతనూ తిడుతూనే లోపలకు వెళ్ళింది. ఆశ్చర్యం-దొడ్డి శుభ్రపరచి ఉన్నది.

ఆశ్చర్యంతోనూ, ఆనందంతోనో గబగబా చిదంబరరావుగారి వద్దకు వచ్చి--

'పాకీది వచ్చి చిమ్మిందండీ, మనం చూడలేదు.'

'ఓహో, అట్లాగా! జ్వరం వచ్చింది. రాలేను -అని కబురు పంపిందే! ఎప్పుడు వచ్చింది? ఎవరు వచ్చారు?'

చిదంబరరావుగారు కూడా ఆశ్చర్యపోయాడు.

'ఏమో, ఎప్పుడు వచ్చారో... ఎవరు వచ్చారో... పాకీది చిమ్మిన దానికంటే శుభ్రంగా ఉన్నది.'

'అంటే-పాకీది కాదనా? --చిమ్మేది పాకీయేగా?'

అని అడుగుతూ అమ్మ చిదంబరరావుగారి వంక తిరిగి-

'తాతగారూ-చిమ్మేది పాకీయా? పాకీది చిమ్ముతుందా?- అసలు పాకీ అంటే ఏమిటి?'

'చిమ్మేదే పాకీ అమ్మా - యానాది వాళ్ళు వాళ్ళ వృత్తి వల్లనే ఆ పేరు వచ్చింది.'

'మరి రాఘవమ్మగారు ఎందుకూ అట్లా అంటుంది-పాకీ చిమ్మిన దానికంటే-అని' -అమ్మ ప్రశ్నించింది.

'పెద్దదిగాదూ? ఏదో తెలియక అట్లా అంటుందిలే...'

చిదంబరరావుగారు సర్దటానికి ప్రయత్నించారు.

'పెద్దవాళ్ళు మాట్లాడినప్పుడు పెద్దవాళ్ళంటారు. చిన్నవాళ్ళు మాట్లాడి నప్పుడు చిన్నపిల్లలంటారు. మరి తెలిసేది ఎప్పుడు? తెలిసేది ఎవరికి? ఎవరు చిన్న? ఎవరు పెద్ద?' - అమ్మ ప్రశ్నల వర్షం కురిపించింది.

'నేను పెద్ద. నీవు చిన్న'

'మరి తెలిసేది ఎవరికి?'

'ఉన్నారు కొంతమంది, తెలిసినవాళ్ళు; మధ్యరకం.'

16 'నా కంటే చిన్నా, మీకంటే పెద్దా ఉండవచ్చుగా?'

'ఉండవచ్చు.'

'అప్పుడు మనమేమవుతాం?'

చిదంబరరావుగారు ఆలోచనలో పడ్డారు.

'మధ్యరకమా?'

'అంతే... అంతే...'

'మరి, మనకు తెలుసుగా. ఎందుకిట్లా చెపుతారూ? ప్రతి మనిషికీ తనకంటే పెద్దా, తనకంటే చిన్నా ఎప్పుడూ ఉంటారుగా-'

అమ్మతో ఏమి మాట్లాడుతున్నా చిదంబరరావుగారు 'దొడ్డి చిమ్మింది ఎవరా?' అని ఆలోచిస్తూనే ఉన్నారు.

అంతలో సంభాషణను మారుస్తూనూ చిదంబరరావుగారి ఆలోచనను భంగపరుస్తూనూ అమ్మ ప్రశ్నించింది-

'భగవంతుడెట్లా ఉంటాడండీ తాతగారూ?'

'చూస్తేనేగా తెలిసేది. నేను చూడలేదు.'

'చూస్తే తెలియదేమో - తెలుసుకుంటే తెలుస్తాడు. వాడైనా తేలుస్తాడా?'

' నీ ముఖం-'

'అంటే - భగవంతుడంటేనా?'

'ఊఁ-'

'ఎందుకు మీరు 'ఊఁ' అన్నారు? ఒప్పుకున్నారా? నేనే ననా?'

'ఊఁ-'

'మరి రోజూ మీరెందుకు గుళ్ళోకి పోతారు?'

'అక్కడ కూడా నిన్నే చూద్దామని.'

'అప్పుడు గుళ్ళోవాడిని యిక్కడనే చూడవచ్చుగా-'

చిదంబరరావుగారు పకపకా నవ్వి-

'మన్నవవారి తెలివంతా నీకే వచ్చిందమ్మా-'

అమ్మ ఒక్క క్షణం కూడా విరామం యివ్వకుండా అడిగింది-

'అయితే యిప్పుడు మన్నవ వారికి తెలివి లేకుండా పోయిందా?'

'మరి - వాళ్లకు తెలివేమున్నది?'

'తెలివంటే-?'

'తెలివంటే చెప్తా - పైకి వెళదాం పద-'

అని చిదంబరరావుగారు అమ్మనెత్తుకుని మేడమీదకు వెళ్లారు. అప్పటికీ అమ్మ వదలిపెడితే కదా!

'ఏం తాతగారూ - చెప్పరూ తెలివంటే ఏమిటో...?'

'తెలివంటేనా? - నీవే.'

చిదంబరరావుగారి సమాధానమది.

విసుగువల్లనా?

చమత్కారంగానా?

స్థిరాభిప్రాయమా?

ఏమో?... నిర్లిప్తంగా ఆ మాటఅని చిదంబరరావుగారు తిరిగి తాను ఆలోచనలో మునిగిపోయారు - పాకీదొడ్డి ఎవరు చిమ్మారా? అని.

ఆలోచిస్తూ, ఆలోచిస్తూ అప్రయత్నంగా పైకి అన్నారు.

'ఎవరు చిమ్మారు?'

అమ్మ అందుకుని అన్నది - 'ఎవరు చిమ్మితే యేమి? చిమ్మేది పాకీ అన్నారుగా-'

'అవునమ్మా - ఎవరైనదీ తేలవద్దూ? డబ్బులివ్వవద్దూ మనం?'

'చిమ్మిన మనిషి వచ్చి చెప్తే ఆలోచించకుండా యిస్తారా?'

'ఆ -'

'నేనే చిమ్మింది.'

చిదంబరరావుగారు ఆ మాటలను నమ్మలేదు. అయినా ఒప్పుకున్న ప్రకారం రూపాయి యివ్వబోయారు.

'నమ్మి యిస్తున్నారా? మాట అన్నాను కదా అని యిస్తున్నారా?'

'నమ్మలేదమ్మా-'

'నమ్మలేని అమ్మనా?' అని బిగ్గరగా అని-

'అమ్మలేని అమ్మనా?' అని చిన్నగా అన్నది.

చిన్నగా అన్నమాటకూడా చిదంబరరావుగారికి వినిపించింది. ఆయన కరుణామయ హృదయం స్పందించింది. అమాంతం అమ్మను దగ్గరకు లాక్కుని గుండెలకు హత్తుకుని పందిరిమంచం మీదకు వెళ్లి తన పొట్టమీద పడుకోబెట్టు కున్నారు. ఆలోచనలో కన్నులు జలజలా స్రవించాయి.

వెంటనే అమ్మను క్రిందికి దించి రెండు రూపాయిలు అమ్మచేతిలో పెట్టబోయారు. తీసుకోకుండా అమ్మ అడిగింది - 'నాకు వద్దు; కానీ పాకీది ఒక పూట చిమ్మితే ఎంత యిస్తారు?'

'అది నెలల లెక్క అమ్మా-'

'నెలలో పూటను విడదీయండి-'

'అర్ధనా-' లెక్క వేయకుండానే చెప్పేశారు.

'ఇదేనా, మొన్న లక్ష్మణాచార్యులుగారు వచ్చినప్పుడు మాట్లాడుతూ అర్థం, ప్రాణం.. అన్నారు. అది యీ అర్థమేనా?'

'అబ్బా! నీకెక్కడ దొరకుతాయమ్మా యీ పదాలూ... ఆ-ఆ అర్థం యిదే.'

"ప్రాణం కూడా యీదేనా?"

"ఆ - యిదే.'

'మొన్న అమ్మ పోయినప్పుడు ప్రాణం పోయిందంటిరే - యిదే పోయిందా?'

"కాదమ్మా - ప్రాణమంటే ఎంత తీపో డబ్బంటే అంతే - అని దాని అర్థం.'

'అంటే ప్రాణ మున్నంత వరకూ డబ్బు అవసరమనేమొ...'

'ఇది యింకా బాగుంది.'

అంటూ 'సాత్త్విక స్వభావం' అని లోపల అనుకున్నారు. వారి భావాన్ని అనుసరించి అమ్మ అడిగింది.

'మీ భావమా?'

'కాదమ్మా-'

'మొన్న 'స' అంటే తనయొక్క, నా యొక్క -అని భారతి పిన్నికి పాఠం చెబితిరే. స్వభావమంటే మీభావం. సాత్త్వికమని గుర్తించింది మీ భావం. అదే సాత్త్విక భావం.'

ఆ వివరణకు చిదంబరరావుగారు ముగ్ధులై-

'మా అమ్మ వ్యాసుడంత అవుతుందా?' అనుకుంటూ మంచం మీది నుండి దిగి - 'కోర్టు వేళ అయిందమ్మా. రేపు మన్నవ వెళ్ళవద్దూ - అన్నీ నాలుగు రోజుల దాకా వాయిదా వేయించి వస్తాను. ఆడుకో-'

అంతలో నల్లఖాశింసాహెబ్ వచ్చి...

'ఈ పూటే వెళదామండీ-' అన్నాడు.

ఆ మధ్యాహ్నం పన్నెండు గంటలకు అందరూ మన్నవ ప్రయాణమై రైల్వేస్టేషనుకు బయలుదేరారు. దారిలో ఒకామె తిని పారవేసిన విస్తరికోసం వెదుకుతూ అమ్మను అడిగింది.

'ఎక్కడయినా తిని పారవేసిన విస్తరి కనుపించిందా?'

'ఈ వాకిలి ముందర నుంచుని ఉండండి. వీళ్ళు తిని పారవేసే వేళ అయింది; దొరకవచ్చు.'

అంటూ ఉండగానే గోడమీదుగా విస్తరి పడ్డది. ఆమె దానికోసం ఆదుర్దాగా పరుగెత్తింది. అమ్మ ఆమె వద్దకు వెళ్ళి అడిగింది.

'అసలు మీకీ విస్తరి ఎందుకు; ఎందుకూ పనికిరాదని పారవేసిందిగదా

- మీ రెందుకు వాడతారు?'

'మాకు పిల్లలు బ్రతక్కపోతే పుల్లాకులో పొర్లిస్తే బ్రతుకు తారన్నారు. అందుకనీ...'

'మీరు అన్నాలు తినరా? మీది పనికిరాదా? అసలు పుల్లాకు అంటే అప్పుడు తినిపారవేసిందేకాదు. పులిసిపోయిన ఆకు, పులిసిరి వాసన వచ్చేది.'

'ఓహో... అదా? చిన్నపిల్లవయినా నీవే నయం-' అంటూ వాళ్ళు వెళ్ళారు.

అమ్మ స్టేషనుకు వెళ్ళింది. రైలు గంట ఆలస్యంగా వస్తుందని చెప్పారు. వెంటనే అమ్మ యింటికి వెళ్ళి దొడ్లో చీకిపోయిన విస్తరి తీసుకుని వీధిన పరుగెత్తి వారిని చూచింది.

'ఈ విస్తరి మా. యింటికి కుష్ఠురోగి వస్తే వాడికి అన్నం పెట్టింది. మరి యిది పనికి వస్తుందా?' అని అడిగింది.

'ఏదయితేనేమి? అయినా నీకు గుర్తున్నదా? అది ఎటు కొట్టుకుని పోయిందో...'

'అది నిజమే ననుకోండి. అయినా యిదేనని నా గుర్తు.'

'ఏదో ఒకటిలే, అమ్మా - బిడ్డ బ్రతికితే అంతే చాలు.

ఆమె విస్తరి తీసుకుని వెళ్ళిపోయింది. అమ్మ స్టేషనుకు వచ్చింది.

పాకీమనిషి విషయమూ, పుల్లాకు విషయమూ ఆలోచించుకుంటూ అమ్మ అటూ యిటూ తిరుగుతూ ఉన్నది. ప్లాటుఫారం మీద ఎగుమతి కోసం చేపల గోతాలు పెట్టి ఉన్నాయి. వాటి ప్రక్కనే చిదంబరరావుగారూ, మరిడమ్మగారూ కూర్చుని ఉన్నారు. మరిడమ్మగారికి చేపల వాసన కాదు గదా చేపల కేక కూడా పనికిరాదు. అందుకనే అమ్మ ఆశ్చర్యపోతూ-

'తాతగారూ-ఒకప్పుడు అసహ్యించుకొన్నది మరొకప్పుడేమవుతుంది.

ఎప్పుడూ అసహ్యమే. కానీ అవసరాన్ని బట్టీ...

'అవసరమంటే ఎటువంటిది?'

'ముఖ్యమయింది.'

'ముఖ్యమంటే తనకున్నదా? జరిగినదా?'

'తప్పనిసరి అయినది.'

'అది చాలటంలేదు. ఎందుకంటే - మీరు నాకు జ్వరం వచ్చినప్పుడు వాయిదాకు ఒంగోలు వెళ్లవలసి వచ్చింది. అప్పుడు డాక్టరుగారు ఆ పూటనే ముఖ్యంగా యింజక్షను యివ్వాలి అన్నారు. అప్పుడు మీరు తప్పనిసరిగా ఒంగోలు పోవలసి వచ్చింది. ఏది ముఖ్యం? ఏది తప్పనిసరి? ముఖ్యానికి తప్పనిసరికీ తేడా వున్నదిగా - ముఖ్యం నా యింజక్షను అయింది. తప్పనిసరి ఒంగోలు ప్రయాణమయింది. కనుక ముఖ్యం అంటే తప్పనిసరి కాదు. ఆ అర్థం చాలదు. అవసరమంటే-ముఖ్యం అనే అర్థం కూడా చాలదు.'

'పోనీ - ఏది చాలుతుందో నీవు చెప్పు-'

అంతలో గంట కొట్టారు. చెక్కవంగింది.

'తాతగారూ-చెక్కవంగినా అరగంటకు గానీ రైలు రాదు. అదీ ఒకరు నడిపితేనే వచ్చేది. వాడు మాత్రం అనుకున్నట్లు నడపగలడూ?'

చిదంబరరావుగారు పకపకా నవ్వి---

'నీకెవరు చెప్పారూ నడపలేడని?'

'ప్రతి పనిలోనూ తెలుస్తూనే ఉన్నది - అనుకున్నది జరగదని.'

'మరి, ఏది జరుగుతుందంటావు?'

'తనకున్నదే జరిగేది.'

చిదంబరరావుగారు అమ్మను పరిష్వంగంలోనికి తీసుకుని ఫాల భాగం మీద ముద్దు పెట్టుకొని ముంగురులు సవరిస్తూ-

'నేననుకున్న మాట ఖాయం చేస్తావా అమ్మా-'

జీడిపప్పు అమ్ముకునే అమ్మి కేక వేసుకుంటూ అమ్మ ముందుకు వచ్చి నిలుచున్నది. ఆమె కాలు ముందుకు సాగలేదు. అమ్మ కూడా ఆమె వంక చూస్తూ ఉన్నది.

'ఏం అమ్మా - నీకు తినాలనిపిస్తున్నదా?' చిదంబరరావుగారు అడిగారు.

'నాకు ఎప్పుడూ ఏమీ తినవలెననీ అనిపించదు. ఏమి తినవలసి వచ్చినా వద్దు అనీ అనిపించదు.'

అమ్మ మానసిక స్థితి కంటే వాక్చమత్కృతి చిదంబరరావుగారిని ఎక్కువగా ఆకర్షించినట్లున్నది. అడిగారు--

'శబ్దమంజరివా?'

రైలు కూత వేసింది. చిదంబరరావుగారు జేబులో నుండి అర్థణా తీసి యిస్తూ -

'ఒక గిద్దెడు పప్పు యివ్వు అమ్మ-' అన్నారు.

కానీ, అమ్మ అన్నది - 'ఒక కానీ జీడిపప్పు మాకిచ్చి ఒక కానీ జీడిపప్పు నీవు తీసుకో-కానీ జీడిపప్పు నీకు కొనిపెట్టాననుకో అమ్మా...'

చిదంబరరావుగారు ఆశ్చర్యంగా అడిగారు---

'అమ్మాయి అమ్ముకోవడానికి గానీ తినటానికి కాదుగా - అమ్మేవాళ్ళు అసలు తినలేరు.'

రైలు ప్లాటుఫారం మీదకువచ్చి ఆగింది.

12. ఆపదుద్ధారిణి

హడావుడిగా అందరూ రైలు ఎక్కి లోపలికి వెళ్ళి కూర్చున్నారు. అమ్మ మాత్రం రైలు పెట్టె వాకిట్లో నిలుచున్నది.

'అమ్మా - ముందుకు పడతావమ్మా...' చిదంబరరావుగారు అన్నారు.

'చాలా మంది అట్లా నిలుచుంటారు. పడడం లేదుగా?'

---అమ్మ ప్రశ్నించింది.

'పిచ్చి ప్రశ్నలు వేయక లోపలికిరా--'

అమ్మ లోపలికి వెళ్ళి చిదంబరరావుగారి ప్రక్కన కూర్చున్నది. ఎదురు సీటుమీద ఒక ముసలాయన ఉన్నారు. అతని ప్రక్కన ఒక కుఱ్ఱవాడు ఉన్నాడు. వాడికి ఎనిమిది సంవత్సరాలున్నాయి. వాడు ఒక కిటికీ ప్రక్కగా కూర్చున్నాడు. వాడికి ఎదురుగా మరో కిటికీ ప్రక్కగా అమ్మ కూర్చున్నది.

రైలు ఎఱ్ఱకాల్వ దాటింది; అప్పికట్ల స్టేషన్ దాటింది; తుంగభద్ర దాటింది; మాచవరం స్టేషన్ దాటింది.

ఎదురుగా కూర్చున్న అబ్బాయి అమ్మ వంక కన్నార్పకుండా చూస్తున్నాడు. అమ్మ కిటికీలో గుండా బయటకు చూస్తున్నది. తదేకంగా అమ్మ నవలోకిస్తున్న అబ్బాయి బయటకు చూచాడు. టెలిగ్రాఫ్ స్తంభాలూ, చెట్లూ గబగబా వెనక్కు పరుగెత్తుతున్నాయి. అబ్బాయి ఆశ్చర్యపోయాడు.

'అదేమిటి తాతా - చెట్లు పరుగెత్తుతున్నాయ్?'

'భ్రమ అంటే యిదేకదా...' తాత గొణుక్కున్నాడు.

'నిజం తాత, చూడు - నీవు నిజం చెప్పమ్మా...' అని ఆ అబ్బాయి అమ్మ వంక చూస్తూ చెయ్యి బయటకు జాపాడు.

కిటికీ చెక్క గభీమని పడ్డది 'అమ్మా-' అని కేక పెట్టాడు అబ్బాయి. తాత కెవ్వుమన్నాడు.

గాభరాగా పెట్టెలో జనమంతా లేచారు. ఒకరు చెక్కను పైకి తీసి

పిల్లవాని చెయ్యి బయటకు తీశారు. చేతికి -కనుపించే గాయమేమీ కాలదు. చూపు మాత్రం అమ్మ వంక అలాగే నిలబడి పోయింది. ఒకాయన కంటివద్ద చిటికెలు వేశాడు; ఒకాయన గుండెమీద చెయ్యి పెట్టి చూచాడు; ఒకాయన పరీక్షించాడు. అందరూ ఒకరి ముఖాలు ఒకరు చూచుకున్నారు. ఒకరు పెదవి విరిచారు; మరొకరు చప్పరించారు; ఇంకొకరు తలకాయ అడ్డంగా త్రిప్పారు. అందరూ కలిసి వివర్ణమయిన ముఖాలతో తాత వంక చూచారు.

అందాకా కొయ్యబారిపోయిన తాతకు వారి ముఖాల్లోని భావం చలనం కలుగజేసింది. వెంటనే లేచాడు; మనుమడిని చూచాడు; వాడి నాసికాగ్రాన తన వ్రేలునుంచాడు; శ్వాస తగలలేదు.

'ఋణం తీరింది...' అని బావురుమన్నాడు తాత.

'చేతికి దెబ్బ కూడా తగలలేదు. ప్రాణం పోవలసిన దెబ్బ కాదు. తలమీద బలమైన గాయం తగిలి బ్రతికినవారు కూడా ఉన్నారు. కాని యీ సంఘటన దురదృష్టకరం...'

-ఒకాయన సానుభూతి ప్రకటించాడు.

'గొలుసులాగి రైలు ఆపుదామా?' - మరొకాయన తాతను అడిగాడు.

'మధ్యలో నేను మాత్రం ఏమి చేస్తాను? వచ్చే స్టేషన్‌లోనే దించండి-'

పిల్లవానిని ఒక ప్రక్కగా పడుకోబెట్టి - తమ పని అయిపోయింది అన్నట్లుగా అందరూ వారివారి స్థలాల్లో కూర్చున్నారు.

'మీది ఏ ఊరు తాతా?' అమ్మ మెల్లగా అడిగింది.

'మా ఊరు చాలా దూరమమ్మా - నానాయాతనలూ పడి వీడిని పెంచుతున్నాను. వీడు నా కూతురి బిడ్డ. వీడి తల్లీ, దాని తల్లీ - యిద్దరూ పోయారు.'

'నీ బాధ తీర్చిపోయినాడులే.... తాతా-' ఒకాయన ఊరడింపు.

'ఇప్పుడు ఇది బాధ కదూ? బాధను తీర్చటానికి బాధే అవసర మయినదా? దెబ్బ తగిలినప్పుడు పిల్లవాడికి బాధ. తరువాత తాతకు బాధ.

వారి స్థితిని చూచిన జనానికి బాధ. బాధలో ఏ బాధ ఎక్కువ? అన్ని బాధలూ ఒకటేనా?'

-అని అమ్మ ఆయనతో అని చిదంబరరావుగారిని అడిగింది---

'అసలు బాధ అంటే ఏమిటి తాతగారూ?'

'ఇందాక నుండీ కనపడేదంతా బాధేగా--'

'ఎవరికి?'

'అదే - ఆ పిల్లవాడికీ, తాతకూ_'

'మీరందరూ కూడా బాధ పడుతున్నారుగా---'

'ఔను-'

'నేను వాకిట్లో నిలుచున్నప్పుడు మీరు పడిన బాధ యిప్పుడు పడడం లేదుగా. అయినా వాకిట్లో ఉంటే పడతానని భయపడ్డారు. లోపల ఉన్నవాడికీ తప్పలేదుగా?'

'నిజమేనమ్మా - అట్లా అని మనస్సు ఊరుకోదు.'

'ఊరుకోకపోవడమే దాని గుణమా?'

'అవును.'

నిడుబ్రోలు స్టేషన్‌లో రైలు ఆగింది. ఎవరిదారిన వారు దిగిపోయారు. తాత ఒక్కడే పిల్లవానిని భుజంమీద వేసుకుని క్రిందికి దిగి ఫ్లాట్‌ఫారం మీద చతికిలపడి కూర్చున్నారు. ఏమి చేయాలో తోచక.

చిదంబరరావుగారూ, అమ్మా, ఖాసిం కూడా దిగారు. ఖాసిం బండి కోసం బయటకు వెళ్ళాడు.

'తాతగారూ - ఆ పిల్లవాడిని మనం పారవేయిద్దామా?'

'మనకెందుకమ్మా? మనకు ప్రొద్దుక్రుంకుతున్నది. మనం వెళదాం?'

'మన యిద్దరి మనసూ ఒకటి కాలేదు. నాకు ఉందామనిపిస్తున్నది. మీకు వెళదామనిపిస్తున్నది. ఇద్దరి మనసూ ఒకటయితే మిమ్ములను నేను

'పారవేయిద్దామా?' అని అడగవలసిన అవసరం లేదు. నాకు తోచగానే మీకూ తోచేది. మరి - మనస్సందరిదీ ఒకటే నంటారుగా?'

చిదంబరరావుగారు అమ్మ మాటలన్నీ విని చిరునవ్వుతో-

'అట్టే యీ మరిడమ్మగారి పెంపకం వల్ల ఆమె సంభాషణే అతికి పోయింది.'

'నేను ఏమీ చెప్పనురా నాయనా - నేను మాట్లాడేటప్పుడు ఎప్పుడయినా దగ్గర కూర్చుంటుంది. ఎప్పుడూ ఎక్కడో ఆడుకుంటూనే ఉంటుంది.

అంతలో ఆకాశం ఉరిమింది; చల్లనిగాలి వీచింది. చిదంబరరావు గారు పైకి చూచారు; నల్లని మేఘాలు భయపెట్టాయి.

'బయలుదేరండమ్మా - ప్రొద్దుక్రుంకుతన్నది. అసలే రైలు ఆలస్య మయింది. అందులో వర్షాకాలం. దొప్పలపూడి నుంచి నడవాలి కూడా...'

నల్లఖాసిం వచ్చి ఒంటెద్దుబండి మాట్లాడానని చెప్పాడు.

సామాను బండిలో పెట్టించమని ఖాసింకు చెప్పి చిదంబరరావుగారు ప్లాటుఫారం చివరకు వెళ్ళారు.

చిదంబరరావుగారు వచ్చేలోగా వస్తానని చెప్పి - అమ్మ తాత దగ్గరకు వెళ్ళింది.

అతడు పిల్లవానిని ఒడిలో పెట్టుకుని ఏడుస్తూ కూర్చున్నాడు. చుట్టూ జనం పోగయినారు. అమ్మ వారిని చీల్చుకుని అతని వద్దకు వెళ్ళి నిలుచున్నది.

'అమ్మా - రైల్లో మా కెదురు కూర్చున్న తల్లివి కాదూ? చూడు తల్లీ; చూడూ- చిన్నపిల్లవయినా నిన్ను చూస్తే అన్నీ తెలిసిన పెద్దమ్మ లాగా కనపడు తున్నావు.'

ఏడుపు మాని అతడు అమ్మతో మాట్లాడడం చూచి జనం ఆశ్చర్యంగా అమ్మ వంక చూచారు.

అమ్మ ఆ ముసలివాని వీపుపై చొరవగా చెయ్యివేసి ప్రేమగా నిమురుతూ-

'ఎందుకు నాయనా ఏడుస్తున్నావు? పిల్లవాడు పోయాడనా? ఇప్పుడు ఖర్చులకు డబ్బు లేదనా? నిన్ను చూచేవాళ్ళు ఎవరూ లేరనా? - ఎందుకూ ఏడవడం?

'వీడింత గంజి పోస్తాడనుకున్నాను. ఒకసారి జ్వరం వచ్చి నేను పడుకుంటే - వీడే కాచిపోశాడు.'

'అట్లా అయితే - ఏడ్చేది నీ కొఱకేగా? పెంచింది నీ కొఱకు, అది నీ తృప్తి. నీకు హాయిగా ఉండి పెంచావు. చచ్చిపోతే నీకు యిబ్బంది అని ఏడుస్తున్నావు. ఏదయినా వాడి చేతిలో పెట్టి వాడు తింటూ సంతోష పడు తూంటే-నీకు తృప్తి కనుక వాడికి పెడుతున్నావు. వాడు అల్లరి చేస్తుంటే - కొట్టి అల్లరి మాన్పించి తృప్తి పడుతున్నావు. ప్రాణం లేదనుకునీ శవాన్ని దగ్గర పెట్టుకుని ఏడుస్తున్నావంటే - డబ్బులేదనీ, పారవేసే వాళ్ళు లేరనీ, నీ బాధ్యత తప్పిపోతున్నదనీ. నీ ప్రేమకు అధారం పోతున్నదనీ - అదీ నీ కొరకే...'

చిన్నపిల్ల పలికే పెద్దపెద్ద మాటలు విని జనం విస్ఫారిత నయనాలతో అమ్మవంక చూస్తూ ఉన్నారు. అమ్మను వెతుక్కుంటూ ఖాసిం వచ్చి-

"తాతగారు కోప్పడుతున్నారమ్మా - నీ కోసం వెతుకుతున్నారు."

'అది ఆయన తృప్తి కోసమే ఖాసిం. ఈ తాతకు ఏమి కావాలో కనుక్కుని చేస్తావా? తరువాత వెళదాం.'

'తాతగారు కోప్పడుతారమ్మా-'

'త్వరగా వెళ్ళటం తాతగారి తృప్తి. ఈ తాత పని చూడడం నా తృప్తి.'

అమ్మనూ, ఖాసింనూ వెతుక్కుంటూ చిదంబరరావుగారు వస్తూ కనుపించారు.

'తాతగారు వస్తున్నారు. నీవు వెళ్ళి తాతగారిని కలుసుకో' నేను వస్తున్నాని చెప్పు-' అమ్మ అన్నది ఖాసింతో.

'నేను వెళ్ళకపోయినా యిబ్బందిలేదు. నీవు వెళ్ళు, ఆ అబ్బాయికి ఏదో ఒకటి నేను చేసివస్తాలే' అన్నాడు ఖాసిం.

'సరేలే...' అని వ్రేలుకు ఉన్న ఉంగరం తీసి చేతిలో పట్టుకుని-

' ఆ కొట్టుకు వెళ్ళి ఒక పంపర పనసపండు కొనుక్కురా.' అన్నది ఖాసింతో.

'నా దగ్గర డబ్బు లేదమ్మా-'

'అసలు ఎంతవుతుందో కనుక్కురా-పో.'

'డబ్బు లేని బేరమెందుకమ్మా!'

'అదే వస్తుందిలే...'

ఖాసిం వెళ్ళాడు. అమ్మ తనచేతిలోని ఉంగరం తాత చేతిలో పెట్టి-

'ఇది మార్చుకుని నీకు కావలసినట్లు వాడుకో-'

'చిన్న పిల్లవు, నీకెందుకమ్మా యీ పని? చూచిన పెద్దవాళ్ళందరూ అట్లాగే వెళ్ళారు.'

' నాకొరకే-ఇది నా తృప్తి నాయనా...'

'నా కివ్వడం నీ తృప్తి ఏమిటమ్మా?'

'ప్రపంచంలో ప్రతివాడూ ప్రతిపనీ తనకోసమే చేసుకుంటున్నాడని నాకు తోస్తున్నది.'

అమ్మ మాట్లాడుతుండగా తాత తన చేతిలోని ఉంగరం అమ్మ వ్రేలుకు పెట్టడానికి ప్రయత్నించాడు.

నవ్వుతూ చెయ్యి వెనక్కు తీసుకుని అమ్మ అన్నది.

'ఒక వేళ నీ మనుమడు బ్రతికేడనుకో. అంటే-ఇందాక దెబ్బ తగిలి నప్పుడు ప్రాణం కడబట్టి- తిరిగి తేరుకున్నాడనుకో - అప్పుడు వాడిచేతికి పెట్టు ; ఈ ఉంగరం.'

'ఇంకా ఏమి బ్రతుకుతాడమ్మా - పోయిన బిడ్డ?'

'బ్రతికితేనే - వాడికి పెట్టు. లేకపోతే ఇంకోదానికి వాడుకో-' అని ఉంగరం తాత చేతిలోనే పెట్టి అమ్మ గబగబా ముందుకు వెళ్ళింది.

ఖాసిమూ, చిదంబరరావుగారూ కొట్టు వద్ద నిలబడి ఉన్నారు.

అమ్మ వారివద్దకు వెళ్ళి నిలబడ్డది.

'ఇక వెళదామా అమ్మా?'

'నేను బయటకు వెళ్ళాలి తాతగారూ...'

ఖాసిం అందుకుని అన్నాడు- 'ఇక వ్యవధిలేదు. మీరు ముందు బయలుదేరండి. మీరు దొప్పలపూడి వెళ్ళేటప్పటికి- నేను వచ్చి కలుస్తాను.'

చిదంబరరావుగారు ఇంకేమీ అనలేక-

'జాగ్రత్తగా రండి. ప్రొద్దుక్రుంకింది.' - అని సామానూ, మరిడమ్మగారినీ బండి ఎక్కించుకుని బయలుదేరారు.

ఖాసింకు వారి బంధువులు కనుపిస్తే - మాట్లాడుతూ ఉన్నాడు.

'నీవు మాట్లాడుతూ ఉండు. నేను బయటకు వెళ్ళి వస్తాను.' అని ఖాసింకు చెప్పి - అమ్మ తాత దగ్గరకు వెళ్ళింది.

పిల్లవాని చెయ్యి కదిలినట్లుగా ఉంది- తాత ఆశగా పిల్లవానిని చూస్తూ అమ్మ మాటలు స్మృతికి తెచ్చుకుంటూ ఉన్నాడు. అంతలో అమ్మ వచ్చి ఎదురుగా నిలుచున్నది. పిల్లవాని రెండవ చెయ్యి కూడా కదిలింది. తాత మనసు తబ్బిబ్బయి కన్నుల్లో వేయికాంతులు విరిశాయి.

అమ్మను చూచి ఆనందాశ్రువులతో -

'ఇందుకే-పెద్దలు బాలవాక్యం బ్రహ్మవాక్యం అన్నారు.' అంటూ చేతులు ముకుళించాడు.

'బాలవాక్యంకాదు బ్రహ్మవాక్యమంటే - భ్రాంతిలేని వాక్యమే బ్రహ్మవాక్యం.'

'ఏమిటి? 'ఏమిటీ? 'ఏమన్నావమ్మా? - మళ్ళీ అనూ-'

అమ్మ పునరుద్ఘాటించింది -

'భ్రాంతి లేని వాక్యమే బ్రహ్మవాక్యం.'

తాత ఆ వాక్యం విని ముగ్ధుడయిపోయి, అశ్రుపూర్ణనయనాలతో, గద్గద కంఠంతో అన్నాడు.

'ఆ బ్రహ్మవు నీవేనేమో...'

'భ్రాంతి లేనివాడు బ్రహ్మ - అంటున్నాను. ఎవరైనా... అది సరేగానీ - నేను వెళ్ళుతున్నాను. ఆ ఉంగరం వాడికి పెట్టు, లేవగానే.'

'నీ చల్లని చేతిమీదుగా నీవే పెట్టి వెళ్ళమ్మా - చనిపోయిన బిడ్డకు ప్రాణంపోశావు. బ్రహ్మవో, అమ్మవో ఎవరి నయితేనేమి - అపదుద్ధారిణివి.'

'అంటే ఆపదను ఉద్ధరించేదానివనా?' అమ్మ పకపకా నవ్వింది.

'అవ్వవ్వా:- అట్లా అంటానా? ఆపదల నుంచి మమ్మల్ని ఉద్ధరించావు. నీ ఋణం ఎట్లా తీర్చుకుంటామో...'

అంటూ ఉండగానే అమ్మ ఉంగరం పిల్లవాని చేతికి పెట్టి ముద్దు పెట్టుకుని...

'అన్నిటికీ తరుణమే కారణం, కానీ ఋణమేమీ లేదు తాతా...'

తాత ఆ మాటలకు మరీ ఉప్పొంగి పోయి...

'నీ వెక్కడ ఉంటావో చెప్పమ్మా... నేను వస్తాను. నీవే రక్షించాలి. ఆపదల్లో నీవే ఆదుకోవాలి.'

'అందరినీ రక్షించేవాడు ఒకడే నాయనా. ఆపదలను కలిగించేదీ, ఆపదల నుండి రక్షించేదీ ఒకడే... నీమనుమడికి దెబ్బ తగిలించిన వాడూ, పోయినాడని భ్రమ కలిగించినవాడూ, తిరిగి కదిలించినవాడూ, లేవదీసిన వాడూ... ఒకడే నాయనా...'

13. ఉపనిషద్వాణి

అలతి అలతి మాటలతో అతిసహజంగా అమ్మ యిచ్చిన అద్వైత వివరణకు తాత విస్మితుడై-

'వాడేనా అమ్మా ఇందాక నీవు చెప్పిన బ్రహ్మ, భ్రాంతిలేనివాడు. వాడికివన్నీ ఎందుకో? మా గురువుగారు 'అహం బ్రహ్మోస్మి' అని చెప్పాడమ్మా. నేను ఉపదేశమయ్యాను. మా గురువుగారు ఖాదర్ మస్తాన్. ఆయన బదులు యిప్పుడు చక్రపాణి అనే ఆయన చెపుతున్నారు. ఆయన కూడా 'అహంబ్రహ్మోస్మి' అనే చెపుతున్నారు.'

తాతకు బ్రహ్మత్వ మంటే ఏమిటో వివరించటానికి నిశ్చయించుకున్నది అమ్మ.

'అహం అంటే నేను, బ్రహ్మను నేను. అంటే బ్రహ్మ అయిన నేను. నేనుగానే ఉన్న నేను - అహం బ్రహ్మోస్మి. నేను నేనుగా ఉన్న నేను. అహంకార బ్రహ్మ. నేను నీవుగా ఉన్న నేను అంటే రెండుగా ఉన్న స్థితి - అహంకార బ్రహ్మ. ఇక్కడా బ్రహ్మత్వం లేకపోలేదు. నేను నేనుగానే ఉన్న నేను అనే స్థితి 'అహం బ్రహ్మోస్మి.'

ఉపనిషత్తు అయి అమ్మ వివరిస్తూ ఉంటే తన్మయుడై వింటూ తాత అన్నాడు.

'భ్రాంతి లేనిదే బ్రహ్మ-అన్నావు. ఆ మాట ఎంత బాగున్నది? మళ్ళీ వివరించి చెప్పమ్మా - మా గురువుగారు నాకు తారకం చెప్పారు; నేను పరిపూర్ణమయ్యాను: మా గురువుగారు భ్రాంతి పోవాలని చెప్పేవారు కానీ భ్రాంతిలేనివాడు బ్రహ్మము-అని చెప్పలేదు. భ్రాంతి దేనితో పోతుందమ్మా?'

'చెప్పేదేమున్నది నాయనా - సమయం వచ్చినప్పుడు భ్రాంతి చేతనే భ్రాంతి పోతుంది.'

ఆ వాక్యం తాతకు అర్థంకాలేదు. 'భ్రాంతి చేతనే భ్రాంతి పోవడ'మేమిటి? దానిమీద వివరణ కావాలన్నాడు తాత.

అంతలో ఖాశిం అమ్మవద్దకు వచ్చాడు. ఖాశిం బంధువెవరో చనిపోయాడట. చూచి వస్తానని చెప్పి వెళ్ళాడు.

అమ్మ తాతతో సంభాషణ మళ్ళీ ప్రారంభించింది.

'నీ మనుమడి శరీరాన్ని ఇందాకటి నుంచి గడ్డల్లో పడుకోబెట్టావు, ప్రాణం లేదనుకొని. కాని వాడు బ్రతికి ఉన్నాడు. ప్రాణం ఉందని అనుకున్నప్పుడు ఆ శరీరాన్ని ఎంత చక్కగా పోషించావు. శరీరం అనిత్యమని తెలుసుగా. మీ గురువులు నీకు చెప్పింది అదేగా? ఇందాకటి నుంచీ ఏడ్చింది అందుకేగా?'

'అమ్మా - నేను శరీరం కోసం ఏడ్చానా?'

'మరి దేనికొరకు ఏడ్చావు?'

'కారణం చెప్పలేనమ్మా-'

'పోనీ - యిప్పుడు ఆలోచించు. ఎందుకు ఏడుపు వచ్చిందో...'

ఎక్కడ నుంచి వచ్చిందో గండుచీమల సమూహం తాత కాలిపై ప్రాకింది. తాత వాటిని దులిపి ప్రక్కకు జరిగి నిలబడ్డాడు.

'జరిగావేమిటి నాయనా?' గుర్తించినా గుర్తించనట్లు అమ్మ అడిగింది.

'చీమలు కాళ్ళను కుడుతుంటేను-'

'అది శరీరమేగా?'

'శరీరమే నమ్మా-'

'అనిత్యమైన దానిని గదా కుట్టింది, బాధ ఎందుకు పడ్డావు. బాధ పడ్డదేవరు? అనిత్యమయినదా? నిత్యమయినదా?'

'ఆత్మ నిత్యమయినది.'

'ఆత్మ గోల నా కెందుకయ్యా? అది తెలిసేదీ కాదు. కనపడేదీ కాదు అంటారుగా. నాకు కనపడేదీ మాట్లాడేదీ శరీరం.'

'నీతో శరీరం ఎందుకు మాట్లాడుతున్నది? మాట్లాడేది మనస్సు.'

'అది ఎట్లా ఉంటుంది?'

'నీవు కారణమైతే నీకు తెలుస్తుందిలే అమ్మా'

'అంటే - మనస్సుకు కారణమైతేనా?'

'మా గురువు దగ్గరకు రా చెప్పిస్తా-'

'నేను నీవే గురువనుకుంటాలే - చెప్పు-'

'నాకు ఆ హక్కు యివ్వలేదు మా గురువుగారు. అయినా చిన్న పిల్లవు; దక్షిణలేదు.'

'దక్షిణ అంటే?'

అమ్మ అడిగిన ఆ ప్రశ్న వినిపించుకోకుండా-

'చిన్నపిల్లవూ; పెద్దమాటలూ...'

'నీవు పెద్దవాడివీ, చిన్నవాడి మాటలూ, ఇక మన పెద్దరికమూ, చిన్నరికమూ మాటలేనా?.... సరి... మా ఖాసిం వస్తున్నాడు. ఈ రాత్రంతా యిక్కడనే ఉంటాను. మాట్లాడుకుందాములే-'

'నీకు లో చూపు చేప్పేదా?'

'ఉన్నది ఉన్నట్లుగా కనపడితే చాలు. లోచూపు వద్దు. కనబడుతున్నది కనబడుతున్నట్లుగానే చెప్పు. ఉన్నది ఉన్నట్లుగా కనబడటమే లోచూపు.'

'కాదమ్మా - అంతరయోగం అని ఉన్నది. ఆ దృష్టి వేరే ఉన్నది. నల్లగుడ్డు లోనికి పోనిచ్చి చూస్తారు.'

ఖాసిం వచ్చాడు.

పిల్లవాడు నెమ్మదిగా లేచి కూర్చున్నాడు.

'తాతా - పిల్లవానిని ఎత్తుకో. ఈ రాత్రికి భావన్నారాయణస్వామి దేవాలయంలో పడుకుని రేపు ఉదయం ఎవరిదారిన వాళ్లం వెళ్ళి పోదాము' అమ్మ అన్నది.

'అమ్మా-ప్రొద్దు పోయింది. అక్కడ అంతాచేసి వచ్చాను. అన్నం తినమన్నారు; తినలేదు. చచ్చి ఏడిచేచోట అన్నమెందుకు? నీవు ఎట్లా ఉన్నావో

అని భయంవేసి త్వరగా వచ్చానమ్మా... ఆకలి కావడంలేదూ?'

'లేదు కానీ... ఈ తాతకు ఏదయినా పెట్టించి, పిల్ల వాడికి పాలు యిప్పించి యీ రాత్రికి ఎక్కడయినా పడుకుందాము.'

'గుళ్ళో పడుకుందామా అమ్మా?' ఖాసిం అడిగాడు.

'ఎక్కడయినా సరే- నీ యిష్టం'

అది అసలు అమ్మ నిర్ణయమే అయినప్పుడు అమ్మకు ఎందుకు అభ్యంతరం ఉంటుంది? - కాని అమ్మలో విచిత్రమేమంటే - తన యిష్ట ప్రకారమే యితరులను నడిపిస్తూ... యితరుల యిష్ట ప్రకారం తాను నడుస్తున్నట్లు కనిపింపజేస్తుంది;

వెంటనే అందుకుని తాత అన్నాడు --

'ఇందాకనే నీవు అన్నావుగా అమ్మా - గుళ్ళో పడుకుందామని.'

'ఏదో అనేకం అనుకుంటాము. అనుకున్నవన్నీ జరుగుతాయా? శరీరాన్ని పారవేయాలని నీవు ఎంత ప్రయత్నం చేసినా, యిందాక ఆ వసతి దొరకలేదు. దొరకక పోవటమూ మంచిదే అయిందనుకో - అయినా ఎవరయినా డాక్టర్లు చూస్తే పారవెయ్యనిచ్చేవాళ్ళు కాదేమోలే - ప్రాణమున్నదని.'- అమ్మ తెరవేయటానికి ప్రయత్నం ఆరంభించింది.

'అందరూ పోయాడన్నారు అమ్మా - నాకూ అట్లాగే ఉన్నది; శ్వాసలేదు.'

'ప్రాణమంటే శ్వాసే కాదు శ్వాస ఆగి కూడా బ్రతుకవచ్చు.'

'అది యోగులే సాధ్యమన్నారు మా గురువుగారు.'

' మీ గురువుగారు ప్రాణమంటే ఎక్కడ ఉంటుందో చెప్పారా?'

'నాకు చెప్పలేదు గాని నాకు ఒకటి తోస్తున్నదమ్మ...'

ఇక ఆ తాత తనకు తోచేడల్లా చెప్పటం ఆరంభిస్తే - యిక అది ముగిసే దెప్పటికో అని భయం వేసినట్లున్నది ఖాసింకు.

'ప్రొద్దు పోయిందమ్మా - అక్కడ మాట్లడుకోవచ్చు. వెళదాం పదండి.'

అని ఖాసిం అమ్మను ఎత్తుకోబోయాడు.

అమ్మ, తనను వద్దని ఆ అబ్బాయిని ఎత్తుకోమన్నది. ఖాసింకు ఏ అబ్బాయో అర్థం కాలేదు.

'ఇందాక చచ్చిపోయాడనుకోలేదూ; ఆ అబ్బాయి పోలేదు. ప్రాణం కడబట్టింది.'

ఖాసిం ఆశ్చర్యపోయాడు.

'కాదమ్మా - నేను చూశాను. ప్రాణం పోయినట్టే ఉన్నది.'

'అదేగా -ఉన్నది లేనట్లు కనబడటమే భ్రాంతిఅంటే.'

ఉండి ఉండీ అమ్మ యిచ్చే ఒక్కొక్కనిర్వచనం వింటూ ఉంటే తాతకు ఆశ్చర్యమూ ఆనందమూ కలిగాయి. తన ప్రతిభను కూడా ప్రదర్శించాలన్న కుతూహలమూ కలిగింది.

'తర్వాత మాట్లాడుకుందామమ్మా. నీకు చాలా చెప్పాలనిపిస్తున్నది. భక్తిగల పిల్లవయ్యేటట్లున్నావు.'

అప్పుడే తాతకనులకు పొర, మనసుకు తెర - రెండూ తయారయ్యాయి. తన మనుమడిని రక్షించిందీ తల్లియేనన్న భావం కలిగిన అతనిలో తిరిగి ఆమెకు బోధ చేద్దామన్న భ్రమ కలిగింది.

ఖాసిం పిల్లవాడిని భుజాన వేసుకున్నాడు. అందరూ దేవాలయానికి బయలుదేరారు. దారిలో హోటల్లో ఖాసిమూ, తాత ఫలహారాలు చేశారు. పిల్లవానికి పాలు యిప్పించారు.

భావనారాయణస్వామి ఆలయం చేరగానే ఒక ప్రక్కగా ఖాసిమూ, పిల్లవాడూ పడుకుని నిద్రపోయారు.

తాత పూర్వ సంభాషణ పునఃప్రారంభించాడు.

'అమ్మా - నీకు యిందాక చెప్పిన అంతరయోగమంటే అర్థం కాలేదా?'

'కాలేదు నాయనా-'

'బయలులో బయలు - ఇది ఉత్తబయలు అను భావమే పరిపూర్ణం అని మా గురువుగారు చెప్పారు. రెండు రూపాయలతో పరిపూర్ణం చేశారమ్మా - ఆ నాయన.'

'ఇంతకూ నాకేమి చెపుతావు?'

'నేను తర్వాత చెప్తాను కానీ... యిందాక అన్నీ నీకోసమే అంటివే. అదేమిటమ్మా చెప్పు-'

'నీవు అన్నం ఎవరికోసం తింటున్నావు?'

'లోగడ నేను అన్నం మానేస్తే మా ముసలిది ఏడిచింది అందుకని తింటున్నాను. గుణాలు చంపటం కోసం అన్నం మానేద్దామనుకున్నాను.'

'లోగడ తింటూ మానేశావు కనుక ఏడిచింది.'

'తల్లిదండ్రులు అలవాటు చేశారు కనుక తింటున్నాను.'

'నీవు ఆమెచేత పెట్టించుకు తినటం అలవాటు చేశావు కనుక ఏడిచింది. అన్నం సంగతి సరేలే... పెళ్ళి ఎవరికోసం చేసుకున్నావు?'

'అదీ తల్లిదండ్రులే చేశారమ్మా.'

'అందుకు ఒప్పుకోవటం నీ తృప్తేగా?'

'ఆ-'

'ఆ తర్వాత భార్యతో అవసరాలు నీ అవసరమా? వాళ్ళ అవసరమా?'

'చిన్న పిల్లకు ఏమి మాటలమ్మా?'

'పెద్ద వాడికి చిన్నపిల్లతో ఏమి ఆలోచనలు నాయనా?'

"నీవు చిన్నపిల్లగా లేవమ్మా-'

'నీకు మాత్రం పెద్దరిక మున్నదా?'

'సరేలే... నీకు నేనేదో భక్తిమాటలు చెపుదామనుకున్నా.'

'భక్తి లేని భుక్తిమాటలు యిట్లాగే ఉంటాయి.'

అమ్మ మౌనంగా కూర్చున్నది. అది తాతకు యిష్టం లేదు. అమ్మ మాట్లాడితే వినాలనీ, ఆ మూర్తిని అదేపనిగా చూడాలనీ ఉన్నది. మూర్త ఎదుట ఉన్నా - తృప్తిగా లేదు. ఆ మాటలు కూడా వినాలి.

'నిన్న పిల్లవాడి దగ్గర చెప్పిన మాటలు చెప్పమ్మా చాలా బాగున్నాయి.'

'చిన్నపిల్లనని కోప్పడ్డావుగా?' బుంగమూతి పెట్టి అమ్మ కోపం నటించింది.

'నేను నిన్ను కోప్పడ్డానా? ఈ మాటలు వద్దన్నానుగాని, ఏవైనా జన్మ కడతేరే మాటలు చెప్పు-'

'కడతేరేవి మాటలు కావు.'

కదిలిస్తే బాంబులు పేలినట్లే. అందుకే తాత అన్నాడు. 'ఏమి మాటలమ్మా! మాటల దేవతవా? తత్వాలు చెపుతావా?'

'నీదోతత్త్వం, నాదో తత్త్వం, ఇక నేనేమి చెప్పేది?'

'సాయంకాలం చెప్పిన మాటలు చెప్పమ్మా-'

'ఏమీలేదు నాయనా -మనిషి ఏది చేసినా తన తృప్తి కొరకే చేస్తాడు - అంటాను. అది నా అభిప్రాయం. నీకు నచ్చితే వినూ - లేకపోతే లేదు.'

'చెప్పమ్మా చెప్పు - నా బిడ్డకు ఆపద వస్తే కనిపెట్టుకు కూర్చున్నావు. మర్చిపోయినా నమ్మా - ఆ ఉంగర మివ్వమంటావా?'

'తిరిగి తీసుకోవటానికి యివ్వలేదు. ఆ యివ్వటం నా తృప్తి. ఏది చేసినా అంటే - మేలు చేసినా, కీడు చేసినా, దగ్గరకు తీసినా, ముద్దు పెట్టు కున్నా, తిన్నా తినకపోయినా, అలిగి పడుకున్నా - అన్నీ తన తృప్తి కొఱకే చేస్తాడు. ప్రేమించినా, ద్వేషించినా, - ప్రతి దానికీ తానుతప్ప మరో కారణం లేదు. పెద్దలు 'ధనమూలమిదం జగత్' అన్నారు. కానీ, కాదు. 'తన మూల మిదం జగత్' అంటే తానే ధనమనేమొ. ధనమంటే డబ్బనే కాదు - నా ఉద్దేశం. తాను ఉండి కొన్ని వస్తువులు కావాలంటే డబ్బు అవసరమయింది. తాను ఉండి వస్తువులుంటే - ధనంతో పనిలేకుండా సరిపోతుంది. వస్తువులుండి

ధనం లేకపోయినా జరుగుతుంది. ధనముండి వస్తువులు లేకపోతే జరుగదు. లక్ష రూపాయిలు జేబులో పెట్టుకుని బజారుకు వెళ్ళినా కావలసిన వస్తువు లేనప్పుడు లక్ష రూపాయిలకూ విలువలేదు. నా దృష్టిలో వస్తువే ధనం. ధనమే వస్తువు. అవి భిన్నం కాదు. 'ధనమూల మిదం జగత్' అనేది శ్రుతి ప్రమాణం మాత్రం కాదు. ఎవడో అవసరానికి డబ్బు లేనివాడు వాడిన మాట అది.'

మంత్రముగ్ధుడివలే ఆ మాటలలో మైమరచి ఆ స్వరంలోని మాధుర్యానికి పరవశుడై -

'నీ మాటలు వింటుంటే 'ఉపనిషద్వాణి' వింటున్నట్లున్నదమ్మా - చాల బాగున్నాయి మాటలు.'

'ఇక బాగుండని దేమిటి? - నా రూపమా?'





14. సంహారకారిణి

కొద్దిక్షణాలు తాత అమ్మ ముఖంలోనికి తదేకంగా చూచాడు. కన్నూ ముక్కూ, నోరూ, గడ్డమూ, చెవీ, చెంపలూ, నొసలూ - దేనికదే ఎంతో కుదిరికగానూ, అందంగానూ ఉన్నాయి. ఆపాదమస్తకమూ దృష్టిని సారించాడు. కాళ్ళూ, చేతులూ, నడుమూ, మెడా - అన్నీ తీర్చిదిద్దినట్లున్నాయి. చేతి వ్రేళ్ళు అంత పొడవుగా అంత అందంగా ఉన్నాయేమిటి? కనుబొమ్మల్లో అంత ఆకర్షణ ఉంటుందా?

పాదం నుండి ఫాలంవరకూ యావత్ శరీరమూ దివ్యతేజో విలసితమై నట్లున్నది. ప్రతి అవయవమూ లావణ్యానికి స్థావరమై సౌందర్యానికి ప్రతినిధియై విరాజిల్లుతున్నట్లున్నది.

అలంకృతమయిన సువర్ణాభరణాలు రమణీయమై నవ్యకాంతులు విరజిమ్ముతున్నాయి. మరి, ఆస్వర్ణాభరణాల సంయోగంవల్ల దేహమలా ఉద్దీప్తమై ఉజ్జ్వలమై భాసిస్తున్నదో... ఆ దివ్య శరీర మధురస్పర్శవల్ల కలిగిన ఆనందాతి శయంతో పసిడికాంతియే పదింతలై పరిఢవిల్లిందో తాత మేధకు అందలేదు.

హఠాత్తుగా తాత మనోవీధిలో మురళీధరుడై బాలకృష్ణుడు ప్రత్యక్ష మైనాడు. శిరమున పింఛమూ, నొసటన తిలకమూ, ఉరమున కౌస్తుభమూ నేత్రోత్సవం చేశాయి, పాదమంజీరాల ఘలంఘలారావాలూ, వేణుగానమూ కర్ణామృతమైనాయి.

తాత హృదయం హర్షప్రపూర్ణమై, శరీరం పులకితమయింది.

పారవశ్యంతో చేతులు ముకుళించి 'కృష్ణా... కృష్ణా...' అంటున్నాడు. పెదవులు చలిస్తున్నాయి. కన్నులు స్రవిస్తున్నాయి.

అమ్మ దగ్గరకు వెళ్ళింది.

'చెప్పవేం? నా రూప మెట్లా ఉంది?' ఏమీ ఎరుగని అమాయకు రాలిగా అమ్మ అడిగింది.

జవాబు లేదు.

మళ్లీ అడిగింది అమ్మ.

తాత కన్నులు మూసుకునే, వణికే పెదవులతో-

'నీ రూపమా?... కన్నుల... పండువుగా... ఉన్నది. ఇవ్వేళ నా పుణ్యం పండింది. నా జీవితమే పండినట్లున్నది. లోగడ ఎందుకు యింకా బ్రతికేనా అని వాపోయేవాడిని? నేటికి ఎందుకు బ్రతికానో అర్థమైంది. నేడు నా మనోహరమూర్తిని సందర్శించాను. నా మనోరథం ఫలించింది. నాకింకేమీ వద్దు కృష్ణా... నా కింకేమీ వద్దు. నా బ్రతుకింక చాలురా... నా బ్రతుక్కిది చాలురా...'

అంటూ అమ్మను తన కౌగిలిలోకి తీసుకుని అశ్రుధారలతో అమ్మ శిరస్సు నభిషిక్తం చేశాడు.

'నేను తాతా... నేను. ఇటు చూడు...'

తాత మెల్లగా కన్నులు తెరిచాడు. అమ్మను చూచాడు. తాత కన్నుల నుండి ఆనందంతో పాటు ఆశ్చర్యం తొంగిచూచింది.

'నీవా అమ్మా... నీవా? నీవేనా?'

'ఔను... నేనే.'

'ఇంకెవరూ లేరా?'

'ఎవరూ లేరు. నేను ఒక్కతేనే...'

'ఎంత తియ్యనికలగన్నాను? ఈ సందర్శన మంతా నా భ్రమయేనా? జీవితమే కల అంటుంటే అందులో మరో కల. కలలో కల కల్లకాక మరేమవుతుందీ?'

'అయితే జీవితం యథార్థమయితే కలా యథార్థమవుతుందా?'

'అవన్నీ సరేగాని అమ్మా... మనం యిందాక ఏమి మాట్లాడు కుంటున్నాము? ఈ లోగా నా మనసూ శరీరమూ యిట్లా అయిన వేమిటీ?'

'నీ వేమయినావో, ఎందుకయినావో నాకేమి తెలుసుగానీ... నీవు నన్ను ఏమయినా చెప్పమని అడిగితే నేనే 'తన మూల మిదం జగత్' కాని 'ధనమూల మిదం జగత్' అనే వాక్యం శ్రుతి ప్రమాణం కాదన్నాను.'

'నిన్ను చూస్తుంటే ఎవరెవరో స్మృతిపథంలోకి వస్తున్నారమ్మా. ఆ 'శ్రుతి' అనే పదం మా గురువుగారు తఱచుగా ఉపయోగిస్తుండేవారు. ఇంకోమాట కూడా అనేవారు - 'రజ్జుసర్పభ్రాంతి' అని. అంటే నీకు అర్థం అయిందా అమ్మా?'

అమ్మ ఎంతలో ఎటువంటి తెర కమ్మివేసింది?

'కాలేదు నాయనా--'

'అంటే - తాడును చూచి పామనుకోవటం' తాత వివరించాడు.

'పామును చూచి తాడనుకోరూ? భ్రమ అనేది రెండు వైపులా కలిగించవచ్చుకదా...' అమ్మ న్యాయాన్ని తిరగవేసింది. తాత తికమక పడ్డాడు.

'మా గురువుగారు ఏమి చెప్పారంటే - ఈ ప్రపంచం అంటే యీ జగత్తు ఒకటయితే మరొకటిగా చూస్తున్నామన్నారు. ఇది ఎప్పుడూ ఉండేది కాదుట; లేనిదట. లేని దానిని ఉన్నదనుకోవటం... స్వప్నం మాదిరి...'

'నాకు అర్థం కావటం లేదు తాత - ఇంకా వివరించి చెప్తావా?'

'చిన్న పిల్లవు కదూ? నీ కర్థం కాదులే అమ్మా - '

అంత అనుభవం పొందిన తాత కన్నులకు ఎంతలో గంతలు కట్టబడినయ్!

'పోనీ అర్థం అయ్యేటట్లు చెప్పు-'

సూర్యునికి దారి చూపించేందుకు దీపం పట్టుకునే పిచ్చి వానిలా తాత ఉపక్రమించాడు-

'చీకట్లో తాడుందనుకో... దాని మెలికలు చూచి పామని భ్రమ పడతాడు.'

తాత తానేదో వివరిద్దామని ప్రారంభించినా -- అమ్మ పలికిన వాక్యాలకు తాత మళ్ళీ శ్రోత మాత్రమే అయి అడిగాడు--

'ఎట్లాగమ్మా? ఏమిటి?- చెప్పూ...'

'అసలూ... భ్రమ.... తాడూ, పామూ రెండూ తెలిసిన వాడికేగా కలిగేది.

అచ్చగా తాడు తెలిసినా లేదు. అచ్చగా పాము ఒకటే తెలిసినా లేదు. పసిపిల్లవాని ముందుకు పాము పరుగెత్తుకు వచ్చిందనుకో - వాడు పామును పట్టి ఆడు కుంటున్నాడు. వాడే తాడు పట్టీ ఆడుకుంటాడు. ఏమీ తెలియదను కుందామా?- వస్తువు కనబడితే చేత్తో పట్టుకోవటం తెలుసు. అది ఎటుపోతుంటే అటు పారాడటం తెలుసు. కరుస్తుంది. అపాయమని మాత్రం తెలియదు. అప్పుడు వాడికి తెలివి ఉన్నట్లా, లేనట్లా? పెద్దవారిలో కూడా కొన్ని జంతువుల యొక్క ఉపయోగమూ, వాటి లక్షణమూ తెలియని వారున్నారు. వారి కీ భయం కానీ, భ్రాంతి కానీ లేదు.

భ్రాంతి - అంటే మమకారం.

భ్రమ - అంటే ఊహించటం. అది ఎట్లా అంటే - తాడును చూచి పాము అనుకోవటం అన్నారే... అది భ్రమయేగా? భ్రమ అంటే ఊహించటమూ? లేక భ్రమ అనే దానికి మాయ అని కూడా అర్థం వస్తుందా? - తాడునందు పామును ఆరోపించినట్లుగా - జగత్తు సత్యమనుకొంటున్నామంటున్నారు. బ్రమ్మయే సత్యం కానీ జగత్తు మిథ్య - అను వాక్యాన్ని ఆధారం చేసుకొని అంటున్నారు. రెంటికి ఒకదానికొకటి సంబంధ మునదల్లా అవినాభావ సంబంధ మంటారు. పైన చెప్పిన రజ్జువును సర్పంగా చూచింది నా భావం. భయపడ్డది నా భావం. దీపం తెచ్చింది నా భావం. కాదనుకొన్నది నా భావం. నా భావం సర్వం నా భావం అంతా నా భావం. అంటే అంతా షభావంలోనిదే. అభావమే భావానికాధారమైనది. భావాభావసహితమే ఈ పభ్రావమంతా. దీనికి రహితం లేదు. అంతా సహితమే. 'అందుకే అవినాభావ సంబంధం' - అంటే అవి, నా, భావసంబంధం. అవి - అంటే కనబడేవి. నా భావం - అంటే కనబడే వాటిని ఊహించేది. ఊహను బట్టి సంబంధం. ఏదయినా తాను చూచేదాన్ని బట్టి కనబడుతుంది.'

తాత ఆ మాటల్లోని మాధుర్యం ఆస్వాదించాడే కానీ అందులోని అర్థం ఏ మాత్రమూ తన మనసు కెక్కలేదు.

'నా కర్థం కాలేదమ్మా, ఈ గొడవలేమీ తెలియవు, ఆ గురువుగారు చెప్పిన ముక్కలేకాని, వారు మహావాక్యాలు మాత్రమే చెప్పారు.'

'ఏమిటి ఆ మహావాక్యాలూ?'

'అంటే వాక్యార్థం అంటారు.'

'వాక్యార్థం అంటే వాక్యాల కర్థమా? ప్రతి వాక్యానికీ అర్థముంటుందిగా-'

'అట్లాకాదమ్మా - మహావాక్యాలని వేరుగా ఉంటాయి. అవన్నీ చెప్పిన తర్వాతనే పరిపూర్ణం చెప్పేది. ముందు తారకం, సాంఖ్యం, అమనస్కస్థితి.'

'అమనస్కస్థితే పరిపూర్ణమా?'

'కాదు, కాదు, దేనికదే.'

'దేనికదే అయినప్పుడు అది పరిపూర్ణం ఎట్లా అయింది?'

'నీకు చెప్పినా తెలియదమ్మా- మా గురువుగారి దగ్గరకు రా, చెప్పిస్తా.'

ఎక్కిన మెట్లన్నీ ఒక్కొక్కటే దిగుతున్నాడు తాత.

'నేనిప్పుడు నిన్ను అడిగానా? నీవే చెప్పటం ప్రారంభించావు గాని - '

'నీవు శ్రద్ధగా వినటంలేదు. అర్థం కావటం లేదు. నీకు తలకాయలేదు.'

తాత అడుగుమెట్టు చేరాడు.

అంతలో పిల్లవాడు లేచి 'నేను అమ్మ దగ్గరకు పోతా' ననీ యేడుపు మొదలుపెట్టాడు.

'నాయనా! - మీ అమ్మలేదుగా, చచ్చిపోయింది' తాత అనునయించాడు.

పిల్లవాడు కళ్ళు నలుచుకుంటూ-

'ఉంగరం యిచ్చిన అమ్మ కావాలి' అన్నాడు.

'ఆ. అమ్మాయి యిక్కడనే ఉంది నాయనా...'

తాత చెప్తుండగానే పిల్లవాడు లేచి అమ్మగొంతు వాటేసుకొని 'అమ్మా...' అని పెద్దగా అరచి ప్రాణం వదిలాడు.

తాత బావురుమన్నాడు.

'ఇదేమి అన్యాయం తల్లీ! ఇదేమయినా ప్రయోగమా? రైల్లోకూడా నీవు ఎక్కినప్పటి నుంచీ అన్నీ ఆపదలే. పోయినవాడు పోక మళ్లీ బ్రతకటమేమిటి? భక్తిగల పిల్లవని వెంటబెట్టుకువస్తే యిట్లా అయింది. నీవు అసలు ఎవరవమ్మా?'

'నేను వాడమ్మనే..'

వాడమ్మ అంటే అందిరకీ అమ్మని కూడా అర్థం. గొంతు కఱచుకొని ఉన్న పిల్లవానిని మెల్లగా విడదీసి అమ్మ తనకాళ్లమీద పడుకోబెట్టుకుంది.

తాత ఏడుపు విని ఖాసిం లేచాడు. నిప్పుపుల్ల గీచి చూచి- అమ్మ కాళ్లమీద నుండి పిల్లవానిని లేవదీయబోయాడు. శవంపైకి లేవలేదు.

'ఇదేమి అన్యాయం? ఈ పిల్లవాడిని ఎందుకిట్లా పడవేశావ్? చిన్న పిల్ల అని తెలియదూ? బుద్ధి లేదూ? అసలే వాళ్లు అన్నీ దెబ్బలు తిని ఉన్నారు.'

తాత జరిగినదంతా ఖాసింతో చెప్పాడు.

ఖాసిం ఆశ్చర్యపోయాడు. అమ్మను పదలిపెట్టకుండా తాత వస్తున్నాడా? తాత వెంట అమ్మ వస్తున్నదా? ఇది కేవలం రైల్లో పరిచయమేనా? లోగడనే పరిచయమున్నదా? అందులో ఆ ఉంగరం చూడగానే అతని సందేహం బలపడి అడిగాడు-

'లోగడ అమ్మ సొమ్ము చాలా పోయింది. నీకు యిట్లా లోగడ ఏమయినా యిచ్చిందా?'

తాత తనకేమీ తెలియదన్నాడు.

'సరే అయిందేమో అయింది. ఇప్పుడేమి జరగాలి? తెల్లవారవచ్చింది. అసలు... ఎందుకమ్మా నీకీ పంపకం?'

'అది నా పెంపకం?'

'ఇప్పుడీ పిల్లవాడి సంగతి ఏమి చేయాలి? అర్చకులు వస్తే ఊరుకోరు. ఇక్కడ పీనుగులను పెట్టకూడదు.'

ఆలోచనా భారమూ, బాధ్యతా ఖాసింమీద పడ్డది. తాత దుఃఖంలో ఉన్నాడు. అమ్మ చిన్నపిల్ల!

కాని - అమ్మ వెంటనే అన్నది---

'పీనుగులను పెట్టవలసిన దిక్కడనే. వాడెంత ధన్యుడో! దేవుడిలో లయమయిపోయాడు. లేకపోతే, దేవాలయంలో పోడు.'

'ప్రాణం పోవటమే లయంకావటమా? ఇంకా నయం... నీ ఒళ్ళో పోయాడు కనుక నీలోనే లయమయినా డనలేదు!'

'కాలేదని ఎవరన్నారూ?'

తాత గతుక్కుమని వెంటనే అడిగాడు -

'అయితే నీవే ప్రాణం తీశావా?'

'ఎందుకు తీయకూడదు? ఇచ్చినవాడే తీస్తాడు.'

తాతకు ఆ వాక్యం లోతు అందక అడిగాడు---

'మరి నీవు యివ్వలేదుగా?'

అమ్మ మాత్రం అందనిస్తే కదూ!

'నేను తీయలేదుగా--'

'నీవే తీశావు?'

'అయితే- నేనే యిచ్చాను.'

కొన్ని క్షణాలు నిశ్శబ్దంగా గడచిన పిదప అమ్మ చెప్పింది.

'రెండూ మనం కాదు. ఇన్ని మహావాక్యాలు నేర్చుకుని పరిపూర్ణమైన నీకు అమ్మాయిగా తోచాను. వాడికి అమ్మగా తోచాను. మీకు యిట్లా తోచటానికి ఏది కారణమో... మొదట రైల్లో పిల్లవానికి తగిలిన దెబ్బకు, తర్వాత రక్షణకు, యిప్పుడు అమ్మగా గుర్తించి ప్రాణం విడవటానికి ఆ శక్తే కారణం.'

వేదాంతాన్ని కబుర్ల వరకే అలవాటుపడిన తాత అనుభవంలోకి వచ్చేటప్పటికి తట్టుకోలేక విసుగుతో అన్నాడు---

'సరేలే అమ్మా - మా దారేదో చెయ్యి-'

'నేనేమి చేస్తాను? అమ్మాయిని! ఖాసింను అడుగు-'

ఖాసిం లోపలకు వచ్చి-

'మనం వెళదాం, పదమ్మా-' అన్నాడు.

'ఈ పిల్లవాడినీ, తాతనూ యిక్కడ నుంచి దాటించి మనం వెళదాం.'

'నీ కెందుకమ్మా? ఈ పిల్లవాడితో, తాతతో నీ కేమిటి సంబంధం?'

'నీతో నాకేమి సంబంధమో వాళ్ళతోనూ నా కదే సంబంధం' అంటూ అమ్మ పిల్లవానిని లేవదీసి భుజాన వేసుకున్నది.

ఔను-మన సంబంధాలూ, పరిచయాలూ పరిమితంకాని- అమ్మకు ఎవరితో సంబంధం లేదూ? ఆ సంబంధం సర్వవ్యాప్తమయింది కదా!

అంతకు ముందు ఖాసింకు లేవని పిల్లవాడు అమ్మ చేతుల్లో బెండువలే అయిపోవటం చూచి ఖాసిం ఆశ్చర్యపోయాడు. అయినా అమ్మ భుజాన నుండి తీసుకుని క్రింద పడుకోబెట్టబోయాడు.

అమ్మ ఖాసింను వారించి తన భుజాననే వేసుకుని గబగబా వెళ్ళింది. విస్మయంతో ఖాసిం అమ్మ వంక చూచాడు. ఆ గమనంలో అమ్మమ్మ రంగమ్మ గారు తళుక్కుమని స్ఫురించింది. 'సంవత్సరీకాలకు యింటికి వస్తున్నావా?' అనుకున్నాడు మనస్సులోనే.

'అలస్యం చేయక రండి-' అమ్మ కంఠం వినిపించింది. ఆ స్వరంలో అనుల్లంఘనీయ శాసనం ధ్వనించింది.

ఇద్దరూ వెంటనే బయలుదేరారు. తాతకు అంతకంతకు భయమధిక మయింది. ఆలోచనలో పడ్డాడు. అంతకు క్రితం బాపట్లలో తాత బావమరిది బావమరిదికి ఒక అమ్మాయి కనపడి రక్షణ కలిగించిందట. ఆ విషయం విన్నప్పుడు తనకూ అట్లాంటి అనుభవం కావాలనిపించింది. కానీ ఆ అమ్మాయే యీ అమ్మాయీ అనటానికి ఋజువులేదు. అయినా, ఖాసిం ప్రస్తావించిన బంగారం విషయం. ఆలోచిస్తే - ఆ అమ్మాయీ యీ అమ్మాయీ ఒకరే కావచ్చు. అందుకనే ఖాసింకు ఆ విషయం చెప్పి విచారించుకోమన్నాడు.

ఖాసింకు యిప్పుడు ఆ విచారణ ప్రధానంగా కనుపించలేదు. తనను

ఎత్తుకుండే యీడులో తాను యిట్లా ఎత్తుకుంటుందేమిటీ? అదీ, యింత నిర్దయంగా శవాలనూ... అన్న ఆలోచన వచ్చి - అసలు, యీ అమ్మాయి జన్మయే ప్రత్యేకంగా ఉన్నదని నిర్ణయించుకున్నాడు.

అమ్మ త్వరత్వరగా వెళ్ళి ఒక చోట పిల్లవానిని దింపింది. అది లోగడ అమ్మమ్మ, అమ్మ తెనాలి నుండి వస్తూ ఆగిన ప్రదేశం.

అమ్మ పార కావాలనుకుంటూ ఉండగా - ఒక పార అక్కడ పెట్టి కనుపించింది. వెంటనే దానిని తీసుకుని మూడు పారలు వేసి మట్టి తీసి గుంట చేసి పిల్లవానిని పడుకోబెట్టింది. ఆ స్థలంలో ప్రస్తుతం సహస్ర లింగాలయంలో అమ్మవారి విగ్రహమున్నది.

అమ్మ ఖాసింకూ తాతకూ ఎదురువచ్చి చేసిన పని చెప్పి - 'నేను యిక్కడ ఉంటాను మిగతా మీరు చేసిరండి' అన్నది.

'ఉంగరం తీయను. కావాలంటే మరేదయినా అడుగు - యిస్తాను...'

'ఉంగరం వృధా పోవటమెందుకు? మట్టిలో కలిసిపోవటమేగా?'

'మీ కెందుకు? మీరు పొండి - అంత అల్లారు ముద్దుగా పెంచిన శరీరం మట్టిలో కలిస్తే లేనిబాధ ఉంగరానికి ఏమి వచ్చింది? ఆ రకం ఉంగరం చేయించగలము. ఆ రకం అబ్బాయిని చేయించలేము. సరిగ్గా ఆ రకం ఉంగరం మాత్రం చేయించగలమా? వెళ్ళి అవసరమయినది చేయండి.'

అమ్మ స్వరంలో స్ఫురించే అధికారమూ. అమ్మ సాహస చర్యలూ చూస్తుంటే ఖాసింకు కూడా భయం వేయసాగింది.

ఖాసిమూ, తాతా యిద్దరూ కదలకపోవటం చూచి- 'మీరు అక్కడకు పోతారా? లేదా? తాతా... నీ విషయం చెప్పు-'

'నేను పోతానమ్మా - నీవు కూడా ఉండు-'

'తాతా, ఖాసిమూ, అమ్మా -వెళ్ళుతుండగా తాతకు ప్రమాదకరమైన విరోచనమూ వాంతీ అయి స్పృహతప్పి పడిపోయాడు.

20 'కలరా రానే వచ్చిందమ్మా. పిల్లవాణ్ణి కూడా అదే ఎత్తుకు వెళ్ళిందేమో...'

ఖాసిం భయపడ్డాడు.

'తాతా... తాతా..' అని అమ్మ పిలిచింది.

తాత మెల్లగా కళ్ళు తెరిచి అమ్మను చూచి లేని ఓపిక తెచ్చుకుని పెదవులు తడుపుకుని అన్నాడు.

'ఆపదుద్ధారణివే అనుకున్నాను కానీ నీవింత భయంకర సంహారకారిణి' వనుకోలేదమ్మా-'

'అట్లాగునా?' అమ్మ చిరునవ్వు నవ్వింది.

మరి, అతనికి ఆ చిరునవ్వులో ఏమి వినిపించిందో, ఏమి కనుపించిందో...

'నేను పొరబడ్డానమ్మా! నన్ను క్షమించమ్మా - నీవు సంహారకారిణివే కాదమ్మా - ఈ సర్వసృష్టి స్థితిలయకారిణివమ్మా.'

తాత చేతులు జోడించాడు. కన్నులు మూశాడు. అంతే- ఇక ఆ కన్నులు తెరువలేదు. అంతిమశ్వాస వదిలాడు.

15. త్యాగమూర్తి

ఖాసిం తాత పలికిన తుదిమాటలు విన్నాడు; తాత చేతులు ముకుళించి కన్నుమూయటం చూచాడు; ఆశ్చర్యపడిపోయాడు. వెంటనే ఖాసిం మనసులో గుంటూరు మస్తాన్ స్ఫురించాడు.

నిర్లిప్తంగా ఉన్న అమ్మవంక చూచాడు.

'ఆ మస్తానయ్యే యిట్లావచ్చాడా; ఆ మస్తానయ్య అద్దం విసిరివేస్తే చుక్కాని అయిందట. ఈమే నడకలో ప్రతి అడుగూ చుక్కానిగానే ఉన్నది.'

-అనుకుంటూ మస్తాన్‌ను కొన్ని క్షణాలు మనసులో ధ్యానించుకొని...

'ధైర్య మియ్యయ్యా-ముసిలోణ్ణీ, ఈ పిల్లోణ్ణీ ఏం చెయ్యమంటూవు? చిన్నపిల్ల అయినా అమ్మాయిగారిని గురించి ఏమీ భయం లేదులే. పెద్ద వారికంటే ధైర్యమున్నది...'

అనుకుంటూ నాలిక కొరుక్కొని...

'అయ్యో... ఇదేమిటి అమ్మను మస్తానయ్యే అనుకుంటూ మళ్ళీ యిట్లా అనుకుంటానేమిటీ?'

అని ఖాసిం భావ ఘర్షణలో కల్లోల పడుతుండగా అమ్మ అన్నది.

'ఖాసిం! ఏమిటి ఆలోచిస్తున్నావు? మనం యిందులో యిరుక్కు న్నాము, ధైర్యమున్నా లేకపోయినా యిక్కడ ఉన్న పనిచేసి వెళదాము.'

ఖాసిం ఉలిక్కిపడి అడిగాడు...

'ధైర్యం అనేమాట అంటున్నావు. నేను నీతో ఏమయినా అన్నానా? నాలోనేగా అనుకున్నది.'

'నీ వనుకున్నావని నేననలేదు. నాకు తోచి నేనన్నాను. ఇంతకూ వీళ్లను ఏదో ఒకటి చేసి వెళదాము. నేను పిల్లవాడికి మట్టికప్పి వస్తాను. నీవు తాతకు మట్టి వేసెయ్యి. తాతకు కూడా నేను కాస్త మట్టి వేస్తాలే...'

అని గుప్పెడు మట్టి తీసుకుని తాతమీద వేసి...

'పోదాము-రా. యిద్దరం కలిసి పిల్లవాడి దగ్గరకు వెళదాము' అని ఖాసింను అమ్మ తీసుకువెళ్లింది.

పిల్లవానిని సమీపించగానే ఆ పిల్లవాడు ఒక ఉయ్యాలలో ఊగుతున్నట్లు, ఒక ముత్తయిదువ ఊపుతున్నట్లు కనుపించింది. ఖాసిం గుండె ఝల్లుమన్నది.

'ఈ పిల్లవాడు అప్పుడే అటువంటిచోట పుట్టాడా?' పుడతాడా అమ్మా?'

'ఎటువంటి చోట?'

'నాకు కనుపించిన చోట.'

'నీకు కనుపించినచోటు నాకు కనుపించలేదుగా. అయినా నాకేమి తెలుసు?'

'ఏమో, యిన్ని చేస్తున్నావు - పొడుంకాయల్లే.'

అమ్మ ఆ మాటలను విననట్లుగానే అన్నది-

'పారతీసుకో - మట్టి పోద్దువుగాని.'

'నీవే పొయ్యమ్మా-'

'చిన్న పిల్లలు పోయవచ్చా?'

'నీవు యివన్నీ ఎట్లాచేశావు? యివన్నీ చిన్నపిల్లలు చేసే పన్లేనా?'

'ఇప్పుడే తెలుసుకున్నా చెయ్యకూడదని, పొడుంకాయల్లే.'

తన మాటను అమ్మ తిరిగి తనకు అప్పజెప్పేసరికి ఖాసిం మనసు కలుక్కుమన్నది.

'కోపం వచ్చిందా అమ్మా - తమాషాగా అన్నాను. అంతే' అని పార తీసుకుని పిల్లవాని మీద మట్టిపోసి వెనక్కు తిరిగి చూచాడు. అమ్మ కనుపించలేదు. దృష్టి సారించాడు. అమ్మ రోడ్డు మీద నిలుచుని కనుపించింది.

తన వెన్ను ఆనుకుని నిలుచున్న అమ్మ ఎప్పుడు ఎట్లా రోడ్డు మీదకు వెళ్లింది? నడిచి వెళ్లటానికి వ్యవధి ఏది? అని ఆలోచించుకుంటూ అమ్మ

వద్దకు వచ్చి అమ్మను చూస్తూ యదాగుండెపడి నిలుచున్నాడు.

'ఇంటికి వెళదామా?' అమ్మ, ఏమీ జరగనట్లు, ఏమీ తెలియనట్లు ప్రశ్నించింది.

'తాత ఉన్నాడుగా - మట్టికప్పి వస్తా.'

'ఏం? ధైర్యంగా మట్టిగా కప్పుతావా - నే లేకపోయినా?'

'ఆ- ఎంతమందికైనా యీ రోజు నుండి కప్పివేస్తా - నీ దయవుంటే.'

'నా దయ ఏమిటి? నీకు ధైర్యం వచ్చే రోజు వచ్చింది.'

'నాకు ధైర్యం కొరకేగా అమ్మా - నన్ను యీ పనిచేసి వదిలి పెట్టావు.'

'ఎక్కడ వదిలి పెట్టాను?'

' మీ నాన్నగారు ఎప్పుడూ 'నట్టింట పుట్టిముంచటం' అంటారు. అట్లాచేశావు నీవు నన్ను.'

' మళ్లీ అనూ-'

'ఏదోలే అమ్మా... ఎందుకు?'

'ఆ ముంచటం నీ కెందుకు ఉపయోగ పడ్డది?'

'పార చేతికిచ్చి తప్పించుకున్నావుగా?'

'అయితే - అదేనా నీ ధైర్యానికి కారణం? ఏ ఆధారం లేనప్పుడు ధైర్య దానంతట అదే వస్తుంది, ఖాసిం, అధైర్యమే ధైర్యాని కాధారం. నేనిక్కడ కూర్చుంటాను. ఆ పని కూడా పూర్తి చేసిరా, పోదాము.'

ఒక రసవత్తరమయిన నాటకానంతరం తెరజారి దీపాలు వెలిగినట్లుగానే తెలికాంతుల ప్రసారం ప్రారభమయింది. ఇకనైనా మేలుకొనమనేమో. కోడి ఖాసిం చెవిలో కూసింది.

'అప్పుడే తెల్లవారిపోయింది. ఇక, మనుషులు తిరుగుతారు. త్వరగా మట్టివేసి వస్తాను. వెళ్లిపోదాం.'

'ఆ పొలాల్లో ఎవరో మనిషి కనుపడుతున్నారు, పిలువు - డబ్బులిచ్చి,

మట్టి పొయ్యమని చెప్పు - మనం పోదాము.'

' నా దగ్గర రూపాయిన్నరే ఉంది. రెండు రూపాయిల క్కూడా పోస్తాడో పోయడో, అదీగాక అతనికెందుకు యీ విషయం తెలియనివ్వటం?'

'ఏం ఫర్వాలేదు. పిలువు-'

ఖాసిం చప్పట్లుకొట్టి కేకవేశాడు. అతడు చేలో నుంచి చెయ్యి ఎత్తాడు. ఖాసిం చెయ్యి ఊపాడు.

అతడు వస్తూండగానే అమ్మ ఖాసింతో-

'అతడు రైతు. మట్టి నీవు పొయ్యి అని చెప్పకు - పోయించమని చెప్పు-'

ఖాసిం పకపకా నవ్వి -

'సరేలే - అమ్మా, మా అమ్మ కరిణీకం చేస్తే బాగుండును!'

'ఎటూ చేస్తానుగా.'

'నీవెందుకు చేస్తావు? అన్నయ్య చేస్తాడు.'

'కరణాన్ని అనిపించుకోనుగాని కరిణీకం చేస్తాను.'

'చెయ్యమ్మా చెయ్యి - రంగమ్మ తల్లి కడుపు చల్లగా భూమి మీద పది కాలాలపాటు చల్లగా వుంటే అంతే చాలు.'

'నా పుటకే ఆవిరి. చల్లదనమేముంది?'

'నీ పుటకేనా? అందరిపుటక ఆవిరేనా?'

'పుట్టటానికి కారణం అకారణం. కారణాలు చూస్తే మాత్రం ప్రతి జన్మకు ఆవిరే కనుపడుతుంది.'

'అంతేగా అమ్మా! మా అమ్మ హనుమంతయ్యగారి మాదిరిగా తయారవుతుంది.'

రైతు దగ్గరకు వచ్చాడు. అతడు ఖాసిం ఎఱిగినవాడే. అతని పేరు డేగల కోటయ్య.

'అమ్మాయికి రాత్రికూడ అన్నం పెట్టించలేదు. ప్రొద్దెక్కుతున్నది. నాకు ఒక సహాయం చెయ్యి - ' అని ఖాసిం అర్థించాడు.

'అన్నం పెట్టించమంటావా?' కోటయ్య అడిగాడు.

'ఏట్టే-కాదు. రాత్రి ఒక ముసలివాడు యిక్కడ పోయాడు. అమ్మాయిని తీసుకొని నేను త్వరగా వెళ్ళాలి. ఆ ముసలివానిమీద దోసెడు మట్టి పోయించు-'

-అంటూ జేబులోని రూపాయితీసి కోటయ్యకు యివ్వబోయాడు.

'మిగిలిన అర్థరూపాయి గూడా యివ్వు-' అని అమ్మ అనగానే కోటయ్య తనకు డబ్బు వద్దన్నాడు.

'నాకు పోయించవలసిన బాధ్యత ఉన్నది. తీసుకో నాయనా-అయితే యింకొకటి అది నాది కాదు. ఇదీ నాది కాదు. నాకున్నది మట్టే అనుకో - ముసలివాడెంతో నీవూ అంతే.'

కోటయ్య పకపకా నవ్వి-

'నా పనికూడా యింతేనా ఏమిటీ?' అన్నాడు.

'కాదు నాయనా - ప్రేమకు యిద్దరూ ఒకటే అన్నాను. అతని పేరుతో యీ రూపాయిన్నరకు ఏదైనా చేయించు-'

-అని కోటయ్యతో చెప్పి ఖాసింను డబ్బులు యివ్వమన్నది.

కోటయ్య డబ్బులు అందుకుని అమ్మ చెక్కిళ్ళు తాకి ముద్దు పెట్టుకొని-'పోయిరండమ్మా...' అన్నాడు.

వారు కొద్దిదూరం పోగానే; కోటయ్య పరుగెత్తుకు వెళ్లి ఒక పావలా ఖాసిం చేతిలో పెట్టి-

'దొప్పలపూడిలో ఏదైనా కొనిపెట్టు అమ్మాయికి-' అన్నాడు.

'కొనుక్కు తినటమేకాదు. నాయనా - ఏది బుద్ధిపుడితే అది చేస్తాను. నీవు చేసిన పనినేనూ చేయవచ్చు -' అని అమ్మ అన్నది. ఖాసిం పావలా తీసుకుని జేబులో వేసుకున్నాడు.

కోటయ్య 'మహాచురుకైన పిల్ల' అంటూ వీపుమీద తట్టి ఏదో అనిర్వచనీయమైన ఆనందం మనసును నింపివేస్తుండగా-వెళ్ళి ముసలివాని మీద మట్టి కప్పివేశాడు.

ఆ స్థలంలో ప్రస్తుతం సహస్రలింగాలయ ప్రాంగణంలో గరుత్మంతుని విగ్రహమున్నది.

అమ్మను భుజంమీద ఎక్కించుకుని - మనోయవనికపై వెలుగునీడల మధ్య ఎన్నో దృశ్యాలు పరుగులు తీస్తుండగా-రామచంద్రపురం మీదుగా దొప్పలపూడి చేరారు.

దొప్పలపూడిలో చాలామంది ఖాసింను ఎఱిగినవారే. చిగురుపాటి నరసయ్యగారు ఎదురై అడిగారు-

'ఎవరా అమ్మాయి?'

' మా కరణంగారి అమ్మాయి.'

'వారి భార్య పోయిందటగా-'

'ఔను. ఆమెగారి సంవత్సరీకాలకే అమ్మాయిగారిని తీసుకు వెళ్ళు తున్నాను.'

అంటూ ముందుకు సాగి కొంతదూరం వెళ్ళేసరికి - ఏడు సంవత్సరాల పిల్ల ఒకతే రెండు సంవత్సరాల పిల్లను పొట్టకు కఱచుకుని చీమిడి ముక్కుతో ఏడుస్తూ కనుపించింది.

అమ్మ చివాలున ఖాసిం భుజం మీద నుంచి దూకి, ఖాసింను అడిగి పావలా తీసుకుని ఆ పిల్లకు యిచ్చి తన వంటిన ఉన్న గౌను కూడా విప్పి 'ఆ పిల్లకు తొడుగు-' అని యిచ్చి వేసింది.

ఖాసిం ఆశ్చర్యపోయాడు. త్యాగానికయినా హద్దు ఉండాలనుకున్నాడు. కించిత్ కోపం కూడా వచ్చింది.

గౌను కూడా యిచ్చావేమిటి? ఇప్పుడు ఉత్త వంటితో ఎట్లా వస్తావు?'

'నిన్న తాతగారు మూటలన్నీ తీసుకునివెళ్ళి ఉండరు. ఇక్కడే అట్టేపెట్టి ఉంటారు. నాన్నగారు ఎక్కువగా వస్తూ పోతూ ఉండేయిళ్ళలో పెడతారు. కనుక్కో-'

'ఇప్పుడెక్కడలే - ఎండెక్కుతుంది, వెళదాము.'

'ఈ లాగు కూడ యిచ్చివేస్తే అప్పుడేమి చేస్తావు?'

'అబ్బబ్బ - వెళ్లివస్తానుండు తల్లీ.'

- అని అక్కడకు దగ్గరలోనే ఉన్న కాపూరి వెంకయ్య గారింటికి ఎళ్లి కనుక్కుంటే ఒక మూట మాత్రం తాతగారు తీసుకు వెళ్లినట్లు మిగిలినవన్నీ అక్కడనే ఉన్నట్లు తెలిసింది. ఖాసిం ఆ మూటల నుండి గౌను ఒకటి తీసుకుంటూ ఉండగా లాగు కూడా యిచ్చిందేమో..' అన్న సందేహం కలిగి 'ఎందుకైనా మంచిది' అని లాగు కూడా ఒకటి తీసుకుని వచ్చేసరికి అమ్మ లాగు కూడా యిచ్చి దిగంబరియై నవ్వుతూ నిలుచున్నది.

'నే ననుకున్నంతా చేశావ్!' అని ఖాసిం ఆశ్చర్యపోతుంటే...

'కాదు; నేనన్నంత చేశాను. నేనన్నదే నీ వనుకున్నది. నీ వనేదయినా, నీవనుకునేదయినా, నే ననుకుంటేనే-'

ఖాసింకు ఆ మాటల్లో గర్భితమయిన పరమరహస్యమూ, పరమ సత్యమూ అర్థంగాక-

'ఎట్లాగయితే నేమిలే..' అంటూ అమ్మకు లాగూ, గౌనూ తొడిగి భుజాన ఎక్కించుకొని బయలుదేరాడు.

ఊళ్లోకి వెళ్లగానే ఎదురుపడిన ప్రతి ఒక్కరూ అమ్మతో పాటు యింటికి నడిచారు. యింటికి వచ్చిన అందరూ అమ్మను ఎత్తుకుని ముద్దు పెట్టుకుని దించారు.

'రంగమ్మతల్లి పిల్లల బ్రతుకుకోసం తపస్సు చేసింది. చివరకు యీ తల్లిని చూచుకునేటందుకు తనే లేకపోయింది'- అని రంగమ్మగారి దురదృష్టాన్ని తలుచుకుని ఆబాలగోపాలమూ కంట నీరు పెట్టుకున్నది.

బంధువులందరూ అమ్మను-మా యింటికి పోదాము రమ్మంటే మా
21 యింటికి పోదాము - రమ్మనమని అడిగారు. అమ్మ అందరినీ నిరాకరించింది.

అంతలో గొల్ల నాగమ్మ వచ్చింది. అమ్మను చూడగానే నాగమ్మ గుండెలో సముద్రం పొంగింది.

'మన యింటికి పోదామా?' సంతోషంగా అర్థించింది నాగమ్మ.

అమ్మ దివాలున లేచి నిలుచుని చేతులు చాచింది. నాగమ్మ అమ్మ చేరువకు వెళ్లింది. అమ్మ నాగమ్మవంక చూచింది. నాగమ్మ చూపు నిలిచి పోయింది. శరీరం కొయ్యబారింది.

కొద్ది క్షణాల పిదప నాగమ్మ 'అమ్మా మిట్టమధ్యాహ్నం సూర్యుని లాగా ఉన్నావమ్మా. ఆ సూర్యుని చూస్తూ కళ్లు తెరవలేము. నిన్ను చూస్తుంటే మూయలేము' అన్నది.

చూట్టూ ఉన్నజనం అమ్మ ఎవరింటికీ వెళ్ళనని నాగమ్మతో వెళ్లటానికి అంగీకరించటమూ, నాగమ్మ స్థితీ చూచి పెంచిన మమకారం వల్లనని అనుకున్నారు.

నాగమ్మ ఆనందాశ్రువులతో అమ్మను ఎత్తుకుని వాకిట్లోకి వచ్చేటప్పటికి తెనాలి నుండి వెంకట సుబ్బారావుగారూ, జానకమ్మగారు అప్పుడే వస్తూ ఎదురైనారు.

'పిల్లను యిప్పుడెక్కడికి తీసుకువెళ్ళుతున్నావు. మేము పిల్లకోసం వస్తే. దించి వెళ్ళు-' అని నాగమ్మ చంకలోని అమ్మకోసం జానకమ్మ చేతులు చాచింది.

'ఎంత పెంచినా వారిపిల్ల కనుక దించమన్నారు. దించక తప్పదు. తనకు ప్రేమేకాని హక్కు ఏమున్నది? రంగమ్మ గారే ఉంటే యిట్లా అనకపోను' అని నాగమ్మ అనుకుంటూ ఉండగా కన్నులు స్రవించాయి.

జానకమ్మగారు మళ్లీ చేతులు చాచి అమ్మను రమ్మన్నది. అమ్మ నాగమ్మ చంక దిగలేదు. వెంకట సుబ్బారావుగారు పిలిచారు. అమ్మ రానని తల వూపింది.

'సరే-కాసేపుంచుకుని తిరిగి తీసుకురా-' జానకమ్మగారు నాగమ్మను శాసించింది.

నాగమ్మ అమ్మను తనయింటికి తీసుకుని వెళ్ళుతుంటే- దారిపొడుగునా అమ్మను ముద్దు పెట్టుకొనడమూ, తలదువ్వడమూ, వీపు నిమురుటంతో - దాదాపు రెండు గంటలు పట్టింది.

16. విస్మృతి

అమ్మను మన్నవలో దించి ఖాసిం దొప్పలపూడి వెళ్ళి అక్కడ వదిలిన సామాను తీసుకుని తిరిగివచ్చాడు. చిదంబరరావుగారు ఖాసింను 'ఎంత సేపయింది వచ్చి' అని అడిగారు. కాని ఖాసిం సమాధానం చెప్పేలోగానే పనిమీద లోపలకు వెళ్ళారు.

అన్నపూర్ణమ్మగారు సీతాపతితాతగారిని - 'పిల్లవచ్చిందట చూచావా?' అని అడిగింది.

'ఆ - దూరంగా చూచాను. అందరూ వచ్చారు. నేను దగ్గరకు పోలేక పోయాను.'

ఇంతలో జానకమ్మగారు అందుకుని 'నేను పిలిచినా రాలేదు. మేము గొల్లనాగమ్మ మాత్రం చేయలేదు' అని నిష్ఠూరాలు పలుకుతుంటే అన్నపూర్ణమ్మ గారు కల్పించుకుని 'అబద్ధమేమున్నది? దాని మాత్రం మనం చేయలేదుగా' అని నిజం పలికింది.

'తనకు ఎవరు ఎక్కువ చేసిందీ, ఎవరు తక్కువ చేసిందీ భేదం తెలిసి వెళ్ళిందా అమ్మాయి? నాగమ్మ రమ్మనగానే-పెంచింది గనుక వెళ్ళి ఉంటుంది' అది సీతాపతి తాతగారు సమర్థిస్తే-

'అది మాత్రం ఎల్లా తెలిసిందయ్యా?' అని జానకమ్మగారు ప్రశ్నించింది.

'ఇప్పుడు అది అంతా ఎందుకు? రేపటి నుంచి పెంచవలసింది మీరేగా ఆ పిల్లను? తల్లి సొమ్మును మీరే తీసుకువెళ్ళండి. ఇక్కడయినా ఎవరో చూడవలసిందేగా...' అని సీతాపతి తాతగారు కోరారు.

వెంకట సుబ్బారావుగారు గొంతు పెద్దదిచేసి అన్నారు.

'అసలే మంటపుడుతుంటే యిప్పుడెందుకీ గొడవ? కావలెనని మేన మామ కొడుక్కు, అందరితో విరోధం పెట్టుకుని యిచ్చిచేస్తే కావలసింది అయిపోయింది. ఎవరు పెంచినా తల్లికాదుగదా? అందులో నాకు చేసి దాటేస్తుందని ఆ పిల్లమీద ఆశ పెట్టుకున్నా...'

అంటూ సీతాపతితాతగారి నుద్దేశించి--

'నా సంగతి అట్టే పెట్టండి. ముందు వీడిపరిస్థితి ఏమిటి?'- అని అడిగారు.

వెంకట సుబ్బారావుగారి మాటలకో, లేక తన పరిస్థితిని ఊహించు కున్నందు వలననో -సీతాపతితాతగారి కన్నులు చెమ్మగిల్లగా అన్నారు-

'నాకు పెళ్లి అవసరం లేదు. అమ్మాయికేమీ ఫరవాలేదు. రాఘవరావుదే బాధగా ఉన్నది. బుద్ధిమంతుడయితే ఏ అమ్మఅయినా అన్నం పెడుతుంది. కాని అల్లరి ఎవరు భరిస్తారు?'

'సామాన్యమయిన అల్లరి కాదుగదా. అది ఆ తల్లికే సరిపోయింది. వాళ్లమ్మ-నేను చస్తేగానీ నీకు బుద్ధిరాదురా అంటూ ఉండేది. ఇక, బుద్ధి వస్తుందేమో..' అని జానకమ్మగారు రాగాలు తీసింది.

'ఈ మాటలన్నీ ఎందుకమ్మా? వచ్చినపని నెరవేర్చుకోండి. పిల్లల సంగతి యిప్పుడెందుకు? అది వచ్చినపని నెరవేర్చుకు పోయింది. ముప్పయి సంవత్సరాలకే ఎనిమిది మందిని కన్నది. ఉన్న యిద్దరినీ నా చేతిలో పెట్టి పోయింది' అని చిదంబరరావుగారు నిట్టూర్చారు.

'ఎవరి పిల్లలు వారికి బరువుకారు. ఇంకొకరు పెంచవలసి వస్తే మాత్రం పిల్లల గుణగణాలు ఆలోచనకు వస్తాయి' అని సీతాపతితాతగారు విచారపడ్డారు.

'నాకు వేరే భయంలేదు. వీడిని తీసుకువెళ్లితే రాముడు చెడిపోతాడని భయం' అని జానకమ్మగారు తన అభ్యంతరాన్ని వెలిబుచ్చింది.

చిదంబరరావుగారు వెంటనే అన్నారు.

'నేను చెప్పింది అర్థంచేసుకోనండి వదినగారూ... పిల్లను గురించి భయంలేదు. ఎవరైనా పెంచగలరు. ఈ పాటున వదిలిపెడితే నాగమ్మ అయినా పెంచుతుంది. ఎవరిమాట ఎందుకు? పోతూపోతూ తల్లియే చెప్పి పొయిందిగా, వాడిదే బాధ అని. పిల్లవాడు మీ కెవరికీ అక్కరలేదు. ఇక, ఎందుకీ రభస? నేనే పెంచుతాను.'

'వాడేం చిన్నపిల్లవాడా? జడ వెయ్యాలా? నీళ్ళు పొయ్యాలా? - మా తిప్పలు మేము పడతాములే...' అని నిస్పృహలో పడ్డారు.

ఒక మనిషి పోతే ఎందరికి ఎన్ని ఆలోచనలు!

'నాయనా చిదంబరా, జరిగేది జరుగుతుందిగా. అంతల్లా యింత య్యింది. నాకు సానుభూతి చూపేది. నా రెక్కలు ముక్కలవుతున్నాయని బాధ పడేది. నాకు చేసి నన్ను దాటిస్తానన్నది. చివరకు నా కళ్ళముందు తానే దాటిపోయింది... ఒక సంవత్సరం కష్టపడితే ఏ తల్లో ఒక తల్లి వచ్చి కాచిపోస్తుంది' అని మరిడమ్మగారు తన విచారపూరిత కంఠంలో నుండి ఆశాభావాన్ని వ్యక్త పరిచింది.

సీతాపతితాతగారు తాతమ్మగారి మాటల్లోని భావాన్ని గ్రహించి యిష్టంలేక క్రిందపరుచుకున్న ఉత్తరీయం విదిలించి భుజాన వేసుకుని-

'ఎత్తులు వేస్తున్నావు. ఆ పప్పులేమీ ఉడకవు. 39 ఏళ్ళు వచ్చాయి ఇంకా ఏమి పెళ్ళి?'

అంటూ అక్కడ నుండి బయటకు వెళ్ళిపోయారు.

* * *

అమ్మ నాగమ్మగారి యింటివద్ద చిన్నప్పటి విషయాలు గుర్తు ఉన్న దానిలాగా ఆ స్థలాలన్నిటినీ తన చరణ రజస్సుతో పునీతం చేస్తూ -

'మీ అమ్మాయి ఏదీ?' అని నాగమ్మ నడిగింది;

'మా అమ్మాయి ఎవరో నీకు తెలుసా?' నాగమ్మ నవ్వింది.

'నాకు అప్పుడు పాలు యివ్వలా? సుబ్బలక్ష్మికదా పేరు.'

'నీతో ఎవరు చెప్పారమ్మా?'

'ఎవరో చెప్తే విన్నాను.'

చాకలి సుబ్బమ్మ 'అందరూ చెప్పుకుంటూ ఉంటే విన్నది కాబోలులే. దానిలో ఏమ్మునది?' అన్నది.

కాని నాగమ్మ ఆ విషయాన్ని అంత తేలిగ్గా తీసుకోలేదు. అమ్మ జ్ఞాపక

శక్తి అతిమానుషమనుకున్నది. కాట్రపాటి లక్ష్మీ నారాయణగారి భార్య సుబ్బమ్మ గారు కూడా అమ్మ చురుకుదనాన్ని అసామాన్యమని ప్రశంసించింది.

అంతలో పొలం నుండి సుబ్బలక్ష్మి వచ్చింది. ఇంట్లో అమ్మను చూచింది. పట్టలేని ఆనందం కలిగింది. అమ్మదగ్గరకు ఒక్క గంతు వేసింది. దారిలో మండిగం తగిలి బోర్లపడ్డది. ఆ పడటంలో సుబ్బలక్ష్మిచేతులు అమ్మపాదాలమీద పడ్డాయి. లేచేటప్పుడు చేతుల ఒత్తిడికి అమ్మ పాదాలు కందాయి.

'పిల్లపాదాలు చూడు - కనపడటంలేదూ?' నాగమ్మ సుబ్బలక్ష్మిని కోప్పడింది.

'ఏమీ కనపడలేదమ్మా - అమ్మను చూడగానే ఏదో మాయ కప్పినట్లు అయిపోయింది. పాదాలు చేతికి తగలగానే నా సర్వమూ మరచిపోయాను. ఏమిటో శరీరం నుండి లాగినట్లయింది.'

'నీ కడుపులో ఉండేప్రేమే లాగింది' అని కాట్రపాటి సుబ్బమ్మగారు పూర్తిచేసింది.

సుబ్బలక్ష్మి అమ్మను తన ఒడిలోకి తీసుకుని పాలు త్రాగమని కోరింది.

'ఆకలిగా లేదు. అయినా యిక్కడ నా పాలు లేవుగా!'

'రోజూ ఏ పాలు త్రాగుతావు, మరి?'

'ఎప్పుడన్నా గేదెపాలు కాచి యిస్తారు.'

'అవేనా నీపాలు అంటే? నీ పాలు నా దగ్గర ఉన్నాయమ్మా. నీవు త్రాగమ్మా. ఒకసారి నీకు యిస్తేగానీ నాకు తృప్తి వుండదు' అని సుబ్బలక్ష్మి ప్రాధేయపడ్డది.

'త్రాగటం చేత కావద్దూ యిప్పుడు? అమ్మ పేచీ పెట్టింది.

'ఒక్కసారి యీ రొమ్ము నోట్లో పెట్టుకో అమ్మా తృప్తి పడతాను' సుబ్బలక్ష్మి బ్రతిమాలింది.

'అయితే - నీ కోసమేగా యివ్వటం. నా కోసం కాదన్నమాట' అమ్మ తర్కించింది.

'కాదమ్మా - నీ కొరకేగా యివ్వటం' సుబ్బలక్ష్మి సమర్థించుకో ప్రయత్నించింది.

'మరి నేనెక్కడున్నా వచ్చి యిస్తావా? ఇన్నాళ్లనుంచీరాలేదే?'

'మా అమ్మ దెప్పుతున్నది; పోట్లాడుతున్నది' అని నాగమ్మ చిన్నగా నవ్వుకుని అన్నది-

'ఒక రోజున నేను బాపట్ల వచ్చానమ్మా. ఆ రోజున నాన్న ఊళ్లో లేరు. తాతమ్మ నిజామాబాదు వెళ్లింది. నీవు ఎక్కడికో ఆడుకోబోయావని చెప్పారు. మళ్లీ తెల్లవారుజామున వచ్చేటప్పుడు చూస్తే - నిద్రపోతున్నావు. లేపకుండా చూచి వచ్చానమ్మా-'

'నిన్న కాదమ్మా అన్నది. పాలిచ్చే ఆమెను.'

ఆ మాట వినగానే సుబ్బలక్ష్మి గతుక్కుమన్నా వెంటనే తెప్పరిల్లి -

'నేను రోజూ నిన్ను అనుకుంటా తల్లీ - ఈ కాపురంలో బయటకు వచ్చేందుకు లేదు. ఏ రోజు కూలి ఆ రోజు తెచ్చుకోవాలి. రోజూ పిల్లకు పాలిస్తూ నీవే త్రాగుతన్నావనుకుంటాను' అని తన సంవత్సరన్నర వయస్సుగల పిల్లను చూసి-

' ఈ పిల్లకు నీ పేరే పెట్టుకున్నా'నని చెప్పింది.

'ఇక, నాకు పాలివ్వటం ఎందుకు?'

'అది - లేనప్పుడు ఉన్నట్లుగా చూచుకోవటానికమ్మా-'

'ఉన్నప్పుడు కూడా లేనట్లుగా చూచుకో-'

సుబ్బలక్ష్మి గుండె కలుక్కుమన్నది.

'ఆ మాట అనబోకమ్మా - ఉన్నప్పుడు కూడా లేనట్లు చూచుకోలేనమ్మా. ఆ మాట చాలా బాధగా ఉన్నదమ్మా -' అని సుబ్బలక్ష్మి తన రవికెముడి విప్పి-

'పాలు త్రాగమ్మా - నీవు త్రాగకపోతే నేను అన్నం తినను' అని బ్రతిమాలుతూ బలవంతంగా స్తనం అమ్మ నోట్లో పెట్టింది.

అమ్మ నోట తొమ్ము పెట్టుకొని పాలు త్రాగుతూ ఉండగా-

'పోయిన పిల్లల అందరి తెలివీ, రంగమ్మతల్లి తెలివీ అంతా కలిసి యీ అమ్మకు వచ్చింది. పోయినపిల్ల లక్ష్మి కూడా తెలివిగలదే. ఇట్లాగే మాట్లాడేది...'

అని సుబ్బలక్ష్మి అనుకుంటూ ఉన్నది.

క్షణాలు గడిచే కొద్దీ సుబ్బలక్ష్మిలో లోకవిస్మృతి కలిగింది. ఏదో తెలియని సుఖంలో పరవశం పొందుతున్నది. మామూలుగా తన పిల్ల పాలు త్రాగుతున్నట్లులేదు. పళ్ళువచ్చిన పిల్ల త్రాగుతున్నట్లుగా కూడా లేదు. కారణం - తన మమకారమే నేమోనని సర్దుకున్నది. పాలు త్రాగుతూ అమ్మ సుబ్బలక్ష్మి ముఖం వంక చూచింది. ఆ కన్నుల్లో గూడు కట్టుకున్న అమాయకతను చూచి సుబ్బలక్ష్మి అమ్మను ముద్దు పెట్టుకోవాలని తల వంచింది. కాని మెడ వంగలేదు. ఆమె భావాన్ని గ్రహించి అమ్మ తన బుగ్గను ఆమె మూతికి అందించింది. గులాబీవలే అతికోమలంగానూ అందంగానూ ఉన్న అమ్మ బుగ్గను తన కర్కశమైన పెదవితో చుంబించటానికి మొదట సందేహించీ, ఆ అవకాశాన్ని జారవిడుచుకోవటానికి యిష్టంలేక - స్పృశించీ స్పృశించకుండా ఆ బుగ్గపై ముద్దు పెట్టుకుంటూ - ప్రపంచంలో యింతకంటే హాయి ఏమున్నది? ఇదే సుఖానికి పరమావధి - అనుకున్న సుబ్బలక్ష్మి అమ్మను తన పొట్టకు గట్టిగా హత్తుకున్నది.

ఎంత అదృష్టవంతురాలు సుబ్బలక్ష్మి! ఏ పుణ్యానికి ఫలమో అది! ఏ తపస్సుకు వరమో అది!

అమ్మ మెల్లగా సుబ్బలక్ష్మి ఒడిలో నుంచి దిగి నాగమ్మను చూచి-

'పాలు యిక చాలు కానీ కాసిని నీళ్ళు పొయ్యి-' అని అడిగింది.

'ఇవ్వాళ ఊరికేనే నీళ్ళు కావాలని అడుగుతున్నావా' ఇది వరకు నీళ్ళు పోసిన విషయం గుర్తున్నదా?' నాగమ్మ ఆశ్చర్యంతో ప్రశ్నించింది.

'గంగరావిచెట్టు క్రింద నీళ్ళు పోసుకున్నట్లు గుర్తు.'

'గుర్తెందుకు ఉండదులే, సంవత్సరం నాలుగు మాసాలేగా అయిందీ' అని నాగమ్మ సమాధానపడుతుంటే--

'అయినా యింత చిన్నపిల్లకు యింత జ్ఞాపకశక్తి యేమిటి? ఈ పిల్ల స్పర్శ మాత్రం చేతనే యిందాక నాలో ఆ మైమఱపేమిటి? అన్నీ ఆశ్చర్యం కలిగించే లక్షణాలే. ఇదేమున్నది? ఇందాక పాలు యిచ్చేటప్పుడు నేను అనుభవించిన

ఆనందం అందరూ అనుభవిస్తే బాగుండు ననిపించింది' అని సుబ్బలక్ష్మి చెప్తుండగా ఆమె మనస్సుతో పాటు శరీరమూ పులకరించింది.

అంతలో అమ్మను తీసుకువెళ్లటానికి నల్ల ఖాసిం వచ్చి -

' అమ్మా - నిన్ను నాన్నగారు తీసుకురమ్మంటున్నారు' అన్నాడు.

'నీవు నిజం చెప్పు- నాన్నా? తాతమ్మా?' అని అమ్మ అడిగింది.

'మీ నాన్నగారే-' ఖాసిం నవ్వాడు.

'అబద్ధమాడకుండా అంటున్నాను, అను-'

'ఊఁ - అబద్ధమాడకుండా అంటున్నాను - తాతమ్మ రమ్మన్నది.'

'నాన్న అక్కడే నిలుచుని లేరూ? తాతగారు చూస్తూ తొందరగా అనలేదూ?'

ఆ ప్రశ్నలు విని ఖాసి, ఆశ్చర్యపోయి-

'నేను వచ్చేలోగా అక్కడ నుండి ఎవరైనా వచ్చి పోయారా? నాకెవరూ ఎదురు రాలేదు...' అని అనుకుంటూ ఉంటే - సుబ్బలక్ష్మి 'అమ్మాయిగారి లక్షణాలన్నీ విశేషంగానే ఉన్నాయి. కనుక్కునే ఉండవచ్చు' అన్నది ఏమీ ఆశ్చర్యం లేకుండానే.

ఖాసిం అమ్మముఖంలోకి కన్ను ఆర్పకుండా చూస్తూ నిశ్చేష్టుడై పోయాడు.

సుబ్బలక్ష్మి ఖాసింను రెండుసార్లు పిలిచింది. కాని ఖాసింకు ఆ పిలుపు వినిపించలేదు. అతడు అమ్మ ముఖంలో తను అక్కడకు బయలుదేరే ముందు జరిగిన సంఘటనను చూస్తూ ఉన్నాడు.

నాగమ్మ కూడా ఖాసింను చూచి ఆశ్చర్యపోయి--

'చాకలి లక్ష్మయల్లే అయిపోతాడేమో - బుంగెడు నీళ్ళు తెచ్చి నెత్తిన పొయ్యవే...' అన్నది సుబ్బలక్ష్మితో.

22 అమ్మ వెంటనే ఖాసిం చెయ్యి పట్టుకున్నది. ఖాసింకు తెలివి వచ్చింది. కానీ నిద్రపోయి లేచినవాడి మాదిరిగా మత్తుగా ఉన్నాడు. అమ్మ బయలు దేరింది. ఖాసిమూ వెంట నడిచాడు, మంత్రబద్ధునివలె.

దారిలో మన్నవ చెన్నయ్యగారు కనుపించి ఖాసింనుపలకరించారు. కానీ ఖాసిం నుండి జవాబు లేకపోయేసరికి - 'నీకెంత గర్వంరా?' అన్నారు.

ఆ మాట ఖాసింకు వినపడకపోయినా, అమ్మ విని అన్నది - 'ఇటువంటి రోజు నీకూ ఉన్నదిలే. అందరూ ఆ నాడు నిన్నూ అట్లాగే అనుకుంటారులే..'

చెన్నయ్యగారికి సరిగా వినిపించక అమ్మను- 'ఏమిటమ్మా, నీవన్నది? మళ్ళీ అను..' అని కోరుకున్నారు.

'ఖాసింను నీవన్నది మళ్ళీ అను-' అని అడిగింది అమ్మ.

చెన్నయ్యగారు నవ్వుకుని, చేతులోని పుగాకు చుట్ట అరుగుమీదపెట్టి అమ్మ దగ్గరకు వచ్చి అమ్మ చెయ్యి పట్టుకుని తీసుకుని వెళ్ళి అరుగుమీద కూర్చునబెట్టుకున్నారు.

ఖాసిం మత్తుగా అక్కడనే నిలబడ్డాడు.

'అమ్మా - ఇంతకూ నీ వెవరి అమ్మాయివి?'

'నేనెవరి అమ్మాయినని తీసుకువచ్చావు?'

'అమ్మాయివని ముద్దువచ్చి తీసుకువచ్చాను.'

'ఇంకాయేమి, నేను ముద్దు అమ్మాయిని.'

'ఇంకానయం, ముద్దు అమ్మాయినన్నావు, మొద్దు అమ్మాయిననలేదు' అని వీపుమీద ముద్దుగా తట్టారు.

'ఔను... మొద్దు అమ్మాయినే. నేను మొద్దు అమ్మాయిని, నీవు ముద్దు మొద్దుగా బెట్టుకున్న అబ్బాయివి' అని అమ్మ నవ్వింది.

అమ్మను ఒడిలోకి తీసుకుని 'నీవు మా సీతతో ఆడుకుంటావా?' అని అడిగారు.

'సీత అంటే రాముని భార్యా? నీవు జనకమహారాజువా?'

చెన్నయ్యగారు మనసులో చిదంబరరావుగారి పెంపకమనిపిస్తున్న దనుకుని 'ఇంత తెలివేమిటి?' అన్నారు అమ్మతోనే.

'తెలివంటే - పెంచినవాళ్ళనుబట్టి ఉంటుందా? కన్నవాళ్ళనుబట్టి

ఉంటుందా? వాళ్లిస్తారా? తెలివి ఎక్కడ ఉంటుంది? ఎట్లా ఉంటుంది? తెచ్చు కోవాలంటే తెచ్చుకో గలిగిందీ, యివ్వాలంటే యివ్వగలిగిందీనా తెలివి?'

అమ్మ అట్లా ప్రశ్న వెంట ప్రశ్న వేస్తుంటే - చెన్నయ్యగారు ఆశ్చర్యపోయారు. తమ మనసులో అనుకున్న విషయం అమ్మ ఎట్లా గ్రహించిందా అని, ఆశ్చర్యంతో అమ్మ పొట్టమీద చెయ్యి వేసి దగ్గరకు లాక్కున్నారు. అంతే - అమ్మా, తనూ తప్ప యితర లోకమంతా చీకటి మరుగున పడింది. మరే స్మృతీ లేదు.

పది నిమిషాల తర్వాత అమ్మ చెన్నయ్యగారి గుండెలపై చేతితో తట్టి పిలిచింది.

కళ్ళు తెరచి అమ్మవంక చూచారు. కళ్ల వెంట బొటబొటా నీరు కారింది. 'ఈ మహాతల్లిని చూచుకోకుండా రంగమ్మగారు దాటిపోయింది కదా?' అని నిట్టూర్చి, 'ఈ చిట్టితల్లికి అన్నం పెట్టుకుందామంటే, యివ్వాళ యింట్లో వంట కూడా లేదు కదా. అందరి భోజనాలూ అక్కడనే కదా...' అని విచారించి 'అమ్మా నీవు వడ్డిస్తావా?' అని అడిగారు.

'ఇంతసేపటి నుండీ వడ్డించినది చాల్లేదా! అవే తిను-'

'ఇంకా పెట్టమ్మా-'

'అవసరమయితేనీవు అడగకుండానే యింకా యింకా పెడతాను.'

ఖాసిం యింకా మత్తుగానే ఉన్నాడు. చెన్నయ్యగారికి పూర్తి స్పృహ వచ్చింది. అందువలన అడిగారు-

'ఏమిటి అతని పరిస్థితి?'

'ఇందాకటి నుండీ నీవు నాతో కాలం గడపటానికి ఏ స్థితో అతనిదీ అదే స్థితి.'

'నాకు స్థితి ఏమున్నది? ముద్దువచ్చి నిన్ను దగ్గరకు తీసుకున్నాను.'

'నీ సంతోషం పరిమితిగా ఉండి నీకు వెంటనే లోకస్మృతి కలిగింది. అతని ఆనందం హద్దులు దాటింది కనుక యింకా అవలి ఒడ్డునే తిరుగు తున్నాడు.'

'మా దొడ్లో చిన్న బాదంకాయంత లేవు, ఏమి మాటలూ!'

'ఏమి మాటలేముంది? తెలుగు మాటలే!'

'మన ఊళ్ళో చలమరాజు ఉండేవాడు ఆయన పోతూ నిన్ను పెట్టి పోయాడేమిటి? ఆయనకూ యింత తెలివి లేదేమో...'

'ఇంత - తెలివి అంటున్నావు. నీవు వడ్లు కొలుస్తూ ఉంటావే - ఆ మానికతో కొలవటానికి అందుతుందా తెలివి?'

'అట్లా అందేది కాదమ్మా-"

'మరి చలమరాజుకు కూడా 'యింత' లేదన్నావుగా. నా కెంత ఉన్నది? నా కంటే ఆయన కెంత తక్కువ ఉన్నది? ...షుమారుగా చెప్పులే. నీవు వడ్లు కొలిచిన తర్వాత క్రింద మిగిలిన పోగు సోలెడో తవ్వెడో ఉంటుందని చెప్తుంటావుగా. అట్లాగే చెప్పు - 'యింత' అని.'

చెన్నయ్యగారు ఏమీ మాట్లాడక అమ్మను చూస్తూ కూర్చున్నారు.

'లేకపోతే - తెలియనివాడివి ఎందుకు అన్నావో అద్దైనా చెప్పు-'

'నేను ప్లీడరును కాదమ్మా.'

'ఇందాక మాట్లాడేటప్పుడు ప్లీడరుననుకొని మాట్లాడావా? ఇందాక అవుననుకొని ఇప్పుడు కాదని తెలుసుకొనిన తెలివేనా నీవు అనే తెలివి?'

'దెబ్బ కొట్టావే?'

'ఎక్కడ తగిలింది?'

'ఈ దెబ్బ కొట్టావే?'

'ఎక్కడ తగిలింది?'

'ఈ దెబ్బ శరీరమంతా తగిలింది. ఎవరైనా కొడితే ఒక చోట తగులుతుంది.'

సీతాపతితాతగారి యింటి వద్ద నుండి మడిగట్టుకొని భోజనానికి రమ్మని కబురు వచ్చింది' అమ్మ అరుగు దిగి ఖాసిం దగ్గరకు వెళ్ళింది.

'మనమిద్దరము కలిసి పోదాము ఉండమ్మా - నేనూ వస్తాను' లోపలకు వెళ్ళుతూ ఆగి చెన్నయ్యగారు అన్నారు.

'మేము యిద్దరమే వెళ్ళుతున్నాము. మేము యిద్దరం వస్తే - మనం యిద్దరం అంటావేమిటి? మనం ముగ్గురమూ అనలేవూ?" అంటూ ఖాసిం చెయ్యి అందుకుని అమ్మ సాగింది.

చెన్నయ్యగారు నాలుక కొరుక్కొని లోపలకు వెళ్ళారు.

ఇంటికి వెళ్ళగానే పురోహితుడు అక్షతలు తీసుకువచ్చి రాఘవరావు మామయ్యకూ, అమ్మకూ ఆశీర్వచనం చేశాడు.

* * *

సంవత్సరీకాలు కాగానే వచ్చిన బంధువులందరూ ప్రయాణమైనారు. వెంకట సుబ్బారావుగారూ, జానకమ్మగారూ అమ్మను తమ వెంట పంపమని కోరారు. సీతాపతితాతగారు అంగీకరించారు. కానీ మరిడమ్మగారు ఒప్పుకొనక తాతగారిని పెండ్లి చేసుకొనమని చెప్పి - యీలోగా తను అక్కడనే ఉంటానన్నది. తాతగారు పెళ్ళి చేసుకోనని ఖండితంగా చెప్పి - పిల్లను పంపించటానికే నిర్ణయించారు. వెంకట సుబ్బారావుగారు తాతగారిని తమ వెంట వచ్చి పిల్లను అలవాటుచేసి రమ్మన్నారు.

' నేను ఎక్కడికీ రానండీ - పిల్లను అందరూ తీసుకు వెళతామంటారు. వాడి సంగతే అర్థంకాకుండా ఉన్నది. అటువంటి దుడుకువాడిని ఎవరు భరిస్తారు' నాక్కూడా విసుగే, తల్లికి మినహా - తల్లికి తప్పదు.'

'తల్లికి తప్పదు - కాదు. తల్లికి తప్పే కనబడదు.'

అమ్మ పలికిన ఆ వాక్యం విని చిదంబరరావుగారు విస్మితులై-

'మళ్లీ అనమ్మా-'

'మీరు ఎంతవరకు విన్నారో అది అనండి. తరువాత నేనంటాను.'

'మా అమ్మ లా చదువుకుంటే బాగుండేది.'

' నా లాగా చదువు కోవటానికి నేనేమీ చదువుకోలేదు...'

'నీ లాగా కాదమ్మా - నీవు 'లా' చదువుకుంటే బాగుండేది.'

'అయితే నాకు 'లా' తెలీదంటారు.'

'తెలీదని గాదమ్మా - తెలుసు గనుకనే.'

'అయితే - యింకా చదువుకోవటమెందుకు?'

'అబ్బబ్బా... వదిలి పెట్టవు. ఇదే లా అంటే."

అంతలో వెంకట సుబ్బారావుగారు వచ్చి-

'ఏమిటీ తాతా మనుమరాలి సంభాషణ? మీతో వస్తానంటున్నదా?'

'లేదు, లేదు - మా గొడవ వేరు. అయినా, యింతకూ మీరేమి తేల్చారు? రైళ్లు అందవు. త్వరగా వెళ్లాలి...'

'ఇంతకూ నీ ఉద్దేశ మేమిటిరా?' వెంకట సుబ్బారావుగారడిగారు.

'ప్రస్తుతం అందరం బాపట్ల పోదాము. గొడ్లూ, వడ్లూ అన్నీ తీసుకు వెళదాము. వడుగు అయిన తర్వాత ఎవరు ఎక్కడ ఉండాల్సిందీ ఆలోచిద్దాము.'

అందరూ బాపట్ల ప్రయాణానికి సన్నాహమైనారు.

17. చింతలతోపు

చింతలతోపు అంటే అమ్మకు చాలా యిష్టం. చింతకాయలన్నా, చింతాకులన్నా, చింతచిగురన్నా, చింతరసం అన్నా అమ్మకు ఏనలేని ప్రేమ.

మన్నవకు ఉత్తరదిశలో పడమర నుంచి తూర్పుకు ప్రవహించే మురుగు కాలవకు దక్షిణపు ఒడ్డున చింతలతోపు ఉన్నది.

తాతగార్లూ, మరిడమ్మగారూ వగైరా అందరూ బాపట్ల ప్రయాణం నిశ్చయం చేసుకోగానే అమ్మ వెంటనే ఆ చింతల తోపుకు వెళ్ళింది.

ఒక ఎత్తయిన చింతచెట్టు ఎక్కింది. చిటారుకొమ్మ మీదికి వెళ్ళింది. చూట్టూ చూచింది. అన్నీ చింతలే. ఎటు చూచినా చింతలే అంతా చింతల మయం! 'ఇదేమిటి కావాలని చింతలతోపు మధ్యకు వచ్చి చింతచెట్టు ఎక్కి కూర్చుని ఎటుజూచినా చింతలేనని ఆశ్చర్యపోతానేమిటి?' అని అమ్మ తనలోతానే సన్నగా నవ్వుకుని ఆలోచించ సాగింది...

'చింత చెట్టు ఉన్నది. దీనికి చిగురు వేస్తుంది. ముదురాకు ఉంటుంది. పూలు పూస్తాయి. లేతకాయలు కాస్తాయి. ముదురుకాయ లుంటాయి. పండుకాయ లుంటాయి. అన్ని లక్షణాలూ ఉన్నాయి. కానీ అన్ని లక్షణాలూ ఒకేసారి చూపించలేకపోతున్నది. కాలాన్ని అనుసరించి లక్షణాలు బహిర్గత మవుతుంటాయి. గుణాలు కూడా కాలానికి కట్టుబడుతున్నాయన్నమాట.'

అనుకుంటూ ఉండగా అమ్మ ఎక్కి నిలుచున్న కొమ్మ - ఆ పావన పాదస్పర్శతో పునీతమై జీవన లక్ష్యమే సఫలీకృతమైనట్లు, తనకు యిక జీవితం మీద వాంఛయే లేనట్లు విరిగింది. వెంటనే అమ్మ ప్రక్క కొమ్మ పట్టుకున్నది.

అమ్మ ఎక్కిన కొమ్మ విరగటం అదే మొదలు. అమ్మ లోగడ చిటికేశ్వరపు చెట్టు, బాదం చెట్టు కూడ ఎక్కింది. పాలు అమ్ముకుంటే కానీ జీవనం లేని మునలిది బఱ్ఱెకు మేత లేదని బాధ పడినప్పుడల్లా అనేక పర్యాయాలు చిటికేశ్వరపు చెట్టు ఎక్కింది. చిదంబరరావు తాతగారు విస్తళ్ళు కుట్టుకునేందుకు ఆకుల కోసం అన్వేషణ ప్రారభించినపుడల్లా అమ్మ చరచరా బాదం చెట్టుకు ఎగబ్రాకేది.

ఆ రెండు చెట్లూ చాలా పెళుసు. కానీ అవి ఎప్పుడూ విరగలేదు. చింతచెట్టు చాలా గట్టి. అయినా అది విరిగింది. అమ్మ అందుకు కారణం ఆలోచించి 'ఇంతకూ అన్నిటికీ కాలమే ఆధారమనుకున్నది.

ఇంకొక కొమ్మ మీదకు ఎక్కి దాని చిట్టచివరకు వెళ్ళి... ఏమీ పట్టుకొనకుండా అక్కడ నిలుచుని గ్రామం నాలుగు దిక్కులా దృష్టి సారించి...

'ఈ కొమ్మ యిప్పుడు విరగదేమీ? పైగా ఊరంతా చూపిస్తున్నది. అయితే ఈ కొమ్మ ఊరిని చూపిస్తున్నదా? నేనే చూడగలుగుతున్నానా?... మూడూ ఉన్నా - ఆ మూడూ నేనేగా. చెట్టు ఉన్నదని గుర్తించింది నేను. చెట్టు ఎక్కింది నేను. కొమ్మ విరిగినట్లు గుర్తించింది నేను. మరొక కొమ్మను ఆధారం చేసుకున్నది నేను. చిటారుకొమ్మ కెక్కింది నేను. ఊరు నాలుగు వైపులా చూచింది నేను. ఇదంతా నేనేనని అనుకున్నది నేను...'

అంతలో గంగరాజు పున్నయ్యగారు ఆ చెట్టు క్రిందకు వచ్చి 'ఈ చెట్టు వేసింది నేను' అనుకుంటూ వెళ్ళారు. ఆయన తలయెత్తలేదు; అమ్మను చూడలేదు.

అమ్మ ఆ మాటలు విన్నది.

'అదే నేననుకున్న నేను. అదే ఎవరికి వారు నేను అనుకుండే నేనే - నే ననే నేను. అంతా నేనైన నేను నీవుగా చూడాలంటే నేను నీవై చూస్తారు. నేను నీవు వేరుగా చూడలేరు. అదే నేననే నేను. ఇవే నేతి మహావాక్యాలు. మరిడమ్మ తాతమ్మ మొన్న ఎవరికో చెపుతుంటే విని 'నేతి నేతి' అంటే ఏమిటి అని నేనడిగితే చెప్పలేదు. దాని సారం యిదే...'

అనుకుంటూ రెండు మూడు చెట్లకు అవతలగా తలవంచుకుని నడిచి వెళ్ళుతున్న గంగరాజు పున్నయ్యగారిని అమ్మ కేక వేసింది.

'తాతగారూ...'

పున్నయ్యగారు నాలుగు దిక్కులా చూచారు. ఎవరూ కనుపించలేదు.

'తాతగారూ...'

మళ్ళీ అదే పిలుపు. వేణుగానం లాంటి కంఠం. పున్నయ్యగారు గిరగిరా తిరిగారు. ఆత్మప్రదక్షిణం చేసినట్లు.

'తాతగారూ...'

ఆ పిలుపులోని స్వర తరంగాలు పున్నయ్యగారిలోని అణువణువునూ స్పర్శించాయి. తనువెల్లా పులకాంకిత మయింది; తలపైకి ఎత్తారు.

చింతచెట్టుపై కృష్ణుడు? శిరమున పింఛమూ, ఉరమున కౌస్తుభమూ, కరమునూ పెదవులనూ సంధిస్తూ మురళీ - మనోమోహన లావణ్య మూర్తి కన్నుల ముందూ.

ఆ విశ్వసమ్మోహన కమనీయమూర్తి కరుణామయ హృదయ స్పందన సంజనితమో, మధుర మధుర సుధాపూర్ణ లలితాధర సముత్పన్నమో_ సుందర వంశీ వినిర్గత వినిర్మల మనోహర స్వరలహరి పొంగులువారి వారి వీనులనేకాక సమస్త నాడీమండలాన్నే విచలిత పరచివేసింది.

'కృష్ణా...'

అని పున్నయ్యగారు పారవశ్యులై పులకితాంగులై కేకవేసి ఆ చెట్టుక్రిందకు పరుగెత్తి తలపైకి యెత్తారు.

చూపులకు శూన్యం తగిలి వెనుకకు మరలివచ్చి పున్నయ్యగారి మనసును వెక్కిరించాయి. నిరాశోపహతులై-

'ఎక్కడకు వెళ్లావు కృష్ణా_

ఎక్కడ దాగావు ప్రభూ...'

అని అరుస్తూ అన్వేషిస్తూ వీధిన పడ్డారు.

ఆ వంశీనాదం మళ్లీ వినిపించింది. ఉలిక్కిపడి వెనక్కు తిరిగి చెట్టుపైకి చూచారు. ఆ రమణీయానన పరివేష్టితమై దివ్య తేజోవలయం! క్షణ మాలసించక చెట్టు క్రిందకు పరుగెత్తారు.

దివి నుండి భువికి అవతరణ చేసినట్లు అమ్మ చెట్టు దిగింది. పున్నయ్యగారు పరవశులై పాటలు పాడుకుంటూ నృత్యం చేస్తున్నారు. అమ్మ దగ్గరకు వెళ్లి పిలిచింది. పున్నయ్యగారి కన్నుల్లో లౌకిక దృష్టి లేదు.

అమ్మను అమాంతం కౌగలించుకుని, తన బాహుబంధంలో బిగించుకుని-

'దొరికావులే దొంగా_'

23

నిన్నింక

వదలనులే నిజంగా...'

అని రాగాలు తీస్తూ అమ్మను తన భుజంమీద వేసుకుని...

'వచ్చావా కృష్ణా వచ్చావా

నా మొఱ

విన్నావా ప్రభూ విన్నావా

ననుపాలింప వచ్చావా

నీ

దయ చూపింప వచ్చావా..."

అని ఆర్తితో ఆర్ద్ర హృదయంతో పాడుతూ, లయబద్ధంగా అడుగులు వేస్తూ వీధివీధికీ తిరిగారు. చూచిన వారందరూ పున్నయ్యగారి అకంలక కృష్ణ బక్తిని స్మరించి తల్లిలేని పిల్లమీది ప్రేమతో ఆ విధంగా ఆవేశంతో పరవశించి పోతున్నాడనుకున్నారు. ఎంతో అభిమానంగల పున్నయ్యగారు ఎన్నడూ లేనిది నృత్యగానాలతో వీధులవెంట పరుగు లెత్తటం చూచి అది ఉన్మాదావస్థ యేమోనని భయపడి వారి తమ్ముడు రామసుబ్బయ్యగారు వారిని వెంబడించారు.

గ్రామం చూట్టూ మూడుసార్లు ప్రదక్షిణం చేసి పున్నయ్యగారు సీతాపతితాతగారి యింటి ముందు ఆగి వసారాలోకి వచ్చారు.

దిగటానికి గూడ వీలు లేకుండా అమ్మను తన భుజం మీద గట్టిగా బంధించి వేశారు.

మరిడమ్మగారు బయటకు వచ్చి చూచి అన్నది-

'ఏమిటిరా పున్నయ్యా - అమ్మాయి నెత్తుకు వచ్చావు? మీ యింటికి వచ్చిందా? వాళ్ళమ్మ పోతూ చెప్పిందేమో, నీ దగ్గర కృష్ణమూర్తి ఉంటాడు గదూ...'

'ఉంటాడేమిటి? ఉన్నాడు. ఇదుగో...' అని పున్నయ్యగారు స్వరపేటిక బద్దలయ్యేలాగ అరిచారు.

ఆ కంఠంలోని మేఘగర్జన విని యింటిలోని వారందరూ బయటకు వచ్చారు. పున్నయ్యగారు తన్మయులై రెండు చేతులా అమ్మను వదలి నృత్యం చేస్తున్నారు. అమ్మ జారిపడుతుందేమోనని భయపడి చిదంబరరావుగారు అమ్మను తీసుకోవడానికి ప్రయత్నించారు. పున్నయ్యగారి భుజం కరుచుకుని అమ్మ రాలేదు.

'ఏమి పెట్టి కరిపించాడేమిటి?' అని ఆశ్చర్యంతో అడిగారు.

'ఆయనలో ఉన్న 'నేను' నాలో ఉన్న 'నేను' పెట్టి అతికించారు.' అని అమ్మ చెప్పింది.

'అయితే ఆత్మను పెట్టి అంటావా?'

'ఆత్మ పెట్టేది కాదు. ఆవరించేది. ఆవరించే ఉన్నది.'

అమ్మ చెప్పే ఆత్మ వివరణ చిదంబరరావుగారికి అర్థం కాలేదు. వివరంగా చెప్పమని అడిగారు. పున్నయ్యగారు కూడా నృత్యం ఆపి తెలిసీ తెలియని స్థితిలోనే వింటున్నారు. వారి భుజం మీదనే ఉన్నది అమ్మ.

'ఆత్మ అంటే ఏమిటో నేను చెప్పనా? నా కేమి తెలుసు? ఎవరయినా చెప్పకుండేవి చెప్పమంటే చెప్తాను. దానికి చాలా అర్థమున్నది. అయినా ఒక్కమాటలో చెప్పనా?'

అంటూ అమ్మ పున్నయ్యగారి భుజం మీది నుండి క్రిందకు జారి - నేలపై ఒక వలయం గీచి చిదంబరరావుగారిని-

'ఈ సున్నలో ముఖ్యమైన ప్రదేశమేది?' అని అడిగింది.

'సున్నాలోపల చెప్పమంటావా? సున్నా చుట్టటానికి ఆధారం చెప్పమంటావా?'

'సున్నాలో తెలిస్తే ఇది చెప్పినట్లే.'

'గీటు కాకుండానా?'

'అంతా ముఖ్యమే.'

'గీత మీద ఏది ముఖ్యం?'

'బయల్దేరింది ముఖ్యం.

'బయలుదేరటానికి ఏది ముఖ్యం?'

'సంకల్పం.'

'వేలు, గోరు, భూమి, ఈ మూడు ముఖ్యం కాదా-సంకల్పం దాకా పోయారూ?'

ఈ మూడూ సంకల్పానికి సంబంధించినవేగా?

'సంకల్పం ఆకృతి లేనిది. ఈ మూడు ఆకృతి గలిగినవి సంకల్పం కాదని కాదు. ఈ మూడూ చెప్పి సంకల్పం దగ్గరకు వెళ్ళాలి.

'అక్కడకు ముందే ఎందుకు వెళ్ళకూడదు?' చిదంబరరావుగారు నవ్వారు.

'వెళ్ళకూడదనికాదు, క్రమంగా వస్తే కానిదేమిటో తేలుతుందని-'

'ఇంత తలకాయ ఎక్కడిదో.' చిదంబరరావుగారు చిన్నగా స్వగతం లాగా అనుకున్నారు.

అది విని అమ్మ వెంటనే అన్నది-

'మీ అందరికీ ఎక్కడిదో నాకూ అక్కడిదే. మీ అందరు ఎక్కడ తెచ్చుకున్నారో నేనూ అక్కడే తెచ్చుకున్నాను. అయితే మీరూ ఎక్కడ తెచ్చు కున్నారు?'

'అబ్బబ్బ- జీడి-'

'నీవు కొనిపెట్టిన జీడి పప్పా? అదే అనుకుంటే నన్ను అంతా తింటా రేమో. అయినా అట్లానన్ను చూస్తేగా తినటానికి?'

'నేను తింటాను, రా.' అని వెంకట సుబ్బారావుగారు అమ్మను దగ్గరకు తీసుకుని బుగ్గమీద కొరికారు.

'తినమంటే కొరకటమూ?' అమ్మ నవ్వింది.

'సీతాపతి- ఎందుకూ? ఇచ్చిన దేవుడు మరచిపోతే నీ కూతురు బ్రహ్మాండమే' అంటూ ఉండగానే వెంకట సుబ్బారావుగారి కన్నులశ్రుపూర్ణ మయినాయి.

'నేను బ్రహ్మాండమూ, మీరు బ్రహ్మాండంలోని వాళ్ళూనా?'

'నీవు ఎట్లా బ్రహ్మాండానివి?' చిదంబరరావుగారు సమాధానం కోసం కుతూహలపడ్డారు.

'మీ అన్నగారేగా అన్నది-' చిదంబరరావుగారి కుతూహలం మీద చన్నీళ్ళు చిలికింది అమ్మ.

'అన్నదల్లా ఒప్పుకుంటావా?' చిదంబరరావుగారు మరో మార్గంలో ఎదుర్కొన్నారు.

'జరుగుతన్నదీ అదే. ముందు జరగబోయేది అదే. వచ్చింది అందుకే. ఎవరేది చేసినా, అన్నా ఒప్పుకునేందుకే-' అని అమ్మ ఒప్పుకున్నది అసందిగ్ధంగా.

'అయితే ఆ స్థితిని ఏమంటారు?'

'అనేవాళ్ళ స్థితిని ఏమంటారో చెప్పండి-'

'చిదంబరం - ఎందుకురా? దానివన్నీ మొండి ప్రశ్నలు...' వెంకట సుబ్బారావుగారు మందలించారు.

'నాకు మొండితనం తప్ప గండుతనం లేదు.'

వెంకట సుబ్బారావుగారు స్థూలకాయులు. వారి శరీరం వారు చూచుకుని నవ్వుకున్నారు.

'మీ గొడవే మీదా? పున్నయ్య సంగతి ఏమయినా ఆలకించారా?' మరిడమ్మగారు అడిగింది.

'ఆలకించలా, లాలించా' అమ్మ అందుకున్నది.

ఆ మాట విని మరిడమ్మగారు కన్నులింతచేసి చూస్తుంటే...

'లాలించటమేమిటి? బ్రహ్మాండమయినప్పుడు పాలించదూ?' చిదంబరరావుగారు సమర్థించారు.

'బ్రహ్మాండమయినప్పుడు పాలించే తీరుతుంది' అమ్మ కూడా ధృవపరిచింది.

'అయితే నిన్ను యిప్పుడు ఏ లెక్కలో వేసుకోవాలి?' వెంకట సుబ్బయ్య గారి ధర్మసందేహం.

'ఏ సంఖ్యకందితే అది.'

చిదంబరరావుగారు నవ్వుకుంటూ అన్నారు.

'ఏది మాట్లాడినా అసాధ్యం.'

'అసాధ్యమయితే మాట్లాడలేనుగా, సాధ్యమయితేనే-'

'సాధ్యాసాధ్యాలకు తేడా ఏమిటో... మహాలావు మాట్లాడుతున్నది' చిదంబరరావుగారికి అమ్మతో వాదన యిష్టం.

'నేను కాదయ్యా మహాలావు అడుగో-' అని అమ్మ వెంకట సుబ్బారావు గారిని చూపించింది.

పున్నయ్యగారితో సహా అందరూ నవ్వారు. పున్నయ్య గారిని చూచి అందరూ ఆశ్చర్యపోయారు. వారు తన్మయావస్థ నుండి మామూలు స్థితిలోకి వచ్చారు. అమ్మను ఒడిలోకి తీసుకుని -

'అమ్మా, తల్లిలేని తల్లీ-' అంటూ అమ్మను చెక్కిళ్ళు పుడికి ముద్దు పెట్టుకున్నారు.

'తల్లి లేని తల్లీ అంటే తొలి నేనే ననా?' అమ్మ 'తల్లి' శబ్దానికి అర్థం యిచ్చింది. ఔను-తనను గురించి అయినా తాను చెప్పకుంటే గాని మనకు తెలియదు!

చిదంబరరావుగారి మేధ విభ్రాంతి చకితమై పోయింది ఆ నిర్వచనం విని-

'ఆ అర్థం వచ్చే మాట ఏమున్నదీ అందులో?' చిదంబరరావుగారు జిజ్ఞాసువై అడిగారు.

'పోనీ అందులో లేకపోతే మాన్లే. తల్లి లేని తల్లి అంటే ఏమిటో మీరు చెప్పండి-'

'తల్లిలేని తల్లి అంటే మీ అమ్మ పోయిందిగాదూ-అందుకని అన్నారు. వారి ఉద్దేశం అదీ.'

'నేను ఉద్దేశాలను గుర్తించలేనుగా, మాటల్లో ఉన్న అర్థాన్ని చెప్పాను' అన్నది అమ్మ తనకేమీ తెలియనట్లు అమాయకంగా.

చిదంబరరావుగారు పకపకా నవ్వి కూర్చున్న అమ్మ పొట్టలోకి వంగి తలతో పొట్టరుద్ది ముద్దు పెట్టుకుని-

'నేను ఉద్దేశాన్ని గ్రహిస్తానని కాదు నేనన్నది. మీ అమ్మ చచ్చి పోయిందనీ, తల్లి లేని పిల్లవనీ అందుకనే తల్లి లేని తల్లివని ఆయన అన్నాడని నా ఉద్దేశం. ఆయన ఉద్దేశమూ అదేనని నా విశ్వాసం.'

'దొరికావులే.'

'ఎక్కడ దొరికాను?'

'మీరున్న చోటే దొరికారు.'

అంతలో పున్నయ్యగారు నవ్వి-

'కృష్ణపరమాత్మ స్థితి మనకు లేదు గనుక ఆ తల్లికి ఉన్నది గనుక ఆ అర్థం వచ్చింది' అన్నారు.

కృష్ణపరమాత్మ స్థితికీ కృష్ణుడికీ తేడా ఉంటుందంటారా?' అని అమ్మ అడిగింది.

'ఏమోనమ్మా - అంతగా చెప్పలేను. నీ వంక చూడగా చూడగా కిష్టప్పవేమోనని అనుమానం వస్తున్నది.'

'అనుమానమేగా - అవున్లే, అనుమానమే కాకపోతే - కిష్టప్పా అని పిలిచేవారుగా -'

కృష్ణునికీ, కృష్ణ తత్వానికీ తేడా ఏమిటీ అనే ప్రశ్న మేము వేశామని... నీవు చెప్పు సమాధానం-'

అమ్మ అంగీకరించింది.

కృష్ణతత్వమంటే కృష్ణుడి లక్షణాలు కలిగింది. కృష్ణుడంటే కృష్ణుడే. కృష్ణుని గురించి చెప్పుకోవటానికి పురాణాలే ఆధారమయినాయి. ఆ పురాణాలు చెప్పిన లక్షణాలు ఎక్కడ ఉంటే వాటిని కృష్ణతత్వం అంటున్నాము...'

ఆచార్యునివలె వివరిస్తున్న అమ్మను చూస్తూ...

'వాడే వీడు; వీడే వాడు. అప్పుడు ఆ ఆకారంతో వచ్చాడు. ఇప్పుడు యీ రూపంలో వచ్చాడు' అంటూ పున్నయ్యగారు పడిపోయారు.

ప్రొద్దుటివలే తన్మయావస్థ కలిగిందని అందరూ లేచి నిలుచుని వారివంక చూస్తూ ఉన్నారు. అంతలో వారి మూతీ, చెయ్యీ, కాలూ పక్షవాతం వచ్చినట్లు వంకరలు తిరిగాయి.

మరిడమ్మగారు పున్నయ్యగారి దగ్గరకు వచ్చి నాడి చూచింది. అవసానదశను గ్రహించింది. అందరూ కలసి పున్నయ్యగారిని వారి యింటి వద్దకు తీసుకువెళ్లారు.

అమ్మ ఆ రాత్రి వారిని చూడటానికి వారి యింటికి వెళ్లింది. అమ్మ వెళ్లి నిలుచోగానే కన్నెత్తి అమ్మవంక చూచి కదలని చెయ్యి ఎత్తి నమస్కారం చేసి నంగిమాటలతో...

'చెట్టుమీద నిలుచున్నది నీవే... నీవే కృష్ణుడివి..' అంటూ కళ్లు పెద్దవి చేసి లేవబోయి... 'నీవే నీవే...' అంటూ చెయ్యి పైకి ఎత్తారు. ఆ చేతిని అమ్మ అందుకున్నది. తృప్తిగా ఆయన తెరచిన కన్నులు మూశారు. మళ్లీ తెరవాల్సిన అవసరం లేకుండా.

చిదంబరరావుగారు మెల్లగా అమ్మ చెయ్యి పట్టుకుని మూగే జనంలో నుంచి అమ్మను యింటికి తీసుకువచ్చి ఒళ్లో కూర్చోబెట్టుకుని...

'ప్రొద్దున నిన్ను ఆయన భుజాన ఎత్తుకుని తీసుకురావటానికి అసలు కారణమేమిటి?'

'అసలు కారణం అసలుకే తెలియాలి.'

'అసలంటే?'

'అసలంటే - శక్తి.'

'శక్తి అంటే!'

'ప్రతి దానిలో ఉండే శక్తి.'

అంటూ అమ్మ చిదంబరరావుగారి జేబులోని కలమూ, కాగితమూ తీసుకుని కాగితంమీద ఏవో కొన్ని పిచ్చిగీతలు వ్రాసి..'

'ఈ కలానికి సిరాను ధరించే శక్తి, పాళీకి వ్రాసే శక్తి, చేతికి కలాన్ని పట్టుకునే శక్తి, కాగితానికి అక్షరాలను ధరించే శక్తి... ఈ శక్తులన్నీ ఆ అసలే, ఆ

అసలే యీ శక్తి' అని వివరించింది.

'అప్పుడు అన్నింటిలో ఉన్న శక్తులు అనలైనప్పుడు ఆ అనలుకు స్పెషలేమిటి?'

'స్పెషలంటే?'

'ప్రత్యేకత.'

'నేను మాత్రం ప్రత్యేకత అన్నానా? అన్నింటిలో ఉండే శక్తీ-తన శక్తి-తను అయినప్పుడు ప్రత్యేకత లేదు.'

'ఆ స్థితి ఎట్లా ఉంటుంది?'

'అది చెప్పేది కాదు. చెప్పేది కాని దానిని చెప్పవలసి వచ్చింది గనుకనే చెప్పటానికి ప్రత్యేకత అవసరమయింది.'

'అబ్బా! ఇంత గంభీరమైన భావాలు ఎక్కడ నుండి వచ్చాయో-' అని ఆశ్చర్యపోతూనే....

"నేను వ్రాసిన ఆత్మబోధ చదువుతావా? చదువురాదుగా..." అని సానుభూతి ప్రకటించారు.

'చదువుకోలేదు కనుక చదువు రాలేదు.'

చిదంబరరావుగారు ఆనంధబాష్పాలు కారుస్తూ-

'ఇవన్నీ నీకు ఎట్లా తెలిశాయమ్మా?' అని అడిగారు.

'తెలుసుకుండేది తెలివేగా?'

'ఆ తెలివికి ప్రతి దానిని తెలుసుకోవటమేగదా దాని వృత్తి. తెలివికి తెలుసుకోవటమే వృత్తి అయినప్పుడు - అది సహజమే. విశేషమేమున్నది?'

అమ్మ ఎవలికే ప్రతి పదమూ, వేసే ప్రతి పదమూ విశేషంగానే ఉంటుంది. కాని అమ్మకు మాత్రం అన్నీ సహజమే. అందుకే చిదంబరరావుగారు వెంటనే అన్నారు.

'వేరే విశేష మేమున్నదమ్మా? నీవే విశేషం.'

అంతలో వెంకట సుబ్బారావుగారూ మిగిలనవారూ యింటికి వచ్చారు.

పున్నయ్యగారి దహన సంస్కారాలు మరునాడుగాని జరగవు కనుక వారి బావట్ల ప్రయాణం మూడవ నాటికి వాయిదా పడింది.

మూడవ రోజు తెల్లవారుజామున అందరూ ప్రయాణమైనారు. నల్లఖాసిం బండి కట్టాలి. అతను 'యింకా రాలేదేమి' అనుకుంటూ ఉండగా ఖాసిం వచ్చాడు.

'నీవు దీర్ఘాయుష్మంతుడివిరా. నీ మాట యిప్పుడే అనుకుంటున్నాము' మరిడమ్మగారు దీవించింది.

'ఇంకా ఎందుకమ్మా యివ్వటికే బరువుగా ఉంది. రంగమ్మ తల్లి పోయిన తర్వాత యీ ఊళ్ళో ఉండలేక పోతున్నాను. బిడ్డలూ మీరన్నా యిక్కడ ఉంటే కొంత తృప్తిగా ఉంటుంది' ఖాసిం బాధ పడ్డాడు.

'ఆ గీత మనకు లేదు నాయనా - మీ అయ్యగారికి చెప్పు - పెళ్ళి చేసుకుంటానంటే యిక్కడే ఉంటాను.'

'అయ్యగారికి చెప్పే మాత్రపు వాడినా? అయినా చెప్పి చూస్తాను...'

అని సీతాపతితాతగారి దగ్గరకు వెళ్ళి-

'అయ్యా - నాదో కోరిక. కోప్పడకుండా ఉంటారా?' అని అడిగాడు.

'ఏమిట్రా చెప్పు - నీ ముఖం... కోప్పడేదేమున్నది?'

'నేను యీ కొంపవైపుకు రాకుండా ఉండలేనయ్యా...'

'నిన్ను ఎవరు రావద్దన్నారురా?'

'యిక్కడకు వస్తే మండోదరి లాంటి అమ్మ గుర్తుకు వస్తూ ఉంటుంది. ఆమె లేకపోయినా మిమ్మల్నీ పిల్లల్నీ చూచుకుని అయినా బ్రతుకుతానయ్యా - అన్నం నీళ్ళు లేకపోయినా మిమ్మల్ని చూచుకుని అయినా బ్రతుకుతా - అమ్మాయి గారిని చూస్తే అసలే వదిలిపెట్ట బుద్ధి పుట్టదు.'

'అయితే -ఏమిటిరా నీ క్షోభ? చెప్పి పంపిందిలే.. ఊరుకోదు.'

'మీరు, పిల్లలూ, తాతమ్మగారూ యిక్కడ ఉంటే చూచుకుంటూ ఉంటాను.

'చూచుతో గాని ఆవిడగారు ఉండదట.'

'ఉండేటట్లు చెయ్యండయ్యా - అనే నా ప్రార్థన.'

అదంతా మరిడమ్మగారి ప్రబోధం అని గ్రహించి సీతాపతి తాతగారు విసుగుతో-

'ఏడిచినట్లే ఉంది-'

అని విసురుగా ఉత్తరీయం విదిలించి పైన వేసుకుని మరిడమ్మ గారితో-

'ఏం నీవు చెప్పటం చాల్లేదా? దానివల్ల జరిగే ప్రమాదాలు చాలా ఉన్నాయి' అన్నారు.

'కోప్పడకుండా వినరా నాయనా - చెపుతా. నీవా - జబ్బువాడివి. ఎంతమంది చెల్లెళ్ళూ, అక్కలూ ఉన్నా- ఆస్తి జూచి- కొన్నాళ్ళు ఎవరు చేసినా- కాస్త జబ్బు చేస్తే ఎంతగానో బాధపడతావు' అని ఆమె బ్రతిమాలింది.

'అక్కడొక మాట, అప్పుడొకమాట - ఎందుకమ్మా? నీ పూర్తి ఉద్దేశం చెప్పేసెయ్యి-'

'ఏమీ లేదు నాయనా - నీవు పెళ్ళి చేసుకుంటావంటే యీ నాలుగు రోజులూ చేసి పెడతాను, రేవు ఒకామె వస్తుంది, దాని కాపరం అది చేసుకుంటుంది - అనే ఆశతో. ఇప్పటికే చేసిచేసి నా చేతులు కడుక్కున్నట్ల యింది. ఆరేండ్లకు ముండ మోసింది యీ తల్లీదండ్రీలేని పిల్లలను పెంచటానికే నేమో, దీనికి ఏ ఒడ్డూ లేదా?...' ఆమె కళ్ళు చెమరించాయి.

దానికి సీతాపతి తాతగారి మనసు కరగకపోగా కుపితులై--

'నీవు అనవసరంగా నా మెడ కురిపోయవద్దు' అని అరిచారు.

ఆ అరుపు విని చిదంబరరావుగారు వచ్చి---

'ఇప్పుడెందుకు యీ గోల? - ఆ సమయం వస్తే తప్పించుకోలేడుగా...' అని ఆమెను సర్ది-

'ఎందుకురా - ఆ పెద్దదానిమీద అంత పెద్దగా మాట్లాడుతున్నావు?

అంతా మన మీద ప్రేమతోనేగా - యిక్కడికి ఆమెకది మూడో తరం... తల్లీదండ్రీ లేని వాళ్ళను యాదుకు రావటం...' సీతాపతి తాతగారిని కూడా మందలించారు.

'ఆమెది ఆమెకు వేరే లేదు కనుక అందరూ పిల్లలే' అమ్మ తీర్మానించింది.

'పాపం పెద్ద యిల్లాలు మాట్లాడుతున్నది' వెంకట సుబ్బారావుగారు నవ్వుతున్నారు.

'ఊహాకు మనందరికంటే పెద్దదే' చిదంబరరావుగారు తమ విశ్వాసాన్ని ప్రకటించారు.

అంతలో సీతాపతితాతగారు అమ్మను ఎత్తుకుని ప్రక్కకు తీసుకువెళ్లి రెండువేళ్ళూ చూపించి అమ్మను ఒక వేలు పట్టుకోమన్నారు.

'నీవు ఏ వేలు పట్టుకోమంటే ఆ వేలు పట్టుకుంటా నాన్నా.'

'నేను చెప్పటం కాదమ్మా - నీ యిష్టం వచ్చిన వేలు పట్టుకో-'

'నాకు అవసరం రాలేదుగా - యిష్టం అనేది ఏమున్నది?'

'నేను అడిగినప్పుడు ఏది బుద్ధిపుడితే అది పట్టుకో-' అని రెండు గడ్డిపరకలు చేతపట్టుకు వచ్చి -

'ఈ రెండింటిలో ఏదో ఒకటి పట్టుకో అమ్మా-'

'నేను అది పట్టుకోను గానీ నీవు ఎందుకు అడిగిందీ చెప్పు-'

'అది నీకెందుకమ్మా?' - నేనడిగానుగా-'

'నేనడిగానుగా - పెళ్ళి చేసుకోవటం తప్పదా - అని అడుగుతున్నావా?'

చప్పున అమ్మను దగ్గరకు లాక్కున్నారు. జలజలా సీతాపతితాతగారికి కన్నులు స్రవించాయి. తాతగారి కన్నీళ్ళు చూచి అమ్మ వెంటనే గడ్డిపరక పట్టుకుని-

'పట్టుకున్నానుగా - ఏడవకు' అన్నది.

' పిచ్చి తల్లీ-' అని గుండెలకు హత్తుకుని - 'అందుకు ఏడుస్తున్నావా?' అన్నారు.

'నేను పట్టుకున్న ఫలితమేమిటి?' తాతగారి గడ్డం పట్టుకుని అమ్మ అడిగింది.

'చెప్పే దేమున్నది? పెళ్లి తప్పనిసరి-'

'అయితే తాతమ్మ చెప్పిన మాట వింటావన్నమాట. నాకెందుకులే... నేను బాపట్ల వెళ్లుతున్నానుగా-'

'అయితే నీవు తాతమ్మ మాట వింటావా? నా మాట వింటావా?'

'నాకు తాతమ్మ మాటే కావాలి నాన్నా'

'రేపు వచ్చే ఆవిడ నిన్ను సరిగా చూడదు. నీ సొమ్ములన్నీ యిప్పుడే ఖర్చు పెట్టాలి. అందుకు నీకు యిష్టమేనా?'

'జరిగేది మంచిపని అయిన్నాడు ఖర్చుపడ్డా యిష్టమే. మాట తప్పినా యిష్టమే.'

వెంకట సుబ్బారావుగారు వచ్చి అడిగారు-

'అబ్బా కూతురి సంభాషణ ఏమిటి?'

'అబ్బా, కూతిరి యిష్టాగోష్టి.'

'నీవు ఎక్కడ విన్నావమ్మా యీ మాట?'

'ఎక్కడో మీరు అంటూ వుంటేనే విన్నా'

'నాకు ఆ పదం అలవాటు లేదే-'

'తాతగారూ మీరు మాట్లాడుతుంటే మా పెద్దత్తయ్య ఏమిటీ అన్నాదమ్ములు మాట్లాడుతున్నా'రంటే 'నీ మాటగాదు; మా అన్నాదమ్ముల యిష్టాగోష్టి' అంటిరే... దొడ్డివాకిట్లో-'

'ఓహో - ఎక్కడ జ్ఞాపకశక్తి!' అని ఆశ్చర్యపోయి-

'సరే - యిక భోజనాలకు పోదాము, రండి - తర్వాత మాట్లాడుకోవచ్చును.'

సీతాపతితాతగారు అమ్మను ఎత్తుకుని భోజనానికి బయలు దేరారు.

18. "సర్వసృష్టికారిణిని"

అందరూ భోజనాలకు కూర్చున్నారు. అమ్మ కూడా సీతాపతి తాతగారి దగ్గర అన్నానికి కూర్చున్నది. తాతగారు ఔపోసన పట్టి కందిపచ్చడి కలుపు కుంటూ అడిగారు-

'నీ కేది యిష్టం?' అని.

'విస్తరిలో ఉన్న వాటిల్లోనా నా యిష్టం? అసలు నా కేది యిష్టమనా అడిగింది?'

అమ్మ ఎదురు ప్రశ్న విని చిదంబరరావుగారు పకపకా నవ్వి- 'చెప్పవయ్యా సీతాపతీ, చెప్పు సమాధానం-' అన్నారు.

సీతాపతి తాతగారు ఏమీ మాట్లడలేదు.

'చెప్పేదేమున్నది? మీ యిష్టం వచ్చినట్లు చేయటమే-' అన్నది అమ్మ చిదంబరరావుగారితో-

'నాతో తరువాత పోట్లాడుదువుగాని - మీ నాయన నడిగి ఆ సమాధానం ముందు చెప్పించుకో-'

'నాన్నే మీ రనుకుని మీరు చెప్పండి ఆ సమాధానం. మొన్న మీరు ఆ ప్రశ్న మేము వేశామని సమాధానం చెప్పమంటిరే-'

'అడుగడుగునా అడుగు తీసి అడుగు పెట్టడం మహా కష్టంగా ఉంది, యీ అనసూయా మహాదేవిగారితో-' అని చిదంబరరావుగారు నవ్వారు.

'ఆహా - ఈ అనసూయా మహాదేవిగారే కారణం' అన్నారు వెంకట సుబ్బారావుగారు, మనసులో ఏమేమో ఊహించుకుంటూ.

'సమస్త కార్యాలకూ కారణమేనా?' అమ్మ గంభీరంగా అడిగింది.

'ఆ - యిప్పుడు జరిగిన యీ విషాద ఘట్టానికి నీవే కారణం-' వెంకట సుబ్బారావుగారు నొక్కి చెప్పారు.

ఆ మాటలకు చిద,మరరావుగారు బాధపడి అడ్డు చెప్పారు-

'అట్లా అనబోకు - శాస్త్రరీత్యా 'శాంతి' చేయించాముగా అట్లా ఎందుకు జరగాలి?

'వాళ్ళ కట్లా జరిగే యోగ్యత ఉంటే వీళ్ళిట్లా వుడతారా? వీళ్ళిట్లా పుట్టినందువల్ల వాళ్ళ కట్లా జరుగుతుందా? అసలు యివి రెండూ కాకపోయినా - అట్లా అనుకుంటారా?'

అమ్మ ఒక్కసారి తర్కశాస్త్ర జలధి గర్భంలోకి దూకి ఒక్క మునకవేసి తలపైకెత్తి ఫక్కుమన్నది. తీరంలో నిలబడిన తాతగార్లిద్దరూ నివ్వెరపాటుతో అమ్మవంక చూస్తూ ఉండిపోయారు. అమ్మ తిరిగి తీరానికి వచ్చి-

'ఏమిటి? ఏమంటారు?' అని అడిగింది.

'నీవే చెప్పు-' చిదంబరరావుగారు అర్థించారు.

'మరి- తొడుక్కుండేదెవరు:

చిదంబరరావుగారు ఫక్కున నవ్వి-

'గాంభీర్యంలో చమత్కారం, చమత్కారంలో గాంభీర్యం- దీనిని కావ్యంలో అయితే 'రసాభాస' అంటారు...'

అని అలంకారశాస్త్రం నెమరుకు తెచ్చుకొని-

'పరిహాసం మాని ఆ ప్రశ్నకు సమాధానం చెప్పమ్మా-' అని వినయంగా అడిగారు.

'నాకు చెప్పే స్థితి ఉంటే - యీమెగారే కారణమని అనిపించు కుంటానా? అసలు - కారణానికి అర్థం ఏమిటి? కారణానికి అర్థం తెలిస్తే కార్యాలన్నీ తనే అవుతాడా? చెప్పండి - తాతగారూ చెప్పండి... తొందరగా చెప్పండి...'

అమ్మ మాటా, కంఠమూ కూడా ఉద్రిక్తమయ్యాయి.

అమ్మ మాటల్లోని ఆవేశమూ, అర్థస్ఫూర్తీ అమ్మ ముఖంలోకి తాతగారి దృష్టిని ఆకర్షించుకుని ఆకట్టుకున్నాయి. వెంటనే వారి సర్వేంద్రియాలు నిశ్చేతనములయ్యాయి. అందరూ చేసే చేసే భోజనాలు మాని చిదంబరరావు

గారిని చూస్తూ - ఎవరి నోట ఏ మాటా లేక మౌనంగా ఉండిపోయారు.

అమ్మ మెల్లగాలేచి చెయ్యి కడుక్కుని వాకిట్లోకి వెళ్ళింది. అక్కడున్న ఎవరూ అమ్మ వెళ్ళటాన్ని గమనించలేదు. అమ్మ వాకిట్లో ఉన్న నులకమంచం మీద పడుకున్నది.

అరగంట గడిచింది. అందరికీ స్పృహ కలిగింది.

అందరికీ అప్పటిదాకా నిద్రపోయి అప్పుడే లేచినట్లూ, ఏలోకం నుండో అప్పుడే యీ లోకంలోకి దిగినట్లుగానూ ఉన్నది. అందరూ ఆపిన భోజనాలు చేయడం పునఃప్రారంభించారు.

కొద్దిక్షణాలు గడిచే సరికి చిదంబరరావుగారికి అమ్మ జ్ఞప్తికి వచ్చింది. చూట్టూ చూచారు. ఎక్కడా కనిపించలేదు. లోగడ జరిగిన సంభాషణ కూడా స్మృతికి వచ్చింది. భోజనం చేయకుండా వెంటనే లేచి వాకిట్లోకి వచ్చారు. మంచంమీద ఎవరో పెద్ద ముత్తయిదువ పడుకున్నట్లుగా కనుపించింది. ఎవరా పెద్ద ముత్తయిదువ పడుకున్నట్లుగా కనుపించింది. ఎవరా అని దగ్గరకు వచ్చేసరికి - ఆమె రంగమ్మ! ఆశ్చర్యంతో కన్ను 'లింత' చేసుకుని చూచేలోగా అమ్మ సన్నగా నవ్వింది.

'ఎంత భ్రమ పడ్డానమ్మా! అని అమ్మను ఎంగిలి చేత్తోనే నిమురుతూ చిదంబరరావుగారు--

'ఏం సూరమ్మ తల్లీ...' అనగానే...

'నన్ను సూరమ్మ అంటారేం? ఆదెమ్మను, ఏమి పేర్లు యీ పేర్లు? నేను సూరమ్మనూ గాను; ఆదెమ్మనూ గాను.'

'సోదెమ్మవులే. అది సరేగానీ ఎందుకు అట్లా కనపడ్డావ్?' చిదంబర రావుగారింకా ఆశ్చర్యం నుంచి తేరుకోలేదు.

'ఎట్లా చూచేవారికి అట్లా కనపడతాను.'

విస్మయసాగరంలో తీరం చేరుకుంటున్న వాడిని మరొక తరంగం లోపలికి నెట్టివేసినట్లు - చిదంబరరావుగారికి తగిలింది ఆ వాక్యం.

అంతలో అందరూ భోజనాలు ముగించుకుని బయటకు వచ్చారు.

'ఎందుకురా తింటూ తింటూ వచ్చావు? అమ్మాయి జ్ఞప్తికి వచ్చిందా?' అని వెంకట సుబ్బారావుగారు చిదంబరరావుగారిని అడిగారు.

'జ్ఞాపకం వచ్చేదేమున్నది? ఎప్పుడూ ఉంటూనే ఉన్నది. కాని యీ వేళ యేదో మాయ కప్పినట్లున్నది.'

'మాయ నీకే కప్పటమేమి? అందరికీ కప్పిందిగా-'

అమ్మ అక్కడ నుండి లేచి - 'ప్రయాణం ఎప్పుడు నిశ్చయించారు తాతగారూ?' అని అడుగుతూ బయటకు వెళ్ళింది.

'ఎక్కడికో వెళ్ళుతున్నది మళ్ళీ' అనుకుని-

'అన్నాల సమయం నుండి ఏమిటిదంతా అసలు?' అని ఆలోచనలో పడి-

'అన్నయ్యా మీరంతా రెండెడ్ల బండిలో రండి. నేను అమ్మాయిని ఎత్తుకుని నడిచి వస్తాను' అని వెంకట సుబ్బారావుగారితో అంటూ చేతితో ముఖం తుడుచుకున్నారు. ఎంగిలి చేయి తగిలింది. వెంటనే లేచి చెయ్యీ ముఖమూ కడుక్కుని తడిగుడ్డతో ఒళ్ళంతా తుడుచుకున్నారు. కానీ శరీరమంతా మంట లెత్తింది. 'ఎంగిలిచేయి పూసుకున్నాను కాబోలు. ఈ స్థితి ఎప్పుడూ రాలేదు. మరుపు అంటే ఏమిటో ఎరుగను' అనుకుంటూ వెళ్ళి స్నానం చేశారు.

'దీనిని బట్టి గంగరాజు పున్నయ్యగారి స్థితి ఏమిటో' అయినా అమ్మాయిని ఒంటరిగా కూర్చోబెట్టుకుని అడగాలి..., అనుకుని పున్నయ్యగారి వద్దకు వెళ్ళి తెల్లవారుజామున ప్రయాణం సంగతి హెచ్చరించి వాకిట్లోకి వచ్చారు.

అమ్మ ఒంటరిగా అరుగుమీద కూర్చున్నది. చిదంబరరావుగారు వలకరించారు. అమ్మ పలకలేదు. వలకని అమ్మను కదిలించటానికి సందేహించి-

'మా అమ్మ ధ్రువుడల్లే కనపడుతూ ఉంది' అనుకుంటూ ఆయనా
25 అట్లాగే నిలబడ్డారు.

ఒక పావుగంట పిమ్మట అమ్మ కదిలినట్లు తోచింది.

'ఏమి చేస్తున్నావమ్మా - అందరూ పడుకుని నిద్రపోతున్నారు. నీవు కూడా పడుకుందువుగాని, రా -' అని అమ్మను పిలిచారు.

'నేను వస్తాను. మీరు వెళ్ళి పడుకోండి-'

'నిన్ను అర్థం చేసుకోవటం కష్టమమ్మా. ఎట్లా జరుగవలసి ఉన్నదో ముందుకాలం...' అని ఆయన కూడా అరుగుమీద కూర్చుని అమ్మను ఒడిలోకి తీసుకున్నారు. గడ్డం పట్టుకుని ముఖంలోకి పరికిస్తూ- 'నీ సంగతేమిటో చెప్పమ్మా-వినాలని ఉన్నది' అన్నారు.

'వినటమెందుకు? కంటున్నారుగా-'

అమ్మ బుగ్గమీద ముద్దుపెట్టుకుని ఆనందాశ్రువులతో తన చెంపలు తడుస్తుండగా-

'అమ్మా-అనసూయా-నీ వేమిటో చెప్పు-' అని చిదంబరరావుగారు ఆవేశంగా ఆర్తితో అడిగారు.

'నేను ఏమీ లేదు. అందరివంటి దానినే. ఎందుకట్లా ఏడుస్తున్నారు?'

'అందరి వంటి దానివేగానీ చిన్నతనంలో యీ ప్రసంగాలన్నీ ఆలోచన కలిగిస్తున్నాయి.'

కొంతకాలం యిద్దరి మధ్యా మౌనంగా ప్రవహించి పోయింది. చిదంబరరావుగారు మెల్లగా కంఠం సవరించుకుని --

'పున్నయ్యగారి సంగతి అడుగుతా... నిజం చెప్పవూ...' అని బ్రతిమాలారు.

'ఇప్పుడు మీ సంగతి యేమిటో నిన్న పున్నయ్యగారి సంగతి కూడా అదే. ఇప్పుడు మీ స్థితి మీకు తెలుస్తున్నదీ? ఆయన సంగతీ అంతే. చెప్పేదేమీ లేదు.'

ఆ వివరణ అమ్మకు యిష్టం లేదని తేల్చుకున్న చిదంబరరావుగారు విషయం మార్చక తప్పిందికాదు.

'ఇంతకూ బాపట్ల వస్తావా?'

'నాకు అంతకూ రావాలనే ఉంది.'

'అంతకూ అంటే అంతటకూ అనా?'

'ఇంతకూ అంటే ఏ అర్థముందో అంతకూ అంటే ఆ అర్థమే ఉంది.'

'ఇంతకూ చెప్పవూ?'

'చెప్పితే అర్థంకాదు.'

'అర్థం అయ్యేటట్లు చెప్పమనేగా అడగటం...'

'చెపితే అర్థంగాదు తాతగారూ-ఇంత తావత్రయం నిన్న ప్రొద్దున లేదుగా? పున్నయ్యగారిని చూచినప్పుడు వారిని గురించి ఆలోచనలేదుగా? మీకు కలిగిన అనుభవాన్ని పురస్కరించుకుని పున్నయ్యగారిని గురించి ఆలోచన వచ్చింది.'

'ఔను, నిజమే - నీవు అట్లా మాట్లాడుతూ ఉంటే ఆనందంగా ఉండి అడుగుతానమ్మా-'

'ఔను. నిజమే - మీకు అర్థం గాక కాదుగా-' అంటూ అమ్మ గోడన ఉన్న మట్టి పెళ్ళలు వలుచుకు తిన్నది.

'అదేమి పని అమ్మా? మట్టి తినకు. కడుపులో బల్లలు పెరుగుతాయి.'

'ఆమె మా అమ్మ; తాతగారూ-'

ఆ మాట చిదంబరరావుగారికి అర్థంగాక - ' మీ అమ్మ రంగమ్మ అయితే ఈమె ఎందుకవుతుంది?' అని అడిగారు.

'ఆ అమ్మ పోతూ యీ అమ్మను చూపించింది. ఆ అమ్మవలే యీ అమ్మ పోయేది కాదు. ఎన్ని బళ్ళూ, ఎన్ని కార్లూ మీదగా పోయినా, తిట్టినా, తన్నినా, మలమూత్రాలు విసర్జించినా, ఏమి చేసినా - సమస్త జనానికీ అన్నం పెట్టేది యీ తల్లే. అన్ని వేళలా అన్ని వస్తువులకూ ఆధారమయింది యీమే. అందుకే యీ భూమిని నేను ప్రత్యక్ష దైవంగా మాతృదేవిగా భావిస్తాను.'

'ఇంకా వివరంగా చెప్పాలమ్మా--'

'ఇప్పుడే చెప్పమంటారా?'

'వద్దులే. మనం పోతూ పోతూ చెప్పుకుందాము బండిలో.'

'ఇప్పుడు ఎన్ని గంటలయింది. తాతగారూ?'

'రెండు అయి ఉంటుంది.'

అందర్నీ లేపి బండి కట్టించండీ - తెల్లవారేటప్పటికి పొన్నూరు చేరవచ్చు.

అందరూ బయలుదేరే టప్పటికి గం. 3.30 ని. అయింది. అందరూ ఒకే బండిలో ఎక్కారు. రెండవ ఒంటెద్దుబండి దొరకలేదు. అనుకున్నట్లుగా చిదంబరరావుగారి సంభాషణకు అవకాశం చిక్కలేదు.

అమ్మ బండి తొట్టిలోకి ఎక్కి-

'తాతగారూ - నేను బండి తొట్టిలో కూర్చోనా?' అని అడిగింది.

'కూర్చుని - కూర్చోనా అని అడుగుతావే మమ్మా?'

'కూర్చోలేదు తాతగారూ. అటుగా ఎక్కాను. మీకు కూర్చున్నట్లుగా కనబడుతున్నానా?'

'పొట్టిదానివి కదూ? భూమికి జానెడు ఎత్తున ఉంటావాయె!'

'ఔను - భూమికి జానెడు ఎత్తున ఉంటాను' అమ్మ నవ్వింది.

'లోపలగానా? పైగానా? చిదంబరరావుగారు చమత్కరించారు.

'లోపల గానా; బయట బజానా' అన్నది అమ్మ వెంటనే.

ఆ ఉర్దూ పదాలు అమ్మ ఎక్కడ విన్నదా అని చిదంబరరావుగారు చకితులవుతుంటే... అమ్మ అడిగింది---.

'ఇంతకూ భూమికి జానెడు ఎత్తున - లోపలనా, పైనా?'

'లోపల ఎట్లా ఉంటావమ్మా? పైనే---'

'మరి - యిందాక భూమిమీద జానెడెత్తున అనలేదుగా. భూమికి జానెడెత్తున అనలేదుగా. భూమికి జానెడెత్తున అన్నారు. నా మీద భూమి ఉన్నట్లుగా ఉంది మీ మాట.'

'ప్రతి అక్షరంలో నుంచి అర్థం తీస్తావమ్మా-'

'వ్యర్థమయిన అర్థాలు కావు కదా?'

'నీ మాట ఏదీ వ్యర్థం కాదమ్మా - అంతా సార్థకం.'

'ఎవరికి సార్థకం అంటారూ? సాధకులకా? అయినా నా దృష్టిలో సాధకులే లేరు'

అంతలో బండిలో సామానంతా సర్దారు. అందరూ ఎక్కారు.

'తాతగారూ - నేను నడిపేదా బండీ?' అమ్మ అమాయకంగా అడిగింది.

'బండేమిటి తల్లీ - అంతా నడుపుతావు!'

'నడిపేవాడిని బట్టి అంతా నడుస్తుందా తాతగారూ?'

నల్ల ఖాసిం వచ్చి ఎద్దుల నదిలించాడు. ఒక ఎద్దు త్వరగా కదిలింది. రెండవది కదలలేదు. గట్టిగా కొట్టగానే దెబ్బతిన్న ఎద్దు ముందుకు లంఘించింది. రెండవది వెనక్కు తగ్గింది.

'దగ్గరగా కూర్చుంటే చాలా విషయాలు మాట్లాడుకోవచ్చు. మీరు కూడా తొట్లోకి రండి-' అని అమ్మ చిదంబరరావుగారిని పిలిచింది.

'తోలేవాడు కూర్చోవద్దా అమ్మా?'

'వాడికి చోటు ఉన్నది.'

'అక్కర్లేదు. నేను ఎద్దుల తాళ్ళు పట్టుకొని నడుస్తాను' ఖాసిం అందుకుని చెప్పాడు.

'తాతగారూ-ఖాసిం అన్నమాటలు వినబడ్డాయా?'

'నడవలేడమ్మా - అంత సేపు.'

'నడిపించగలవాడు నడవలేకపోవట మేమిటి?' అని అమ్మ సత్యాన్ని చమత్కరించింది.

చిదంబరరావుగారు దొప్పలపూడి దాటిన తరువాత తొట్టి లోకి వస్తా నన్నారు. కాని దొప్పలపూడి దాటగానే బండి బోల్తా పడ్డది. కానీ ఎవరికీ దెబ్బలు

తగలలేదు. అంతా సర్దుకుని మళ్ళీ బండి ఎక్కారు.

'తాతగారూ - మనం బండిలో అన్ని సంగతులూ మాట్లాడుకుందామనుకున్నాము గదూ-'

'ఇంకా పొన్నూరు చాలాదూరం ఉందిగా - మాట్లాడుకుందాము. అయినా యీ బండి బోల్తాపడి ఎవరికీ దెబ్బలు తగలకుండా ఉండి ఒడ్డున పడడానికి ఎవరున్నారో అదృష్టవంతులు...'

'పడటానికి ఏ అదృష్టవంతులున్నారో?... రెంటికీ ఒక రేనా? పడటానికి - పడకుండా ఉండటానికీ, దెబ్బలు తగలటానికీ - తగలకుండా ఉండడానికి... రెంటికీ కారణం ఒకటేగా?' అని అమ్మ ప్రశ్నార్థకమయిన సత్యాన్ని వెల్లడించింది.

బండీ నడుస్తూ ఉన్నది.

రామచంద్రాపురం రోడ్డు తిన్నగా వచ్చాక ఎద్దులు రెండూ కుమ్ముకున్నాయి. బండి కలతపడి, కాడితాళ్ళు తెగి సుడిపడ్డాయి. అమ్మ తొట్టిలోనుంచి క్రిందకు దూకింది. పడిపోయినట్లుగా అందరికీ కనుపించింది. 'అమ్మో-బిడ్డ పడిపోయిందని' అందరూ ఒక్కసారి ఆక్రోశించారు. అంతలో బండి వెనుకకువాలి అందరూ వెనుకకు దొర్లారు. అమ్మ నవ్వుతూ వారి వద్దకు వచ్చి-

'నేను ముందు పడ్డాను; మీరు వెనుక పడ్డారు. ముందు నేను పడ్డాను. నా వెనుక మీరు పడ్డారు. నేను చిన్నమ్మాయిని, ముందు పడ్డాను. పెద్దవారంతా నావెంట పడ్డారు' అన్నది విలాసంగా.

'ఎన్ని అర్థాలుగా అన్నావమ్మా!' చిదంబరరావుగారు విస్మితులయినారు.

అందరూ లేచి సర్దుకున్నారు. అమ్మకూ, చిదంబరరావుగారికి మినహా మిగిలినవారికి కొద్ది గాయాలయినాయి.

'అర్థాలకోసం అనలేదు. జరుగుతున్నది అంటున్నా.'

'అర్థాలకోసం అనలేదు, సరే. జరుగుతున్నది సరాసరి చెప్పితే సరిపోదూ? ఇన్ని రకాలుగా ఎందుకూ? ఇంతకూ చిదంబరం, ఏమిటిరా

అమ్మాయి అనేది-' అని వెంకట సుబ్బారావుగారు అడిగారు.

'చాలా ఉన్నది అర్థం. ఇప్పుడప్పుడే తేలేటట్లుగా లేదు. యింటికి వెళ్లిన తరువాత తీరికగా కూర్చోబెట్టుకుని అడగాలి-' చిదంబరరావుగారు అలవాట యిన వాయిదా వేశారు.

బండి సాగింది. అమ్మా, చిదంబరరావుగారూ తొట్టిలో కూర్చున్నారు.

'తాతగారూ-మీరు యిప్పుడు తెనాలి తాతగారితో అన్నదేమిటి?' అమ్మ అడిగింది.

'పట్టుకున్నా పీక?'

'నేను పట్టుకోలేదు. మీరే అన్నారు - యింటికి వెళ్లిందాకా పీక ఎత్తవద్దని.'

'ఏదీ చెప్పకుండా తప్పుకోవటానికా యీ యెత్తు-'

'అందుకే రెండెద్దులూ యీ ఎత్తు ఎత్తినయ్. ఇంతుకూ అనుకున్నది జరుగదు; తనకున్నది తప్పదు.'

ప్రతివ్యక్తి అనుభవంలోనూ అడుగడుగునా ఎదురై ఓదార్చే సత్యమూ, ప్రతివ్యక్తి మనసులోని ఊహాజగతికి లోకానుభవానికీ మధ్య నిలిచే సమన్వయ సూత్రమూ, పరాజితుడయిన మానవుడు కారణంకోసం ఆకాశంలోకి తలయెత్తి చూచినపుడు అంతరంగం పలికే సమాధానమూ, సర్వమతాల సకలశాస్త్రాల సారమూ అయిన ఆ మహావాక్యాన్ని అమ్మ నోటి వెంట అలా నిర్లిప్తంగా, నిసర్గంగా వినగానే చిదంబరరావుగారు ఆశ్చర్య ఆనందాలతో పులకితాంగులై

'అన్నయ్యా-' అని పెద్దగా కేకవేసి-

'విన్నావా?' అని అడిగారు.

'ఏమిటి - వినబడలేదు నాయనా.'

ఆ సమాధానం మరిడమ్మగారి నుండి అనుకుని-

'అన్నయ్య నిద్రపోతున్నాడా ఏమిటి పిన్నీ-?' అని అడిగారు.

పలికింది నేనేరా-' అన్నారు వెంకట సుబ్బారావుగారు.

దానిని గురించి అన్నదమ్ములిద్దరూ తర్కించుకున్నారు. అది విని మరిడమ్మగారు 'నేను గాదు నాయనా-' అన్నది.

'ఇందాకటి నుంచీ అరుచుకున్నారుగానీ, దేనిని బట్టి మీకీ అనుమానం వచ్చిందో చెప్పండి-' అని అమ్మ చిదంబరరావుగారిని అడిగింది.

'గొంతును బట్టి.'

'గొంతు మీ కంటికి కనబడలేదుగా?'

'ధ్వనిని బట్టి-'

'ధ్వని కూడా కాదు. నిజం చెప్పండి-'

పోనీ- నేను చెప్పినవి చాలటంలేదుగా. నీవు చెప్పు.'

'మీరు నాకు చాలేటట్లు చెప్పలేక పోవటంకాదు. చిన్న పిల్లకు నిజం చెప్పడం ఏమిటిలే అని.'

'పోనీ - నిజం నీవు చెప్పరాదూ?'

తాతగారు మిమ్మల్ని 'ఏమిరా' అనేవారు. 'ఏమి నాయనా' అని తాతమ్మ అంటుంది. తాతగారు పొరపాటున 'నాయనా' అంటే అది విని మాటను బట్టి మోసపోయి తాతమ్మ అనుకున్నారు. పలికింది తాతగారే. ధ్వని కూడా కాదు మీ అనుమానానికి కారణం. ఏదో ఆలోచించేటప్పుడు ఆలోచనలో ఈ మాటలోని భావాన్ని కాని శబ్దాన్ని కాదు మీరు గుర్తించింది. అప్పుడు శబ్దానికి కూడా ఆధారం భావమే అయింది.'

స్పష్టంగానూ, స్ఫుటంగానూ, ధారాళంగానూ అమ్మ మాట్లాడే తీరు చూచి వెంకట సుబ్బారావుగారు ఆశ్చర్యంతో -

'ఏమిటో మహారాణిగారు తీర్మానం చేస్తున్నారే-' అన్నారు.

'నేను మహారాణినిగాదు. తాతగారు - సర్వసృష్టికారిణిని.'

విస్మయానందాలతో వారి మేనులు ఒక్కసారి పులకరించాయి. వారి

మేధామండలాల్లో ఒక్క మెరుపు మెరిసింది. పరిసర ప్రకృతి పరమానందంతో పరిమళించింది. పవనుడు భక్తితో ప్రదక్షిణాలు చేసినట్లు అక్కడే సుడితిరిగాడు. ఆకాశం నుండి దేవతలు జయధ్వానాలు సలిపినట్లు, మేఘమాలికలు మెత్తగా నినదించాయి.

'బండి ఆపు ఖాసిం-' చిదంబరరావుగారు బండి ఆపించి అమ్మవంక చూచారు. అమ్మ మామూలుగానే కూర్చున్నది.

'మళ్ళీ అనమ్మా-'

అవసరం కలుగలేదుగా.'

'ఇందాక భూమి తల్లి అన్నావు. ఆమె అన్నింటికీ ఆధారమన్నావు. ఇప్పుడు సర్వానికీ 'నేనే' ఆధారమంటున్నావు-'

'సర్వానికీ సర్వమూ ఆధారమే.'

తరంగం వెంట తరంగం పెద్దపెట్టున వచ్చి మీదపడి ఊపిరి సలుపుకోనివ్వనట్లు వాక్యం వెంట వాక్యం అమ్మనోట వెలువడి చిదంబరరావు గారిని ఉక్కిరి బిక్కిరి చేస్తున్నాయి. వారిమనో విహాయసంలో అమ్మ పలికే ప్రతిమాటా ఒక్కొక్క నక్షత్రమై నిలిచిపోతున్నది.

బండి పొన్నూరు సమీపించింది.

చిదంబరరావుగారు అమ్మతో మాట్లాడాలనుకున్న విషయ ప్రస్తావన కూడా జరుగలేదు.

౹౭. వాడూ బిడ్డేగా

అమ్మ హఠాత్తుగా అన్నది.

"నాకు మరలా మన్నవ పోదామని ఉన్నది తాతగారూ-"

"మేము ఇటు తెనాలి వెళతాము. మీరు బాపట్ల వెళ్ళండి. వస్తే అమ్మాయిని తీసుకువెళతాము" అని వెంకటసుబ్బారావుగారు అన్నారు.

"మన్నవలో అనుకున్న మాటలు మరిచారా ? అందరూ కలసి బాపట్ల వెళదామనుకున్నారుగా?" అమ్మ ప్రశ్నించింది.

"మరుపుకాదమ్మా - పరిస్థితులట్లా ఉన్నాయి."

"అందరమూ కలసి బాపట్ల పోదాము. నాలుగు రోజులున్నతరువాత నేనూ తెనాలి వస్తాను" అన్నది అమ్మ.

"అయితే తప్పకుండా పోదా"మన్నారు వెంకట సుబ్బారావుగారు.

"అప్పుడేమవుతాయి ఆ పరిస్థితులు ?" అమ్మ నవ్వుతూ ప్రశ్నించింది.

"ఏమయితే నీకెందుకు? తప్పకుండావస్తా, నీవు వస్తానంటె-" వెంకట సుబ్బారావు గారు నొక్కి చెప్పారు.

"అప్పటికి నా పరిస్థితులెట్లా ఉంటాయో" అని అమ్మ వెంకటసుబ్బారావు గారి ముఖంలోకి చూచింది.

"నీకు కూడా పరిస్థితులా ?" అని ఆశ్చర్యపోయారు వెంకట సుబ్బారావుగారు.

"పరిస్థితులందరికీ ఒకటిగానే ఉంటాయి."

"ఇవన్నీ ఎందుకు ? నీవు వస్తానంటేనే మేము వస్తాము."

"మీరు వస్తే-నాకు వీలుగావుంటే నేను వస్తాను."

వెంకట సుబ్బారావుగారు సంభాషణ కొనసాగించలేక అన్నారు - "మీ నాన్న నిన్ను బలవంతంగా తీసుకు వెళ్ళమన్నాడు."

"ఏమిటి?" అమ్మ ప్రశ్నించింది.

"నిన్ను బలవంతంగా తీసుకువెళ్ళమన్నాడు నన్ను."

"మిమ్మల్ని నేను బలవంతంగా తీసుకువెళ్ళాలా? ఎందుకు?"

"అది కాదమ్మా-నన్ను బలవంతంగా తీసుకువెళ్ళమన్నాడు నిన్ను."

"అది కాదండి - నేను మిమ్మల్ని బలవంతంగా ఎక్కడకు ఎందుకు తీసుకు వెళ్ళాలండీ?"

అందాకా సంభాషణంతా మౌనంగా వింటున్న చిదంబరరావుగారు పకపకా నవ్వుతూ -

"నిన్ను తీసుకు వెళ్ళమని తనతో చెప్పాడుటమ్మా-" అన్నారు.

"ఓహో : అదా ? మరిట్లా చెప్పరేమి ?" అని అమాయికంగా అడిగి వెంకటసుబ్బారావుగారి వంక తిరిగి.

"ఆ సంగతి నాకు చెప్పేదేమున్నది? అది మీ బలం మీద ఆధారపడి ఉన్నది. ఎవరి బలంకొద్దీ వారు చూచుకోవచ్చు."

"ఇంతా మేము తీసుకువెళితే చెప్పకుండా వస్తావా?"

"మీరు వింతగా తీసుకువెళితే - నేను తీరుగావస్తా."

"ఎందుకూ లాభంలేదు. దానికి ఇంత ఇష్టం లేనిది ఎందుకు ? ఇంతమంది మనుమలూ మనమరాళ్ళూ ఉండగా ఏ మబ్బా అది రాకపోతే?" జానకమ్మగారు విసుక్కున్నారు.

"అందుకనే రాను" అన్నది అమ్మ.

"ఎందుకని?"

"ఎందరో ఉన్నారుగా - నేను ఒక్కతెను రాకపోతే మాత్రమేమి ?"

జానకమ్మగారి విసుగూ, అమ్మమాటా చిదంబరరావు గారికి బాధ కలిగించి సర్దటానికి అమ్మతో అన్నారు -

"ఆమెకు మాట్లాడటం చేతకాదమ్మా-"

"మాట్లాడటం చేతకాక మాట్లాడితే బాధలేదు".

"నీకు ఎప్పడూ బాధలేదులే అమ్మా"

"మీ మాట నాకు ఆశీర్వచనంగా ఉండాలి. భరించలేని స్థితి అంటూ నాకు రాకూడదు. మరి, భరించలేనిదే బాధ కదా-"

"అనిర్వచనీయమైన శక్తి గలదానికి నా ఆశీర్వచన మెందుకమ్మా?"

"నిర్వచనాలతో ఉన్నాను కనుక."

ఎట్లాగయితేనేమి - రైల్వేస్టేషను చేరేసరికి అందరూ బాపట్ల వెళ్ళటానికే నిశ్చయించుకున్నారు. రైలు రాగానే చిదంబరరావుతాతగారు, అమ్మా ఒక పెట్టెలోనూ - మిగతా అందరూ మరొక పెట్టెలోనూ ఎక్కారు.

రైలుకదలగానే, ఇక ఒక క్షణమయినా వృథాకారాదన్నట్లు చిదంబరరావు గారు అడిగారు.

"అమ్మా - అనసూయా మనం బాపట్లలో దిగేలోగా పున్నయ్యగారిని గురించి క్లుప్తంగా జరిగిందంతా చెప్పమ్మా-"

"అసలు మీకు యీ ఆలోచన ఎందుకు వచ్చింది తాతగారూ-"

చిదంబరరావుగారు కొన్ని క్షణాలు మౌనంగా ఉండిపోయారు - అందుకు సమాధానం దొరకకకాదు, చెప్పలేక. ఒక్కసారిగా ఒక దివ్యానుభూతి శరీరమంతా నిండగా కంఠంకూడా పూడిపోయి ఉండవచ్చు. అనిర్వచనీయమయిన భావానికి అవసరమయిన భాష లభ్యంకాక కావచ్చు. ఏమయినా ముఖమెత్తి అమ్మవంక చూచారు. ఆ ముఖంలో వారు చూచింది - ఏమీ తెలియని అమాయికతో, అన్నీ తెలిసిన ప్రశాంతతో..... ..... కన్ను లశ్రు పూర్ణమయినాయి. గొంతు సవరించుకున్నారు.

"ఎల్లప్పడూ నన్ను ఆనందపరిచేదీ, చెప్పటానికి చేతకానిదీ నీయందు నాకొక అభిప్రాయం ఉన్నది. ఒక్కొక్కప్పడు ఎంతో పెద్దదానివిగా స్ఫురిస్తావు. మరొకప్పడు

పసిదానివిగా కనిపిస్తావు. ఒక్కొక్కసారి సర్వజ్ఞవలె వ్యవహరిస్తావు. ఆ వెంటనే ఏమీ తెలియనట్లు మాట్లాడుతావు. అసలు నీలో గొప్పతనమెట్లా ఉన్నా - ఒక బాలిక గురించి ఒక మనిషికి ఇన్ని అభిప్రాయాలా ? ఇన్ని రకాల భావాలా? సాధారణంగా ఒక వ్యక్తిని గురించి ఒక వ్యక్తికి ఒకరకమయిన అభిప్రాయమే ఏర్పడుతుంది. అది సరిఅయిన నిర్ణయం అయినా, కాకపోయినా. కాని ఇన్ని రకాలుగా ఏర్పడవు. సామాన్యంగా నాకు ఎంత గొప్పవారియందూ సదభిప్రాయం ఏర్పడదు. అదీగాక నా అభిప్రాయాలు కూడా క్షణక్షణానికీ రంగులు మార్చుకోవు. మరి, నీయందు ఇన్ని రకాల భావాలూ, అందులోనూ ఎంతో సద్భావమూ కలగటం విశేషం కాదూ ? ఇదే నీ అసాధారణ స్థితి అను కుంటున్నాను. నేనేమీ నీ మాట బయటపెట్టను. విశ్వసించి నా వికారాలు పోగొట్టుకుంటా."

"ఆకారమే వికారంతో వచ్చింది తాతగారూ-"

చిదంబరరావుగారు అమ్మను తన గుండెల దగ్గరకు తీసుకున్నారు. గొంతులోని జీర తగ్గలేదు.

"ఎంత బాగా అన్నావమ్మా ! ఎన్ని జన్మల సుకృత ఫలమమ్మా-యీ జ్ఞానసంపద. ఏ మహర్షీ, ఏ జ్ఞానీ యీ మాటను ఇంత తేలిగ్గా అనగలడమ్మా? ఏ సాధనా, ఏ విద్యాభ్యాసమూ లేని నీవు ఇంత గొప్ప విషయాలు వివరించటమూ, యీ నీ సర్వజ్ఞత్వమూ సామాన్యం కాదమ్మా, నీవు ఆదిశక్తివి; లోక జననివి....."

అంటూ ఉండగానే వారు నిశ్చేష్టులయినారు. కొద్ది క్షణాల్లో మళ్ళీమామూలై.

"రంగమ్మ తల్లిగర్భాన రత్నగర్భ ఆవిర్భవించింది...." అని అంటూ మళ్ళీ మైమరిచారు.

కొన్ని నిమిషాల అనంతరం తిరిగి జాగ్రత్తలోకి వచ్చినా కలతనిద్రలో ఉన్నట్లు - ఎదురుగా ఉన్నవారిని "రత్నగర్భ ఏదీ?" అని ఆవేశంగా అడిగారు.

అమ్మ చిదంబరరావుగారి చెయ్యి పట్టుకుని

"రత్నగర్భ అంటే సముద్రమా ? భూమా?" అని అడిగింది.

"రెండూనూ".

రైలు బాపట్లలో ఆగింది. అందరూ దిగి సామాను సర్దుకుంటూ ఉన్నారు. అమ్మా, చిదంబరరావుగారూ ముందు వెళ్ళారు. గేటుదగ్గర టిక్కెట్టుకలక్టరు నిలుచుని ఉన్నాడు. చిదంబరావుగారు టిక్కెట్లు తీసి-

"అమ్మా-యివిగో టిక్కెట్లు" అన్నారు.

టిక్కెట్టు కలక్టరు ఆశ్చర్యంగా చిదంబరరావుగారిని "నీ కేమయినా మతి పోయిందటయ్యా?" అన్నాడు.

"ఆఁ......ఆఁ..........పోలా-మతి నీకు?" అన్నది అమ్మ.

"ఎవరినమ్మాయి నీ వన్నది?" టిక్కెట్టు కలక్టరు అడిగాడు.

"ఎవరికి మతిబోతే వారిని. అమ్మా-అంటే అంత నామర్దాగా ఉన్నదా?... అమ్మా!?"

"అయితే నన్నేనా అమ్మాయి నీవన్నది?"

రైలుదిగి వచ్చినవారు గుమికూడారు. వారిలో ఎక్కువగా చిదంబరరావు గారిని ఎఱిగినవారున్నారు. వారిలో ఒకరయిన వడ్లమూడి శ్రీరాములుగారు "ఈ అమ్మాయి ఎవరండీ?" అని చిదంబరరావుగారిని అడిగారు.

"నా మనుమరాలు"

"ఇంతకూ నన్నేనా అమ్మాయి నీవన్నది? నే నడిగిన దానికి సమాధానం చెప్పరేమి?" అని టిక్కెట్టు కలక్టరు అరిచాడు.

"అసలు జరిగిందేమిటో వీరందరికీ తెలిసేటట్లు వివరంగా చెప్పబ్బాయి- శ్రీరాములు తాతగారూ, నేను చెప్పేదా?"

"చెప్పమ్మా-"

"తాతగారు 'టిక్కెట్లు యివిగోనమ్మా-' అన్నారు. అప్పడు నా చేతికి యిస్తున్నా రేమోనని నేను చూచాను. కాని చెయ్యి మాత్రం ఆయనవైపే ఉన్నది. నన్ను కాదులే అని నేననుకున్నాను, వెంటనే ఆయన 'నీ మతి పోయిందా యేమి'

అన్నారు. నన్నన్నట్లా, తాతగారి నన్నట్లా"?

శ్రీరాములుగారు పకాపకానవ్వి అమ్మ నెత్తుకుని ముద్దుపెట్టుకొని వీపు నిమురుతూ భుజంమీద వడుకోబెట్టుకుని వెళ్ళారు. టిక్కెట్టు కలక్టరు గుడ్లుతేలవేసి చూస్తూ ఉండిపోయాడు.

శ్రీరాములుగారు యింటిముందుకు తీసుకువచ్చి అమ్మను దింపి-

"నిజం చెప్పు-అక్కడ ఏమి జరిగింది? నీ మాటలు విని సంతోషం ఆగక నిన్ను ఎత్తుకు వచ్చాను."

"ఇంకానయం - మీరు ఎత్తుకు వచ్చారు గనుక అంతటితో పోయింది."

"లేకపోతే వాడినే భుజాన వేసుకు పోవలసి వచ్చేదా?" శ్రీరాములుగారు నవ్వారు.

"అబ్బే-అట్లా ఎందుకులెండి. వాడూ బిడ్డేగా-"

. "ఓహో ! అంతలావు అమ్మవారివా నీవు?"

"నేను ఎంత చిన్నమ్మనయినా ఇంతలావు తాతగార్లకు తగాదాబెట్టాను. అమ్మా-అనటమేగా కారణం. అంతేలే... అన్నిటికీ అమ్మే కారణం."

"ఎంత బాగున్నవమ్మా - నీ మాటలు! నీతో పోట్లాట పెట్టుకున్నా ఎంత బాగుంటుంది!"

"అని మాట్లాడితే పోట్లాట ఏమి వస్తుంది? అయినా మాట్లాడటమేగా పోట్లాడటమన్నా-"

"ఇట్లాగే మాట్లాడుతూ ఉండమ్మా"-

"ఎందుకూ?"

"నీ ధ్వని విందామని."

అంతలో సామానుతో సహా అందరూ ఇంటికి వచ్చారు. చిదంబదరావుగారు వారి గదిలోకి వెళ్ళి పడుకున్నారు. అమ్మ మేడమీదకు వెళ్ళి మూలగదిలో కూర్చున్నది. వంటమనిషి చెంచమ్మ అందరకూ కాళ్ళకు నీళ్ళు ఇచ్చి-

"అమ్మాయిగారు ఏది?" అని అడిగింది.

"ఏమోనమ్మా - మాకంటె ముందే వచ్చింది ఆమెగారు. తాతగారి దగ్గర ఉన్నదేమో..." నని అన్నపూర్ణమ్మ గారు చెప్పింది.

"ఆ అమ్మాయిని చూడాలనిపిస్తున్నదమ్మా. ఒక్కసారి మేడమీదకు వెళ్ళి చూచి రమ్మంటారూ?"

"అది అడగాలీ? - సముద్రస్నానానికి కొండు భొట్ల వారి ఆజ్ఞ అన్నట్లు. వెళ్ళి చూచిరా-"

వెంకటసుబ్బారావుగారు దక్షిణపువైపున ఉన్న అరుగుమీద కూర్చుని తన బిడ్డ రంగమ్మగారి స్మృతితో బాధపడుతూ ఉన్నారు. జానకమ్మగారు బాపట్ల లోనే ఉంటున్న వారికుమార్తె వరలక్ష్మమ్మగారింటికి వెళ్ళింది. మరిడమ్మగారు బాదమాకులు ముందుపోసుకుని విస్తళ్ళు కుడుతూ ఉన్నది. అన్నపూర్ణమ్మగారు స్నానంచేసి దేవతార్చన గదిలోకి వెళ్ళింది.

చెంచమ్మగారు గబగబా మేడమీదికి వెళ్ళి కిటకీలో కూర్చున్న అమ్మను ఎత్తుకుని-

"మా అమ్మ వచ్చిందే..." అంటూ ఆ స్పర్శలోనే శరీరం పులకించిపోయి కొన్ని క్షణాలు నిలబడిపోయింది.

స్మృతిరాగానే అమ్మను ఎత్తుకుని క్రిందకు వచ్చి నీళ్ళుపోసి వంటగదిలోకి తీసుకువెళ్ళి పీటవేసి అమ్మను కూర్చోబెట్టుకుని తాను వంటచేసింది.

"తాతగారు రానిది నేను తినను". అన్నది అమ్మ.

అంతలో చిందబరరావుగారూ, వెంకటసుబ్బారావుగారలూ కూడా స్నానంచేసి భోజనానికి వచ్చారు. అందరూ భోజనాలు చేయగానే చిదంబరరావుగారు కోర్టుకు వెళ్ళటానికి బయలుదేరుతుండగా ఒక ఉత్తరం వచ్చింది. అది లోగడ వంటమనిషి రాఘవమ్మగారు వ్రాసినది. అత్యవ సరమయిన పనిమీద తాను గ్రామాంతరం వెళుతూ తన స్థానంలో చెంచమ్మగారిని ఏర్పాటు చేశానని వివరిస్తూ క్షమార్పణ కోరుకున్నది.

౨౦. అందరికీ అమ్మ

అందరూ భోజనం చేసినా - రాఘవరావు మామయ్య సైకిలుమీద ఎక్కడికో వెళ్ళి అన్నానికి రాలేదు.

అమ్మ మరిడమ్మగారి యొద్దకు వెళ్ళి అన్నది -

"అన్నయ్య ఇంకా అన్నానికి రాలేదు. అందరం తిన్నాము. తల్లికి ఒక బిడ్డ రాకపోయినా దిగులే.

మరిడమ్మగారికి ఆ మాటలు ఆశ్చర్యం కలిగించి అన్నది- "అదేమిటమ్మా - అన్నయ్యను పట్టుకుని బిడ్డ అంటావు అయినా వాడు అన్నం తినకపోతే బాధపడే తల్లికాస్తా పోయిందికదా?"

"వాడు అన్నం తినకపోతే బాధపడే తల్లికాస్తా పోయిందిగాని ఎవరు అన్నం తినకపోయినా బాధపడే తల్లి ఉన్నది."

"ఎవరు ఆమె?"

"అడిగే ఆమెకు పెంచిన మమకారం ఉన్నది. ఈ మాటచెప్పే అమ్మ అమ్మగా అర్థం కాకుండా ఉన్నది. అంటే..."

అమ్మ మాటలు వినే కొద్దీ మరిడమ్మగారికి ఆశ్చర్యం ఎక్కువై అన్నది -

"అయితే, పెంచిన మమకారం నాకు అమ్మవై అమ్మగా గుర్తించబడకుండా ఉన్న అమ్మవు నీవనా అర్థం?"

"తీసుకో గలిగిన వారికి తీసుకోగలిగినంత."

"అందరికీ అమ్మ అయిన అమ్మ రప్పించుకోవచ్చు. సరి అయిన దారిలో పెట్టుకోవచ్చు."

"చెయ్యటం చేతుల్లో ఉన్నప్పడు బాధ ఉండదు. మాట ఉండదు. ప్రతిదీ ఒకేసారి నిర్ణయమై ఉంటుందిగా. మారేదయితే మారటానికి వీలున్న దయినా ఆ స్థితిని నిర్ణయమని అనరు. నిర్ణయమంటే తప్పనిసరిగా జరిగేది. నేను అమ్మగా

నిర్ణయించుకున్నాను. అమ్మ అమ్మగా కనుపించకపోయినా, అన్నీ తాను ఏర్పరచుకున్నవయినా - ఆ ఏర్పాటు సక్రమంగా నెరవేర్చవలసిందే. ప్రథమంలో స్పందన కలిగేటప్పుడే ఎవరెవరి నడకలు వారికి ఏర్పడతాయి. ఈ సంగతి ఆ స్పందనాన్ని అడుగుదాము. నీటికి తడి ఎట్లా స్వభావమో అట్లాగే ఆ స్పందనం అనేక స్వరూపాలై కూర్చున్నది. నీటికి తడి స్వభావం అనేది నా మాటకాదు. ఒకప్పుడు నీవు చెప్పినమాటే. నీవు మాట్లాడింది నీ భావనేనా ? నీ భావానికి తగినట్లుచెపితే నీకు అర్థమవుతుంది అని చెప్పాను ఆ ఉదాహరణ".

అమ్మ మాటలు వింటూ మరిడమ్మగారు కాలవాహినిలో ఎదురీదింది అమ్మముఖంలో తన గురువుగారయిన మల్లెల రత్తమ్మగారిని చూచింది. పాతగుంటూరులో తాను గురువుగారి యొద్దకు వెళ్లింది. ఆమె చేసిన బోధ పునశ్చ రణమయింది. కాని ఆమెకది పునశ్చరణగా తోచలేదు. అప్పుడు జరుగు తున్నట్లే అనుభవించింది.

ఆమె తిరిగీ కాలఝరిలో వర్తమాన తీరానికిచేరి జరిగినదంతా గురువు గారయిన మల్లెల రత్తమ్మగారి దయాప్రభావమనుకున్నది. ఆమెమహిమకు అది తార్కాణంగా కూడా భావించింది. కాని, ఆమె అమ్మ ముఖంలోనే దర్శన మివ్వటానికి కారణమేమిటని ప్రశ్నించుకుని అమ్మలోని నైర్మల్యమే కారణమని సమాధానం చెప్పకున్నది. ఒకవేళ తాను ప్రత్యేకంగా దర్శనమిస్తే అహంకారం కలగవచ్చుకూడా. తన విషయంలో గురువుగారు కనవరచిన శ్రద్ధకు సంతోషవడ్డది. కనుకనే బాల బ్రహ్మతో సమానం కనుక బ్రహ్మానందాన్ని ప్రసాదించిందని భావించింది.

కోర్టుకు వెళ్లిన చిదంబరరావుగారు తిరిగివచ్చారు.

అమ్మ అన్నది "అప్పడే వచ్చారేమిటి? వెళ్లటానికి రావటానికి వ్యవధి ఏది? అన్నయ్య అన్నానికి రాలేదు. మీకు ఎక్కడయినా కనుపించాడా?"

"లేదమ్మా"

"అన్నయ్యను గురించే నేనూ తాతమ్మా మాట్లాడుకుంటున్నాము".

"ఏం మాట్లాడుతున్నావమ్మా".

"అన్నయ్య రాలేదనే చింత తాతమ్మతో చెప్తుంటే ఆమె చింతనలో వడ్డది తాతగారూ - చింతకు కారణం నా సొంతం అనుకోవటమేగా - సొంతం అనుకొకపోతే సౌఖ్యానికి దారిలేదు. సౌఖ్యంగల దారిగా కనపడుతూ దుఃఖాన్ని రుజువు చేస్తుంది నాది అనేది."

ఆ భావాలూ ఆ వదాలూ విన్న చిదంబరరావుగారి కవిహృదయం మురిసిపోయి అన్నారు.

"వీలు కలిగినప్పడల్లా అమ్మాయితో ఏకాంతంగా సంభాషణ చేస్తే చాలా హాయిగా కాలం గడుస్తుంది, పిన్నీ-"

"ఏకాంతంగా అంటే సంభాషణ పోతుందండీ తాతగారూ-"

ఆ వాక్యానికి చిదంబరరావుగారు మరీ ముగ్ధులై పోయారు.

"ఇప్పడేవస్తా" నని అమ్మ వెళ్ళింది.

"అయితే, చిదంబరా - నీవు యీమాట అనటానికి నీకేదయినా అనుభవం కలిగిందా?" మరిడమ్మగారడిగింది.

"మొత్తం మీద మన ఆవరణలో బ్రహ్మాండం నిండి ఉన్నది. అంటే నిండింది కనపడేది కాదు. పరిమితం కనపడేది, అది నిండి ఉంటే అందరికీ అర్థమయ్యేది కాదు. కనుకనే పరిమితంగా వచ్చింది. అర్థమయినట్లు ఉండే అయోమయ మవుతుంది. అర్థం కాకుండా ఉండీ - వారి సంస్కారాన్ని బట్టి అర్థమవుతుంది. ఆ రంగమ్మతల్లి పోతూ పోతూ మన చేతుల్లో పెట్టినందుకు జాగ్రత్తగా ఆ బిడ్డను రచ్చకెక్కించకుండా చూచుకోవాలి. భగవంతుడు యీ రూపంగా ఇక్కడ అవతరించటానికి కారణం వెతుక్కుంటే - లోగడ అమ్మ అంటే అమ్మాయమ్మగారూ (మరిడమ్మగారి తల్లి), మా మేనమామ చలపతి రావుగారూ (సీతాపతితాతగారి తండ్రి), నిస్వార్థంగా అందరికీ సేవ చేయటమే పరమావధిగా బ్రతుకుతున్న నీవూ - మీముగ్గురి యొక్క సాధన చతుష్టయ సంపత్తియొక్క ఫలిత మనుకోవాలి."

చిదంబరరావుగారి ఒక్కొక్క అక్షరం మరిడమ్మగారి కన్నులనుండి ఒక్కొక్క అశ్రుబిందువును జార్చింది.

"ఈ క్షణాన ఉన్న ఉద్దేశాలు శాశ్వతం చేయమ్మా - ఏవేళా వీటిని చెదర నీయకమ్మా - మళ్ళీ మాయను కప్పకమ్మా-" అంటూ మరిడమ్మగారు అంతకు ముందు అమ్మ కూర్చుని లేచి వెళ్ళిన పీట మీద తల ఆనించి-

"నీలో చేర్చుకో తల్లీ-" అని ప్రాధేయపడ్డది.

"పిన్నీ - మనసులో అనుకోవలసిందేకానీ, పెద్ద పెద్దగా రానీయక మాటలు - అందుకు అవసరమూ లేదు. అందువల్ల ప్రయోజనమూలేదు" అన్నారు చిదంబరరావుగారు".

"అసలు పుట్టినప్పటి లక్షణాలే ప్రత్యేకంగా ఉన్నాయిరా నాయనా. నేను కనుక్కోలేకపోయాను. నేను ఆ సమయంలో అక్కడ లేకపోయినా తర్వాత విన్నాను కదా. విని వింతగా ఉన్నదనుకున్నానుగాని యింత విశిష్టత గుర్తించలేక పోయాను. అసలు యిప్పడు వెనక్కివెళ్ళి ఆలోచిస్తే- కడుపున పడ్డప్పటి నుండీ జరిగిన పరిస్థితులన్నీ ఒక మహాపురుషుడు ఉద్భవించే లక్షణాలే..." మరిడమ్మగారి కన్నుల తడి ఆరలేదు.

"జరిగి పోయినవి వదలివేసెయ్యి - తెలుసుకోలేని కాలం పోయింది. ఇక - యీ తెలివికి తెరవేయకుండా ఉంటే అదే చాలు."

అమ్మ అటుగా వెళ్ళుతూ వారి మాటలు విననట్లుగా తనలో తానే అనుకున్నట్లుగా అన్నది.

"నాటకంలో వేషాలు వేసుకు రావటానికి తెరలు అవసరం."

"ఎక్కడనుండి వస్తున్నావమ్మా? నాకేనా యీ సమాధానం?"

"అనుకుండేది నాకోసమే. ఈ మాట అందరికీ ఉపయోగపడవచ్చు."

చిదంబరరావుగారు ముసి ముసి నవ్వులు నవ్వుకుని-

"ఇంకా వేరే అనుభవాలు ఎందుకమ్మా పిన్నీ - ఈ వయస్సులో యీ సమాధానాలూ, యీ ఆలోచనలూ... మాటలు కూడా రాని వయస్సు కదా-"

మరిడమ్మగారు పీటమీదనుండి తల పైకి యెత్తి- "ఈ అనుభవాలు మన

యిద్దరికే కాదుగా ? ఈ మాటలు అందరూ వింటున్నవేగా ? మరి అందరికీ నీకు కలిగిన భావం కలుగుతున్నదా ? కారణమేమిటి?" అని అడిగింది.

"నాకు మాత్రం యిప్పుడున్న యీ సంపూర్ణమయిన భావమూ, విశ్వాసమూ నిలుస్తుందని ఏమున్నది?"

"సంపూర్ణమయినప్పడు తొలగేదేమిటి?" అమ్మ అడిగింది.

చిదంబరరావుగారూ, మరిడమ్మగారూ యిద్దరూ ఒకసారి అమ్మ వంక చూచి యిద్దరూ ఒకేసారి...

"మనకు ఇక ఏమీ తరుగులేదు" అన్నారు.

చిదంబరరావుగారు చేతులు ముకుళించి-

"ఒకవేళ నీవు మాయను కప్పినా అసలు నీ రూప మేమిటో చూపించి తరువాత తెరవేసుకో అమ్మా-" అని అడిగారు.

"తెర లోపల తెర ఎప్పడూ ఉన్నది. నాకూ తెర ఉన్నది. నేను వేషం వేసు కోవటానికి ఒక తెర. నా వేషం మీకు చూపటానికి మరొక తెర. మాటలతో తొలగని తెరలు. మూటలతో లోపలకు రానివ్వని తెరలు".

"మాకేమీ వద్దులే అమ్మా - ఇప్పడున్న అభిప్రాయాన్ని మార్చకుండా చెయ్యి" మరిడమ్మగారు మళ్ళీ అర్థించింది.

నమ్మకమేమున్నది? నా భావాలు మారుతూనే ఉన్నాయి. పున్నయ్యగారి స్థితిని చూడకముందు నా మనస్సువేరు. ఇప్పటి ఆలోచనవేరు; భావంవేరు. నా సందేహాలకు వాచా సమాధానం లేకపోయినా మనస్సుకు స్ఫురిస్తూనే ఉన్నది. ఈ పని ఎవరు చేస్తున్నారన్న సందేహం నాకులేదు. అయితే - పున్నయ్యగారికి ఇవ్వబడిన అనుభవాలు ఎక్కువే కావచ్చు. అవి నాకు తెలియ వనుకో. అయినా ఆయన భక్తుడు. ఆయనకు ఇవ్వటంలో విశేషంలేదు. నాకు యిచ్చిన అనుభవాలు నాకు చాలు, అవి కేవలం అమ్మ అనుగ్రహం వల్లనే. మరి - నాకేమి పవిత్రత, అర్హత ఉన్నది.? అపవిత్రుడికీ పవిత్రతను ప్రసాదించింది. అమ్మ.

వివశులై వివరించే చిదంబరరావుగారి మాటలు వింటూ-.

"ఈ క్షణం మళ్ళీరాదురా నాయనా" అని మరిడమ్మగారు అమ్మవంక చూచింది.

"తాతమ్మా - మీ అమ్మ అమ్మాయమ్మగారి సంగతి చెప్పవమ్మా .... వింటాను" అన్నది అమ్మ.

"మా అమ్మ అమ్మాయమ్మే యీ అమ్మ అయితే ఇంకా చెప్పేది ఏమున్నది? నీకు తెలియని దేమున్నది?"

"పెద్దవాళ్ళు అంటూ ఉంటారే తెలిసీతెలియనిస్థితి అని - అదీ నాది."

"ఆ మాట చిన్నపిల్లలనే అనవచ్చుగానీ, ఆ మాట అర్థం ఇదే. తెలిసి కూడా తెలియనట్లుండే వారికి చెప్పటం కష్టం కాదూ మరి-"

ఆ వివరణకు చిదంబరరావుగారు ఆనందపరవశులై అన్నారు. "ఎంత చక్కగా విడదీశావమ్మా - అన్నీ ఇట్లాగే వివరించుతల్లీ! కాళిదాసుకు వరమిచ్చిన కాళి నీ దగ్గర నేర్చుకున్నట్లున్నది. కాళి మ్రొక్కినవారికే వరమిస్తుంది. నీవు మ్రొక్కినవారికీ, మ్రొక్కనివారికీ యిస్తావు..."

"వరమంటే మీ ఉద్దేశం?" అమ్మ అడిగింది.

"వరమంటే..." చిదంబరరావుగారు ఆలోచనలో పడ్డారు.

"ఔను- వరమని మీరు మామూలుగా దేనిని అంటారు?"

"ఎవరికయినా అనుగ్రహంతో శుభం ప్రసాదించబడినప్పుడు వరమివ్వ బడిందనీ, ఆగ్రహంతో అశుభం విధించబడినప్పడు శాపమివ్వ బడిందనీ అనుకుంటాము"

"నా దృష్టిలో ఆగ్రహానుగ్రహాలు లేవు అంతా అనుగ్రహమే. కష్టసుఖాలూ, శుభాశుభాలూ అన్నీ అనుగ్రహం వల్లనే. ఇవ్వబడిన సర్వమూ వరమే. ఇక మ్రొక్కినవారూ, మ్రొక్కనివారూ అని భేదమేమున్నది?... అది సరేగానీ కాళికి నేర్పాననంటారేమిటి?"

"తప్ప తల్లీ-ఒక్క కాళికి అనీగాదు; ఒక్క నేర్చు కోవటమనీగాదు. సర్వ దేవతలకూ ఆదివి నీవు. యావజ్జగతికీ జననివి నీవు అన్నిటికీ ఆధారం నీవు. అందరికీ అమ్మవు నీవు. సర్వకార్యాలకూ కారణమై అకారణంగా సకలకార్యాలూ నడుపుతున్న సగుణమూర్తివమ్మా..."

చిదంబరరావుగారు భక్త్యావేశంతో స్తుతిస్తూ ఉండగా మేడమీదనుండి అడుగులసవ్వడి వినిపించింది. అమ్మలేచి దొడ్లో బాదంచెట్టువద్దకు వెళ్ళింది.

పైనుండి వెంకటసుబ్బారావుగారు దిగివచ్చి చిదంబరరావుగారితో "ఈ రాత్రే వెళతాను" అన్నారు.

ఆమాట చిదంబరరావుగారి వీనులకు అందలేదు. వెంకటసుబ్బారావుగారు ఆశ్చర్యంగా చిదంబరరావుగారి వంక చూచి కంఠస్థాయిపెంచి మళ్ళీచెప్పారు.

చిదంబరరావుగారు నెమ్మదిగా "ఏమిటీ"? అన్నారు.

"ఈ రాత్రికే తెనాలి బయలు దేరుదామని"..... వెళ్ళితే వెళ్ళుదువుగానిలే అమ్మాయిని కొంచెం సేపు దగ్గరకు తీసుకో..."

"ఎందుకురా? నా మాట వినదుగా దగ్గరకూర్చుంటే ఆవేదన ఎక్కువ. నిద్రపోతుంటే కలవచ్చింది.... రంగమ్మ కనపడి... నాన్నా, పిల్లను తీసుకు వెళతావా?... అన్నట్లుగా."

అది వినగానే చిదంబరరావుగారి కన్నులు స్రవించాయి. వెంటనే అన్నదమ్ములిద్దరూ బాదంచెట్టు క్రింద నున్న అమ్మవద్దకు వచ్చారు. వెంకట సుబ్బారావుగారు అమ్మను లేవదీసి భుజంమీద పడుకోబెట్టుకుని అమ్మను "తెనాలి పోదాము వస్తావా అమ్మా?, మీ అమ్మ తీసుకు వెళ్ళమన్నది" అని అడిగారు.

"ఎప్పుడు చెప్పింది" అని అమ్మ అడిగింది.

"కలలోవచ్చి చెప్పిందమ్మా."

"పొమ్మని నాకు చెప్పదేమి ? తెనాలి పొమ్మని నాకు చెప్పితే వస్తాను. తీసుకు వెళ్ళమని పెద్దవాడికి నీకు చెప్పింది కాని చిన్నపిల్లనని నాకు చెప్పకూడదూ!?

- తెనాలి వెళ్ళమని."

"చెప్పితేగాని రావటమ్మా?"

"మీరు రమ్మని అనలేదుగా ? మీరు రమ్మనటం, నేను రావటం తరువాత. మీ అమ్మ తీసుకువెళ్ళమన్నది. వస్తావా - అని అడిగారు.

మా అమ్మ పొమ్మంటే వస్తాను అన్నాను."

ఆ సంభాషణ చిదంబరరావుగారికి బాధ కలిగించింది. వెంటనే అన్నారు.

"అన్నయ్యా - వాళ్ళ అమ్మ చెప్పిన పనులన్నీ చేస్తున్నామా మనం ? పదేపదే వాళ్ళ అమ్మను జ్ఞప్తి చేయటమెందుకు ?"

"అమ్మను ఒకరు జ్ఞప్తి చేయటమేమిటిలెండి తాతగారూ ! మరుపురానిది అమ్మ. మరువలేనిది అమ్మ. మరొకరు అడ్డులేనిది; ఎవరూ తీసివేయలేనిది" అని అమ్మ చెప్తూ ఉండగా వెంకటసుబ్బారావుగారు అన్నారు.-

" ఆ కరువు ఎవరూ తీర్చలేరు."

"ఇంకా నన్ను తీసుకువెళ్లటం ఎందుకు తాతగారూ- కరువు తీర్చలేనిది."

"నీ కరువు తీర్చటానికి కాదమ్మా- ఆయన కరువు తీర్చుకుంటాడు యీ రూపంగా" అని చిదంబరరావుగారు అన్నగారిని సమర్థించారు.

"నాతో ఆయన కరువులేమి తీరుతాయి తాతగారూ- ఆయనతో నా కరువూ తీరదు. నాతో ఆయన కరువూ తీరదు."

"మేము తీర్చలేము గాని నీవు తీర్చగలవమ్మా-" అని చిదంబరరావుగారు విశ్వాసం వెలిబుచ్చారు.

"ఎవరూ తీర్చలేరు. అందరికీ తీరనివ్యథలే. నేను ఆయన కూతురునై కనపడలేను. ఆయన నాకు అమ్మయై కనపడలేదు. ఆయన తాతగారే. నేను మనుమరాలినే."

"పూర్తిగా నీ ఉద్దేశం చెప్పమ్మా" వెంకటసుబ్బారావు గారు వేడుకున్నారు.

"నే నందుకు రాలేదు" అమ్మ ప్రకటించింది.

"అంతా మరుగేనా?" చిదంబరరావుగారు ప్రశ్నించారు.

"మరవులేదు గాని మరుగు ఉన్నది. మరుగే నా విధానం".

మరుగు అంటే మనకు కనపడని మరుగు అమ్మకు ఉన్నది. అంతేగానీ, మనను కనలేని మరుగు లేదు అమ్మకు.

"అంటే నీ లక్ష్యం అదన్నమాట" చిదంబరరావుగారు ఆసక్తి కనపరిచారు.

"అదేగా యీ లక్షణమంతా?"

"పోనీ యిదయినా తత్‌క్షణమే చెప్పావు."

"అదయినా మీ సమక్షంలోనే."

"ఎంత ప్రత్యక్షంగా వినిపిస్తున్నదో చూడు, అన్నయ్యా-ఇంకా నీకు దిగు లెందుకు? బిడ్డపోయిన మంట మంటే. అందులో అది అతివినయంగల బిడ్డ. ఎవరి మనసూ నొచ్చకుండా ఎవరికీ ఏ బాధా లేకుండా దాటిపోయింది. అని చిదంబరరావుగారు ఓదార్చటానికి ప్రయత్నించారు.

"మీరంతా యిప్పుడు పడేది బాధ గాదా తాతగారూ- అమ్మ యిప్పుడు పోవటం అవివేకం కాదూ? బ్రతికి ఉంటే ఒక రిద్దరినే బాధపెట్టేది. ఇప్పుడు అందరినీ బాధపెడుతున్నది" అని అమ్మ అన్నది.

ఆ మాటల్లో సత్యం విచిత్రంగా ధ్వనించింది. అందులోని అజేయమైన తార్కిక ప్రతిభ వెంకటసుబ్బారావుగారి గుండెలను దూసుకుపోయి, అన్నారు-

"అబ్బబ్బా.... ఏం చంపుతుందిరా? నోరు ఎత్తనివ్వదు".

"మీ అమ్మాయిని చంపానన్నారు. యిదివరకు ఇప్పుడు అందరినీ చంపుతున్నానంటున్నారు ఇదేగా బాధపెట్టటమంటే."

"అందుకే - తప్పేమున్నదమ్మా-లయకారిణివి........ అన్నీ నీవేగా-" అని చిదంబరరావుగారు అంటూ ఉండగా మరిడమ్మగారువచ్చి "వాడి (సీతాపతి)

సంగతి అందరూ కలసి ఆలోచించండిరా..." అన్నది.

ఇంకా ఆలోచించే దేమున్నది? పిల్లను తెనాలి తీసుకువెళతాను. వాడి సంగతి మీరు ఆలోచించండి. రాఘవుడిని భరించటం కష్టం. వీడిని తీసుకువెళ్ళితే సీతారాముడిని పాడుచేసినట్లవుతుంది" అని వెంకట సుబ్బారావుగారు అంటూ ఉండగా సీతాపతిగారు మన్నవనుంచి వచ్చారు. అమ్మ పరుగెత్తుకుంటూ ఎదురువెళ్ళింది. తాతగారు అమ్మను ఎత్తుకుని దొడ్లోకి వచ్చారు.

అడుగోనయ్యా-రానే వచ్చాడు. తేల్చేసెయ్యండి-" అన్నారు చిదంబరరావు గారు.

"ఇది సమయం కాదు" అమ్మ అన్నది.

"పోదాం పదండి-పనులున్నాయి. నేను వెళ్ళాలి. అన్నయ్యా-పని ఉన్నది. అటు వస్తావూ-" చిదంబరరావుగారు అడిగారు.

"ఇప్పడు కాదులే మళ్ళీ వస్తానుగా-నాకు పెళ్ళితో ఏమీ సంబంధం లేదు. నేను పెట్టిందేదో పిల్లకు ఉంచండి."

తాతగారి చంకలోనుండి అమ్మ క్రిందకు జారి-

"నీవు పెట్టిందంటూలేదు. నీవు పెట్టింది అంటుకొని లేదు." అని అన్నది.

సీతాపతితాతగారు తలపూవుకుంటూ బావి దగ్గరకు వచ్చి కాళ్ళు కడుక్కున్నారు.

"అంటుకున్నదేదో వదిలేపోయింది. ఈ పిల్లలున్నారు గనుక యీ ఆలోచన" అన్నారు చిదంబరరావుగారు

"ఇవే చిక్కుడుకాయలు" అన్నది అమ్మ సన్నగా నవ్వుతూ.

ఆ మాట వినగానే చిదంబరరావుగారు సంతోషంతో ఉక్కిరి బిక్కిరై-

"మీతో వచ్చిన చిక్కేమున్నదమ్మా? వాళ్ళ గీతలో ఉన్న చిక్కుగానీ. అయినా ఆ చిక్కుడుకాయలమాట ఎట్లా తోచింది? ఎంతో చక్కగా ఉన్నది" అన్నారు.

"అది మీ పెంపకం ఫలితమే తాతగారూ-కాయలంటే పిల్లకాయలుగా తోచింది. కాడ చిక్కురొక్కురుగా అల్లుకుపోయింది. ఇప్పడు పరిస్థితులట్లాగే ఉన్నాయిగా. అందుకని చిక్కుడుకాయలన్నాను."

"అందుకేగా కాళికికూడా నీవే నేర్పింది అన్నది" అన్నారు చిదంబరరావుగారు సంబరపడిపోతూ.

"ఈ మాట అనకముందే అన్నారుగా?"

"అబ్బా - ఇదే కాదమ్మా. నీ నోటివెంట ఏది వచ్చినా అట్లాగే ఉన్నది."

"తాతగారూ- ఒకటి అడుగుతాను, చెపుతారూ? ఒక్కొక్కప్పడు విసుగులో 'అబ్బా' అంటారు. మరొకప్పడు దుఃఖంలో 'అమ్మా' అంటారు. విసుగులో తండ్రినీ, దుఃఖంలో తల్లినీ ఎందుకు స్మరించాలండీ?"

ఆ ప్రశ్నకు పకపకా నవ్వుతూ చిదంబరరావుగారు అమ్మచేతి బొటనవ్రేలు తీసుకుని నోటిలో పెట్టుకున్నారు. ఎంతో తియ్యగా ఉన్నది.

"ఏమిటో తీయగా వస్తున్నదమ్మా నోట్లోకి. ఆ తీపే యింతపని చేస్తూ ఉన్నది.

" ఆ తీపి మీ నోట్లో ఉన్నదా? నా చేతిలో ఉన్నదా? శరీరమంతా ఉన్నదా? ఉభయులకూ ఉన్నదా? తీపి ఉన్నస్థితి ఎటువంటిదో గ్రహించేస్థితి కూడా అటువంటిదే."

"నీవు ఎట్లాచేస్తే అట్లా అవుతుందమ్మా" అన్నారు చిదంబరరావుగారు.

"ఇదొక వాడుకపదం 'అభ్యాసయోగయుక్తేన.........' అంటూ అమ్మ చటాలున ఆపింది. చిదంబరరావుగారు ఉలిక్కిపడి ఆశ్చర్యంగా అన్నారు-

"ఇదెక్కడిదమ్మా-మళ్లీ చదువు మళ్లీ చదువు-"

"నా దగ్గర పుస్తకాలున్నాయా, కాగితాలున్నాయా మళ్లీ చదవటానికి."

ఇందాక ఎట్లా "చదివేవో-అట్లా చదువమ్మా"-

"ఇందాక ఆ మూడ్‌లో అన్నాను."

"ఇది ఎక్కడ విన్నావమ్మా?!" అమితాశ్చర్యంతో చిదంబరరావుగారు కేక పెట్టారు.

"కన్నానయ్యా-"

"ఏమమ్మవమ్మా - ఏమమ్మ యేమిటి, కమ్మనమ్మ..." అంటూ అమ్మను ముద్దుపెట్టుకోవాలనుకున్నారు. అమ్మ కనుపించలేదు.

'ఇంతే - కనుపరిచినట్లే కనుపరిచి ఇంతలోనే తెర వేసింది. కొంచెంసేపు చిన్నపిల్లవలే కనపడి ముద్దులు మూట కడుతుంటే- అంతలోనే మాయమవు తుంది..." అనుకుంటూ...

"ఏమిటమ్మా - అదృశ్యమైనావు?" అన్నారు.

"అదే మీకు సాదృశ్యం" అమ్మ స్వరం వినిపించింది.

"రూపం చూపించి తెరవెయ్యమ్మా - అని లోగడ అడిగాను. ఇదేనా చూపించి తెరవేయటం...?"

"రూపంలేనిది రూపం వచ్చింది. వచ్చినరూపం పోయింది. నా రూపం చూపించమని అడిగారు. ఉన్నది గనుక లేకపోవటం అంటూ వచ్చింది. లేదు గనుక యీ రూపం ఉన్నదంటూ వచ్చింది. లేనిరూపం నిర్గుణం. ఉన్నరూపం సగుణం. అదే నిర్వికారం, సాకారం. నిర్వికారానికి ఆకారమున్నది. సాకారానికీ ఉన్నది. ఉన్నదేదో ఉన్నది. ఈ ఉన్నదే అది. అదే నేను-"

స్పష్టంగా చెపుతున్న అమ్మను కన్నులప్పగించి చూస్తూ ఉండిపోయారు చిదంబరరావుగారు.

21. వినోదిని

అంతలో తమ కుమార్తెగారి ఇంటికి వెళ్లిన జానకమ్మగారు తిరిగి వచ్చింది.

వెంకటసుబ్బారావుగారూ, జానకమ్మగారూ తెనాలి ప్రయాణ మవుతూ సీతాపతితాతగారి యొద్దకు వచ్చారు.

"నీవూ, పిల్లలూ తెనాలి రండి-నాలుగురోజులు ఉండి ఆశీర్వచనపు బట్టలు కట్టుకుని వద్దురుగాని. నీవు ఒక యింటివాడవు కావద్దూ?" అన్నారు వెంకటసుబ్బారావుగారు.

"నాలుగురోజులలో వస్తాలెండి. ఇంకా మీకు బట్టల ఖర్చు తప్పలేదూ? నాకెందుకు? భగవంతుడే నన్ను ఎప్పడో ఆశీర్వదించాడు. మీరు నన్ను ఒక ఇంటివాడిని గాదు, బజారుపాలు చేస్తారు. నా కళత్ర యోగం బాగుండవద్దూ? బాగుంటే ఇట్లా జరిగేది కాదు. నా కావిడ పోయిందనే బాధ, కొరత - రెండూ లేవు - ఎప్పుడూ దగ్గరే ఉన్నది. కాని ఈ పిల్లల గురించినబాధ తీవ్రంగా ఉన్నది. పిల్లను ఎవరయినా చూస్తారు. చూడకపోయినా ఇది కావాలని, ఇది వద్దనేది లేనిది గనుక బాధలేదు. ఈ అల్లరివాడిని, రాఘవుడిని ఎవరు భరిస్తారు."

బాధపడే సీతాపతితాతగారితో జానకమ్మగారు అన్నది "వాళ్ల అమ్మ పోయిందిగా; ఇక బుద్ధిగలవాడు అవుతాడులే. ఉన్న నాలుగురోజులు ఏడిపించుకు తిన్నాడు."

"ఏది ఎట్లా ఉన్నా - యీ పిల్లకు ఆరోగ్యమైనా ఉంటే."

అని సీతాపతితాతగారు అంటూ ఉండగా అమ్మ పరుగెత్తుకువచ్చి తాతగారి ధోవతి చెంగులు పట్టుకొని "ఆరోగ్యం లేదుగాని అయుర్దాయం ఉన్నది నాన్నా" అని అన్నది.

"ఎంతకాల మమ్మా - నీ నోటిమీదుగా చెప్ప - బాల వాక్యం."

"ఉన్నంతకాలం."

సీతాపతితాతగారు వెంకటసుబ్బారావుగారితో.... "అమ్మాయి జాతకం చాలా కష్టజాతకంగా ఉన్నది బావా" అన్నారు.

"చాల గొప్పజాతకంగా గూడా ఉన్నది."

"ఈ రెండూ ఎట్లా కలుస్తాయి బావా?"

"గ్రహలక్షణాలను బట్టే గదా, మన మనుకోవటం? రేపు ఎట్లా మారుతుందో - నడకమీద తెలియవలసిందే".

"బ్రతికి బాగుంటే జాతకాల మాట తరువాత ఆలోచిద్దాం."

"అందరి శని దాని మీదగా పోయిందిగా. ఇక బాగుండక ఏం జేస్తారు?" జానకమ్మగారు అందుకుని అన్నది.

"ఏమిటా మాట ? నీకు నీ కడుపెంతో, ఎవరి కడుపు వారికి అంతే-" వెంకటసుబ్బారావుగారు భార్యను మందలించారు.

"ఇంతకూ వాళ్ల అమ్మ లేకపోవటమే దురదృష్టం. తక్కిన అదృష్టాలను గురించి ఆలోచన ఏమిటి? దానికి తోడు ప్రాణం పోయేటప్పుడు నేను దగ్గరలేని కొరత..."

కారే కన్నీటిని తుడుచుకుని సీతాపతితాతగారు చెప్పారు-

"పిల్లకు ఉన్న బంగారం, మీ తల్లికి పెట్టిన బంగారం, మూడుఎకరాల పొలం యిచ్చి నాలుగు రోజులు ఉండి పిల్లను మీకు అప్పగించి అలవాటు చేసి వస్తాను. చెవులు ముక్కులు మాత్రం కుట్టించకండి - యిప్పడప్పడే... వాళ్లమ్మ ఎప్పడో ఒక సారి నాతో అన్నది..."

"అమె వచ్చినట్లే-మా దగ్గర ఉన్నట్లే మాట్లాడుతున్నారే. ఆ మరిడమ్మగారిని వదలిపెట్టి ఉంటుందా ? మరిడమ్మగారి మెడ కరుచుకొని వదలదుగా..." జానకమ్మ గారు అసూయను వ్యక్తంచేసింది.

అమ్మ అన్నీ వింటూ విననట్లుగా కూర్చున్నది. సీతాపతితాతగారు మళ్లీ అందుకుని ఆహ్వానించారు.

"ఏది ఎట్లా ఉన్నా సంవత్సరీకాలయినా రాఘవుడి చేత పెట్టిద్దామనుకున్నాను.

అదీ తప్పిపోయింది, వడుగు చెయ్యనందువలన. ఈ సంవత్సరం అదయినా చేయాలి. ఒక వేళ చేస్తే - బాపట్లలోనే చేస్తాను. మీరు తప్పకుండా వచ్చి - పోయింది నేను, ఉన్నది మీ అమ్మాయి అనుకుని - ఆ కార్యం నెరవేర్చండి-"

"అదేమిటిరా ఆ మాట ? నీ వెవరివి ? నీవు మాత్రం మావాడివి కాదూ ?" వెంకటసుబ్బారావుగారు నొచ్చుకున్నారు.

"మీ సంగతి సరేలే... జానకమ్మక్కయ్యకు - పాపం - నాకివ్వటం ఇష్టం లేకపోయినా ... పట్టుదలగా మీరు ఇచ్చి చేసినందుకు - అక్కయ్య మీకంటే ఎక్కువ గానే చూచింది."

"పెళ్ళికి ముందు ఆమెకు అసలు ఇష్టం లేక పోయినా. అయిన తరువాత అందరి అల్లుళ్ళకంటే నిన్నే ఎక్కువగా చూచింది. నరే... యిప్పుడవన్నీ ఎందుకు తవ్వుకోవటం ? నాలుగు రోజులలో తప్పకుండా-రా-మేము వెళతాము, ట్రెయిన్ వేళయింది" వెంకటసుబ్బారావుగారు అన్నారు.

అంతలో చిదంబరరావుగారు వచ్చారు.

ఇంట్లోకి వెళ్ళి అందరకూ చెప్పి వెంకటసుబ్బారావు గారూ, జానకమ్మగారూ స్టేషన్‌కు వెళ్ళారు-తెనాలి ప్రయాణమై.

అమ్మకూడా, వారికంటే ముందుగానే స్టేషన్‌చేరింది - వారికి చెప్పకుండా. వాళ్ళు వచ్చి టిక్కెట్లు కొనుక్కుని ప్లాటుఫారం మీదకు రాగానే ట్రెయిన్ వచ్చింది. వారు గబగబా ట్రెయిన్ ఎక్కబోతుంటే - అమ్మ వెనకగా వెళ్ళి-

"తాతయ్యా ! నాకొక కాని యివ్వు" అని అడిగింది.

"తాత అనే ముక్క వెంకటసుబ్బారావుగారికి వినపడక 'అయ్యా' అని మాత్రమే వినపడి "ఇప్పుడుగాదుపో, బండి సాగుతుంది. బండిక్రింద పడతావు. ఫో అమ్మాయి-ఫో..." అని కసిరారు.

అమ్మ మళ్ళీ జానకమ్మగారితో "అమ్మా - ఒక కానీ యివ్వు" అన్నది.

చెప్పేది నీకు కాదమ్మాయి? ఎన్నిసార్లు చెప్పాలి?" అని జానకమ్మగారు విసుక్కున్నది.

"వాగి వాగి అదే పోతుందిలే, నీవు ఊరుకో- వెంకటసుబ్బారావుగారు సర్దారు.

ప్రయాణీకులు బండి ఎక్కటం పూర్తి అయింది. కానీ ఎదురుగా గూడ్సు బండి వస్తున్నందున ఆ బండి కదల్లేదు. అంతలో చిదంబరరావుగారు అన్నగారు మరచిపోయిన పర్సు తీసుకువచ్చారు.

వారిద్దరూ రైలుపెట్టిలో కూర్చున్నారు. అమ్మ అక్కడనే ప్లాటుఫారం మీద నిలుచున్నది. చిదంబరరావుగారు లోపలివారినిగానీ, అమ్మనుగానీ చూడక బండి పొడుగునా యీ చివరి నుండి ఆ చివరి వరకూ రెండు మూడు సార్లు తిరగ్గా అమ్మ వెనకగా వెళ్ళి-

"అయ్యా - నాకొక కానీ యివ్వండి. మీకు కావలసిన వారిని నేను చూపిస్తాను" అన్నది.

"అబ్బబ్బా ఉండు - బండి పోతుంది" అని విసుగ్గా చెయ్యి విదిలించారు. ఆ విసురుకు అమ్మ చేతికి బాగా దెబ్బ తగిలింది. అది గూడా లక్ష్యపెట్టక చిదంబరరావుగారు పైకివెళ్ళి తిరిగివచ్చే సమయంలో అమ్మ ఒక పెట్టె ముందు నిలుచుని తలవంచుకుని మెల్లగా అన్నది, చిదంబరరావుగారికి వినపడేటట్లు-

"ముందర ఉన్నది కూడా కనుపించదు."

ఆ మాట విని ఆగిన చిదంబరరావుగారితో-

"మీరు వెతికేవారిని నేను చూపిస్తా రండి-" అన్నది అమ్మ.

"ఎందుకూ? నీ కానీ డబ్బుల కోసమా?" అంటూ ఆ మాటలకు విలువ నివ్వక ఇంకా తిరిగి తిరిగి విసుగుపుట్టి చివరకు అమ్మవద్దకు వచ్చారు.

అమ్మ నల్లచీరె ముసుగు వేసుకుని కూర్చుని నేల మీద గీతలు గీస్తూ ఉన్నది.

"ఏయ్ అమ్మాయ్ - ఇందాక కానీ అడిగితివే, అణాయిస్తాను. నాకు కావలసినవాళ్ళను చూపించు".

అని చిదంబరరావుగారు జేబులోనుండి అణా తీసిచేతిలో ఉంచబోగా "ఇదిగో - ముసుగుదొంగ" అని అమ్మ లేచి నిలుచున్నది. చిదంబరరావుగారు ఉలిక్కిపడ్డారు శరీరం జల్లుమన్నది. గొంతులో ధ్వని మారింది. ఎందుకో తెలియకుండా "అన్నయ్యా" అని కేక పెట్టారు.

"ఏం కన్నయ్యా" అన్నది అమ్మ వెంటనే.

పెట్టెలో కూర్చున్న వెంకటసుబ్బారావుగారు తమ్ముని కేకవలె ఉన్నదనుకుని అటు ఇటు చూచారు గానీ ఎవరూ కనుపించక ఊరుకున్నారు.

చిదంబరరావుగారు అమ్మను నిర్నిమేషంగా చూస్తూ-

"కన్నయ్యా అంటే... చూచానయ్యా అనా? కన్నా నయ్యా అనా? నిను కన్నాననా?.." అని అంటూ ఉండగా కన్నులు ఆనందాశ్రువులను జలజలా కురిశాయి.

"అదంతా నాకు తెలియదు నేను కన్నానన్నమాట మీరు విన్నారుగా. మీకు ఎట్లా తోస్తే అట్లా..."

చిదంబరరావుగారికి- ఏదో తప్పు చేసినవానికివలె శరీరం స్వేదంతో తడిసి పోయింది. అయోమయంగా నిలబడ్డారు.

వెంకటసుబ్బారావుగారు బండి ఇంకా కదలక పోవటానికి కారణం తెలుసు కుందామని బండిదిగి బయటకు వచ్చారు. చిదంబరరావుగారు తమ కేక విని అన్నగారు వచ్చారనుకుని-

"ఇంతసేపటికి వచ్చావేమి? పలకలేదేమి?" అని అడిగారు.

"నాకు నీ పిలుపు వినిపించలేదు."

అమ్మ వెంకటసుబ్బారావుగారిని చూస్తూ సాధించటం ప్రారంభించింది-

29 "మీ తమ్ముడు మాత్రం యివ్వట మెందుకు? ఇందాక లేదంటే లేదన్నారు. ఫొఫో-అంటే అన్నారులే; నీకు బుద్ధి లేదూ - అంటే అన్నారులే. డబ్బు యిచ్చి ఎన్ని అన్నా ఫరవాలేదు. ఇప్పడయినా ఇస్తారా ఒక కానీ. ఒక కానీ కోసం ఇన్ని

మాటలన్నారంటే - ఆ కానీ ఎంత విలువయినదో ఆలోచించండి-"

ఆ మాటలు వింటూ జరిగింది ఊహించుకొని చిదంబరరావుగారు నిర్ఘాంతపోయి పెద్దపెద్ద కళ్ళుచేసి చూస్తూ-

"నేనూ అంతే నేనూ అంతే..." అని అస్పష్టంగా అన్నారు.

వెంకటసుబ్బారావుగారు గుండెలు బాదుకుంటూ "నీవా, నీవా, నీవా.." అని పదిసార్లు అడిగారు.

అంతలో జానకమ్మగారుకూడా దిగుతూ-

"ఏమిటమ్మా ఆ గోల? ఆ పిల్ల ఎవరు? ఎవరన్నా మారుపడ్డారా?" అంటూ దగ్గరకు వచ్చింది.

"మారుపడేగా ఇందాక మాట్లాడినవన్నీ-" అమ్మ అన్నది.

"ఎవరు? ఏమిటి?"

"ఎవరూ - ఏమిటీ - అనేగా 'పాపిష్టిగోల' అన్నారు. వందలూ, వేలూ ఎవరు అడిగారు? కానీయేగా అడిగింది. నీ మెడలో అన్ని కట్టలున్నాయే, ఆ మెడ నొప్పి పుట్టేను- మెడ తిరగకుండా పెట్టుకున్నావే. నీ బొడ్డుచుట్టూ ఉన్న డబ్బు అడిగానా? నీ మెడలోఉన్న బంగారపు కట్ట అడిగానా? ఒక్కకానీ... ఒక్కకానీ.. కానీ ఇవ్వకపోతే మానెలే. ఈ ఒక్కసారికేగా నేనడిగేది. ఇక ఎన్నటికీ మీరు నాకు ఒక కానీ యివ్వలేరు. నేను పట్టుకోలేను సరే కానివ్వండి. ఎందు కాలస్యం? కానీతో కాలం వెళ్ళి పోతుంది. కానీ... కానీ, తాతగారూ - కానివ్వండి. కాలం వెళ్ళిపోతుంది."

"పెద్ద సమస్య తెచ్చి పెట్టావమ్మా" అన్నారు చిదంబరరావుగారు బరువుగా శ్వాస వదలుతూ.

"మీకేమండీ? కవులు - సమస్యలు పరిష్కారం చేస్తారు. పైగా ప్లీడరు కూడానూ.."

"ఏం ప్లీడరుగారో.. అయోమయావస్థగా ఉన్నది.

"అయోమయావస్థ అంటే యీ స్థితి మాయ అనా?

"కృష్ణుడు గోపికలను ఏడిపించినట్లుగా వేధిస్తున్నావు. వాడే నయం - ప్రత్యక్షంగా ఏడిపించాడు."

"కృష్ణుడు చేసింది వేధించటమేనా? వేధించమంటే ఏమిటి తాతగారూ?"

"కృష్ణుడు చేసింది వేధించటం కాదనుకో. భక్తిని కొలిచాడు, ఎవరికి ఎంతవరకు ఉన్నదా అని."

"దేనితో కొలిచి ఉంటాడో..." అమ్మ కుతూహలం వ్యక్తపరచింది.

"దేనితో కొలుస్తాడు? భక్తితోనేగా".

"కృష్ణుడికి గోపికలమీద భక్తి ఎక్కువా? గోపికలకు కృష్ణునిపైన భక్తి ఎక్కువా?"

చిదంబరరావుగారు చేతులు నలుపుకుంటూ-

"ఇది నీవు చెప్పవలసిందే నమ్మా"- అన్నారు.

"నన్నే చెప్పమన్నట్లయితే 'గోపిక' అనేపేరు ఎందుకు వచ్చిందో ముందు చెప్పండి. గోపిక, కృష్ణుల యొక్క నామధేయాల్లో ఉన్న అర్థం చెపితే... తరువాత ఆలోచిద్దాం."

"ఇదీ నీవు చెప్పవలసిందే-" నంటూ చిదంబరరావుగారు రెండు చేతులూ జోడించారు.

"పోనీ కృష్ణుడికి చెప్పండి"-

"పూర్తిగా తెలియనిస్థితి తల్లీ-" చిదంబరరావుగారు తలవంచారు.

"సందేహం లేకుండానా ? కొద్దిగా తెలిసిన స్థితి ఏమయినా ఎక్కడయినా అంటుకుని ఉన్నదా ? ఏమీ తెలియని స్థితి సంపూర్ణంగా ఉన్నదా ?"

"అదేమిటమ్మా - ముందరికాళ్లకు బంధాలు వేస్తావు. ప్రతి విషయంలో కాదమ్మా. ఈ ఒక విషయమే నేనన్నది."

అమ్మ ముసిముసినవ్వులు నవ్వుతూ-

"మీకే తెలియకపోతే నా కేమి తెలుస్తుంది?" అన్నది.

"మాది చదువుకున్నచదువు తల్లీ - నీవు చెప్పమ్మా వివరంగా. 'అన్యధా శరణం నాస్తి' అంటేనేగానీ చెప్పేటట్లు లేవు."

"పోనీ, అదయినా పూర్తి నమ్మకమేనా మీకు?"

చిదంబరరావుగారు గజగజా వణుకుతూ నిలబడ్డారు.

"నన్ను చెప్పమంటావా?" వెంకటసుబ్బారావుగారు అడిగారు.

"చెప్పండి తాతగారూ - మీరెక్కడ? మతుకుమల్లి రఘూత్తమశాస్త్రులగారి అల్లుడుగారు కదూ ? మీకెందుకు తెలియదూ?".

"మా మామగారి పేరు నీ కెట్లా తెలుసూ? అయినా ఆయన పండితులని నీ కెట్లా తెలుసు... ? ఒరే చిదంబరం ఆ కృష్ణుడే యీ కృష్ణుడేమోరా....

"కృష్ణుడంటే ఏమిటో చెప్పలేదు కానీ - ఆ కృష్ణుడనీ యీ కృష్ణుడనీ పోలుస్తున్నారు మహా యిద్దరూ, మహాకాకపోవట మేమిటిలే - యిద్దరూ మహా మహా మహా..."

"లోపలకు వెళ్ళి కూర్చుని మాట్లాడుకోవచ్చు. రండి" అని జానకమ్మగారు సలహా యిచ్చింది.

"బండి కదలటానికి వ్యవధి ఉన్నది. వెయిటింగ్ రూంలో కూర్చుందా" మన్నారు చిదంబరరావుగారు.

నలుగురూ వెళ్ళి గదిలో కూర్చున్నారు.

"ఇంతకూ చెప్పరేమి తాతగారూ".. అమ్మ పునఃప్రారంభించింది.

అంతలో ఒక వృద్ధభిక్షుకుడు 'యశోద-కృష్ణ'ల పాట పాడుకుంటూ వచ్చాడు.

"పేర్లకు అర్థాలు చెప్పకోవటం చాలా కష్టం - తాతగారూ. లోగడ కృష్ణుడు, గోపికలకే అర్థం చెప్పవలసి వచ్చింది. ఇప్పడు యశోద అని కూడా కలిసింది."

"ఇట్లాగే ప్రతి దేవుని పేరుకూ, దేవునికీ అర్థం తేలాలి. అసలు దేవుడనే మాటకు అర్థం తెలిస్తే - దేవు డెవరో వెతకవచ్చు."

వెంకటసుబ్బారావుగారు త్వరగా అందుని-

"దేవుడంటే... భగవంతుడూ" అన్నారు.

"ఎంత త్వరగా చెప్పారండీ ! మరి, భగవంతుడంటే.." అని అమ్మ మళ్ళీ అడిగింది.

అన్నదమ్ము లిద్దరూ ఆలోచనలో పడ్డారు. జానకమ్మగారు అక్కడనే నిద్రపోయింది.

బండి మెల్లగా సాగి ముందుకు వెళ్ళింది. వెంకటసుబ్బారావుగారి సామానంతా అందులోనే ఉన్నది. అందులో డబ్బుకూడా ఉన్నది.

హఠాత్తుగా చిదంబరరావుగారిని అమ్మ "అసలు యీ సంభాషణ ఎందుకు వచ్చింది తాతగారూ..." అని అడిగింది.

"నాకు గుర్తులేదమ్మా.." అని ఆలోచించుకుని "ట్రెయిన్ దగ్గర..." అని చెప్తుండగా వెంటసుబ్బారావుగారు బయటికి చూచి గాభరాగా "బండి పోయిందిరా" అని కేకవేశారు.

జానకమ్మగారు నిద్రలేచి "బండే కాదు, అన్నీ పోయినయ్" అని అరిచింది.

అమ్మ నిర్లిప్తంగా "కాని - పోనీ, ఏం చేస్తాము?" అన్నది.

"నీ కానీయే ఇంత దూరం తెచ్చింది" చిదంబరరావుగారు నీళ్ళు నమిలారు.

"నే కాదన్నానా?"

"నీవు ఏది కాదంటావమ్మా, నోటితో ఏదీ కాదనవు."

"ఇంతకూ ఏం చేద్దాము?"

"ఏం చేసే దేమున్నది ? మీరు చేసినపనే. బండిలో కాలు పెడుతూ "ఫో ఫో, నీకేం బుద్ధిలేదూ?" అని అన్నారు బండిని; అందుకనే అది పోయింది."

అని అమ్మ చెప్తుంటే ముగ్గురూ నిర్విణ్ణులై నిలబడి పోయారు. అమ్మ మళ్ళీ వారిలో చైతన్యం కలిగించే ఉద్దేశంతో అన్నది. "ఇందాక చిదంబరరావుతాతగారు అన్నారు చూచారూ... కృష్ణుడు గోపికలను వేధించినట్లుగా అని. నా ఉద్దేశం వేధించటం అంటే విధించటమే"

"ఆ అర్థం అవునో కాదోగాని నా ఉద్దేశమూ అదే" నన్నారు చిదంబర రావుగారు.

"ఇంకా ఒకటిగూడా ఉన్నది తాతగారూ. విధి అంటే బ్రహ్మ అనిగూడా నా ఉద్దేశం. ఎందుకంటున్నానంటే - విధి అంటే తప్పనిసరి. నిర్ణయమంటే చేసితీర వలసినది. అందుకే ఏదయినా పనిని నిర్ణయించారా - అంటారు. నిర్ణయమనే మాటకు గుర్తు అనికూడ ఉన్నది. వీడు ఫలానా అని ఆరూఢత కలిగించేది నిర్ణయం."

"ఔనౌను - త్యాగయ్యకూడా అన్నాడు యీమాట."

"ఏమని?"

"ఒకకృతి ఉన్నదిలే అమ్మా... నీకు తెలియనట్లు ఎందుకడుగుతావు?"

"మొన్న ధేనువుకొండ చిన్నయ్యగారు నన్ను ఒడిలో కూర్చోబెట్టుకొని పాడినకృతా? 'ఎవరని నిర్ణయించేదిరా'... అనేదేగా ?

"విధి కిదేనా? ఇంకా ఉన్నవా అమ్మా అర్థాలు?" అని చిదంబరరావుగారు అడిగారు.

"అర్థాలు ఎన్ని ఉన్నా రెండు మాటలమీద ఆధార పడి ఉన్నది - విధిని గురించి చెప్పాలంటే."

"ఏమిటమ్మా - ఆ రెండు మాటలూ చెప్ప-"

"విధే విధానం. విధి అంటే బ్రహ్మ, పరమాత్మ, చైతన్య స్వరూపం. చైతన్యం - అదే స్పందనం. ఆ స్పందనంచేత కలిగే పరిణామం సృష్టి. అది అనుక్షణం జరుగుతూనే ఉన్నది. ఆ జరిగేది విధానం. 'విధే విధానం' అంటే ఇదే."

అమ్మ అట్లా వివరిస్తుంటే చిదంబరరావుగారు ఆనందపరవశులై-

"గోపికలకు కూడా చెప్పమ్మా-" అని అడిగారు.

"సామాన్యమయిన అర్థం నాకు తోచింది చెప్పమంటారా? భక్తి అంటే మనో-వా-క్కాయ కర్మలు - అని మీరంటారే-వాటికి అతీతమైనస్థితి వారి భక్తి. ఆ భక్తే గోపిక"

చిదంబరరావుగారు ఆ వివరణకు తృప్తిగా తల వూపుతూ "ఆ స్థితి వాళ్ళందరి దగ్గర ఉన్నట్లులేదే" అని సందేహం వెలిబుచ్చారు.

"గోపికల్లోనూ అనేక విధాల వాళ్ళున్నారు. గోపికల ఆరాధన ఎట్లా ఉంటుందంటే ఒకామె ముఖాన్ని - ఒకామె పాదాల్ని, ఒకామె హస్తాల్ని, ఒకామె భుజాల్ని, ఒకామె చెవులను, ఒకామె నేత్రాలను, ఒకామె లలాటాన్ని, ఒకామె లలాటమందలి తిలకాన్ని, ఒకామె కంఠాన్ని, ఒకామె కంఠస్వరాన్ని, ఒకామె శక్తిని. ఒకామె జ్ఞానాన్ని - ఒక్కొక్కరు ఒక్కొక్క విధంగా కృష్ణునిలో ఉన్న ధారణాశక్తియై - ధారణ అంటే ఉచ్ఛ్వాస నిశ్వాసలు గూడా ఆరాధించి రాధ అయింది."

అమ్మ ముఖంలోనూ, కన్నుల్లోనూ మెరిసే కాంతినీ, ఆ మాటల్లోని మాధుర్యాన్నీ తన్మయత్వంతో అనుభవిస్తూ చిదంబరరావుగారు అడిగారు-.

"అమ్మా - ఆ కృష్ణుడు, ఆ రాధ - అందరూ నీవై చెపుతున్నావా?"

నేనెట్లా చెప్పినా - మీరు దానిని ఎంతగానో తీసుకోగలిగారు మీరు వివేకులు గనుక".

చిదంబరరావుగారు చిన్నగా నవ్వుకుంటూ - తల్లి చిన్నపిల్లవాడికి బోధించి నట్లుగా ఉన్నదనుకుంటూ - అడిగాడు "వివేకమంటే ఏమిటమ్మా" అని.

"తన్ను తాను విమర్శించుకోవటం వివేకం. ఇతరులను విమర్శించటం అవివేకం.

చిదంబరరావుగారు ఆశ్చర్యంతో కన్నులు పెద్దవి చేసి అమ్మను చూస్తుంటే-

"పనికిమాలిన గుణాలను విడిచినవాడే వివేకి - అని చాలమంది చెప్తుంటే విన్నా"నన్నది అమ్మ.

"ఎవరూ చెప్పలేదమ్మా - యీ మాట."

అంతలో వెంకటసుబ్బారావుగారు "ఒరే చిదంబరం, ఇప్పడు యింకొక ట్రెయిన్ వస్తుంది. మరి పెట్టె సంగతి ఏం చేద్దాము?" అని అడిగారు.

"ఏం చేద్దాము?" ప్రాప్తముంటే దొరుకుతాయి. మీరు బయలుదేరండి.

"అందులో చాలా ఉన్నాయి. దాదాపు రెండు వేల రూపాయల కిమ్మతుచేసే గుడ్డలూ, బంగారమూ, పైకమూ ఉన్నవి. ఏం చేసేటట్లు." అని జానకమ్మగారు రాగాలు తీసింది.

"చేసేదేమున్నది? ప్రాప్తముంటే వస్తాయి. లేకపోతేలేదు. అన్నది అమ్మ.

"ఓ యబ్బో! పెద్దనాపసాని - మాటలు చాలా నేర్చుకున్నది." అని జానకమ్మ గారు అంటూంటే అమ్మ వెంకటసుబ్బారావుగారిని-

"తాతగారూ - నేనొక సంగతి అడుగుతాను - చెప్తారూ?" అని అడిగింది.

"ఆ తాతయ్యను అడుగమ్మా" అని చిదంబరరావు గారిని చూపించారు.

"సరే - మీరు చెప్తారా తాతగారూ?"

"మమ్మల్ని అడుగుతావుగానీ చివరకు నీవే చెప్తావు" అన్నారు చిదంబర రావుగారు.

"సరే - ఒకరికి పదివేల రూపాయలున్నవనుకొనండి. అందులో నాలుగువేలు పోయినవనుకొనండి. మరొకరికి ఆకలవుతున్నది. కానీ లేదు. ఈ యిద్దరిలో ఎవరికి ఎక్కువ బాధ?"

జానకమ్మగారు అందుకుని "లేనివాడికి ఒకటే బాధ. కష్టార్జితం పోతే బాధగాదూ?" అని అడిగింది.

"ఈ బాధల్లో తేడా ఎప్పడు తెలుస్తుందంటే అన్ని రకాల బాధలూ ఒకరే అనుభవిస్తేగానీ ఆ తేడాలు తెలియవు" అన్నది అమ్మ.

"మాకు దారిద్ర్యం రావాలంటా వేమిటి?" జానకమ్మ గారు కంగారు పడి పోయింది.

"నా ఉద్దేశం అది కాదమ్మా..." అని అమ్మ చెప్పబోతుంటే వెంకటసుబ్బారావు గారు సర్దారు.

అంతలో బండికి గంట కొట్టారు.

"నా దగ్గర ఉన్న పర్సు తీసుకుని వెళ్లండి. అవి ప్రాప్తముంటే దొరుకుతాయి" అని చిదంబరరావుగారు అన్నారు.

ఇద్దరూ ట్రెయిన్‌లో తెనాలి వెళ్ళారు. ఇంటికి వెళ్ళే సరికి వారి సామాను యింటి ముంగిటిలోనే కనుపించింది. ఆ పెట్టిలో వారిని ఎరిగినవారుండి వారి సామాను వారి ఇంటికి చేర్చారు.

౭౭. శేముషీ వైభవం

వెంకటసుబ్బారావుగారినీ, జానకమ్మగారినీ ట్రెయిన్ ఎక్కించి చిదంబర రావుగారూ, అమ్మా ఇంటికి వచ్చి, మేడమీద గదిలో ఒక మంచం మీద పడుకున్నారు. చిదంబరరావుగారికి విన్నకొలదీ అమ్మమాటలమీద ఆసక్తి అమ్మ మాటలు వినాలని కుతూహలమూ పెరుగుతున్నయ్.

"ఇందాక గోపిక అంటే అర్థం చెప్పావు - బాగున్నది, ఇప్పుడు కృష్ణుడంటే ఏమిటో చెప్పమ్మా." అని చిదంబరరావుగారు అడిగారు.

"అసలు ఆ పదం కృష్ణుడు కాదు, గృష్ణుడు" అన్నది అమ్మ.

"ఆఁ.... ఆఁ.... పదాలనే మార్చేస్తున్నావా? గృష్ణుడా? అదెట్లా గమ్మా?" చిదంబరరావుగారు ఆశ్చర్యపోయారు.

"గృష్ణుడంటే- గుణము లన్నిటికి ఆధారమయినవా" డని అమ్మ సులభంగా చెప్పేసింది.

ఆశ్చర్యపయోధిలో మునిగిపోయిన చిదంబరరావుగారికి అమ్మ మాటలు సరిగా వినిపించక-

"గణితమా? అంటే లెక్కలా?" అని ప్రశ్నించారు.

ఎక్కడికక్కడే సమన్వయం చేయగలిగి, దేని నయినా సమర్థించగలిగిన అమ్మ, వెంటనే అన్నది -

"ఔను; గణితమే. గుణములన్నా గణితమే. రూపమన్నా గణితమే అంతా గణితమే. దీని తరువాత అది అన్నా గణితమే. ఒకటి, రెండు, మూడు... అనే కాదు, ప్రతిదీ గణితమే."

"ఓహో, ఇదా గణితమంటే. అయితే - సృష్టికూడా గణితమేనా అమ్మా?" విద్యార్థిలా నమ్రతగా అడిగారు చిదంబరరావుగారు.

"ఎందుక్కాదు? ఒక చెట్టు ఉన్నదనుకొనండి. ఆ చెట్టు ఎంత ఎత్తు ఉన్నదీ - అన్నారు. గజమనో, అర్థ గజమనో ఒక లెక్క. ఎన్ని చెట్లు, ఎంత పొడవు, ఎన్ని

కొమ్మలు, ఎన్ని ఆకులు, ఎన్ని కాయలు, ఎన్ని పూలు, ఎంత దూరంలో, ఏ మూలలో, ఎంత ఎత్తున, ఎంత లోతున.. అన్ని ఆలోచనలకూ గణితమే ఆధారం. అది అక్షరాలలో వ్రాసినా, అంకెలలో వ్రాసినా.

మనిషిని ఉదాహరణగా తీసుకుందాము. మనిషికి రెండు చేతులు, రెండు కాళ్ళు, రెండు ముక్కులు..... ముక్కు ఒకటి అయినా రెండు భాగాలయింది-భాగ మన్నా లెక్కే. పంచభూతాలతో కూడిన శరీరాన్ని తీసుకున్నా... అసలు ఒక భూతమే పంచబడ్డది గనుక పంచభూతాలయింది. భూతాలు అయిదు అన్నా గణితమే. అసలు జగత్తే గణింపబడ్డది. అన్ని రకాలలో గణితమే గనుక ఇంకా వివరణ అనవసరము. కదలిక, పరిణామం అన్నా - ఒక దానిలోనుండి మరొక దానిలోకి పోవటం... అంతా గణితమే. అంటే లెక్కకు అందనిది. అంటే అతీతమయింది. అంటే రూపంలేనిది అని. రూపం వచ్చేటప్పటికి ఒక యిల్లో, ఒక వాకిలో, దర్వాజో... ఇంటికి రెండు నిట్రాళ్ళనీ, దర్వాజాకు రెండు తలుపులనీ... తూకం విషయం తీసుకుంటే - సవాశేర్లనీ. వీశలనీ, మణుగులనీ... కొలతల విషయానికి వస్తే - పుట్లనీ, బస్తాలనీ, మానికలనీ, సోలలనీ, గిద్దలనీ... కొన్ని గిద్దలొక సోల, కొన్ని మానికలొక బస్తా, కొన్ని బస్తాలొక పుట్టి.

ఇట్లా ప్రతిదీ గణితమే. ఈ ఏర్పాటుకంతకూ కర్త ఆ కృష్ణుడే. ఆ కృష్ణుడు కూడా యీ లెక్కలలో ఒకడే. ఇవన్నీ సృష్టించుకుని అందులో తానూ ఒకడై, యీ లోకాన్ని నడిపిస్తున్నాడు. నడక అంటే - ఒక పాదం ముందూ, ఒక పాదం వెనుకా. ద్వంద్వాలే సృష్టికి ఆధారం. సర్వం సర్వానికీ ఆధారమే. అ, ఆ, ఇ, ఈ... అం అః - ఇది కూడా ఒక గణితమే. అది ఒక మహామంత్రం. సంగీతం తీసుకున్నా, మంత్రశాస్త్రం తీసుకున్నా, వాస్తుశాస్త్రం తీసుకున్నా జ్యోతిషం, వైద్యం, వేదాంతం తీసుకున్నా షట్‌శాస్త్రములన్నా - షట్‌శాస్త్రములంటే ఆరే, అక్షరాలతో వ్రాసినా, అంకెలు వేసినా, గుర్తించటం సంఖ్యమీదనే ఆధారపడ్డది. ఈ సంఖ్యే కృష్ణుడు. సాంఖ్య విచారణ అని గీతలో చెప్పాడు. సాంఖ్య విచారణ అంటే ఇదే. కనపడుతున్న దానిని విచారించటమే సాంఖ్య విచారణ. తారకం అంటే మనస్సుతో; మంత్రంతో అంటే కొన్ని అక్షరాలు కూర్చి ఒక వాక్యంచేసి ఒక భావాన్నిచ్చి భాగించేది తారకం. భావం తానయ్యేది అమనస్కం. ఆ మూడింటి

స్థితి చెప్పేది, చేసేది, చూచేది. చెప్పేది సాంఖ్యం. చేసేది తారకం. చూచేది అమనస్కం.

ఇన్ని మాటలూ యిన్ని స్థితులూ చెప్పకున్నప్పటికీ. ఇన్నీ, అన్నీ, అంతా ఇంతా, ఎంత, అంతా తానైనా ప్రత్యేకించి ఒక రూపంగా వచ్చినవాడే కృష్ణుడు. ఆ కృష్ణునిలో ఉండే సర్వసాధారణ ఆరాధన, ధారణాశక్తే యీ రాధ. ఆరాధన అంటే తాను యెప్పుడూ తన శక్తిని ఉపయోగపరచటమే. ఇవే ప్రకృతి, పురుషులు. రూపం పురుషుడు. రూపంలో ఉండే శక్తి ప్రకృతి. ఈ రెండూ ఒకటి విడిచి ఒకటి లేవు. మాటలతో చెప్పవలసివస్తే- ఒకటి ఒకటనో, రెండూ ఒకటనో, ఏదో ఒకటి గణితంలో చెప్పవలసిందే. అందుకే అగణితుడు గణితుడయినాడు సామాన్యంగా గొప్పస్థితిగలవానిని ఘనస్థుడంటారు. అంటే పొడవు, వెడల్పులే కాక- లోతు- అంటే గుండె లోతు, మనసు లోతు, ఆలోచన లోతు గల మనిషి అని అర్థం. 'గ' అనే అక్షరం మీద నాకు తోచిన అర్థం యిదే. అంతకూ కర్త గనుక గృష్ణుడన్నాను. గణితంకూడా ఆయనే అనే దృష్టితో అన్నాను. అసలు వీటన్నింటికీ శబ్దమే ఆధారం. ఇట్లా అక్షరాలకు చెప్పకోవటం ఆరంభిస్తే - ఎంతయినా విరామం లేకుండా ఆ రాముణ్ణి చూడవచ్చు."

అనర్గళంగానూ, అతి నిర్దుష్టంగానూ అమ్మ యిచ్చే వివరణలకు చిదంబర రావుగారు ఆనందపరవశులౌతూ-

"అంటే"? అని అడిగారు.

"విరామం లేనిది రామం" అని "నిద్రవస్తున్నది. రేపు మాట్లాడుకుందామా తాతగారూ?" అని అడిగింది అమ్మ.

"నీకు నిద్ర యేమిటమ్మా? కృష్ణుడిని గురించి చెప్పావు. రాముడిని గురించి కూడా చెప్పు. రామం అంటే విరామం లేనిది - అన్నావు. దేనికి విరామం లేదు?" .

"సృష్టికి లేదు. కదలికకు లేదు. విరామం లేకుండా జరుగుతున్న ప్రతిపనీ రాముడే. మనలోని ఉచ్ఛ్వాస నిశ్వాసలు విరామం లేకుండా ఉన్నాయి. వ్యష్టిలోగానీ, సమష్టిగాగానీ విరామం లేకుండా ఉండే ప్రతి ఒక్కటి రామమే".

"నీవు చెప్పే ప్రతి ఒకటి అద్వైత స్థితికి తీసుకు వెళ్ళుతున్నదమ్మా-" అన్నారు చిదంబరరావుగారు చిరునవ్వుతో.

"నేను తీసుకువెళ్ళే దేమున్నది? అది అయ్యే ఉన్నది."

"సామాన్యంగా బయలుదేరి - ప్రతిదానినీ ఆ పాయింట్ దగ్గరకు తీసుకువెళ్ళగలగటం ఎంత విశేషమమ్మా! నీకు విశేషమేమిటిలే? విశేషమే నీవు. దశరథుని కుమారుడు రాముని గురించి చెప్పమ్మా-"

"అ సమయంలో ఆ అవతారం అవసరమయింది. ఆ రాముడు పరిమితిగల రాముడుగా, విరామంలేనిదానిలో నుంచి రాముడు అవతరించాడు. తనలో ఉండే శక్తి సీతై, ఆ సీతే లోకమాతై, ప్రకృతై సర్వసాక్షియై, సర్వం ఆరామమై, విరామం లేనివారుగా ప్రపంచానికి వారి ధర్మాన్ని పంచిపెట్టారు. వారే సీతారాములు." క్రొత్త భావంతో, క్రొత్తబలంతో, క్రొత్త అర్థంతో గంగాఝరిలా ప్రవహించే అమ్మ వాక్ప్రవంతిలో చిదంబరరావుగారు ఆనందంతో తలమునకలవుతూ-

"ఇట్లా అంతకూ చెప్తావటమ్మా?" అని అడిగారు.

"అంతకూ అనంతమేగా. అంతకూ యేదో అనంతానికీ అదే. ఎంతెంతలైనా అనంతమ్మలోని వారే. 'అంత' అంటే పరిమితే. 'ఎంత' అన్నా పరిమితే. అమ్మ అంటే మళ్ళా పరిమితి వచ్చింది. అంతా మమ అనుకొనండి. ఈ పరిమితులన్నీ అపరిమితంలోనివి గనుక ఆ అపరిమితం పరిమితంగా వచ్చే - పరిమితాలన్నీ కలుపుకోవాలి".

"ఎన్ని రకాలుగా చెప్పినా - అన్నీ, అందరూ ఒకటేననీ, అంతా అద్వైతమేననీ, వస్తువులు, మనుషులు, మహాపురుషులు, అవతారవ్యక్తులు- అన్నిరకాలు కలిపి - గొడ్లనూ గోదనూ కూడా కలిపి ఒక టేమిటిలే, ప్రపంచంలో ఉన్న ప్రతిదానిని గురించి ఒకేదానికి సమన్వయంచేసి చెప్తావమ్మా" అంటూ ఉంటే చిదంబర రావుగారి చెక్కిళ్లు అశ్రువులతో తడిసిపోయాయి. కొద్ది క్షణాలాగి వారే మళ్ళీ అన్నారు.

"సమన్వయం చేసేదేమిటిలే? ఆ సమన్వయమే నీవుకదా. లేకపోతే ఇట్లా

సాధ్యంకాదు. నీవు అసాధ్యం కనుక నీకు అంతా సాధ్యమే నమ్మా. ఈ నా మాటలు కూడా నీవే."

చిదంబరరావుగారి చెక్కిళ్ళు దాటి అశ్రుప్రవాహం పక్కను కూడా తడపటం ప్రారంభించింది.

"నీ యీ మాటలూ, యీ అపూర్వసిద్ధాంతాలూ, నిర్వచనాలూ ఏ పండితులన్నా వ్రాస్తే బాగుండును, తల్లీ..."

"పండితుడైన పామరుడు వ్రాయడు. పామరుడయిన పండితుడు వ్రాస్తాడు" అంటూ కొనగోటితో అశ్రువులను మీటుతూ-

"ఎందుకు తాతగారు - బ్రహ్మాండం పక్కలో పెట్టుకొని ఏడుస్తారూ?" అని అడిగింది అమ్మ.

చిదంబరరావుగారు అంతలోనే నవ్వి-

"నిన్ను బ్రహ్మాండం అని ఎవరన్నారు? నీవు బ్రహ్మాండానివా?".

"ఒకప్పుడు మీరే అన్నారు. అయినా మీరు యీ పేరుతో ఎప్పుడో ఒకప్పుడు బ్రహ్మాండమని వ్రాయక తప్పదు. బ్రహ్మాండమంతా మీ చేతిలో, మీకలంలో కలంలోని సిరాలో, పాళీలో, అక్షరాలలో, మీ భావంలో నిండిపోయింది."

"అయినా ఆ పేరు ఎందు కవసరమవుతుంది?"

"అది ముందు మీకే తెలుస్తుంది."

"ముందు తెలిసేదేమున్నది?" ఇప్పుడు తెలియక పోతేగా, చెప్పు-"

"నాకు తెలియనిది లేదని మీకు ఆరూఢమేనా? ఆరూఢత పూర్ణంగా ఉన్ననాడు మీరే చెప్పగలుగుతారు."

"పూర్ణంగా ఎక్కడ ఉంటుందమ్మా? వెలితిగానే ఉంటుంది. నీ మాటలు వినేటప్పుడు ఉన్న అభిప్రాయం తరువాత మారిపోతుంది. అట్లా మారకుండా చేయవలసింది నీవేనమ్మా..... సరే. వీళ్ళందరి గురించి చెప్పావుగానీ, నీవు ఎందుకు వచ్చావో, నీ అవతార మేమిటో చెప్పమ్మా-"

"నాది అవతారమని ఎవరు చెప్పారు? నేనేదీ పెట్టుకు రాలేదు. నా కేమీ తెలియదు. ప్రత్యేకించి ఒక పని అంటూ లేదు. సృష్టి ఏ ఉద్దేశంతో జరుగు తున్నదో..." హఠాత్తుగా అమ్మ ఆపేసింది.

చిదంబరరావుగారికి ఉత్కంఠ హెచ్చి అడిగారు-

"అంటే సృష్టికి ఆధారమనా?"

"అని ఏమున్నది?"

"అదే. అర్థం కాకేమున్నది? తప్పనిసరిగా సృష్టికి ఆధారమనే ఉన్నది. అయినదీ అదే. నే ననుకున్నదీ అదే. జరిగేదీ అదే. జరగబోయేదీ అదే."

"లోగడ జరిగింది అది గాదా ? మా తాతగారు గడగడ లాడిస్తున్నారే.."

"నే నాడించే దేమున్నది? అంతా ఆడించ బడటమే...."

"ఒక్కొక్క పనికి ఒక్కొక్కరిని నిర్ణయించి - రైలు బండిని చక్రాలు పట్టాలు తప్పకుండా డ్రైవరు నడిపిస్తున్నట్లుగా, అదీ ప్రభుత్వం నిర్ణయించినట్లుగా - యీ దిక్చక్రం తిరుగుతున్నది."

తెల్లవార వచ్చింది. నాలుగున్నరయింది.

"ముఖం కడుక్కుందామా అమ్మా-" చిదంబరరావుగారు అమ్మను అడిగారు.

ఇద్దరూ లేచి ముఖం కడుక్కున్నారు.

చిదంబరరావుగారికి ఇంకా అమ్మ మాటలూ, ఆ వాగ్ధురీ, అందులోని అర్థగాంభీర్యమూ, ఆ ఆలోచనా పటిమా, ఆ శేముషీ వైభవమూ అచ్చెరువు కలిగిస్తూనే ఉన్నాయి. ఆ ఆనందోద్వేగంలో మేను పులకలెత్తుతూనే ఉన్నది.

౨౩. "నేను తల్లిని"

అమ్మా, చిదంబరరావుగారూ ముఖం కడుక్కుంటూ ఉండగా పనిచేసే ఎరుకల నల్లి సరివితుక్కు తీసుకుని నీళ్లపొయ్యి రాజేసింది.

అమ్మ ముఖం కడుక్కువి నల్లి దగ్గరకు వచ్చి.

"నల్లీ స్నానానికి నీళ్ళు యిస్తావా?" అని అడిగింది.

"ఇంకా కాగలేదమ్మా, నేను కాచి ఇస్తాను."

"నీవు కాచి ఇస్తావా? కట్టెలు కాచి యిస్తాయా?"

అంటూ అమ్మ నవ్వింది.

"నేనే కాస్తాను"

"నీవే కాస్తే కట్టెలెందుకు?"

"కట్టెలూ, నేనూ రెండూ కావాలమ్మా. నీ తర్కం బాగుంది" అంటూ చిన్నగా నవ్వుకుంటూ "అమ్మాయి గారూ - నీవు యీ ఆవరణలో తిరుగుతూంటే, యిదంతా నెత్తినవేసుకుని - అంటే చెప్పటం చేతకావటంలేదు - ఇంటి యజమాని ఉంటాడే. అదీ చాలదేమో... నేను చదువుకునే రోజుల్లో మా స్కూలు మేనేజరు గారు ఉండేవారు. స్కూలు బాధ్యత ఆయన నెత్తిన ఎంత ఉందో, అట్లాగే తమ నెత్తిన ప్రపంచమంతా ఉన్నట్లు కనపడుతుందమ్మా. చూడటానికి చిన్నపాపాయిలా కనపడుతావుగాని ప్రపంచానికే పెద్దవా అనిపిస్తున్నది...." అమ్మలో ఏదో చూస్తూ- చూచింది చెప్పలేక మాటలు వెతుక్కుంటూ అవస్థ పడ్డది నల్లి.

"నీ కట్లా ఎందుకు తోస్తున్నది నల్లీ?"

"ప్రతి ఇంటిలో ఉండే చిన్నపిల్లల మాదిరిగా ఉండవుగా అమ్మా. ఒక లక్షణమేమిటి? అన్నీ విశేషంగానే ఉన్నాయి. చెప్పటం చేతకావటం లేదు."

అంతలో ఎక్కడనుండో మొగలిపువ్వు గుబాళించింది. మరుక్షణానికే రకరకాలపూలు అదృశ్యంగా పరిమళించాయి.

నల్లికళ్ళు అమితానందంతో మెరిశాయి.

"చూచావా? నీవు గొప్పదానివని రుజువయింది. మేము మంచివారిని గురించి చెప్పకునేటప్పడు వారిని గురించి ప్రభువు సువార్త పంపుతాడు. దానికి సంకేతమే యీ వాసనలు. అంటే నీ వెంతో మంచిదానివీ, గొప్ప దానివీ అన్న మాట..."

"నాకు ఏవాసనా రాలేదమ్మా."

"నీ సంగతి కదూ - అందుకని నీకు రాదులే. అమ్మా.. పరలోకంలో ఉన్న ఆ తండ్రి ఎట్లాంటివాడో కనపడుతున్న నీవూ అంతే!"

"నేను అంతే!?"

"అంటే నేను అంతు కాననా? అమ్మా - నేను ఫలానా అని నిర్ణయించ లేక పోవచ్చును, వివరించలేక పోవచ్చును. కానీ ఏదో విశేషం నీలో నాకు స్పష్టంగా కనుపిస్తున్నది. అదే నేను దైవత్వం అనుకుంటున్నాను. ఆ తండ్రివి కూడా కాదు. నీవు మరియావే అనుకుంటా."

"చాలా మరియాదగా గుర్తించావు. మరియాకు పదియేళ్ళ పిల్లప్పడు ఏసు పుట్టాడు. నాకు ఎవరు పుట్టారు?"

"నీకు పదియేళ్ళు వచ్చేటప్పటికి పుడతాడేమోలే."

"అమెకు పెళ్ళికాకుండా పుట్టాడు."

నల్లి పకపకా నవ్వి "మా బంగారు తల్లికి అన్నీ తెలుసునే. నీవు మరియాకు కూడా అమ్మవమ్మా. లేక పోతే యింత పసికూనకు యిన్ని విషయాలు ఎట్లా తెలుస్తాయి ? ఏదోలే, పనిచేసేదిలే అనుకోక యథార్థం చెప్ప తల్లీ-" అంటూ అమ్మను వీపుమీద పడుకోబెట్టుకుని చీపురు తీసుకుని దొడ్డి చిమ్మటం ప్రారంభించింది.

"నల్లీ-నన్ను అందరికీ తల్లి నంటివే. ప్రపంచాని కంతకూ నేనే ఆధార మంటివే,
31 మరి, నాకు నీవు ఆధార మయినావు, నన్ను మోస్తున్నావు. మరి-నీవు ఎవరివి?" అని అమ్మ ముసి ముసి నవ్వులు నవ్వింది.

"నా పేరే నల్లికదా. నిజంగా నాది నల్లి పుటకే. నీ మంచానికి పట్టి నీ రక్తం త్రాగుతూ - నీరక్తం త్రాగిన బలంతో నిన్నెత్తుకున్నా. నీవిచ్చిన శక్తికాకపోతే నీవు దైవంగా నాకు తోచదుగా అమ్మా. నీవు దైవంగా తోచటానికి నీవే ఆధారం. దైవం అని తోస్తున్నది; చిన్నపిల్లగా కనపడుతున్నందువల్లనే యీ ముద్దులూ, మురిపెమూ. ఈ మాయే లేకపోతే యిట్లా నిన్ను ఎత్తుకుని ఆనందపడ లేనుగా అమ్మా-అసలు, నా పెనిమిటి పోయింది యిందుకే నేమో. లేక పోతే ఇక్కడ పనికి కుదిరేదానినే కాదు కదా. ఏది ఎందుకు జరుగుతుందో మాకు తెలియదు దురదృష్టంలో అదృష్టం అంటే యిదేనేమో..."

"దూరదృష్టి కలగటమే అదృష్టం. దూరదృష్టి అంటే దూరాన ఉన్నది కనబడటం కాదు. నేను చిన్న పిల్లగా ఉన్నాననుకో - నాలో ఏదో దైవత్వం, సామాన్యం కంటే ఏదో విశేషం నీకు కనుపించటమే దూరదృష్టి."

నల్లి పకపకా నవ్వి "అసలు దురదృష్టం అంటే - యీ రకమయిన దూరదృష్టి కలగకపోవటమేనేమో నమ్మా..." అన్నది.

అంతలో అన్నపూర్ణమ్మగారు "ఏంనల్లి! నీళ్ళు కాగాయా?"

అమ్మ మెల్లగా నల్లి వీపునుంచి క్రిందకు జారింది. వెంటనే నల్లి "నాకేదో అండగా ఉండి జారిపోయినట్లు ఉందమ్మా" అన్నది.

"నేను చూడలేదమ్మా, చూడండి కొంచెం."

"దీనిపని అయినట్లే ఉన్నది. సమాధానం ఎట్లా చెపుతున్నదో చూడు-" అనుకుంటూ...

"ఏమిటే నీవన్నది? మళ్ళీ అను..." అని కొంచెం కఠినంగానే కేక వేసింది అన్నపూర్ణమ్మగారు.

"ఏమీలేదు తల్లి-పొయ్యి క్రింద నిప్పవేసి వచ్చాను. మళ్ళీ చూడ లేదు. కాగితే పోసుకుందురుగాని, లేకపోతే వచ్చి మంట చేస్తాను."

అంతలో అమ్మ పరుగెత్తుకుని వచ్చి నీళ్ళు చూచి, చెంబుతో నీళ్ళు తీసుకుని వెళ్ళి అన్నపూర్ణమ్మగారికి యిచ్చింది - కాగినవేమో చూడమని.

"నిన్ను అడగలేదుగా, ఎందుకు పెద్దనాపసాని వలే నీవు వచ్చావు. నీవు నల్లివా?" అని అడిగింది అన్నపూర్ణమ్మగారు.

"నేను నల్లిని గాదు తల్లిని."

అంతలో ఆంధ్రపత్రిక చేతబట్టుకుని అన్నపూర్ణమ్మగారి కోసం చిదంబర రావుగారి దొడ్లోకి వచ్చి అమ్మను కూడా చూచి-

"ఏమంటున్నది యీామెగారు?" అని అన్నపూర్ణమ్మ గారిని అడిగారు,

జరిగిన సంభాషణ చెప్పింది అన్నపూర్ణమ్మగారు.

చిదంబరరావుగారు ముసిముసిగా నవ్వుకుంటూ- "రా అమ్మా, రా - వార్తాపత్రిక చదువుతావా?" అని అడిగారు.

అమ్మ తాతగారి వెంట నడుస్తూ -

"చదవట మెందుకు?" అని అడిగింది.

"సంగతులు తెలుసుకొనటానికి."

"తెలుసుకుని ఏం చేస్తారు? మనకు తెలిసిన విషయాలే తెలుస్తాయా? తెలియని విషయాలూ తెలుస్తాయా?"

అంతలో ఒకాయన వచ్చి తాతగారిముందు నిలబడ్డాడు, అమ్మ వార్తాపత్రిక చదివి అతనికి వినిపించమని అడిగింది. చిదంబరరావుగారు ఇటలీ రాజకీయాల గురించి చదివి "అర్థమయిందా?" అని అడిగారు. అతను అర్థం కాలేదన్నాడు.

పత్రిక చదువుకుంటే సంగతులు తెలుస్తాయంటిరే, మీరు చదివినా అతనికి అర్థం కాలేదు. అంటే, తెలిసిన వారికే పత్రికలోని విషయాలు తెలుస్తాయి, తెలియని వారికి తెలియవన్నమాట" అన్నది అమ్మ.

"చదువు వచ్చుగానీ నాకు పత్రిక విషయాలు అర్థం కావండీ" అన్నాడు అతడు.

ఆ క్షణంలో చిదంబరరావుగారికి అతడూ, అమ్మా ఒకటిగా తోచారు. ఇద్దరూ

ఒకటిగా కనుపించారు. అతని కంఠధ్వని కూడా అమ్మ స్వరం వలెనే వినిపించింది అమ్మ కంటే కొద్దిగా యెత్తుగా మాత్రం ఉన్నాడు.

చిదంబరరావుగారు "ఇతడిందాక నాకింత చిన్నవాడుగా కనుపించలే దేమిటీ?" అనుకుంటూ అమ్మవంకా ఆ అబ్బాయి వంకా చూపు మారుస్తూ పరిశీలనగా చూస్తూ ఉన్నారు. ఒకసారి అమ్మవంక చూచి మళ్ళీ అతనివైపు చూచేటప్పటికి ఆ అబ్బాయి కనుపించలేదు. చిదంబరరావుగారు ఆశ్చర్యంగా నలుమూలలా చూస్తుంటే-

"తాతగారూ - ఆ అబ్బాయిని యింతకుముందు ఎప్పుడయినా చూచారా?" అని అమ్మ అడిగింది.

"చూడలేదు. కానీ, యిందాక ఇట్లా తోచలేదు. తెలిసినవాడుగా అనిపించింది ఇట్లా అనుకుంటే అప్పుడే విమర్శించి చూచేవాడిని."

"పోనీ, ఎవరోలే_ మీ మనుమడనుకుందాము."

"నే తాతనయినప్పుడు అందరూ మనుమలే."

"అయితే నీవు ప్రపంచానికంతకూ తాతవా? మన ఇంట్లోనే అందరూ నిన్ను 'తాత' అనటం లేదుగా? తలా ఒకరకంగా పిలుస్తున్నారు. చిన్నపిల్లలకు తాత వనుకుందామా? చిన్నపిల్లలుకూడా అందరూ 'తాత' అనటం లేదుగా సుందర్, ఆదిలక్ష్మి - 'పెదనాన్న' అని పిలుస్తున్నారు..."

"అబ్బబ్బ - నీ క్రాసుకు తట్టుకోలేను తల్లీ-"

"మీ దగ్గర పెరగటమే కారణం."

"అవును - ఎవరి మెడకయినా వేయటమేగా?"

"నేను వెయ్యలేదు. వెయ్యటానికి సిద్ధమైన వాటిని తీశాను."

"ఏవరికి తీశావు?"

"ఎవరన్న వారికే."

"చిదంబరరావుగారు ఆశ్చర్యంతో కొన్నిక్షణాలు నిశ్చేష్టులై, తేరుకుని అడిగారు-

"అప్పుడు నీవు ఏ రూపంలో ఉన్నావు?"

"ఎప్పుడు? అసలు ఏమయినా జరిగిందేమిటి?" ఏమీ తెలీనట్టు అమాయకంగా అడిగింది అమ్మ.

చిదంబరరావుగారు ఆలోచనలో పడ్డారు.

"ఎవరో పుక్కిటి పురాణంగా చెప్పకుంటూ ఉంటే విన్నా"నన్నది అమ్మ నెమ్మదిగా.

"మరి నన్నెట్లా అడగగలిగావూ? ఎవరన్న వారే నన్నావుగా చెప్పకుంటే విన్నమాటలుగా లేవు కేవలం విన్న మాటలైతే అంత స్పష్టంగా అడగలేరు. విన్నమాటలకూ కన్న మాటలకూ తేడా ఉంది." మాట్లాడుతున్నారు గానీ చిదంబరరావు శరీరం చెమటతో తడిసింది.

"పోనీ మీ సంగతి మీరే చెప్పండి" అమ్మగొంతు సన్నమయినా, అందులో శాసనం ధ్వనించింది.

"ఏమున్నదని చెప్పేదీ - నీవన్నదే."

"తాతగారూ - నిజంగా చేశారా?"

"జరిగినదంతా సంగ్రహంగా చెపుతాలే..."

"సరేలెండి. నాకు ఏమీ వద్దుగానీ, అసలు మీరేమీ ఎరుగరుగా. ఆ ఒక్క ముక్కచాలు."

"నేనేమీ ఎరుగను. కానీ మొత్తం మీద నా నడకే నా మీద నేరాన్ని రుజువుచేసింది. నేను కాశీ వెళ్ళటం..."

"అసలు ఎందుకు వచ్చింది, తాతగారూ-"

"నేను పొన్నూరులో ఉండి ప్లీడరువృత్తి చేస్తున్నాను. ఆ సమయంలో పొన్నూరు కరణం పొన్నూరు గోపాలరావుగారు. వారే భావనారాయణస్వామిదేవాలయ ధర్మకర్త. వారు వస్తుతః చాలా పెద్దమనిషి. నీతి నిజాయితీలు కలవారు. నాకు పెద్దవాళ్ళతో స్నేహమెక్కువ. అదీగాక మన్నవ కరణంగారి అల్లుడిననే ప్రత్యేకత.

అందువల్ల గోపాలరావుగారు దేవాలయ నిర్వహణలో నా సహాయం కోరారు. ఎంత ఆదాయం వచ్చినా రక్తికిరాని దేవాలయ పరిపాలనను సరిచేయమన్నారు. బంధువులు ఎందరు ఎంతవద్దన్నా- వారి కోరికను నిరాకరించలేకపోయాను. దానితో దేవాలయానికి సంబంధించిన కొందరికి మా ఇద్దరి మీదా కక్షా-ఇద్దరినీ చంపాలనే ప్రయత్నమూ ప్రారంభమయినాయి. కాని విధి వేరొక విధంగా నిర్ణయించింది. వారికి మరణమూ, నాకు కారాగారమూ. నా నేరం రుజువై నాకు ఉరిశిక్ష విధించబడింది. మీ అత్తయ్య కర్లపాలెం పిచ్చయ్య శాస్త్రిగారి సహకారంతో బాలా త్రిపురసుందరి పూజ ప్రారంభించింది. ఆ దేవి కరుణతో మీ అత్తయ్యకు కోర్టులో ఏం జరుగుతుండేదీ ప్రత్యక్షంగా కనుపిస్తూ ఉండేది. చివరకు ఉరిశిక్ష తీసివేసి జైలుమాత్రమే వేసిన సంగతికూడా తెలిసింది. దేవాలయ వ్యవహారాలు చూచేటప్పడు రాజ్యలక్ష్మి అమ్మవారికి పొన్నమాను రథం చేయించాను - డబ్బు నాది కాకపోయినా. ఆ రాజ్యలక్ష్మి అమ్మవారే బాలాత్రిపురసుందరై కేసు కొట్టివేయించింది. ఆ బాలాత్రిపురసుందరే ఇప్పడు అనసూయయై జ్ఞప్తికి తెస్తున్నది. ఇది నీ పుట్టుకకు ఏడు సంవత్సరాలు ముందు జరిగింది...."

అంతలో చిదంబరరావుగారి కోసం కొందరు వ్యక్తులు వచ్చారు. చిదంబర రావుగారు అమ్మను బల్లదించి ఇంట్లోకి వెళ్ళి స్నానం చేయమన్నారు. అమ్మ దొడ్లోకి వెళ్ళి స్నానానికి నీళ్ళుతోడుకోబోయింది. అంతలో నల్లి వచ్చి,

"నేను తోడిస్తాను. బంగారు తల్లీ" అన్నది.

అమ్మ ఎప్పడు ఎక్కడ కనపడినా తనలో తానే నమస్కారం చేసుకుంటూ ఉండేది. నల్లి తెలుగు కావ్యాలు చదువుకున్నది. భగవత్ చింతన కలది. అనుక్షణం ఆమెకు యేవేవో అనుభవాలు కలుగుతూ ఉండేవి. అమ్మ సర్వత్రా వ్యాపించి ఉన్నదనే విషయంలో ఆమెకు బాగా నమ్మకం కుదిరింది. అందువల్ల అమ్మను ఎక్కడ నుండి అయినా కొలువవచ్చు, దర్శించవచ్చు, ఆమె అనుగ్రహం పొందవచ్చునన్న విశ్వాసంతో బాపట్ల నుండి నెల్లూరు జిల్లా ఆకులల్లూరు తోటల్లో స్థిరనివాస మేర్పరచుకున్నది.

24. కరుణ

తర్వాత పదిహేను రోజులకు సీతాపతితాతగారు, రాఘవరావుమామయ్యా, అమ్మా - ముగ్గురూ తెనాలి బయలుదేరారు. ముగ్గురూ కోచీలో కలసి వచ్చి తెనాలి స్టేషనులో ఒకేసారి దిగినా - ప్రయాణీకుల సందోహంలో కలసి అమ్మ ముందుగా బ్రిడ్జీ దాటింది.

బ్రిడ్జీ దాటగానే అక్కడ అనేకంగా గుఱ్ఱపుబళ్ళూ, ఒంటెద్దుబళ్ళూ ఉన్నాయి. అందులో ఒక ఒంటెద్దు బండి దగ్గరకు అమ్మ వచ్చి నిలబడి ఎద్దును నిమురుతూ "బండి ఎంతకు కడతా వబ్బాయి?" అని అడిగింది.

అమ్మ చేతిస్పర్శ తగలగానే - ఎద్దు ఉలిక్కి పడి గజగజా వణికింది. బండి వాడు అదిచూచి అమ్మ ఎద్దును ఏమో చేసిందనుకొని-

"ఏయ్, అమ్మాయి-ఎద్దు జోలికిరాకు" అన్నాడు.

అమ్మ ఎద్దును నిమురుతూనే ఉన్నది. "నీకు కాదా చెప్పేది-" అని అతడు కొరడా విసిరాడు. ఆ దెబ్బ అమ్మకూ, ఎద్దుకూ యిద్దరకూ తగిలింది. ఎద్దు ఉలిక్కిపడి కాడి వదలి పెట్టి అమ్మ పాదాలపై ముట్టిబెట్టి కిందపడి. అమ్మను చూస్తూ ఉన్నది.

బండి మనిషి అమ్మపాదాలవంకా, ఎద్దు ముఖం వంకా చూచాడు. కోపంతోపాటు ఆశ్చర్యమూ కలిగింది.

"ఇదేమిటమ్మా! ఈ ఎద్దును యిట్లా చేశావు? అసలే చావుకు సిద్ధమయింది. వారం రోజులనాడు చచ్చిపోయిందనే అనుకున్నాను కానీ ఎందుకనో బ్రతికింది. అవస్థ పడి పడి ఆశ వదులుకుని సర్వం భగవంతుని మీదనే భారంవేసి ఎద్దుకు మేతవేసి పడుకున్నాను. మళ్ళీ నేను లేచేటప్పటికి మేత కొరుకుతూ ఉన్నది. ఎప్పడూ తాడు తెంచడంగానీ, వేసినగడ్డి మేయకపోవడంగానీ, ఏవేళ ఎంతదూరం బండి కట్టినా ఎదురు తిరగడంగానీ ఎరుగదు. ఆరోజు జబ్బుచేస్తే దేవునికి మ్రొక్కుకున్నాను - నయంచేస్తే ఏమయినా యిస్తాననే బదులు, ఎద్దునే యిస్తానన్నాను. నయమయింది. యివాళనే బండి కట్టాను" అని బండివాడు

చెప్తూనే ఉన్నాడు. ఎద్దు 'అంబా_' అని అరిచి ప్రాణం వదలింది. అతడు ఆ సంఘటన చూచి విస్మయంతోనూ, వేదనాతిశయంతోనూ గుండెలు బరువెక్కి కొయ్యబారి పోయాడు.

ఎద్దు అంతిమశ్వాస వదులుతూ, తన ముట్టెను - అమ్మ పాదాలు కందుతాయని యేమో-పాదాల మధ్యకు చేర్చి కన్నుమూసింది. అమ్మ ఎద్దునూ, బండివానినీ కడగంట చూస్తూ, కరుణను వెలార్చుతూ నిలబడ్డది.

ఇదేమీ పట్టకుండా రాఘవరావుమామయ్య ముందుకు సాగిపోయాడు. సీతాపతితాతగారు ఎవరితోనో మాట్లాడుతూవస్తూ అమ్మనుచూచి ఆగారు. అంతలో ఎక్కడనుండో ఒక రాయి రివ్వునవచ్చి అమ్మకాలికి తగిలి వెంటనే రక్తం స్రవించింది.

తాతగారు గాభరాగా "అయ్యో, అయ్యో - ఇదేమిటి?" అని అరిచారు.

"ఈ ఎద్దు తనప్రాణం పోయే సమయంలో కూడా నాకు బాధ కలుగ కూడదని ఆలోచించింది. కాని ఎవరో ఎక్కడనో ఉద్దేశించి రాయి విసిరితే నాకు తగిలింది. అంటే బాధపడవలసిన సమయంలో ఎవరూ తప్పించ లేరని ఋజువు కాలేదా? ప్రతిజీవి అనుక్షణం తన జీవితంలో జరుగుతున్న ప్రతి సంఘటనను అవగాహన చేసుకుంటే - వేరే శాస్త్రాలతో పనియేమున్నది?"

అని అమ్మ వివరిస్తుంటే - తాతగారు బాధగానూ, విసుగుగానూ-

"నీ వేదాంతం సరే - ఈ ఎద్దేమిటీ?" అన్నారు.

"ఎద్దు చచ్చిపోయింది నాన్నా"

"చచ్చిపోతే పోయిందిలే. యివతలకు రా. నీవెందుకు అక్కడ నిలుచున్నావు? నీవేమయినా బ్రతికిస్తావా?"

"బ్రతికించలేనూ, చంపలేనూ"

తాతగారు అమ్మరెక్క పట్టుకుని యివతలకు లాగి "మాటలు కోటలు దాటుతున్నాయి. కాళ్ళు గడపలు దాటవు_ మనకు పోయినపొద్దుగునా చావులే. ఈ ప్రొద్దు ఇట్లా క్రుంక వలసిందేనా?" అని బాధపడ్డారు.

"అమ్మ చచ్చిపోతే అంతమంది ఏడిచారే. ఎద్దు చచ్చిపోతే ఎవరూ ఏడవరేమి నాన్నా-" అని అమ్మ అడిగింది.

"అందరి సంగతీ వదిలిపెట్టు - నీవు ఏడవటం లేదేమి?"

"నేను ఆ రోజునా ఏడవలేదు. ఈ రోజునా ఏడవటం లేదు. కనీసం నా గాయం చూస్తే కలిగిన ఆదుర్దా ఎద్దు మరణించినా లేదు కదా-"

"చచ్చిపోయిన ఎద్దును గురించి ఆదుర్దాపడితే మాత్రం ఏమి వస్తుంది? నీ గాయ మంటే - కట్టు కట్టు కోవచ్చు. నయం చేసుకోవచ్చు."

"అమ్మకోసం ప్రాణంపోయిన తరువాతనేగా అంతగా ఏడ్చింది?"

"అబ్బబ్బా... విసుగుపుడుతున్నది. ఏమి ప్రశ్నలు? పిచ్చి ప్రశ్నలు! ఇంతకూ కూలి వాడికి మూటలు ఇచ్చి నడిచిపోదామా ? బండి మాట్లాడమంటావా?"

"మీ యిష్టం. ఎట్లా తీసుకువెళితే అట్లా వస్తా."

"అట్లా కాదు. నీ యిష్టం వచ్చినట్లు చెప్పు. ఏ బండి కావాలంటే ఆ బండి కట్టిస్తాను. లేక నడుస్తా నంటావా - అదయినా సరే."

అమ్మ ఏమీ మాట్లాడలేదు.

"నీ యిష్టం వచ్చిన బండి ఏరుకో అమ్మా-"

అమ్మ చనిపోయిన ఎద్దును చూస్తూ ఉంటే, తాతగారు అమ్మబండి కోసమే చూస్తున్నదని భావించి-

"తేల్చి చెప్పరాదా ? మనస్సులో ఒకటి మాటలో ఒకటీ ఎందుకు?" అని అడిగారు.

"ఆ బండి కావాలి" అని ఎద్దుచనిపోయిన బండిని చూపించింది అమ్మ. తాతగారు ఆ బండికోసం మనిషిని పంపారు.

"నీకు కనపడడం లేదటయ్యా? ఎద్దు చచ్చిపోతే బండి కావాలని అడుగుతావు?" బండి మనిషి కసురుకున్నాడు.

"ఏడ్చినట్టే ఉన్నది. ఏమి కోరికలమ్మా? ఎటువంటి కోరికలు కోరుతున్నావు?"

"నాకు ఏనాటికయినా కోరికలంటూ ఉంటే అట్లాగే ఉంటాయి."

"తీర్చుకోలేని కోరిక లెందుకు?"

"నేనుగాదు మీరయినా అంతే. ఏ బండి కావాలంటే ఆ బండి ఎక్కిస్తా న్నావుగా. ఏమి తీర్చగలిగారూ ? తీర్చకపోగా - నా మనస్సులో ఉన్న ఉద్దేశం కనుక్కున్నవారివలె, నా మనస్సును గుర్తించినట్టుగా, అన్నీ అర్థమయినట్లుగా, నేను ఎటో చూస్తుంటే - ఏదో చూచాననీ, అయినదొకటైతే యింకో రకంగా అర్థం చేసుకుని - సంభాషణ ప్రారంభించారు. అసలు ప్రతిమనిషీ యింతే, తమ మనసునుబట్టి యితరుల ఉద్దేశాన్ని నిర్ణయిస్తారు. -- మనస్సు మరొకరికి ఎవరికీ అర్థంకాదు. చివరకు భార్యా భర్తల కేమీ, తల్లీబిడ్డలకేమీ, అన్నదమ్ముల కేమీ, అక్క చెల్లెళ్ళకేమీ - కనీసం మార్గదర్శకులమనీ, గురువులమనీ అనుకుని బోధచేసేవారికిగూడా మనస్సును గుర్తించలేని స్థితి ఉంటూనే ఉన్నది. ఇదే భిన్నత్వం అంటే. అసలు మనస్సు తెలిసినప్పుడు బోధలేదు."

అమ్మ గంభీరంగా చెప్పకుపోతూఉంటే - తాతగారు మారు మాటలేక వింటూఉంటే - అంతకంటే కూడా అతి శ్రద్ధగా ప్రక్కనే యింకొక మనిషి ఆలకించాడు. అతని పేరు ఖాదరువల్లీ.

అమ్మా, తాతగారూ నడిచే పోతూ ఉన్నారు. అమ్మ కాలికి తగిలిన గాయం రక్తం స్రవిస్తూ ఉంటే ఖాదరువల్లీ చూచి-

"అయ్యా-అమ్మాయిగారిని ఎత్తుకోనా? కాలికి కట్టు కట్టించవద్దా?" అంటూ అమ్మను ఎత్తుకోబోయాడు.

"వద్దులే నాయనా - నడుస్తాలే" అని అమ్మ అంటుంటే - ఖాదరువల్లీకి అమ్మాయిగా తోచలేదు.

తాతగారికి అతని అనుసరణ సందేహాకారణమయి అమ్మవద్ద నున్న బంగారం అతనిలో దురాశను ప్రేరేపించిందని భావించి-

"ఎవరివి నీవు? ఎందుకు వస్తున్నావు?" అని అడిగారు.

"ఏమీలేదు. ఆ అమ్మ మాట్లాడుతుంటే వినాలనిపిస్తున్నది. ఆ అమ్మను

చూస్తుంటే ఇంకా చూడాలనిపిస్తున్నది. ఆ అమ్మ నడుస్తుంటే ఎత్తుకోవాలని పిస్తున్నది. పోనీ - కొంచెం సేపాగండి. మా వాళ్ళబండి కట్టుకు వస్తాను..." అని అంగలు వేసుకుంటూ వెళ్ళాడు ఖాదర్‌వల్లీ.

"ఈ రోజుల్లో ఎవరినీ నమ్మరాదు. అందులో అతను సాహెబు. బంగారం కాజేయటానికి యివన్నీ యెత్తులు. అతను వచ్చేసరికి మనం యిల్లు జేరుదాము" అన్నారు తాతగారు.

"వాడిది చాలా గొప్ప హృదయం నాన్నా. మంచి చెడ్డలు కులంమీద ఆధారపడి ఉన్నాయా ? గుణహీనుడైనా మీరు చెప్పే పద్ధతిన ఒకడు కులాన్నిబట్టి గుణవంతుడవుతాడా?"

"అనవసరంగా మాట లెందుకు? - చిన్న పిల్లవు?"

"అవును నాన్నా - అనవసర మాటలుగావు ఇవి - అవసరం కలిగిన మాటలేగా?"

"అంతా చంద్రమౌళివారి పోలికలు వచ్చినయ్".

"వారికి కోపం వచ్చినప్పడేమో మన్నవవారి పోలికలంటారు. మీకు కోపం వచ్చినప్పడేమో చంద్రమౌళివారి పోలిక అంటారు. నావి ఎవరి పోలికలూ కావు. నా పోలికే మీ అందరకూ వచ్చింది."

అంతలో గుళ్ళపు బండి తోలుకుని ఖాదర్‌వల్లీ వచ్చి - "అయ్యా - ఎక్కండి" అంటూ అమ్మను బండి ఎక్కించాడు. తాతగారు కూడా ఎక్కారు. తాతగారికి ఖాదర్ మాట మీద కొంతవరకు నమ్మకం ఏర్పడ్డది.

అయిదు నిమిషాల్లో యిల్లుచేరారు. మామయ్య ముందుగానే యింటికిజేరి వర్తమానం అందించడంతో అందరూ వారి కోసం ఎదురుచూస్తూ ఉన్నారు. వాకిట్లో బండి ఆగగానే అమ్మ పెదతల్లి అన్నపూర్ణమ్మగారు బండి దగ్గరకు వచ్చి బండిలోనుంచి అమ్మను దించి ఎత్తుకుని యింట్లోకి తీసుకువెళ్ళింది. ఇంట్లోకి వెళ్ళగానే అయిదుగురు పినతల్లులూ అమ్మకోసం చేతులు చాపారు. అందరి లోనూ ఒక్కసారిగా రంగమ్మగారి స్మృతి రగిలి దుఃఖం వెల్లువలై పెల్లుబికింది.

వెంకటసుబ్బారావుగారూ, యితరులూ కూడా సీతాపతితాతగారినీ, అమ్మనూ ఎంతో ఆదరంగా చూచారు.

ఒకరోజున వెంకటసుబ్బారావుగారు సీతాపతితాతగారిని దగ్గరకు పిలిచి సానుభూతి నిండిన స్వరంతో-

"నా దగ్గర నీకు యీడయిన పిల్లకూడా లేదుగా" అన్నారు.

"ఒక పిల్లను యిస్తే యింతగా సంతోషపెట్టాను. ఇంకా నాకు ఆ పాతకం కూడా ఎందుకు? నా కసలు ఆ ఉద్దేశం లేదు. మీరు పిల్లల బాధ్యత తీరిస్తేచాలు - పిల్లను యిచ్చినంత పుణ్యం" అన్నారు సీతాపతితాతగారు విచారగ్రస్తులై, అవనత వదనంతో, రుద్ధకంఠంతో.

"నీకు ఎట్లా తప్పతుంది నాయనా - రంగమ్మతల్లి బాధ్యతకూడా నీ నెత్తినే ఉన్నది. అంటే పిల్లలు మాకు బరువైకాదు. ఎంత మేము చూచినా, నీ బాధ్యత ఎక్కడకు పోతుంది?"

అంతలో అన్నపూర్ణమ్మగారు వచ్చి -

"అమ్మాయిని ఎంత పలుకరించినా పలుకదు. ఏది పెట్టినా తినదు. ఇటువంటి పిల్ల మనకేమి అలవాటు అవుతుంది? అయినా పదిరోజులు అట్టే పెట్టుకుని ప్రయత్నం చేద్దాము" అన్నది.

జానకమ్మగారు అందుకుని-

"మనం పెంచేదేమిటిలే. ఆస్తి ఉన్నది. మొగుడూ పిల్లలూ లేని ముసలమ్మ ఉన్నది. ఇక్కడి కంటే గారాబంగానే పెరుగుతుంది. అక్కడనే, మన్నవలో" అన్నది.

జానకమ్మగారికి అమ్మను తెనాలిలో బలవంతంగా పెంచడం ఇష్టం లేదు. అయినా వెంకటసుబ్బారావుగారూ, అన్నపూర్ణమ్మగారూ పదిరోజులు శాయ శక్తులా ప్రయత్నించి విఫలులైనారు, అమ్మ ఉద్దేశాన్ని ఏమాత్రమూ మార్చలేక.

పదకొండవ రోజున సీతాపతితాతగారికీ, అమ్మకూ తలంటి పోయించారు. క్రొత్తగుడ్డలుపెట్టి వెంకటసుబ్బారావుగారు సీతాపతి తాతగారిని "ఒక యింటి వాడవు కా నాయనా" అని ఆశీర్వదించారు.

అన్నపూర్ణమ్మగారు అమ్మను దగ్గరకు తీసుకుని-

"మంచి మంచి పరికిణాలు కుట్టిస్తాము. చాలా సొమ్ములు చేయిస్తాము. ఇక్కడ ఉండమ్మా.." అని బ్రతిమాలింది.

"చాలా సొమ్ములూ, పరికిణాలూ తాతమ్మ కావుగా" అన్నది అమ్మ.

"సముద్రమంత గంభీరం" అని అన్నపూర్ణమ్మగారు కణతలు నొక్కుకున్నది.

"తరచుగా అమ్మాయిని తీసుకుని వస్తూపోతూ ఉండండి క్రమంగా అల వాటు అవుతుందేమో, ప్రస్తుతం అలవాటు అయ్యేటట్టులేదు" అన్నది జానకమ్మ గారు సీతాపతితాతగారితో.

"సరే-యేం చేస్తాము? పోనీలే... రంగమ్మ పోతూపోతూ చిదంబరంచేతిలో పెట్టి పోయిందిగా. అన్నీ వాడే చూచుకుంటాడు."

సీతాపతితాతగారూ, అమ్మా చేసే బాపట్ల ప్రయాణం తెలుసుకుని ఖాదరువల్లీ ముందుగానే బండి తోలుకొనివచ్చి వాకిట్లో నిరీక్షిస్తున్నాడు.

బండికోసమని తాతగారు వాకిట్లోకి వచ్చేటప్పటికి సిద్ధంగాఉన్న బండిని చూచి తాతగారు అబ్బురపడుతుంటే - ఖాదరువల్లీ చేతులుచాచి "అయ్యా, రండి-" అని పిలిచాడు.

రాఘవరావుమామయ్యను తర్వాత బాపట్లకు పంపమని వెంకటసుబ్బారావు గారికి చెప్పి అమ్మను బండి ఎక్కించుకుని సీతాపతితాతగారు బయలుదేరారు.

స్టేషనువద్ద బండి దిగి తాతగారు ఖాదరువల్లీకి బాడుగ డబ్బులు యివ్వబోతే--

"వద్దయ్యా - అమ్మకు నీవు తండ్రివి; నేను బిడ్డను- నేను కూలికిరాలేదు. అమ్మ కోసం వచ్చాను" అన్నాడు ఖాదరువల్లీ.

"చిన్నపిల్లను పట్టుకుని అమ్మ అంటావేమిటిరా" తాతగారు ప్రశ్నించారు.

"ఎందుకనో తెలీదుగానీ, అట్లా అనిపిస్తున్నదయ్యా అది సరేగానీ... నేను బాపట్ల వచ్చి-నా అన్నం నేనుతింటూ అమ్మను చూస్తూ ఉంటాను."

"బాపట్ల ఎందుకూ?"

"బాపట్ల కోసం కాదయ్యా-అమ్మకోసం."

అమ్మ కల్పించుకుని తాతగారికి వినపడకుండా ఖాదరువల్లీతో-

అమ్మను ఇక్కడ చూచావుగా నాయనా- ఈ పూట వద్దులే. నే వెళ్ళిన తరువాత యింకొకనాడు రా- అన్ని సంగతులూ అక్కడ మాట్లాడుకుందాము వివరంగా" అన్నది.

అంతలో ట్రెయిన్ వచ్చింది.

"ఓ అబ్బాయ్- యీ సామానూ, మమ్మల్ని రైలెక్కించి వెళ్ళు" తాతగారు ఖాదరువల్లీని అడిగారు.

"ఈ మాత్రం కరుణతో మాట్లాడింది యిదేగా అతనితో" అన్నది అమ్మ.

"ఇదే కాదమ్మా - అసలు కరుణ అంటేనే నాకు లేదు."

"పోనీ - కరుణ పొందుతావా?"

"అదీ లేదు."

"కరుణ లేకపోతే మనమే లేము. మనము చేసే పనులన్నీ కరుణవల్లనే. నా దృష్టిలో కష్టసుఖాలు రెండూ కూడా కరుణవల్లనే. ప్రతి చిన్నపనీ మన చేతులతో చేస్తున్నామనుకున్నా, మనం ఎట్లాచేసినా - వాడి కరుణ వల్లనే. మనకు కనపడకుండా ఆయా తరుణాల్లో ఆయా పనులు చేయించటమే కరుణ. కరుణసముద్రం అల వంటిది. ఆ తరంగానికి తరుణం వచ్చినప్పుడు నీరే తరంగమౌతుంది. ఎక్కడో ఒకచోట పుట్టి కొండలాగా పెరిగి లయమౌతుంది. ఒక్కొక్క అల ఎక్కడనుండో వస్తున్నట్లు ఉంటుంది. ఒక్కొక్కటి దగ్గరలోనే పుట్టినట్లు ఉంటుంది. ఇంతకూ నీటికి గాలి ఒరిపిడేగా, అల అంటే."

అమ్మ చెప్పే విషయం తాతగారికి ఏమీ అర్థం కాలేదు. ఖాదరువల్లీ ఎంతో శ్రద్ధగా అమ్మ ప్రతిమాటనూ విని-

"నేను తప్పకుండా బాపట్ల వస్తానమ్మా - నేను తెలుసుకోవలసినవి చాలా

"బాపట్ల ఎందుకూ?"

"బాపట్ల కోసం కాదయ్యా-అమ్మకోసం."

అమ్మ కల్పించుకుని తాతగారికి వినపడకుండా ఖాదరువల్లీతో-

అమ్మను ఇక్కడ చూచావుగా నాయనా- ఈ పూట వద్దులే. నే వెళ్లిన తరువాత యింకొకనాడు రా- అన్ని సంగతులూ అక్కడ మాట్లాడుకుందాము వివరంగా" అన్నది.

అంతలో ట్రెయిన్ వచ్చింది.

"ఓ అబ్బాయ్- యీ సామానూ, మమ్మల్ని రైలెక్కించి వెళ్ళు" తాతగారు ఖాదరువల్లీని అడిగారు.

"ఈ మాత్రం కరుణతో మాట్లాడింది యిదేగా అతనితో" అన్నది అమ్మ.

"ఇదే కాదమ్మా - అసలు కరుణ అంటేనే నాకు లేదు."

"పోనీ - కరుణ పొందుతావా?"

"అదీ లేదు."

"కరుణ లేకపోతే మనమే లేము. మనము చేసే పనులన్నీ కరుణవల్లనే. నా దృష్టిలో కష్టసుఖాలు రెండూ కూడా కరుణవల్లనే. ప్రతి చిన్నపనీ మన చేతులతో చేస్తున్నామనుకున్నా, మనం ఎట్లాచేసినా - వాడి కరుణ వల్లనే. మనకు కనపడకుండా ఆయా తరుణాల్లో ఆయా పనులు చేయించటమే కరుణ. కరుణసముద్రం అల వంటిది. ఆ తరంగానికి తరుణం వచ్చినప్పుడు నీరే తరంగమౌతుంది. ఎక్కడో ఒకచోట పుట్టి కొండలాగా పెరిగి లయమౌతుంది. ఒక్కొక్క అల ఎక్కడనుండో వస్తున్నట్లు ఉంటుంది. ఒక్కొక్కటి దగ్గరలోనే పుట్టినట్లు ఉంటుంది. ఇంతకూ నీటికి గాలి ఒరిపిడేగా, అల అంటే."

అమ్మ చెప్పే విషయం తాతగారికి ఏమీ అర్థం కాలేదు. ఖాదరువల్లీ ఎంతో శ్రద్ధగా అమ్మ ప్రతిమాటనూ విని-

"నేను తప్పకుండా బాపట్ల వస్తానమ్మా - నేను తెలుసుకోవలసినవి చాలా

25. భావనాతీత

సీతాపతిగారూ, అమ్మా బాపట్లస్టేషన్‌లో ట్రెయిన్ దిగి చిదంబరరావు తాతగారి యింటికి రాగానే వారు అమ్మను చూచి -

"అమ్మా, రంగమ్మా - వచ్చావా?"

అని - చప్పున పొరపాటు గ్రహించి అమ్మను యెత్తుకున్నారు. కన్నులు నీటికుండలవగా భారంగా అడుగులు వేస్తూ లోపలకు నడిచారు.

అంతలో సీతాపతితాతగారు త్రుళ్ళిపడ్డారు. అయితే అది చిదంబరరావుగారి అవస్థ చూచికాదు; హఠాత్తుగా అమ్మమ్మగారి కంఠస్వరం వినిపించి నందువలన.

'అమ్మాయిని ఎక్కడా వదిలి పెట్టవద్దు. ఆ ప్రయత్నం కూడా చేయవద్దు. మనకు బరువుకాదు. అమ్మాయే మన బరువూ మోస్తుంది."

అమమ్మ కంఠస్వరం తనను ఉద్దేశించి స్పష్టంగా వినిపిస్తున్నా... తాతగారు తాను భ్రమపడుతున్నానేమోనని నాలుగుదిక్కులూ కలియజూచి, ఏమీ కనుపించక బరువుగా నిట్టూరుస్తూ వాకిట్లో ఉన్న బల్లమీద కూలబడి-

"ఇట్లా ప్రతిదీ వినిపిన్తూ అన్నివేళలా అవసరమయిన సలహాలు యిస్తూండగూడదా ? మనిషిలేని కొరత లేకుండా చేయకూడదా?"

అని ఆలోచనలో మునిగిపోయారు.

"ఏమి నాయనా పిల్లను తీసుకువచ్చావేమి?"

మరిడమ్మగారి ప్రశ్న తాతగారికి వినిపించలేదు; సమాధానమివ్వలేదు. ఆ సమాధానం కోసం మరిడమ్మ గారూ ఎదురు చూడలేదు. ఇంట్లోకి వెళ్ళి పోయింది.

ఆ సాయంకాలం లక్ష్మణాచార్యులుగారు వచ్చారు, వారు నృసింహోపాసకులు, గంభీరమయిన విగ్రహం. నిత్యమూ చిదంబరరావుగారింటికి వచ్చిపోతూ ఉంటారు. ఆనాడు వస్తూనే...

"అమ్మా - బాలాత్రిపురసుందరీ...." అని కేకలు వేస్తూ ఎదురుపడిన అన్నపూర్ణమ్మగారిని -

"బాలాత్రిపురసుందరి ఎక్కడ ఉన్నదమ్మా?" అని అడిగారు.

"బాలా త్రిపురసుందరి అంటే?"

"మన బాలే నమ్మా-"

"మాకు బాలలు ఎవరూ లేరే?"

అంతలో అమ్మ మేడమీది నుండి దిగివస్తూ ఆగకుండానే-

"ఆబాలగోపాలం బాలలయ్యే వృద్ధులైనారు" అంటూ స్నానాల గదిలోకి వెళ్ళింది.

అమ్మను చూడగానే లక్ష్మణాచార్యులుగారి కన్నులు విస్ఫారితాలై, ఆ మాటలు వినగానే మనసు మకరంద పానంచేసినట్లు ఆనందమయమై -

"ఇదిగో నమ్మా - యీ బాలే...." నంటూ వివశులై ఒకసారి కనులు మూసు కుని, మరల తెరచి -

"అమ్మాయి చెప్పిన సమాధానం వినలేదా ? వినపడ లేదా?" అని అడిగారు.

"కనపడనూ లేదు" గదిలోనుండే అమ్మ పలికింది.

"ఇటు వెళ్ళిందా ఏమిటి అమ్మాయి?" అన్నపూర్ణమ్మగారు అడిగింది.

"చూడలేదన్న మాట. మనం చూడకపోయినా మనలను ఎప్పుడూ చూస్తూనే ఉంటుంది మన తల్లి" అన్నారు లక్ష్మణాచార్యులుగారు.

"చూస్తున్నానని చూచేవారు ఎంతటివారో?" అమ్మ అడిగింది.

"నీ వెంతవారిని చేస్తే అంతవారు."

"అంతా వారే, వారే వీరు."

కూర్చున్న ఆచార్యులుగారు గబగబాలేచి స్నానాల గదిలోకి వెళ్ళి కాళ్ళూ - చేతులూ కడుక్కుంటున్న అమ్మను ఎత్తుకుని.... తన కాషాయగుడ్డలతో అమ్మ ముఖమూ, కరచరణాదులూ తుడిచి 'ఈ తల్లి అర్థమయ్యే తల్లికాదు, చెప్పినా అర్థంకాదు" అనుకుని-

"అమ్మా - నాకు మాత్రం యీ స్థితి మారకుండా చెయ్యి తల్లీ. నాకు అరవై సంవత్సరాలు వెళ్లిపోతున్నాయి. నీ లీలలన్నీ చూస్తానో, చూడనో... నిన్ను నేను మీ అమ్మపోయిన రోజునుండీ గమనిస్తూనే ఉన్నాను. ఇటీవల ఒక రోజున స్వప్నంలో నీవు కనిపించావు నీ యథార్థం వివరించావు. తుదకు నీవు నా తండ్రి, నా ప్రభువు, నా ఆరాధ్యదైవం నృసింహస్వామిగా సాక్షాత్కరించావు. అప్పుడే వినిపించాయి. 'అంతా వారే. వారే వీరు' అన్నమాటలు. ఆ కలిగిన ఆందోళన, ప్రేమ, భక్తి యీ రోజుకు ధ్రువపడ్డాయి. రూపంకూడా ఆనాడు చూచినదే..."

ఆచార్యులుగారు ఆవేశభరితులై చెప్పకుపోతుంటే అన్నపూర్ణగారు గదిలోకి వచ్చి-

"ఏమిటీ మీ సంభాషణ?" అని అడిగింది.

"ఏమి ఉందమ్మా? తల్లి మాటలు ముద్దుగా ఉన్నాయి. కొన్ని మాటలు మనం మూటకట్టుకొనటానికి అనుకూలంగా ఉన్నాయి. ఈ బంగారు మూట ఎవరికి ఇచ్చేది?

అంటూ తన పైగుడ్డలో అమ్మను మూటగట్టుకొని ఆ మూటను వీపున వేసుకుని దొడ్లోకి వెళ్లారు.

అప్పుడే బజారునుండి వచ్చిన చిదంబరరావుగారూ, నిద్ర లేచిన సీతాపతి గారూ ఆచార్యులుగారికి నమస్కరించి కూర్చున్నారు.

"ఈ నమస్కారం నా వీపున జోలెలోఉన్న బాలకు మాత్రమే చెందుతుంది" అన్నారు ఆచార్యులుగారు.

ఆ మాట నిజమేనన్నట్లు చిదంబరరావుగారు నవ్వుకుంటే, సీతాపతిగారు తమ ఆలోచనలో మునిగిపోయారు. అన్నపూర్ణమ్మగారు చాపలు పరచింది. అందరూ మాట్లాడుకుంటూ విశ్రాంతిగా కూర్చున్నారు. చిదంబరరావుగారి తల్లి నరసమ్మగారు బాదంచెట్టుక్రింద మంచంలో పడుకుని అమ్మా... అమ్మా... అని మూలుగుతూ ఉన్నారు.

"ఎందుకో బామ్మగారు మూలుగుతున్నారే" అన్నారు ఆచార్యులుగారు.

"నిన్నటినుండి ఆమెకు భోజనం లేదు."

"ఏం - జ్వరం వస్తున్నదా?"

"లేదు. రంగమ్మతల్లి పోయినప్పటినుండి యీామెయిట్లాగే ఉంటున్నది. ఇబ్బేమీా లేదు. మానసికబాధే. చెప్పిన మాట అర్థం చేసుకోలేదు. చెప్పినమాటే చెపుతూ ఉంటుంది. అన్నం రెండు రోజులకో మూడు రోజులకో తింటూ ఉంటుంది."

"అయినా నేను లేపి చూస్తాను" అంటూ ఆచార్యులుగారు మంచం దగ్గరకు వెళ్ళి ఆమె వెన్నురాస్తూ "అమ్మా ! తల్లీ ! లే - అన్నం పెడుదువుగానీ - లే, నాకు..." అని అడిగారు.

నరసమ్మగారు ఉలిక్కిపడి లేచి "ఎవరూ? ఎవరూ? రంగమ్మ తల్లా? లేదుగా నాయనా-" అని వెంటనే బరువుగా కళ్ళు మూసుకున్నది.

"అమ్మా - బాలాత్రిపురసుందరీ - నీవు వచ్చిలేపు లేస్తుంది" అన్నారు ఆచార్యులవారు.

అమ్మ లేచివచ్చి చిన్నగా పిలిచింది 'తాతమ్మా' అని. ఆమె వెంటనే లేచి కూర్చున్నది.

"చూచారా పున్నమ్మగారూ - బాలాత్రిపురసుందరీ అంటే - ఎవరూ లేరంటిరే. లక్షణాలు కనిపెడుతూ ఉండండి" ఆచార్యులుగారు అత్యుత్సాహంతో అన్నారు.

"కనిపెడితే కనపడేవి కావు. కనపడితే కనిపెట్టేవి. మీా ప్రయత్నాలు లేవు" అన్నది అమ్మ.

ఆ మాటలకు చిదంబరరావుగారూ, ఆచార్యులుగారూ ఒకరి కన్నుల్లోకి ఒకరు చూచుకున్నారు. ఆ కన్నుల్లో వెలిగిన ఆనంద జ్యోతుల కాంతుల్లో యిద్దరూ వివశులై ఉండగా అమ్మ నరసమ్మగారి చేయిపట్టుకుని-

"తాతమ్మా - స్నానం చేద్దువుగాని రా" అని రెక్క పట్టుకొనగానే ఆమె లేచి నిలుచున్నది.

మరిడమ్మగారు గబగబా లేచివచ్చి "నీవు వద్దులే అమ్మా-" అని అమ్మతో అని నరసమ్మగారిని చెయ్యి పుచ్చుకుని బావి దగ్గరకు తీసుకొని వెళ్ళి స్నానం చేయించింది.

"అమ్మా - తాతమ్మకు, నీవు అన్నం పెడతావా?" అని అడిగారు ఆచార్యులు గారు.

"నేను పెట్టడం ఏమిటి?"

"నీవు పెడితే - ఆమె రోజూ అన్నం తింటుందమ్మా."

"నేను పెట్టనప్పడూ ఆమె పుట్టినప్పటినుంచీ అన్నం తింటూనే ఉన్నదిగా?"

"చిదంబరరావుపంతులుగారూ - మీ బదులు అమ్మాయిని పంపండి కోర్టుకు"- ఆచార్యులుగారు నవ్వారు.

"ఆమె కోర్టుకు వెళితే జడ్జీ, మునసబూ, ప్లీడరూ, పార్టీ - అన్నీ ఆమే అయి విచారణ చేయాలి; తీర్పు చెప్పాలి" అన్నారు చిదంబరరావుగారు.

"ఇప్పడు మాత్రం అన్నీ అయి చేయించడంలేదూ?"

"వినటానికి విచిత్రంగా ఉంటాయి మీ మాటలు" అన్నది అన్నపూర్ణమ్మగారు.

"వినటానికి విచిత్రమే. అనుభవించేవారికి విచిత్రంకాదు" అని ఆచార్యులు గారు వివరించబోతుండగా నరసమ్మ గారిని స్నానం చేయించి తీసుకు వచ్చారు.

ఆచార్యులుగారు అమ్మను ఉద్దేశించి -

"త్వరగా విస్తరివెయ్యమ్మా -" అన్నారు.

"నాకు మడిగుడ్డ లేదుగా?"

"నీకు మడి ఏమిటమ్మా? నీవే మడి."

"నేనే మడి అయితే నన్ను కట్టుకో లేదేమి? గుడ్డలు కట్టుకుంటున్నారుగా?"

"నిన్ను కట్టుకోవటం లేదుగాని, నిన్ను చుట్టుకునే ఉన్నాము."

అన్నపూర్ణమ్మగారు మడికట్టుకువచ్చి అత్తగారికి అన్నం పెట్టడం ఆరంభించింది.

"పోనీ-నీవు కలిపి పెట్టమ్మా. కలప మంటే అన్నమే కాదు అన్నీ-" అన్నారు ఆచార్యులుగారు అమ్మతో.

అమ్మ దొడ్లోకి వెళ్ళి ఒక గుడ్డ తడుపుకుని కట్టుకు వచ్చింది. నరసమ్మగారు అన్నం కలుపుకుంటూ ఉన్నది. అమ్మ అన్నంవంక చూస్తూ నిలుచున్నది. మరిడమ్మగారు పెరుగుగిన్నె తీసుకు వచ్చి-

"నీ కెందుకమ్మా యీ తడిగుడ్డ?" అంటూ అమ్మ ముఖంలోకి చూచింది. అందులో శాంభవీముద్రలోనున్న తమ గురువు మల్లెల రత్తమ్మగారి పోలికలు కనుపించాయి. తన భ్రమయేమోనని తరచి చూచింది. సాక్షాత్తు తమ గురువుగారే. అదే క్షణంలో లక్ష్మణాచార్యులుగారు అమ్మలో నృసింహస్వామిని దర్శించారు.

వివశురాలైన మరిడమ్మగారు అనాలోచితంగానే నరసమ్మగారి కూరన్నంలో పెరుగు కుమ్మరించింది. వెంటనే ఆచార్యులుగారు పెరుగన్నపు ముద్ద పెట్టుమని చెయ్యి చాపారు.

నరసమ్మగారు ఎంగిలి అని సందేహించింది.

"పెట్టమ్మా" అని ఆచార్యులుగారు సింహగర్జనచేసి, కళ్ళు పెద్దవిచేసి, చెయ్యి ముందుకు చాపారు.

వెంటనే మారుమాటలేకుండా నరసమ్మగారు అన్నం ముద్దచేసి ఆచార్యులు గారి చేతిలో పెట్టింది. అన్నపుముద్ద చేతిలో పడగానే ఆచార్యులుగారు నోరు తెరిచారు. నోరు తెరవగానే జిహ్వ జానెడు పొడవున బైటకువచ్చి కాలనాగు వలెనూ, నోరు ఎటుచూచినా జానెడు వెడల్పున మృత్యు గహ్వరంవలెనూ - భయావహంగా కనుపించాయి. కన్నులు కడువెడదలై కణకణలాడే చింతనిప్పులైనాయి. నల్లగుడ్లు మరింత నల్లనై నయనాంచనాల్లోకి చేరాయి.

ఆ దృశ్యం చూడగానే నరసమ్మగారు కర్పూరం తెప్పించి హారతి ఇప్పించింది.

మరిడమ్మగారు రెండు బుంగల నీరుతెచ్చి నెత్తిన కుమ్మరించింది.

ఆచార్యులుగారిలో చలనంలేదు.

అరగంట తర్వాత మామూలు స్థితిలోకి వచ్చి అమ్మనుచూచి-

"తడిగుడ్డలు విప్పమ్మా-మన యింటికి వెళదాం" అన్నారు.

అమ్మ తడిగుడ్డలు విప్పి గౌను వేసుకున్నది. ఇద్దరూ ఆచార్యులుగారి యింటికి బయలుదేరారు. ఇంట్లోని వారందరూ వరుసగా ఆచార్యులుగారికి ప్రణమిల్లారు. ఆనాడు అక్కడనే ఉన్న కనకమ్మబామ్మగారుకూడా వారికి నమస్కరించింది.

అమ్మా ఆచార్యులుగారూ వారింటికి చేరారు. ఆచార్యులుగారు నిత్యమూ దేవతార్చన జరుపుకునేచోట అమ్మను కూర్చున బెట్టారు.

ఆరోజు ఏకాదశి. రాత్రి ఏడుగంటలయింది. అట్లాగే వారిద్దరూ బొమ్మలవలే మూడు గంటలు కూర్చున్నారు.

తర్వాత ఆచార్యులుగారే కనులు తెరచి-

"తల్లీ... యింతకూ నీ వెవరమ్మా... చెప్పతల్లీ... రెండు మూడు నెలలనుండి యీ ఆలోచన కలిగినా అడిగే అవకాశం యీ నాటికి కలిగింది. ఏమమ్మా... మాట్లాడ వేమమ్మా.... పోనీ నేనెవరినో చెప్ప.... పలుకవమ్మా... పలుకుగల తల్లీ..." అని ప్రాధేయపడ్డారు.

"నీవు పలికే పలుకే నేను నాయనా-"

ఆ పలుకు వినగానే ఆచార్యులుగారు పులకితాంగులై వెంటనే అమ్మను ఆలింగనం చేసుకుని-

"నేనే అమ్మ అమ్మే నేను, నేనే అమ్మ, అమ్మే...." అని పునశ్చరణచేస్తూ నలభై ఒక్క కొబ్బరికాయలుకొట్టి నారింజకాయంత ముద్దకర్పూరం వెలిగించి-

"అమ్మా - నీ చేతి మీదుగా ఏమయినా వ్రాసి యివ్వమ్మా-" అని పుస్తకం అందించారు.

"చదువు రాదుగా నాయనా."

"నీవు చదువుతోనని చదువుతో వ్రాయి-"

అమ్మ పుస్తకం అందుకుని "ఏమి వ్రాయ మంటారు?" అని అడిగింది.

"వెలితిలేనిదిగా వ్రాయమ్మా-"

జానెడు కైవారంగల పెద్ద సున్నా చుట్టింది అమ్మ.

"వెల లేనిది ప్రసాదించావమ్మా-" అంటూ దానిని కనుల కద్దుకొని "ఎన్ని అర్థాల గల అక్షరాన్ని యిచ్చావమ్మా" అన్నారు.

"ప్రక్కన ఏ అక్షరం లేనప్పుడు అది వట్టిదేగా?" అని అమ్మ ప్రశ్నించింది.

"ప్రక్కన అక్షరం లేనప్పుడు ప్రపంచమంతా యిదేననీ. నేనే ననీ- చూపిస్తున్నావమ్మా. నా అనుభవాలన్నీ మన ఇంట్లో వాళ్లతో చెప్పమంటావా అమ్మా-"

"చెప్పినా-వారి అనుభవం కాదుగా నాయనా."

"చెప్పినా నమ్మరమ్మా-"

రాత్రి పన్నెండు గంటలయింది. తిరిగి యిద్దరూ చిదంబరరావుగారింటికి బయలుదేరారు. దారిలో పెద్ద త్రాచు యిద్దరిమధ్యనా నిలుచుని ఉన్నట్లు కనపడింది. ఆచార్యులుగారు ఉలిక్కిపడి అమ్మను కేకవేసి "దూరంగా వెళ్ళు - కాటేస్తుంది" అన్నారు.

"ఆ కాటులో ఘాటు లేదు లెండి."

"త్రాచుపాము, అమ్మా - విషం."

సర్పం హఠాత్తుగా ఆచార్యులుగారి నిలువునా లేచి తోకమీద నిలబడి వారి వంకనే చూస్తూ ఉన్నది. ఆచార్యులుగారు భయకంపితులై నిశ్చేష్టులైనారు. అరగంట తర్వాత కళ్ళు తెరచి చూడగా - అమ్మ సర్పపరివేష్టిత అయి ఉన్నది. ఆయన వెంటనే అమ్మపాదాలపై ఒరిగారు.

"పాములంటే నిర్భయుడనైన నేను ఎందుకింత భీత మనుస్కుడనైనాను? అయినా ... యీ సర్పం నిన్ను చుట్టవేసుకున్న దేవమ్మా?"

"ఇది మామూలు సర్పం కాదు నాయనా- నాగేంద్రుడు. ఆ నాగేంద్రుడే

నన్ను చుట్టుకుని ఉన్నాడు. నేను నాగేంద్రుడిని చుట్టించుకున్నాను. ఆ నాగేంద్రుడే నాగేశ్వరుడై వస్తాడు. వాడే నా కాధారం. వాడి ఆకారమే నేను."

అమ్మ నోటి వెంట వెలువడే ప్రతిమాటకూ ఆచార్యులుగారు ఉక్కిరిబిక్కిరై పోతున్నారు.

"అమ్మా... అమ్మా... ముగ్గురమ్మల మూలపుటమ్మా- నీకు ఆధారమేమిటమ్మా? నీవే ఆధారం..."

అంటూ అమ్మను తన బాహువుల్లో బిగించుకుని అశ్రుధారతో అమ్మ మూర్ధాభిషేకం చేస్తూ ఉంటే అమ్మ అన్నది -

ముగ్గురమ్మల మూలపుటమ్మ అంటే... ఆదియై, అనాదియై యీనాటి కిది అయింది. ముగ్గురు మూర్తులకు తల్లి మూలపుటమ్మ - మూడుభాగాలై, అన్ని అవస్థలు మూడుగాచేసి, తను త్రిపుటియై, బాలై, బాలాత్రిపుర సుందరై - మూడు కాలాలు, మూడు పూటలై - ముగ్గురు మూర్తులకు భార్యలై - మూడు గుణములై - ఆ మూడే సత్త్వ రజస్తమోగుణములై ... ప్రపంచమైనది. ప్రపంచమంటే ఒక భూతంలో నుండి అనేకంగా పంచబడినది. అందుకే - నాకు ఆధారం కావలసి వచ్చింది."

"అమ్మా - లోకజననీ ... నృసింహస్వామికీ తల్లివా, అమ్మా-"

"మళ్లీ అట్లా అంటారేమి?"

"ఏమీ లేదమ్మా - తృప్తిలేక, ఆనందం పట్టలేక, అమ్మా - చిన్నపిల్లవుగా కనబడడంలేదమ్మా. సాక్షాత్ ఆకాశానికీ భూమికీ నీవే అంటుకుపోయినట్లుగా కనబడుతున్నావు. భయం పుడుతున్నది. ఆనందమూ కలుగుతున్నది."

అంటూ గద్గదస్వరంతో-

"రండమ్మా రండి - చూడండి - మా ఆదిదేవుని. అవతారమూర్తిని.... నృసింహస్వామిని... రండర్రా- రండి... అమ్మా అమ్మా" అని కేకలు వేశారు.

ఆ ఉచ్చైస్స్వరానికి యిళ్లల్లో నిద్రపోయే వారందరూ ఉలిక్కిపడిలేచి బయటకు వచ్చారు. అమ్మ ఆచార్యులుగారిని అక్కడనే వదిలి యింటికి వెళ్లింది. బయటకు వచ్చిన వారికి ఆచార్యులుగారు ఒక్కరే కనపడ్డారు. అందరూ వారికి వళ్ళు

పెరిగిన దనుకొన్నారు.

వంగులూరి శేషతల్పశాయిగారి భార్య "అమ్మా - అమ్మా అంటున్నారు. నృసింహస్వామి భార్య ఆదిలక్ష్మి ప్రత్యక్షమయిందేమో-" అన్నది.

"ఆదిలక్ష్మి లేదూ, చెంచులక్ష్మిలేదు. అంతా భ్రమ. ఏమీ లేదక్కడ. అన్నీ మన వికారాలే..." అని తల్పశాయిగారు ఖండించారు.

అందరూ పునః గృహప్రవేశంచేసి పర్యంకాలపై ప్రశాంత చిత్తులై పవళించారుగానీ, ఆచార్యులుగారు. మాత్రం ఉద్విగ్న మానసంతో అక్కడనే తెల్లవారుజాము వరకూ జాగరణ చేశారు.

అమ్మ ఇంటికి వెళ్ళేసరికి తలుపులువేసి ఉన్నాయి. అందువలన బయటి అరుగుమీదనే పడుకుని తెల్లవారు జామున పనిమనిషికోసం తలుపులు తెరవగానే తానూ లోపలకు వెళ్ళి ముఖం కడుక్కుని అందరికీ కనుపించింది. రాత్రి అమ్మ లేనట్లు ఎవరికీ తెలియదు.

ఆనాటినుండీ లక్ష్మణాచార్యులుగారు రోజూ చిదంబరరావుగారింటికి వచ్చేవారు. అమ్మ ఆచార్యులగారింటికివెళ్ళేది. అమ్మను గురించి తెలుసుకున్న దెల్లా ఆచార్యులుగారు చిదంబరరావుగారితో చెప్పేవారు. ఇంట్లో మిగతావారికీ చెప్పినా మనసుకు పట్టేదికాదు.

ఒకరోజు సాయంకాలం అందరూ కూర్చొని ఉండగా "ఇంతకూ యీ తల్లి ఎవరి భార్య కావలసి ఉన్నదో. అయిన సంబంధాలేమయినా ఉన్నాయా?" అని అడిగారు.

ఎవరూ మాట్లాడలేదు.

"ఆయనే సంబంధం. అయిన సంబంధాలేమున్నాయి? సంబంధమే ఆయన. బంధమే ఆయన" అన్నది అమ్మ.

"ఆయన ఎవరు?" ఆచార్యులగారికి అర్థం కాలేదు.

"మీరుగూడ అడుగుతారేమి? మొన్ననే చెప్పానుగా-" అమ్మఙ్ఞప్తి చేసింది.

ఆ మాటను మరెవరూ వినకపోయినా, చిదంబరరావుగారు ఆలకించి

ఆనందంతో తల పంకించారు.

ఆచార్యులుగారు సంతుష్టాంతరంగులై-

"సీతాపతీ - నీది రత్నగర్భమయ్యా" అన్నారు.

"అందరిదీ రక్తగర్భమే" నన్నది అమ్మ.

"పోనీ - ఆ రక్తంకూడా అందరి రక్తం లాంటిది కాదమ్మా."

"అందరి రక్తం కలసిన రక్తం."

"అందరికీ నీ వర్ధం కావు తల్లీ-"

"అందరి సంగతీ వదిలేసెయ్యి. నీ కవుతున్నదా అర్థం?"

"నా కయితే అందరికీ అయినట్లు కనపడేదే... నీవు భావనాతీత వమ్మా ఎంత అర్థమయినట్లు ఉంటావో అంతలోనే అంత అందకుండా పోతావు. సరే-సీతాపతీ పిల్లవాడి ఉపనయనం చేసెయ్యి త్వరగా - వాళ్ళ అమ్మ ఆబ్దికమైనా పెట్టుకుంటాడు" ఆచార్యులుగారు సలహా ఇచ్చారు.

"ఈ కార్తీకమాసంలో చేద్దామనుకుంటున్నా" నని సీతాపతిగారు తమ అభిప్రాయం వ్యక్తం చేశారు.

"వద్దులే - మాఘంలో చెయ్యి"

"కొన్ని మ్రొక్కులున్నాయి. ఈ లోగా, తిరువళ్ళూరు వీరరాఘవస్వామి దగ్గర మ్రొక్కుబళ్ళు తీర్చుకురావాలి. మీ ఇష్టప్రకారం ముహూర్తం పెట్టండి-" అని అడిగారు సీతాపతిగారు.

"మార్గశీర్షమాసంలో వెళ్ళండి నాయనా - రేపు ఉదయం నాలుగు గంటలకు కార్తీకం ప్రవేశిస్తుంది" అని ఆచార్యులుగారు అన్నారు.

"అబ్బాయి వడుగు కాగానే మన్నవ వెళ్ళవలసి వస్తుంది. ఇంక ఆ ఊరిలోనే ఉండిపోతాము."

"సరే... మార్గశీర్షమాసం రేపు ప్రవేశిస్తుందనగా మద్రాసు చేరాలి" అని ఆచార్యులుగారు నిర్ణయించారు.

అందరూ అందుకు సమ్మతించారు.

26. సర్వజ్ఞ

ఆనాడు నరకచతుర్దశి.

తెల్లవారుజామున చిదంబరరావుగారింట్లో అందరూ తలంట్లు పోసుకుని మధురపేణి తిన్నారు.

అమ్మమాత్రం తలంటి పోసుకోలేదు. ఏమీ తిననూలేదు. అందువల్ల చిదంబరరావుగారు-

"ఏమమ్మా - పండగపూట తలంటి పోసుకోలేదేమి?"

"అదే ఆలోచిస్తూ ఉన్నాను. సరే - మీరు చెప్పండి - అసలు పండగంటే ఏమిటి? ఈ పండగ ఉద్దేశం ఏమిటి? ఇవి చెప్పి తలంటి పోయండి-"

"పండగ అంటే వేడుక. అందరూ ఉత్సాహంగా తలంట్లు పోసుకుని ... తల మురికి, శరీరం మురికివదిలించుకుని... నూతన వస్త్రాలు ధరించి, తమకు ఉన్నంతలో పిండివంటలు చేసుకుని తృప్తిగా భోజనం చేసి ఆనందంతో కాలం గడుపుతారు. అందరూ సమానంగా గడిపేదే పండుగ."

"అయితే - అందరకూ సమానమయిన ఆనందంలేనిది పండుగ కాదుగా?"

"కాదు."

"మరి - నా కానందం లేదు. ఇది పండుగ కాదా?"

చిదంబరరావుగారు ఉక్కిరి బిక్కిరై గుటకలు మ్రింగుతూ-

"పండగ అనే మాటకు అర్థం చెప్పాను. కాని ప్రతి వారూ ఆనందంగా ఉంటారని కాదు. ఆనందంలేనివారు కూడా ఉంటారు."

"పండగకు అర్థం చెప్పారు సరే. ఈ పండగ యొక్క ఉద్దేశం కూడా చెప్పండి".

"ఇది దుర్మార్గుడయిన రాక్షసుని వధించిన రోజు."

"ఎవరు వధించారు?"

"కృష్ణపరమాత్మ."

"కృష్ణుడు పరమాత్మేనా?"

"ఆఁ."

"పరమాత్మ నామరూపాలు లేనిది అనుకుంటున్నారుగా?"

"మే మనుకుంటున్నాములే. నీవు చెప్పు-"

"పరమాత్మ - అనేది నామమేగా? అంతటా నిండి ఉన్న దానికి రూప మున్నదిగా. అంటే ఒక రూపమైలేదు. అన్ని రూపాలై ఉన్నది. ప్రత్యేకరూపం లేదు కనుక రూప రహితుడు... అది సరే-నిజంగా కృష్ణుడేనా చంపింది?"

"అని పురాణాలు చెపుతున్నాయి. నీతో ప్రతిదీ తంటాయే."

"కృష్ణుడు భగవంతుడేగదా. భగవంతునికి గూడా దుర్మార్గులున్నారా? అన్నీ తనలో నుండే వచ్చినయ్‌గదా"

"ఏమిటో.... పురాణాలు దుష్టశిక్షణ, శిష్టరక్షణ అని రెంటినీ చెపుతూనే ఉన్నాయి"

"రాముడు గూడా అట్లాగే చెప్పాడా?"

"లేకేమమ్మా. ఆయనకూ దుష్టశిక్షణా, శిష్టరక్షణా రెండూ ఉన్నాయి."

"భగవంతుడుగా పూజింపబడేవారిలో యింతకూ ఎవరయినా ఆ ద్వంద్వం లేనివారున్నారా?"

"ఇప్పటికి రాలేదు. ఇక వస్తారేమో తెలియదు."

అంతలో ఒక పిచ్చికుక్క అటు వచ్చింది. దానిని చంపేందుకు కొందరు తరుముకు వచ్చారు. ఆకుక్క వారిని తప్పించుకుని చిదంబరరావుగారి దొడ్లోకి వచ్చి దాక్కున్నది.

"ఇటేమయినా పిచ్చికుక్క వచ్చిందా పంతులుగారూ?" రొప్పుతూ వచ్చి అడిగాడు ఒకాయన.

"కుక్క అయితే వచ్చిందిగాని పిచ్చికుక్క అని తెలీదు. అయినా మీరు

చూచుకోనండి - ఏమూల నయినా ఉన్నదేమో..."

వాళ్ళు దొడ్డి అంతా వెదికారు. ఎక్కడా కుక్క కనుపించలేదు. కుక్క అరటిచెట్లల్లో నక్కి కూర్చున్నది. వాళ్ళు వెళ్ళిపోయారు.

"తాతగారూ - వీళ్ళెందుకు కుక్క వెంట పరుగెత్తుకు వచ్చారు?"

"అది పిచ్చికుక్క. అది ఎవరిని కరిస్తే వారికి పిచ్చి ఎక్కుతుంది. అందుకని చంపటానికి వచ్చారు. ఒకటి పోయినా పదిప్రాణాలు రక్షింపబడతాయి."

"అయితే వీళ్ళు కూడా కృష్ణపరమాత్మ వంటి వాళ్ళేనా? ఒకడితో పదిమంది బాధపడకుండా ఉండట మేగా ఆయన చేసిందీ. కుక్క నరకాసురుని వంటిది."

"కృష్ణుడు నరకాసురుని చంపితే ప్రజలకూ భద్రత కలిగింది; వాడికీ జన్మరాహిత్య మయింది. వీళ్ళు కుక్కను చంపితే ప్రజలకు మాత్రమే ఉపయోగ పడుతుంది."

"అసలు.... దానికి నిజంగా పిచ్చేనా? దానిని కొడుతున్నారని తెలిసీ దాక్కొన టానికి వచ్చిందిగా ? ఇతరులను బాధించటం పిచ్చా? తన రక్షణ కూడా తెలుసుకో లేక పోవటం పిచ్చా?"

"నిజమే-దాని రక్షణ కూడా దానికేమి తెలుస్తుంది పిచ్చిదానికి?"

"పదిమందిని బాధించేదానిని పిచ్చి అంటున్నాం. ఒకరిని బాధించే దానిని కక్ష అంటున్నాం."

"పది మందిని బాధించినంతమాత్రాన పిచ్చి అనరు. వాడిని దుర్మార్గుడని అంటారు. ఒకళ్లను అయినా పరిమితి లేకుండా అకారణంగా బాధించినా దుర్మార్గుడనే అంటారు."

"ఆ బాధించేవాడి మనస్సుకు అక్కడ యేదో ఒక లోపం కానీ కష్టంకానీ కనపడకపోయినా బాధిస్తాడా, యేదీ కనపడకపోయినా బాధిస్తాడా?"

"వాడనుకున్నది కానప్పడుకూడా కష్టం ఉండవచ్చు."

"మన కిష్టంలేని పని చేసినా దుర్మార్గుడనవచ్చుగా? మంచిచెడ్డలు రెండూ

యిష్టానిష్టాల మీద ఆధారపడి ఉంటాయి?"

"పదిమందికీ ఇష్టమై ఒకడికి అనిష్టమైతే..."

"అసలు అది కాదమ్మా - సంఘంలో కొన్ని కట్టు బాట్లకు బద్ధుడై ఉన్నాడు సభ్యతకలవాడు."

"సభ్యత అంటే?"

"సంఘం, సభ్యత గుర్తించినవాడికి సంఘంలో ఒక స్థానమున్నది. మనిషిగా."

"సభ్యత అంటే ఏమిటో చెప్పకుండా దాటేస్తారేమిటీ? సభ్యత అంటే మర్యాదా? సభ్యత లేనివాడు మనిషికాడా? సభ్యత అంటే చెప్పటం కుదరలేదు."

"సభ్యత అంటే తన వ్యక్తిత్వాన్ని తాను పోషించు కోవటం."

"పోషించుకోవటమంటే డబ్బు సంపాదించటమా?" అన్నం తినటమా?"

చిదంబరరావుగారు పకపకా నవ్వి-

"ఆఁ- అన్నీ. అయినా నీ కెందుకీ ప్రశ్నలు? ఔనులే. నీకు గాకపోతే మరి ఎవరికి? ముద్దుగా నీవు అడగటమూ, నేను చెప్పటమూ తప్ప - నీకు తెలియని దేమున్నదీ?"

"నాకు తెలియనిది లేదంటూ మీకు తెలిసిందిగా, అయినా నా స్థితి అంతా మీకు తెలుసన్నమాట. మరి నేను రేపు ప్రొద్దున ఏమి చేస్తానో చెప్పండి-"

చిదంబరరావుగారు చిరునవ్వుతో-

"ఏం? నేను చెప్పలేనివాణ్ణి అనుకొన్నావా? నిద్ర లేస్తావు, ముఖం కడుక్కుంటావు. కాకపోతే, దొడ్లో చెట్ల చుట్టూ తిరుగుతుంటావు... నాకు తెలియదనుకున్నావా?..."

అమ్మ ఆ విషయాన్ని అంతలోనే ఆపి-

"తాతగారూ - కుక్కదగ్గరకు వెళ్ళి వద్దాం, రండి-" అని పిలిచింది.

"ఈ మాటలతోనే సరిపెడుతున్నావు. త్వరగా తలంటుకుందువుగాని, రా..."

అని అమ్మచెయ్యి పట్టుకున్న చిదంబరరావుగారితో అమ్మ చిరునవ్వు చిందిస్తూ అన్నది-

"కావలసినంత ఆముదం అంటుకునే వచ్చాను."

"ఏదీ? ఎప్పుడంటుకున్నావు?" - అంటూ చిదంబరరావుగారు అమ్మ తలమీద చెయ్యిపెట్టిచూచి "అంటుకో లేదే-" అన్నారు.

"నా ఆముదం అందరికీ అర్థంకాదు. చూస్తే కనపడేది కాదు. చేతికి తగిలేది కాదు. అది నాకే కాదను కొనండి, అందరికీ ఉన్నది. ఆముదమంటే జిడ్డు గలది. నాలుగు ప్రక్కలా కమ్మేది. ఆ జిడ్డే సంస్కారం. ఈ సంస్కారాలకు ఆస్కారమయినా తానూ సంస్కారాన్నే పెట్టుకురావాలి. అందరి సంస్కారాలు తనయందే ఉంటాయి."

"ఏమోనమ్మా - యీ స్వల్పమయిన తలకాయకు ఏమి అర్థమవుతుంది?"

"నేను చెప్పిన దానిలో స్వల్పం, గొప్ప - యేమీలేదు."

అంతలో అన్నపూర్ణమ్మగారు అరచేతిలో ఆముదం వేసుకుని-

"ఇంతసేపు తలంటుకోకుండా ఎక్కడున్నావు?" అని ఆముదం తలకుపెడుతూ "ఈ స్నానమైతే నీవు ఎక్కడున్నా ఏమీ ఫర్వాలేదు. నీవు చేయవలసిన పనులు ఇక్కడ ఏమీ లేవు. తాత, మనుమరాలు ప్రొద్దుగూకులూ కూర్చొనవచ్చు" నన్నది.

అమ్మ అన్నపూర్ణమ్మగారితో ఏమీ మాట్లాడక చిదంబరరావుగారిని అడిగింది-

"స్నానానికి వెళ్ళమంటారా?" అని. చిదంబరరావుగారు అంగీకరించారు.

అమ్మ ఒక అడుగు ముందుకువేసి, ఆగి-

"మళ్ళీ వచ్చిన తర్వాత నయినా నాకీ సంశయం తీర్చాలి" అన్నది.

"ఏమిటా సందేహం?"

'కృష్ణుడు పరమాత్మ అయినప్పుడు - వాడికీ రెండు ఉంటాయా -

దుష్టత్వమూ, శిష్టత్వమూ - అని? ఆ రెండూ ఎవరిచేత కల్పింపబడ్డాయి?"

"ఎవరిచేత కల్పింపబడే దేమున్నది? దుష్టత్వంవాడి ప్రారబ్ధంచేత వస్తుంది."

"వాడు వచ్చిన తర్వాత ప్రారబ్ధమా? ప్రారబ్ధంచేతవాడు వస్తాడా?"

"ప్రారబ్ధంతోనే వస్తాడు."

"అప్పడు ప్రారబ్ధం ఎవరు?"

"ఇది చాలా చిక్కుసమస్య తల్లీ. నాకు తేలేదికాదు."

"పోనీ-యిది చెప్పండి. సృష్టి ఎవరిచేత ఏర్పడ్డది?"

చిదంబరరావుగారు కొన్ని క్షణాలు ఆలోచించి తల పంకించి అన్నారు" అంతా లీల అంటున్నారమ్మా.

"అంటే ఒకడుగా ఉండి ఒకడే ఆడుకుంటున్నాడనా? వాడెవరు?"

మేధావంతులయిన చిదంబరరావుగారి ఆలోచనా విధానమే స్తబ్ధమవగా అప్పడు వెంటనే అమ్మ అన్నది-

"కర్త, కర్మ, క్రియ-మూడూ ఒకటేగా? కర్మ, క్రియ, కర్తలోవే."

కొన్ని క్షణాలు చిదంబరరావుగారు నిశ్శబ్దంగా అమ్మ ముఖం వంక చూస్తూ ఉండి-

"అమ్మా - అనసూరీ... ఇది చెప్పటానికి నా తాహతు చాలదు. కానీ శాస్త్రాలు మాత్రం పరమాత్మచేత కల్పింపబడ్డ దంటున్నారు. మళ్ళీ దానిలోనే కలిసి పోతుందంటున్నారు."

"నాకది అక్కర్లేదు. భగవంతుడంటే నామరూపాలు ఉన్నాయా? అతనికి సంకల్పాలున్నాయా, లేవా?"

"శాస్త్రాలు నామరూపరహితుడనీ, సంకల్పరహితుడనీ అంటున్నాయి."

"అయితే - నిన్న మీరు భారతం చదివేటప్పడు అన్ని రూపాలూ నావే నని కృష్ణుడన్నట్లు చదివారుగా? అన్నిరూపాలూ ఆయనే కావటంచేత, ఆయనకు

వేరే రూపం లేదు గనుక రూపం లేనివాడనా? అందరి సంకల్పాలూ ఆయన సంకల్పమే గనుక ఆయనకు వేరే సంకల్పం లేదనా ? అన్ని నామాలూ ఆయన నామాలే. ఆయన సంకల్పరహితుడు కాదు. సంకల్ప సహితుడు. ఆయనది సంకల్ప రహితమయిన సంకల్పం."

అమ్మ గంభీరవదనయ్యై, సుస్పష్టమయిన స్వరంతో అపూర్వ నిర్వచనాలు పలుకుతూంటే ఆశ్చర్యచకితులైన చిదంబరరావుగారు-

"రహితమయిన సంకల్పమేమిటి?" అని అడిగారు.

"రెండు లేనిది. రెండూ తానయినది. రెండుగా తోచనప్పడు రాగరహితు డవుతాడు."

"అందుకే మనవాళ్ళు..." అంటూ చిదంబరరావు గారు నిశ్చేష్టులై పోయారు.

"అసలు ముక్కతేలలేదు, తాతగారూ. ఏమంటారు?" అని అమ్మ తరచి అడిగింది. కొద్దిక్షణాలు ఆయనలో ఏ కోశానా చలనమూ, ఆలోచనా లేవు తర్వాత ఆయనే అన్నారు-

"ఎంతసేపూ నిన్నే చూడబుద్ధి అవుతున్నది. మాట్లాడాలనిపించటం లేదు. నీ ప్రశ్నకు సమాధానం ఏమి చెప్పాలో తెలియటం లేదు."

"అయితే సరే - తలంటిపోసుకుని వస్తా" నన్నది అమ్మ.

"ఇంకో పదినిమిషాలు ఉండమ్మా-" చిదంబరరావుగారు వేడుకున్నారు.

అంతలో అన్నపూర్ణమ్మగారు అమ్మను పెద్దగా కేకవేసింది. అమ్మవెంట చిదంబరరావుగారు కూడా వెళ్ళారు. అమ్మ దొడ్లోకి వెళ్ళగానే మరిడమ్మగారు నూనెసీసా తీసుకొని కృష్ణుడి సుద్దులు పాడుతూ అమ్మకు తలంటి, నీళ్ళు పోసింది.

"వినటానికి ముద్దుగానే ఉన్నాయిగానీ తాతమ్మా- చూస్తే విసుగు వచ్చేదేమో కృష్ణుడి అల్లరి" అన్నది నవ్వుతూ.

"వాడి అల్లరి చూచినా విసుగు రాదమ్మా" అన్నది మరిడమ్మగారు.

"ఎంత మొద్దుపిల్లవయినా నీవు ముద్దురావటంలేదూ? అట్లా ఆ కృష్ణుడూ ముద్దువచ్చే వాడేమో.." అన్నది అన్నపూర్ణమ్మగారు.

"తెలిసి అన్నా తెలియక అన్నా మంచిమాటే అన్నది మన్నవ వెంకయ్యగారి కూతురు. మంచిమాట ఏమిటిలే, ఉన్నమాటే" అన్నారు చిదంబరరావుగారు నన్నగా నవ్వుతూ."

"ఉన్నదెల్లా అంటూ ఉంటుందా మా అత్తయ్య?" అమ్మ ప్రశ్నించింది.

"ఉన్నది ఉన్నట్లు మాట్లాడినా మాట్లాడకపోయినా వినేవారినిబట్టి అర్థమవుతుంది. ఇంతమందిలో ఆవిడ అన్నమాటలని తెలియలేదుగా?" అంటూ చిదంబరరావుగారు దొడ్లో అరుగుమీద ఎదురుగా కూర్చున్నారు.

"మీకేమీ పనిలేదా తాతగారూ - కోర్టుకు వెళ్లరూ?" అని అమ్మ అడిగింది:

"ఎక్కువ పనిలేదుగానీ వెళ్లివస్తా."

"ఈ రోజుకూడా కోర్టు ఉన్నదా?"

చిదంబరరావుగారు ఆలోచించి అన్నారు "పండగ ఎట్లా ఉన్నా - యిది మూడవ శనివారం. సెలవు రోజు - మరిచేపోయినా..."

అన్నపూర్ణమ్మగారు చిదంబరరావుగారిని కూడా తలంటి పోసుకొనమని కోరింది.

"నాకు నా మనుమరాలు పోస్తుందిలే" అన్నారు చిదంబరరావుగారు. అంటూండగానే అన్నపూర్ణమ్మగారు నూనె తీసుకు తలంటింది.

అంతలో మరిడమ్మగారు వచ్చి "చిదంబరం - అమ్మాయి పొట్ట, బొడ్డు జూచావా ఎట్లా ఉన్నాయో..." అన్నది.

"ఏమోనమ్మా - నాకేమీ అర్థంకాలేదు. పొట్ట అర్థంకాలేదు కానీ..." అని ఆపారు చిదంబరరావుగారు.

"ఆc_ కాని - ఏమిటి?"

"ఆc - ఏమీ లేదమ్మా, ఆమెగారి జన్మే యెట్లా ఉన్నదో చూడు అన్నట్లు

ఉన్నది. ఎప్పటికప్పుడు దేనికదే క్రొత్త. అమ్మాయి విషయంలో అంతా నిత్య నూతనమే" అని గంభీరంగా అంటూ అమ్మ కన్నుల్లో నురుగు పడుతుందేమో గుడ్డ అడ్డం పెట్టమని హెచ్చరించారు.

చిదంబరరావుగారి నోటివెంట పూర్తిగా మాటలు వెలువడ లేదు. అమ్మ కళ్ళు తెరవడమూ, నురుగుధార కళ్ళల్లో పడడమూ జరిగింది.

"అయ్యో" అని చిదంబరరావుగారు పెద్దగా కేకవేసి అమ్మతలపై నీళ్ళు పోయబోయారు. కన్నుల్లో బాగా నురుగుపడ్డా - ఏదో ఆశ్చర్యకరమయిన సంగతి జరిగితే చూస్తూన్నట్లు అమ్మ కళ్ళు తెరచి చూస్తూ ఉన్నది.

చిదంబరరావుగారు "అనసూరీ..." అని పిలిచారు. అమ్మ పలకలేదు.

"ఎక్కడ ఆలోచిస్తున్నావు? ఏమిటా విశేషం?"

క్రమేణా అమ్మదృష్టి యేదో ప్రమాదం జరుగుతూంటే చూస్తున్నట్లు పరివర్తన చెందింది.

కొద్ది నిమిషాల్లో ఒకామె చిదంబరరావుగారింటికి పరుగెత్తుకు వచ్చింది - శోకాలు పెడుతూ.

సరిగ్గా - అమ్మ కన్నుల్లో ప్రమాద సంఘటన ద్యోతితమయిన సమయాన ఆమె కోడలు గాయపడింది. ఆ కోడలిని మంచంమీద ఆసుపత్రికి పంపి అత్తగారు తమకు పరిచితులయిన చిదంబరరావుగారి కోసం వారింటికి వచ్చింది.

తదేకంగా దృష్టి సారిస్తున్న అమ్మ ఆమె రాగానే "మీ కోడలికి ఎట్లా ఉన్నది?" అని అడిగింది.

అమ్మ ప్రశ్న విని మరిడమ్మగారు ఆశ్చర్యంగా "ఆమె వాకిట్లోకి రాగానే అట్లా అడుగుతావేమిటి? ఆమె కేమయినా జబ్బుగా ఉన్నదా?" అని అడిగింది.

వారి సంభాషణ ఏమీ వినిపించుకోకుండానే ఆమె పెద్దగా శోకాలు పెడుతూ చిదంబరరావుగారిని ఆసుపత్రికి రమ్మని కోరింది.

ఆమె మాట ఆలకించకుండా చిదంబరరావుగారు అమ్మ ముఖంలో

పరిణామం చెందుతున్న వర్చస్సును అవలోకిస్తూ "అమ్మాయికి త్వరగా నీళ్ళు పోయండి" అని చెప్పి ఉత్తరీయం పైన వేసుకుని ఆసుపత్రికి వెళ్ళారు.

మార్గమధ్యంలో చిదంబరరావుగారు సర్వజ్ఞురాలైన అమ్మను ఎవరూ అర్థం చేసుకోలేదని అనుకుంటూ అంతకు క్రితం అమ్మస్థితికి, అప్పుడు జరిగిన ఆ సంఘటనకూ సమన్వయం కుదుర్చుకుంటూ - ఆ ప్రమాదం జరిగిన ఆమెను తీసుకుని వచ్చి అమ్మకు చూపించితే ఏమయినా ప్రయోజనం ఉండవచ్చునని ఊహించి వెనక్కు తిరిగి వచ్చి అమ్మను "తల తుడుచుకున్నావా?" అని అడిగారు.

"తుడిచారు."

"గౌను తొడుక్కో అమ్మా-"

"తాతగారు ఏమిటో ఆలోచిస్తున్నారే? ఆ అమ్మాయి బాధను గురించేనా? ఇట్లాంటివి ఈ వేళ ఇంకా ఎన్ని జరిగాయో.. రేపు మీరే వింటారు."

"రేపు వినేదేమున్నది? ఇప్పుడే చెప్పమ్మా...."

"తమాషాగా అన్నాను. నాకేమి తెలుసు...?"

"అర్థంకాని తల్లీ-నీవి వ్యర్థంకాని పలుకులు. ఎక్కడేమి జరుగుతున్నాయో...."

అని చిదంబరరావుగారు అంటూ ఉండగా ఆ అత్తగారు తిరిగివచ్చి-

"ఏం నాయనా-యింతవరకు రాలేదు. మీ మనుమరాలితో, మీ ఆనందం తోనే సరా? మా ప్రాణం మీదకు వచ్చి మీ సహాయం కోరినా మీరింతవరకు రాలేదు. పైగా వస్తున్నానని చెప్పి పంపారు."

"నా మనమరాలూ, నా ఆనందమే నీ కోడలికి ప్రాణం పోకుండా చేసింది."

"ఏమిటీ? ఎట్లా..." అంటూ ఆమె విస్మయంతో కళ్ళు పెద్దవిచేసింది.



అమ్మవాక్యాలు

తన్నుతాను విమర్శించుకోవడం వివేకం - ఇతరులను విమర్శించడం అవివేకం.
సర్వత్రా ఉండే మమకారం మాధవత్వాన్ని గుర్తింపచేస్తుంది.



27. "అంతా నేనే"

ఆ అత్తగారు విస్మయ సాగరంనుండి ఆనందతీరం చేరి-

"ప్రాణమోసం లేదుగదా - అంతకన్నా నాకు కావలసిన దేమున్నది?"

"ఇంతకూ ఆసుపత్రిలో ఎంతవరకు జరిగింది వైద్యం?" చిదంబరరావుగారు అడిగారు.

"మందువేసి కట్టు కట్టారు. అమ్మాయి మాట్లాడడం లేదు."

ఆమె చెప్పే మాటల నాలకిస్తూ చిదంబరరావుగారు అమ్మముఖంలోకి చూచారు. ప్రసన్నరేఖా విలసితమయిన అమ్మ వదనమండలం చూచి ధైర్యంతో ఆసుపత్రికి బయలుదేరారు.

ఆ సమయంలోనే కంకటపాలెం నుండి అంతకన్న ఎక్కువ ప్రమాద కరమయిన దెబ్బలు తగిలినవారు అరుదెంచారు. వారిని చూడగానే అంతకుముందే అమ్మ అన్న "ఇంకా ఇలాంటివి ఎన్ని జరిగినయ్యో...." అన్న వాక్యం జ్ఞప్తికివచ్చి వారి యొద్దకు వెళ్ళి-

"మీరు ఎప్పుడు పొడుచుకున్నారు?" అని అడిగారు.

వారికీ అదే సమయాన దెబ్బలు తగిలినట్లు తెలిసింది. చిదంబరరావుగారు మరొకమారు అమ్మ సర్వజ్ఞత్వానికి ఆశ్చర్య చకితులైనారు.

లోపలకు వెళ్ళి గాయపడిన అమ్మాయి సంగతి విచారించారు. ప్రమాద మేమీలేదని విని సంతోషంతో చిదంబరరావుగారు వెనుదిరిగారు, వెంటనే అమ్మను చూడాలని. ఆసుపత్రిగేటు దగ్గరకు వచ్చేసరికి మరొక దృశ్యం చిదంబరరావుగారి దృష్టిని ఆకర్షించినది. ఒకామెను మంచంమీద పడుకోబెట్టుకొని మోసుకువస్తూ ఉన్నారు. చిదంబరరావుగారు 'ఏమిటీ?' అని ప్రశ్నించారు.

"అయ్యా - నేను గొల్ల అమ్మన్నను. మా అమ్మాయి ప్రొద్దున తొమ్మిది గంటల నుండి నొప్పులతో బాధపడుతున్నది. ఆ బాధతోనే గొడ్డుకు మేత వెయ్యబోతే ఆ

గొడ్డు కొమ్ము, పొట్టలో పొడుచుకుని లోపలున్న బిడ్డ చెయ్యి, వేలూ బయటకు వచ్చాయి... అందులో కొమ్ములు నిన్ననే సన్నగా చెక్కించాను."

"ఎన్ని గంటల కమ్మన్నా?" చిదంబరరావుగారు ఆత్రంగా ప్రశ్నించారు.

"ఉదయం పదిగంటల ప్రాంతంలో."

చిదంబరరావుగారి ఆశ్చర్యమూ ఆనందమూ పందెం వేసుకుని సరిహద్దులు దాటుతున్నాయి. ఉదయాన అమ్మ మాట్లాడిన మాటల్లో - ఇదికూడా ఒక సంఘటన అయి ఉంటుందనిపించింది. వెంటనే అంగలువేస్తూ ఇంటికి వచ్చారు. మేడమీద ఒంటరిగా కూర్చున్న అమ్మవద్దకు వచ్చారు.

"ఏమమ్మా - ఒంటరిగా ఏం చేస్తున్నా విక్కడ?"

"నే నెప్పుడూ ఒంటరిదాన్ని కాను. నాలో అందరూ ఉన్నారు."

"అందరూ నీలో ఎట్లా ఉన్నారు? వేరుగానే కనపడుతూ ఉన్నారుగా"

"అంటే - నా మనస్సులో అందరూ గుర్తువస్తూనే ఉన్నారు. అనేకం, అనేకులు, అనేక విషయాలు... ప్రపంచమంతా మనసులో నెమరువేసుకుంటున్నాను. అందువల్లనే నేనే అన్నీ అయినాననీ, నేను ఒంటరిదాన్ని కాననీ అన్నాను."

"ఈ రోజు ఆసుపత్రిలో అనేక ప్రమాద సంఘటనలు విన్నాను. మన అమ్మన్న ఉన్నాడే - అతని కుమార్తెకూ ప్రమాదకరమయిన గాయమయింది. మరొకటి కంకటపాలెంలో, మరొకటి నందాయపాలెంలో, ఇంకొకటి ఇంకొకచోట. వారినందరినీ విచారిస్తే...."

అంటూ చిదంబరరావుగారు సన్నగా, భావగంభీరంగా నవ్వుకుంటూ దీప్తిమంతములూ, సర్వలోకావలోకన సమర్థములూ అయిన అమ్మ నయన యుగళిలోకి నిశితంగా చూస్తూ-

"అమ్మా - అనసూరీ... నేనొక చిన్నసంగతి అడుగుతాను చెప్తావా?"

"అడగండి - విషయం చిన్నదా ? మాట చిన్నదా ?

"విషయం అనేదికూడా మాటేగా?"

"మాటకు సంబంధించినంతవరకూ మాటలన్నీ మాటలే. చేసేది పని - చెప్పేది మాట. ఎంత పెద్దపని చేసినా, ఎన్నిరోజులపనిఅయినా, ఎంత శ్రమ అయినా, మాటలతో చెప్పాలంటే - 'శ్రమ'. అంటే రెండక్షరాలుగల మాటేగా? అక్షరాలు రెండు మాత్రమే అయినా వినగానే వెంటనే ఆ అక్షరాల్లో ఉండే భావం ప్రతి ఒక్కరికీ అనుభూతమవుతుంది."

"ఇంతకూ నేను అడిగింది పోగొట్టావా?"

"మీరడగవలసింది మీ దగ్గరే ఉన్నది."

"వేలికి వేస్తే కాలికీ, కాలికి వేస్తే వేలికీ... మన్నవ వారిపిల్లకాదూ?" అంటూ శిరస్సును తన చేతుల్లోకి తీసుకుని ముద్దు పెట్టుకుని, తనివితీరా చంకకు ఎత్తుకుని అమ్మ చెవి దగ్గరగా నోరు పెట్టి.

"అమ్మా-నీకు ఎక్కడ ఏమి జరిగినా తెలుస్తాయా? నే నెవ్వరికీ చెప్పనులే... చెప్పు-" అన్నారు చిదంబరరావుగారు.

"చెప్పరూ? బలేవారు! మీకేమయినా తెలుసేమో చెప్పండి - నాకు అగోడ అవతలిదే తెలీదు. ఎదురుగుండా ఉన్నదే అర్థం చేసుకోలేను. అయినా మీరు ఎత్తుకు తిరిగే పిల్లను - నన్ను పట్టుకు ఇట్లా అడుగుతారేమిటి? నన్ను చూస్తే మీకు పరిహాసమా...? అయితే మీ స్థితి చాలా గొప్పది. సర్వం తెలును ననుకున్న అమ్మను మీ చంక బెట్టుకున్నారు. అమ్మ స్థితినంతా మీరే చక్కబెడతారా?"

"నీ స్థితి చక్కబెట్టే వాడినా, అమ్మా? అయినా చక్కబెట్టటమంటే ఏమిటి?"

"ఏమిటి అనుకొని చక్కబెట్టేవాడినా అన్నారూ?"

"నీ వన్నావని అది ఎంతమాటో అనుకొని - నేను అంత వాడినా - అని అన్నానమ్మా"

"నేనూ ఎవరో అనుకుంటుంటే విని అన్నాను. ఇంతకూ మీరడిగేది కూడా నేను అర్థం చేసుకోలేను. తాతగారూ-"

"పోనీలే, అమ్మా - అట్లాగే ఉండూ..."

అంతలో అన్నపూర్ణమ్మగారు మేడమీదకు వచ్చి- "ఎంత సేపయింది వంట అయి? పండగపూట అన్నాలకు రారా?" అన్నది.

"పండగ కానినాడు అన్నం తినకుండా ఊరుకుంటున్నామా?" అన్నది అమ్మ చిన్నగా నవ్వుతూ.

"వస్తున్నాం, పద-" అని అమ్మ చెయ్యి పట్టుకుని "ఏమమ్మా పోదామా?" అని చిదంబరరావుగారు అడిగారు.

"నేను రాలేనులే, మీరు వెళ్ళండి-"

"ఎందుకనీ? ఇద్దరం కలిసి తిందాము, రా-"

"నేను రాను తాతగారూ-"

అమ్మ మాట వినిపించుకోకుండా, చిదంబరరావుగారు అమ్మను ఎత్తుకుని క్రిందకు తీసుకువెళ్ళి వంట మనిషిని పిలిచి- అమ్మాయికి కూడా మడి కొల్లాయి గుడ్డ యివ్వండి-" అన్నారు.

"ఎందుకూ? దానికి వేరే పెట్టరాదూ?" అని అన్నపూర్ణమ్మగారు అందుకున్నారు.

"నా దగ్గరే కూర్చుంటుంది" చిదంబరరావుగారి కంఠంలో నిర్ణయం వినిపించింది.

"ఎందుకు తాతగారూ - ఆకలిగా లేదని చెప్పాను గాదా"

"ఎందుకూ తినబోయేదానికి వేరే పెట్టమంటావు?" చిదంబరరావుగారు అన్నపూర్ణమ్మగారిని విసుక్కున్నారు.

"నేను తినటానికి రాలేదుగా. మీరు ఎత్తుకు వచ్చారు" అమ్మ నెమ్మదిగా అన్నది.

"తినటానికే గదమ్మా - నేను తీసుకువచ్చింది?"

"మీరు తినటానికే తీసుకువచ్చారు."

చిదంబరరావుగారు అమ్మ మాటలోని శ్లేషకు ఫకాలున నవ్వి- "నేను

తినటానికి కాదమ్మా - నీవు తినటానికే నిన్ను తీసుకువచ్చాము" అన్నారు.

"నిజమే కాని నేను తినకుండా వెళ్ళటానికి వచ్చాను. తిన్నా తినక పోయినా ఒకటిగానే ఉంటుంది. తాతగారూ-"

అంతలో సీతాపతిగారు మడికట్టుకుని భోజనానికి వచ్చారు. ఇంటిలో ఉన్నవారందరూ బంతులుతీర్చి భోజనాలకు కూర్చున్నారు. సీతాపతిగారు అందరివంకా జూచారు. ఎక్కడా రాఘవరావు మామయ్య కనుపించలేదు. పండగపూటకూడా అందరితో కలిసి భోజనానికి రాలేదుగదా అని వారికి చాలా బాధ కలిగింది.

"నీవయినా రా అమ్మా-" అని అమ్మవంక తిరిగి అడిగారు. వారి రెండు కన్నులనిండా తొణికిసలాడే కన్నీరు అందరి హృదయాలను కదిలించివేసింది.

తాతగారి కన్నీరు చూచిన అమ్మ అంతకుముందు అన్నం తినవని అన్నా వెంటనే "ఎక్కడ కూర్చోమంటారు?" అని అడిగింది.

చిదంబరరావుగారూ, సీతాపతిగారూ ఇద్దరూ నా దగ్గర కూర్చోమంటే నా దగ్గర కూర్చోమని అడిగారు. భారతి అత్తయ్య అమ్మను వేరే కూర్చోమని కంటితో నంజ్ఞచేసింది. అమ్మ వేరే ఆకు తెచ్చుకుని వేసుకుని అందరినీ తలాకొంచెమూ అందులో పెట్టమని అడిగింది.

"కూర్చుంటే మా దగ్గర కూర్చో - తలా కొంచెం ఎందుకమ్మా?" చిదంబర రావుగారు యిష్టపడలేదు.

"నాపాలు అందరి పాలబడ్డది."

"ఏం మాటలు? - పిచ్చిమాటలూ..." అని భారతి అత్తయ్య అమ్మ జడపట్టుకుని లాగింది - మాట్లాడవద్దని సూచనగా.

అమ్మ తల వెనుకకు విరుచుకోవటం చూచి చిదంబరరావుగారు అడిగారు- అదేమిటని.

"మెడ నొప్పిగా ఉంటే వెనక్కు విరుచుకున్నాను" అమ్మ అబద్ధమాడింది.

"అయినా నీకై నీవు విరుచుకున్నట్లు లేదే?"

36

"ఏదయితేనేమిలే భోజనాలు త్వరగా కానీయండి-"

సీతాపతితాతగారు ఏదో ఆలోచించుకుంటూ, కన్నీరు కారుస్తూ అన్నం కలుపుకుంటూ ఉన్నారు. అమ్మకు ఎవరూ అన్నం పెట్టలేదు. వంటమనిషి అన్నం తీసుకువచ్చి వడ్డించింది. అందరూ భోజనాలుచేసి లేచారు. అమ్మ ఆకు దగ్గరనే కూర్చున్నది.

"ఎందుకమ్మా అట్లా కూర్చున్నావు, తినకుండా?" వంటమనిషి అడిగింది.

"తింటే తినూ-లేకపోతే లేదూ - ఎందుకు అట్లా కూర్చుంటావూ?" భారతి అత్తయ్య మందలించింది.

"ప్రొద్దున్నే యిడ్లీ పెట్టారా?" - వంటమనిషి సందేహం.

"ఇడ్లీ లేదూ, దాని మొహమూ లేదు."

"పోనీ - పరమాన్నయం వేయించుకో, అమ్మా-"

"దానికి పరమాన్న మెందుకూ? - అంతా పరమానందమే" అన్నది హేళనగా భారతిఅత్తయ్య.

అమ్మ వెంటనే లేచి దొడ్లోకి వెళ్ళి చెయ్యి కడుక్కుని సరాసరి చిదంబర రావుగారి వద్దకు వెళ్ళింది. వారు ఖిన్న మనస్కులై "ఏమమ్మా అన్నం తినలేదుగా" అని అడిగారు.

"ఇంకా ఆ సంగతి ఎందుకులే, పోనీలెండి" అని అమ్మ సర్దివేసింది.

"పువ్వొత్తులు వెలిగిస్తావా అమ్మా?"

"నేను వెలిగించలేనండీ... అసలు వెలిగించటమెందుకూ?"

"నిన్న చెప్పానుగా- ఒక అసురుడు పోయిన దినమనీ, అందరికీ ఆనంద ప్రదమయిన స్మృతిచిహ్నమయిన దినమనీ..."

"అటువంటి ఆనందం నాకు లేదు. ఒక బిడ్డ తరిగాడని బాధకూడా లేదు లెండి. కృష్ణుడిని చూస్తే సంతోషమూ లేదు, నరకాసురుడు చస్తే బాధాలేదు."

"ఎందుకనీ?"

"ఏమో... నాకు ఎప్పుడూ ఏమీ అనిపించదు. ఏ సంఘటనా నాకు సుఖాన్ని గానీ, దుఃఖాన్నీగానీ యివ్వవు. అంతా, అన్నీ నేనే ననిపిస్తుంది. నేనంటే - యీ అనసూయమ్మనే అని కాదు. అందరిలో ఉన్ననేను."

అంతలో లక్ష్మణాచార్యులుగారు వచ్చి అమ్మను ఎత్తుకుని - "ఈ ఉదయం తొమ్మిదింటికి మా ఇంటికి వచ్చావటమ్మా?" అని అడిగారు.

చిదంబరరావుగారు వకవకానవ్వి "తొమ్మిదింటికి తలంటి పోసు కుంటున్నది."

లక్ష్మణాచార్యులుగారు "మా ఇంటికి వచ్చిందే, చేతిలో మొక్కజొన్నకండె కూడా పట్టుకున్నది. నేను చూచాను" అని ఆశ్చర్యం ప్రకటించారు.

"అవి అసలే లేవు మా ఇంట్లో. అయినా మన చర్చ ఎందుకూ? ఎదురు గుండా ఉన్నదిగా, అడుగుదాం" అన్నారు చిదంబరరావుగారు.

"నిజమే తాతగారూ - మీరు ఆసుపత్రికి వెళ్లినప్పుడు తొందర తొందరగా వెళ్లి వచ్చి కిటికీలో కూర్చున్నా."

"అప్పుడు తొమ్మిది గంటలు కాదుగా - పది అయింది" అన్నారు చిదంబర రావుగారు.

"మా ఇంటికి వచ్చినప్పుడు తొమ్మిదే అయింది."

"మీ గడియారం ఆగిపోయింది" అన్నది అమ్మ.

లక్ష్మణాచార్యులుగారు నవ్వుతూ "నాకు గడియారం సంగతి తెలీదను కున్నావా అమ్మా-" అన్నారు.

"జరిగింది జరిగినట్లు చెప్పూ - మరి..."

అమ్మ లేని విసుగును ప్రదర్శిస్తూ "అబ్బా - ఎట్లా అయితేనేమి? - వెళ్లి వచ్చాను" అన్నది.

లక్ష్మణాచార్యులుగారు అనిమేషంగా అమ్మ వదనం లోకి అవలోకిస్తూ-

"ఈ రోజు ముఖం యింత ఉజ్వలంగా కనబడుతున్నదేమమ్మా?"

"అంటే రోజూ లేదేనేవా?" అమ్మ నవ్వింది.

అంతలో చిదంబరరావుగారు అందుకుని-

"రాత్రి నిద్రలో ఏమిటో కలవరించావమ్మా అది కలవరింతంగా మాత్రంలేదు. ఎవరితోనో సంభాషిస్తున్నట్లుగా ఉన్నది. మాటలన్నీ స్ఫుటంగా ఉన్నాయి. కలవరింతలో మాటలకు అంత బలం ఉండదు" అన్నారు.

"కలవరింత కూడా - ఏదో ఒక దృశ్యం కనబడితే వారితో మాట్లాడడమేగా? చూచేవాళ్లకు కనబడదు. కలవరించేవాడి దృష్టిలో అది నిజమే. వాడికి ప్రత్యక్షమే - వీడికి వింతగానే ఉన్నది. వాడికి కలవరమే-వీడికి వింత. అదే కలవరింత" అమ్మ నిర్వచించింది విలాసంగా.

ఆ నూతన నిర్వచనానికి మురిసిపోతూ చిదంబరరావుగారు తదేకంగా అమ్మవంక చూస్తూ నిలబడ్డారు. సీతాపతితాతగారు ఏమో ఆలోచించుకుంటూ అటూయిటూ పచారుచేస్తూ "ఏమిటది?" అని అడిగారు.

"నీవు అదృష్టవంతుడవయ్యా ! నీది రత్నగర్భమయ్యా - ఇవన్నీ సరేగానీ నీ ప్రయాణం ఏం చేశావు?" అని లక్ష్మణాచార్యులుగారు అడిగారు.

"మద్రాసులో మీరు దిగేలోగా కామేశ్వరరావుగారికి కబురు చేస్తాను. రైల్వేస్టేషను దగ్గరకు వచ్చి మిమ్మల్ని వారింటికి తీసుకుని వెళతారు. నీవెక్కడో ఆలోచిస్తూ ఉంటావు. పిల్లలతో వెళ్లాలి. మీ అక్కయ్యతో చెప్పి అన్నీ సర్దుకోనండి-" చిదంబరరావుగారు హెచ్చరించారు.

"ఇవాళ మా ఇంట్లో నృసింహస్వామికి లక్షపత్రిపూజ తులసీ దళాలతో చేస్తాము. మీరందరూ రండి-" అని లక్ష్మణచార్యులుగారు ఆహ్వానించారు.

"ఎవరికీ, నాకా పూజ?" అమ్మ అడిగింది.

"ఆ-నీకూను."

"మాట మారిందే."

"నీకూ చేస్తానన్నానుగా?"

"అంతేలెండి. ఇప్పుడెందుకూ? - తర్వాత చెప్తాను."

"మనం ఎప్పటిది అప్పుడు మరచిపోతాం. ఆమెకు అన్నీ గుర్తు ఉంటాయి.. అయినా ఆమెకు గుర్తు ఉండడమేమిటి? ఆమే గుర్తు అయితే. ఆమెను గురించిన అభిప్రాయం కూడా స్థిరంగా ఉండదు, రకరకాలుగా ఉంటుంది." అన్నారు చిదంబరరావుగారు బాధగా. "స్థిరమైన అభిప్రాయముంటే ఇంకా కావలసిన దేమున్నది? మీరూ, వారూ - అంటూ రెండులేవు. మీరేవారు."

"అమ్మా- ఆ స్థాయి మాకు అందేదేనా?"

"లక్ష్మణాచార్యులుగారు మరొకసారి అందరినీ పూజకు ఆహ్వానించి "నీవు తప్పకుండారా, అమ్మా-" అని అర్థించారు.

"ఇందాక, నేను రాకపోయినా వచ్చానన్నారు. ఈసారి నేను వచ్చినా రాలేదంటారేమో.." అని అమ్మ నవ్వింది.

"కళ్లకు ఏమి మాయ కాటుక పెడతావమ్మా?"

"కాటుకే మాయ. ఎందుకంటే మాయను నలుపుగా వర్ణించారు శాస్త్రాల్లో. అటువంటి మాయను ధరించేవి కనులే. మరి, కళ్లకు కాటుక అవసరమే-"

చిదంబరరావుగారు ముసిముసినవ్వులతో మురిసి పోతూఉంటే... లక్ష్మణాచార్యులుగారు ఆలోచనాభారంతో మందగమనులై గృహోన్ముఖు అయినారు.

28. గోలకొండ

ప్రొద్దు గ్రుంకింది.

"పూజకు అందరం ఆచార్యులగారింటికి వెళదాము. ఆయన ఇంతగా వచ్చి పిలిచి వెళ్ళారు" అన్నారు చిదంబరరావుగారు.

"అందులో విశేష మేముందిలెండి? రోజూ వస్తూనే ఉన్నారుగా? అన్ని మాటలతోపాటు యీ మాట కూడా అన్నారు. వారందరినీ పంపండి - మన మిద్దరమూ వెళదాము" అన్నది అమ్మ.

"అంతే ననుకో - అయినా, వెళ్ళవలసిన అవసరం ఉన్నదిగా?"

"అవసరమేమిటి? వెళ్ళాలనుకుంటున్నాము - అంతే."

"మా అమ్మ, శబ్దమంజరి..." అనుకుంటూ లోపలకు వెళ్ళి "అందరూ ఒక పావుగంటలో లక్ష్మణాచార్యులుగారి ఇంటికి చేరండి-" అని అన్నపూర్ణమ్మగారి నుద్దేశించి అన్నారు.

అమ్మ మేడ మీదకు వెళ్ళి కూర్చున్నది.

చిదంబరరావుగారు అందరినీ ఆచార్యులగారింటికి పంపించి మేడ మీదకు తిరిగివచ్చారు. రాగానే ఒక ముత్తయిదువ కనిపించింది. ఆమె రోజా రంగు చీరె కాశీ పోసి కట్టుకుని, ఊదారంగు రవికె తొడుక్కున్నది. ముక్కుకు బులాకీ, ముంగెరా - చెవులకు నీలం బావిలీలూ, పచ్చలూ, చెంపస్వరాలూ, జూకాలూ - శిరమున తమలపాకు, మొవ్వరేకు కొప్పగొలుసూ, తిరుగుడు పువ్వూ, పాపిట బొట్టూ, రాగిడీ, నాగరమూ, చంద్రవంకా - చేతికి బాదు బందులూ, కడియమూ - ముంజేతికి మురిడీ గొలుసులూ, పలక మురుగులూ - మెడలో అడ్డిగలూ, గజ్జెల పట్టెడా, జిగినీ గొలుసూ, పలకసరి పట్టెడా, గుళ్ళకంటే, కాసుల పేరూ, పగడాలహారమూ, ముత్యాలహారమూ, చంద్ర హారమూ, సూర్యహారమూ - నడుముకు వడ్డాణమూ - అన్ని వ్రేళ్ళకూ ఉంగరాలు - చేతికి బంగారపు గోట్లూ - కాలికి అందెలూ, కడియాలూ, గొళ్ళెపుగొలుసులూ, పావడాలూ, తుమ్మకాయబిళ్ళలూ - మోకాలుకు జానెడు క్రిందినుంచి కాలుకు

అంతా సొమ్ములలో కాలివ్రేళ్లకు మట్టెలూ, పిల్లి వ్రేళ్ళూ.. వివిధ ఆభరణాలతో ఆనాటి భాగ్యవంతుల ముత్తయిదువవలే నిమ్మపండు మేని ఛాయతో, నుదుట రక్తపురంగులో రూపాయంత బొట్టుతో ఉన్న ఒక ముత్తయిదువ కనుపించింది. ఆమెను చూడగానే వారి అన్న అత్తగారు మతుకుమల్లి ముత్తమ్మగారు అనుకుని-

"మీరు ఎప్పుడు వచ్చారు?" అంటూ దగ్గరకు వచ్చారు. అంతలోనే రూపం మారి వీరాసనం వేసుకుని జుట్టు విరబోసుకుని అభయహస్తంతో చేతిలో చెరకుగడ పట్టుకుని ఎడమకాలు కుడికాలు మీద వేసుకుని కిరీట ధారిణియై ఫలానా అమ్మవారు అని గుర్తించ లేకుండ ఒక లిప్తకాలం మాత్రం దృశ్యమానయై మళ్ళీ ఆ రూపమూ మారి జడకుప్పెలూ, నాగరమూ, పరికిణీ చొక్కాలతో పది సంవత్సరాల బాలికయై, శరీరమంతా సకలాభరణాలతో అలంకృతమై బాలాత్రిపుర సుందరివలే ప్రత్యక్షమైంది. మరుక్షణంలోనే కన్యాకుమారివలే, భ్రమరాంబవలే, కనకదుర్గవలే, జ్ఞానప్రసూనవలే - బొడ్డు కూడా కోయబడక శరీరమంతా మాయను కప్పకుని - అప్పడే మాతృగర్భం నుంచి వెలుగులోకి వచ్చిన పసి కందువలే - చింపిరి గుడ్డలతో, చేతిలో కఱ్ఱపుల్లతో గొడ్లను కాచే పదియేళ్ళ కుఱ్ఱవాడువలే - నెరిసిన గడ్డంతో, కఱ్ఱపోటుతో గజగజవణికే వృద్ధుడువలే- లలాటాన విభూతిరేఖలతో, చేతిలో పంచాంగం, చెంబుతో 'శ్రీరామచంద్ర పరబ్రహ్మణే నమః' అంటూ మామూలుగా భిక్షాటనకు వచ్చే పేద బ్రాహ్మణునివలే - కోర్టులో మునసబుగారు వలే - పాకీ దొడ్లో చిమ్మే వెంకన్న వలే - దొడ్లో చెట్లకు నీళ్ళు పోసే వీరాస్వామివలే - హత్య చేయబడిన తన స్నేహితుడు పొన్నూరు గోపాలరావుగారువలే - చిత్రచిత్రంగా తెర మీద చిత్రాలవలే అమ్మ కనుపించింది. వెంటనే చిదంబరరావుగారు శరీరం జలదరించి నేత్రాలు విశాలం చేసి చూచారు. వెంటనే అమ్మ ఒకే ఆకృతిలో అనేకంగా కనుపించింది. చిదంబరరావుగారు కనులు మూసుకుని చేతులు ముకుళించారు. తమ వాకిట్లో ఉన్న కృష్ణుడి బొమ్మవలే - కుగ్లర్ హాస్పిటల్ డాక్టర్వలే - అక్కడ చిమ్మేమనిషివలే కనుపించింది. ఆ వెంటనే పిఠాపురం తాలూకా చెందుర్తి కరణంగారూ, బాలోపాసకులూ అయిన పెమ్మరాజు సత్యనారాయణగారు వలే కనుపించింది. విచిత్ర మేమిటంటే వారిని చిదంబరరావుగారు అంతకుపూర్వం ఎరుగరు. కాని ఆ కరణంగారు ఆ మరునాడే అక్కడకు వచ్చారు తర్వాత

లక్ష్మణాచార్యులుగారు చేస్తున్న క్రతువంతా కనుపించింది. శంకరాచార్యులు కనుపించారు. చివరకు ఎక్కడో నానా బాధలు పడుతూ ఒక ఇంట్లో సేవచేస్తున్న స్త్రీ వలెనూ, ఆ స్త్రీ పడే బాధలు అసంఖ్యాకంగా సినిమా తెరమీద బొమ్మలవలే కనుపించాయి. ఆ దుర్భరమయిన బాధలన్నిటినీ ఓర్పుతో అనుభవించే స్త్రీని చూడగానే చిదంబరరావుగారి గుండెలు బరువెక్కి, కన్నులు నీటికుండలై 'ఎవరీ సహనమూర్తి? ఈ చరిత్ర గతంలోనిదా? వర్తమానం లోనిదా? భవిష్యత్తు లోనిదా?' అని ఆలోచించుకుంటూ-

'సహనమనే దేవతను ఆరాధిస్తున్న తల్లీ' అని పెద్ద పెద్దగా కేకలుపెట్టి కనులు మూసుకుని క్రిందపడి ఉండగా

"సహజ సహనం"

అనే అక్షరాలు పెద్దవిగా బంగారపు రంగుతో వ్రాసి ఉన్నాయి. ఆ అక్షరాలు చూచి చిదంబరరావుగారు ఉలిక్కి పడ్డారు. ఆయన కనులు మూసుకున్నా ఆ అక్షరాలు కనుపిస్తూనే ఉన్నాయి. పైగా, ఆ అక్షరాల క్రింద చొక్కాలేకుండా బొడ్డు క్రిందకు జారిపోయిన పరికిణాతో చింపిరిజుట్టుతో చీమిడితో అమ్మ పోలికన ఒక బాలిక కనుపించింది. ఆ అక్షరాలనూ, ఆ మూర్తినీ అవలోకిస్తూ శరీరంమీద మనసుమీద అధికారం కోల్పోయి ఒక విధమయిన పరవశ స్థితిలో ఉండిపోయారు చిదంబరరావుగారు. అమ్మ మెల్లగా అక్కడ నుండి లక్ష్మణాచార్యులుగారింటికి వెళ్ళింది.

ఆ రాత్రి పన్నెండు గంటలకు అన్నపూర్ణమ్మగారూ ఇతరులూ ఇంటికి బయలుదేరారు. అమ్మ మాత్రం ఆ రాత్రి అక్కడనే ఉండి ఉదయాననే వస్తానన్నది. ఇంటికి వచ్చి అందరూ ప్రసాదాలు ఎక్కువగా తిన్నారేమో, మత్తుగా నిద్ర పోయారు. అన్నపూర్ణమ్మగారు మాత్రం మేడమీదకు వచ్చింది. చిదంబరరావు గారు గాఢసుషుప్తిలో ఉన్నారు. అన్నపూర్ణమ్మగారు వెనుదిరిగి క్రిందికి వెళ్ళ బోతుండగా చిదంబరరావుగారు కదిలారు. మేలుకున్న చిదంబరరావుగారు నాసికాపుటాలకు మధురమైన మొగలిపువ్వు వాసన తగిలింది. ఆ వాసన ఆయన గుండెలపై నుండే ప్రసారిత మవుతున్నది. ఏమిటీ ఇక్కడ? - అనుకుంటూ గుండెలపైకి చేతిని పోనిచ్చారు. అక్కడ చేతికీ మెత్తగా తగిలింది.

ఉలిక్కిపడి దానిని క్రిందకు విసిరారు. అది సర్పం - బిరబిరా ప్రాకుతున్నది ఆయన గుండెలవిసిపోయి ముచ్చెమటలు పోశాయి. అదృశ్యం చూచిన అన్నపూర్ణమ్మగారు గజగజలాడింది. 'ఇంటి చుట్టూ మంచి పూలచెట్లు ఉండటాన ఆ వాసనకు పాములు చేరుతున్నాయి' అని అనుకుంటూ ఉండగా ఆ పాము అదృశ్యమయింది.

అన్నపూర్ణమ్మగారు కాళ్ళూ చేతులూ కూడదీసుకుని చిదంబరరావుగారి దగ్గరకు వచ్చింది. స్వేదజలంతో తడిసిపోయిన చిదంబరరావుగారిలో ఎక్కడా చైతన్యం కనుపించక పోయేసరికి ఆయన సర్పదష్టులయినారేమోనని అన్నపూర్ణమ్మగారు భయవిహ్వలయై శోకాలు పెట్టింది. వెంటనే చిదంబరరావు గారు భయపడవలసిన ప్రమాదమేమీ జరగలేదని సంజ్ఞ చేశారు.

చిదంబరరావుగారు ఉలుకూ పలుకూ లేక పడుకున్నారు.

'పాము కరిచిందా? కరిస్తే తెలివిలో ఉండరు కదా... అయినా ఆ రంగమ్మతల్లి పోయిన వేళావిశేషం ఎట్లాంటిదో? నట్టింట ప్రాణం పోయింది...' అని విసుక్కుంటూ అప్పడప్పడు శోకాలు పెడుతూ అన్నపూర్ణమ్మగారు చిదంబర రావుగారి దగ్గరనే కూర్చున్నది.

చిదంబరరావుగారు మాటలు పెకలించుకుని "ఏమిటే నీ వస? అమ్మాయి అనసూయ ఎక్కడ?" అని అడిగారు.

"రాత్రి లక్ష్మణాచార్యులగారింటి వద్దనే పడుకున్నది. తర్వాత ఏమయిందో తెలీదు."

"ఇప్పుడు తెల్లవారిందా?"

"ఆఁ- తెల్లవార వచ్చింది. అయిదయింది."

"అయితే అమ్మాయి రాత్రి యింటికి తిరిగి రాలేదా?

"రాలేదు. అక్కడనే ఉంటానన్నది."

"అయితే అసలు రాత్రి అక్కడకు ఎన్ని గంటలకు వచ్చింది?"

"మేము రాబోయే ముందు పన్నెండు గంటలకు వచ్చింది. తాతా

మనుమరాలూ ఒకరిని వదిలిపెట్టి ఒకరు ఉంటారేమిటి?"

"అవసరమయితే ఆమె ఉంచుతుంది."

"ఆమె అంటే ఎవరూ? బాలాత్రిపురసుందరా? చందలూరి మహాలక్ష్మమ్మా?"

"ఎవరయినా ఆమేగా-"

"ఎవరయినా ఆమేనంటే అందరూ ఒకటేననా మీ ఉద్దేశం?"

అంతలో లక్ష్మణాచార్యులగారి ఇంటివద్ద నుంచి అమ్మ వచ్చి వెనుకగా నిలుచుని-

"ఆఁ- అందరూ ఒకటే" అన్నది.

అమ్మ - మాట వినగానే చిదంబరరావుగారు ఉలిక్కి పడిలేచి నిలుచున్నారు.

అన్నపూర్ణమ్మగారికి ఆశ్చర్యంకంటే అసూయే కలిగి "ఇందాకటి నుంచీ పిలిచినా పలుకలేక పోతిరే? మనుమరాలు వచ్చేసరికి లేచి కూర్చున్నారే? ఏం మంత్రం వేసింది?" అని అడిగింది ముఖం చిట్లించి.

అమ్మ చిదంబరరావుగారి చేయి పట్టుకుని-

"తెల్లవారింది లేవండి. ముఖాలు కడుక్కుందాము - పండుగ...." అన్నది.

అన్నపూర్ణమ్మగారు మేడ దిగి క్రిందుకు వెళ్ళింది.

"తాతగారూ - ఏమిటి చాలా నీరసంగా ఉన్నారే? పాపం లక్ష్మణాచార్యులు గారు పిలిస్తే, వెళ్ళి రాకూడదూ? మనకేమి ప్లీడర్లమని యింత గర్వం?"

చిదంబరరావుగారు ముసిముసి నవ్వులు నవ్వుకుంటూ-

"నీవు వెండికొండవా, బంగారుకొండవా...?" అని అడిగారు.

"అవేవీ కాదు. నేను గోల్కొండను."

చిదంబరరావుగారు ఆశ్చర్య చకితులవుతుంటే "గో..ల..కొం..డ..ను.." అని అమ్మే వివరించింది.

చిదంబరరావుగారు ఫకాలు మన్నారు. కొన్ని క్షణాలు ఆగి ఆయన అమ్మను అడిగారు-

"అమ్మా - ఆ గదిలో 'ఆత్మబోధ' అనే గ్రంథం ఉన్నది. కొంతవరకు వ్రాశాను. మిగతా నీవు చెప్పమ్మ నేను వ్రాస్తాను."

"తాతగారు పాచినోటితో ప్రొద్దున్నే పరిహాసమాడుతున్నారే! నాకేమయినా చదువా, చట్టుబండలా? నన్ను చూస్తే మీకు బలే హాస్యంగా ఉన్నది..." అంటూ అమ్మ మనోహరంగా నవ్వుతుంటే చిదంబరరావుగారు మాత్రం గంభీర వదనంతో వినమ్రులై అమ్మ ముఖంవంక చూచారు. రాత్రి జరిగినదంతా స్మృతికి వచ్చి ఒక స్వప్నంవలే తోచింది. ఒక క్షణంలో అదంతా అమ్మ ప్రేరణే అనిపించింది. మరుక్షణంలో కాదేమోననిపించింది. శంకాకులమయిన మనసుతో- "అమ్మా-నా తలా, మనస్సూ, శరీరమూ ఏదో తేలిక పడ్డటు అనిపిస్తున్నది. నాకీ రాత్రి కనబడినదంతా ఏమిటమ్మా? అని అడిగారు.

"మీకు కనబడినది నాకేమి తెలుస్తుంది? నేను ఆచార్యులుగారింటికి వెళ్ళాను."

"మనమిద్దరం పోదామన్నావు. వాళ్ళను పంపించాను. మేడ మీదకు వెళ్ళాము.... ఎందుకో ఈ జరిగినదంతా నీ వల్లనే అనిపించటం లేదు - లోగడ నాకున్నవి కనబడడంతో.."

"అంటే?.. అవి ఏమిటి?"

చిదంబరరావుగారు కొన్ని క్షణాలు మౌనంగా ఉండి ఒకసారి తల పంకించి గొంతు సవరించుకొని-

"పొన్నూరు గోపాలరావుగారు కనబడ్డారు. అది బాగానే ఉన్నది. చంపిన వాళ్ళు కూడా కనబడ్డారు. లోగడనే నాకు వారిపై అనుమానమున్నది. కానీ చూడని విషయం ఎందుకు అనాలి అని సందేహంతో ఊరుకున్నాను. నాకు వితంతు వివాహాలంటే ఇష్టం. ఆరోజుల్లో నేనే కొన్ని చేశాను. కందుకూరి వీరేశలింగంపంతులుగారు బాపట్ల వస్తే మనఇంటిలోనే విడిది. ఈ విషయంలో

కొందరు పెద్దలు నన్ను వెలివెట్టారు. ఏ భావికీ మంచి నీళ్లకు కూడా రానిచ్చేవారు కాదు. మన కెవరయినా నీళ్ళు పోస్తే వారికి కూడా శిక్షే మీ అత్తయ్యకు యిది అవమానమై దుర్భరమై హిస్టీరియాకు కారణమయింది. గోపాలరావుగారి హత్య విషయంలో - అందరికీ తెలిసిందే - పద్దెనిమిది నెలలు జైలు శిక్ష ననుభ వించాము. మళ్ళీ వచ్చాము గనుక సరిపోయింది. లేక పోతే నాతోపాటు మూడు కుటుంబాల హతమై పోయేవి. ఆ రోజుల్లో ఏ శక్తి కాపాడిందో ఆ శక్తేయీ నాటికీ కాపాడుతూనే ఉన్నది. ఎల్లుండి యిల్లు పగల కొట్టించాలని మీ అత్తయ్య గోల పెడుతున్నది. - ఇంటికేవో దోషాలు ఉన్నాయనీ... అందువల్లనే బిడ్డలు బ్రతకటంలేదనీ, ఎంతడబ్బు సంపాదించినా నిలువకుండా పోతున్నదనీ - ఈ కారణాలు ఆధారం చేసుకునే మీ అత్తయ్య కనుపించినవారినెల్లా సలహా అడుగుతున్నది. కర్ణపాలెం బుచ్చయ్యగారు కలశం పెట్టించి నవరాత్రి పూజలు ఏర్పాటు చేశారు. ఆ కేసు నడిచే రోజుల్లో రోజూ నాలుగు వందల మందికి భోజనాలూ, పూజా చేయించేవారు. తర్వాత పెమ్మరాజు సత్యనారాయణగారు శ్రీచక్రంవేసి ఇచ్చారు. చివరకు లక్ష్మణాచార్యులుగారు కొంపనే ఊడబీక మన్నారు. మీ అత్తయ్య పోరు పడలేక ఇల్లు పడగొట్టేందుకు ఎల్లుండి ముహుర్తం నిశ్చయించుకున్నాను. కాని ఎందువల్లనో తెల్లవారుజాము మంచీ వద్దనిపిస్తున్నది." అన్నారు.

"ఎందువల్లా?" ఏమీ తెలియనట్లు అమ్మ అమాయకంగా అడగింది.

"ఇది నమన్య అయి పదిరోజులనుంచి వేధిస్తూనే ఉన్నది. ఎక్కడ కూర్చున్నా ఎక్కడ నిలుచున్నా యిదే ఆలోచిస్తూ ఉన్నాను. కలలో నా ఆలోచనలన్నీ ఆకృతి ధరించాయి. అయినా అది కలగా తోచడంలేదు. చివరకు సహసమనే అక్షరాలు కనిపించాయి. అది పగలగొట్టడానికి సహసమో, పగలగొట్టకుండా ఉండటానికి సహసమో అర్థం కావటంలేదు."

"సహసమనేనా మీకు కనుపించింది?" అమ్మ ఖండించింది.

"ఆఁ-అంతే నంటారా ? అమ్మ ఖండించింది.

"ఆఁ-అంతే"నంటూ అమ్మ కళ్ళలోకి చూచారు. మరి, ఆ కళ్ళలో మళ్ళీ ఏమి

అవలోకించారో-

"మర్చేపోయినా - సహనశ్రీ అని కనిపించింది." అంటూ ఉండగా ఆయన ముఖం ఎఱ్ఱబడ్డది.

"అంటే ఆ సహనశ్రీ మన అత్తయ్య అనా? పగల గొట్టించకపోయినా ఓర్చుకుంటుందనా?" అని అడిగింది అమ్మ - చిదంబరరావుగారిని మార్గం తప్పించే ప్రయత్నంలో.

"అదే అయితే నాకు కావలసిన దేమున్నది?"

"ఇవన్నీ మీ ఆలోచనలకు సంబంధించిన దర్శనాలే. అయితే ఇంకా నాలుగు రోజులు చూడండీ."

"కలలకు మనస్సే ప్రధానమంటారుగా?"

"మేడమీదకు మెలకువతో వచ్చారా? నిద్రలో వచ్చారా? అవన్నీ నిద్రలో చూచినట్లుగా ఉన్నది?"

"అవన్నీ అంటున్నావు. నేను చెప్పినవి రెండేగా? నాకు కనిపించినవి నీకు తెలుసా?"

"తెలుసు."

"ఎట్లా?"

"మీరు చెపితేనే విన్నాను."

"నేను చెప్పలేదే?"

"ఎట్లాగో తెలుసులెండి."

"నీ కేమయినా భాగమున్నదా ఏమిటి అందులో?"

"భాగమేమున్నదీ? ఇదేమయినా వ్యాపారమా ? నిజంగా అనుభవించిన దానిని మీరు కల అని ఎట్లా అనుకుంటున్నారో అట్లాగే నేనూ మీరు చెప్తే తెలిసింది అన్నాను."

"నాకేమీ అర్థం కావటంలేదు."

"అర్థం కాకపోతే ఫరవాలేదు. కానీ యిల్లు మాత్రం అనవసరంగా పగులగొట్టించకండి. సరేనా?"

చిదంబరరావుగారు కనులు మూసుకుని ఒకసారి ఆకాశంలోకి చూచి కనులు తెరచి అమ్మ ముఖంలోకి చూస్తూ-

"సరేనమ్మా - మీ అత్తయ్య ఎంత గందరగోళం చేసినా ఇక పగలకొట్టనమ్మా. మరి - ఈ ఇంట్లో బిడ్డలు బ్రతకరనే వాదు వచ్చిందిగదా..."

"ఏనాటికయినా ఆ వాదు పోతుందేమోలెండి. బ్రతికే పిల్లలు ఉంటారేమో. ఇంతకూ ఆ కనుపించిన మూర్తి ఎవరిదనిస్తున్నది?"

"ఏమోనమ్మా... నీవేనేమో..."

అన్నపూర్ణమ్మగారు వస్తూనే...

"ఎంత ప్రొద్దెక్కిందో చూచారా? తొమ్మిది దాటింది. ఇంతవరకూ ముఖాలు కూడా కడగలేదు; కాఫీలు కూడా అక్కరలేదా? ఏమి ఆలోచన..." అని కేకలు వేసింది.

అన్నపూర్ణమ్మగారి కేకలు పూర్తి కాకమునుపే అమ్మ క్రిందికి దిగింది. అమ్మ వెంటనే చిదంబరరావుగారు కూడా దిగి వచ్చారు.

అమ్మ ముఖం కడుక్కుని బాదం చెట్టుక్రింద ఆడుకుంటూ ఉన్నది. అందరూ కాఫీలు త్రాగారు. అంతలో పదిరోజులనాడు ఎక్కడికో వెళ్లిన రాఘవరావు మామయ్య వచ్చాడు.

అమ్మ గబగబా రాఘవరావుమామయ్య దగ్గరకు వెళ్లి "మనం తిరువళ్ళూరు వెళ్లాలి - నీ మ్రొక్కుబడి తీర్చేందుకు. ఎక్కడికీ మళ్లీ వెళ్లకు -" అని చెప్పింది.

"నాకీ నమ్మకాలు లేవు."

"నీకు నమ్మకాలు లేకపోతే నీవు మ్రొక్కుకోకు. నాన్న, అమ్మ, వాళ్లకోసం మ్రొక్కుకున్నారు. నీవు నీ పిల్లలకోసం మ్రొక్కుకోకుండా ఉందువుగాని.

పంచమినాడే ప్రయాణం అన్నయ్యా. పోనీ - నీకిష్టం లేకపోతే మానివేసెయ్యి ఇవాళే అమావాస్య ఈ రోజు నీవే అందరికీ బెల్లం పంచెయ్యి స్వామి పేరుతో."

అని అమ్మ చెప్తూ ఉండగానే సీతాపతితాతగారు వచ్చి - "ఎట్లాగయినా పోక తప్పదు" అన్నారు. ఆ మాట విని ఏమీ సమాధానం చెప్పకుండానే రాఘవరావు మామయ్య ఎక్కడికో వెళ్ళిపోయాడు.

అందరూ భోజనాలుచేసి సహస్రదీపాలు వెలిగించి ఆనందంగా ఉండగా - చెప్పకుండా ఎక్కడికో వెళ్ళిన మామయ్య తిరిగివచ్చి వాళ్ళ ఆనందంలో పాలు పంచుకున్నాడు.

౭౨. నాగులచవితి

ఆనాడు నాగుల చవితి.

రైలుపేటలో అద్దంకివారి తోటలో ఒక పుట్ట వున్నది. అనేకు లానాడు ఆ పుట్టలోని నాగేంద్రునికే పయస్సులు నివేదన చేస్తారు. అన్నపూర్ణమ్మగారు కూడా అక్కడకు వెళ్లింది. అందరితో కాకపోయినా అందరూ తిరిగి వచ్చే వేళ అమ్మ కూడా బయలుదేరింది. చిదంబరరావుతాతగారిని కూడా వెంట రమ్మన్నది.

"ఈ పండక్కు నే నెందుకమ్మా? —" అన్నారు కాని తాతగారూ వెళ్లారు.

అమ్మ వెళ్లేటప్పటికే అందరూ పాలుపోయటం పూర్తి అయింది. అమ్మ వెళ్లి అన్నపూర్ణమ్మగారి దగ్గరి గ్లాసు తీసుకుని అందులోని నీళ్ళు పోసింది.

చటుక్కున నాగేంద్రుడు పుట్టపైకి వచ్చి పడగవిప్పాడు. అక్కడ ఉన్న వారందరూ భీతమనస్కులైనారు. పూజ చేయించే పురోహితుడు సైతమూ భయకంపితుడై దూరంగా పరుగెత్తి-

"ఎవరో అమంగళంగా వచ్చి ఉంటారు. మైలసోకింది. నాగేంద్రుడికి కోపం వచ్చింది" అని కేకలు వేశాడు.

గప్పున ఆ పరిసర ప్రదేశమంతా మొగలిపూల పరిమళంతో పరివృత మయింది. చిదంబరరావుగారికి లక్ష్మణాచార్యులుగారింటిలో పూజరోజు రాత్రి తన అనుభవం స్మృతికి వచ్చింది. అన్నపూర్ణమ్మగారు ఆశ్చర్య ఆందోళనలతో గమనిస్తూ ఉన్నది.

"ఎవరో అపవిత్రులు వచ్చారు" అని పురోహితుడు గొంతు పెద్దదిచేసి మళ్లీ అరిచాడు.

"వచ్చింది అపవిత్రులే అయితే అది బయటకు రాదండీ. దానివాళ్ళు వస్తేనే అది వచ్చింది" అన్నారు. చిదంబరరావుగారు విశ్వాసమూ - గాంభీర్యమూ తొణికిసలాడే కంఠస్వరంతో.

పురోహితుడు మారు మాటాడలేక, భయంతో నిలవలేక అక్కడనుండి నిర్గమించాడు.

"అందరూ పాలు పోస్తుంటే ఆ అమ్మాయి నీళ్ళు పోసింది. అందువల్ల నాగేంద్రునికి కోపం వచ్చిందేమో-" నని కొందరూ-

"ఆ అమ్మాయికి ఏం ప్రమాదం జరుగుతుందో"నని కొందరూ-

అందరూ తలా ఒకరకంగా అనుకున్నారు. అన్నపూర్ణమ్మగారూ ఏమేమో ఊహించి చివరకు లక్ష్మణాచార్యులుగారిని అడిగి అసలు విషయం తెలుసు కోవాలని నిశ్చయించుకున్నది.

చిదంబరరావుగారు మాత్రం అమ్మవదనేందు మండలం నుండి ప్రసరించే ప్రసన్నతా విలసితమయిన ప్రశాంత శీతల జ్యోత్స్నల నవలోకిస్తూ ఆనందాశ్రువుల రాల్చారు. వాని కనుగుణంగా సన్నని తుప్పర ప్రారంభమైంది. నాగేంద్రుని హృదయమూ ఆనంద ప్రపూర్ణమయిందెమో, ప్రఫుల్ల వదనంతో నిశ్చేష్టుడై నిలబడిపోయాడు.

పూజ అయిపోయినందువలనగానీ, భయపడిగానీ, అందరూ ఎవరిదారిన వారు వెళ్ళిపోయారు. చిదంబరరావుగారూ అమ్మా మాత్రం అక్కడ మిగిలారు.

అమ్మ నాగేంద్రుని సమీపానికి వెళ్ళి ముఖంలో ముఖం పెట్టి - చిదంబర రావుగారిని చూస్తూ-

"తాతగారూ - వానకు తడుస్తున్నట్లున్నారు. ఈ పడగ నీడన చేరుదామా?"

"నీకేమమ్మా? అగ్నిగుండంలో ఆడుకోనూగలవు; పాముపడగ నీడన కాపురమూ చేయగలవు" అన్నారు చిదంబరరావుగారు నవ్వుతూ.

"తాతగారు హాస్యం చేస్తున్నారు? జోస్యం చెపుతున్నారా?"

"జోస్యం అనగానే చిదంబరరావుగారి గుండె కలుక్కుమని కంపిత కంఠంతో-

"ఏమమ్మా - అట్లా అంటున్నావు నాకు అంతవాక్శుద్ధి లేదులే" అన్నారు.

"అయితే మీరు పలికే పలుకులన్నీ మీవేనని మీ ఉద్దేశమా?"

"కాదా మరి?"

"అయితే సరేలేండి- తెలీక అడిగాను... అవన్నీ పోనీండి - ఇంతకూ యీ నాగేంద్రుని శిరస్సుపై మీ చెయ్యి పెడతారా? మీ చల్లని స్పర్శకోసం ఎదురు చూస్తున్నాడు."

చిదంబరరావుగారి పెదవులు కదల్లేదు.

"ఏమిటీ? ఇంతకూ చెయ్యి పెడతారా?" అమ్మ మళ్ళీ అడిగింది.

"నీవు పెట్టిస్తావా?"

"మీరు పెడితే పెట్టిస్తాను"

"నాకై నేనే పెట్టగలిగితే - నీవలెనే నేనే నిన్ను అడిగే వాడినిగా?"

అమ్మ తనచేతిపై చిదంబరరావుగారి చేయి వేసుకుని చేతితో పడగ సవరిస్తూ -

"ఏమి నాయనా, నాగేంద్రా - నా కోసం బయటకు వచ్చావా?" అని అమ్మ అడుగుతూండగానే ఎగిరి అమ్మ భుజంపై వ్రాలింది.

చిదంబరరావుగారు ఉలిక్కిపడి కనులు మూసుకుని అమ్మ రెండో భుజంపై వ్రాలిపోయారు. శరీరం కొయ్యబారిపోయింది. పదినిమిషాలకు స్వస్థతపొంది కళ్ళుతెరచి-

"ఇది అద్భుతమయిన సంఘటన అమ్మా ! నన్ను కూడా అట్లా చేయరాదూ? ఆ రూపం ఇవ్వరాదూ? ఎవరూ దగ్గరకు రారు. ఎవరికీ అవసరంలేదు" అని అడిగారు.

"అవసరం లేకపోతే ఇంత జనం రారుగా? ఆ రూపానికి భయం కలిగించే స్వభావమున్నది. శక్తి గొప్పదని భక్తితో పాలుపోయటానికి వచ్చినా - రూపం చూచి భయపడి పారిపోయారు. వీని లక్షణాలు... భయం, క్రోధం, ద్వేషం... వీరిలోనూ ఉన్నాయి, స్థాయిల తేడాతో. వీరికి క్రోధం, లేకపోతే భయానికి తావు లేదు క్రోధానికీ భేదం ఉన్నది. క్రోధం ఎట్లా అయినా సాధించాలనేది. కోపం తాత్కాలికంగా బెదురు పెట్టేది. ద్వేషం విషంతో సమానం. రాగం అమృతంతో సమానం రాగం అంటే కేవలం కోర్కెగానే చెప్తారు కొందరు. అదీ, లౌకిక

సంబంధమయిన వాంఛలుగానే తీసుకుని నిరసిస్తారు."

"మరి?"

"రాగమంటే 'అది కావాలి' అనుకోవటం." 'అది తనది' అనుకోవటం. 'అదీ తనూ ఒకటే' అనుకోవటం."

"రాగమంటే యిదా అమ్మా అర్థం?"

"మరి ఏమనీ? మీరు చెప్పండి-"

చిదంబరరావుగారు మెల్లగా తలవూపుతూ "చెపుతానమ్మా, చెపుతా.." నంటూ ఉండగానే అమ్మ నాగేంద్రునితో "పోరా" అన్నది. వెంటనే భుజం మీదనుండి పాదాలమీద వ్రాలి ఒక్క క్షణం ఉండి జరజర పుట్టలోకి వెళ్ళింది.

"అమ్మా-ఇది యీ పుట్టలోనే ఉంటుందా ? నేనెప్పుడయినా వస్తే కనపడమని చెప్పు-" అడిగారు చిదంబరరావుగారు.

"ఎవరినయినా రానీయండి - త్రవ్వించి చూద్దాము."

"ఎందుకూ నీవు చెప్తే చాలదూ?"

"పోనీలే - ఆ పుట్టలో కాకపోతే నా పొట్టలో ఉన్న దనుకోనండి. నా పొట్టలోనేకాదు. అందరి పొట్టలలోనూ ఆరేసి పాములున్నాయి. అవి బుస్సు బుస్సు మంటూనే ఉంటాయి."

"ఏమిటవి? అరిషడ్వర్గాలా?"

"ఏమో నాకు తెలియదదంతా."

"మధ్యమధ్యలో యీ తెరలెందుకమ్మా"

అమ్మ ఆ ప్రశ్న వినిపించుకోకుండా-

"అందరూ మానవుని జీవితగమనానికి ఆధారం నవగ్రహాలంటూ ఉంటే నాకు రెండే కనపడుతున్నాయి" అన్నది.

"ఏమిటీ ఆ రెండూ - రాహుకేతువులా?"

"కాదు; రాగద్వేషాలు."

"రాగద్వేషాలకు మించి మరేమీ లేవా?"

"ఆ రెండూ జీవితానికి ఆధారం. ఆ రెంటికీ 'నేను' ఆధారం. రాగమంటే 'కావాలి' అని కదా. ఒక విధంగా ద్వేషంకూడా రాగమే. ఉదాహరణకు - ఒకరిని చంపాలి అనేది ద్వేషం. ఆ చంపడం అనేది కోరికేగా? ఆ చంపటంకోసం కత్తిని ప్రేమిస్తాడు. విషాన్ని ప్రేమిస్తాడు. దానికోసం వెతుకుతాడు. దొరకకపోతే బాధపడుతాడు. దుఃఖిస్తాడు. అన్నం తినడు. చంపాలనుకున్న మనిషి కనబడితే చూడలేడు. చూచి సహించలేడు. వాడికి హింసే ఆరాధన. ఇది చూడలేని వాడికి అది హింస.

వాడు ఎవరిని చంపాలనుకున్నాడో మరొకడు దానిని పోషించాలనుకున్నాడు. వాడు దేనిని కావాలనుకున్నాడో వీడు దానిని ద్వేషిస్తున్నాడు. ఒకప్పుడు దేనిని ద్వేషించాడో మరొక అప్పుడు అది అవసరం. అంటే అక్కర్లేక పోయిందే - కాలభేదంలో అవసరమవుతుంది. ఒకే పదార్థమే ఒక సమయంలో అమృతమై మరొక సమయంలో విషమవుతుంది, గుణంకూడా కాలపరిస్థితుల సమసరించి పరిణామం చెందుతుంది. సర్పం విషజంతువని ప్రసిద్ధి. కాని అది అమృత జంతువు కూడా. దాని పంటిలో నుండి వచ్చింది విషం; గొంతులో నుండి వచ్చింది అమృతం. మరొకటిగూడా ఉన్నది. దాని వెనుక పంటిని పిండే టప్పుడు తగిలినా ప్రమాదంలేదు. గరళం ఒక తరుణంలో ప్రాణహరమయినా మరొక తరుణంలో ప్రాణదానమూ చేస్తుంది."

అమ్మచేసే సుదీర్ఘమయిన వివరణకు చిదంబరరావుగారు ఆసక్తితోనూ ఆనందంగానూ ఆలకిస్తూ. తల పంకిస్తూ-

"ఈ స్థితి ప్రతి పాము విషానికీ ఉన్నదా?" అని అడిగారు.

"ప్రతి పాములోనూ విషముంటుంది కానీ త్రాచుపాముకే గరళం తీస్తారు. మనిషిని చంపగలిగిన దానికే విషమని కాదుగా. ఒక్కొక్కటి ఇంకొక దాని ప్రాణం తీస్తున్నది."

"ప్రాణం తీయటమే విషానికి ప్రధానగుణమా?"

"కాదు. విషం బ్రతికించేటప్పుడు ప్రాణం తీయటమే ప్రధానగుణమని ఎట్లా అంటాను? మనిషి అన్నింటినీ చంపగలవాడు; దేనినీ చంపలేనివాడు కూడా. అందరూ, అన్నీ కాలం మీదనే ఆధారపడ్డయ్."

అంతా విని, అమ్మను అంతా అర్థం చేసుకున్నాననుకునే చిదంబర రావుగారు-

"సృష్టికీ, మానవులకూ వ్యతిరేకమయిన జంతువులతో నీకీ సాంగత్య మేమిటమ్మా?" అని అడిగారు.

"చెప్తానుగానీ - ప్రొద్దెక్కింది. అన్నానికి వెళుతూ చెప్పకుందామా?"

"నీవేమో ఎటూ తినవాయె - నేను తినకుండానే ఉందామను కుంటున్నాను, నాగులచవితి కదా."

"ఇక్కడకు రమ్మంటేనే, ఆడవాళ్ళకు కానీ నాకెందు కంటిరిగా?"

"వచ్చేటప్పుడున్నట్టు లేవుగా నా అనుభవాలు. సరే కానీ - ఒకప్పుడున్న అభిప్రాయాన్ని మరొకప్పుడు ఎందుకమ్మా అంతత్వరగా మార్చేస్తావు?"

"మనస్సు యొక్క లక్షణమే అది."

"అది నాకు తెలుసు - 'మహా' ఎందుకు అట్లా చేస్తావని అడుగుతున్నాను."

"అడిగేది చెప్పేదానికి అందేదికాదు. అడగటానికీ, చెప్పటానికి అంటే మాటలకు అది అతీతమయింది. అనుభవైకవేద్యం మాత్రమే. అంటే అది కేవలం మనస్సుకూ కంటికీ సంబంధించినది. దానిని మాటలలో పెట్టేటప్పటికి యదార్థం మరుగున పడి ఏదో చెప్తాము. విన్నవాళ్ళు యేదో అర్థం చేసుకుంటారు."

"మనస్సులో అనేకం తోస్తున్నాయి. అడగటానికి నోరు రావటం లేదు."

"అంటే - మాటలు లేకుండానే సందేహాలు తీరి పోతున్నాయంటారా?"

కొన్ని క్షణాలు ఆలోచనలో మునిగి చిదంబరరావుగారు అడిగారు-

"ఇందాక నీవు చెప్పిన ద్వేషమూ, రాగమూ రెండూ కావాలన్న దాని మీదనే ఆధారపడ్డ వన్నావు. ఎవరికి కావాలి? ఏమి కావాలి?"

"ప్రతివారికి ప్రతిదీ కావాలి; ప్రతివాళ్ళూ ప్రతిదీ - వాడికి కావాలి. ఇవి లేకపోతే వాడు లేడు. వాడున్నా వాడిని గుర్తించే వాళ్ళుంటినే వాడి ఆట. వాడి ఆటలో ఉన్న మనం మనదేదో ఉన్నదని బాధపడుతూ ఉంటాము. ఆ శక్తి తమాషా ఏమిటంటే శుద్ధంగా ఉంటే తనే అవుతాము. తనకు లేకపోయినా మనకు మలినం పెట్టాలంటే వాడికీ కావలసి వచ్చిందిగా? ఈ కావలసిరావటం అంతా వాడి రూపమే, ఆ శక్తి రూపమే. ఒకే శక్తి అదీ, వాడూ అయింది. అది వాడే, ఆ ఆది యిదంతా కలిసి ఆ అనాదే కావాలి."

"ఇందాక మలినం మలినం అన్నావే ఎట్లాగమ్మా? ఆ మలినం అంటే ఏమిటో చెప్తావా ఆధార పూర్వకంగా-"

"మలినాన్ని గురించి చెప్పటానికి మలినమే ఆధారం. అద్దం మలినంతో చేసింది. మలినమంటే వస్తు రూపాంతరం; ఒక రూపం మరుగున పడి మరొక రూపం రావటం. అద్దాన్ని స్వచ్ఛతకు ఉపమానంగా తీసుకుంటారు. అదీ కొన్ని పదార్థాల పరిణామంతోనే తయారయింది. శుద్ధమైన అద్దంలో ముఖంచూస్తే కనపడదు. ఆ అద్దానికి రంగు పూస్తే కానీ ముఖం కనపడదు. ఆత్మకు ప్రతి జగత్తు. అందుకనే జగత్తు ఆత్మ కాకపోలేదు."

"బ్రహ్మసత్యం. జగత్తు మిథ్య అంటే ఏమిటమ్మా?"

"ఏది అనుభవిస్తుంటే అది సత్యం. కడుపు నొప్పి వచ్చినప్పుడు కడుపు నొప్పి అసత్యం అనుకుంటాడా? బ్రహ్మ సత్యమయిన నాడు జగత్తు వేరు కాదుగా? నిత్యమైన దానిని తెలుసు కోవటమే సత్యం."

"ఎందుకో పెద్దలు అట్లా చెవుతున్నారు. ఏమిటోలే అమ్మా - అర్థం కాదు. మాటలు ఎన్ని చెప్పినా - ఆ భావాలు పోవటం లేదు. వట్టి మాటలేగా-"

"మీరు 'ఆత్మబోధ' అంటూ వ్రాశారుగా? ఆత్మకే బోధ చేసేవారు - మీకేమిటి అర్థం కాకపోవటం?

"ఎక్కడికి లాగావమ్మా?"

"నాకు మాటలతో చెప్పటం చేతగాదు. తాతగారూ, మీరు ఆత్మను కలంగా,

కాగితంగా, సిరాగా, పాళీగా అక్షరాలుగా వంచారన్న మాట. పంచబడ్డా యంటారా? అప్పుడు ఆత్మను ఆత్మకు ఆత్మతో బోధచేశారు. బోధ అనేది యివన్నీ"

చిదంబరరావుగారు తల ఊపుతూ-

"కానిది లేదనేగా అమ్మా - నీవు చెప్పింది" అన్నారు.

"ఆc-అంతే ననుకుంటా. అయినా మాటలతో చెప్పటం చేతగాదు. ఇక యింటికి వెళదామా? ఇప్పడు రెండు గంటలయింది."

"వెళుతూ మాట్లాడుకుందామా?"

"వెళుతూ మాట్లాడదామని అనుకుని ఆలోచించనక్కరలేదు మాట్లాడటం అదే జరుగుతుంది. ఊరుకోవాలన్నా ఊరుకోలేము."

ఇద్దరూ కలసి ఇంటికి వచ్చారు. అన్నపూర్ణమ్మగారు భోజనం చేయకుండా వారికోసం నిరీక్షిస్తూ ఉన్నది.

"మేము ఉన్నప్పుడు వాన కురిసింది. మేము యిటురాగానే వాన తేలి పోయింది. మేము ఉండటం నాగేంద్రుడికి ఇష్టం లేదు గాబోలు ఇంతసేపూ ఏమి చేస్తున్నారు ఇంటి దగ్గరవాళ్ళ ఆలోచన లేకుండా?" అని చిదంబరరావు గారిని ప్రశ్నించింది.

"ఇవాళ నాగులచవితికదా - ఉపవాసం ఉంటారేమో ననుకున్నాను."

" బాగానే ఉన్నది ఆమెగారేదీ?" అమ్మను గురించి అన్నపూర్ణమ్మగారు అడిగింది.

"నాతో కూడా వచ్చింది లోపలకు. మరి, ఎటు వెళ్ళిందో..."

"పిలవండి - తిండికి" అని అన్నపూర్ణమ్మగారు విసుక్కున్నది.

"అది తింటుందో తినదో - మొన్న నా దగ్గర తింటుంటే వద్దంటివి."

"ఎవరి కడుపులో కాలితే వారేతింటారు నేను వద్దనే దేమిటి? వాడు, సీతాపతి మరీ దిగులు పడుతున్నాడు. పిల్లవాడు ఆ తీరూ, పిల్ల యీ తీరూ,

వేళకు అన్నానికి కూడా రాదాయె" అన్నపూర్ణమ్మగారు రాగాలు తీసింది.

"పిల్ల జ్ఞప్తికి వచ్చినప్పుడు దిగులు పడుతూ ఉంటాడా?" చిదంబరరావుగారు వ్యంగ్యంగా అడిగారు.

"ఏమయినా వాడికి ఉన్న ప్రేమ మీకు ఉండదుగా?"

"అంతే, అంతే" చిదంబరరావుగారు ఆ సంభాషణ అంతటితో ఉపసంహరించటం ఉత్తమమని భావించారు.

మళ్ళీ చినుకులు ప్రారంభమయినాయి.

"ఏమిటీ వర్షం తెరవాట్లుగా వస్తున్నది?" అని అన్నపూర్ణమ్మగారు విసుక్కున్నది.

"స్వాతీ విశాఖ కార్తెలు కావూ...." అని చిదంబరరావుగారు అనునయించటానికి ప్రయత్నించారు.

అంతలో వీధితలుపు చప్పుడయింది. మేడమీది నుంచి అమ్మ దిగి వచ్చింది.

"మేడమీద ఉన్నావా? నేను చూడలేదమ్మా, మీ అత్తయ్య అడుగుతున్నది నిన్ను."

"నన్ను కాదుగా అడిగింది, మిమ్మల్నేగా?"

"అడిగింది నన్నే, నీ సంగతమ్మా - తర్కప్రవీణ గారూ-"

వీధి తలుపు మళ్ళీ చప్పుడయింది. భారతీదేవిగారు మధ్యహాలులో సంగీతం నేర్చుకుంటూ ఉన్నది. మరిడమ్మగారు తులసికోట దగ్గర కూర్చుని వత్తులు చేసుకుంటూ ఉన్నది. అన్నపూర్ణమ్మగారికి కోపమూ విసుగూ ఎక్కువై ఏమీ వినిపించలేదు.

"ఇందాకనుండీ ఎవరో తలుపుకొడుతున్నారు. నీవయినా తీసిరా, అమ్మా...." చిదంబరరావుగారు అమ్మను అడిగారు.

అంతలో సగం తడిసిన గుడ్డలతో మాధవపెద్ది కాళిదాసుగారిభార్య పుణ్యవతిగారు పుట్టలో పాలుపోసి వస్తూ వర్షంవలన వరండాలోకి వచ్చి

నిలుచున్నది.

అమ్మ లోపలకు వెళ్ళి "ఎవరో వచ్చారని" చెప్పింది. అన్నపూర్ణమ్మగారు బయటకు వచ్చి పుణ్యవతిగారిని చూచి-

"అయ్యో- మీరా? రండి లోపలికి, ఇంకా ఎవరో అనుకున్నాను - తలుపు కొడుతుంటే" అన్నది.

"తలుపు కొట్టింది మేము కాదండీ. ఆయన ఎవరో... కాషాయగుడ్డలు కట్టుకుని ఉన్నాడు. వెంట ఒక అమ్మాయి ఉన్నది ఆ అమ్మాయి - ఇందాక తలుపుతీసేనే - ఆ అమ్మాయి పోలికన ఉన్నది" అని చెప్పింది పుణ్యవతిగారు.

"ఎవరయి ఉంటారబ్బా? అనసూయ ఇక్కడనే ఉన్నది. లక్ష్మణాచార్యులుగా రనుకుంటే - యీ సమయంలో యిటురాడు. మరి ఎవరై ఉంటారు?"

అని అన్నపూర్ణమ్మగారు ఆలోచించుకుంటూ ఉండగా వర్షం పెద్దదయింది. బిచ్చగాళ్ళు కొందరు గబగబా పంచలోకి అన్నపు జోలెలు క్రింద పెట్టుకు నిలబడ్డారు.

అన్నపూర్ణమ్మగారు వారినీ, ఆ జోలెలను చూచి అసహ్యంతో "ఎంగిలి మంగలం... ఆ సంచులు అక్కడ నుండి తీయండి..." అని పెద్దగా అరిచి లోపలకు వెళ్ళింది.

వాళ్ళు సంచులు తీసుకుని చేతుల్లో పట్టుకున్నారు అంతలో అమ్మ వచ్చి వాళ్ళ చేతులలోని సంచులు తీసుకుని గదిలోపెట్టి వంట మనిషి దగ్గరకు వెళ్ళి-

"నాకు కొంచెం అన్నం పెడతారూ?" అని అడిగింది.

"అయ్యో - నా తల్లీ ! ఎందుకు పెట్టను? అసలు అన్నమే అడగవుగా-" అన్నది వంటమనిషి.

"ఆకలవుతున్నది పెద్ద విస్తరివేసి చాలా అన్నం పెట్టండి-"

"ఇదంతా తినటానికేనా?"

"అడగక అడగక అడిగితే ఇట్లా అంటారేమండీ? ఇక రోజూ అడుగుతుంటే ఎంత విసుక్కునే వారో..."

"నీవు తినగలిగినంత పెట్టించుకో అమ్మా-"

"ఇన్నాళ్ళనుంచీ తినని అన్నమంతా కలిపి త్వరగా పెట్టండి - వాన వెలుస్తుంది."

"వాన వెలిస్తే నీవు భోజనం చేయటానికేమమ్మా?"

అంతలో చిదంబరరావుగారు వచ్చి -

"ఎవరికమ్మా అన్నం? అని అడిగారు.

అమ్మ గబగబా వచ్చి చిదంబరరావుగారి చెవిలో రహస్యం చెప్పింది. చిదంబరరావుగారు నవ్వుకుంటూ "సరే" అన్నారు. అది చూచి వంటమనిషి మరి కొంచెం అన్నం పెట్టింది. అమ్మ ఆ అన్నం తీసుకువెళ్ళి - జోలెల్లో తడిసిన అన్నం కుక్కలకూ పందులకూ వేసి యీ అన్నం జోలెల్లో వేసి చేతికి ఇచ్చి "నాయనా - ఉండండి, పులుసు యిస్తాను, తీసుకు వెళుదురుగాని" అంటూ లోపలికి వెళ్ళి స్నానాలగదిలో ఉన్న తీసివేసిన ఒక సత్తుగిన్నెను తీసుకుని చిల్లులకు సున్నిపిండి తడిపి మాటు పెట్టి ఆ అన్నానికి తగిన పులుసు అందులో పోయించుకుని నేతిగిన్నె తీసుకుని బయటకు వచ్చి వారి అన్నంపై నెయ్యి వడ్డించి, పులుసు గిన్నె చేతికి ఇచ్చి -

"మీకు అమ్మాయిలున్నారూ? వాళ్ళకు గౌనులు ఉన్నాయా?" అని అడిగింది.

"లేవు తల్లీ. పిల్లలు మాత్రం ఉన్నారు."

"మీకు ధోవతులు లేవా? చినిగిపోయినవి కట్టుకున్నారేమి?"

"కడుపులోకి తిండే లేకపోతే ధోవతులు ఎట్లా వస్తాయి తల్లీ?"

అమ్మ గబగబా దొడ్లో బాదమాకులు ఏరుతున్న చిదంబరరావుగారి దగ్గరకు వెళ్ళి -

"ఏమిటి తాతగారూ - వానలో బాదమాకులు ఏరుతున్నా" రని అడిగింది.

"కొమ్మ విరిగి పడ్డదమ్మా మంచి ఆకులున్నాయి. అందుకని ఏరుతున్నాను."

"సరే ఏరుకుందురుగానీ, నేనుకూడా వచ్చి మీకు సాయంచేస్తాను. ఒక్క విషయం చెప్పండీ- మీ వద్ద చిరిగిపోయిన తలగుడ్డలుగానీ, ధోవతులుగానీ ఉంటే నాకు యిస్తారూ?"

"ఏమి చేసుకుంటావమ్మా?"

"ఆ సంగతి తరువాత చెపుతాను. మీరు యివ్వాలనుకుంటే త్వరగా యివ్వండి-"

"సరే - పుస్తకాల బీరువాపైన ఉన్నాయి. తీసుకో-"

"బాగా చిరిగిపోయినవని అవసరంలేదు తాతగారూ-"

"లేదమ్మా. బాగా చినిగిపోయినదాకా నేను కట్టుకోనుగా."

అమ్మ పరుగెత్తుకు వెళ్ళి బీరువామీద ఉన్న మూడు తలగుడ్డలూ, నాలుగు ధోవతులూ, ఒక కోటూ తనవి నాలుగు గౌనులూ తీసుకుని వాళ్ళకు ఇచ్చి -

"గబగబా వెళ్ళండి - ఎవరయినా చూస్తారు" అన్నది.

ఒకడు ఆ మాట అనగానే అంగలు వేసుకుంటూ వెళ్ళాడు కానీ మరొకడు "ఎందుకమ్మా, నీవు మీ వాళ్ళను అడక్కుండా ఇచ్చావా? తెలిస్తే కొడతారేమో..." అన్నాడు - అమ్మపై జాలితో

"వాళ్ళను నేను కొట్టకుండా ఉంటే చాలును. వాళ్ళు నన్ను కొట్టడమే! వాన వెలుస్తున్నది. మేడమీది వాళ్ళు క్రిందికి వస్తున్నారు. మీరు త్వరగా వెళ్ళండి-"

వాళ్ళ ముఖాలు ఆనందంతో విప్పారాయి.

"మా బంగారు తల్లీ! కడుపెడు సంతానం కలిగి ఆ తల్లి కడుపు చల్లగా పదికాలాలపాటు వర్ధిల్లాలి. మాకు కోమటి బేమ్మల సావాసమే నమ్మా..." అంటూ వెళ్ళారు.

"మేము కోమటి బ్రాహ్మలం కాదు. వట్టి బ్రాహ్మలమేలే" అంటూ అమ్మ లోపలకు వచ్చింది.

"వాన వెలిసింది. ఇల్లంతా చూచాముగా. ఇక వెళతామండి. రైలు అవతల నాగేంద్రుడు వెలిశాడు అంటున్నారు. వీలయితే రేపు వెళ్ళి వద్దామను కుంటున్నాను. ప్రొద్దు ఉంటే యీవేళే వెళ్ళి రావాలి" అని పుణ్యవతిగారు బయలుదేరింది.

"నాగేంద్రుడూ లేడు; నాగజెముడూ లేదు. మామూలు పామే. తలా కొంచెం పాలు పోసి ఏవేవో మంత్రాలు చదివేసరికి బయటకు వచ్చింది" అన్నది అన్నపూర్ణమ్మగారు.

"ఏదో ఒకటిలెండి - కనబడినా మన పాపిష్టి కళ్ళకు అర్థం కావద్దూ? కనబడడానికి సుకృతం కావాలి. కనబడినా అర్థం చేసుకోవడానికీ అంతకన్నా అదృష్టం కావాలి" అన్నది పుణ్యవతిగారు.

అన్నపూర్ణమ్మగారు ఇక ఏమీ మాట్లాడ లేదు. అమ్మ అన్నపూర్ణమ్మగారి దగ్గరకు వచ్చి "వారికి బొట్టు పెట్టి తలా ఒక పండు యివ్వు - అత్తయ్యా" అని మెల్లగా అన్నది. ఆమె వినిపించుకోనట్లు ఊరుకున్నది.

"ఎవరమ్మా యీ అమ్మాయి? అప్పుడే మర్యాదలు కూడా తెలిసినై" అన్నది పుణ్యవతిగారు. ఆమె ఒక కంట ఆనందమూ, మరో కంట ఆశ్చర్యమూ మెరిశాయి.

భారతీదేవిగారు అందుకుని-

"ఆమెగారా? మా పెద్ద మేనమామగారి కూతురు, పెద్దనాపసాని ఆమెకు మర్యాదలేమీ - అన్నీ తెలుస్తాయి-' అన్నది.

ఆమె వ్యంగ్యంగానే అయినా ఎంత సత్యం పలికింది!

మాటలలోనే కాలం గడిచిపోయిందిగానీ ఎవరూ కుంకుమ భరిణా పళ్ళూ తీసుకురాలేదు.

అమ్మ దొడ్లోకి వెళ్ళి రెండు నారింజపండ్లూ, బాదం కాయలూ తెచ్చి బొట్టు పెట్టి వారికి నారింజ పండ్లు యిచ్చి "మీ పిల్లలకు తీసుకుని వెళ్ళండి" అని బాదంకాయలు వారి దోసిళ్ళలో పోసింది.

వారు ముందుకు సాగినా వారి మనసులు అమ్మ మీదనే లగ్నమయినాయి.

౩౦. గుడిగంటలు

భారతీదేవిగారు అమ్మను పిలిచి ఒక పావలా ఇచ్చి బజారుకు వెళ్ళి ఒక దారపు ఉండా, సూదీ కొనుక్కుని రమ్మని చెప్పింది.

"నాకు లెక్క తెలియదు. వాళ్ళు యిచ్చినట్లు తీసుకువస్తాను" అని చెప్పి అమ్మ బయలుదేరింది.

దారిలో కొందరు కుంటివాళ్ళూ, గ్రుడ్డివాళ్ళూ కనిపించారు. అమ్మ చేతిలోని డబ్బులు వారికి ఇచ్చి ముందుకు సాగింది. బ్రహ్మాండంవారి సత్రం సమీపానికి వచ్చేసరికి అక్కడ అంతకు క్రితం అమ్మ అన్నం పెట్టిన బిక్షకులూ, ఇంకా అనేకులూ కనుపించారు. వారందరూ- కలిసి భోజనం చేస్తూ ఉన్నారు.

"మీరు ఇక్కడ ఉన్నారేమిటీ? ఇది మీ ఇల్లా?" అమ్మ అడిగింది.

"మా ఇల్లు కాదమ్మా - ఇది సత్రం."

"సత్రం అంటే సర్వులకూ స్వతంత్రమైనదనా?"

ప్రక్కనే ఒక కుష్టివాడు వెళుతూ ఆ మాట విని చక్కని నిర్వచనం అనుకొని-

"నీవు ఎవరి అమ్మాయివి?" అని అడిగాడు.

"ఎవరు దగ్గరకుతీస్తే వారి అమ్మాయిని... ఈ ఎదురుగుండా ఉన్న వేమిటీ?"

"ఆంజనేయస్వామి ఆలయం, దత్తమఠం"

అంతలో గుడిగంటలు వినిపించాయి. అమ్మ మానస సరోవరంలో భావ తరంగాలు ఉద్భవించాయి. దేవాలయంలేని ఒక గ్రామాన దేవాలయ నిర్మాణమూ, సర్వులకూ స్వతంత్రమయిన భవన నిర్మాణమూ... క్షణంలో అమ్మ మనస్సులో సంకల్పం జరిగింది. ఎక్కడెక్కడో భిక్షాటన చేసుకువచ్చి అందరూ కలసి ఒకేచోట కూర్చుని సంతోషంగా కబురులు చెప్పకుంటూ అన్నం తినేవారిని చూచి అమ్మ అమితంగా ఆనందపడి-

"అన్ని గ్రామాల్లో అందరూ అందరి ఆస్తులూ కలుపుకొని ఎవరివృత్తి వారు చేసుకుంటూ ఒకేచోట ఉంటూ ఒకే రకంగా తింటూ ఉంటే ఎంత బాగుం టుంది" అని మనసారా ఆశించింది.

అట్లాగే నడివీధిలో నిలబడిపోయి ఆలోచనలో మునిగిపోయిన అమ్మను చూచి విస్మయంతో ఆగిన ఆ కుట్టివాడు మళ్లీ అడిగాడు-

"ఏమిటమ్మా? ఇక్కడ నిలుచున్నావు? ఎక్కడికి వెలుతున్నావు?"

"ఏమీ లేదు, నాయనా-" అంటూ ఉండగానే ఆ పిలుపులోని మాధుర్యంలో అతడు పరవశమౌతుండగా-

"సూదీ దారమూ కొనుక్కురావాలని షాపుకు వెలుతున్నాను, కానీ..." అని ఆగింది అమ్మ.

"కానీ... ఏమిటీ? ఏమి జరిగింది?" అతడు కుతూహల పడ్డాడు - తరువాత వినాలని.

"అందుకు ఇచ్చిన డబ్బులను బిడ్డలకు ఇచ్చేశాను."

"బిడ్డలకా?"

"ఔను - దారిలో కొందరు గుడ్డివాళ్ళూ, కుంటివాళ్ళూ కనపడితేనూ..."

"వాళ్ళు నీ బిడ్డలా?!"

"ఔను - వాళ్ళూ నా బిడ్డలేగా-"

"ఎట్లాగూ?".

"అందరివలెనే"

"అందరూ నీ బిడ్డలా? ఎట్లా అవుతారు? ఈ అందరినీ నీవు కన్నావా?"

"కంటేనేనా? అనుకుంటేనూ బిడ్డలే. అట్లా కనగలిగితే చాలు."

అతనికి అమ్మ భావనావైశిష్ట్యమూ, హృదయ వైశాల్యమూ అర్థంగాక, ఆ చర్చ చేసే సామర్థ్యం లేక-

"ఇప్పుడే వస్తాను -నీవు యిక్కడనే ఉండమ్మా-" అని అక్కడకు సమీపంలోనే ఉన్న వారి యింటికి పరుగెత్తుకు వెళ్ళాడు.

అతని మాట ననుసరించి కాకపోయినా, అమ్మ కొన్ని క్షణాలు అక్కడనే నిలుచుని - తరువాత ఒక షాపుకు వెళ్ళి సూదీ, దారమూ తీసుకున్నది. షాపు గుమాస్తా "డబ్బు లివ్వమ్మా-" అంటూ ఉండగా అతడు వచ్చి జేబులో నుండి రూపాయి కాగితం తీసి యిచ్చాడు.

"ఎందుకు నాయనా, నీవు?" అమ్మ మెల్లగా అన్నది.

గుమాస్తా చిల్లర యిచ్చాడు. ఇద్దరూ బయలురేరారు. అమ్మ గబగబా ముందు నడిచి ఆ వస్తువులు భారతీదేవి గారికి యిచ్చి మళ్ళీ వీధిలోకి వచ్చి నడక సాగించింది. ఆ అబ్బాయి ఎదురై అడిగాడు-

"మీ యిల్లెక్కడ?"

"మా యిల్లు యీ ఊళ్ళో లేదు."

"మరి-యిక్కడ ఎందుకున్నావు?"

"బంధువుల యింటికి వచ్చాను."

"మీది ఏ ఊరు?"

"మా ఊరితో ఎందుకులే, నాయనా"-

"నీతో అవసరం ఉన్నప్పుడు మీ ఊరితో గూడ అవసరముంటుందమ్మా. అక్కడ మీ యింట్లో ఎవరెవరు ఉంటారు.?"

"అంతటా చూచేవాళ్ళు ఒకరే ఉంటారు."

"ఆ ఒకరు ఎట్లా ఉంటారు?"

"వాళ్ళు మానవులవలెనే ఉంటారు."

"నీ వలెనే ఉంటారా?"

"ఎట్లా చూచే వాళ్ళకు అట్లా ఉంటాడు. ఆ చూపు ఇవ్వవలసింది కూడా వాడే."

అమ్మ మాటలు ఒక్కటొక్కటి విన్నకొలదీ అతనిలో ఆనంద వీచికలు ఉవ్వెత్తుగా లేచి అతనిని ముంచెత్తాయి. అదే అమ్మకు తెలియజేయటానికి ప్రయత్నించాడు.

"నీవు చిన్నపిల్లగా కనిపించినా నీ భావాలు చాలా గొప్పగా ఉన్నాయమ్మా. ఇంతకంటే అనటం చేతకాక గొప్పగా ఉన్నాయన్నాను. నీ రూపం, నీ మాటలు నీ గొంతులో నుంచి వచ్చే శబ్దం వాటిలో ఉండే అర్థం. అబ్బా-అంతా కలిపితే పంచదార చిలక గుర్తుకు వస్తున్నది. ముక్కు కొరికినా, ఎక్కడ ఏ అవయవం కొరికినా ఒకే తీపి. ఇంతకంటే వర్ణించడం చేతగావటం లేదమ్మా. నన్నిక్కడే వదలివేయక మీ ఇంటికి తీసుకు వెళ్లమ్మా. నన్ను మరిచిపోకుండా ఉంటావా?"

"నన్ను మీరు మరిచిపోకుండా ఉండాలా? మిమ్మల్ని నేను మరిచిపోకుండా ఉండాలా?"

"ఎందుకమ్మా అట్లా అడిగావు?"

"నీ వన్న మాటేగా నే నన్నది? నేను చిన్నపిల్లనుగానూ? నేను మరిచి పోతాను. పెద్దవాడివి - నీవు గుర్తు పెట్టుకోవాలిగానీ-"

అతడు నిరుత్తరుడై అడిగాడు-

"అసలు నీవు ఎవరివమ్మా?"

అమ్మ మౌనంగా నిలుచున్నది.

అమ్మచేతిని అతని అరచేతిలోకి తీసుకుని వ్రేళ్ళు సవరిస్తూ - కన్నీరు కారుస్తూ - అరచేతిని ముద్దు పెట్టుకొని - వ్రేళ్ళు నోట్లో పెట్టుకొని చప్పరిస్తూ-

"ఈ వ్రేళ్ళు ఎంత తీపి - అమ్మా ఎంత హాయిగా ఉన్నదమ్మా ! నోట్లో అమృతం కురుస్తున్నది. బుజ్జితల్లీ - పొన్నకాయంత ఉన్నావు. నీ పేరేమి టమ్మా?"

"నా పేరా ? ఎందుకూ?"

"నిన్ను పిలవటాని కమ్మా-"

"పేరు తెలీకపోయినా మాట్లాడుకుంటూనే ఉన్నాముగా? ఇంకా పేరెందుకూ?"

"ఇవి ఎక్కడి సమాధానాలమ్మా?"

"అన్నీ ఎక్కడివో, యివీ అక్కడివే. నీ ప్రశ్న లెక్కడివో, నా సమాధానాలూ అక్కడివే."

అతనికి ఆ మాటలలోని అర్థగాంభీర్యం అందక నిలబడిపోతే అమ్మ మళ్లీ అన్నది-

"ఇక నేను వెళతాను. ప్రొద్దుపోతున్నది. ఇంటి దగ్గర నన్ను కోప్పడుతారు. నీకు నేను బాకీ ఉన్నానుగా, తెచ్చి ఇస్తాను.".

"నీకు ఇల్లే లేదంటివి - ఎక్కడ తెచ్చి ఇస్తావు?"

"ఎక్కడో అక్కడ" అని అమ్మ ముందుకు సాగింది.

అతడు అమ్మచెయ్యి పట్టుకొని "ఒక్కసారి ఇటురా అమ్మా - ఎత్తుకుంటాను" అన్నాడు ప్రాదేయపూర్వకంగా-

"నీ దగ్గరనే ఉంటే - ఇటురా అంటావేమిటి? నీ చేతిలోనే ఉన్నానుగా?"

అని అమ్మ అంటూ ఉండగా గుఱ్ఱపుబండి చప్పడయింది. అతను ఆ వైపుకు తలత్రిప్పాడు - అక్కడ అమ్మ ! ఇదేమిటి - అని మరోవైపు. ఆ వైపునా అమ్మ! నలు దిక్కులా నాలుగు రూపాల్లో అమ్మ ! కాని తనచేతిలో చెయ్యిలేదు. తన సమీపాన అమ్మలేదు. అతనికి ఏమి అర్థం కాలేదు. అయోమయమ్మైనాడు. కనులు మూసుకున్నాడు. ఎన్ని క్షణాలు కాలప్రవాహంలో కలసిపోయినాయో... అతడు కళ్లు తెరిచి చూచాడు. అతని ఎదురుగా ఒకే అమ్మ అదే మెత్తని చెయ్యి - తనగుప్పిటలో. అతని కన్నులు నిండి అశ్రువులు పొరలి అమ్మచేతిని అభిషిక్తం చేశాయి.

అమ్మ అతని మానసిక అవస్థతో తనకేమీ ప్రమేయం లేనట్లు - "నేను వెళ్ళివస్తాను. ఈ ఊళ్లో ఉంటే ఎప్పడయినా కలుసుకుని మాట్లాడుకుందాము"
40 అన్నది.

"రోజూ కనబడతావా? నన్ను ఎక్కడికి రమ్మంటావు?"

"నీవు రావద్దు. వీలుగా ఉంటే నీ ఉన్నచోటికి నేనే వస్తాను."

అతడు గుండెనిండా ఆనందమూ, కంటినిండా నీరూ నింపుకుని - శరీరం తేలికయై అడుగులు తడబడుతుండగా ఇంటికి చేరుకున్నాడు.

అమ్మ ఇంటికి వెళ్ళేసరికి లక్ష్మణాచార్యులుగారూ, ఇంటిలోనివారూ అందరూ కలిసి ప్రయాణ సన్నాహం చేస్తున్నారు.

31. "దేవతను కన్నావు"

తిరువళ్ళూరు ప్రయాణ సన్నాహంలోనున్న ఇంటిలోని వారందరూ లోపలకు అడుగుపెట్టిన అమ్మను చూచీ చూడనట్లు ఊరుకున్నా లక్ష్మణాచార్యులుగారు-

"ఏమమ్మా - ఎంతమంది తలుపులు కొట్టివచ్చావు?" అని అడిగారు.

"సాయంకాలం ఆరుగంటలకు పంపించాను బజారుకు. ఇప్పుడు వస్తున్నది. తొమ్మిది గంటలయింది. ఎంతమంది యిళ్ళు తిరిగివచ్చిందో... దగ్గరలోనే ఉన్న కాఫీ హోటలుకు పంపిస్తేనే వెళ్ళిన అరగంటకు కానీరాదు" అని దోషారోపణ చేసింది భారతీదేవిగారు.

"హోటల్లో ఉడికే ఉడికేవి తింటూ కూర్చుంటుందేమో మా బాలమ్మ...." చమత్కరించారు లక్ష్మణాచార్యులుగారు.

"ఆ పని చేయదులెండి - చేతిలో పెట్టినా తినదు" అంటూ భారతీదేవిగారు వెళ్ళిపోయింది.

"మా బాలమ్మ తినకపోవటం నిజమేగానీ - వీరందరూ చేతిలో పెట్టటం ఎంత నిజమో" అనుకుంటూ లక్ష్మణాచార్యులుగారు అమ్మను దగ్గరకు తీసుకుని తలనిమురుతూ-

"సీతాపతీ - అందరూ గుడ్డలూ అవీ సర్దుకున్నారా?" అని అడిగారు.

"భారతీ - నీవు అందరి గుడ్డలూ సవరించు. మీ అమ్మవీ, రాఘవడివీ, అమ్మాయివీ - అందరివీ" అని చిదంబరరావుగారు ఆదేశించారు.

"అనసూయ గుడ్డలు ఎక్కడ ఉన్నాయో, కనపడలేదు."

"ఏమమ్మా - ఎక్కడున్నాయి?"

"నాకేమి తెలుసు ? ఎప్పుడూ ఒక చొక్కాయేగా ఒంటిన ఉండేదీ మిగిలినవి ఎక్కడ ఉన్నాయో."

"అమ్మాయి గుడ్డలు కొంచెం కనిపెట్టి ఉండగూడదటమ్మా - భారతీ."

"నేను కనిపెట్టే ఉంటున్నాను నాన్నా ఏమి చేసిందో... ఒకటి లేదు."

"పోనీలే - ఒంటిన ఉన్నది కాక ఇంకొకటి ఉంటే చూడు - పట్నంలో దిగగానే కుట్టించుదురుగానీ...."

"రెండవది కూడా లేదు నాన్నా" భారతీదేవిగారు విసుక్కుంటూంటే-

"పోనీలే-" అని చిదంబరరావుగారు సర్దివేశారు.

"పంచమిగడియలు వస్తే - ఈ రాత్రికే బండి ఎక్క వచ్చునా?" అని సీతాపతితాతగారు అడిగారు.

"రైళ్ళు ఎట్లాగూ సకాలంలో రావటంలేదు. ఈ రోజూ యీ రాత్రి బండి యే పన్నెండు గంటలకో గానీ రాకపోవచ్చు. అప్పుడు బయలుదేర వచ్చును" అని లక్ష్మణాచార్యులుగారు నిర్ణయించారు.

వెంటనే సీతాపతితాతగారు ఆ ప్రయాణాన్నే నిశ్చయ పరచి-

"ఈ నిక్షేపరాయుడు ఎక్కడున్నాడో..." అని రాఘవరావు మామయ్య గురించి అనుకుంటూ ఉండగానే రాఘవరావు మామయ్య లోపలకు వచ్చి "టిక్కెట్లు కొనుక్కుని వచ్చాను" అన్నాడు.

"నీకు డబ్బు ఎవరిచ్చారురా? అక్కడ కూడా దొంగ తనమే చేశావా?" అని చిదంబరరావుగారు అడిగారు.

"లేదు, తాతగారూ - కనుక్కుని వచ్చాను. కొనుక్కుని కాదు. తమాషాకి అన్నాను."

"ప్రయాణం ఈ పూటనే అని నీకు ఎవరు చెప్పారు?"

"కిళ్లీ దుకాణం దగ్గర నిలుచుంటే అమ్మాయి వచ్చి చెప్పింది."

"ఏమమ్మా - నీవు ఇక్కడనే ఉన్నావుగా?" తాతగారు ఆశ్చర్య చకితులైనారు.

"మీరు స్నానాలు చేసేటప్పుడు వెళ్ళి చెప్పి వచ్చానులెండి-"

"వెళ్ళకుండా మాత్రం చెప్ప కూడదుటలే..."

తనలో తానే అనుకున్నట్లు తాతగారు పైకి అంటూ అందరితోపాటు భోజనాలకు లేచారు.

భోజనాలు పూర్తికాగానే అందరూ స్టేషనుకు వెళ్ళారు. పన్నెండుంబావుకు ట్రెయిన్ ఇచ్చింది. మరునాడు ఉదయం మద్రాసులో దిగగానే రైల్వేస్టేషనులోనే కామరాజుగడ్డ కామేశ్వరరావుగారు కలుసుకొని వారి ఇంటికి తీసుకొని వెళ్ళారు. వారి ఇంటిలో రెండు రోజులు ఉన్నారు. అక్కడ అవసరమయిన వస్తువులన్నీ కొనుక్కున్నారు. అమ్మకు మేజోళ్ళు, బూట్లు, గౌనులతోపాటు ఒక పట్టుపరికిణా కూడా కొన్నారు, అక్కడనుంచి బయలుదేరి తిరువళ్ళూరు వెళ్ళారు.

తిరువళ్ళూరులో సామానంతా సత్రంలో పెట్టుకుని వీరరాఘవస్వామి దేవాలయానికి వెళ్ళి స్వామిని దర్శించి, కోనేటిలో స్నానంచేసి బెల్లంవేసి మ్రొక్కుబడి తీర్చారు.

అమ్మ ఈత కొట్టుకుంటూ వెళ్ళి కోనేటి మధ్యలో ఉన్న మండపం మీద కూర్చున్నది చిన్నపిల్ల కోనేటిలో పడ్డదని అందరూ భయపడి కేకలు వేశారు. అమ్మమాత్రం ఒకచోట మునిగి మండపం దగ్గర తేలి మండపం మీదకు వెళ్ళి కూర్చున్నది. అందరూ విభ్రాంతులై చూస్తూ ఉండి పోయారు.

అక్కడ మూగిన జనంలో కాషాయగుడ్డలు కట్టుకున్న ఒక మనిషి సీతాపతితాతగారి దగ్గరకు వచ్చి -

"మండపంలో కూర్చున్న అమ్మాయి ఎవరండీ?" అని అడిగారు.

"మా అమ్మాయే నండీ."

"ధన్యుడివి నాయనా - దేవతను కన్నావు..."

ఆ మాటలు అర్థంగాక తాతగారు అయన వంక చూస్తూనే ఉన్నా అయన ఇక ఒక ముక్క అయినా పలకకుండా చరచరా నడిచి వెళ్ళిపోయారు. తాతగారు చూస్తుండగానే ఆ జనంలో అయన యిక కనుపించలేదు.

ఆశ్చర్య ఆనందాలు వెల్లువలవుతుండగా - తాతగారు తమ విడిదికి వచ్చి - అన్నపూర్ణమ్మగారికి సాధువుతో జరిగిన సంభాషణ చెప్పారు.

"అ(-ఏముందిలేరా? సాధువులు సంపాదన కోసం ఇట్లాగే చెపుతుంటారు. ఇంకా నయం - మీ అమ్మాయికి గండం ఉన్నది. నేను నయం చేస్తాను - అని చెప్పలేదు. వాళ్ల దుంపతెగ - అంతా మోసమే. కూతురు దేవత అని నమ్మావా?"

"నమ్మితే నిన్ను అడిగేపని లేదుగా? తెలియకనే నిన్ను అడుగుతున్నాను. అయినా అడిగేదేముందిలే. జరిగింది చెవుతున్నాను."

"ఏముందిలేరా, పిచ్చినాయనా...."

అంతలో భారతీదేవిగారు వచ్చి అందుకుని - "ఏమిటో తమ్ముడిని పిచ్చినాయనా - అంటున్నావే" అన్నది.

"నీ సంగతి కాదులేవమ్మా - నీ కెందుకు?'

"నా సంగతి అంటున్నావు, ఏమిటీ - అని అడగలేదుగా?"

తాతగారు జరిగినదంతా మళ్లీ చెప్పారు.

భారతీదేవిగారు ఫకాలున నవ్వి -

"ఓహో ... మన్నవ వారింట్లో దేవత పుట్టిందని పొంగుతున్నారా ? కూతురిని దేవత అని అన్నాడనా? పొరబాటునకూడా అనుకోకండి. మీ ఇళ్లలో దేవతలు పుడతారా? పుడితే చంద్రమౌళి వారింటిలో పుట్టాలి.... ఇంతకూ నీ కూతురు ఏదీ?" అని అడిగింది.

"ఇందాక మండపంమీద కూర్చున్నది. ఇప్పుడెక్కడ ఉన్నదో...."

"ఏ సాధువు వెంట వెళ్లిందో-"

"అట్లా వెళ్లదులేవే తల్లీ" అన్నపూర్ణమ్మగారి సమర్థింపు.

"అది వెళ్లేదేమిటి ? వాడే ఇంత మత్తుమందు చల్లి తీసుకుపోతాడు."

అందరి భోజనాలు ముగిసినా అమ్మ ఇంటికి రాలేదు. మధ్యాహ్నం రెండు గంటలు దాటింది. అమ్మను అన్వేషిస్తూ తాతగారు బయలుదేరారు. దారిలో ఎవరిని ఏమని గుర్తు అడిగేటట్లు? అడిగినా ఎవరు చెప్పగలరు? తాతగారు

ఆ క్రొత్త ఊరిలోని వీధి వీధి తిరిగి తిరిగి అలసిపోయి ఇంటికి వచ్చారు. రాఘవరావు మామయ్యను పిలిచి ఇక ఆయనను వెతికి రమ్మన్నారు.

కాని అమ్మ ఆ సత్రంలోనే వాకిట్లో ఒక గదిలో ఒక పహిల్వాన్‌తో మాట్లాడుతూ కూర్చున్నది.

"ఎక్కడనుంచి వచ్చారమ్మాయి?"

అమ్మ ఏమీ మాట్లాడలేదు.

"ఏమమ్మా - పలకవేమి? ఈ ఇనుప గొలుసులు తెంచుతావా?"

"నేను ఏ గొలుసులూ తెంచలేనూ, ముడివేయలేనూ."

"ఈ గొలుసులు కాక ఇంకా గొలుసు లున్నాయా?"

"ఎంతవారమయినా యీ గొలుసులు తెంచగలుగుదుముగానీ యీ గొలుసుల కాధారమయిన గొలుసును తెంచలేము."

"అది ఎక్కడ ఉంటుందమ్మా?"

"అన్నింట్లో ఉండీ - అన్నీ కాకుండా ఉంటుంది."

"అది ఎట్లా ఉంటుంది?"

"ఇట్లాగే ఉంటుంది."

"మన యిద్దరి వలెనా?"

"దాదాపుగా... నేనై - మనమయినట్లు".

"కొంచెం వివరించి చెప్పమ్మా"

"అది యిట్లా వివరిస్తే తెలిసేది కాదు. సమయం వస్తేనే తెలిసేది."

"సమయం ఎప్పడు వస్తుందమ్మా"

"తెలిసి వచ్చేది గాదు. వస్తేనే తెలిసేది."

అమ్మను చూచినకొలదీ, అమ్మ మాటలు విన్నకొలదీ ఆ పహిల్వాను

మనసులో ఏవేవో భావాలు మనోహరాకృతి దాల్చాయి. వెంటనే అమ్మను అడిగాడు.

"నా దగ్గర నెమలిపించం ఉన్నది. పెట్టుకుంటావా?"

"ఎక్కడ పెట్టుకోవాలి?"

"నీ ఆకారమూ, నీ ముందరి జడా - అందుకు అనుకూలంగా ఉన్నాయమ్మా."

"పింఛం నా కనుకూలమా? పింఛానికి నేను అనుకూలమా?" రెండూ కలిస్తే ఇంకా ఎందుకయినా అనుకూలమా?"

"అదిగో - వాడికనుకూలం" అంటూ ఎదురుగా గోడమీద ఉన్న మురళీ ధరుడయిన కృష్ణుని ఫొటో చూపించాడు.

"నేను వాడికి అనుకూలం కావటానికి ఎవరికి వ్యతిరేకం?"

"ఎవరికీ వ్యతిరేకం కాదంటున్నావు - నాకు అనుకూలమేనా?"

"అనుకూలమంటే మీ ఉద్దేశమేమిటో? మొదట రూపానికి అనుకూల మన్నారు. ఇప్పుడు మనస్సుకు సంబంధించినట్లు అంటున్నారు. అనుకూలమంటే మీ పూర్తి ఉద్దేశం చెప్పండి-"

"చాలా లోతుగా మాట్లాడుతున్నావే?"

"మీరు అడిగిన వాటికి సమాధానమేగా? మీరు ఎంతలోతుకు తీసుకు వెళితే అంతలోతుకు వచ్చి ఉంటాను."

అమ్మ మాటల్లోని ఆ భావగాంభీర్యానికి అతడు సమ్ముగ్ధుడై అమ్మను తన ఒడిలోకి తీసుకుని అమ్మచుబకం పట్టుకొని తనవైపుకు త్రిప్పకొని ఆ లేత బుగ్గలపై, ముద్దు పెట్టుకుంటూ-

"నీవు ఇష్టదైవానివా అమ్మ?" అని అడిగారు.

"నీ ఇష్టదైవమెవరో నాకేమి తెలుసు?"

"ఎవరో కాదు. అదుగో వాడే. మురళీ కృష్ణుడు ! ఆ స్వామి ఎదురుగా వచ్చి మాట్లాడాలాని కోరుకుని ధ్యానం చేసేవాడిని. ఇందాక నీకు ఆ ఫొటో చూపించి

నప్పడు అందులోని దివ్యసౌందర్యం నీలో తళుక్కుమన్నది. క్రమంగా చూస్తుండగానే నీవు ముమ్మూర్తులా నా స్వామివే అయినావు..."

"కొన్ని క్షణాలు అతడు నిశ్చేష్టుడై, తిరిగి అశ్రుధారలతో, గద్గద స్వరంతో-

"కృష్ణా ! శక్తి స్వరూపంకూడా నీవేనా? రాధవై వచ్చావా? మొన్ననే అనుకున్నాను - రాధా సమేతుడవైన నీ చిత్రం తెచ్చుకుందామని. ఇక ఏ ఫోటోలూ అక్కర లేదు. ఇట్లాగే నాలో ఉండిపో కృష్ణా-" అంటూ అమ్మ శిరస్సుపై తన గడ్డం ఉంచి వత్తి పట్టుకున్నాడు. అంతలో అమ్మ ముఖం తనవైపు తిరిగినట్లయింది. చప్పన అమ్మ నొసటిపైన తన పెదవులతో స్పృశించాడు. అంతే - కృష్ణా ! అని అరిచి పడిపోయాడు. అతనికి ఆ లోకాతీతస్థితిలో ఎటు చూచినా ఏమి చూచినా కృష్ణ దర్శనమే అయింది.

కనుల నిండిన కృష్ణుడు కనుమరుగుకాగా, అతడు మేఘాంచలాల మీదినుండి మేదినికి దిగివచ్చి ఆర్తితో---

"కృష్ణా.. కృష్ణా.." అంటూ దివ్యావేశుడై లేచి నిలుచున్నాడు. అందాకా అతని ఒడిలో కూర్చున్న అమ్మ చప్పన క్రిందకు దూకింది. అంతకు క్రితం జరిగిన సంఘటన విస్మృతిలో పడిపోయి - అతని సత్యసందర్శనం స్వప్నం వలె కరిగిపోయి - అమ్మలో కృష్ణుని పోలికలు మాత్రమే చూస్తూ-

"గుమ్మంలోకి వెళ్ళి మాట్లాడుకుందాము - రా, అమ్మా" అని అమ్మ చెయ్యి పట్టుకుని తీసుకుని వెళ్ళి నెమలి పింఛం తలలో పెట్టి ఫ్లూట్ చేతికి ఇచ్చి ఫోటో తీశాడు.

ఆ సమయంలో సీతాపతి తాతగారు అటూ ఇటూ తిరుగుతూ ఉన్నా - అమ్మను గుర్తుపట్టలేదు. అమ్మ ఆ పహిల్వానుకు వారిని చూపించి-

"వారే మా నాన్నగారు. నన్నే వెతుకుతున్నారు. అయినా నన్ను చూచి గుర్తుపట్టలేదు" అన్నది.

"మీ నాన్నగారు గుర్తుపట్టలేని స్థితిలో కూడా నీవు ఉంటుంటావా?" అతడు ఆశ్చర్యపోయాడు.

"నేను ఎప్పుడూ ఒకటిగానే ఉంటాను. వారే ఏదో ఆలోచిస్తూ ఉంటారు. నన్నే కాదు. ఎదురుగా వచ్చిన కార్లనూ, గుఱ్ఱపు బండ్లను కూడా లెక్క చేయరు. లెక్క చేయకపోవడమంటే గుర్తుపట్టకపోవటమే అవే గుర్తించి ప్రక్కకుపోతాయి."

ముద్దు ముద్దుగా అమ్మమాటలు వింటూనే వివిధ రీతుల్లో అమ్మ ఫొటోలు తీసుకున్నాడు. అంతలో అమ్మ చీరె కట్టుకుని - కొప్పు పెట్టుకుని - అన్నపు పళ్ళెం చేత బట్టుకుని - వడ్డన చేస్తున్నట్లు అతనికి దృశ్యమాన అయింది. ఆ దృశ్యం చూడగానే అతని శరీరం పులకితమై, చేతిలోని కెమేరా క్రిందకు వదలివేసి అమ్మ పాదాలపై వ్రాలిపోయి.

"అమ్మా - ఆదిలక్ష్మి - జగజ్జననీ ... ఎక్కడ నుండి వచ్చావు? నాకీ రూపం అంటే చాలా యిష్టం..." అంటూ ఉండగానే అమ్మ మామూలు అమ్మాయిగా కనుపించింది. అతడు విభ్రాంత మనస్కుడై భిన్నవదనుడై కూలబడి పోయాడు. అమ్మ మెల్లమెల్లగా అడుగులు వేసుకుంటూ తాతగారు ఉన్న గదిలోకి వచ్చింది. వెతకటానికి వెళ్ళిన తాతగారూ, అమ్మా ఒకరి వెనుక ఒకరు గదిలోకి ప్రవేశించారు. అప్పుడే దీపాలు వెలిగాయి.

"ఏమిటి? ఎక్కడ దొరికింది నీ కూతురు?" అని భారతీదేవిగారు అడిగింది.

"ఎక్కడా కనుపించలేదు" తాతగారు నిస్పృహతో జవాబిచ్చారు.

"అదిగో వచ్చిందిగా-"

"వచ్చిందీ ? ఎప్పుడు వచ్చింది? నాతో రాలేదు!"

"నీ వెంటనే వస్తున్నది. నీవు ముందు, ఆమె వెనుక-"

అన్నపూర్ణమ్మగారు కూడా భారతీదేవిగారితో కలిసి నవ్వుకున్నది - గారాబాల తమ్ముని దీనవదనం చూచి.

సీతాపతితాతగారి హృదయంలో ఒక్కసారిగా వాత్సల్యం పొంగులువారి అమ్మను దగ్గరకు తీసుకుని - ఎత్తుకుని - గుండెలకు హత్తుకుని దించి-

"ఏదో ఒక రకంగా వచ్చిందిగా. ముందు దానికి అన్నం పెట్టండి - ప్రొద్దుటి నుండి తిన్నదో, లేదో..." అన్నారు.

"ఏమీ తినకుండా ఇంతసేపు ఎట్లా ఉంటుంది?"

తాతగారు ఏమీ మాట్లాడక వాకిట్లోకి వెళ్ళారు. అమ్మ లోపలకు వెళ్ళి ఒక మూల కూర్చున్నది.

అందరూ భోజనాలు చేశారు. శ్రీపురం పుత్తూరు ప్రయాణమయినారు. బయట గాలి దుమారమూ, ఉరుములూ, మెరుపులూ, అమ్మ పాదం బయట పెట్టే సరికి ఎక్కడో భీకరాక్రోశంతో అశనిపాతమయింది.

అమ్మ వాకిట్లోకి వచ్చిన తరువాత తాతగారు "అమ్మాయి భోజనం చేసిందా?" అని అడిగారు.

"ఆఁ-పెట్టినట్లే ఉన్నది" అన్నది భారతీదేవిగారు

"అమ్మా - తిన్నావా?" తాతగారు అడిగారు.

"ఆఁ-"

"నేను యీ కోవెలలోనే ఉంటాను. ఇక్కడ పెట్టిన ప్రసాదం తింటాను. మీరు బయలుదేరగానే కబురు చేయండి - నేను వస్తాను" అని అమ్మ తాతగారితో చెప్పింది.

"అన్నం తిని వద్దువుగాని రా, అమ్మా-" తాతగారు పిలిచారు.

"ఇక్కడ ప్రసాదం పెడుతున్నారుగా?"

"ఆకలిగా లేదా?"

"లేదు."

సీతాపతితాతగారు కూడా వెళ్ళారు.

అందరూ భోజనం చేసి పడుకున్నారు సాయంకాలం మూడు కాగానే అమ్మ విడిదికి వచ్చి - పడుకున్న తాతగారి పక్కలో కూర్చున్నది. తాతగారు అమ్మ వీపు నిమురుతూ ఉలిక్కిపడి-

"వళ్ళు కాలిపోతున్నదే" అన్నారు.

"కాలు జాలుగా కూడా ఉన్నది నాన్నా"

"వేడి జేసి ఉంటుందమ్మా. కొంచెం మజ్జిగ త్రాగు-" అని తాతగారు ఒక గ్లాసులో మజ్జిగ తెచ్చి ఇచ్చారు.

అంతలో తాతగారి మాటలు ఒక తెలుగు దేశపు డాక్టరు విని-

"ఏమిటండీ జ్వరం అంటున్నారు - అమ్మాయికా? ఇటురమ్మనండి -" అని చేయి చూచి మందు బిళ్లలు ఇచ్చి-

"జర్వం తీవ్రంగానే ఉన్నది" అన్నం పెట్టకండి. జ్వరం కొన్ని రోజులుండవచ్చు నన్నారు.

ఆ మాట వినగానే తాతగారి గుండె ఝల్లుమన్నది. అయనకు గతమంతా ఒక్కసారి కళ్లకు కట్టినట్లయి శరీరం స్వేదసిక్తమై-

"నరే - త్వరలో యిల్లు జేరుదాము నేను తిన్నవన్నీ దెబ్బలే" అనుకుని అన్నపూర్ణమ్మగారి దగ్గరకు వెళ్లి ప్రయాణం గురించి త్వరపెట్టారు.

రాత్రి పది అయ్యేనరికి తిరువళ్ళూరు వచ్చి అక్కడ సత్రంలో వదిలి పెట్టిన సామానులు తీసుకుని స్టేషనుకు వచ్చి మద్రాసు చేరారు.

మద్రాసులో కామేశ్వరరావుగారింటికి వచ్చి ఆ రోజు అక్కడ ఉండి తెల్లవారు జామున ట్రెయిన్ ఎక్కి సాయంకాలానికి బాపట్ల చేరారు.

32. మధురోహ

బాపట్లలో ట్రెయిన్ దిగి సీతాపతితాతగారూ వగైరాలు చిదంబరరావు తాత గారింటికి వచ్చారు. అందరూ ఇంటిలోకి వచ్చీ రాకముందే చిదంబరరావు గారు అమ్మ నెత్తుకుని-

"మీ అన్నయ్య ఉపనయనం ఇంకా వారం రోజులున్నది. తరువాత అయినా వాడిచేత అల్లరి మానిపిస్తావా?"

"వాడి అల్లరితో వాడే అల్లరై పోతున్నాడు. మనకేమి నష్టము?" అమ్మ ఎదురు ప్రశ్న వేసింది.

చిదంబరరావుగారు సీతాపతితాతగారిని పిలిచి రాఘవరావు మామయ్య ఉపనయన లగ్నం పెట్టించాననీ, అది ఒక వారం రోజులున్నదనీ - అందరికీ శుభలేఖలు సైతమూ పంపించాననీ చెప్పి - యాత్రా సమారాధన కూడా అందులోనే చేసుకొనవచ్చునని సలహా ఇచ్చారు.

"అయితే - నేను మన్నవ వెళ్ళివస్తాను" అన్నారు సీతాపతితాతగారు.

"పెందలాడే భోజనంచేసి వెళ్ళుదువుగాని-" అని చిదంబరరావుగారు ఆదేశించారు.

సీతాపతితాతగారు అంగీకరించారు. భోజనం ముగించుకుని మన్నవ ప్రయాణం కాగానే అమ్మవచ్చి -

"నేను కూడా వస్తా నాన్నా-" అన్నది.

"అన్నయ్య ఉపనయనం ఇక్కడనే నమ్మా - నీవు అక్కడ కెందుకు?" అన్నారు చిదంబరరావుగారు.

"ఇంకా వారం రోజులున్నదిగా. అప్పుడు నాన్నా, నేను యిద్దరం కలిసి రావచ్చును."

"నేను రేపే వస్తానమ్మా, జ్వరంతో ఉన్నావు. నీవు వద్దమ్మా" సీతాపతితాతగారు వారించారు అమ్మను."

"మద్రాసులో జ్వరంగా ఉన్నా ఇక్కడకు రాలేదూ?" అమ్మ ప్రశ్నించింది.

"అక్కడకు వెళ్ళిన తరువాత తగిలింది కనుక ఇంటికిరాక తప్పదు."

"ఇదీ తప్పనిసరిగా ఉన్నది నాకు" అమ్మ కంఠంలో నిశ్చయం స్ఫురించింది.

"సరే, బయలుదేరు-" సీతాపతితాగారు అంగీకరించక తప్పలేదు.

ఇద్దరూ బయలుదేరారు.

"తండ్రీ కూతుళ్ళు బయలుదేరుతున్నారు - ఎందాకా?" అని చిదంబరరావు గారి ప్రశ్న.

"నేను వెళ్లి రావాలిగదా ఎటూ నాతో అమ్మాయి కూడా వస్తానంటున్నది."

"సరే తీసుకువెళ్ళు - మరి అక్కడ అన్నానికి ఇబ్బంది గదా-"

"అమ్మాయి అంత పట్టుదలగా ఉంటే వద్దనట మెందుకూ? హోటల్లో భోజనం చేస్తాములే."

"సరే పదకొండు గంటలయింది. ఇది కోచీవేళ - వెంటనే బయలుదేరండి-"

సీతాపతితాతగారూ, అమ్మా బయలుదేరి రైల్వే స్టేషన్‌కు వచ్చారు. తాతగారు టిక్కెట్లు కొనుక్కుని ప్లాట్‌ఫారం మీదకు రాగానే - మన్నవ మనిషి షేక్‌మౌలా సాహెబ్ కనపడి-

"ఇదిగోనయ్యా -పైకం తీసుకువచ్చాను. ఆలస్యమయింది" అంటూ ఒక కాగితపు పొట్లం తాతగారి చేతికి అందించాడు.

సీతాపతితాతగారు ఆశ్చర్యంతో-

"ఏమిటీ?... డబ్బు ఎక్కడిది?" అని అడిగారు.

"మీరు కబురు చేశారుగా-"

"కబురా? నేను చేయలేదు-"

"అదేమిటీ - ఎవరో నేను ఇంటిలోలేని సమయాన మా ఇంటికి వచ్చి - మీ మాటగా ఉపనయనానికి డబ్బు తెమ్మనిచెప్పి వెళ్ళారట. నేను ఇంటికి రాగానే

మా ఆవిడ చెప్పింది. అయితే - ఆ మనిషి ఎవరయినదీ గుర్తు తెలియలేదు. ఎవరయితే నేమీ మీరు పంపిన మనిషేగదా అని పైకం తీసుకు వచ్చాను" అని జరిగిన ఉదంతం వెల్లడించాడు మౌలా.

తాతగారు విస్మయసాగరంలో తలమునకలుగా స్నానం చేస్తూ-

"నేను ఎవరిచేత కబురు చేయలేదు. అయినా ఇంటికి వెళ్ళి అడుగుదాము - మా బావగారేమైనా కబురు చేశారేమో-" అన్నారు.

ముగ్గురూ కలిసి తిరిగి ఇంటికి వచ్చారు.

"మన్నవ కేమైనా కబురు చేశావా డబ్బు కావాలని" అని చిదంబరరావు గారిని సీతాపతితాతగారు ప్రశ్నించారు.

"చేద్దామనుకున్నాను గాని చేయలేదు."

"ఇంకా నయం - తీసుకురమ్మన్నారనే చెప్పాడు. తన చేతికే ఇప్పించుకు రమ్మన్నారని చెప్పినట్లయితే ఇచ్చేవాడివేగా?" అని అమ్మ నవ్వింది.

"ఆఁ ఇచ్చేవాడినే. వాళ్ళు ఎవరయినా - అది కరణంగారి మీద అభిమానం కొద్దీ - అన్నాడు మౌలా.

"ఎంత తీసుకువచ్చావు ఇంతకూ?" చిదంబరరావుగారు అడిగారు కుతూహలంతో.

"పదిహేను వందలు తీసుకువచ్చానండి. అయ్యో చెప్పటం మరచిపోయాను. మా అడదానికి రంగమ్మతల్లి కనపడి - త్వరగా డబ్బువంపు అన్నదట. అప్పటినుంచీ మా ఆడది ఊపిరాడనీయలేదు. అందుకనే త్వరపడ్డాను. దానికి అది కలగా లేదు. రంగమ్మగారు నిజంగా కనపడి చెప్పినట్లే ఉందట..."

మౌలామాటలు వింటూ ఉంటే చిదంబరరావుగారికి రంగమ్మగారు ఎదురుగావచ్చి నిలుచున్నట్లే ఉన్నది. వారి కంటివెంట నీరు ధారలు కట్టింది.

"నీవు మాకు కనబడకపోయినా - మా వెంటనే ఉంటున్నావన్న మాట. నీ ప్రేమ అనన్యమమ్మా-" అని చిదంబరరావుగారు తన మనసులోనే అనుకుంటూ సీతాపతిగారి చేతిలోని పైకం తీసుకుని లెక్కపెట్టుకోబోతుంటే-

"ఇంతకూ అతను అన్నం తిన్నాడేమో కనుక్కున్నారా?" అని అమ్మ అడిగింది.

"లేదు".

"తినలేదయ్యా - బండి ఆలస్యంగా వచ్చింది" ఈ పూటే గాదు - అన్నంతిని నాలుగు పూటలయింది" అన్నాడు మౌలా.

"అయితే నేను అగ్నం పెట్టించిన నాటి నుండి నీకు అన్నం లేదన్నమాట. శరీరం పోయినా జీవుడు ఇక్కడే ఉండవచ్చుననే దృష్టాంతం కోసం కాబోలు" అన్నారు చిదంబరరావుగారు బొంగురుపోయిన కంఠంతో.

"అయితే-అమ్మ వెళ్ళి చెప్పిందంటారా తాతగారూ?" అని అమ్మ అడిగింది.

"చెప్పింది కుఱ్ఱవాడే అనుకో అమ్మా. ఆ కుఱ్ఱవాడు ఎవరో తేలలేదుగా? పైగా స్వప్నమొకటి. ఈ రెండూ సమన్వయం చేస్తే ఏమి అనిపిస్తున్నది? తార్కికంగా నిరూపించలేకపోవచ్చును. నా మనస్సుకు మాత్రం రంగమ్మే ఇవన్నీ చేసుకుంటున్నదేమో అనిపిస్తున్నది. అట్లా అనుకుంటే కొంత మనశ్శాంతి."

మౌలా వెళ్ళిపోయాడు.

పైకం అందినది కనుక వెంటనే బజారుకు వెళ్ళి ఉపనయనానికి అవసర మయిన వస్తువులన్నీ కొనుక్కు వచ్చారు. పనులు ప్రారంభమయినాయి. ఉపనయనానికి క్రిందటిరోజునే బంధువు లనేకులు వచ్చారు. అందులో అనేకులు "పనిలోపని - పిల్ల పెళ్ళి కూడా చెయ్యక పోయారా?" అన్నారు.

"పెళ్ళి తరువాత చూద్దాము - బ్రతుకు నిజం కానివ్వండి -" చిదంబరరావు గారు నిట్టూర్చారు.

ఒక పెద్ద ముత్తయిదువ ముసిముసి నవ్వులతో "ఇంటిలో ఉన్న సంబంధ మేగా? చేసేస్తే బాగుంటుంది. తరువాత రాఘవుడికిచేసి తాను (సీతాపతి తాతగారూ) చేసుకుంటే సరిపోతుంది" అని సలహా యిచ్చింది.

ఆ మాటలు ఎవరి చెవికీ ఎక్కలేదు.

తెల్లవారుజామున రాఘవరావుమామయ్య ఉపనయనం జరిగింది. అంబా

రావుతాతగారు దంపతులు పీటల మీద కూర్చున్నారు.

ఉపనయన ఉత్సాహమూ మేళాల సందడీ ఎంతగా ఉన్నా - రంగమ్మగారి స్మృతి అందరినీ కలచి వేసింది.

మొత్తానికి నాలుగురోజులూ గడిచి ఉపనయనం సమాప్తం అయింది.

సీతాపతితాతగారు కుటుంబసహితంగా మన్నవ ప్రయాణం నిర్ణయించుకుని అన్నపూర్ణమ్మగారి దగ్గరకు వచ్చి-

"అక్కయ్యా - నాలుగు రోజులు మన్నవలో ఉండి వస్తాము" అని చెప్పారు.

"పదహారురోజుల పండుగ వెళ్లంది ఎక్కడకూ వెళ్ల కూడదు-" అన్నది అన్నపూర్ణమ్మగారు.

సీతాపతితాతగారు ఎదురు చెప్పలేక 'సరే' నంటూ లోపలకు వెళ్ళారు.

అంతలో సీతాపతితాతగారి చెల్లెలు కనకదుర్గమ్మ (బామ్మ) గారూ, వారి భర్త బ్రహ్మాండం సుబ్బారావుగారూ వచ్చారు - వారి జ్యేష్ఠ కుమారుడు నాగేశ్వరరావు (నాన్న) గారి ఉపనయనానికి ఆహ్వానించటానికి అప్పటికి ఉపనయనం ఆరురోజులు మాత్రమే ఉన్నది.

అందువల్ల బాపట్లలో ఉపనయనానికి వచ్చిన వారందరూ ఇంకా నాలుగు రోజులు అక్కడనే ఉండి- అందరూ కలసి రేటూరు ఉపనయనానికి వెళ్ళారు. వారితో కలిసి అమ్మకూడా రేటూరు వెళ్ళింది.

రేటూరులో నాన్నగారి ఉపనయనం పూర్తికాగానే అందరూ స్వగృహోన్ముఖులయ్యారు. అమ్మను ఇంకా నాలుగురోజులు అట్టిపెట్టమని బామ్మ సీతాపతితాతగారిని అడిగింది.

"నాకు తెలియదు. చిదంబరరావుగారిని అడుగు-" అన్నారు తాతగారు.

"ఆయన ప్రొద్దున్నే బాపట్ల వెళ్ళాడు. ఇంకా ఎవరిని అడిగేది?"

"అయితే అక్కయ్యనడుగు-"

బామ్మకు కొంచెం కోపం వచ్చి అన్నది-

"ఎవరి నడగటం ఎందుకులే? మీ పిల్లను మీరు తీసుకు వెళ్ళండి. నీ పిల్లను నీ ఇష్టం లేకుండా వారినీ వీరిని అడిగేదేమిటి?"

సీతాపతితాతగారు బామ్మమాటలు వినిపించుకోనట్లు అక్కడ నుండి వెళ్ళిపోయారు. అంతలో అన్నపూర్ణమ్మగారు వచ్చి-

"నేను వెళ్ళివస్తానమ్మా - కనకం" అన్నది.

"నేను అమ్మాయి అనసూయను నాలుగురోజులు ఉంచుకుంటానంటే - నిన్ను అడగమన్నాడు. ఏమంటావు?"

"మరి - వాళ్ళ అన్నయ్య పదహారు రోజుల పండగ వస్తున్నదిగా-"

"రెండు రోజులలో వాళ్ళ మామయ్యో, బావో వస్తారుగా - అప్పుడు పంపిస్తానులే."

"సరేదాని ఇష్టమయితే ఉంచుకో - అయినా వాళ్ళ తాతమ్మను వదిలి ఉండాలిగా-"

అంతలో సుబ్బారావుతాతగారు అక్కడకువచ్చి -

"ఉండమ్మా - రెండు రోజులుండు. నేను తీసుకువెళ్ళి పంపిస్తా" నన్నారు.

అంతలో లోకనాథం బాబాయి వచ్చి-

"ఉండు అనసూయా - ఉండు. చెరువుకు వెళ్ళి కలువపూలు తోసు కుందాము" అన్నాడు.

"ఉండమ్మా - ఉండు ఎక్కడయితే నీకేమి?-" అని సుబ్బారావు తాతగారు అమ్మతో అని-

"పాపం, వీళ్ళమ్మకు నేనంటే ఎంతో ప్రేమ. అసలు మనిషిలోనే ఎంతో మర్యాద, మన్నన. ఆమెతోనే ఇంటికి కళే! పోయింది. కళ అంటేనే ఆ అమ్మాయి అన్నట్లు ఉండేది" అని నిట్టూర్పు విడిచారు.

"సరే ఉంచుకొండి రెండురోజుల్లో తీసుకురండి-" అని చెప్పి అన్నపూర్ణమ్మ గారు బాపట్ల వెళ్ళింది.

బంధువులందరూ "కోడలును అట్టే పెట్టుకున్నావే" అని బామ్మను హాస్య మాడేరు.

"కోడలయితేనేనా ఏమిటి? మేనగోడలుగదా - అదీగాక తల్లిలేని పిల్ల. నాలుగు రోజులు నా దగ్గర ఉంచుకుందామనుకున్నాను. ఎటూ ఆ దేశం తీసుకువెళ్లలేను గదా-" అని బామ్మ సమాధానం చెప్పిందిగానీ అమ్మను కోడలు చేసుకుందామన్న భావనో, కోడలు అవుతుందన్న ఆశో బామ్మను చెప్పలేనంత ఆనందపరచింది.

"అయినా వారి స్థితికి మాకు ఇస్తారా?" అని సుబ్బారావు తాతగారు ఆశనూ, నిస్పృహనూ వ్యక్తం చేశారు.

"ఏమమ్మా - మీ బావను చేసుకుంటావా?" అక్కడనే ఉన్న నాన్నగారి మేనత్త వెంకటసుబ్బమ్మగారు అమ్మను సరాసరి అడిగింది.

అమ్మ ఏమీ మాట్లాడలేదు.

నాన్నగారి తాతగారు శేషయ్యగారు అక్కడకు వచ్చి-

"ఓహో- మా మనుమరాలా? ఇదే సమయం ఇప్పుడే పెళ్లి కూడా చేద్దామా?" అన్నారు. వారికి కూడా అమ్మను తన మనవడికి చేసుకుందామన్న ఆశయమే.

"ఆఁ- చేసుకుందురుగాని. మన్నవవారి పిల్లలు తేరగా వచ్చారు, పాపం-" అని రాగాలు తీసింది - నాన్నగారి నాయనమ్మ రత్తమ్మగారు.

ఆమె మన్నవవారి ఆడబడుచే. బామ్మ మన్నవవారి ఆడబడుచే మరి - అమ్మ కూడా అ ఇంటికి వస్తే - మన్నవవారి మూడవ ఆడబడుచు వచ్చినట్లే.

"మన్నవ వారంతా బ్రహ్మాండంలోకి రావలసిందే" శేషయ్యతాతగారు అన్నారు.

అందరూ పకపకా నవ్వారు. అమ్మ అన్నీ వింటూ ఏమీ విననట్లు నిలుచుని ఉన్నది.

లోకనాథం బాబాయి ఒక లడ్డు చేతిలో పట్టుకువచ్చి "అనసూయా - ఇదిగో అడుకుందాము-రా. చెరి కొంచెం తీసుకుందాము" అని అన్నారు.

ఇద్దరూ కలిసి చెరువుకట్ట మీదకు వెళ్లారు.

"చెరువులో దిగుతావా అనసూయా-"

"నాకు చేతకాదు లోకం. నీవు దిగుతావా?"

"నేనూ దిగలేను."

"మరి-పూలు ఎట్లా వస్తాయి? ఈ లడ్డు ఎవరికయినా పెట్టి వాళ్లచేత కోయించుకుందాము."

"ఈ లడ్డు యివ్వడం ఎందుకు? మన జీతగాడు తెచ్చిపెడతాడులే-"

"మన జీతగాళ్లు మన ఇంట్లో లడ్డు తినే ఉంటారు. తినని క్రొత్తవాళ్లకు ఇచ్చి కోయించుకుందాము" అన్నది అమ్మ.

"కాదులే అనసూయా - ఒక అణాయిచ్చి కోయించుకుందాము లడ్డు ఎందుకులే?"

"మనం ఇచ్చే అణాకు లడ్డు ఇవ్వరుగా. ఇవి మంచి లడ్లు. చాలా బాగున్నాయి. వాళ్లు ఎప్పుడూ తిని ఉండరు. మనకు ఇంటి దగ్గర ఇస్తారు కదా కావాలంటే."

"అయితే ఇంతకూ ఎవరిని పిలుద్దాము?"

"ఇది ఎవరికి ప్రాప్తమో వాళ్లే వస్తారు. మనం త్వరపడితే రారుగా" అని అమ్మ అంటూ ఉండగానే ఒక కుర్రవాడు నీళ్ల కోసం చెరువుకు వచ్చి గట్టుమీద అమ్మనూ, బాబాయినీచూచి ఆనందంతో ఎవరూ అడగకుండానే చెరువులో దిగి చెరి నాలుగు పూల కోసి వారికి ఇచ్చాడు. అమ్మ అతనికి లడ్డును యిచ్చింది. కాని అతను తీసుకోనక వెళ్లిపోయాడు.

అమ్మా, లోకనాధం బాబాయీ పూలు తీసుకుని ఇంటికి వచ్చారు. ఇంటికి రాగానే నాన్నగారి మేనత్తలూ, పినతండ్రులూ అందరూ ఎదురుగా వచ్చి-

"ఎక్కడికి వెళ్లావమ్మా?" అని అడిగారు.

"ఇవిగో నా చేతిలో ఉన్న యీ పూలు కోసుకువద్దామని వెళ్లాము" అన్నది అమ్మ.

"అమ్మా - పెందలాడే స్నానం చేసి అన్నాలు తినండి - నీవూ, లోకమూ" అని సుబ్బారావుతాతగారు కేకవేశారు.

అమ్మ లోపలికి వెళ్ళి బామ్మను -

"నాకు ఆకలి కావటంలేదు. నేను పెందలాడే పడుకుంటాను. ఎక్కడ పడుకోమంటావు?" అని అడిగింది.

"ఎక్కడో అక్కడ పడుకో - తరువాత నేను వచ్చి నా దగ్గర పడుకోబెట్టు కుంటాను"

అమ్మ పశువుల చావడిలో ఆవుల దగ్గరగా పడుకున్నది. ఎవరూ చూడలేదు. అక్కడనే తెల్లవార్లూ పడుకున్నది. జీతగాళ్ళు యిళ్ళకు వెళ్ళారు తెల్లవారుజామున పశువులకు మేతవేయటానికి ఒక జీతగాడు వచ్చి అమ్మను చూచి లోపలకు తీసుకువెళ్ళి పడుకోబెట్టాడు.

ప్రొద్దునే అమ్మలేచి ముఖం కడుక్కుని బామ్మకు కనపడింది.

"ఎక్కడ పడుకున్నావమ్మా? తెల్లవార్లూ ఎంత వెతికినా కనపడలేదు."

"రాత్రి ఎక్కడో అక్కడ పడుకో నేను తీసుకువచ్చి పడుకోబెట్టుకుంటా నంటే - వెళ్ళి పశువుల చావట్లో పడుకోవాలి అనిపించి పడుకున్నాను" అన్నది అమ్మ.

"సరే ముఖం కడుక్కున్నావా?"

"కడుక్కున్నాను."

"కొంచెం పెరుగువేసి అన్నం పెడతాను, రా-" అని అమ్మకు అన్నం పెట్టింది.

అమ్మ అన్నంతింటూ ఉండగా బంధువులు చూచి -

"చూచారా - కోడలికి తెల్లవారకముందే పెరుగు పోసి అన్నం పెట్టు కుంటున్నది. అందుకనే అట్టిపెట్టుకున్నది. ఇతరులను యిట్లా చూస్తుందీ?" అని బుగ్గలు నొక్కుకున్నారు.

"ఎందుకు చూస్తుంది? - కాబోయే కోడలూ, మేనగోడలాయే-" అని రత్తమ్మగారు సమర్థించింది.

అమ్మ యీ సంభాషణ వింటూ ఉన్నది. కానీ విస్తట్లోవున్న అన్నం మెతుకు కూడా కొరకలేదు. వారి మాటలకు బామ్మ మనసు చాలా బాధపడింది అందుకనే అమ్మ అన్నం తినలేదని కూడా విచారపడింది.

"తల్లిలేని పిల్లవని తీసుకువచ్చి ఎన్ని మాటలు అని పిస్తున్నానమ్మా? తిన్నదీ లేదు - పెట్టిందీ లేదు. అమ్మా - లేచి చేయి కడుక్కో-" అని అమ్మతో చెప్పి సుబ్బారావు తాతగారి దగ్గరకు వెళ్ళి-

"వాళ్ళ అన్నయ్య వడుగు పదహారురోజులపండగ మూడు రోజులలో వస్తుంది ఒక పరికిణా చొక్కా కుట్టించి తీసుకువెళ్ళి పంపించిరండి - ఉన్నంతవరకూ చాల్లే" అన్నది బామ్మ విసురుగా.

"ఏం - ఎవరన్నా ఏమన్నా అనుకుంటున్నారా?"

"ఎవరూ ఏమీ అనుకోవటంలేదు. అయినా - యివన్నీ ఎందుకూ? అమ్మాయి వెళుతాననంటున్నది; పంపిద్దాము. మీరు వెళ్ళినా సరే లేక అబ్బాయిచేత పంపినా సరే" అన్నది ఖచ్చితంగా బామ్మ.

"నేనే దింపి వస్తానులే. అబ్బాయి వచ్చినా నేను కూడా వెళతాను" అన్నారు సుబ్బారావుతాతగారు.

బామ్మ లోపలకువచ్చి అమ్మతో గుడ్డలు సర్దుకోమని చెప్పి- నాన్నగారిని "నీవుకూడా వెళుతావా?' అని అడిగింది.

"స్కూలుకు వెళ్ళి కనపడి రావాలమ్మా. నేనూ బాపట్ల వెళ్ళాలి.

"నాన్నగారూ కూడా వస్తారు. అనసూయను జాగ్రత్తగా తీసుకువెళ్ళి దింపిరండి - " అన్నది బామ్మ.

నాన్నగారు లోపలకు వస్తూండగా అమ్మ గుడ్డలు మూట కట్టుకుంటూ కనిపించింది.

"నావి కూడా చొక్కా లాగూ నీ మూటలో వేసుకో బాపట్లలో ఇద్దువుగానీ" అన్నారు నాన్నగారు అమ్మతో.

అమ్మ అన్ని గుడ్డలూ మూటకట్టింది. అందరూ బాపట్ల బయలుదేరాదు.

బాపట్లలో బజారులోనే సుబ్బారావు తాతగారు ఆగి అమ్మను అడిగి అమ్మ పరికిణీ, చొక్కా అదికి తీసుకున్నారు - అమ్మకు క్రొత్తగుడ్డలు కొందామని. నాన్నగారూ అమ్మా కలిపి చిదంబరరావు తాతగారింటికి వచ్చారు. అమ్మ చేతిలోని మూట చూచారు.

"గుడ్డల మూట అది తీసుకురావలెనా? నీవు తీసుకురాకూడదూ, నాగూ?' అని అడిగారు చిదంబరరావుగారు.

"ఎవరి మూట వారు మొయ్యవద్దా తాతగారూ?" అన్నది అమ్మ నవ్వుతూ.

"ఆ గుడ్డలన్నీ నీ మూటయేనా?"

"బావవి కూడా ఒక జత ఉన్నాయ్."

"నీవి కూడా అందులోనే వేసి అమ్మాయి చేతనే మోయిస్తున్నావా?

అంతలో పకపకా నవ్వుతూ భారతీదేవిగారు వచ్చి -

"ఓహో - దంపతులు వచ్చారే! అట్లా అంటా వేమిటి? ఎవరికోసం మోస్తుంది నాన్నా? ఇదే మొదలు మొయ్యటానికి....." అన్నది.

"చేసుకునేవారందరూ మోయటంలేదు. దాని కెందుకూ?" అంటూ లోపలకు నడిచారు - అమ్మనూ, నాన్నాగారినీ వెంట బెట్టుకుని.

లోపలకు వెళ్ళగానే బంధువులందరూ-

"దంపతులు వచ్చారు - దంపతులు వచ్చారు" అని నవ్వారు.

"మీ దంపతులేనా వచ్చింది? అప్పుడే ఒంటరిగా తీసుకు వచ్చావేమయ్యా? పెళ్ళి కూడా చేసుకునే వచ్చావా?" అని వంటమనిషి చెంచమ్మగారు విస్తుపోతూ అన్నది.

"చెంచమ్మగారూ - మీరన్నమాటలో చాల పొరపాటు ఉన్నదండీ, పెళ్ళి కాలేదన్న అనుమానం దగ్గర పెట్టుకునే దంపతులనటం పొరపాటు కదూ?" అని అమ్మ అడిగింది.

"కాబోయే దంపతులని అన్నానమ్మా" అని చెంచమ్మగారు మాట మార్చింది.

చిదంబరరావుగారు అమ్మను తీసుకుని మేడమీదకు వెళ్ళి రేటూరులోని విశేషాలు చెప్పమని అడిగారు.

"ఏమి ఉన్నయ్ విశేషాలు? అక్కడ ఉన్న కొద్ది కాలం ఆనందంగా వెళ్ళి పోయింది. ముగ్గురం బ్రహ్మానందంగా కలసి వచ్చాము" అన్నది అమ్మ.

"ముగ్గు రెవరూ?"

"నేనూ, బావా మామయ్య."

"సుబ్బారావూ వచ్చాడా? లోపలకు రాలేదేమిటి?"

"బజారుకు వెళ్ళారు - నాకు క్రొత్త గుడ్డలు కొనుక్కురావటానికి."

కొన్ని క్షణాల కాలం మౌనంగా గడిచింది.

"రేపు పదహారు రోజుల పండుగ కాగానే మీ నాన్నావాళ్ళు మన్నవ వెళ్ళాలను కుంటున్నారు. నీవుకూడా వెళతావా?" అని చిదంబరరావుగారు అడిగారు.

"తీసుకు వెళతానంటే వెళతాను."

"ఎన్నాళ్ళకు తిరిగి వస్తావు?"

"నాదేమున్నది తాతగారూ - మీరందరూ కలిసి ఎక్కడ ఉంచితే అక్కడనే ఉంటాను. ఎప్పుడు రమ్మంటే అప్పుడే వస్తాను."

ఆ సమాధానానికి తాతగారు ఆనందపడిపోయి అమ్మను ముద్దుపెట్టుకుని - కోర్టుకు వెళ్ళే సమయమయిందని క్రిందికి దిగివచ్చారు. సుబ్బారావుగారు చొక్కా, పరికిణీ పట్టుకువచ్చి మేడపైకి వెళ్ళి అమ్మకు ఇచ్చారు.

అమ్మ క్రొత్త గుడ్డలు కట్టుకొని మేడ దిగి క్రిందికి వచ్చింది.

"మామగారు పెట్టినవా? అనీ-

"పెళ్ళికూతురువలే ఉన్నావే!" అనీ బంధువులందరూ హాస్యం చేశారు.

ఆ మాటలన్నీ వింటూ సుబ్బారావుగారు అమ్మతన కోడలయిందనే మురిసి పోయారు. ఆనాడు కొడకూ కోడలుతో ప్రయాణం చేశానని ఆనందపడ్డారు.

బామ్మకు తాతగారికీ బంధువులందరికీ అదోక మధురోహ. అమ్మనూ నాన్నగారినీ చూచిన వారందరూ వారిని దంపతులుగానే ఊహించుకుని సరసోక్తులతో సమ్ముగ్ధులయ్యారు.

మధ్యాహ్నం భోజనాలు కాగానే సుబ్బారావుతాతగారు రేటూరు బయలు దేరారు.

"పదహారు రోజుల పండుగ ఎల్లుండే గదా - ఈ రెండు రోజులూ ఉండండి-" అని అన్నపూర్ణగారు అడిగింది.

"నేను ఉన్నా అబ్బాయి వెళ్ళాలి. ఈ పదహారు రోజుల పండగ వరకయినా సంధ్యవార్చాలిగదా?" అన్నారు సుబ్బారావుగారు.

"అయితే అబ్బాయిని పంపి, మీరు ఉండండి-"

సుబ్బారావుగారు అంగీకరించారు.

పదహారు రోజుల పండుగనాడు రాఘవరావు మామయ్యతోబాటు అమ్మను కూడా కూర్చోబెట్టి హారతులు యిచ్చి మంగళస్నానాలు చేయించారు. ఆ రోజున అన్నా చెల్లెలూ ఇద్దరూ ఒకే విస్తరిలో భోజనం చేయటం సంప్రదాయం కనుక అమ్మా, రాఘవరావుమామయ్య కలిసి భోజనం చేశారు.

పదహారు రోజుల పండుగ ఆనందంగా ముగిసింది. అందరూ కలిసి రెండు రోజులలో మన్నవ వెళ్ళటానికి నిశ్చయించుకున్నాను.

33. విశ్వరూప సందర్శనం

అమ్మనూ, మామయ్యనూ తీసుకుని సీతాపతితాతగారు మద్రాసు ప్రయాణమై మరిడమ్మతాతమ్మను కూడా రమ్మని అడిగారు.

తాతగారి కోరికను నిరాకరిస్తూ మరిడమ్మగారు "నీవు పెళ్ళి చేసుకుంటే రావలసిందే కానీ ఎల్లకాలము నేను ఈదలేను యీ సంసారం. ఓపిక లేదు. నేను రాలేను నాయనా" అని అన్నది.

"నేను పెళ్ళి చేసుకుంటానంటే ప్రస్తుతం రావటానికి ఓపిక వస్తుందా? మాట తప్పనివాడినని మాట అంటేచాలు అనేగా నీ ఉద్దేశం? కేవలం నా కోసమే అయితే ఎవరూ అక్కరలేదు. పిల్లలున్నారు. పిల్ల మరీ దిగులు పడుతుందని..." అని తాతగారు మాటలు సాగదీశారు.

"పిల్ల దిగులు కూడా ఒకనాటిది కాదుగా నాయనా...." మరిడమ్మగారు అక్షర అక్షరం మధ్యలో రాగప్రస్తారం చేసింది.

"దాని ఇంటికి అది వెళ్ళేంతవరకూ మనం జాగ్రత్తగా చూడటం మన బాధ్యత కదా?"

"అంత మూర్ఖత్వ మెందుకూ? ఒప్పుకోరాదుటరా నాయనా-" అన్నపూర్ణమ్మ గారు మందలించింది.

"మీ కేమిటీ? అందరూ ఇప్పుడు బాగానే చెప్తారు. రేపు ఏదయినా అనుభవించవలసిన వాడిన నేను గదా-"

"ఎంతమంది చేసుకోలేదు? నీవేనా ఏమిటీ?" అన్న పూర్ణమ్మగారు కోప్పడింది.

"ఎవరి మనసు వాళ్ళ దక్కయ్యా. ఆ వచ్చే ఆవిడ ఎట్లా ఉంటుందో - వీడా, అల్లరివాడు. ఇదా, నోటిలో నాలుక లేనిది... పిల్లకు తిప్పలు వస్తాయి." తాతగారి దృష్టి భవిష్యత్తు నుండి వర్తమానానికి రానన్నది.

"ఎన్ని తిప్పలయినా ఎన్నాళ్ళు? ఆ పిల్ల బాధ్యత మేము చూచుకుంటాములే మహా ఉంటే - అయిదారేళ్ళు"

"కాదక్కయ్యా - మన నాన్న పెళ్లి చేసుకోకుండా ఉండి మరిడమ్మగారిచేత మన అందరికీ చేయించాడు. కనుక పిల్లలకు ఏ బాధా లేకుండా తల్లిలేని కొరత లేకుండా చూచింది. నా ఒక్కడి సుఖంకోసం పెళ్లి చేసుకుంటే రేపు ఎందరు ఎన్ని బాధలు పడాలో దీర్ఘంగా ఆలోచించండి."

"ఏమయినా సరే. నేను రాలేను నాయనా-" మరిడమ్మగారు భీష్మించింది.

అంతలో చిదంబరరావుగారు వచ్చి-

"సరే ఎక్కడో అక్కడ మనం సంబంధం చూచి పెళ్లి చేస్తే వాడు కాదంటాడటలే. బయలు దేరండి త్వరగా" అని చర్చను ముగించారు.

పదకొండు గంటలకు భోజనంచేసి తాతగారూ, అమ్మా, మామయ్య మన్నవ వెళ్లారు. ఆ రాత్రి మంత్రిప్రగడ రాజమ్మగారు భోజనానికి పిలిచింది. ఆమె అమ్మమ్మకు స్నేహితురాలు. వారిది తాతగారి ఇంటికి ఎదురిల్లు. మొదట రెండు రోజులూ వారు రాజమ్మ గారింటిలో భోజనంచేసిన తర్వాత పూటకూళ్ల ఇంట్లో ఏర్పాటు చేసుకున్నారు. పేరుకు పూటకూళ్ల యిల్లు అయినా పులిపాక మాచమ్మ గారింటిలో ఆదరణకూ ప్రేమకూ కొరత లేదు.

అమ్మకు తడపరపోసి తగ్గింది. పథ్యం పెట్టే రోజుకు బావట్ల నుంచి మరిడమ్మగారు వచ్చింది. మొదట అమ్మకు మాత్రమే అన్నం వండిపెడతానన్నది. తర్వాత అమ్మకు ఆరోగ్యం కలిగేదాకా పదిహేను రోజులవరకూ అందరికీ వండి పెడతానన్నది.

"పదిహేను రోజుల తర్వాత సంగతి ఆలోచిద్దాములే" అన్నారు తాతగారు.

అమ్మకు తడపర పొక్కులన్నీ చెక్కులు ఊడి కురుపులుగా మారాయి. మరిడమ్మగారు వాటినన్నిటినీ ఎప్పుడూ వేప ఆకురసంతో నూనెతో తుడుస్తూ అమ్మకు సేవ చేసింది.

మరిడమ్మగారి మాట ప్రకారం సీతాపతితాతగారు అమ్మకు దొప్పలపూడి నుండి కుమ్మరి కనకమ్మద్వారా రోజూ ఒక అణా పెరుగు తెప్పించేవారు. క్రమంగా తడపర తగ్గి ఆరోగ్యం వచ్చింది.

కోమటి హనుమంతును పిలిపించి అమ్మకు రోజూ ఒక అణా కారప్పూస, ఒక చక్రకేళీ యిచ్చి వెళ్లేటట్లు తాతగారు ఏర్పాటు చేశారు.

హనుమంతు ఎంతో శ్రద్ధాభక్తులతో అది ఒక ఆరాధనగా పడమట బజారు నుంచి తూర్పు బజారుకు వచ్చి అమ్మకు నివేదన చేసి వెళ్ళుతుండేవాడు.

నిత్యమూ తాతగారు అమ్మను కాలవలో వున్న బల్లకట్టు మీదకు షికారుకు తీసుకు వెళ్ళేవారు. ఆ బల్లకట్టుమీద ఆసీనురాలై అమ్మ కాలవ అవతల నున్న మాలపల్లెలోని పిల్లలందరినీ పిలిచి - తన వెంట తీసుకువెళ్ళిన కారప్పున అందరికీ పంచిపెడుతూ ఉండేది.

కొన్ని రోజుల తర్వాత అమ్మ బల్లకట్టు మీదకు బదులుగా దేవాలయానికి వెళ్ళేది. అమ్మ కారప్పూసను దేవాలయంలో నివేదన చేసి అర్చకుడికి కూడా పెట్టేది.

అతడు నివేదన చేయబడిన ప్రసాదం అని కాకపోయినా కారప్పూస గదా అని తినేవాడు. ఆయన అర్చకుడయినా అది జీవనోపాధికోసం అవలంభించే వృత్తి గానే కాని - నివేదనలోని ఆంతర్యమూ, ప్రసాదంలోని ప్రభావమూ ఆయనకు అర్థం కాలేదు.

ఒక రోజున తాతగారు బాపట్ల వెళ్ళారు. ఆ రోజు రాత్రి అమ్మ దేవాలయంలో పడుకున్నది. అర్చకుడు తన చీట్లపేకాట తొందరలో తలుపుకూడా వేయకుండా వెళ్ళాడు.

అమ్మ మెల్లగా గర్భగుడిలోకి వెళ్ళి తలుపులు బిగించుకున్నది. పూర్వం బాపట్లలో భావనారాయస్వామి వారి కోవెలలో చేసినట్లు అమ్మవారిని నఖశిఖపర్యంతం నిశితంగా పరీక్షించింది. దగ్గరలో ఉన్న ఒక కొండ రాయినీ, ఉలినీ తీసుకువచ్చి ఆ రాతిపై అమ్మవారి చిత్రాన్ని గీచింది.

విగ్రహానికి ఉన్న అలంకారాలన్నీ మామూలు రాతికి అలంకరించింది.

ఇప్పుడు ఏది అమ్మవారు ? అని అమ్మ తనలో తానే ప్రశ్నించుకున్నది. అలంకృతమయిన సామాన్య శిలా? అలంకార రహితమయిన శిల్పమా? రేఖా విలసితమయిన శిలా? అమ్మవారి కంఠాలంకృతమయిన హారాలన్నీ తీసి తెంచి వేసింది. పూలూ, దారమూ, చమికీ అన్నీ వేరయినాయి. నివేదన చేసిన కారప్పూసను చూచింది. అందులోని సెనగపిండీ, నీళ్ళూ, ఉప్పూ, కారమూ,

నూనే - దానిని తయారుచేసేందుకు అవసరమయిన నూనే - దానిని తయారుచేసేందుకు అవసరమయిన పళ్ళేలూ, భాండీ - చేసేవాడూ, అమ్మేవాడూ, కొనేవాడూ - అన్నీ దృష్టిపథంలోకి వచ్చాయి. అన్నింటిలోనూ అంతర్లీనంగా అమ్మవారు సాక్షాత్కరించింది. అంటే అన్నివస్తువులూ కలిసి అమ్మవారా? ఏ వస్తువుకు ఆ వస్తువే అమ్మవారా ?

అమ్మ గుడి వెలుపలికి వచ్చింది. గుడివంక చూచింది. అమ్మవారు ప్రత్యక్షమయింది. ఆలయమే అమ్మవారా ? ఆలయంలో అమ్మవారా ?

ఆలయశిఖరంవైపు దృష్టి సారించింది. అమ్మవారు కనుపించింది. రాతి రాతిలోనూ అమ్మవారే.

ప్రాంగణమంతా కలయదిరిగింది. నేలపై నడుస్తున్నట్లు లేదు. పాదాలకు అమ్మవారే తగిలింది. ప్రతి ఇసుక రేణువులోనూ అమ్మవారే దృశ్యమాన అయింది.

ప్రక్కకు చూచింది అమ్మ. అక్కడ ఒక వృక్షం. ఆ వృక్ష భాగాలన్నిటిలోనూ అమ్మవారే. కాండమూ, కొమ్మలూ, ఆకులూ, పూవులూ, కాయలూ - అన్నిటిలోనూ అమ్మవారే.

ఆకాశం వంక అవలోకించింది. నక్షత్రాలకు బదులుగా అమ్మవారి రూపాలే అనంతంగా కనిపించాయి.

ఎటు చూచినా - పైనా, క్రిందా, ప్రక్కలా - అంతటా అమ్మవారే !

ఏమిటిది? ఇంతమంది అమ్మవార్లా? లేక - ఇన్నింటిలోనూ ఒకే అమ్మవారా? ఒకే అమ్మవారే ఇన్ని ఆకృతులు ధరించిందా? ఒకే అమ్మవారే అనంతకోటి రూపాలతో విశ్వమంతా తానే అయి భాసిస్తునదా? విశ్వరూప సందర్శనమంటే - విశ్వంలోని ప్రతి అణువులోనూ, ప్రతి వస్తువునూ ఒకటిగా చూడటమేనా?

తనలో తానే విచికిత్స చేసుకుంటూ - అమ్మవారి విగ్రహాన్ని తిరిగి మామూలుగా అలంకరించి - ఆలయ ద్వారబంధాలు యథాలీతిగా వేసి ఇంటికి వచ్చింది.

అమ్మ ఇంటికి చేరేసరికి తెల్లవారుజామున నాలుగూ ముప్పావు అయింది.

ఇంటికి వచ్చి మామూలుగానే ముఖం కడుక్కుంటూ ఉండగా మరిడమ్మగారు చూచినా - అమ్మకు అప్పుడప్పుడు మంత్రిప్రగడ రాజమ్మగారింటికి వస్తూపోతూ ఉండే అలవాటు ఉన్నందున ఆరోజునా అమ్మను గురించి ప్రత్యేకంగా ఆలోచించలేదు.

సీతాపతితాతగారు మరునాడు బాపట్ల నుండి తిరిగి వచ్చారు. గరికపాడులో ఉండే - అమ్మ మేనత్తఅయిన వెంకటసుబ్బమ్మగారికి అనారోగ్యంగా ఉన్నందువలన కానుపుకు గుంటూరు తీసుకువెళ్ళారు. ఆ విషయం తాతగారు మరిడమ్మగారికి చెప్పగానే ఆమె పెంచిన మమకారంతో మితిలేని బాధపడి "తల్లిలేని పిల్ల అని అతి గారాబంగా పెంచాను. యమధర్మరాజు చేతిలో పెట్టాను." అని యేడుస్తూ ఆ రోజంతా భోజనమే చేయలేదు.

"ఇప్పుడు బాధపడి ఏమి ప్రయోజనం? - వెళ్ళి చూచిరా...?" అన్నారు తాతగారు.

"ఇప్పుడు ఎట్లా వెళ్ళేదిరా, నాయనా? వెళ్ళిమాత్రం చేసేది ఏమున్నది?"

"అదేమిటి? - అట్లా కాదులే. నేను ఎవరినయినా తీసుకువచ్చి వండించు కొంటానులే. చూచివస్తే కొంత వరకు మనస్సుకు ఉపశాంతి" అన్నారు తాతగారు.

"ఇప్పుడు ఎవరువస్తారు ఇక్కడకు?"

"కాకుమాను వెళ్ళి మన్నవ భీమయ్యగారి భార్యరంగమ్మగారిని తీసుకు వస్తాను. పిల్లను తీసుకు వెళతే తీసుకు వెళుదువుగానీ - లేకపోతే ఉంటుంది. ఆమె వండి పెడుతుందిగా-"

"నేను వెళ్ళితే - పిల్ల నన్ను వదలి పెట్టి ఉంటుందా!"

"తెనాలిలో ఉండదుగానీ - ఎక్కడయినా ఉంటుంది."

"ఎందుకూ అవకాశం ఉన్నప్పుడు వదలి పెట్టి పోవడం? దానిని వదలి నేనే ఉండలేను. తీసుకు వెళతాను... సరే - నీవు కాకుమాను వెళ్ళి ఆమెను తీసుకురా. తరువాతనే మేము వెళతాము." అని నిర్ణయించింది మరిడమ్మగారు.

ఎట్లాగయితేనేమి - తాతగారు కాకుమాను నుండి రంగమ్మగారిని

తీసుకువచ్చి మరిడమ్మగారు గుంటూరు ప్రయాణమయ్యే సరికి పదిరోజులు పట్టింది.

పదకొండవరోజున తెల్లవారుజామున రెండెద్దుల బండి కట్టుకుని మరిడమ్మ గారూ, అమ్మా పచ్చలతాడిపర్రు వెళ్ళారు. అక్కడికి చేరేసరికి తెల్లవారింది. బస్సుకోసం వారు రోడ్డుమీద కూర్చున్నారు. ఆ దారినే ఒక ఘోషాయి వెళ్ళుతూ అమ్మనుచూచి నమస్కారంచేసి ఒక క్షణం నిలబడి - వెనక్కు తిరిగి తిరిగి చూస్తూ బరువుగా అడుగులో అడుగు వేసుకుంటూ నడుస్తున్నాడు.

"నీదే వూరబ్బాయి?" మరిడమ్మగారు అడిగింది. అతడు మాట్లాడ లేదు.

"ఎవరూ ఆ అబ్బాయి ? ఇటు తిరిగి తిరిగి చూస్తున్నాడు. - ఎరిగినవాడులె -" అన్నది అమ్మతో మరిడమ్మగారు.

"ఎవరో మరి - నేనూ ఇదే చూడటం."

"గోసాయి అయిందీ, స్వాములవారు అయిందీ తెలియకుండా ఉన్నాడే-"

"వారిద్దరికీ భేదం తెలిస్తేనేగా అర్థంకావటానికి? ముందు గృహస్థులకూ స్వాములవారికీ తేడా ఏమిటి?"

"గృహస్థు అంటే ఇల్లూ, వాకిలీ, పెళ్ళామూ, పిల్లలూ కలిగి ఉండటమూ. సన్యాసి అంటే ఆ లక్షణాలేమీ లేకపోవటమూ..."

"కనపడేటట్లుగానా?" అమ్మ ప్రశ్నించింది.

"ఉంటే కనపడకుండా ఎట్లా ఉంటాయి?"

"నేను నీ దగ్గర ఉన్నాననుకో. నీతో యేదో మాట్లాడుతున్నాను. మనసు ఎక్కడో పనిచేస్తున్నది. ఏమో తినాలనిపిస్తున్నది. అవి ఇక్కడ లభ్యం కావు గాబట్టి మానుకున్నాను. మనసులో తినాలని ఉండి బాహ్యంగా తినకపోయినా తిన్నట్టు కాదా?"

"అటువంటివాడు ఆ గుడ్డ కట్టుకోడు. గట్టివాడే కట్టుకుంటాడు." మరిడమ్మ గారు సమర్థించటానికి ప్రయత్నించింది.

"నాకు బయలుదేరేటప్పుడు అన్నం తినాలని అనిపించలేదు. ఇప్పుడు అనిపిస్తున్నది అట్లాగే ఎవరికయినా, ఏ విషయంలో నయినా..."

"అయినా నీ కెందు కీ ఆలోచనలూ?"

"అదే మానవ లక్షణం. తనకు తగినవీ, చేయగలిగినవీ, అనగలిగినవీ, వినగలిగినవీ మాత్రమే తలంపుకురావు ఏవేవో ఆలోచనలు వస్తూ ఉంటాయి. తనకు ఏది అవసరమో అంతవరకే ప్రేరణ కలిగితే బాగుండును. ఆ అవసరానికి ఏమి అవసరమో ఇదంతా...?"

"ఇవాళ నీ నోటివెంట అన్నీ ఏవో పెద్ద పెద్ద మాటలు వస్తున్నాయే...."

"ఇంతకూ ఆ వెళ్లేది సన్యాసా, గృహస్థా?"

"సన్యాసాశ్రమంలో పతనమై పెళ్లిజేసుకుని - భార్యా, సంతానమూ కలిగిన వాళ్లను గోసాలయిలంటారు. ఆయన ఆ తెగ."

"అంటే వారు గృహస్థ స్వాములవార్లా?"

"నీ ముఖం - గృహస్థ స్వాములవా రేమిటి?"

"వేరే ఆలోచనకలవాడు ఆ గుడ్డ కట్టుకోడంటివే ఇందాక?"

మరిడమ్మగారు పకపకా నవ్వింది.

"మనుషుల నడవడినిబట్టేగా ఇన్ని తెగలు; మనిషి మనస్తత్వం ఎన్నిరకాలు!" అని అమ్మ అంటూ ఉండగా బస్సు వచ్చింది. మరిడమ్మగారూ, అమ్మా అందులో ఎక్కి కూర్చున్నారు. అందువలన గోసాయికి అమ్మతో మాట్లాడటానికి అవకాశం లభ్యంకాలేదు. అతడు అమ్మ వంక కనులప్పగించి చూస్తూనే ఉన్నాడు. బస్సు సాగింది.

"నీ కింత పెద్ద పెద్ద ఆలోచన లేమిటమ్మా?" బస్సులో మరిడమ్మ గారు అమ్మను మళ్లీ అడిగింది.

"నీ పెంపకం కాదూ?"

"నా దగ్గర ఎంతమంది పెరగలేదూ? వారంతా యిట్లా అయినారా? నీవు

ఆ ప్రహ్లాదుడూ, ధ్రువుడూ వలే అవుతావేమో-"

"వాళ్ళ చిన్నవయస్సులోనే ఎంతగానో ఎదిగిపోయారు. నాకు అన్నీ ఆలోచనలూ, అన్నీ అనుమానాలే-"

ఇక - మరిడమ్మగారు సమాధానం చెప్పలేదు. బస్సులో నుండే ఆలోచనా సాగరంలోకి దూకింది.

ఆమె సాగరతీరం చేరకముందే బస్సు గుంటూరు చేరింది.

4

34. అవ్యాజానురాగం

అమ్మ, మరిడమ్మతాతమ్మ గుఱ్ఱపుబండిలో బ్రాడీపేట మూడవలైనులో చింతపల్లి రామచంద్రరావుగారి ఇంటి దగ్గరకు వెళ్ళారు.

ఆ ఇంటిలో రామచంద్రరావుగారి తమ్ముడైన గుండేలురావు పక్షవాతంతో ఇరవై సంవత్సరాల నుండి బాధపడుతూ ఉన్నారు. ఆయనకు భార్యా పిల్లలు లేరు. రామచంద్రరావుగారి కుటుంబమే ఆయనకు ఆశ్రయమయినా - రామచంద్రరావుగారికి ద్వితీయ కళత్రమయినందున వారి మీద శ్రద్ధాభక్తులే అంతంతమాత్రంగా ఉండేవి ఆమెకు.

ఆమె పేరు గౌరమ్మ. గుణాన్ని బట్టి అందరూ గయ్యాళి గౌరమ్మ అనేవారు.

అమ్మ గుఱ్ఱపు బండి దిగి సరాసరి గుండేలురావుగారి మంచం వద్దకు వెళ్ళింది. బస్సుస్టాప్‌లో తాతమ్మ నారింజపండ్లు కొన్నది. అందులో నుండి అమ్మ ఒకపండు తీసుకుని గుండేలురావుగారికి ఇచ్చింది. ఆయన వల్చుకోలేక ప్రక్కన పెట్టుకున్నారు. అమ్మ పండువలిచి ప్రేమతో ఆయన నోటిలో పెట్టింది మూత్ర విసర్జనతో కలుషితమైన వస్త్రాలు తీసి, శుభ్ర వస్త్రాలు పక్కలో పరిచింది.

అయాచితంగానూ, అత్యంత అనురాగంతోనూ అమ్మ చేసే ఉపచారం గుండేలురావుగారి గుండెను పులకింపజేసింది.

ఆయన రామభక్తుడు కావటంతో తన ఇష్టదైవమే తనను అనుగ్రహించే నిమిత్తం యిట్లా ప్రత్యక్షమయినాడని భావించారు.

ఆ ఆనందపారశ్యంలో 'రామచంద్రా, రామచంద్రా... అనుకున్నారు - ఉత్తేజితులై. ఆ సంబోధన అన్నగారైన రామచంద్రరావుగారు విని తననే పిలుస్తు న్నాడనుకుని తమ్ముడిని సమీపించి -

"ఏమిటీ" అని అడిగారు.

గుండేలురావుగారు అమ్మ వంకనే తదేకంగా చూస్తూ కన్నీరు కారుస్తూ - అన్నగారు తిరిగి పిలిచేదాకా గమనించలేదు.

గుండేలురావుగారు తన అనుభూతిని వివరిస్తుంటే - "యింతకూ యీ అమ్మాయి ఎవరు?" అని అడిగారు రామచంద్రరావు.

"రాముడే... రఘురాముడే..." అని గుండేలురావు గారి గద్గద కంఠం పలుకుంతుంటే-

"నేను మీ ప్రక్కభాగంలో ఉన్న శేషగిరిరావుగారి బావమరది కూతురిని" అన్నది అమ్మ.

"ఎప్పుడు వచ్చావమ్మా?"

"ఇప్పుడే. సరాసరి దొడ్లోకి వచ్చాను. కాళ్ళు కడుక్కున్నాను. ఇంతలో మీరు కనపడ్డారు. ఇక్కడకు వచ్చాను."

"ఓహో... ఆ గుళ్ళపుబండి దిగి వచ్చింది నీవు, ఆ ముసలమ్మగారూనా? ఇంతకూ శేషగిరిరావుగారు మీకు ఏమవుతారన్నావూ?"

"శేషగిరిరావుగారి భార్య నాకు మేనత్తా, ఆ ముసలమ్మగారికి మేనకోడలూ-"

"నా మొదటి భార్య శేషగిరిరావుగారి చెల్లెలే. మనమంతా బంధువులమే. అయితే - నీవు పెద్దబావమరది, అంటే - సీతాపతిగారి కుమార్తెవా?"

అంతలో వాకిట్లో నుండి పిలుపు విని రామచంద్రరావుగారు బయటకు వెళ్ళారు.

గుండేలురావుగారు అమ్మచేతిని తన చేతిలోకి తీసుకుని ఆ చేతి సొకుమార్యానికీ, సౌందర్యానికి సమ్ముగ్ధుడవుతూ తన గుండెలపై, నొసటిపై, కనులపై రాచుకుంటూ-

"ఇంటికి వెళ్ళి అన్నం తిని - రా - అమ్మా-" అన్నారు.

అమ్మ ఇంటికివెళ్ళి మరిడమ్మగారితో తనకు ఆకలిగా లేదనీ, తను భోజనం చేయననీ, తనకోసం ఎదురు చూడవద్దనీ చెప్పి - బుట్టలో ఉన్న ఒక నారింజ పండు తీసుకుని వస్తూండగా సుబ్బమ్మగారు చూచి-

'ఊళ్ళోకి వచ్చి యింతసేపయితే - ఎక్కడ ఉన్నావు?" అని అడిగింది.

"'గుండేలురావుగారి దగ్గర"

"సుందరీ, ఆదిలక్ష్మి బడినుండి వచ్చి నీవు వచ్చావని విని నీ కోసం వెతుకుతూ వెళ్ళారు..." అని సుబ్బమ్మగారు చెప్తూ ఉండగానే వారూ వచ్చారు.

"ఎక్కడున్నా వనసూయా?" ఇద్దరూ ఒకేసారి ప్రశ్నించారు."

"గుండేలురావుగారి దగ్గరున్నాను."

"ఎబ్బే - ఆయన దగ్గర వాసన. అన్నీ మంచంలోనే. ఆయన దగ్గరకు ఎందుకు వెళ్ళావు?"

"నాకు ఆయన దగ్గరే కూర్చుందామనిపిస్తున్నది."

"అయితే నీవు వెళ్ళు - మేము రాము. మేము ఆడుకుంటాము."

వాళ్ళిద్దరూ వెళ్ళారు. అమ్మ మరొకసారి సుబ్బమ్మగారితోనూ, మరిడమ్మ గారితోనూ చెప్పి గుండేలురావుగారి వద్దకు వెళ్ళింది.

ఆనాటి నుండీ అహర్నిశమూ, అనుక్షణము గుండేలురావుగారి పరిచర్యలోనే అమ్మకు కాలక్షేపము. ఆయనకూ అందులోనే అనిర్వచనీయమయిన సంతోషమూ, సంతృప్తి, ఒక క్షణం అమ్మ కనుమరుగయితే కలవరమూ, కలతా. ఆ రాకకోసం, ఆ స్పర్శకోసం, ఆ మాట కోసం తీవ్రనిరీక్షణ. ఆ స్పర్శలో ఏదో అలౌకికానుభూతి - ఆ మాటలో ఎంతో తియ్యదనమూ - ఆ చూపులో ఏమిటో చల్లదనమూ - ఆయనకు గోచరించేవి. అమ్మ సన్నిధిలో ఉన్నంతకాలమూ అమ్మలో నుండి ఏదో శక్తి తనలోకి ప్రవేశిస్తున్నట్లూ - తన నుండి ఏమిటో అమ్మలోకి ప్రవహిస్తున్నట్లూ - ఆయనకు అనుభూతమయ్యేది.

ఆ దివ్యానుభవంతో పదిహేను రోజులు గడిచిన పిమ్మట ఆయనకు తన అంత్యకాలం సమీపించినట్లు అవగతమయింది.

అన్నగారిని పిలిచారు. అమ్మ పక్కలోనే ఉన్నది. అన్నగారిని కూడా పక్కలో కూర్చోమన్నారు. ఒక చేతితో అమ్మ చేతినీ, మరొక చేతితో అన్నగారినీ పట్టుకుని-

"అన్నయ్యా-" అతని కంఠం పెగల్లేదు. కన్నులు సజలమయినాయి.

ఒకసారి కన్నీటి తెరలను చీల్చుకుని అమ్మను ఆపాద మస్తకమూ అవ లోకించి-

"మన పక్కలో కూర్చున్నది ఒక అమ్మాయి కాదు. ఒక దివ్యశక్తి సన్నిధిలో మనం ఉన్నాము. ఈ పదిహేనురోజులూ ఎంతో ఉదారంగా ఉపచారం చేసింది. అమ్మలా ఆదరించింది, రాముడై రక్షించింది.

"అన్నయ్యా - నా మాట నమ్ము. నా రాముడే నా కోసం ఇట్లా అవత రించాడురా. లేకపోతే నాపై అంత కరుణ ఎవరికి ఉంటుంది ? అసలు ఆ దయార్ద్ర హృదయం ఒక్క నా రాముడికి మాత్రమేగా ఉన్నది ! ఆ నళినాయత లోచనాలూ, ఆ విశాల ఫాలభాగమూ, ఆ కరుణామయదృక్కులూ, ఆవచో మాధుర్యమూ, ఆ గంభీరాకృతీ ఓహ్ నా రాముడే అన్నయ్యా - నిస్సందేహంగా రఘురాముడే అన్నయా- నా రాముడికి నా మీద ఎందుకింత అనుగ్రహం కలిగింది? ఆ దయాపయోనిధి నాపై ఎందుకిట్లా పొంగి పొరలింది? నేనేమి చేశాననీ? నేనేమయినా యాగాలు చేశానా? తపస్సు చేశానా?

నా రాముని ప్రేమకూ, కరుణకూ కారణం లేదు. అందుకే ఈ దీనుని కోసం రూపం దాల్చి వచ్చాడు.

అన్నయ్యా - నేనేదో చెపుతున్నానని అనుకోవద్దు. ఈ అమ్మ కేవలం రాముని రూపమే. ఎవరేమనుకున్నా నీవు మాత్రం యీ అమ్మను నమ్ముకో - మనసా పూజించుకో-

నాకు వ్యవధి లేదు. లేకపోతే ఈ రహస్యం ఎంత మందికి వెల్లడించే వాడినో, వేయినోళ్లతో జగత్తంతా చాటేవాడిని.

బంధువులెవరూ అమ్మను గుర్తించినట్లులేదు. అందుకే అంత అలక్ష్యం చేస్తున్నారు. ఔను - మహాత్ములెప్పుడూ మట్టిలో మాణిక్యంవలే నిగూఢంగానే ఉంటారు. వారి కరుణ ప్రసరిస్తేగానీ ఎవరూ వారిని ఎరుగలేరు.

పదిహేను రోజుల నుంచీ చూస్తున్నాను - ఈ అమ్మ అన్నం తిన్నదీ లేనిదీ కూడా విచారించినవారు ఎవరూ లేరు.

అలుకు గుడ్డలో కూడా దేవుని దర్శించమని ప్రబోధించే మతంలోని మనం - కనికరించి దేవుడు కనిపిస్తే అలుకుగుడ్డవలే చూస్తున్నాము.

ప్రస్తుతం ఇదే నా ఆవేదన లోకరక్షణ కోసం వచ్చిన ఈ అమ్మను లోకమే రాక్షసియై భక్షిస్తుందేమో, ప్రేమతో పాలు పోసే యీ అమ్మచేతిని లోకమే కాలనాగయై కాటేస్తుందేమో. మెత్తని యీ హృదయం ఏ పాషాణాల తాకిడికి ఏమవుతుందో..."

కన్నీటితో గుండేలురావుగారి వక్షస్థలీ, పక్కా తడిసి పోయినాయి. రామచంద్రరావుగారు నిర్విణ్ణులై పోయారు. అమ్మ నిశ్చలంగా తనకేమీ సంబంధించనట్లు కూర్చున్నది.

అంతలో గుండేలురావుగారి కొరకు అన్నం తీసుకు వచ్చారు.

వెంటనే అమ్మ ఆ అన్నం అందుకుని -

"నేను కలిపి పెట్టనా నాయనా -" అని అడిగింది.

"చిన్నపిల్లవు - నీ కెందుకులే అమ్మా?" అన్నారు రామచంద్రరావుగారు.

"అట్లా అనవద్దు. ఒక ముద్ద పెట్టనివ్వు. అమ్మచేతి మీదుగా ఒక మెతుకు తిన్నాచాలు...." అని గుండేలురావుగారు అమ్మ చేరువకు జరిగారు.

అమ్మ అన్నం కలుప ప్రారంభించింది.

"అన్నయ్యా - ఎందుకయినా సమయం రావాలి. అమ్మపై మనకు విశ్వాసం కలగటానికయినా - అమ్మకు మనపై కరుణ కలగటానికయినా, ఇందులో ఏది ముందో ఏది వెనుకో చెప్పలేను.

ఏమయినా నీవు మాత్రం అమ్మపాదాలు వదలవద్దు. అమ్మపై నమ్మకమే మనకు రక్ష-

గుండేలురావుగారు నంగి మాటలతో అన్నగారికి తన విశ్వాసాన్నీ, అను భవాన్నీ చెపుతుంటే అమ్మ అన్నం కలిపి గోరుముద్దలు చేసి పసిపిల్లవానికి వలే నోటికి అందించింది.

గుండేలురావుగారి కన్నులతోపాటు, రామచంద్రరావుగారి కన్నులు కూడా జలజలా వర్షించాయి.

గుండేలురావుగారు ఆ ముద్దలు మ్రింగలేక మ్రింగుతూ-

"దుర్లభ మనుకున్న కరుణ అవ్యాజంగానూ అయాచితంగానూ నాపై ప్రసృతమయింది. అదృష్ట వంతుడిని....." అంటూ కనులు మూశారు.

రామచంద్రరావుగారు గొల్లుమన్నారు.

ఇరుగుపొరుగు జనం ప్రోగయినారు.

వచ్చినవారందరూ ఆయన పోయినందుకు విచారించటం కంటే - యిరవై సంవత్సరాలనుండీ ఆయన పడుతున్న బాధ విరగడ అయినందుకే గాక చరమదశలో అమ్మ పరిచర్యలో ఆయన పొందిన సుఖశాంతులకు ఎంతో సంతోషపడ్డారు.

35. ఉపజ్ఞ

అమ్మ గుంటూరులో ఉండగా ఒక రోజున బజారు వెంట వెళ్ళుతూ ఉన్నప్పుడు పురాణ పఠనం వినిపించి లోపలకు వెళ్ళింది. అది ఒక స్వాములవారి ఆశ్రమం. వారు సకల శాస్త్ర పారంగతులూ, పురాణ ప్రవచనంలోనూ, వేదాంత విచారణలోనూ ప్రసిద్ధులూనూ.

అమ్మ వరుసగా 30 రోజుల ఆ ఆశ్రమానికి వెళ్ళింది. స్వామివారు అమ్మనూ పలుకరించలేదు. అమ్మ స్వామివారినీ పలుకరించలేదు.

స్వామివారు అమ్మను రోజూ చూస్తూనే ఉన్నారు. రోజూ ఒక్కతే వస్తుంది. కూర్చుంటుంది. ఎవ్వరితో మాట్లాడదు. ఏమీ వింటున్నట్లు కూడా కనుపించదు. తన దగ్గరకు రాదు. తనకు నమస్కరించదు. తనకేమీ అర్థం కాలేదు. కాని ఆ కన్నుల్లో, ఆ చూపుల్లో, ఆ ముఖంలో ఆ వర్చస్సులో, ఏదో 'అలౌకికత' స్ఫురిస్తున్నది. తనను కూడా కదిలిస్తున్నది. ఆలోచనలు కలిగిస్తున్నది. ఎవరీ అమ్మాయి? - కాని తాను ఒక పీఠాధిపతి; సర్వసంగ పరిత్యాగి. ఆ అమ్మాయి ఎవరైతే తనకేమి? - అందులో ఆడపిల్లను గురించి చింతన తన కెందుకు? తానుగా పిలిచి పలుకరించటమా ? - ధర్మ విరుద్ధమయిన విషయం. సంప్రదాయం అంగీకరించని సంగతి.

కాని ఈ ధర్మాలకూ సంప్రదాయాలకూ కట్టుబడదు మనస్సు. మనస్సులో రేగిన కల్లోలానికి కదిలిపోయి 81వ రోజున స్వామివారు అమ్మను పిలిచారు.

స్వామి : అమ్మా ! నీ వెవరు?

అమ్మ : నేను ఎవరో తెలియకనే తెలుసుకుందామని వచ్చాను.

స్వామి : మీది ఏ కులం ?

అమ్మ : శుక్ల శోణితాల కేదో - అదే.

స్వామి : అయితే - నీవు నా దగ్గర ఉంటావా, అమ్మా?

అమ్మ : ఉండను.

స్వామి : ఎందుకని ?

అమ్మ : మీరు ఎవరో స్వాములవారు. మా ఊరు, మా నాన్న, తాతమ్మ నాకున్నారు. వారిని వదలిపెట్టి ఉండలేను. వారి గుర్తు లేనప్పుడు మీ దగ్గరకు వచ్చేపనీ లేదు.

స్వామి : మంత్రం చెబుతాను - చెప్పకుంటావా?

అమ్మ : ఎందుకో ?

స్వామి : ఇందాక నేను ఎవరో తెలుసుకుందామని వచ్చానంటివే?

అమ్మ : అంటే - దానికి మంత్రమే కావలెనా ?

స్వామి : కావద్దా మరి ?

అమ్మ : అసలు మంత్రమంటే ఏమిటి?

స్వామి : కొన్ని పవరుగల అక్షరాలు కలిపి - కొన్ని వాక్యాలు చేసి - వానికి కొంతశక్తి యిచ్చి అది మాబోటివారు రహస్యంగా మీకు చెప్పేది.

అమ్మ : అక్షరాలలో పవరుగల వంటారు? సమాధానం చెప్పటానికి స్వామి వారికి కొంత వ్యవధి అవసరమయింది. "అక్షరాలకు శక్తి మేము యిస్తాము."

అమ్మ : ఇందాక మీరు పవరుగల అక్షరములంటిరే ! మీకే యిచ్చే శక్తి ఉన్నప్పుడు గడ్డిపోచకు కూడా ఇవ్వవచ్చును.

స్వామి : ఇవన్నీ నీ కెందుకమ్మా ? చిన్న పిల్లవు. చెప్పేది చెప్పించుకో -

అమ్మ : చెప్పేది వింటాను చెప్పించుకోలేను. చెప్పించు కోవటమంటే మీ రన్నదెల్లా అనాలి. చెప్పేది వింటాను.

దిగ్భ్రాంతి చెందారు స్వామివారు. ఇంత చిన్నపిల్లకు ఇంత పెద్దమాట లేమిటి - అని విస్తుపోయారు. ఈ వింత ప్రశ్నలూ, సమాధానాల ముందు తన పాండిత్యం మూగవోతున్న దేమిటి - అని ఆశ్చర్యచకితులై ఆలోచనలో పడ్డారు. అంతలో శిష్యులు స్నానానికి పిలిస్తే స్వామివారు "స్నానం చేసి వస్తాను" అని వెళ్లారు.

అమ్మ బంధువుల ఇంటికి వెళ్ళింది.

మరునాడు అమ్మ స్వామివారి దగ్గరకు వెళ్ళుతూ గులాబీలూ, సంపెంగలూ తీసుకుని వెళ్ళింది. దారిలో సైడుకాలవ కడుగుతున్నారు. చేతిలో పూలు ఉన్నా దగ్గరున్న పూల సుగంధాలను అణిచివేసి - సైడుకాలవ దుర్వాసన "గుప్పు" మన్నది - ఏమిటిది? అని ఆలోచిస్తూ అమ్మ స్వామివారి దగ్గరకు చేరింది. అందరూ అప్పడే ప్రసాదం తీసుకుని బయటకు వచ్చారు. అందులో ఒకరు "ఏ అమ్మాయ్, పో-పో- ఇక్కడ ఏమీలేదిప్పడు" అన్నారు.

అమ్మ : లేనిదానికొరకు రాలేదు. ఉన్నదాని కొరకే వచ్చాను.

ఒకరు : ఏమిటి నీకు ఉన్నదిక్కడ?

అమ్మ : మీకు లేనిదీ, నాకు ఉన్నదీ.....

ఒకరు : ఎవరదీ ? తలపొగరు సమాధానం...

అమ్మ : ఎవరిదీ ?

స్వామివారు లోపలనుండే విని కేకవేశారు - "ఎవరూ?" అని.

ఒకరు : ఎవరో ఒక అమ్మాయండీ- అంటూ అమ్మ చెంపమీద చెళ్ళున కొట్టారు. స్వామివారు మళ్ళీ కేకవేశారు- "రానివ్వు లోపలకు" అని. అమ్మ లోపలకు వెళ్ళింది.

స్వామి : ఏమిటమ్మా మోత మ్రోగింది?

అమ్మ : రెండు కలిసిన శబ్దం.

స్వామి : అంటే ? తన చెంప మీద చేతితో తానే కొట్టుకుని చూపించింది అమ్మ.

స్వామి : ఆ మోత నీవు కొట్టుకున్నదా ? ఎవరయినా కొట్టిందా - అమ్మా?

అమ్మ : మీరు చూడక విన్నది ఎవరో కొట్టింది. చూస్తూ విన్నది కొట్టుకున్నది.

స్వామి : నాకు సమాధానం చెప్పిన వాడేనా నిన్ను కొట్టింది?

అమ్మ : మీకు చెప్పటం విన్నాను కాని మనిషిని చూడలేదు. కొన్ని క్షణాలు మౌనంగా గడిచినయ్. స్వామి వారికి అమ్మతో ఏదయినాసరే మాట్లాడవలెనని ఉత్సాహంగా ఉన్నది. ఎక్కువకాలం నిశ్శబ్దంలో కలిగిపోవడం ఇష్టంలేక స్వామి వారే సంభాషణ ప్రారంభించారు.

స్వామి : అమ్మా - అన్నింటిలోకి యేది ఎక్కువ వాసన?

అమ్మ : సైడు కాలువ స్వామీ ! స్వామివారు ఆశ్చర్యపోయి అర్థంకాక అడిగారు - "ఎందువల్ల" అని.

అమ్మ తాను వచ్చేటప్పడు జరిగిన సంగతి చెప్పింది. స్వామివారు నవ్వి అన్నారు- "పూలల్లో నమ్మా" అని.

అమ్మ : పూలల్లో అని అడుగలేదుగా. ఏది ఎక్కువ అని అడిగారు. అందువల్ల నా అనుభవాన్ని చెప్పాను.

స్వామి : అన్ని పూలల్లో యేది మంచివాసనో చెప్పమ్మా-

అమ్మ : ఏది ఇష్టమయినవారికి అది మంచివాసన. కొంచెంసేపు మళ్లీ మౌనంగా గడిచింది. ఎవరి తోటీ మాట్లాడటానికయినా విముఖంగా ఉండే స్వామివారు క్షణ మౌనాన్ని కూడ సహించలేక పోయారు.

స్వామి : మధ్యాహ్నం నుండి రాలేదేమమ్మా?

అమ్మ : అప్పడు వచ్చే తరుణం రాలేదు. ఇప్పడు వచ్చింది - వచ్చాను.

స్వామి : తరుణమంటే ఏమిటమ్మా?

అమ్మ : తప్పించుకుందామన్నా తప్పనిది - చేద్దామన్నా చేయలేనిది - వీటన్నింటినీ నడిపించేది - నాయనా!

స్వామివారు ఆ సంబోధన విని నివ్వెరపోయారు.

స్వామి : నాయనా - అంటున్నావెందుకు నన్నూ?

అమ్మ : అది నా విధి.

స్వామి : విధి అంటే...?

అమ్మ : విధానమే విధి - విధే విధానం.

స్వామి : అంటే యేమిటమ్మా?

అమ్మ : విధి కర్త. విధానం కర్మ. అమ్మకు ఎలాగయినా మంత్రోపదేశం చేయాలని స్వామివారికి ఆసక్తి కలిగింది.

స్వామి : ఇంతకూ మంత్రం చెప్పకుంటావా, లేదా?

అమ్మ : మంత్రాన్ని గురించి మీరు వివరించటం చాలలేదు. చాలితే చెప్పకునే దాన్ని.

స్వామి : పోనీ, నీవు చెప్ప-

అమ్మ : అయితే ఆ మంత్రం చెప్పేదా, వివరించేదా ?

స్వామి : నీ ఇష్టం. ఏమి చేసినా సరే నమ్మా. రెండూ అవసరంగానే ఉన్నాయి.

అమ్మ : అయితే నే నెవరినై చేయాలి ? స్వామివారు ఆనందం పట్టలేక తన ఆశ్రమమూ, దాని విధులూ, అవధులూ మరచి - అమ్మను దగ్గరకు తీసుకుని - ముద్దు పెట్టుకుని అన్నారు. "నీవు అమ్మాయివే కానీ, అమ్మగా ఉన్నావమ్మా"

అమ్మ : మాయీ అంటే అమ్మే కదా!

స్వామి : ఇంతకూ నీవు ఏమి చదువుకున్నావమ్మా?

అమ్మ : బళ్ళోకి పోవటం లేదు. ఈ బడికే వచ్చాను. ఇది ఉపాధ్యాయుడు లేని బడిగా ఉన్నది. కాని ఉపాధ్యాయుడు లేని దానిని బడి అనటం నాదే పొరపాటు.

స్వామి : సరేలే అమ్మా - అని నవ్వుతూ మళ్ళీ అడిగారు -

"ఏమయినా పెడితే తింటావా, అమ్మా?"

అమ్మ : చివాట్లు పెడితే తినను. కొడితే పడను. అదీ నన్నడిగి చేస్తే. అంతలో ప్రొద్దు క్రుంకింది.

స్వామి : ఏ పండు ఇష్టమమ్మా నీకు ?

అమ్మ : తింటే తరగని పండు. ఎప్పడూ తినే పండు. తలపండు. సంతోషంతో స్వామివారికి కళ్ళు మెరిసినయ్. ఒక పండు తెచ్చి అమ్మకు యిచ్చి "వెళ్ళిరా అమ్మా" అన్నారు.

మూడవ రోజు సాయంకాలం అమ్మ మళ్ళీ ఆశ్రమానికి వెళ్ళింది. పురాణ శ్రవణం జరుగుతున్నది. అమ్మ వెళ్ళి ఒక మూల కూర్చున్నది. స్వామివారు అమ్మను గమనించారు. పురాణం నడక మందగించింది. అమ్మతో మాట్లాడవలె ననే కుతూహలంతో స్వామివారు పురాణం ముందుగానే ముగించారు. అందరూ వెళ్ళిపోయారు. అమ్మ స్వామివారి దగ్గరకు వెళ్ళి పంపరపనస పండు ఇచ్చి నమస్కారం చేస్తూ ఉండగా -

స్వామి : మొత్తం మీద తలపండంత పండు ఇచ్చావమ్మా.

అమ్మ : దేనికి మొత్తం మీద?

స్వామి : అబ్బా ! సరే కాని - నేను అడిగింది చెపుతావా, అమ్మా?

అమ్మ : మీ రడిగింది చెప్పలేను. మీ రడిగేది నాకు అర్థమయిన దానినిబట్టి చెప్పగలను.

స్వామి : ఎందుకు అర్థం చేసుకోలేవు?

అమ్మ : నేను మీరు కాలేదు కనుక.

స్వామి : ఎప్పడు అవుతావు?

అమ్మ : నేను మీరు అయినప్పడు సర్వమూ అవుతాను. స్వామివారు అమ్మను దగ్గరకు తీసుకుని తల గుండెలకు హత్తుకుని అన్నారు... "నీ వెవరవు తల్లీ? నీవు తప్పకుండా నా దగ్గర ఉండాలమ్మా!"

అమ్మ : నే నుండలేను కానీ మీరుంచుకొనండి - నాయనా.

స్వామి : మంత్రమంటే యేమిటో నీవు నిజంగా చెప్పవూ?

అమ్మ : నా చేత నీవు మంత్రం చెప్పించుకొనేవాడవు, నా కెట్లా చెపుతా నన్నావు?

స్వామి : నా మంత్రాలు వేరు. నీ మంత్రం వేరు.

అమ్మ : నిజంగా చెప్పించుకుంటావా? అప్పుడు నీ వెవరవయి చెప్పించు కుంటావు?

స్వామి : నీవు ఎవరిని చేస్తేవారినవుతాను.

అమ్మ : నీవు నిజంగానే నెవరి ననుకుంటున్నావు? చెప్పవూ?

స్వామి : బాలరాజరాజేశ్వరివమ్మా.

అమ్మ : బాలరాజరాజేశ్వరి అంటే చిన్న రాజరాజేశ్వరి అనా ?

స్వామి : కాదమ్మా. అన్నీ అమే.

అమ్మ : అప్పడు రెండు మాటలెందుకు ? స్వామివారు నవ్వుతూ అన్నారు - "ఒకే వస్తువు అన్ని రూపాలూ అయింది కనుక."

అమ్మ : ఎట్లా ? స్వామివారు సమాధానం చెప్పటానికి ఆలోచిస్తూ ఉంటే అమ్మయే అందుకుని అడిగింది- "అన్ని భాషలకూ, అన్ని అక్షరాలకూ మొట్ట మొదట కాగితం మీద కలం పెట్టగానే పడే చుక్క ఏ అక్షరం? ఏ భాష? ఎందుకు ఆధారమైంది?"

స్వామి : అదే అన్ని అక్షరాలకూ పునాది. దానినే 'పాయింట్' అంటారు ఇంగ్లీషులో

అమ్మ : అదే అన్నిటికి ఆధారమా ? కొంచెంసేపు ఆగి స్వామివారి కళ్లల్లోకి చూచి మళ్లీ అన్నది. "అదే ఆధారమయితే కలం కాగితం ఘర్షణ కదా! అదే శాస్త్రమని నీ ఉద్దేశమా నాయనా ? మంత్రం అంటే మనస్సు. బీజాక్షరమంటే శబ్దంయొక్క స్థాయికే అక్షరాలు.

స్వామి : ఇటువంటి నీ మంత్రశాస్త్రానికి పీఠికంటూ ఉన్నదా?

అమ్మ : లేకేమి ? ఉన్నది నాయనా. అ, ఆ, ఇ, ఈ.... అం, అః - ఇదే పీఠిక.

స్వామి వారు తియ్యని పాయసం తెప్పించి అమ్మకు ఇచ్చారు. అమ్మ త్రాగుతూ ఉండగా స్వామిగారు అడిగేరు - "నాకూ ఇవ్వవూ?"

అమ్మ : ఇవ్వటానికి ఇచ్చావా ? త్రాగటానికి ఇచ్చావా ?

స్వామి : త్రాగటానికే ఇచ్చాను. కాని నాకు మళ్ళీ త్రాగ బుద్ధి అవుతున్నదమ్మా.

అమ్మ : మీరు నాకు ఎక్కడ తెప్పించి ఇచ్చారో చెప్పండి మళ్ళీ తెచ్చి ఇస్తాను.

స్వామి : నేను గ్లాసెడు యిస్తే నీవు సగం ఇవ్వలేవూ ?

అమ్మ : ఇంత చిన్నపిల్లకే ఇది చాలకపోతే - అంత పెద్ద పొట్టకు అది చాలుతుందా ? అందుకని తెచ్చిపెడతానన్నాను.

స్వామి : నీకెందుకూ? నేను సరిపుచ్చుకుంటానుగా.

అమ్మ : తృప్తికల మనసా ? లేక కొద్దిదానిని ఎక్కువ చేస్తారా ?

స్వామి : తృప్తి అంటే యేమిటమ్మా ?

అమ్మ : ఇంతకంటే మరొకటి లేదనే స్థితి.

స్వామి : అబ్బా ! యే మమ్మవమ్మా . నీవు ఎందుకు వచ్చావో చెప్ప ? మీ ఊరేమిటి తల్లీ ? నీ తల్లి పేరేమిటి ?

అమ్మ : మా అమ్మ పేరు ఆధారం. మా నాన్న పేరు అవకాశం.

స్వామి : ఆధారం, అవకాశమంటే - వారికి వేరే పేరు, రూపం లేవా?

అమ్మ : ఆధారమనేది పేరేగదా రూప మెందుకు లేదూ ?

స్వామి : ఎట్లా ఉందో చెప్పమ్మా -

అమ్మ : ఈ ఉయ్యాలబల్ల ఉన్నదనుకోనండి. బల్లకి గొలుసు ఆధారం. గొలుసుకు దూల మాధారం. దూలానికి భూమి ఆధారం. ఇంకా చెప్పదలుచు కుంటే చాలా ఆధారాలు ఉన్నాయి. సర్వమూ ఆధారంమీదనే ఆధారపడి ఉన్నది

కనుక ఆధారం సర్వసాధారణమయింది.

స్వామి : అయితే విశేషం లేదా ?

అమ్మ : ఆ శక్తికి విశేషం లేదు. అమ్మ ఇచ్చే సమాధానాల్లోని అర్థ గాంభీర్యానికీ, జ్ఞాన సంపదకూ స్వామివారు ఆశ్చర్య చకితులై నిరవధిక ఆనందభరితులై సజల నేత్రులై రెండు గంటలసేపు పడుకుని మళ్ళీ అడిగారు- "నీ యధార్థ స్థితి చెప్పమ్మా!" కొంచెంసేపు మౌనంగా ఉండి మళ్ళీ అడిగారు - "నిన్ను మీ వారందరూ ఎట్లా చూస్తూ ఉంటారమ్మా?"

అమ్మ : వారికి కనపడ్డట్లు చూస్తారు.

స్వామి : అందరికీ ఒకే రకంగా కనపడతావా ?

అమ్మ : అందరికీ ఒకేరకం తరువాత చూద్దాము. మీరు చూచిన రోజు నుండి ఒకే రకంగా తోస్తున్నానా ? రూపం ఒకటిగానే ఉన్నది. కానీ తోచటంలో మార్పులు ఉన్నాయి కదా ! అయినా - అసలు అందరికీ ఒకటిగానే ఎట్లా కనబడతాను నాయనా ? వారి వారి స్థితినిబట్టి చూస్తారు. మనసు కొలతబద్ద గదా ! అ బద్ధకు అందినంత కొలుస్తారు. గజంలో అంగుళాలు ఉన్నాయి. కానీ అంగుళంలో గజాలు లేవు. స్వామివారు అమ్మను మళ్ళీ దగ్గరకు తీసుకొని అన్నారు.

"మొత్తమ్మీద మీ వారికి నీ స్థితి చెప్పి నిన్ను అట్టి పెట్టుకుంటానమ్మా"

అమ్మ : నా స్థితి అంటున్నారు. నా స్థితి తెలిసిందా - యేమిటి?

స్వామి : స్థితి తెలియకపోయినా సంభాషణవల్ల నేనొక స్థితిని నిర్ణయించు కున్నాను. అది నీవే చెప్పావుగా - మనస్సు కొలతబద్ద అని. అమ్మ బయలుదేరి "వెళ్ళి వస్తాను" అన్నది.

స్వామి : నీవు ఒంటరిగా వెళ్ళవద్దమ్మా. ఒకరిని నీకు తోడుగా పంపుతాను.

అమ్మ : నాకు తోడు వద్దు.

స్వామి : కాదమ్మా. నీవు ఒక్కదానవు పోలేవు. చిన్న పిల్లవు - స్వామివారు

ఒక పిల్లవానిని తోడు వెళ్ళమన్నారు.

అమ్మ : చిన్నపిల్లను రోజూనా, యీరోజే చిన్నపిల్లనా?

స్వామి : సరేలే పో, అమ్మా, నీ ఇష్టం - పంపనులే. అమ్మ నమస్కారం చేయబోతే స్వామివారు చేయనీయక చెయ్యి పట్టుకున్నారు.

అమ్మ : చెయ్యి పట్టుకుంటే నమస్కారం ఆగలేదు. చేతుల కలయిక కాదు నమస్కార మంటే.

స్వామి : ఆ మాటకు ఏమి అస్కారం ?

అమ్మ : సంస్కారమే ఆస్కారం. ఆ సంస్కారమే మీకు నమస్కారం చేయించింది. అని బయలుదేరి - "ఆశీర్వదించండి" అని ఒక చిరునవ్వు నవ్వి - "ఆశీర్వచనం అడిగేది కాదు. సంప్రదాయం ప్రకారం అడిగాను. వెళ్ళివస్తాను..." అన్నది అమ్మ. బరువు గుండెలతో స్వామివారు అక్కడే కూర్చున్నారు- అమ్మ నడిచే దారివంకనే చూస్తూ. అమ్మమాత్రం ముందుకు సాగిపోయింది.

36. బ్రాహ్మణత్వం

స్వామివారి యొద్ద సెలవు తీసుకుని అమ్మ కొంత దూరం వెళ్ళేసరికి తనను ఒక మనిషి అనుసరిస్తున్నట్లు అమ్మకు సందేహం కలిగింది. పరిశీలనార్థం వెంటనే ఒక చోట ఆగి - అతనిని చూచింది. అతను కూడా ఆగాడు. అమ్మ గబగబా నడిచింది. అతడూ పెద్ద పెద్ద అంగలు వేశాడు. అమ్మ మెల్లగా నడిచింది. అతడూ నడకవేగం తగ్గించాడు. అమ్మ ఒకచోట నిలబడ్డది. అతడూ ఆగిపోయాడు.

అమ్మ ఎంతసేపటికీ కదలక పోయేసరికి - అతనికి విసుగేసి వెనుదిరిగి వెళ్ళిపోయాడు. అమ్మ ఇంటికి చేరింది.

తరువాత మూడవ రోజున సీతాపతి తాతగారు గుంటూరు వచ్చి అమ్మను తీసుకుని తెనాలి వచ్చారు. అమ్మను అక్కడ అలవాటు చెయ్యాలనే ఉద్దేశంతో తాతగారుకూడా ఒక వారం రోజులు ఉండి ఒకరోజు రాత్రి అమ్మతో చెప్పకుండా మన్నవ వెళ్ళారు.

నిద్రలేస్తూనే "మా నాన్న యేడి తాతయ్యా?" అని వెంకటసుబ్బారావుగారిని అడిగింది.

"ఏమోనమ్మ - నాకు తెలియదు. రాత్రి నీకివ్వమని ఒక రూపాయి ఇచ్చాడు. ఎటు వెళ్ళాడో తెలియదు. బయటకు వెళ్ళేడేమో -

ఇక ఎవరినీ ఏమీ అడగకుండా పాకీదొడ్డి నుంచి వచ్చేదారిలో వాకిట్లో కూర్చున్నది అమ్మ. కాని ఎంత సేపటికీ రాలేదు.

జానకమ్మగారు చూచి కోపంవచ్చి - "ఎంతసేపు కూర్చుంటావట్లా? ఇక లోపలకు రా - మీ నాయన వస్తాడులే. ఎవరూ పీక్కుతినరు మీ నాయన్ను" అని కేకలేసింది.

అమ్మ ఏమీ సమాధానం చెప్పలేదు. అక్కడనుండీ కదలలేదు. ఎవరు పిలిచినా పెదవి కదపలేదు. దాదాపు తొమ్మిదయింది.

వెంకటసుబ్బారావుగారు వచ్చి అమాంతం అమ్మను భుజాన వేసుకుని తన గదిలోకి తీసుకువెళ్ళి "ఎందుకమ్మా అంతబాధ పడతావు? నా దగ్గర ఉండ కూడదూ?" అని అడిగారు.

"ఉండకూడదని కాదు - నాన్న కావాలనిపిస్తున్నది."

"నాన్న కావాలంటే వస్తాడులే - అమ్మా, తొందరపడితే ఎట్లా? ఆయనకు అనేక పనులుకదా ? మీ అమ్మ లేదాయె. అన్ని పనులూ ఒక్కడే చూచు కోవాలాయె. అక్కడ ఎవరో వండిపెడితే మీరందరూ తినాలి. ఇక్కడ మీ అమ్మమ్మ బిడ్డపోయి ఏడుస్తున్నది. నిన్ను చూచుకొని కొంత తృప్తి పడుతుందేమో - నీవు ఇక్కడ ఉండకూడదా అమ్మా?" అని వెంకటసుబ్బారావుగారు అడిగారు

"అయితే - అమ్మమ్మే మా దగ్గరకు వచ్చి ఉండవచ్చునుగా - ఎవరో వండి పెట్టకుండానూ సరిపోతుంది."

"నిజమేనమ్మా - ఉండవచ్చును. మరి - ఇక్కడ చూస్తున్నావుగా. ఇద్దరు మీ పినతల్లులు వారి ఇళ్ళకు వెళ్ళితే - ఇద్దరు పినతల్లులు పురిటికి వస్తున్నారు, ఈ రోజు మన ఇంటిలో ఎందరున్నారో లెక్కపెట్టు-"

"అవన్నీ ఎందుకులే తాతగారూ - ఇంతకూ నేను మా నాన్నను వదిలిపెట్టి ఉండలేను. మా నాన్నను ఇక్కడకు తీసుకువచ్చినా సరే; నన్ను అక్కడకు తీసుకు వెళ్ళినా సరే."

"ఏదో ఒకటి చేద్దాములే. ముందు ముఖం కడుక్కో" అని వెంకట సుబ్బారావుగారు అనునయిస్తుండగా పెద్దతల్లి అన్నపూర్ణమ్మగారు వచ్చి-

"వాళ్ళ నాన్న ఇచ్చిన రూపాయి ఇవ్వక పోయినావా" అన్నది.

"రూపాయి నాన్న కాదుగా? రూపాయిలే అమ్మ, నాన్న అయితే అమ్మ లేదనుకోవటమెందుకు?" అని అమ్మ అడిగింది.

వెంకటసుబ్బారావుగారు పక్కున నవ్వి -

"అది కాదమ్మా - మి నాన్న ఇచ్చిన రూపాయి ఇవ్వమన్నది. అంతే, రూపాయి నాన్న అని కాదు."

అంటూనే విషాదాశ్రుపూరిత నయనులై...

"ఈ మాట ఆ తల్లి ఉండి వింటే ఎంత సంతోషించేదో. లేకలేక ఇద్దరు బ్రతికేటప్పటికి తానే లేకుండా పోయింది. బిడ్డల కోసం ఏడిచినన్నాళ్ళు పట్టలేదు - తన బ్రతుకు" అని వాపోయారు.

అంతలో జానకమ్మగారు వచ్చి -

"బుద్ధులు భూము లేలుతుంటే రాతలు గాడిదలు కాస్తున్నట్లు - తల్లిలేని దానికి తగినట్లుగా బాగా చూస్తామనే చోట ఉండే గీత ఉండవద్దూ?" అని విసుక్కున్నది.

అమ్మకూ మిగతా వారికీ ఆ విషయంలో రాజీ కుదరకుండానే నెల రోజుల గడిచాయి. అంతలో అమ్మకు జ్వరం తగిలింది. అందులో 'నాన్నా' అనీ, 'తాతమ్మా' అనీ నిరంతరం కలవరించేది. అందువలన సీతాపతితాతగారికి కబురు చేశారు.

మూడవరోజుకు అమ్మకు జ్వరం జారింది. జారగానే వచ్చి వాకిట్లో కూర్చున్నది.

ఒక పాకీబండి వీధివెంట వెళ్ళుతున్నది. పాకీవాడు బండి తోలుతున్నాడు. పాకీది వీధులు చిమ్ముతూ - కసువు బండిలో పోస్తూ - బండివెంట నడుస్తున్నది. వారి మూడేళ్ళ పిల్లవాడూ తల్లివెంట నడుస్తున్నాడు.

అదలింపబడిన ఎద్దు పరుగెత్తింది. బండిని అనుసరిస్తూ పాకిది పరుగెత్తింది. తల్లికోసం పిల్లవాడూ పరుగెత్తాడు...

కాలికి రాయి తగిలి పిల్లవాడు పడ్డాడు. వెనక్కు చూడని పాకీది ముందుకే వెళ్ళింది.

వాకిట్లో కూర్చున్న అమ్మ ఆ పిల్లవానిని చూచింది. ఆ సమయంలో అక్కడ అమ్మతోపాటు అమ్మబంధువులనేకులు ఉన్నారు. కాని ఎవరి హృదయాన్నీ ఆ దృశ్యం స్పృశించలేక పోయింది. అంతలో ఆ దారిని రెండు గేదెలు పరుగెత్తుకు వస్తూ కనుపించాయి. అప్పడు మాత్రం వారు 'అయ్యో అయ్యో' అనుకోవటంలో పెదవులు కదిలాయి గానీ - హృదయం కదిలిందో లేదో తెలియదు; వాళ్ళ

మాత్రం కదలలేదు; అమ్మ చివాలున లేచి శరవేగంతో పిల్లవానిని సమీపించి ఒక్క ఊపులో వానిని లేవదీసి భుజాన వేసుకున్నది.

వెంకటసుబ్బారావుగారు ఆశ్చర్యంగా చూస్తూ "దీనిలో భూతదయ కనపడు తున్నది. జ్వరంతో ఉండి ఎంతవేగంతో పరుగెత్తిందో చూడండీ - అదీ మనసు లోని ఆవేగమేకానీ కాళ్ళలోని వేగమా?" అంటూ లోపల ఉన్న జానకమ్మగారిని కూడా కేకవేశాడు.

జానకమ్మగారు బయటకు వచ్చే లోపల అమ్మ ఆ పిల్లవానిని భుజాన వేసుకుని ఇంటికి చేరింది. దారిని పోయేవాళ్ళు, అంతకుముందు పడ్డ పిల్ల వానిని చూచీ చూడనట్లు నటించినవాళ్ళు - పాకీదానిని కేకవేసి పిల్లవాడు పడ్డ విషయం అందించారు. ఆమె వెంటనే వెనక్కు తిరిగి పరుగెత్తింది.

పిల్లవానిని భుజాన వేసుకుని ఇంటికి చేరిన అమ్మను చూచి వెంకట సుబ్బారావుగారు, జానకమ్మగారూ, అన్నపూర్ణమ్మగారూ నోటిమీద చెయ్యి వేసుకొని లబలబా కొట్టుకున్నారు.

"ఇటువంటిది కనుకనే యీ రాతరాసింది" అన్నది జానకమ్మగారు.

సరాసరి గడపలు ఎక్కుతున్న అమ్మను వారిస్తూ - "దిగు, దిగు ఆ పాడుపీడ భుజాన వేసుకుని వస్తావేమిటి? స్నానంచేసి వద్దువుగాని-" అని కసిరింది అన్నపూర్ణమ్మగారు.

పాకీది పరుగెత్తి వచ్చి నిలుచున్నది.

"అదిగో అందరమ్మ వచ్చింది" అన్నది అమ్మ పాకీ దానిని చూస్తూ కారుణ్యం పొంగులువారే కన్నులతో.

వెంకటసుబ్బారావుగారు నివ్వెరపాటుతో నీరవంగా ఉన్నా - అన్నపూర్ణమ్మ గారు అందుకుని -

"నీవూ అందరమ్మవే! మహా మాటలు నేర్చావు - చిన్నపిల్లకు పెద్ద శోకమని" అంటూ బుగ్గలు నొక్కుకున్నది.

"ఆఁ- మరిడమ్మగారి పెంపకం కదూ?" అని జానకమ్మగారు అవహేళన చేసింది.

పాకీది ముందుకు వచ్చి చెయ్యిజాపి బిడ్డను పిలుస్తూ- "దొరసానీ.... నీవు ఎత్తుకుని వచ్చావా ? నా బిడ్డ ఎంత అదృష్టవంతుడమ్మా - బ్రాహ్మలెత్తుకున్నారు?" అని పరవశమై పోయింది.

"మా బ్రాహ్మణత్వం మట్టిలో గలిసింది. ఇంకా ఏం మాట్లాడుతావులే? నీ పిల్లవాడిని నీవు తీసుకుపో" అని రుసరుస లాడింది జానకమ్మగారు.

ఆ నోటి దురుసుతనానికి వెంకటసుబ్బారావుగారు నొచ్చుకుని "ఎందుకంత త్వరపడతావు? అయిపోయిందేమో అయిపోయింది గదా. రైల్లో ప్రయాణాలు చేయటం లేదూ?" అని ఆమెను చల్లపరచ ప్రయత్నించారు.

అమ్మ వెంకటసుబ్బారావుగారి మాటలకు అడ్డువచ్చి జానకమ్మగారికి సమాధానంగా-

"అవును - బ్రాహ్మణత్వం మట్టిలో గలిసింది కనుకనే మీరు ఆ పిల్లవాడిని ఎత్తుకోలేదు" అన్నది గంభీరతాపూర్ణమయిన కంఠస్వరంతో.

జానకమ్మగారికిగానీ, అన్నపూర్ణమ్మగారికి గానీ వారి ఆవేశంలో ఆ మాటలు చెవిదూరకపోయినా వెంకటసుబ్బారావుగారు విని ఆశ్చర్య ఆనందాలతో వారిని సంబోధించి-

"అమ్మాయి మాటలు విన్నారా ? చమత్కారంగా అన్నట్లున్నా - అందులో ఎంత అర్థం ఉన్నదో ఆలోచించారా ? బ్రాహ్మణత్వం ఆమెకు మాత్రమే ఉన్నట్లు తేల్చింది!" అని వివరించారు.

"బ్రహ్మతత్వమే బ్రాహ్మణత్వం - అని మరిడమ్మ తాతమ్మ అంటుంటే విన్నాను" అన్నది అమ్మచిన్నగా.

"మహా బ్రాహ్మణత్వం నీకేగా వచ్చిందిలే" అన్నది అన్నపూర్ణమ్మగారు - అంతకంటే మరేమీ అనలేకనూ, అక్కసు పట్టలేకనూ.

పాకీది చెయ్యిజాపి 'రా అయ్యా' - అని పిలిచి మరో ప్రయత్నం చేసింది. కానీ వాడు రాకపోగా అమ్మ కంఠం గట్టిగా వాటేసుకున్నాడు.

అందరూ ఆశ్చర్యపోయారు. పాకీది వెంటనే పిల్లవానితోపాటు అమ్మను కౌగిలించుకుని-

"నేను కాదమ్మా అమ్మను - ఈ బిడ్డకే కాదు నాకు కూడా నీవే అమ్మవు" అన్నది గద్గద కంఠంతో.

జానకమ్మగారూ, అన్నపూర్ణమ్మగారూ "ఛీ, ఛీ..." అంటూ ఆ దృశ్యం చూడలేక కళ్ళుమూసుకుని లోపలకు వెళ్ళారు. "బలవంతంగానయినా తీసి ఇవ్వమ్మా పిల్లవాడిని" అని సలహా ఇచ్చారు వెంకటసుబ్బారావుగారు.

"నేను వద్దన్నానా ? బలవంతంగా లాగే ఓపిక నాకులేదు. నన్ను విడిచిపెట్టి వెళ్ళే ఓర్పు వాడిలో లేదు."

అంతలో జానకమ్మగారు పనిమనిషిద్వారా కబురు చేసింది - ఆ గౌనుకూడా విప్పి పాకీదాని ముఖాన పారవేసి దొడ్డివాకిలిన వస్తే పంచామృతాలు త్రాగించి స్నానం చేయించి పవిత్రంచేస్తేకానీ ఇంట్లోకి అడుగు పెట్టటానికి వీలులేదని.

జానకమ్మగారికి సమాధానంగా పనిమనిషితోనే అమ్మ అన్నది.

"గౌను విప్పి బయట పడవేసి నేను లోపలకు వెళ్ళటమెందుకు? నేనూ పాకీదాని వెంటనే వెళ్ళుతాను. పాకిపిల్ల వాడిని తాకింది నేనుగాని గుడ్డలు కావు. మైలపడ్డది నేనైతే గుడ్డలు విప్పితే మాత్రం మైల ఎక్కడకు పోతుంది? పోనీ - చెయ్యివరకూ తీసివేద్దామనుకున్నా భుజంమీద పడుకోబెట్టుకున్నాను. వాడు పొట్టకూడా తాకాడు. పైగా వాళ్ళ అమ్మ వచ్చి కౌగిలించుకుని మొత్తం తాకింది. అంతకుముందే వాడిని ఎత్తుకోవాలనే ఉద్దేశంతో మనసే మైలపడ్డది. అమ్మమ్మ అన్నట్లుగా ఇల్లాంటి రాత రాసిందన్నట్లుగా రాతకూడా మైలపడ్డది. రాత రాసిన వాడూ మైలపడి ఉంటాడు. ఇన్ని రకాల మైలలు కలిసి యీ సంఘ మాతను సంఘానికి దూరం చేసినయ్".

వెంకటసుబ్బారావుగారికి పట్టలేని ఆనందం కలిగింది. వెంటనే అమ్మ చేతిలో నుండి పిల్లవానిని తీసుకుని పాకీదానికి యిచ్చి - అమ్మ గౌను విప్పి దానినీ పాకీదానికే యిచ్చి - అమ్మను భుజాన వేసుకొని - రంగమ్మగారిని స్మృతికి తెచ్చుకుని-

"అబ్బా - కడుపులో మంటపెట్టి పోయింది గదా ఇవన్నీ చూచుకుంటే ఎంత తృప్తి పడేదో...."

అనుకుంటూ ఉండగా అమ్మగౌనును తన పిల్లవానికి తొడుక్కునీ పిల్లవానిని ముద్దు పెట్టుకుంటూ వెళ్ళుతుండగా పాకీదాని చెయ్యి వెంకట సుబ్బారావుగారికి తగిలింది.

ఆయన వెనక్కు తిరిగి చూచి "హూ" అని అసహ్యించుకున్నారు.

"అయ్యయ్యో ... తాతయ్యగూడా మైలపడ్డాడు. పాకిది తాకినవాళ్ళను తాకినవాళ్ళను తాకడమే కాకుండా పాకిదే తాకింది. తాతయ్య పూర్తిగా మైలపడ్డాడు...." అని అమ్మ అంటూ ఉండగా పాకీది వెళ్లిపోయింది.

వెంకటసుబ్బారావుగారు అమ్మను బావిదగ్గరకు తీసుకుని వెళ్ళారు - స్నానం చేయించేందుకు. అన్నపూర్ణమ్మ గారు ఆవుపాలూ, పంచితం తీసుకుని వచ్చింది. అంతలో ప్రక్క యింటి దుర్గమ్మగారు వచ్చి-

"అది కాదండి - ప్రాయశ్చిత్తం అంటే దర్భ కాల్చి నాలుకపై పెడతారు. కాని చిన్నపిల్లకు మనం అవన్నీ ఎక్కడ చేస్తాము?" అన్నది.

"పోనీలే - మీనాన్నగారికి పెట్టండి" అని సలహా యిచ్చింది అమ్మ.

అమ్మమాటను వినిపించుకోకుండా తన సలహాను పునరుద్ఘాటించే దుర్గమ్మగారితో-

"మీరు ఇటీవల ఆసుపత్రిలో చేరినప్పుడు మీకు మందులిచ్చింది, నీళ్ళు పోసిందీ ఎవరు? మీరు బయటకు పోతే బొచ్చె పట్టింది వారే, నోట్లో మందు పోసిందీ వారే"నని చెప్పింది అమ్మ.

"బొచ్చె పట్టినవారు వేరు, మందులిచ్చిన వారు వేరు"

"ఏమీ కాదు వారు కడగా ఉండి - కడగా ఉన్న వారికి చాకిరిచేసి - అన్ని రకాల వారికి పురుళ్ళుపోసి బొచ్చెలు పట్టిన వారే నీ నోట్లో మందులు పోశారు. నీవు ఏంపెట్టి కాల్చుకున్నావు నీ నాలుక? నీ రక్తం కూడా మైలపడ్డదీ. దానికి ప్రాయశ్చిత్తమేమిటి?"

"బలే తగని పిల్లవేనే?"

"తగిన పిల్లను గనుకనే అన్నాను."

దుర్గమ్మగారు ఒక్క నిట్టూర్పు విడిచి-

"ఒక్క పిల్ల బ్రతికినా బాణం వంటిది" అని ప్రశంసించింది.

అంతలో జానకమ్మగారూ, అన్నపూర్ణమ్మగారూ మునిపల్లె బుచ్చయ్యశాస్త్రి గారిని తీసుకుని వచ్చి - తీర్థం యిప్పించటానికి ప్రయత్నించారు.

"వారికి యీ సంగతి చెప్పారా?" అని అమ్మ ప్రశ్నించింది.

"చెప్పలేదు."

"అయితే నేను త్రాగను."

"ఇదేమి పీడ? మాయ పీడ! కొనితెచ్చుకున్నట్లుగా ఉన్నది. ఇంతకూ చచ్చినదాని రాత అట్లాంటిది. కొడుకు ఆ తీరు కూతురీ తీరు" అని జానికమ్మ గారు విసుక్కున్నది.

"చచ్చిన వారికి యింకా రాత లేమిటి?" అని అడిగింది అమ్మ.

"మరి-యింకా రంగమ్మకూతురనే అంటున్నారుగా" జానకమ్మగారు తనను తాను సమర్థించుకున్నది.

"ఎప్పుడూ అనవసరంగా మాట్లాడదు. అవసరం వస్తే మాట్లాడకుండా ఉండలేదు. ఇంతకూ జరగవలసిన పనులు కానీయండి. అనవసరంగా కాలయాపన ఎందుకూ?" అని వెంకటసుబ్బారావుగారు జీతగాడిని పిలిచి- నీళ్ళు తోడించుకుని స్నానంచేసి - ఆవు పంచితంత్రాగి మళ్ళా స్నానంచేసి - సాలగ్రామ తీర్థంకూడా తీసుకున్నారు.

అమ్మ అరటి చెట్లలో దిగంబరంగా నిలుచున్నది.

వెంకటసుబ్బారావుగారు వొళ్ళు తుడుచుకుంటూ "పిల్లక్కూడా నీళ్ళు పోయండి-" అన్నారు.

"నాకు వద్దులే" అన్నది అమ్మ.

అంతా వింటున్న జీతగాడు - అంకాలు వారి సంభాషణలో పాల్గొంటూ-

"అమ్మాయి న్యాయంగా మాట్లాడింది. అందరికీ అనవసరంగా కోపం వచ్చింది. ఆమెకు కులభేదం లేదు. మొన్న ఒక రోజున అరుగుమీద ఉన్న అమ్మాయికి మీరు యిడ్లీ పంపిస్తే నాకు పెట్టి తాను తిన్నది. నాకు నోటిలోనే పెట్టింది. స్వయంగా" అని వివరించాడు.

"నీకు పెట్టిందే తిన్నదా?" జానకమ్మగారు ఆశ్చర్యం ప్రకటించింది.

"అట్లా తినలేదు కాని అట్లా తినటంలో కూడా సందేహించేటట్లుగా లేదు. అందుకని కులభేదమే లేదని అన్నాను."

"కులభేదం లేదు కనుక నీ నోటిలో పెట్టానంటున్నావు. గుణభేదం ఉంటే వీరి యింటిలోనే ఉండేదాన్ని కాదు. గుణభేదమే లేనప్పుడు కులభేదం లేక పోవటంలో విశేష మేమున్నది?"

ఆ మాటల్లోని హృదయవైశాల్యం అంకాలుకు అర్థం కాకనూ యితరులకు సమాధానం తోచకనూ - అందరూ మౌనంగానే ఉన్నారు.

అరగంట గడిచినా అమ్మ పట్టుదలలో మార్పు లేక పోయేసరికి - వెంకట సుబ్బారావుగారు జానకమ్మగారి నుద్దేశించి-

"అవన్నీ ఏమీ వద్దుగానీ అమ్మాయికి చెంబెడు నీళ్ళుపోసి లోపలకు తీసుకురండి-" అన్నారు.

జానకమ్మగారికి అట్లా చేయక తప్పిందికాదు. కాని ప్రాయశ్చిత్తం లేకుండా అమ్మను లోపలకు అనుమతించటంతో అది వారందరికీ జరిగిన ప్రాయశ్చిత్తంగా బాధపడ్డారు.

"ఈవేళ జ్వరం లేదుగా, కొద్దిగా అన్నం తినమ్మా-" అని విస్తరి వేసి అమ్మను తీసుకునివెళ్ళి కూర్చోబెట్టారు వెంకటసుబ్బారావుగారు. కాని అమ్మ వంచిన తలయెత్తకుండా ఆలోచనా నిమగ్న అయింది. అంతలో సీతాపతి తాతగారు వచ్చారు.

"ఏమమ్మా! మీ నాన్న కూడా వచ్చాడుగా, ఇంకా ఎందుకూ విచారం?" అని అడిగారు వెంకటసుబ్బారావు గారు.

"నాన్నకోసం కాదు విచారం. పాకీదంటే ఏమిటి? పనికిరానిదనా?" అని అడిగింది అమ్మ.

"అంతదూరం ఆలోచించలేదు ఎప్పుడూ - పాకి అనటం తప్ప" అన్నారు వెంకటసుబ్బారావుగారు.

"మనం విసర్జించినది శుభ్రపరచినందుకేగా దానికింత అంటు? రాతిమీద

నీళ్ళుపోసి ఆ నీళ్ళు తీసుకువచ్చి సాలగ్రామ తీర్థం అంటే అంత పవిత్రతా? ఆవుపంచితానికి ఉన్న పవిత్రత దానికి లేదూ? కాకపోతే ఆవుపంచితం ఆరోగ్యకరం కావచ్చును. కొన్ని ఉపయోగాలు ఉండవచ్చును. మన కడుపులో ఉన్న అశుద్ధానికి అంటు లేకపోయే. దానిని బాగుచేసిన ఆ తల్లికి అంటు వచ్చిందీ? అది బాగుచేసి దొడ్లోకి మళ్ళీ వెళ్ళుతూనే ఉన్నాము గదా అసలు అంటు అంటే ఏమిటో? అంటు అంటే వదలనటువంటిదని నా ఉద్దేశం....."

అమ్మ మాట్లాడుతూ ఉంటే ఎవరూ ఏమీ మాట్లాడలేదు మళ్ళీ అమ్మ తన ప్రసంగం కొనసాగించింది.

"అంటు అంటే దాదాపు ఒక మాటులాంటిదని నా భావం. మాటు అంటే... ఒక గిన్నెకు ఒక రంధ్రం ఉన్నదనుకోండి. దానికి ఏ తగరమో పూసి ఆ రంధ్రం కనబడకుండా చేస్తారు. ఆ పూసినంత ప్రదేశంలో ప్రత్యేకత కనపడుతూనే ఉంటుంది. గిన్నె ఉపయోగ పడుతూనూ ఉంటుంది. అట్లాగే ఒక లోపాన్ని మరొకదానిచేత మరుగుపెట్టి దాన్ని ఉపయోగించుకుంటూ ఉంటాము. మన ఉపయోగం కోసం కొన్ని ఏర్పాట్లు చేసుకుని - ఆ వస్తువుకు ఏనాటికీ విలువ నివ్వకుండా అవసరానికి మాత్రమే విలువనిస్తూ ఉంటాము. మల విసర్జనకు దూరం పోలేము. నడవలేకనేగా యీ దొడ్లు ఏర్పాటు చేసుకున్నది. అందులో కొందరికి జీవనోపాధి క్రమేణా కొందరికి కులవృత్తి అయింది. కాని చివరకు అది ఎట్లా పరిణమించిందంటే మనకు పనికివచ్చే పాకీతనానికి మనం పనికి రానితనాన్ని అంటగడుతున్నాము."

అన్నపూర్ణమ్మగారు యదాగుండెపడి వింటూ ఉన్నది.

వెంకటసుబ్బారావుగారు అమ్మ వీపుమీద చెయ్యి వేసి వెన్నురాస్తూ ఒక చేత్తో చెక్కిళ్ళు నవరిస్తూ ఉండగా కన్నీళ్ళు స్రవించాయి. వాటిని చూచిన జానకమ్మగారికీ, అన్నపూర్ణమ్మగారికి కూడా గుండెలు ద్రవించాయి.

"జ్వరం జారిందిగా. కొంచెం చారురసం త్రాగుతావా?" అని వెంకట సుబ్బారావుగారు అమ్మను అడిగి-

"ఏమీ లేదమ్మా - నిన్ను నేను యిక్కడ ఉంచుకుని తల్లికొరత లేకుండా చూచుకుని - ఆ పెళ్ళి పేరంటం కూడా చేసి తృప్తి పడదామని ఉన్నది. మీ

నాన్నకూడా - నాకు వద్దు, మీరే యీాదండి - అని అన్నాడు. మీ బాధ్యతలు లేకపోతే ఆయన పెళ్ళి చేసుకుంటాడట. మీ అన్నయ్యకు ముందు పెళ్ళి చేస్తారట - సంబంధాలు వస్తున్నాయి." అన్నారు.

అమ్మ ఏమీ మాట్లాడలేదు.

"తరువాత ఏది ఎట్లా ఉన్నా యిందాక యిది మాట్లాడిన మాటలు దీనికి ఎక్కడనుండి వచ్చాయి?- ఆశ్చర్యంగా ఉన్నది. అన్నది అన్నపూర్ణమ్మగారు.

"ఆశ్చర్యమేమున్నదిలే - చిదంబరరావుగారి దగ్గర పెరగటం కొంతా, మరిడమ్మ గారి సంస్కారం కొంతా. అయినా మరిడమ్మగారు మహా ఆచారం కలిగిన వ్యక్తి. దీనికి యిది ఎక్కడ నుంచి వచ్చిందో ప్రపంచంలో రోజు రోజుకూ పుట్టే వింత విధానాల్లో యిది ఒకటి" జానకమ్మ గారు సిద్ధాంతీకరించింది.

"విధానం అనేది వ్యక్తికి సంబంధించినదేనా?" అమ్మ ప్రశ్నించింది.

"నీతో మాట్లాడలేము తల్లీ. మాటలు పుట్టి నీవు పుట్టావు. పోనీ - మాట్లాడుతుందిగదా అని మనం అడిగినప్పడెల్లా మాట్లాడదు. తనకు యిష్టమయినప్పడే మాట్లాడుతుంది" అన్నది జానకమ్మగారు.

"మొన్న చిదంబరం నాతో ఒకమాట చెప్పాడు- అమ్మాయిని గురించి. అంటే ఏమీ లేదనుకో. అమ్మాయి మాట్లాడేదెల్లా వింటూ అర్థం చేసుకోమన్నాడు. మనకు ఉండే ప్రేమకొలదీ: మనదగ్గర ఉండలేదనే విసుగుతో బాధపడుతూ ఉంటాము. అయినా మనకు ఉండవలసినంత ప్రేమ లేదుకదా దానిమీద దాని తల్లిపోయిన పదకొండవ రోజున మనం - మేము తీసుకొని వెళ్ళము. అక్కడ ఆస్థి ఉన్నది. బ్రహ్మాచారి అయిన మరిడమ్మగారు ఉన్నది. వారే చూచుకుంటారు - అని చెప్పి వచ్చేశాము. గదా నేను రంగమ్మను సీతాపతికి యివ్వటంతో మిగిలిన పిల్లలమీద ఉన్నంత ప్రేమ రంగమ్మ మీదనే లేదు. ఇక దాని పిల్లలమీద ఏముంటుంది?" అన్నారు. వెంకటసుబ్బారావుగారు.

"ప్రేమ లేక కాదుగా. అక్కడ వారికి వసతులున్నాయి. మనం చూచినా చూడకపోయినా చూచేవారున్నారు." అని తన్ను తాను సమర్థించుకున్నది జానకమ్మ గారు.

"ఏది ఎట్లా ఉన్నా మన దగ్గర పెరిగితే అ ఉన్న బంగారం పోకుండా చూస్తాము. ఏ సంసారాల్లో పెరిగినా ఆ బంగారం వదిలిస్తారు" అన్నది అన్నపూర్ణమ్మగారు.

"నా బంగారం ఎక్కడున్నా పోయేది కాదులే, ఎవరూ ఉన్నది వదిలించలేరు. ఇది నాకేకాదు, ఎవరికయినా యింతే" అన్నది అమ్మ.

అంతలో సీతాపతిగారు వచ్చారు. వారికి ఫలహారమూ మంచినీళ్ళూ యిచ్చారు.

"రెండు రోజులలో పిల్లను తీసుకొని వెళ్ళుతాను" అన్నారు సీతాపతిగారు.

"ఇట్లాగే అప్పుడప్పుడు తీసుకొనివచ్చి పదేసి రోజులు ఉంచి అలవాటు చేసి వెళ్ళు, క్రమంగా అలవాటు అవుతుంది" అన్నారు వెంకటసుబ్బారావుగారు.

"పిల్లవాడికి పెండ్లి సంబంధాలు వస్తున్నాయి. అందరితో సరియైనవాడు కాదు అల్లరివాడని చెపుతూనే ఉన్నాను. ఒక సంబంధంవారు పట్టుపట్టారు - పిల్ల అదృష్టాన్నిబట్టి మారకూడదా అని. వారిది కొర్నెపాడు. బహూశా యివ్వాళ యిక్కడికే వస్తారేమో. వారు వస్తే యిక్కడనే నిర్ణయించుకుందాము" అన్నారు సీతాపతిగారు.

"చిదంబరం లేకుండా యిక్కడ ఎందుకూ? బాపట్ల నేనే వస్తానులే వీలయితే సీతాపతి వివాహం కూడా చేయాలనుకుంటున్నాను కానీ దానితో వంతు ఎందుకూ? ఇది ముందే చేసేద్దాము" అన్నారు వెంకటసుబ్బారావుగారు.

తరువాత రెండు రోజులకు అమ్మను తీసుకుని సీతాపతిగారు బాపట్ల వెళ్ళారు. వెంట మరిడమ్మగారూ, వెంకట సుబ్బారావుగారు కూడా వచ్చారు. తరువాత రెండు రోజులకే కొర్నెపాడు నుంచి పెళ్ళి సంబంధం వచ్చింది.

రాఘవరావు మామయ్య పెళ్ళి నిశ్చయమై లగ్నం నిర్ణయమయినది.

37. రూప గుణాలు

రాఘవరావు మామయ్య పెళ్ళి పనులు బాపట్లలో ప్రారంభమైనాయి.

మరిడమ్మ తాతమ్మ గుంటూరులో సుబ్బమ్మగారికి పురుడుపోసి మన్నవ వచ్చింది.

పెళ్ళికి డబ్బు కావాలిగదా. సీతాపతి తాతగారి దగ్గర సమయానికి పైకం లేక అప్పకోసం రోజూ దొప్పలపూడీ, జూపూడి వెళ్ళివస్తూ ఉన్నారు. ప్రతివారూ ఏదో కారణంతో వాయిదా వేస్తున్నారు. చివరకు తాతగారికి విసుగేసి పొలం అమ్మటానికి నిర్ణయించుకున్నారు. కాని కొనేవారేరి? వడ్లధర పూర్తిగా తగ్గిపోవటంవలన ఎక్కడ చూచినా ధాన్యమేగానీ డబ్బు కరువయింది.

పెళ్ళి లగ్నం సమీపించింది. పైకం మాత్రం అందలేదు. ఇంటిలో ఉన్న బంగారం అమ్ముదామని తాతగారికి ఆలోచన కలిగింది. కానీ తల్లి బంగారం పిల్లకు ఉండాలనేది చంద్రమౌళివారి శాసనం. అయినా ఆ విషయంలో గత్యంతరం కనుపించక తాతగారు రాఘవరావు మామయ్యను సంప్ర తించారు. బంగారం విక్రయించటానికి మామయ్య అంగీకరించలేదు. అమ్మమ్మ నగలు అమ్మకొరకు భద్రపరచవలసినదేనన్నారు.

పైకం లేక పెళ్ళి మానుకోవలసిన పరిస్థితి కనుపించి సీతాపతి తాతగారు మరిడమ్మ తాతమ్మను సలహా అడిగారు. తెనాలివారు పెట్టినదిగాక మిగతా బంగారం అమ్మి పెళ్ళి ఖర్చులకు వాడుకోమని ఆమె ఉపాయం చెప్పింది. కాని అట్లా వచ్చే డబ్బు ఏమాత్రమూ పెళ్ళికి చాలేటట్లు కనుపించలేదు. అప్పడు తాతమ్మ తెనాలివారు అమ్మమ్మకు పెట్టిన బంగారం కూడా సగం అమ్మి అందుకుగాను అమ్మకు రెండు ఎకరాల మాగాణి యివ్వమని సలహా యిచ్చింది.

తాతగారు అంగీకరించి బాపట్లకు ఉత్తరం వ్రాశారు - బంగారం అమ్మి పనులు కొనసాగించమని.

అమ్మ రోజులో ఎక్కువభాగం గంగరాజు పున్నయ్యగారి తోటలో కాలక్షేపం చేసేది. అప్పడప్పడు దేవాలయానికి వెళ్ళి వస్తూ ఉండేది.

పెళ్ళి పదిరోజులుందనగా తాతగారు బాపట్ల ప్రయాణమయినారు. ప్రయాణానికి ముందు అమ్మను వెంటబెట్టుకుని గ్రామంలో పెండ్లికి ఆహ్వానించటానికి బయలుదేరారు. తాతగారు కొన్ని యిళ్ళల్లో పిలిచారు. కొన్ని యిళ్ళు వదిలివేశారు. కొన్ని యిళ్ళల్లో అందరినీ పిలిచారు. కొన్ని యిళ్ళల్లో కొందరిని మాత్రమే పిలిచారు. అమ్మకు ఆ ఆహ్వాన విసర్జనల అంతర్యం అవగాహన కానట్లు అడిగింది.

"నాన్నా - కొన్ని యిళ్ళనూ, కొంతమంది మనుషులనూ వదిలి వేశావేమి?" అని.

"బ్రాహ్మల్లో అందరినీ పిలిచాను. ఇతర కులాల్లో ముఖ్యమయిన వారిని మాత్రమే పిలిచాను."

"అదేమిటీ? పిలిచేదేదో అందరినీ సమంగా పిలువు-"

"మనవాళ్ళందరినీ పిలిస్తే చాల్లేమ్మా-"

"మన వాళ్ళంటే గుర్తు ఏమిటి? మనం అనుకోవటమే గదా!"

తాతగారు యిక సమాధానమేమీ చెప్పలేక -

"సరే - అందరికీ శుభలేఖలు పంపుదాములే. ఇల్లు యిల్లూ తిరిగినంత వరకూ చాల్లే" అని తరువాత అందరికీ శుభలేఖలు పంపించి బాపట్ల బయలుదేరారు.

బాపట్ల చేరిన మరునాడే మామయ్యను పెళ్ళికొడుకును చేశారు.

పెళ్ళికి మన్నవ నుండి దాదాపు సగం జనం వచ్చారు. కొందరు రైళ్ళల్లో, కొందరు బస్సుల్లో అందరూ చేరారు. సీతాపతి తాతగారి కుటుంబమూ, సుబ్బమ్మ బామ్మగారి కుటుంబమూ, అందరూ ఒకే బస్సులో సరాసరి పెళ్ళికి తరలివెళ్ళారు.

పెమ్మరాజు పిచ్చయ్యగారు వర్షాలయినప్పటికీ కొర్నెపాడులో ఎంతో మర్యాదగా, సలాంఛనంగా అయిదు రోజులు వివాహం చేశారు. అత్తగారికి యివ్వవలసిన లాంఛనాలు అమ్మకే యిచ్చారు.

బాపట్ల రాగానే పూసల పూలపడలో ఊరేగింపు చేసుకుని అతి వైభవంగా గృహప్రవేశోత్సవం జరిపారు.

ఒక్కొక్కరు మామయ్య వద్దకు వచ్చి-

"ఎంత అదృష్టవంతుడివి! ఇంత అల్లరివాడికి ఎంత చక్కని పిల్ల దొరికింది! ఇకనయినా అల్లరి మానుకుంటావా?" అని అడిగారు.

"నేను భార్యకోసం చేస్తేగా అల్లరి మానుకోవటానికి. అల్లరి మానుకుంటేగానీ చేసుకోమని వారు షరతు పెట్టలేదుగా."

అంతా నవ్వారు - మామయ్య చమత్కారానికి.

అంత వైభవోపేతంగా వివాహం జరిగినా జానకమ్మగారికి సంతోషం లేకపోగా బాధ కలిగింది. తన కూతురు రంగమ్మగారు లేదుగదా అనీ, తమకు అంత ఆస్తి ఉండి, తన కొడుకు ఎంతో బుద్ధిమంతుడయినా తన కొడుకుకు అంత వరకూ పెండ్లి కాలేదనీ.

మూడు నిద్రలు కాగానే బంధువులందరూ ఎవరి ఊళ్లకు వారు వెళ్లారు. తెనాలివారూ వెళ్లారు.

పదహారురోజుల పండుగ కాగానే సీతాపతి తాతగారూ, అమ్మా మన్నవ వెళ్లారు. మరిడమ్మతాతమ్మ బాపట్లలోనే ఉండిపోయింది, సీతాపతి తాతగారికి పెళ్లిసంబంధం చూచేటందుకు.

మన్నవలో సీతాపతి తాతగారూ, అమ్మా హోటల్లో భోజనం చేసే ఏర్పాటు చేసుకున్నారు. అక్కడ మాచమ్మగారే అమ్మకు రోజూ నీళ్ళుపోసి జడవేసేది.

తాతగారు రోజూ తెల్లవారుజామున కృష్ణకాలువకు స్నానానికి వెళ్లేవారు. ఒక్కొక్క రోజున ఏదో ఆలోచించుకుంటూ ప్రొద్దెక్కి తొమ్మిది గంటలకు గానీ తిరిగి వచ్చేవారు కాదు. తాతగారికోసం దారిలో ఎదురు చూస్తూ అమ్మ కూర్చుండేది.

ఒక రోజు మధ్యాహ్నం పన్నెండు గంటలదాకా రాలేదు. ఎదురు చూచి చూచి అమ్మ కృష్ణకాలువకు తానే బయలుదేరింది. దారిలో వర్తకులైన నీలకంఠం కారప్పూస, పకోడీల తట్ట నెత్తిన పెట్టుకుని వెళుతూ ఉన్నాడు. అమ్మ కూడ

అతని ప్రక్కనే వెళ్ళటం ప్రారంభించింది. అతను అమ్మను గుర్తించక అడిగాడు-

"ఎవరమ్మాయివి? పకోడీలు కావాలా?"

అమ్మ మారు పలకలేదు.

"ఏం అమ్మాయ్ - చెప్పవేమి?"

ఎన్నిసారులు పిలిచినా అమ్మ పెదవులయినా కదపలేదు.

నీలకంఠానికి విసుగు వేసింది, కోపం వచ్చింది.

" ఈ తట్ట నీ నెత్తిన పెడితినా, తిక్క కుదురుతుంది."

ఆ మాటా అమ్మ మనసును కదలించలేదూ; కాలినడకను ఆపనూలేదు.

అతనికి ఏమి చెయ్యాల్సిందీ తోచక అమ్మకు ఎదురుగా వచ్చి "ఎన్ని అడిగినా పలకవేమి?" అంటూ గడ్డం పట్టుకుని తలపైకియెత్తాడు. అమ్మను గుర్తించి ఆశ్చర్యపోయాడు. నాలిక కొరుక్కున్నాడు. తట్ట క్రిందకు దించాడు. అమ్మను చంకన ఎత్తుకున్నాడు. అక్కడ నుండి భుజంపైకి ఎక్కించుకున్నాడు. తట్ట నెత్తికి ఎత్తుకున్నాడు. అమ్మను తట్టలో కారప్పూస తీసుకుతింటూ కూర్చోమని చెప్పాడు. దారిలో కొందరు బాటసారులు ఎదురైనారు. అందులో ఒకాయన తమ పిల్లను భుజం ఎక్కించుకున్నాడు. అంతవరకూ నీలకంఠంతో అమ్మ ఏమి మాట్లాడలేదు. బాటసారులు ఎదురుగా దగ్గరకు వచ్చారు. అమ్మ నీలకంఠాన్ని పిలిచి-

"నీవు నన్ను ఎత్తుకున్నట్లు ఆయన ఆ అమ్మాయి నెత్తుకున్నాడు గాని నెత్తిన కారప్పూస తట్టలేదు. మనం కొంచెం పెడదామా?"

నీలకంఠం ఏమీ జవాబివ్వలేదు. అమ్మ క్రిందికి దిగుతానన్నది. నీలకంఠం దించాడు. అమ్మ ముందుకు నడుస్తుంటే వెనక్కుపిలిచి తట్టలోని కారప్పూస తీసి అమ్మ ఒళ్ళోపోశాడు.

"నీవు వెళుతూ వుండు- నేను మెల్లగా వస్తానులే-" అని అమ్మ నీలకంఠానికి చెప్పి అతనిని పంపి బాటసారుల దగ్గరకు పరుగెత్తుకుని వెళ్ళి ఒళ్ళో కారప్పూస తీసి వాళ్ళ అమ్మాయికి పెట్టమని వాళ్ళ దోసెట్లో పోసి తిరిగి వచ్చింది.

నీలకంఠం వెనక్కు తిరిగి అదంతా చూచి ఆశ్చర్యపడి-

"బలే అమ్మ, వమ్మాయ్!" అన్నాడు.

"నేను అమ్మనా? అమ్మాయినా?"

"పెట్టటం చూస్తే అమ్మవలే ఉన్నావు. వయసును బట్టి చిన్న పిల్లవూ, అంటే గుణానికి అమ్మవూ, రూపానికి అమ్మాయివీ"-.

"బాగున్నది నీ సమర్థన" అని అమ్మ నవ్వింది.

"ఇంకొంచెం పట్టు -" అని కారప్పూస అమ్మ ఒళ్లో పోస్తూ "ఎప్పుడూ కారప్పూసేనా, పకోడీలు పెట్టమంటావా?" అని అడిగాడు.

"ఏది పెట్టినా తింటాను. తినటం ఎట్లా ఉన్నా తీసుకుంటాను."

"మళ్లీ ఎవరికయినా పెట్టటానికా?"

"నీవు నాకు పెట్టుకుంటే నీకు ఎంత తృప్తో-ఎవరికయినా పెట్టుకుంటే నాకు అంత తృప్తి."

"సరే - నీ ఇష్టం. పెట్టుకో అమ్మా. రాఘవరావుగారే అనుకున్నాను. నీవు ఆయనకంటే తెలివికలదానవమ్మా-"

అంతలో కాలవదగ్గరకు వచ్చారు.

అమ్మ తనకు పెట్టిన కారప్పూస, పకోడీలు అక్కడ ఆడుకునే పిల్లలందరికీ పంచింది. వాళ్లు అవి తింటుంటే వాళ్ల ముఖాల్లో ద్యోతితమయిన ఆనందదీప్తిని చూస్తూ కొన్ని క్షణాలు గడిపి తాతగారికోసం చుట్టూ చూచింది. తాతగారు కనుపించలేదు. తిరిగి నీలకంఠంతోనే యింటికి వెళ్లవచ్చునని అక్కడనే అమ్మ కూర్చున్నది.

సాయంకాలం నాలుగయింది. అమ్మ కాలువలో స్నానం చేస్తున్నది. తాతగారు జూపూడి నుండి తిరిగివస్తూ తలవంచుకుని నడుస్తూ లాకులు దాటుతూ ఉండగా నీలకంఠం చూచి "కరణంగారూ-" అని కేకలు వేశాడు. తాతగారు దగ్గరకు వచ్చారు. కాలువలో స్నానం చేసే అమ్మను చూపించాడు.

అమ్మ ఒక్కతే అంతలోతు కాలువలో దిగి స్నానం చేయటం చూచిన తాతగారికి భయమూ, కలిగెంది, కోపమూ వచ్చింది, ఆ కోపంతో నీలకంఠంపై అరిచారు-

"నీవు చూస్తూ కాలువలో ఎందుకు దిగనిచ్చావు? చూడిన వాడివి పైకి తీసుకురావద్దా?" అంటూ-

"అసలెందుకు వచ్చింది యిక్కడకు" అని తనకు తానే ప్రశ్నించుకుంటూ కాలువ ఒడ్డుకు వచ్చి-

"ఎక్కు ఒడ్డుకు-" అని అమ్మను-కసురుతూ చెయ్యి అందించారు. ఆసరాగా తాతగారు.

"నేను ఎక్కుతానులే నాన్నా-" అంటూ అమ్మ తానే ఒడ్డుకు వచ్చింది.

"ఎందుకు వచ్చావు ఒంటరిగా యిక్కడకు?"

"మామూలుగా నీవు వచ్చే వేళ దాటినా నీవు రాకపోయే సరికి నేనే వచ్చాను.

"ఇంతకూ అన్నం తిన్నావా?"

"నీవు లేకుండా వారింటికి వెళ్లటం అలవాటు లేదుగా-"

"నీవు వెళ్లితే వారు పెట్టకపోయారా? అలవాటేమిటి? అలవాటు చేసుకుంటే వచ్చేది."

అమ్మ యిక ఏమీ మాట్లాడక విప్పిన గౌనుతోనే వళ్లు తుడుచుకుని ఆ గౌనే తొడుక్కున్నది.

"ఆ తల జూడు- నీళ్లు కారుతున్నది. కొత్తకూస్త జుట్టు కాదుగదా. ఎందుకు తడుపుకున్నావు? ఏం బెట్టి తుడిచేది?" - అని తన పై గుడ్డ తీసి తలకు పిడివేస్తూ "తలంటి పోసేవాళ్లు కూడా లేరు గదా" అంటూ నిట్టూర్చారు.

తాతగారూ, అమ్మా, నీలకంఠమూ కలిసి ఊళ్లోకి వచ్చారు. ఊళ్లోకి వచ్చేటప్పటికి ప్రొద్దుకుంకింది.

"ఇప్పుడు అన్నం పెట్టిస్తాను తింటావా?" అని అమ్మను తాతగారు అడిగారు.

"నీతోనే తింటాను నాన్నా-"

తాతగారు రోజూ మధ్యాహ్నం రెండు గంటల నుండి మన్నవ హనుమంతయ్య గారి దగ్గరకు వెళ్లి ఉపనిషత్తులు వినేవారు. హనుమంతయ్య గారికి జ్యోతిశ్శాస్త్రం కూడా తెలుసు. వులిపాక చెల్లమ్మగారూ, వులిపాక

వెంకట్రామయ్యగారూ, పోస్టుమాస్టరుగారూ నిత్యమూ వచ్చేవారు. ఆనాడు సూర్యాస్తమయం అయినందువలన హనుమంతయ్యగారిని అలవాటు ప్రకారం చూచిరావాలనుకుని-

"నీవు వెళ్లి అన్నం తిన్నానరే? ఇక్కడనే కూర్చున్నా సరే" అన్నారు. అమ్మతో.

"నేను యిక్కడనే కూర్చుంటాలే" అన్నది అమ్మ. తాతగారు వెళ్లి హనుమంతయ్య గారిని చూచి అరగంటలో తిరిగి వచ్చారు. ఇద్దరూ కలసి మాచమ్మగారింటికి భోజనానికి వెళ్లారు.

"ఏం నాయనా-ప్రొద్దున ఎవరింట్లోనయినా భోజనం చేశారా?" అని మాచమ్మగారు అడిగింది.

జరిగిన విషయం తాతగారు వివరించారు.

"పిల్లయినా రాగూడదా? నా పిల్లవలే చూచుకుంటున్నాను గదా"

అమ్మ ఏమీ మాట్లాడలేదు. తలవంచుకుని విస్తట్లోకి చూస్తున్న అమ్మ తలపైకి యెత్తి-

"నేను నిన్ను బాగా చూడటం లేదా?" అని మాచమ్మగారు అడిగింది.

"బాగా చూడనివారు అంటూ ఉంటేగా నీవు నన్ను బాగా చూడటానికి-"

తాతగారు ఆ సమాధానం విని తనలో తానే నవ్వుకుంటూ తలవూపారు.

"మరిడమ్మగారు వచ్చిందాక నీవు ఉన్నా లేకపోయినా అమ్మాయిని వచ్చి స్నానం చేసి జడ వేయించుకుని అన్నంతిని వెళ్లమని చెప్ప- లేని దానిని గనుక డబ్బు తీసుకుంటున్నాను. అదీ ఏడుస్తూనే - అన్నది మాచమ్మగారు తాతగారితో.

"రూపాయలకు బజారులో దొరకనిది ఆదరణ. అదే ఈనాడు రుచిస్తున్నది." అని తాతగారు అంటూ ఉండగానే మాచమ్మగారు పెరుగు తీసుకు వచ్చి యిద్దరికీ వడ్డించింది తృప్తిగా, ముసిముసిగా నవ్వుకుంటూ.


COURTESY VISWAJANANI TRU

38. సర్వాధికారిణి

అమ్మ తన విస్తట్లో మాచమ్మగారు కుమ్మరించిన పెరుగువంక చూస్తూ మాచమ్మగారిని అడిగింది-

"ఆదెయ్య తాతయ్యను కూడా భోజనానికి పిలవరాదూ? రేపటినుంచి ఆయనతోటే తింటాను. మా నాన్నతో తినను."

" ఆయన ఎప్పుడు బడితే అప్పుడు రాడమ్మా. మధ్యాహ్నం ఒంటిగంట దాకా రాడు" అన్నది మాచమ్మగారు.

సీతాపతి తాతగారు భోజనం ముగించి లేచారు. అమ్మ కంచంలో చెయ్యి అట్లాగే పెట్టుకుని మాచమ్మగారిని ఉద్దేశించి-

"రాత్రి ఎన్ని గంటలకు తింటాడు?" అని అడిగింది.

"పన్నెండు అవుతుంది."

"అంతసేపు నీవు కూడా అన్నం తినకుండా వుండి పెడతావా?"

"లేదమ్మా, అంతసేపు నేను ఎక్కడ ఉండేది? నేను తిన్న తరువాతనే ఆయన తింటాడు."

"సీతాపతిగారు త్వరపెట్టారు- "చెయ్యి కడుక్కుని పోదాంపద" అని.

"ఆదెయ్య తాతయ్యగారికి పెరుగు యిష్టమేనా?"

"వేసుకోరు."

"నాకూ పెరుగు సహించదు" అని కంచం అవతలకు నెట్టి అమ్మ చెయ్యి కడుక్కున్నది.

"ఎందుకమ్మా కంచం వదిలి పెట్టిపోతున్నావు?" అని మాచమ్మగారు ఆందోళన వ్యక్తం చేసింది.

అమ్మ ఏమీ సమాధానం యివ్వకుండా గ్లాసు ఇంటిలో పెట్టి చెయ్యి తుడుచుకుంటూ ఆదెయ్యగారి దగ్గరకు వెళ్ళింది.

"ప్రొద్దు పోయింది పోదాంపద ఆదెయ్య తాత దగ్గర కూర్చుంటే ఎట్లా? నాకు

నిద్రవస్తోంది" అని సీతాపతి తాతగారు హెచ్చరించారు.

"నేను ఆదెయ్యతాతయ్య దగ్గర పడుకుంటానులే."

ఆ మాట విని ఆదెయ్యగారు సంతోషపడి- తన పొట్టమీద పడుకోబెట్టుకుని-

"ఇక్కడనే పడుకో అమ్మా, ఇంతకన్నా నాకు కావలసినదేమిటి?" అంటూ సీతాపతితాతగారిని ఉద్దేశించి "నీవు వెళ్ళి పడుకో. అమ్మాయి అంతగా ఏడిస్తే నేను తీసుకువచ్చి దించుతానులే--" అన్నారు.

"నాకు మరీ నయం-వెళుతున్నాను" అని సీతాపతి తాతగారు వెళ్ళారు.

కాలం గడిచి పోతున్నది. కాని ఆదెయ్యగారికి భోజనానికి పిలుపు రాలేదు.

మాచమ్మగారు తృప్తిగా అన్నం తిని హాయిగా నిద్రపోతూ ఉన్నది. ఆదెయ్య గారు మెల్లగా లేచి అమ్మను పక్కమీద పడుకోబెట్టి లోపలకు వెళ్ళి మజ్జిగ త్రాగివచ్చి పడుకున్నారు. అది గమనించిన అమ్మ "తాతగారూ-- మీరు రెండు పూటల భోజనం చేయరా? ఎప్పుడూ తినరా? ఇవాళేనా?" అని అడిగింది.

"రోజూ అంతేనమ్మా"

"ఎన్ని సంవత్సరాలనుండి?"

"అవన్నీ ఎందుకులే అమ్మా యిప్పుడు? నీవు నా దగ్గర పడుకుంటా నంటివిగా, పడుకుందాం పద"--

"నాకు నిద్రరావటం లేదు. ఇవన్నీ తెలుసుకుంటే హాయిగా పడుకుంటాను,"

"చిన్నపిల్లతో ఎట్లా చెప్పేది చెప్ప-"

"నేను చిన్నపిల్లగా అడగటం లేదు."

"ఏమయినా తీరుస్తావా?"

"ఏమీ తీర్చలేకపోయినా మీ యింట్లో అన్నం తినటం తీర్చుకుంటాను."

"రేపు చెపుతాను. పడుకుందాము."

"నీవు చెప్పిందాక మా యింటికి పోను. అన్నం తినను."

చటుక్కున అమ్మ లేచి మాచమ్మగారి దగ్గరకు వెళ్ళి "పన్నెండు గంటలప్పుడు

తాతగారు అన్నం తింటారంటివే. ఇప్పుడు పన్నెండు దాటిందిగా. మరి తినలేదేమి?" అని అడిగింది.

"ఎప్పుడయినా ఒక రోజున తినరుగానీ మామూలుగా తింటారమ్మా" అని అనునయంగా చెప్పిందామె.

" ఆ తినని రోజు ఏదయినా వారం పట్టింపా?"

"ఏమీ లేవు."

"ఏ వారాలూ దేవుడి కివ్వకుండా అన్ని వారాలూ నీకే యిచ్చాడన్నమాట. నీకు మొక్కుకున్నారా తాతగారు?"

అమ్మ చమత్కారంగా అంటున్నదనుకుని మాచమ్మగారు పకపకా నవ్వింది.

అమ్మ గంభీరంగా "నీకు నవ్వు ఎట్లా వస్తున్నది?- సిగ్గులేని ముఖానికి నవ్వే శృంగారమట!" అన్నది.

ఆ కంఠంలోని కాఠిన్యమూ, ఆ స్వరంలోని గాంభీర్యమూ, ఆ ముఖంలోని అరుణిమా మాచమ్మగారిని క్షణంలో భీతమనస్కను చేశాయి.

అంతలో అమ్మ మళ్ళీ నెమ్మదిగా అన్నది-

"ఇక్కడ యిట్లా పడుకోబోతే తాతగారి కాళ్ళు రాయరాదూ? పాపం-పొలం తిరిగి వచ్చారు."

"ఎక్కడ చూశావట్లా?" మాచమ్మగారు కూడా కొంత సర్దుకుని అడిగింది.

"ప్రతి యింటిలోనూ జరుగుతూనే ఉంటుంది. భార్యలందరకూ అది సహజమే. కాని యిక్కడ మాత్రం అసహజంగా ఉన్నది" అంటూ అమ్మ ఆదెయ్యగారి దగ్గరకు వచ్చి పడుకున్నది.

"చిట్టితల్లీ-యింకా నిద్రపోకుండా కూర్చున్నావా? పడుకోరాదూ - ఆ రంగమ్మ తల్లికి నేనంటే ఎంతో ప్రేమ. అటువంటి వాళ్ళు ఊరికి పదిమంది ఉంటే ఎంత బాగుంటుందో-" అంటూ ఉంటే ఆదెయ్యగారి కళ్ళు చెమరించాయి.

"అటువంటి వాళ్ళు ఎక్కువకాలం ఉండరుగా" అమ్మ నిర్లిప్తంగా అన్నది.

ఆదెయ్యగారి కన్నులు జలజలా స్రవిస్తూ ఉండగా- "ఇంతింత ఆలోచనలూ,

అంతంతమాటలూ నీ కెందుకూ? వండుకో అమ్మా- " అని అమ్మను బుజ్జగించారు.

"తాతగారూ - మీ సహనం వంటి సహనం కావాలండీ అందరికీ. సహనమంటే-బాధలుంటేగా సహనం తెలిసేది. సహనమనే దేవతను ఆరాధించాలంటే బాధలనే పూజా ద్రవ్యాలు కావాలి" అన్నది అమ్మ.

అదెయ్యగారికి ఆ మాటల్లో అమ్మ కంఠంకాక ఎవరో ఒక మహర్షి అనుభవ పూర్వకమయిన సత్యం పలుకుతున్న విధానం స్ఫురించింది. ఆశ్చర్య ఆనందాలు అదెయ్యగారిని కొద్ది క్షణాలు ఉక్కిరిబిక్కిరి చేసినా, వెంటనే తేరుకుని అమ్మను అడిగారు-

"ఇట్లాగే తెల్లవారిందాకా యిక్కడనే పడుకుంటావా, అమ్మా?"

"తెల్లవారిందాకానే కాదు- కొన్ని రోజులపాటు మీ దగ్గరే పడుకుంటాను."

కొద్దిరోజులు అమ్మ అదెయ్యగారి వద్దనే ఉన్నది. ఆయనతో కలిసి భోజనం చేయటమూ, ఆయన వద్దనే పడుకొనటమూ.

ఒకరోజు రాత్రి అదెయ్యగారి ప్రక్కలో అమ్మ పడుకున్నది. ప్రక్క గదిలో మాచమ్మగారు పడుకున్నది. ఉన్నట్లుండి మాచమ్మగారి యెదురుగా అమ్మ వచ్చి నిలుచున్నది. ఎంతో ముద్దుగా ఉన్న అమ్మను చూచి మాచమ్మగారు చేతులు చాపింది, దగ్గరకు రమ్మని. అంతలోనే అమ్మ విరాడ్రూపంతో సాక్షాత్కరించింది. మాచమ్మగారు పరవశురాలయింది. క్షణంలో అమ్మ అదృశ్యమయింది. మాచమ్మగారు భయకంపిత అయింది. శరీరం స్వేద సిక్తమయింది. లోగడ అమ్మ యిచ్చిన సలహా శ్రవణేంద్రియాల్లో ప్రతిధ్వనించ సాగింది.

మాచమ్మగారు కొన్ని నిమిషాలు కొయ్యబారి పోయి నిశ్చేష్ట అయింది. అంతలో అమ్మ వచ్చి ఆమెచేతిని స్పర్శించింది. ఆ స్పర్శ, అమృదుకర స్పర్శ తనకు పాముకాటువలె తోచి భయపడిపోయి కెవ్వున కేకవేసింది. అమ్మ చేతిని వెన్నుమీదకు పోనిచ్చి నిమరటం ఆరంభించింది. మాచమ్మగారు కొంత ఉపశమించినా గుండెలో రేగిన దడ ఏమాత్రమూ అణగలేదు.

అంతలో మళ్ళీ తన ఎదురుగా అమ్మ? ఎప్పుడూ చల్లని వెన్నెలను చిందే ఆ

నయనద్వయం తనపై చంద్రనిప్పలను కుమ్మరిస్తున్నది! ఆ బడబాగ్నిలో తాను మాడిమసి అయి పోతుందా?- ఆ ఆలోచనతో శరీరం దగ్ధమైపోతున్నట్లే అనిపించింది. అంతలో మళ్ళీ అదే చల్లని చెయ్యి తన శీర్షోపరిభాగంపై వ్రాలింది. మళ్ళీ ఏదో మేనుకూ, మనస్సుకూ చల్లదనం!

కాని మాచమ్మగారి హృదయాకాశంలో ఏవేవో బొమ్మలు. అన్నీ తన గతచరిత్రకు సంబంధించినవే.

ఒక్కసారిగా మాచమ్మగారి మనస్సులో ఏవో నిర్ణయాలు వెంట వెంటనే జరిగాయి. కన్నులు శ్రావణమేఘాలై పక్కను తడిపివేశాయి.

జరిగినదంతా ఏమిటీ? యథార్థమా? భ్రమా? పరమేశ్వర విలాసమా? అమ్మాయి, అనసూయ ఆటా?- ఇంత చిన్న పిల్ల అనసూయ, ఏమిటీ యివ్వాళ తనతో యిట్లా ఆడుకుంటున్నది? లేక తనను పరీక్షిస్తున్నదా? పరీక్షించటానికి తానేమయినా అధికారిణియా? అసలు-తనకూ, అనసూయకూ ఏమిటీ సంబంధం? మరి యీ అమ్మాయి ఏమిటీ తన మనసు మీదా, శరీరం మీదా యింత అధికారం నెరపుతున్నది? ఈ అమ్మాయిని చూచిన తనకు అంతలోనే ప్రీతి ఏమిటి? ఇది ఏమిటి?- తనలోని బలహీనతా? అనసూయ ప్రభావమా? ఇంత చిన్నపిల్ల అయిన అనసూయ ముందు తాను ఏమిటీ అల్పాతి అల్పమై పోతున్నది?

ఏమయినా అనసూయలో ఏదో అతిమానుష శక్తి ప్రతిభావంతంగా ఉండి ఉండాలి అనుకుంటూ- లేచి ఆదెయ్యగారి పక్కవద్దకు వెళ్ళింది. అక్కడ ఆయన గాఢసుషుప్తిలో ఉన్నారు. ఆయన ప్రక్కనే అమ్మకూడా పడుకున్నది. కన్నులు ముకుళించిన కమలాలవలె కమనీయంగా ఉన్నాయి. నుదురు చంద్రవంకవలే మనోజ్ఞంగా ఉన్నది. ముఖం అమాయకంగా నిర్వికారంగా ఉన్నది.

అప్రయత్నంగా మాచమ్మగారు మంచం ప్రక్కనే కూర్చుని అమ్మ ముఖంలోకి చూస్తూ ఆదెయ్యగారి పాదాలపై చెయ్యి వేసింది.

ఆ స్పర్శకు ఆదెయ్యగారు ఉలిక్కిపడి లేచారు. కనుల ఎదుట తలవంచుకుని అతి వినమ్రయై మాచమ్మగారు కనిపించింది. ఆయన మొదట ఆశ్చర్య చకితులయినా- వెంటనే సంశయగ్రస్తులయినారు- ఆమె ఏమయినా అమ్మకు

అపకారం చేయటానికి వచ్చిందా- అని. అందుకనే వెంటనే అడిగారు.

"ఏం కథా-యిటు వచ్చావు?"

మాచమ్మగారు కూడా విస్మితురాలయింది-ఎన్నడూ ఆదెయ్యగారి కంఠంలో వినిపించని కర్కశత్వానికి.

కాని ఆదెయ్యగారిని అంతకంటే ఆశ్చర్యపరచింది- ఆ మాచమ్మ కన్నులు కురిసే అశ్రుధారలు.

"ఏమిటీ?ఎందుకూ?" అని ఆదెయ్యగారు అడుగుతూండగానే మాచమ్మ గారు ఆదెయ్యగారి పాదాలమీద వ్రాలి-

"నన్ను క్షమించండీ - నేనెంతో అపచారం చేశాను. ఇన్నాళ్ళూ చీకటిలో గడిపేశాను. ఈ క్షణానే నా కళ్ళు తెరుచుకున్నాయి." అని ఆమె విన్నవించుకుంటూ ఉండగానే కోడికూత వినిపించింది.

"ఇందుకు యీ బుజ్జితల్లే కారణం" అని మాచమ్మ గారు అమ్మను చూపిస్తే-

"మనకు యీ మేలు చేయటం కోసమే అమ్మ మన యింట్లో మకాం చేసిందన్నమాట" అన్నారు ఆదెయ్యగారు.

"అదేమిటి-అందుకు అమ్మ యిక్కడనే ఉండనవసరం లేదు. కొన్ని క్షణాల్లో నాకు కలిగిన అనుభవం మీకు వివరించలేను. వివరించినా మీకు అర్థం కాదు. మానసికమయిన అనుభూతి ఎవరిది వారికే. ఎంత సన్నిహితులయినా, ఆప్తులయినా ఎవరి అనుభవం వారిదే. ఒకరిది ఒకరు పంచుకొనలేరు; దీనికి సాక్ష్యమూ ఉండదూ, ఋజువూ ఉండదు. ఇప్పుడు నా మనసు వాన కురిసి వెలిసిన పిదప ఆకాశం వలే నిర్మలంగా ఉన్నది- ఏమయినా అమ్మ నా మనసులో నా మనసుతో తన యిష్టం వచ్చినట్లు ఆడుకున్నది. నా మనసుతో ఆడుకునే శక్తి ఎవరి మనసును ఆడించలేదు? ఆమె అందరినీ ఆడించగలదని తోస్తున్నది.

అంటూ ఉండగా అమ్మలేచి కూర్చుని యిద్దరినీ చూచింది. ఆ దృష్టిలో ప్రసన్నత ఉన్నది.

39. ఇష్టదైవం

మరిడమ్మ తాతమ్మ మన్నవ వచ్చింది. వస్తూనే సీతాపతి తాతగారికి పెండ్లి సంబంధం మాట్లాడుకుని వచ్చింది.

ఒక వారం రోజులలో అంతా సర్దుకుని యిరుగు పొరుగు వారందరినీ పెళ్ళికి ఆహ్వానించి-సీతాపతితాతగారూ, తాతమ్మా, మామయ్యా అమ్మా బాపట్ల వెళ్ళారు. బాపట్ల వెళ్ళిన మూడవ నాడే పెళ్ళికి చీరాల ప్రయాణమయినారు.

అమ్మ, తాతగారిభాషికం చూడకూడదనీ, అందువలన పెళ్ళికి రావద్దనీ అన్నారు బంధువులు, అమ్మ ఏమీ సమాధానం చెప్పకుండా మౌనంగా నిలుచున్నది. అమ్మ మౌనమూ అందులోని విషాదభావమూ గ్రహించి తాతగారు బావురుమన్నారు. తాతగారి మనస్సులో గతమంతా మెదిలింది. అమ్మమ్మ స్మృతి మనసునంతా కలచివేసింది. అమ్మను బుజాన వేసుకుని, అశ్రుపూర్ణమయిన కందోయితో, గద్గదస్వరంతో అమ్మమ్మను ఎదురుగా ఉన్నట్లే ఊహించుకుని-

"నన్నింత అన్యాయంచేసి పోయినావా? నీవు ఉండి నేను పోతే ఎంత బాగుండేది?" అని దు:ఖించారు.

ఆ బాధ చూడ లేక అమ్మ "నేను యిక్కడనే ఉంటానులే, నీవు వెళ్ళు నాన్నా" అని బతిమాలింది, తాతగారి కన్నులు తుడుస్తూ.

ఆ మాట వినగానే తాతగారి దు:ఖం మరింతగా పెల్లుబికింది.

"ఫరవాలేదులే అమ్మా- ఏది అయితే అది అవుతుంది. వెళదాం నీవు కూడా రా" అన్నారు తాతగారు-ప్రేమ అన్ని భయాలనూ జయించగా.

రాఘవరావు మామయ్య బాపట్లలోనే ఆగారు.

పెళ్ళి వారందరూ చీరాల చేరారు. విడిది బందా సీతాపతి గారింటిలో. పెండ్లి బందా వెంకటనరసు పంతులుగారి గృహంలో.

వివాహం ఆ రాత్రి గం.8-30ని.లకు. సరిగా రంగమ్మ అమ్మమ్మ చనిపోయిన సమయం అదే. మాసమూ, తేదీ, నక్షత్రమూ కూడా అదే.

వివాహం నిరాడంబరంగా జరిగిపోయింది. కాగానే బాపట్ల తిరిగివచ్చారు.

కొన్నాళ్ళ క్రిందటి నుండి చిదంబరరావు తాతగారి తల్లి నరసమ్మగారికి మతి స్థిరంగా లేదు. ఆ రాత్రి ఆమె ఏమీ తెలియని స్థితిలో యిల్లు విడిచి వీధిని చేరింది. సరిగా అదే సమయానికి అమ్మలేచి "తాతమ్మా తాతమ్మా" అని కేకలు వేసింది. నరసమ్మగారికి అమ్మ పిలుపు వినపడగానే ఒక మహోజ్జ్వల కాంతిరేఖ కనపడ్డది. వెంటనే స్పృహవచ్చింది. 'ఇది ఏమిటీ? నేను యిక్కడకు వచ్చా నెందుకూ?' అనుకుంటూ లోపలకు వచ్చింది. వస్తూ గడపలో పడిపోయింది. ఆ పడటం సాష్టాంగపడినట్లయి, చేతులు ఎదురుగా నిలుచుని ఉన్న అమ్మపాదాలపై వ్రాలాయి.

నరసమ్మగారు ప్రాణం వదిలింది.

తరువాత కొద్ది రోజులకే సీతాపతిగారూ, మరిడమ్మ తాతమ్మా, రాఘవరావు మామయ్యా అమ్మా అందరూ కలిసి మన్నవ వచ్చారు.

అప్పటికి అమ్మకు ఏడు సంవత్సరాలు నిండి ఎనిమిదవ సంవత్సరం వచ్చింది.

తాతగారింటిలో రెండు పెళ్ళిళ్ళూ, ఉపనయనాలూ కావటంలో డబ్బుకు యిబ్బంది ఏర్పడ్డది. ధాన్యం ధర బాగా తగ్గటంతో ఎంత ధాన్యం అమ్మినా డబ్బే కనిపించేది కాదు.

అట్లా తాతగారు ఆర్థిక క్లిష్టపరిస్థితిలో నుండగా తాతగారి చెల్లెలు కనకమ్మగారి భర్త అయిన బ్రహ్మాండం సుబ్బారావుగారికి జబ్బుచేసి ఉద్యోగం చేస్తున్న నిజామాబాద్ నుండి బాపట్ల వచ్చినట్లు కబురు తెలిసింది. తాతగారు వారికి అపత్సమయంలో తమ సహకారాన్ని అందించాలని మనస్ఫూర్తిగా వాంఛించినా తమ ఆర్థిక పరిస్థితి అందుకు ఏ మాత్రమూ అంగీకరించ నందున తాతగారు విచారగ్రస్తులయినారు.

చివరకు బాపట్ల వెళ్ళి వారిని చూచివద్దామన్నా డబ్బులేక తాతగారు వెళ్ళలేకపోయారు.

ఆ క్లిష్టసమయంలో జూపూడి గ్రామ కాపురస్తులు గుండెమెడ జానకి రామయ్యగారు తాతగారికి మూడువేల రూపాయలు ఋణంగా యిచ్చారు. వారు సామాన్యంగా పొలాలో, బంగారునగలో తాకట్టు పెట్టుకునిగానీ ఎవరికీ

షైకం అప్పగా యివ్వరు, కానీ తాతగారికి తాకట్టు లేకనే యిచ్చారు. మన్నవలో ఆ విషయం అందరినీ ఆశ్చర్యపరచింది. అది తాతగారి అదృష్టం అనుకునే, జానకిరామయ్యగారిని ఆ విధంగా వశపరచుకున్న శక్తి ఏదోనని గ్రామస్థులు అన్వేషిస్తూ ఉండగా-

"మా నాన్న ఆయనకు అల్లుడు కదూ? అల్లునికి లొంగని మామ ఎక్కడ ఉన్నాడు?" అని అమ్మ పకపకా నవ్వింది.

అ మాట విన్నవారు వినగానే నవ్వినా వెంటనే ఆలోచించుకొని-

"మీ నాన్న ఆయనకు అల్లుడు ఎట్లా అవుతాడూ?" అని అడిగారు.

అమ్మ ఏమీ సమాధానం యివ్వలేదు.

వారు ఒక్కరొక్కరే బతిమాలారు.

అప్పడు అమ్మ అన్నది-

"జనకునికి సీతాపతి అల్లుడే గదా" అని.

ఆ మాట వినగానే ఆశ్చర్యపోయినా కొన్నిక్షణాల్లోనే "ఓహో-అదా సంగతి?" అన్నారు వారు.

జానకిరామయ్యగారి అసలు పేరు జనకుడు. కాని పెళ్లిలో జానకిరామయ్యగా మార్చారు. ఆ సంగతి వారు మరచిపోయినా అమ్మమాట వినగానే జ్ఞప్తికి వచ్చి ఆశ్చర్యపోయి-

"నీ కెట్లా తెలుసు?" అని అడిగారు మన్నవ చినరామసుబ్బయ్యగారు.

"అనసూయ చాలా తెలివిగలది. మరిడమ్మ గారి పెంపకం కదూ? పురాణ గాథలన్నీ తెలిసినై. లోకంనడవడీ తెలిసింది" అన్నారు మునసబుగారు.

"ఆమె ఎంతమందిని పెంచలేదూ? మనలను మాత్రం ఆమె దగ్గరకు తీయలేదూ? ఎవరి సంస్కారం వారిదే" అన్నారు పోస్టుమాస్టరుగారు.

"చిన్నప్పటి నుండీ అమ్మాయి అసలు మాట్లాడదు. ఎప్పడయినా ఒక మాట మాట్లాడితే అది ఎంతో అర్థవంతంగా వుంటుంది" అన్నారు సీతాపతి తాతగారు.

ప్రొద్దు క్రుంకింది.

బజారుకు వెళ్లిన తాతగారూ, అమ్మా యింటికి వచ్చారు.

ఇంటివద్ద మరిడమ్మ తాతమ్మ వంట చేసుకుంటూ ఇరుగు పొరుగువారికి పాటలు నేర్పుతూ వున్నది; ఆమె వద్దకు గ్రామంలో పలువురు స్త్రీలు రోజూ వచ్చి పాటలూ, పద్యాలూ నేర్చుకొనటమో, వేదాంతం వినటమో అలవాటు, మరిడమ్మగారు విసుగు లేకుండా మాటలు పలకనివారి చేత గూడా పాటలు సాధన చేయించేది. ఏ యింట్లో ఏ శుభా శుభ కార్యం జరుగుతున్నా అక్కడ ఆమె సహాయం తప్పక వుండేది. ఆమె మూర్తీభవించిన సేవాభావం.

అమ్మ యింటికి రాగానే మరిడమ్మగారి ఒడిలో కూర్చున్నది.

కొన్ని క్షణాల అనంతరం మరిడమ్మగారు "అమ్మా" అని పిలిచింది.

అమ్మ పలకలేదు.

మరిడమ్మగారు మళ్ళీ పిలిచింది.

అమ్మదృష్టి సైతం మళ్ళలేదు.

"పలుకమ్మా"- మరిడమ్మగారు అమ్మ చుబుకం పట్టుకుని అడిగింది-

"కాబోయే మీ అత్తగారు నిజామాబాదు నుండి బాపట్ల వచ్చిందట. వెళ్ళి చూచి వద్దామా? మీ మామయ్యకు చాలా జబ్బుగా ఉన్నదట. అసలే నా గీత మంచిది కాదు. తల్లీ దండ్రీలేని పిల్లలందరూ నాపాల పడటమే. అది నా అదృష్టం వారిదేమున్నది? నాకు సేవ చేస్తామన్నది వారిద్దరే. మీ అమ్మా, యీ మామయ్యా, నన్నిట్లాగే వదిలి మీ అమ్మ ముందుగానే వెళ్ళి పోయింది. ఇతనికి యిటువంటి జబ్బు చేసింది."

"ఏం జబ్బు తాతమ్మా - బ్రతకరా?"

"ఏమి చెప్పేదమ్మా? రాగూడని జబ్బే."

"అంటే బ్రతకడనేగా?"

"అయినా నీవు చెప్ప - నీ కెట్లా తోస్తున్నదో, బాలవాక్యం బ్రహ్మవాక్యం అంటారు."

"రాకూడనిది వచ్చేది బ్రతక్కుండా ఉండటానికేగా".

"పలికావూ! నేను అనుకున్నంతా అయింది."

"అది సరేగానీ తాతమ్మా-కాబోయే అత్తగారన్నా వేమిటి?"

"నీవు బావను పెండ్లి చేసుకుంటావేమోనని అన్నానులే"

"కాబోయే అత్తగారని నిశ్చయంగా అన్నావు. అనుమానంగా అనలేదే."

పాటలు నేర్చుకోవటానికి వచ్చినవారిలో ఒకరయిన మంత్రిప్రగడ విశాలమ్మ గారు-

"పెళ్ళి అయిందాకా అట్లా చెప్పకుని ముచ్చట పడతాం. మేనత్త మేనమామ బిడ్డలున్నారంటే ఎవరికో ఒకరికి పెళ్ళి అయిందాక అనుకోవటం జరుగుతూనే ఉంటుంది" అన్నది.

గంగరాజు కుటుంబాలమ్మగారు కూడా ఆ మాటను బలపరిచింది.

అంతలో తాతగారు వచ్చి -

"అత్తయ్యా-అన్నం పెడతావా?" అని అడిగారు.

"రా, నాయనా నీ కోసమే కనిపెట్టుక్కూర్చున్నాను."

తాతగారు తడిగుడ్డ కట్టుకు వచ్చి-

"కొల్లాయిగుడ్డ ఎక్కడున్నది? పిల్లకు కూడా మడి అంగవస్త్రం యివ్వు-" అని అడిగారు.

తాతగారూ, అమ్మా ఒక విస్తట్లోనే భోజనానికి కూర్చున్నారు. అది వారి అలవాటు. భోజనం చేస్తుండగా-

"నాన్నా-అన్నయ్య అన్నానికి రాలేదేమి?" అని అమ్మ అడిగింది.

"ఎక్కడ తిరుగుతున్నాడో-వాడు రోజూ వస్తున్నాడా?" అన్నారు తాతగారు విచారంగా.

"చదువు లేదు సరేగదా, వేళకు తిండికూడా లేదు" అని మరిడమ్మ గారు సానుభూతి వ్యక్తపరిచింది.

"ఏం జేస్తాము? వాళ్లందరూ పోయి వీడెందుకో బ్రతికాడు" అన్నారు తాతగారు నోటిలో పెట్టుకునే ముద్దను మధ్యలోనే ఆపివేసి.

"అట్లా అనకు నాన్నా-వాళ్ళు పోవటానికి పుట్టారు. వీడుయిట్లా చెయ్యటానికి పుట్టాడు" అన్నది అమ్మ నిర్లిప్తంగా.

"చూడరా సీతాపతి! అమ్మాయి ఎంత నిర్లిప్తంగా అన్నదో" అని మరిడమ్మ తాతమ్మ అమ్మను ప్రశంసించింది.

"అన్నీ నీ మాటలే" అన్నారు తాతగారు.

"నేను మీ అందరినీ పెంచాగా, దానిని ఒక్కదానినే పెంచానా? మరి, మీకు రాలేదుగా ఆ మాటలు. అమ్మాయి అన్నట్లుగా-ఎవరు ఎందుకు వచ్చారో అది చేస్తారు. అంతే" అన్నది మరిడమ్మ తాతమ్మ.

అంతలో తాతగారు భోజనం ముగించి చెయ్యి కడుక్కుంటూ ఉండగా రాఘవరావు మామయ్య బాపట్ల నుండి వచ్చిన ఉత్తరం తీసుకువచ్చి-

"నాన్నా-మామయ్యకు జబ్బు జాస్తిగా ఉన్నదట" అన్నారు.

తాతగారు చేతిలో చెంబు క్రింద ఉంచి ఒక్క క్షణం ఆకాశంలోకి చూస్తూ ఆలోచించి అన్నారు-

"అత్తయ్యా-రేపు మనమిద్దరం వెళదామా?"

"పిల్లలను ఎక్కడ ఉంచి పోదాము? పిల్లలను కూడా తీసుకువెళదాం" అన్నది మరిడమ్మతాతమ్మ.

"అయితే-ముందు నేను వెళ్ళి చూచి వస్తాను. తరువాత మీరు వద్దురుగాని."

మరిడమ్మ తాతమ్మ అందుకు అంగీకరించింది. నడుము విరిగినట్లు తాతగారు కూలబడిపోయి-

"అన్నీ దెబ్బమీద దెబ్బలే. వాడు బ్రతికితే తప్ప యిది కూడ యీదవలసిందేగా నేను" అన్నారు హీనస్వరంతో.

"అదేమిటి నాన్నా - అట్లా అనుకుంటావు? మనలను చిదంబరరావు తాతయ్య భరించటంలేదూ? మనం కూడా ఆయనకు బరువేగా?" అన్నది

అమ్మ మెల్లగా.

"వాళ్ళను ఎవరూ మోయక్కరలేదు. నేను బండిగింజ లిస్తాను" అన్నది మరిడమ్మ తాతమ్మ.

"బండిగింజలతోనే అవుతుందా?" అన్నారు వెంటనే తాతగారు.

"అసలు యిన్ని ఆలోచనలు ఎందుకు? ఎవరి అన్నం వారికి ఉన్నది" అన్నది అమ్మ నిశ్చలంగా.

ఆ రాత్రి అందరూ అన్నం తిని పడుకున్నారు. మరునాడు తెల్లవారుజామున లేచి తాతగారు బాపట్ల వెళ్ళారు.

అమ్మ ప్రతిరోజూ సాధ్యమయినంతవరకు దేవాలయంలోనో గంగరాజు పున్నయ్యగారి తోటలోనో కాలక్షేపం చేయ ప్రారంభించింది. పున్నయ్యగారితోటలో చింతచెట్టు క్రిందనే ఎక్కువ కాలం కూర్చుని చింతచిగురు తింటూ కాలం గడిపేది.

అమ్మ యింటికి రాకపోయినా ఏ పినతండ్రిగారి యింటివద్ద నున్నదోలే అని ఎవరూ అమ్మ విషయం పట్టించుకునేవారు కారు. ఎప్పుడయినా యింటికి వచ్చినపుడు భోజనవిషయం ప్రస్తావనకు వస్తే-ఎక్కడో భోజనం చేశానని చెప్పి అమ్మ అన్నం తినేది కాదు.

అందువల్ల అమ్మకు ఎక్కువ కాలం పున్నయ్యగారి తోటలో గడిపేందుకు మంచి అవకాశం లభించింది. ఒక రోజున అమ్మ చింతచెట్టుపై ఒక కొమ్మమీద కూర్చుని ఉన్నది. తురుమెళ్ళ వెంకటప్పయ్యగారు చింతచిగురుకోసుకునేందుకు అక్కడకు వచ్చారు. అమ్మ ఎక్కిన చెట్టు క్రిందకు వచ్చి తల పైకి యెత్తారు.

చిత్రం! సత్యనారాయణస్వామి ప్రత్యక్షమైనాడు. ఆ స్వామి ఆయన ఇష్టదైవం. అట్లా అయాచితంగా దర్శనం యిచ్చే సరికి ఆయన ఆనంద పరవశులయ్యారు. ఆ ఆనంద రసజలధిలో తల మునకలవుతూ కరాలు ముకుళించేసరికి ఒక గొడ్లుకాచుకునే పిల్లవానివలె కనుపించాడు.

ఆయనకు చికాకు కలిగింది-పానకంలో పుల్లవలె వీడు ఎవరూ?-అనుకొన్నారు.

"ఏవరబ్బాయివిరా? ఇందాకటినుండీ ఎక్కడ ఉన్నావు? చెట్టు ఎక్కి ఎంతసేపయింది?" అని అడిగారు వెంకటప్పయ్యగారు కినిసిన కంఠంతో.

జవాబు లేదు.

"పలకవేమిరా?" హెచ్చు శ్రుతిలో గద్దించారు.

సమాధానం వినిపించక పోయేసరికి 'ఎవరో కుఱ్ఱ వెధవలే' అనుకుని-

'ఒక అనామకుడు పలికితే ఏమీ, పలక్కపోతే ఏమీ?' అని సర్దుకుంటూ-

'ఏమయితేనేమీ, నా స్వామి నాకు ప్రత్యక్షమైనాడు' అని మురిసిపోతూ-

ప్రక్కచెట్టు దగ్గరకు వెళ్ళి చిగురు కోసుకోవటం ఆరంభించారు. చెట్టుపైనుండి అమ్మ చివాలున దూకింది. గౌనుతో ఉన్న అమ్మను వెంకటప్పయ్యగారు చూచారు. అమ్మ పరుగెత్తింది. ఆయన వెంబడించారు.

'ఇదేమిటి-యిన్ని రూపాలు వెంటవెంటనే ప్రత్యక్షమయినాయి? ఒకే స్వామి యిన్ని రూపాలుగా దర్శనమిస్తున్నాడా? ఏదయినా దయ్యం నన్ను ఆవహించి నా మనసును వికలం చేస్తున్నదా?' అనుకుని భయవిహ్వలురై కోసుకున్న కొద్ది చింతచిగురు కూడా నేలపాలు చేసి యింటికి పరుగెత్తారు.

అమ్మకూడా సరాసరి పరుగెత్తుకుని వెంకటప్పయ్యగారి యింటికే వచ్చింది. అక్కడ ఆడవాళ్ళు గవ్వలు ఆడుతుంటే చూస్తూ కూర్చున్నది.

వెంకటప్పయ్యగారూ రొప్పకుంటూ యింట్లోకి వచ్చి వారి భార్యతో-

"నాకు దయ్యం పట్టింది. నాకు దయ్యం పట్టింది" అని కేకలు వేశారు.

ఆమె ప్రశ్నార్థకంగానూ ఆశ్చర్యంగానూ వెంకటప్పయ్యగారి వంక చూచింది.

"చింతచిగురుకోసం పున్నయ్యగారి తోటకు వెళ్ళాను. అక్కడ **నా యిష్ట** దైవమయిన సత్యనారాయణస్వామి సాక్షాత్కార మయింది. ఆ దర్శనం**తో నా** హృదయం ఆనంద ప్రఫుల్లమయింది. నా జీవితమే ధన్యమయిందని భావించాను. కాని, మనకు ఏమి కీడు మూడనున్నదో ఆ మూర్తి వెంటనే ఒక 'మాలపిల్లవాడు' వలే పరివర్తన చెంది నా హృదయాన్ని శకల శకలాలుగా విఛ్ఛినం చేసింది. అంతలోనే ఒక చక్కని ఆడపిల్లవలే కనుపించి పరుగెత్తి కనుచూపుకు అందలేదు" అంటూ అక్కడనే ఉన్న అమ్మ వంక చూస్తూ-

" ఆ అమ్మాయికి యీ అమ్మాయి పోలికలు ఉన్నాయి. ఈ అమ్మాయి వచ్చి ఎంత సేపయింది?" అని అడిగారు.

"మీరు వచ్చేముందే వచ్చింది" అన్నది ఆయన భార్య రంగమ్మగారు.

"చెట్టు దూకింది నీవేనా అమ్మా?" అని అమ్మను వెంకటప్పయ్యగారు అడిగారు.

"నేనే మామయ్యా"

"నీవేనా?"

"ఔను".

"మరి, మాలపిల్లవాడికి ఎటువైపున కూర్చున్నావు?"

"మాలవాడిని నేను చూడలేదు."

"నన్ను అయినా చూచావా?"

"నిన్ను చూచాను."

"నన్ను చూచినపుడు మాలపిల్లవాడు ఎందుకు కనపడలేదూ?"

"వాడు మావాడు కావటంచేత మాలవాడుగా కనపడలేదు."

"మాలవాడు కాకపోతే మానే, యింకొక పిల్లవాడినయినా చూచావా?"

"ఇంకొకరుగా చూడలేదు. ఒకరిగానే చూచాను."

"నిజం చెప్పు పిల్లా" అని వెంకటప్పయ్యగారు అమ్మ చెవి పట్టుకున్నారు.

వెంటనే అమ్మ అదృశ్యమయి ఎదురుగా మళ్ళీ సత్యనారాయణస్వామి నిలబడ్డాడు.

ఆయనకు విద్యుద్ఘాతం తగిలినట్లయి కేకవేశారు.

రంగమ్మగారు భయపడి పరుగెత్తుకు వచ్చింది. వెంకటప్పయ్యగారు నేలపై పడిపోయి-

"నా యిష్టదైవం కనుపించాడు. నా యిష్టదైవం కనుపించాడు. అనసూయ మామూలుపిల్లకాదు. నా యిష్టదైవమయిన సత్యనారాయణస్వామియే యీ అనసూయ" అని పలవరిస్తూంటే-

ఇరుగు పొరుగు వారందరూ గుమికూడారు. తలా ఒక రకంగా ఊహాగానం చేయనారంభించారు. కొందరు పైత్యపుభ్రమ అనీ, మరి కొందరు పిశాచి ఆవేశమనీ భావించి నివారణోపాయాన్వేషణ సాగించారు.

ఏమీ అర్థంకాక రంగమ్మగారు అమ్మను సమీపించి "అసలు ఏమ యిందమ్మా? అని అడిగింది.

"అసలు ఏమిటో తెలిస్తేగా? అసలు తెలియదు. జరిగేది కనపడుతూనే ఉన్నది" అన్నది అమ్మ.

"అది కాదమ్మా, చెట్టు దగ్గర ఏమి జరిగింది? అప్పుడు నీవు ఎక్క డున్నావు?" అని రంగమ్మగారు కుతూహలంగా అడిగింది.

"నేను రోజూ ఆ తోటకు వెళతాను. వెళ్ళి ఆచెట్టు పై కూర్చుంటాను. నాలో ఈ రోజు విశేషమేమీ లేదు. వారి అనుభవమేమిటో నాకు తెలీదు" అన్నది అమ్మ అమాయకంగా.

"అంతే అయి ఉంటుంది. పగలు నడిజామున వెళ్ళినందున భయపడి ఉంటాడు. ఈ అమ్మాయిని చూచి భ్రమపడి ఉంటాడు." అని మన్నవ లింగమ్మ గారు సర్దటానికి ప్రయత్నించింది.

అమ్మ మెల్లగా యింటికి బయలుదేరింది.

తరువాత ఒక గంటకు వెంకటప్పయ్యగారు స్పృహలోకి వచ్చారు. ఆ రోజు నుండి అమ్మ ఎక్కడ కనుపించినా తన యిష్టదైవం సత్యనారాయణస్వామియే అనుకుని చేతులు ముకుళించి నమస్కారం చేస్తూ ఉంటారు.

కాని అందరూ ఆయనను ఆ రోజున దయ్యం ఆవహించిందనీ, అది అమ్మాయి రూపంలో కనుపిస్తుందనీ అందువలన దానిని తన జోలికి రావద్దని ప్రార్థనా పూర్వకంగా నమస్కారం చేస్తున్నారనీ - ఊహించారు.

వెంకటప్పయ్యగారు చాలా పేదవాడు. మంచినీళ్ళ బిందెలు మోసుకుని జీవనం గడిపేవారు. కాని ఆ రోజు నుండి ఆయనకు అన్ని విషయాలల్లోనూ బాగా కలిసిరావటం మొదలయింది. అది తన యిష్టదైవమయిన సత్యనారా

యణస్వామి అనుగ్రహమేనని విశ్వసించి ప్రతి ఏకాదశికీ వ్రతం జరుపుకొన ఉపక్రమించారు.

ఒక ఏకాదశినాడు వారు సత్యనారాయణస్వామివ్రతం జరుపుకుంటున్నారు. అమ్మ అక్కడకు వెళ్ళి---

"నేను పుట్టింది ఏకాదశినాడే" అన్నది.

"అయితే నీకు పుట్టినరోజు పండగ చేయమంటావా?" అని రంగమ్మగారు అడిగింది.

"ఈ రోజు ఆశ్లేషా నక్షత్రం కదా. కనుక మీరు చేసేది నా పూజయే" నన్నది నిశ్చితంగా అమ్మ.

"మేము చేసేది సత్యనారాయణస్వామి వ్రతమమ్మా" అన్నది రంగమ్మగారు.

"సత్యమయినవ్రతమంతా నాతే" అన్నది అమ్మ.

అంతలో వ్రతారంభానికి పురోహితుడు త్వరపెట్టాడు.

వాళ్ళు వ్రతాచరణకు పీటలపై కూర్చున్నారు. అమ్మ యింటికి వచ్చింది.

40. వాగ్దానం

సీతాపతి తాతగారు బావమరిది అయిన బ్రహ్మాండం సుబ్బారావుగారికి జబ్బు అని చూచి రావటానికి వెళ్లి రెండు నెలలయినా తిరిగి రాకపోవటమూ, సుబ్బారావుగారికి జబ్బు ఎక్కువ అయిందని కబురు రావటంతో మరిడమ్మ తాతమ్మగారు ఆందోళనపడి అమ్మతో-

"అప్పులకు భయపడి ఎటయినా వెళ్ళాడేమో" నని సంశయం వెలిబుచ్చింది.

"అప్పులకు భయపడటం ఎందుకు ? నా వద్ద 150 నవర్ల బంగారం ఉన్నది. అది అమ్మి బాకీలు తీర్చుకోమను తాతమ్మా" అని అమ్మ సలహా యిచ్చింది.

మరునాడు ఉదయమే మరిడమ్మ తాతమ్మా, అమ్మా ఇద్దరూ కలిసి బాపట్ల వచ్చారు. వారు చేరే కొన్ని గంటలక్రితమే సీతాపతి తాతగారు కూడా ఎక్కడ నుండో అక్కడకు వచ్చి ఉన్నారు.

సుబ్బారావు తాతగారికి అన్నిరకాల వైద్యమూ చేయించి ఫలితం లేక చందుర్తి కరణంగారయిన పెమ్మరాజు సత్యనారాయణమూర్తి గారిచేత తీర్థం యిప్పిస్తూ ఉన్నారు. ఆయన హిప్నాటిజం కూడా చేస్తూ ఉన్నారు. అందువలన పైకి వ్యాధి తగ్గినట్లు కనిపించినా లోపల వ్యాధి ప్రబలమై ప్రమాదకరమై పరిణమించింది.

సుబ్బారావుగారికి అమ్మ అంటే అమిత ప్రేమ. రోజూ తన దగ్గరకు పిలిపించుకొని కూర్చోబెట్టుకునేవారు. తాను తినేపండు అమ్మ చేతికి అందిస్తూ...

"పాపం-తల్లి లేని పిల్లవు. తినమ్మా - నీ కెవరు పెడతారు?" అనేవారు.

చిన్న కుమారుడయిన లోకనాధంబాబాయికి డబ్బులిస్తూ-

"నీవు ఒక్కడవే తినబోకురా నాన్నా. నీవు కొనుక్కున్నదెల్లా అమ్మాయికి పెడతూ ఉండు. ఆ అమ్మాయి మన ఇంటి అమ్మాయే..." అనేవారు.

"ఇంటి అమ్మాయి ఏమిటి? మన అమ్మాయి అనవేమి నాన్నా?" అని అడిగేవారు లోకనాథం బాబాయి.

"అంటే అందుకొక కారణం ఉందిలే. తరువాత తెలుస్తుంది నీకు. అయితే, జరిగితే - యిప్పడు మేనమామ కూతురు అయిన వదిన; అప్పడు అన్న భార్య

వదిన అవుతుంది. అంటే తల్లితో సమానమవుతుంది".

అంటూ అమ్మను చూచి -

"ఏమమ్మా - బావను చేసుకుంటావా?" అని అడిగారు.

అమ్మ ఏమీ మాట్లాడకుండా దూరంగా వెళ్ళి దక్షిణపు వైపు గదిలో నేల భోషాణం మీద నిలుచున్నది.

కనకమ్మబామ్మ లోపలనుండి తాతగారికి గ్లాసుతో జావ తీసుకువచ్చింది. తాతగారు ఉమ్మివేసిన కళ్ళె చూచి భయబడి పోయి, పెల్లుబికిన దుఃఖంతో అక్కడ నిలువ లేక గ్లాసు తాతగారి చేతికి అందించి లోపలకు వెళ్ళిపోయింది.

అప్పటికి బామ్మఅయిదు మాసాల గర్భిణి. లోకనాథం బాబాయికి తొమ్మిదవ సంవత్సరం. తరువాత పిల్లవాడు నరసింహారావు కుంటివాడు. అయినా చాలా అందమయినవాడు, తెలివిగలవాడు. అతనికి అమ్మ అంటే ఎనలేని అనురాగం. అతనంటే సుబ్బారావుగారికి అమిత మమకారం, అందుకనే అంత జబ్బులో ఉన్నా తండ్రి ప్రక్కలోనే పడుకునేవాడు.

సుబ్బారావుగారు జావ త్రాగి గ్లాసు క్రింద పెడుతూ-

"అక్కడనే నిలుచున్నా వెందుకమ్మా? ఇటురా. చెప్పు - తప్పకుండా బావను చేసుకుంటావా ? నీకు మీ అమ్మలేదు, వాడికి నాన్న లేడు" అన్నారు.

"మీరున్నారుగా. తండ్రి లేరంటారేమి? తల్లి ఉన్న వారికి ఒక్కతే తల్లి. తల్లి లేని వారికి అందరూ తల్లులే" అన్నది అమ్మ.

సాయంకాలం నాలుగయింది. చిదంబరరావుగారు అప్పడే కోర్టు నుండి వచ్చి కోటు విప్పతూ అమ్మమాటలు విని.

"ఈ తల్లి ఎందరి తల్లులకో తల్లి. ఇంకా ఈమెకు తల్లి ఎందుకు?" అన్నారు.

ఆ మాటకు సుబ్బారావుగారెంతో మురిసిపోయి - "ఇప్పడన్నమాట మళ్ళీ అనండి" అన్నారు.

"ఏమున్నది? ఈ తల్లి ఎందరి తల్లులకో తల్లి అన్నాను. అది - అంటే తెలిసేది కాదు, కంటే తెలుస్తుంది" అన్నారు చిదంబరరావుగారు నిశ్చయంగా.

"ఏమిటో నాకు అర్థంకావటంలేదు. కాని ఆ అమ్మాయి ప్రశాంతత వర్ణించటానికి వీలులేనంతగా ఉన్నది. మాటలు వచ్చినట్లుండదు. అంటే రావని కాదు."

అని సుబ్బారావుగారు వివరిస్తూ ఉండగా చిదంబరరావుగారు.

"నీ వంట్లో ఎట్లా ఉన్నది?" అని అడిగారు.

"ఇంకా ఎట్లా ఉండేదేమున్నది? కాళ్ళ ఉబ్బు కూడా చూపాయి ఇక రోజుల్లోకి వచ్చినట్లే" అన్నారు సుబ్బారావుగారు.

చిదంబరరావుగారు కాళ్ళువత్తి చూచారు. గుంటలు పడ్డాయి. బాధతో తలవూపుకుంటూ ప్రక్కకు వెళ్ళిపోయారు.

సుబ్బారావుగారు అమ్మను మళ్ళీ దగ్గరకు పిలిచి-

"ఏంవమ్మా-బావను తప్పక చేసుకుంటావా?" అని అడిగారు.

"చేసుకుండే యోగ్యత తప్పకుండా ఉంటే - చేసుకుంటాను."

"మీ అమ్మ ఉంటే ఎటూ యిచ్చేదికాదు" అని సుబ్బారావుగారు అంటూ ఉండగా-

"నాన్నా - అనసూయ మంచిది నాన్నా తప్పక చేసుకుందాం అన్నయ్యకు" అన్నాడు కుంటిపిల్లవాడు నరసింహారావు.

" చేసుకున్నా చేసుకోకపోయినా ముందు యీ పిల్లలను అలవాటు చేసుకో అమ్మా- దిగులుపడకుండా. మీ అత్తయ్యకు సుఖమంటే ఏమిటో తెలియదమ్మా. చిన్నప్పటి నుంచీ కష్టాలే" అన్నారు సుబ్బారావుగారు.

"సుఖపడటం తెలియని మనిషికి సుఖపెట్టటం ఏం తెలుస్తుంది? ఒక రకంగా ఆలోచిస్తే-సుఖమనేది ఒకరు పెట్టేది కాదు. కొందరు ఎన్ని ఉన్నా సుఖపడలేరు. సుఖమనేది మనస్సుకు సంబంధించినది" అన్నది అమ్మ.

సుబ్బారావుగారు ఆశ్చర్యంగా వింటూ-

"చాలా పెద్ద మాటలు మాట్లాడుతున్నావే, దగ్గరకు రా" అని పిలిచారు.

అమ్మ దగ్గరకు వచ్చింది. తన పొట్టపై పడుకోబెట్టుకుని-

"నీవు తప్పకుండా బ్రహ్మాండంవారి కోడలివి కావాలని ఉన్నది."

"కావాలని ఉంటే అవుతానుగాని అంటే కాను."

భారతి అత్తయ్యా, నాన్నగారూ వచ్చారు.

సుబ్బారావుగారు నాన్నగారిని పిలిచి అమ్మ తెలివితేటల గురించి వివరించి భారతి అత్తయ్యతో-

"ఎప్పుడయినా అనసూయతో మాట్లాడావా? ఆశ్చర్యకరమయిన సమాధానా లిస్తుంది" అన్నారు.

"ఏమో - ఎప్పుడయినా మాట్లాతేనేగా. ముద్దులా ఉంటుంది." అన్నది భారతి అత్తయ్య.

"మన్నవవారిలో అందరికీ ఉన్న తెలివి అన్ని పాళ్ళూ వాళ్ళకు మిగల్చకుండా లాక్కున్నది. మంచితనం కూడా అట్లాగే-" అన్నారు సుబ్బారావుగారు.

"ఒకరి దగ్గర ఉన్న స్థితిని లాక్కునే శక్తి ఎవరి కుంటుంది? 'నే లాక్కుంటాను, జబ్బు నయం చేస్తాను' అని అనుకుంటున్న సత్యనారాయణగారికే చేత కావటం లేదు. చేతనయితే మీ బాధ పోయేదేగా -" అన్నది అమ్మ.

సుబ్బారావుగారు అమ్మముఖంలో ఒక వెలుగును కని సమ్మోహితులై చూస్తూ ఉన్నారు.

నాన్నగారూ, భారతి అత్తయ్యా అలమారులో ఉన్న పుస్తకాలు సవరించుకుని వెళ్ళిపోయారు.

"ఇవాళ నీవు ఎక్కడకూ వెళ్ళకమ్మా" అని సుబ్బారావుగారు అమ్మను అర్థించారు.

బామ్మ జావ తీసుకువచ్చి సుబ్బారావుగారికి యిచ్చింది.

"ఇదిగో-ఈపాపతో ఎప్పుడయినా మాట్లాడావా?" అని సుబ్బారావుగారు బామ్మను అడిగారు.

"ఏం మాట్లాడేదీ? మాటలే రావు దానికి."

"ఎవరయినా అన్నారా? నీవే అంటున్నావా?"

"ఒకరు అనేదేమున్నది? నేను రోజూ చూడటంలేదూ?"

"అసలు మీరు ఎప్పుడూ లాలనగా దగ్గరకు తీసి ఉండరు."

"అంతగా ఎవరికి తీరుతుంది?"

సాయంకాలం ఆరుగంటలయింది. సుబ్బారావుగారికి ఆయాసం ఎక్కువ యింది.

"నీవు యీ రాత్రి నా దగ్గరే ఉండమ్మా-ఎక్కడకూ వెళ్లకు" అని సుబ్బారావు గారు మళ్లీ అడిగారు.

అమ్మ దొడ్లోకి వెళ్లి తులసిదళాలు తెచ్చి- "ఇవి నమలండి. కొంచెం తగ్గుతుంది. అన్నది.

సుబ్బారావుగారు ఆర్తితో నోరు తెరచి తులసిదళాలు నములుతూ-

"నీ కీ వైద్యం ఎవరు చెప్పారమ్మా" అని అడిగారు.

"మీరు బాధగా ఉన్నారనే ఆవేదనే చెప్పింది."

"నీవు నా దగ్గరనే ఉండమ్మా. ఏమిటో భయంగా ఉన్నది. మీ అత్తయ్యను ఒక్కసారి పిలిచి రా అమ్మా-"

అంటూ ఉండగానే వెంట వెంటనే విరోచనాలు అయి నీరసపడి, పడిపోయి, కళ్లు పెద్దవి చేశారు. మాట్లాడుదామని ప్రయత్నమేగానీ మాటపోయింది.

చిదంబరరావుగారి తల్లి సంవత్సరీకాలు అయినందువలన యింటి నిండా బంధువులు వచ్చి ఉన్నారు. సుబ్బారావుగారి బంధువులు లేకపోయినా బామ్మ వైపు బంధువులందరూ అక్కడ ఉన్నట్లే.

సుబ్బారావుగారు చిదంబరరావుగారిని దగ్గరకు పిలిచి 'నేను పోతున్నాను. మీ యిష్టం' అన్నట్లు సంజ్ఞ చేస్తూ నాన్నగారినీ, అమ్మనూ చూపించారు.

చిదంబరావుగారికి సుబ్బారావుగారి కోరిక అర్థమయినా ఎందుకూ ధైర్యం లేక ఏమీ చెప్పలేదు.

మరిడమ్మతాతమ్మ మాత్రం "సరేలే నాయనా" అన్నది.

బామ్మ దుఃఖంతో నిలువలేక నేలపై పడిపోయింది. అందరి శోకాలతో యిల్లు

ప్రతిధ్వనించింది. సుబ్బారావుగారు ఏడుపులను వారిస్తూ సంజ్ఞచేశారు. అయినా ఎవరు ఊరుకొనగలరు?

అప్పటిదాకా తండ్రిప్రక్కలోనే వున్న నరసింహారావును ఎవరో చంకన వేసుకొనటమూ సుబ్బారావుగారిని క్రింద పెట్టటమూ గుడ్డను కప్పటమూ వెంట వెంటనే జరిగాయి. అక్కడ ఉన్న పిల్లలందరినీ ఎవరి తల్లులు వారిని మేడ పైకి తీసుకుని వెళ్ళారు. నాన్నగారిని కూడా బాపట్ల వెంకట్రావుగారు ప్రక్కకు తీసుకు వెళ్ళారు.

అమ్మ మాత్రమే సుబ్బారావుగారి తలవైపున నిలుచున్నది. చిదంబరావుగారు కూడా ప్రక్కనే కూర్చున్నారు.

"ముందుగానే గుడ్డకప్పటం ఎందుకూ?" అంటూ కప్పిన గుడ్డను అమ్మ తొలగించింది.

"ఇందాకనే ప్రాణం పోయిందమ్మా" అన్నారు చిదంబరరావుగారు.

కాని సుబ్బారావుగారు కళ్ళు తెరచి అమ్మ ముఖంలో ముఖంపెట్టి అమ్మను చూచి కళ్ళు మూశారు. వెంటనే ఒక మెరుపు మెరసినట్లయి అది అమ్మలో లీనమై పోయినట్లు చిదంబరరావుగారు చూచి ఆనంద ఆశ్చర్యాలతో-

"ఈ దృశ్యం చూస్తే నీవు బ్రహ్మాండంవారి కోడలువూ, బ్రహ్మాండానికి తల్లివీ, కాక తప్పదేమో అనిపిస్తూన్నది" అని అమ్మను దగ్గరకు తీసుకున్నారు.

అప్పటికి ఎనిమిది గంటలయింది.

మిన్నుముట్టిన శోకనాదాలు వింటూ పెమ్మరాజు సత్యనారాయణమూర్తిగారు మేడమీద కూర్చుని ఆ రాత్రి తన అశక్తత గురించి విచారిస్తూనే ఉన్నారు.

తెల్లవారగానే రావలసిన బంధువులు వచ్చారు. అంత్యక్రియలకు ఏర్పాట్లు జరిగాయి. అమ్మా లోకనాథం బాబాయీ మేడమీద ఉన్నారు.

"అనసూయా - మానాన్న యింక నాతో మాట్లాడరుగా" అని వెక్కివెక్కి ఏడిచే బాబాయిని ఓదారుస్తూ-

"నీది కాదు కాని లోకం- నరసింహారావును చూస్తే దిగులుగా ఉన్నది. అంటే నీకు లేదని కాదు వాడిని ఎవరూ ఎత్తుకోలేరు. అంతా విసుక్కుంటారు,

ఆయన మాదిరిగా చూడగలవారెవరూ? నాకు ఉద్దేశ్యమున్నా ఎత్తుకోలేనుగా-"

అని అంటూ నరసింహారావు దగ్గరకు వెళ్ళి కూర్చుని-

"నాన్నా లోకం-నీవుకూడా రా, తమ్ముడిని ఆడించుకుంటూ కూర్చుందాము" అన్నది అమ్మ.

బాబాయి వచ్చి కూర్చుని "ఒకటే దిగులు పుడుతున్నది అనసూయా" అంటూ ఉంటే కనులు జలజలా వర్షించాయి.

"లోకం-నీవు ఏడవబోకురా" అని దిగులుగా అన్నాడు నరసింహారావు.

"మరి నీ వెందుకు ఏడుస్తావు?"

"మా నాన్న గనుక."

"నాకూ అందుకేరా దిగులు."

"నీవు ఏడిస్తే నేను చూడ లేనురా" అన్నాడు. నరసింహారావు.

అంతలో కళేబరాన్ని శ్మశానానికి కదిలించే సమయ మాసన్నమయింది, అందరూ నమస్కారాలు చేశారు. నరసింహారావును ఎత్తుకుని, అమ్మనూ, నాన్నగారినీ చెరి ఒక చేత్తో పట్టుకొని బాపట్ల వెంకట్రావుగారు తీసుకువెళ్ళి నమస్కారం చేయించారు.

శ్మశానానికి కళేబరాన్ని తరలించగానే పెద్దపెట్టున శోకనాదాలు సాగాయి. అమ్మ అక్కడనే నిలుచున్నది. సత్యనారాయణమూర్తిగారు మేడపైనుండి విచారంగా క్రిందికి చూచారు.

అమ్మ కూడా అతనివైపు చూచింది.

వెంటనే తాను కొలిచే బాలాత్రిపురసుందరి వలెనే ఉండి పకపకా నవ్వుతూ చెయ్యి పైకియెత్తి వస్తానని ఊపుతూ 'ఏమిటి నీ ముఖం-నీవు చేసింది? బ్రతికిస్తానని వస్తివే' అని అన్నట్లు ఉండి వెంటనే ఆ ముఖంలో లోగడతాను చేసిన కృత్రిమమైన పనులన్నీ కనిపించాయి.

అందరితోపాటు అమ్మకూడా శ్మశానానికి బయలుదేరితే అందరూ "వద్దు, వద్దు" అని కేకలు వేస్తుండగా...

సత్యనారాయణమూర్తిగారికి అమ్మ మహిషవాహనా రూఢుడయిన యమ ధర్మరాజువలే ప్రత్యక్షమై వెంటనే సామాన్య బాలికయై కనపడింది.

ఒక్కక్షణంలో కనుపించినదంతా తన మనోభ్రమ అని అనుకుంటూ ఉండగా 'కాదు కాదు' అని ఏదో శక్తి బలవత్తరంగా స్ఫురింపజేసింది.

లోకనాథం బాబాయీ, నరసింహారావూ ఏమి చేస్తున్నారోనని అమ్మ మేడమీదకు వచ్చింది. అమ్మ వచ్చే సమయానికి పిల్లల దగ్గర సత్యనారాయణ మూర్తిగారు కూర్చుని ఉన్నారు.

"నమస్తే స్వామీ" అన్నది అమ్మ. ఆ కంఠం వినగానే లేచి భయం భయంగా బిత్తరచూపులు చూస్తూ తప్పటడుగులు వేస్తూ ప్రక్కకు వెళ్ళిపోయారు.

అమ్మ ఆ పిల్లలిద్దరి దగ్గరకూ వచ్చి-

"లోకం-నీవు యిందాక నాన్నగారికి ఏమని దణ్ణం పెట్టుకున్నావు?" అని అడిగింది.

"నాతో మాట్లాడుతూ చదువు చెప్ప నాన్నా- అని పెట్టుకున్నాను."

"నీవు ఏమని పెట్టుకున్నావ్ నరసింహం?"

"నన్ను ఎత్తుకోమని పెట్టుకున్నాను."

"మరి నీవు ఏమని పెట్టుకున్నావ్" అని వారిద్దరూ ఒకేసారి అడిగారు అమ్మను.

"నన్ను దగ్గరకు తీసుకుని చిదంబర్రావుతాతగారు ఏమని అన్నారో అదే చేస్తానని.."

"అంటే ఏమిటి?" అని లోకనాథం బాబాయి అడిగారు.

"చెప్పేది కాదు. ముందు గుర్తు ఉంటే మీకే తెలుస్తుంది.

"అయితే నాకూ చెప్పవా?" అది దీనంగా నరసింహారావు అడిగాడు.

"నేను కనిపెట్టుకుంటాలే అని పెట్టుకున్నాను. నాన్నా"

"అంటే ఏమిటి?"

"మరే.........మరే...."

చెప్ప అనసూయా-"

"మీ నాన్నాగారు నిన్ను ఎత్తుకుండేవారనుకో. ఇప్పడు ఎవరూ ఎత్తుకో నప్పడు నేను ఎత్తుకుంటాను.

లోకనాధానికి రోజూ డబ్బులు యిచ్చేవారనుకో. ఎవ్వరూ యివ్వకపోతే-కూలి అయినా చేసి-నేను యిస్తాను. మీ నాన్నగారు లేని మీ కుటుంబానికి - ఆయనను చూపలేకపోవచ్చునుగాని- ఆయన లేనందువలన కలిగే యిబ్బంది ఏమీ లేకుండా చూస్తాను."

"నీవు చిన్నదానివిగా. నీవు ఎట్లా చూస్తావు?" అని అడిగారు బాబాయి.

"అవన్నీ నీకు ఎందుకు? ఎట్లాచేస్తానో - కూలి చేయవచ్చు, అడుక్కుని రావచ్చు, మీకు ఏలోపమూ రానీయను. ఇక నీవు ఏడవ వద్దు--"

ఆ మాటల్లోని ధీమా, నిశ్చయమూ సత్యనారాయణమూర్తిగారు విని ఆశ్చర్యచకితులై - చిదంబరరావుగారికి చెప్పాలి- అనుకుంటూ అమ్మ కనబడేటట్లు యివతలకు వచ్చారు.

రూపంలో అమ్మ అతి సామాన్యంగా ఉన్నది కంఠంలోని స్థైర్యమూ, గాంభీర్యమూ అధికారయుతంగా ఉన్నాయి. ఆ వైరుధ్యం వారిని కలత పరిచింది.

అంతలో మన్నవ కృష్ణశర్మగారి భార్య వెంకటసుబ్బమ్మగారు వచ్చి వారిని పరామర్శిస్తూ తాను వలవలలాడింది.

సుబ్బారావుగారి తల్లిదండ్రుల దుఃఖానికి అవధులే లేవు.

కనకమ్మబామ్మ పిల్లలను చూచి అంత దుఃఖాన్నీ దిగమ్రింగాలని ప్రయత్నించీ విఫలురాలై బావురుమన్నది.

మరిడమ్మతాతమ్మ బామ్మ దగ్గరకు వెళ్ళి బామ్మను తన ఒడిలోకి తీసుకుని-

"నా బండిగింజలు నీకే యిస్తాను. రెండేళ్ళు గడిస్తే నీ బిడ్డే నీకు అక్కరకు వస్తాడు" అని ఓదార్చింది.

41. శిక్ష కాదు; శిక్షణ

సుబ్బారావు తాతగారిని దహనం చేసి అందరూ యింటికి చేరారు. అందరూ స్నానాలు చేసి దీపారాధన చూచారు.

సూర్యాస్తమయ మయింది. అందాకా ఎవరూ-పసిపిల్లలు కూడా-భోజనం చేయలేదు. అప్పడు భోజనం చేయగానే, అమితంగా అలసటచెంది యున్నందు వలన అందరూ రాత్రి ఎనిమిది గంటలయినా కాకముందే గాఢ నిద్రామగ్ను లయినారు.

అమ్మ మేడపై పడుకుని ఉన్నది. పెమ్మరాజు సత్యనారాయణమూర్తిగారికి నిద్రపట్టక మేడపైకి వచ్చారు. పడుకున్న అమ్మను చూచారు. అమ్మ వద్దకు వెళ్ళారు. ముఖంలో ముఖం పెట్టి గమనించారు. అమ్మ నిద్రపోయిందని అనుకున్నారు. మెల్లగా పక్కలో కూర్చున్నారు.

అంతలో చిదంబరరావుతాతగారు లేచి కూర్చుని, అమ్మ పక్కలో కూర్చున్న సత్యనారాయణమూర్తిగారిని చూచి ఆశ్చర్యంతో-

"ఎందుకూ అమ్మాయి దగ్గర కూర్చున్నారు?" అని అడిగారు.

"అమ్మాయి కాళ్ళతీపులతో బాధపడుతుంటే మెన్నరిజం చేద్దామని కూర్చున్నాను.

అమ్మ అన్నీ చూస్తూ ఏమి చూడనట్లూ, అన్నీ వింటూ ఏమి విననట్లూ పడుకున్నది.

సత్యనారాయణగారు అమ్మ కాళ్ళు రాయటం ఆరంభించారు.

చివాలున అమ్మ లేచి కూర్చుని-

"మీరు పెద్దవారు, నా కాళ్ళు పట్టుకుంటా రేమిటి?" అని అడిగింది. అప్పడు అమ్మ వయస్సు తొమ్మిది సంవత్సరాలు.

"బాధగా ఉంటే రాస్తున్నానమ్మా."

"బాధా? ఎవరికి?"

"నీకే నమ్మా"

"నాకు బాధ అని నేను మీకు చెప్పలేదు. అయినా మీరు పట్టుకుంటే బాధలు తగ్గుతాయేమిటి?"

"ఆ తల్లి దయవల్ల తగ్గుతాయమ్మా."

"మరి మా మామగారికి తగ్గించలేదేమీ?"

"ఆయుర్దాయం లేనివారికి తగ్గవు"

"ఆయుర్దాయం లేని వారు చచ్చిపోతారు. మీరు చేసే మెస్మరిజం బాధా నివారణకు గదా. మరి, బ్రతికి ఉన్నంతవరకయినా బాధలు తగ్గలేదుగా-"

'అమ్మ-బాబోయి.... ఇదేమిటి? అసామాన్యపు పిల్లగా ఉన్నదే' అనుకుంటూ ఉండగా-

"ఏమిటమ్మా? ఏమిటా గొడవ?" అని చిదంబరరావుగారు అడిగారు - లేచి కూర్చుని కలుగజేసుకుని.

"ఆఁఏమున్నది? ఈయన అడక్కుండానే అందరి బాధలూ అర్థం చేసు కుంటారట. ఈ యింటిలో ఎవరెవరు ఏ ఏ బాధలతో ఉన్నారో చెప్పమనండి కనీసం-నివారణ ఎట్లా ఉన్నప్పటికీ..." అన్నది అమ్మ కొంచెం కరుకుగానే.

"ఇంత గొడవ ఎందుకు వచ్చిందీ పెద్దవారితో?" అని అడిగారు చిదంబర రావుగారు నొచ్చుకుంటూ.

"పెద్దవారు పెద్దవారుగా ప్రవర్తించక పోవటంతో వస్తుంది గొడవ. వీరు: ఉపాసకులట!" అని తాతగారితో వ్యంగ్యంగా అని, సత్యనారాయణమూర్తిగారిని ఉద్దేశించి-

"ఉపాసన అంటే యిదేనా మూర్తిగారూ.... మాట్లాడరేమి? బాలోపాసన అంటే చిన్నపిల్లల ఉపాసనా?" అని అడిగింది అమ్మ.

సత్యనారాయణమూర్తిగారు నిర్వణ్ణులై ఉండిపోయారు.

అమ్మ కంఠస్వరం హెచ్చింది-

"ఇదేనా ఉపాసన అంటే? పలకరేమి? అందరికీ మీరు చేసే మెన్నరిజం యిట్లాగే ఉంటుందా? మీరిక యీ ఉపాసన మానుకున్నాసరే, యీ విషయం వివరించి చెప్పినా సరే" అని హెచ్చరించింది.

సత్యనారాయణమూర్తిలో చలనం లేదు.

మళ్లీ అమ్మే మెల్లగా "మర్యాదగా ఉంటే ఉండాలి లేకపోతే నీ దారిన నీవు వెళ్ళాలి-" అన్నది.

అప్పటికీ ఉలుకూ పలుకూ లేకుండా రెండు గజాల దూరంలో చేతులు కట్టుకొని అతివినయంగా నిలుచున్నారు సత్యనారాయణమూర్తిగారు.

"ఏమిటి తాతగారూ- ఇల్లాంటి వారందరినీ పోగుచేశారు?" అంటూ అమ్మ తాతగారి పక్కలోకి వెళ్లి పడుకుని....

"అయ్య ఉపాసన అంతా ఊరేగింది. దివాలా తీసిన వ్యాపారివలె బిక్క ముఖంతో ఎట్లా నిలుచున్నాడో అయ్య - చూడు" అన్నది అమ్మ.

"అంతా మీ తాత వెంకయ్యగారివలె మాట్లాడుతున్నావే- ఆ దర్పమూ, నీవూ. అసలు ఏమిటమ్మా యీ గొడవ? ఏమి చేశాడేమిటి? నీకు కోపం రావటం అంటే సామాన్యం కాదమ్మా. ఏదో విలయం ఉంటుంది" అని అడిగారు చిదంబరరావుగారు.

"ఆఁఏమయినా చేస్తేనా?" అమ్మ మృదుస్వరంలో కోపం స్ఫురించింది.

"అబ్బో - మా అమ్మ విజృంభించిందే!"

"అవసరమయితే ఏదయినా చేస్తాను. నా విషయమే గాదు యిట్లా ఎంత మందిని వేధిస్తున్నారో-"

"ఇదా విషయం? ఇందుకా అంత కోపం వచ్చింది? నీ అగ్ని తత్త్వాన్ని ఎవరేమి చేస్తారమ్మా?"

"అయితే జలతత్త్వాన్ని చేస్తారన్నమాట."

"అది కాదమ్మా నేనన్నది. నిన్ను ఏమి చేస్తారన్నాను. అంటే యితరులను

చెయ్యమని కాదు."

"ఇంతకూ ముందు యీయన సంగతి తేల్చండి- మేడ దించండి" అన్నది అమ్మ నిశ్చయంగా.

"తెల్లవారనివ్వమ్మా-" బతిమాలారు తాతగారు.

"నిలువునా నిలుచున్నారు. పడుకోబెట్టండి. పడతారేమో..." దయతలచింది అమ్మ.

"స్వామీ-పడుకుంటారా?" చిదంబరరావుగారు అడిగారు.

సత్యనారాయణమూర్తిగారు కదలలేదు.

"పడుకోండయ్యా, పడుకోండి-" చిదంబరరావుగారు విసుక్కున్నారు.

"దిగండయ్యా, మేడ దిగండి-" అమ్మ గద్దించింది.

"పోనీ-అంత తొందర ఎందుకమ్మా? తెల్లవారనివ్వరాదూ? ఏదో ఒకటి చేద్దాము."

"తాతగారూ-ఆయనా, నేనూ, మీరూ కూర్చుని అసలు ఉపాసన అంటే ఏమిటో తేల్చుకుందాము. ఆలస్యం చేస్తే ఆయన బాగుపడే అవకాశం ఉండదు."

"అయితే, ఈ పూటనే బాగుపరచదలచావా?"

"బాగుపడే సమయం వస్తేనేగా ఆయనకు అటువంటి దుర్బుద్ధి పుట్టింది.

"అయ్యా - మూర్తిగారూ యిటు కూర్చుందాంరండి-" అని చిదంబరరావు గారు పిలిచారు.

మూర్తిగారు మెల్లగా అడుగులో అడుగు వేసుకుంటూ వచ్చి కూర్చున్నారు.

"ఏమిటమ్మా-యిక మాట్లాడుదామా?" అని చిదంబరరావుగారు అమ్మను అడిగారు.

"మాటలతో ఏమి బాగుపడతారు? మాటలతో బాగుపడే మార్గం ఉంటే శాస్త్రాలతోనే బాగుపడేవారు. ఆయనకు అనుభవం కావాలి కాని మాటలు అక్కరలేదు. మీరు ఉండండి- తాతగారూ, నేను అడుగుతాను. మూర్తి గారూ-

అసలు, ఉపాసన అంటే ఏమిటి?"

అంతే, అమ్మ ప్రశ్న వేసి వదిలింది. మూర్తిగారు ఆలోచనలో పడ్డారు. ఆయన చేసిన దుష్కృత్యాలన్నీ కనులముందున వచ్చి వరుసగా కనుపిస్తున్నాయి. ఒక్కొక్క దృశ్యం కనపడ్డప్పడెల్లా ఉలిక్కిపడుతున్నారు.

అట్లా పదిహేను నిమిషాలు గతించిన పిమ్మట-" అమ్మా, భయం కలుగుతున్నది" అన్నారు. ఆ విధంగా "భయం....భయం" అంటూ పది పదిహేను నిమిషాలు గడిపారు.

తన కనుల ముందుకు వచ్చి నిలిచిన దృశ్య పరంపరలో చివరకు తాను పసివాడై అమ్మ ఒడిలో వాలిపోయినట్లుగా కనుపించింది వెంటనే వెక్కి వెక్కి ఏడుస్తూ అమ్మ రెండు పాదాలు పట్టుకున్నారు. పాదాల స్పర్శ తగలగానే ఉదయాన శవం దగ్గర చూచిన బాలాత్రిపురసుందరి రూపం మళ్ళీ సాక్షాత్కరించింది.

"అమ్మా-జగన్మాతా...నీవేనా? నిన్ను అర్థం చేసుకోలేక పోయానమ్మా. కాని యింత ప్రత్యక్షంగా అనుభవాలు యివ్వటం కోసం యిన్ని లోపాలు చేయించావా నాచేత-" అని మూర్తిగారు కన్నీరు కార్చారు.

"బాలాత్రిపురసుందరి అంటే...... బాల అంటే పుటుక, త్రిపురసుందరి అంటే బాల్య, యౌవన, కౌమారస్థితులు కలిగినటువంటిది. బాలాత్రిపురసుందరి అంటే-సృష్టి స్థితిలయాలు, భూత భవిష్యత్ వర్తమానాలు, సర్వమూ ఆమె రూపమే. ఆమె అంటే చేతులూ, కాళ్ళూ, చీర, రవికా కలిగిన ఆమె కాదు; శక్తి. అంటే ప్రతిదానిలో గర్భితమయిన శక్తి. ఆశక్తియే ఆమె."

"ఇదివరకే అన్నావు గదమ్మా-వస్తురూపం పురుషుడనీ, దానిలో ఉన్న శక్తి స్త్రీ అనీ, రెండింటినీ విడదీయలేని స్థితే శ్రీవిద్య అనీ పుస్తకాలు చెపుతూనే ఉన్నాయి."

"విడదీయలేని స్థితి కాదు. ఆ రెంటి సంయోగంలో ఉండే సంధికాలమే. అదే అవాఙ్మానసగోచరం."

సత్యనారాయణమూర్తిగారు అమ్మ పాదాలపై నుండి లేవకనే వింటూ ఉన్నారు.

"ఏమి స్వామీ-పాదాల మీద నుంచి తలయెత్తుతారా? పాదాలు అమిత మృదులము. బరువు మోయలేవు. కందుతాయో, కనలుతాయో, నాకు మా అమ్మ అడుగడుగునా దైవత్వమే ఋజువు చేస్తున్నా-అమ్మలో వసితనమే గోచరిస్తుంది. ఎప్పుడూ అమె ఏ బాధా లేకుండా హాయిగా ఉండాలని నా కోరిక. నా జీవితంలో నేను అనుకున్నవన్నీ వ్యతిరేకంగానే జరుగుతున్నాయి. కనుక యిదికూడా వ్యతిరేకమే కావచ్చును." అనుకున్నారు. బాధగా చిదంబర రావుగారు.

అప్పటికి తెల్లవారుజామున మూడు ముప్పావయింది. భారతి అత్తయ్య హార్మోనియం మీద మేలుకొలుపులు ప్రారంభించింది.

అయిదు గంటలకు రెండెద్దులబండ్లు కట్టించుకుని బామ్మా, నాన్నగారూ, వారి బంధువులూ రేటూరు బయలుదేరారు.'

అమ్మ చిదంబరరావుగారితో-

"మీరు పదవర్రోజు వస్తారుగా. నేను రేటూరు వెళతాను. లోకనాధం దిగులుపడి ఏడుస్తాడేమో. నాతో ఆడుకుంటూ ఉంటాడుగా-" అన్నది.

"ఎంత దిగుల్లో ఉన్నా-వాడు తిన్నాడా లేదా అని అడిగే వాళ్ళున్నారు. నిన్ను అడిగే వాళ్ళుకూడా లేరు."

"తిండి కోసం కాదుగదా పోతున్నది. వాళ్ళు ఆపదల్లో ఉన్నారు. నరసింహారావు మరీ ఏడుస్తున్నాడు."

"ఇంకా రేపు వెళ్ళే వారుంటారు. వాళ్ళతో వెళ్ళుదువు గాని. ఇవాళ యీ గొడవలలో నీవు వెళ్ళవద్దు-"

సత్యనారాయణమూర్తిగారు అమ్మపాదాల మీద నుండి తలయెత్తి క్రొత్త ప్రపంచాన్ని చూస్తున్నట్లూ, పునర్జన్మ యెత్తినట్లూ భావిస్తూ లేచి-

"నమస్తే మాతా-" అన్నారు.

అమ్మ చిదంబరరావుగారిని ఉద్దేశించి-

"శిక్ష అంటే క్రమశిక్షణలో పెట్టటమేనా?"అని అడిగింది.

"నీకు తోచిన దానికి తిరుగేముంటుందమ్మా? అదే అందరికీ రక్ష అమ్మా మునుపు లేదుగానీ...... జరిగినకాలం కంటె యిప్పుడు దిగులు ఎక్కువ అవుతున్నది. ఎందువలన? నిన్ను చూస్తున్న కొలదీ దిగులు పెరుగుతున్నదమ్మా-"

సత్యనారాయణమూర్తిగారు లేచి ముఖప్రక్షాళన నిమిత్తం వెళ్ళారు. మిగతా అందరూ ఎవరి పనుల మీద వారున్నారు.

అమ్మ మేడపై గదిలో పడుకుని-

'అత్తయ్య ఏడుపు ఎట్లా మానుతుంది?' అని ఆలోచించుకుంటూ-

'ఇంతకంటె ఎక్కువ ఆనందం కలిగినప్పుడుగానీ, రోజులు గడిచిన తరువాతగానీ, చేయగలిగినది ఏమీలేదని నిరాశ కలిగినప్పుడుగానీ-దానంతట అదే క్రమేణా తగ్గిపోతుంది. లేనిది కలిగినప్పుడు ఉన్నది పోతుందిగా. అది సహజం. నవ్వుయొక్క చరమదశ దుఃఖం, దుఃఖంయొక్క చరమదశ నవ్వూ' అని అనుకున్నది.

ఉదయం ఏడున్నర అయింది.

అమ్మ క్రిందికి వెళ్ళి ముఖం కడుక్కొని స్నానంచేసి మళ్ళీ మేడపైకి వచ్చింది.

చిదంబరరావు తాతగారు ఆఫీసులో ఉన్నారు.

సత్యనారాయణమూర్తిగారు కూడా స్నానం చేసి మేడపైకి అమ్మ దగ్గరకు వచ్చి అమ్మకు సాష్టాంగ నమస్కారం చేసి గడగడా వణుకుతూ-

"ఈ అల్పుని త్వరగా నీలో కలుపుకో తల్లీ-జీవితమంతా తప్పులే అని ప్రాధేయపడ్డారు.

"అల్పుడవని కాదు. మీబోటివారే యిట్లా చేస్తే మా బోటి చిన్నవాళ్ళు ఏమవుతారని మీ తప్పును మీకు తెలియపరచాను. మీరు 'శిక్ష' అనుకోవద్దు. శిక్షణ యిచ్చి మీపేరు సార్థకం చేద్దామని యీ రాత్రి బయట పడ్డాను. లోగడ యీ సంగతి నాకు తెలియకపోలేదు. ఏదయినా ఒక ఆధారం లేనిది మాట్లాడను. మీరు బాగుపడటంకూడా నా కోసమనుకునే బాగుచేస్తున్నాను. మానవుల్లో పొరబాట్లు లేని వారుండరు. పొరపాట్లతో కూడిందే మానవత్వం.

దైవం అనే పేరు పెట్టుకుని వాడి పేరుతో అనేకులను యీ విధమయిన మోసం చేస్తే బాధ అనిపించింది కానీ సామాన్యులు చేస్తే బాధలేదు. సామాన్యులు ఎందరు ఎన్ని విధాల మోసం చేయటం లేదూ? వారందరినీ ఏమంటున్నాం? ఆ మోసం దైవం పేరు మీదుగా ఎందుకూ అని ప్రశ్న-"

అమ్మ దీర్ఘోపన్యాసం వింటూ సత్యనారాయణమూర్తిగారు మౌనంగానే నిలుచున్నారు.

"మీరు భయపడకండి. ఈ విషయం నేను ఎవరికి చెప్పనులెండి-"

"నేను యీ పూట బయలుదేరి వెళదామనుకుంటున్నానమ్మా. వచ్చినపని అయిపోయిందిగా."

"భూమి మీదకు వచ్చిన పనా? ఇక్కడకు వచ్చిన పనా?"

"సుబ్బారావుగారికి జబ్బుగా ఉందని తీసుకువచ్చారు. ఆయుర్దాయం లేనివాడిని ఎవరూ బ్రతికించలేరుగదా. వెళ్ళి వస్తానమ్మా. చచ్చేవాడిని ఏమి చంపుతావు?"

"నాకు మిమ్మల్ని చంపాలని లేదు. మీకున్నవి పోవాలని మాత్రమున్నది."

"క్రిందికి వెళ్ళి చిదంబరరావుగారితో చెప్పి వెళతాను."

"సరే మంచిది. పోయిరండి. పోయినచోట సరిగా ఉండండి. మీకు యీ స్వభావంవల్ల ప్రమాదంలేదు గానీ యీ పోలికే మీ అమ్మాయికి వస్తే-"

"నీ నోటి మీదుగా ఆమాట అనకమ్మా-" అని చేతులు ముకుళించి అమ్మకు నమస్కరించి వారి సంతానమయిన శ్రీనివాస్‌నూ, చిట్టినీ పిలుచుకొని క్రిందికి వెళ్ళారు.

'అన్నగారూ! వెళ్ళి వస్తాము. పది గంటలకు భోజనం చేసి బయలుదేరుతాము" అని చిదంబరరావుగారితో అనగానే వెంటనే ఆయన అంగీకరించారు. అది సత్యనారాయణమూర్తిగారికి చాలా బాధ కలిగించింది.

సత్యనారాయణమూర్తిగారు సామానంతా సర్దుకుని అమ్మను-

అమ్మా-బాలత్రిపురసుందరీ. యిటురా" అని పిలిచారు.

"నేను అయినా కాకపోయినా మీకు ఆ పేరు ఉచ్చరించటానికయినా అర్హతలేదు. నా దగ్గరనే కాకుండా యీ మార్పు ప్రతిచోట కలిగిననాడు నన్ను పిలుద్దురుగాని-"

చిదంబరావుగారు స్నానంచేసి కోర్టుకు బయలుదేరారు.

"మేము వెళ్లిందాకా ఉండండి అన్నగారూ" అని మూర్తిగారు అర్థించారు.

"మీరు వెళ్లిందాకా ఉండే అవకాశమే ఉంటే రేటూరే వెళ్లేవాడిని."

"భోజనమయినా అందరం కలిసి చేద్దాం రండి-"

చిదంబరరావు తాతగారూ, సత్యనారాయణమూర్తిగారూ వారి పిల్లలూ, అమ్మా-అందరూ కలిసి భోజనం చేశారు.

భోజనాలు కాగానే తాతగారు కోర్టుకు వెళ్లారు.

సత్యనారాయణమూర్తిగారు ప్రయాణమై రైల్వేస్టేషనుకు వెళ్లారు. అమ్మకూడా వెంటవెళ్లి పంపించింది.

రైలు సాగబోయేముందు మూర్తిగారు వాకిట్లో నిలుచుని గద్గదస్వరంతో సజల నయనాలతో ముకుళిత హస్తాలతో-

"అమ్మా-దయానిధీ-వెళ్లివస్తానమ్మా" అని సెలవు తీసుకున్నారు.

42. నాగేంద్రుడు

తిరిగి యింటికి వెళుతూ అమ్మ స్టేషన్‌లో గేటు దగ్గరకు రాగానే టిక్కెట్టు కలెక్టరు-

"ఏ అమ్మాయ్-టిక్కెట్టు ఏది!" అని అడిగారు,

అంతలో అమ్మ స్థానంలో పొడుగైన మనిషి తన స్నేహితుడు కనిపించాడు. టిక్కెట్టు కలెక్టరు ఆశ్చర్యపడుతూ, నొచ్చుకుంటూ-

"అయ్యో. నీవా?. ఎవరో పిల్ల అనుకున్నానే. అందుకనే టిక్కెట్టు అడిగాను" అన్నాడు.

"నిజమే-ఒకపిల్ల యిక్కడ నిలుచున్న మాట నిజమే. నేనూ చూచాను. ఆ పిల్ల వెనుకనే నేను వచ్చాను." అని ఒకాయన సాక్ష్యం యిచ్చాడు.

అంతలో టిక్కెట్టు కలెక్టరు రోడ్డువైపు చూచాడు. ఆ అమ్మాయి కనపడింది. వెంటనే ఆదిక్కు పరుగెత్తాడు. అమ్మ కూడా కొంచెం దూరం నడిచే అదృశ్య మయింది.

టిక్కెట్టు కలెక్టరుకు ఆశ్చర్యం వేసింది. భయమూ కలిగింది.

తన స్నేహితుని దగ్గరకు వెళ్ళి-

"ఆ అమ్మాయి నడిస్తే నేను పరుగెత్తాను. అయినా ఆ అమ్మాయిని అందుకోలేకపోయాను. టికెట్టు కోసంకాదు, ఏమిటో తెలుసుకుందామని. చూస్తుండగానే అదృశ్యమయింది. ఒళ్ళు ఝల్లుమన్నది."

"నాకూ ఆశ్చర్యంగానే ఉన్నది. నాకు విశ్వాసం ఉన్నా లేకపోయినా దయ్యాలూ, భూతాల విషయం నమ్మటానికి వీలుగా ఉన్నది. యీ సంఘటన" అన్నాడు ఆ స్నేహితుడు.

"నా కలా తోచటం లేదు. మా తల్లిదండ్రులకూ, తాత ముత్తాతలకూ త్రిపుర సుందరీ ఉపాసనా, శ్రీచక్రపూజా ఉంది. ఆ తల్లి నాకీ రూపంగా దర్శనం యిచ్చిందేమో ననుకుంటున్నాను" అన్నాడు టిక్కెట్టు కలెక్టరు.

అమ్మ నేరేడు చెట్లలోగుండా సరాసరి యిల్లు చేరింది.

అన్ని కేసులూ వాయిదాలు వేయించుకుని కోర్టు నుండి చిదంబరరావు గారు యింటికి వచ్చారు.

పదవరోజున చిదంబరావుగారూ అమ్మా కలిసి రేటూరు వెళ్ళారు.

అందరూ తిలోదకాలూ, ధర్మోదకాలూ విడిచారు. అమ్మ కూడా అక్కడకు వెళ్ళింది. బామ్మ అయిదవమాసం గర్భిణీ అవటంవలన కేశఖండన మాత్రం చేయలేదు. మిగతా మాంగల్య చిహ్నాలన్నీ తొలగించారు.

పదమూడవ రోజున వైకుంఠ సమారాధన పూర్తి కాగానే సాయంకాలం నాలుగు గంటలకు అందరూ బయలుదేరగా నాన్నగారి తాతగారు బ్రహ్మాండం శేషయ్యగారు అందరినీ కొంచెం సేపు ఆగమని సమావేశం ఏర్పాటు చేశారు.

"మూడవనెల రాగానే కనకమ్మను తీసుకువెళతాను" అన్నారు. సీతాపతి గారు - ఆ ప్రస్తావన ఏమీ లేకుండానే.

అందుకని శేషయ్యగారు వెంటనే అన్నాడు-

"ఇప్పుడు ఆ సంగతి ఏం వచ్చింది? నేను చెప్పినా చెప్పకపోయినా మీ బాగుకోసం ఎట్లాగయినా తీసుకువెళతారు..." అంటూ ఆస్తీ అప్పుల విషయం వివరించి పరిష్కారం చేయమని చిదంబరరావుగారిని కోరుతూ-

"తల్లిలేని పిల్లను ఎటూ పెంచుతున్నారుగా, ఆ పిల్లను నాగులుకు యిచ్చి పెళ్ళి చెయ్యండి" అని సలహాయిచ్చారు.

"ఒకళ్ళు చేసేదీ చేయగలిగిందీ ఏముంది?- విధిలో ఎట్లా ఉంటే అట్లా అవుతుంది" అని చిదంబరరావుగారు సమాధానం యిచ్చారు. అది శేషయ్య గారికి తృప్తిని యివ్వలేదు.

మరిడమ్మతాతమ్మా సీతాపతి తాతగారూ, అమ్మా రాఘవరావుమామయ్యా మన్నవకు ప్రయాణమయినారు. కనకమ్మ బామ్మ లోకనాథం బాబాయిని కూడా వారి వెంట పంపింది. అందరూ కలిసి రేటూరు మీదుగా పడవలో మన్నవ వెళ్ళారు.

సాయంకాలం 6 గంటలకు మన్నవ చేరారు.

గ్రామం ముందర సత్రం దగ్గర పెద్ద త్రాచుపాము పడగ విప్పి ఆడుతూ

ఎదురుగా నిలుచున్నది. అమ్మ తలవంచుకుని దాని మీదగానే నడిచింది.

ప్రక్కన ఉన్న రాఘవరావుమామయ్య..........

"ఓ మొద్దూ-పామును చూడకుండా నడుస్తావేం?" అని అరిచారు.

అంతలో పదిమందీ పోగయినారు కర్రలు తీసుకుని. ఆపాము కూడా ఉత్తరం వైపునుండి దక్షిణం వైపు ముఖం తిప్పి అమ్మ వంక చూస్తూ అమ్మ నడచిన వైపే నడుస్తూ ఉన్నది.

"ఈ మొద్దుకు చెబుతూనే ఉన్నాను-తొక్కవద్దని. వట్టి అయోమయం...... పగపట్టినట్లున్నది" అని విసుక్కున్నాడు మామయ్య.

జనం కఱ్ఱలు తెచ్చారుగానీ ఎవరూ పామును కొట్టటానికి సాహసించలేదు. అసలు మాధవాచార్యులు గారి సంఘటన జరిగినప్పటినుండీ ఎవరికీ పామును కొట్టే ధైర్యం లేదు.

మాధవాచార్యులుగారి చరిత్ర చాలా విచిత్రమయినది.

మన్నవ శివాలయంలో ధ్వజస్తంభానికి ఉత్తరంగా ఒక పెద్ద పుట్ట ఉన్నది. అందులో ఒక నాగుబాము ఉన్నది. అక్కడ నిత్యమూ సంతానంకోసమో, ఆరోగ్యంకోసమో అనేకులు ప్రదక్షిణాలు చేసేవారు. ప్రతి నాగులచవితికీ అందరూ పాలు పోసేవారు. చెన్నకేశవ స్వామివారి ఆలయంలో ఒక అర్చకుడు ఉన్నాడు. అతడు ఆయుర్వేద వైద్యుడు, సర్పమంత్రవేత్త. ఎటువంటి సర్పాన్నయినా చేత్తో పట్టుకుని ఆడించగల శక్తిగలవాడు. ఆయనకు యీ ప్రదక్షిణాలను చేసేవాళ్లనూ, యీ సర్పాన్ని అర్చించే వాళ్లనూ చూస్తే హాస్యాస్పదంగా ఉండేది.

మన్నవ గోపాలకృష్ణయ్యగారి కూతురు ఒక ఆమె చాలా కాలం నుండి కడుపు నొప్పితో బాధపడుతూ, అపుట్టకు ప్రదక్షిణాలు చేసింది. ఆమె కడుపునొప్పి నివారణమయింది.

ఆ గ్రామంలో ఎందరకో ఆ పుట్ట అన్నా, అపుట్టలోని నాగేంద్రుడన్నా ఎంతో విశ్వాసం.

ఒక రోజున ఆ పుట్టలో రెండు సర్పాలు కనుపించాయి.

గర్వించిన మాధవాచార్యులుగారు ఒక రోజున ఆ పుట్టను పగలగొట్టారు.

అందులోని రెండు పాములను రెండు చేతులతోనూ పట్టుకుని వీథిలోకి వచ్చి చుట్టూ చేరిన జనాన్ని ఉద్దేశించి-

"మీరు దేవుడని పూజిస్తున్నది యీ పాములనే. నేను మెడ(ప)ట్టుకుని బయటకు లాక్కువచ్చాను. నన్నేమీ చేయలేదేమి? ఇప్పుడు మీ అందరి యెదుట వీటిని చంపుతాను. వాటికి ఏమయినా శక్తి ఉంటే నన్నేమయిన(ా) చేయ మనండి, చూద్దాము. మనుషుల్లో సాధుత్వం ఉన్నవాళ్ళు ఉన్నట్లే పశువుల్లో పాముల్లో కూడా ఉంటాయి. అంతమాత్రం చేత అవి దేవుళ్ళు అవుతాయా?" అని హేళనగా అరిచాడు.

అంతలో మన్నవ నరసింహంగారు అందుకుని-

"నీవు గుడిలో అర్చకుడివిగదా, అక్కడ దేవుడంటే రాయిగదా, మరి నీవు ఆ రాతినేగదా నిత్యమూ పూజిస్తున్నది. ఏమీ చైతన్యం కనుపించని రాయే దేవుడుగా అర్చింపబడుతున్నప్పుడు-సాధుత్వం కల పామునయితే మాత్రం అర్చిస్తే తప్పేమున్నది?" అని ప్రశ్నించారు.

ఆ ప్రశ్న వినిపించుకోకుండా, ప్రజల హృదయ గతభావాన్నీ విశ్వాసాన్నీ అర్థం చేసుకోకుండా పరిహాస పూర్వకంగా దంభాలు పలుకుతూ ఒక దాని కోరలు పెరికాడు. పెరుకుతూండగానే ఒక కోర చేతికి గుచ్చుకున్నట్లయింది. క్షణాల్లోనే పడిపోయాడు. అరగంటలో ప్రాణం పోయింది.

అందరూ పాముకాటువల్ల ప్రాణం పోయిందని అనుకోలేదు. నాగేంద్రుని హత్యాదోష ఫలితమేనని భావించారు.

నిత్యమూ అక్కడ ప్రదక్షిణాలు చేసే ఆవిడ మామూలుగా అక్కడ ప్రదక్షిణాలు చేయటానికి వెళుతూ మార్గంలో ఆ హత్యాసంఘటన విని నివ్వెరపోయి నిశ్చేష్ట అయి తెప్పరిల్లి యింటికి వెళ్ళి పడుకున్నది. కానీ వారం రోజులవరకూ ఆమెకు వళ్ళు తెలియలేదు, నిద్రలేదు. ఆహారం లేదు. తరువాత ఒకనాడు స్వప్నంలో సర్పం కనుపించి-

"ఎందుకు అట్లా ఏడుస్తావు? నన్నెవరూ చంపలేదు. నేను నీ పొట్టలోనే ఉన్నాను."

అని అంటూ ఉండగా ఆ పాము ప్రక్కనే ఒక చిన్న అమ్మాయి కనపడి, ఆ పాము ఆ అమ్మాయి పొట్టలోనికి దూరినట్లు దృశ్యమానమయింది.

వెంటనే ఆమెకు వినిపించింది-

"ఈ రోజునుండీ పాము కనుపించకపోయినా నీవు పుట్టలో పాలుపోసిపో. చాలా జంతువులు త్రాగుతాయి. నాగేంద్రుడు అంటే పాము అనే కాదు. నాగేంద్రుడంటే మన వెన్నంటి కాపాడేదే..."

అంతలో ఆ అమ్మాయి కూడా అదృశ్యమయింది.

అది ఆమెకు స్వప్నంగా తోచలేదు. కాని మెలుకువా అంటే అవునని చెప్పటానికి అవకాశం కనిపించలేదు. అదియొక విచిత్రమైన అవస్థ.

ఆశ్చర్యపడుతూ ఆ దృశ్యాన్ని తలుచుకుని తలుచుకుని ఆనందపడుతూ గ్లాసు నిండా పాలు తీసుకుని లేని ఓపికను పుంజుకుంటూ తూలుతూ తూలుతూ దేవాలయానికి వెళ్లింది.

ఆ పుట్ట ఉండే ప్రదేశానికి వెళ్లింది. అక్కడ పుట్ట కనిపించలేదు. హతాశురాలయింది. గుండె వ్రయ్యలయినట్లయింది. కాళ్ళు విరిగినట్లు కూలబడిపోయింది. కొన్ని క్షణాలకు తన్ను తానే సముదాయించుకుంటూ లేచి ఆ ప్రదేశంలో కనిపిస్తున్న కలుగుల్లోనే పాలు పోసింది. ఆ పాలు పోసేటప్పుడు తాను 'స్వప్నం'లో కన్న పాపనోటిలో పోస్తున్నట్లు అనుభూత మయింది. ఆమెకు అచ్చెరువయింది. 'ఈ పిల్ల ఎవరూ? అన్న విచికిత్స కలిగింది. అయినా ఏమీ నిర్ణయం చేసుకోలేకపోయింది.

ఆనాడెల్లా ఆలోచిస్తూనే గడిపింది. రోజూ పాలు పోసి వస్తూనే ఉన్నది.

నెల రోజుల తరువాత ఒకనాడు అమ్మను చూచింది. ఆమెకు విస్మయం కలిగింది. డోలాయమాన మానసఅయింది.

ఒకనాడు ఆమె పాలు పోయటానికి దేవాలయానికి వెళ్ళటానికి సన్నద్ధ అయింది. వాకిట్లోకి వచ్చేసరికి అమ్మ ఎదురు పడ్డది.

క్షణంలో ఆమె సంశయాలన్నీ విచ్ఛేదం అయినాయి. తాను నిత్యమూ ఆరాదించే నాగేంద్రుడే యీమె అన్న విషయం ధ్రువపడింది. ఇక ఆమె ఆనందానికి అవధుల్లేవు.

"నాగేంద్రా! యిక్కడకే వచ్చావా? నాయందు నీ కెంతదయ? ఈ అనాధను కాపాడేందుకు అరుదెంచావా?" అని పెద్దపెద్దగా అరుస్తూ అమ్మను అమాంతంగా ఎత్తుకుని భుజాన వేసుకున్నది.

ఆ క్షణంలో ఆమెకు అమ్మ అమ్మాయిగా కనుపించక సాక్షాత్తూ నాగేంద్రుని వలెనే సాక్షాత్కరించింది. నాగేంద్రుడు పడగ విప్పి తనకు గొడుగు పట్టినట్లూ తాను తలపైకి యెత్తగా నాగేంద్రుని నోటినుండి అమృతం జారి తన నోటిలో పడ్డట్లూ అనుభూతమై గుటకలు వేస్తూ చప్పరిస్తూ తన్మయమవుతూ,

"నాగేంద్రా-నా కోసం వచ్చావా? నన్ను నీలో కలుపుకోవూ? కలుపు కుంటున్నావా?.......... నీవెంత దయామయుడివి?........" అని పారవశ్యంతో కేకలు వేస్తూ నిలుచునే ప్రాణం వదిలింది.

అమ్మ మెల్లగా ఆమె భుజంనుండి జారి ఒక ప్రక్కగా నిలుచున్నది.

ఆమె కేకలు విని యిరుగుపొరుగువారు పరుగెత్తుకు వచ్చారు. ఆమెనల చూచారు. ఆమెకు శిరోభేదనం అయిప్రాణం పోయి ఉన్నది.

అందరికీ ఆశ్చర్యంతోపాటు ఆనందమూ కలిగింది- ఆమెకు అటువంటి ఉత్తమ మరణం లభ్యమయినందుకు. ప్రాణం ఎన్ని విధాలుగానయినా పోవచ్చునుగానీ; సామాన్యంగా బ్రహ్మ కపాలంగుండా నిర్గమించదు- ఎంతో యోగసాధనలో పరాకాష్ఠ స్థితిని పొందితేనే తప్ప. మరి ఆమెకు అది సునాయాసంగా ప్రాప్తించింది.

మరిడమ్మ తాతమ్మ వగైరాలు అది చూచి విస్మితులయినారు.

తీరా విచారిస్తే ఆ సమయానికి ఆమె భర్త యింటిపట్టునలేడు. ఆయన గ్రామాంతరం వెళ్ళి వారం రోజులయింది.

అమ్మ మెల్లగా వచ్చి మరిడమ్మగారి భుజాలమీద చేతులువేసి వీపు నానుకుని వెనకగా కూర్చున్నది.

"నీవు ఎందుకు వచ్చావమ్మా-పెద్ద నాపసానిలాగా? నీవు లేకపోతే యిదంతా జరుగదని వచ్చావా?" అని మరిడమ్మగారు విసుక్కున్నది.

"నేను లేకపోతే ఎట్లా జరుగుతుంది? మరి యిదంతా జరిపింది ఎవరూ?

-నేనే-" అని అమ్మ నోరారా చెప్పినా అందరూ అమ్మ హాస్యంగా అంటుందను కున్నారు కానీ అందులోని సత్యాన్ని అర్థం చేసుకోలేకపోయారు.

ప్రక్కనున్నవాళ్ళు "యీ అమ్మాయి మరిడమ్మగారి కంఠమాల అయింది" అంటూ-

"చెపుతుంటే వినవేమి? నీ కెందుకూ? చిన్న పిల్లవు. పో-బయటకు-" అని చెయ్యి పట్టుకుని అమ్మను బయటకు పంపించారు.

అమ్మ చిరునవ్వు నవ్వుతూ బయటకు వెళ్ళింది.

"శవాన్ని ఎక్కువ సేపు ఉంచటం మంచిది కాదు. ఎక్కడ ఉన్నాడో కూడా తెలియనివాడి కోసం ఎన్నాళ్ళు ఆపేటట్లు?" అనుకుంటూ అంత్యక్రియలకు ఏర్పాట్లు చేయసాగారు. యిరుగుపొరుగు వారు.

అంతలోనే ఆమె తల్లిదండ్రులూ, భర్తా వచ్చారు. పసుపు కుంకుమలతో ఊరేగింపుతో ఆమె మహాప్రస్థానం సాగింది.

43. ప్రియబాంధవి

ప్రతి జీవితంలోనూ కష్టసుఖాలు రెండూ ఉంటాయన్నా... కొందరి జీవిత సముద్రంలో వరుసగా దుఃఖతరంగాలే ఉత్పన్నమవుతాయి; కొందరి జీవితవనంలో నిరంతరం మలయసమీరాలే ప్రసృతమవుతాయి. కొందరికి దారి పొడుగునా కష్టపరంపరే ఎదురవుతుంది. కొందరి జీవితపథం వారి యిష్టం వచ్చినట్లు మలుపులు తిరుగుతుంది. కొందరు కష్టాల బరువు మోయలేక నడుం విరిగి కూలబడుతారు. కొందరు కష్టమయినా సుఖమయినా నిర్లిప్తంగా అనుభవిస్తారు. కొందరు నేర్పుతో కష్టాలనే సుఖాలుగా మార్చుకుంటారు. కొందరు ఓర్పుతో కష్టాలను కష్టాలుగానే కష్టంగానే అనుభవిస్తారు.

మరిడమ్మగారు చివరి కోవకు చెందుతుంది. ఆమెకు బ్రతుకు బాటలో అడుగడుగునా ఎదురుదెబ్బలే. ఆమె బ్రతుకుకడలిలో నిత్యమూ తుఫానులే. అయినా ఆమె ఓర్పుతో పడవ నడిపిందే కానీ ఏనాడూ అధైర్యపడలేదు.

సీతాపతి తాతగారికి కలిగిన కష్టం పెండ్లితో ఒక విధంగా గట్టు ఎక్కిందను కున్నా... అంతలోనే బ్రహ్మాండం సుబ్బారావుగారి మరణంతో కనకమ్మ బామ్మ సుడిగుండంలో పడ్డది.

ఆ కుటుంబంలో ఎవరికి ఏ కష్టం కలిగినా అది మరిడమ్మగారికి తగిలే దెబ్బే.

ఇక కనకమ్మ బామ్మగారి సంసారం కూడా తానే మోయవలసి వస్తుందనీ, వడ్లధర తగ్గిపోయినందున అది దుర్భరమే అవుతుందనీ సీతాపతి తాతగారు విచారించారు.

చెట్లక్రిందా, పుట్టలపైనా, చెరువుల్లో, కాలవల్లో...... ఎక్కడ బడితే అక్కడ అమ్మ హాయిగా నిశ్చింతగా ఆడుకుంటూ ఉండేది.

బ్రహ్మాండం సుబ్బారావు తాతగారు చనిపోయిన మూడవ మాసంలో మరిడమ్మగారు రేటూరు వెళ్ళి కనకమ్మ బామ్మను మన్నవ తీసుకువచ్చింది. చిన్నవాడు అయినందున లోకనాథం బాబాయి వెంటనే ఉన్నాడు. సెలవు లయినందున నాన్నగారు కూడా వచ్చారు.

బామ్మ మన్నవ వచ్చిన రెండు మాసాలకు ప్రసవించింది... చైత్ర బహుళ ఏకాదశినాడు సాయంకాలం నాలుగు గంటలకు, ఆడపిల్ల పుట్టింది.

తాతగారింటిలో అమ్మకంటే చిన్నపిల్లలు లేనందున పురిటిలోనే బామ్మను తాకి పసిపిల్లను ఎత్తుకుండేది అమ్మ.

ఇరుగు పొరుగు వారందరూ బ్రహ్మాండం సుబ్బారావుగారిని స్మరించి సానుభూతి ప్రకటించారు. ఆయనకు ఆడపిల్లలంటే ఎంతో ప్రేమ అనీ, తీరా ఆడపిల్ల పుట్టేసరికి ఆ ముద్దూ ముచ్చటా చూచుకునేందుకు లేకుండా తానే పోయాడనీ.

ఆ పిల్లకు పేరు పెట్టనందున అందరూ పాప అని మాత్రమే అనేవారు.

పాపకు ఆరు నెలలు వచ్చేదాకా పాపపెంపకం బాధ్యత అమ్మయే వహించింది. అమ్మయే ఉగ్గు పెట్టేది. అమ్మయే పాలు పట్టేది. రోజూ రెండు మూడు యిళ్ళు తిరిగి ఆవుపాలు తెచ్చేది.

అప్పటికి అమ్మ వయస్సు తొమ్మిది సంవత్సరాలు మాత్రమే.

పాపఅత్తయ్యకు స్నానం మాత్రం చేయిస్తూ వికలాంగుడయిన నరసింహా రావుతో కాలక్షేపం చేసేది బామ్మ.

లోకనాధం బాబాయిని మన్నవ పాఠశాలలో చేర్చారు.

సెలవులు పూర్తికాగానే నాన్నగారు పాఠశాలలో చేరేందుకు బాపట్ల వెళ్ళగానే ఒక రోజున సీతాపతి తాతగారు మన్నవగ్రామ కాపురస్తురాలే అయిన పులిపాక చల్లమ్మ గారితో-కనకమ్మ బామ్మగారి సంసార భారాన్ని వహించడం యిక తన వల్ల కాదని వ్యక్తం చేశారు. ఆమె మరిడమ్మ తాతమ్మతో అన్నది ఆ విషయం.

"పూర్తిగా తానే భరించనక్కరలేదు, నా బండి వడ్లూవున్నాయి" అని మరిడమ్మగారు అంటూ వుండగా ఆ విషయం కనకమ్మ బామ్మ చెవుల సోకింది.

కనకమ్మ బామ్మ పరిస్థితులనూ, తన స్థితినీ తీవ్రంగా ఆలోచించుకుని ఒక నిర్ణయానికి వచ్చి మరిడమ్మగారిని సమీపించి-

"నేను ఎక్కడనో అక్కడ పని చేసుకుని బ్రతుకుతాను. అన్నయ్యకు కష్టం కలిగించడం ఎందుకూ?" అని చెప్పి సమాధానం కూడా వినకుండా చిన్న పిల్లలిద్దరినీ తీసుకుని-

"బాపట్ల వెళుతున్నా"నని చెప్పి విజయవాడ వెళ్ళింది. మరునాడు-

నాన్నగారు బాపట్లనుండి మన్నవ వచ్చి సీతాపతి తాతగారితో-

"నిజామాబాద్ నుండి సామాను తీసుకువెళ్ళమని కబురు వచ్చింది. అమ్మ యేమంటుందో....... నేను వెళ్ళుదామంటే రైలు ఛార్జీకి డబ్బులేదు. ఏమి చెయ్యాలో తోచటం లేదు మామయ్యా-" అన్నారు.

"నేను మాత్రం ఏమి చేసేది? వడ్లకు ధర తగ్గిపోయింది. పుట్టి రూ.28లు కూడా కొనేవాడు లేడు. వడ్లధర తగ్గి ఆదాయం తగ్గినా ఖర్చుమాత్రం తగ్గించుకోలేకుండా ఉన్నాము" అన్నారు సీతాపతిగారు.

అంతలో మరిడమ్మగారు వచ్చి-నాన్నగారిని అపతలకు తీసుకువెళ్ళి జరిగిన విషయం అంతా వివరించి-

"మీ అమ్మకు కష్టం తోచి బాపట్ల వెళతానని వెళ్ళింది. బాపట్లకు రాలేదా?" అని అడిగింది.

"రాలేదే."

అంతలో అమ్మ అందుకుని అన్నది-

"ఒక వేళ బెజవాడ వెళ్ళిందేమో, నిన్న నరసింహారావుతో చెప్తుంటే విన్నాను."

"నరసింహారావుకు కూడా మీ నాన్న జబ్బే ప్రారంభించినట్టుంది నాన్నా" అన్నది మరిడమ్మగారు.

నాన్నగారి కన్నులు సజలమయినాయి. ఆలోచనల భారంతో బరువెక్కాయి చివరకు గద్గదస్వరంతో-

"అడుక్కువచ్చి అయినా ఆమెకు పెట్టి నేను తింటాను" అని వాకిట్లోకి వెళ్ళారు.

అక్కడ అరుగుమీద కూర్చుని అమ్మా, లోకనాధం బాబాయీ కబురులూ కథలూ చెప్పకుంటూ ఉన్నారు.

అప్పడు రాత్రి ఏడున్నర అయింది.

నాన్నగారు లోకనాధం బాబాయి చేతిలో ఒక అర్ధరూపాయిపెట్టి-- "ఏమయినా కొనుక్కో" --అని చెప్పి, అమ్మ నీతో ఏమీ చెప్పిపోలేదా?" అని అడిగారు.

"చెప్పకేం, చెప్పే వెళ్లింది. చదువుకుంటూ అనసూయతో ఆడుకుంటూ ఉండు. మళ్ళీవచ్చి తీసుకువెళతాను. నరసిమ్మాయికి మందు ఇప్పించి తీసుకువస్తాను-- అని చెప్పి వెళ్లింది." అన్నారు లోకనాధంబాబాయి.

లోకనాధం బాబాయిని దగ్గరకు తీసుకుని-

"నీవు దిగులుపడకు నాన్నా - నాన్నగారు ఎక్కడకూ పోలేదు. నిజామాబాద్‌లో ఉద్యోగం చేస్తున్నారు. మనమూ అక్కడకు వెళదాం" అన్నారు నాన్నగారు.

మరిడమ్మ, తాతమ్మ వారిని లోపలకు తీసుకువెళ్లి అన్నం పెట్టింది.

నిత్యమూ రాత్రిళ్ళు ప్రొద్దుపోయిన తరువాత పున్నయ్యగారి తోటలోకి వెళ్లటం అమ్మ అలవాటు. కాని ఆనాడు ఆ కార్యక్రమం విరమించుకుని నాన్నగారు పడుకున్న మంచం దగ్గరకు వచ్చి చేతిగాజు ఒకటి తీసి నాన్నగారి చేతిలో పెట్టి-

"ఇదిగో -బావా......... ఒకటి అత్తయ్య తీసుకువెళ్లింది. ఒకటి నీ కివ్వమన్నది. నిజామాబాద్ నుంచి ఉత్తరం వస్తే వెళ్లి సామాను తీసుకురమ్మన్నది. ఎవరికీ చెప్పవద్దన్నది. దిగులు పడవద్దూ, ఏ దిక్కూ లేనివారికి దేవుడే దిక్కూ- అని ఆమె వెళ్లింది" అని చెప్పింది అమ్మ.

"ఇవి మా నరసింహారావు మురుగులవలే ఉన్నాయి. మా లోకనాధానికి ఉండేవి. చిన్నప్పుడు నాకూ ఉండేవి. వీటిని యిట్లా ఖర్చు పెట్టుకొనవలసి వచ్చింది." అని నాన్నగారు బాధపడ్డారు.

కాని అవి అమ్మ మురుగులే. ఒకటి బామ్మకు యిచ్చింది. మరొకటి నాన్నగారికి యిచ్చింది. కాని ఆ విషయం అమ్మ చెప్పలేదూ, నాన్నగారు తెలుసుకొననూలేదు.

మరునాడు ఉదయం నాన్నగారు విజయవాడ వెళ్లి రైల్వే స్టేషనంతా వెతికారు. బామ్మ కనుపించలేదు.

క్రితం రోజుననే బామ్మను ఎరిగినవాళ్ళు చూచి బామ్మకు నచ్చజెప్పి బాపట్ల తీసుకువెళ్ళారు.

నాన్నగారు విజయవాడ నుండి నిజామాబాద్ వెళ్లి బాపట్లకు సామాను తీసుకువచ్చార్లు. కాని వాటిని దాచుకునే స్థలం లేక అడిగిన వారందరికీ తలా ఒక వస్తువూ పంచారు.

కనకమ్మ బామ్మ బాపట్ల చేరిన వారం రోజులకే భారతి అత్తయ్యకు ఏదో గాలి పట్టిందనీ పడిపోయిందనీ కబురు వచ్చింది- అత్తవారింటి నుంచి, ఆమె అత్తవారిల్లూ బాపట్లలోనే. చిదంబరరావుగారికి ఒక్కతే కూతురు అయినందున చాలా గారాబంగా చూచేవారు. తాను వచ్చినందునవలన అట్లా అయిందనీ అంటారేమోనని కనకమ్మ బామ్మ బాధపడ్డది.

భారతి అత్తయ్యగారి అత్తగారింటిలో "మీ నాన్న ఏదో హత్యచేశాడు. అదే యిట్లా చుట్టుకున్నది" అన్నారు.

"రంగమ్మతల్లి పట్టి పీడిస్తున్నది" అన్నది అన్నపూర్ణమ్మగారు.

"అత్తగారింటిలోని ఒరిపిడివల్ల మనస్సు చెదిరియిట్లా అయింది" అని చిదంబరరావుగారు ఉద్దేశపడ్డారు.

వెంటనే భారతి అత్తయ్య జబ్బు విషయం మన్నవకు తెలియజేశారు. మన్నవకు తెలియగానే మన్నవ నుండి అందరూ బయలుదేరి బాపట్ల వచ్చారు.

మన్నవ నుంచి బంధువులు వచ్చేసరికి భారతి అత్తయ్యను కూడా అత్తగారింటి నుంచి పుట్టింటికి తీసుకువచ్చారు.

భూత వైద్యులను పిలిపించారు. చికిత్స ప్రారంభమయింది.

అన్నపూర్ణమ్మగారికి రంగమ్మగారే అట్లా పట్టిందని అనుమానమయి నందువలన అమ్మ మీద కూడా ప్రేమ తగ్గి కోపం ఏర్పడ్డది.

క్రమంగా గుంటూరుజిల్లాలోని భూతవైద్యులందరూ వచ్చి ప్రయత్నించారు. కానీ ఫలితం ఏమీ లేకపోయింది.

ఒక రోజున భారతి అత్మయ్యగారి మామగారు దేశిరాజు రంగారావుగారు వచ్చి-

"ఇది ఏదో వంశంలోనివారు ఘోర హత్య చేసిన మహాపాప ఫలితం. ఒక చోట ప్రశ్నకు వెళితే- యిది తండ్రి చేసిన నేరానికి శిక్ష అని చెప్పారు" అన్నారు.

అందాకా తాతగారి కుర్చీ ప్రక్కనే నిలుచుని చెప్పేదంతా వింటున్న అమ్మ తాను కలుగజేసుకుని-

"మొన్న నేను అణాపెట్టి ప్రశ్నకు వెళితే........ దేశిరాజు రంగారావుగారి రెండవ

కుమారుడూ, మశూచి వలన చనిపోయిన పిల్లా యిద్దరూ కలిసి పట్టి పీక్కు తింటున్నారు- అని చెప్పారు. కావలిస్తే, మనం పోదాం రండి- చెప్పిన వారిని చూపిస్తాను" అన్నది.

చిదంబరరావు తాతగారు బల్లపై చేతితోనే దబదబా బాది పకపకా నవ్వి-

"బావగారు... బావగారూ..." అని అరిచారు.

అమ్మ మాటలకూ చిదంబరరావుగారి అట్టహాసానికి రంగారావుగారు చిన్నబుచ్చుకుని.

"ఎవరీ అమ్మాయి?" అని అడిగారు.

"మా అన్నయ్య మనుమరాలు, బావమరిది కూతురు. లోగడ రోజూ మీ యింటికి వచ్చేదే" అన్నారు చిదంబరరావుగారు.

ఆ చప్పడు విని - ఏమిటా - అని యింట్లో నుంచి అన్నపూర్ణమ్మగారూ, సీతాపతి తాతగారూ, మరిడమ్మ తాతమ్మా, వెంకటసుబ్బయ్యతాతగారూ అందరూ బయటకు వచ్చారు.

అన్నపూర్ణమ్మగారు వస్తూనే - " ఏమిటీ చప్పడూ?" అని అడిగింది.

"ఆc... ఏమీ లేదు. చిన్నపిల్లకదూ, అనసూరి తెలిసీతెలియని మాటేదో అన్నది" అన్నారు చిదంబరరావుగారు

"ఏమిటీ ఆ మాట? దాని సంగతి నేను కనుక్కుంటాను పెద్దవారిని ఏమన్నదేమిటీ?" అని అడిగింది అన్నపూర్ణమ్మగారు.

జరిగిన విషయం వివరించి " మరి అమ్మాయి ఎక్కడ విన్నదో ఆ యిద్దరి పిల్లల సంగతీ. నాకే యింతవరకూ తెలీదు. వారిద్దరూ భారతికి పట్టారని అనసూరి అంటున్నది" అన్నారు చిదంబరరావుగారు.

"అందులో అబద్ధ మేమున్నదీ? లక్ష్మణాచార్యులుగారు అన్నారు" అన్నది అన్నపూర్ణమ్మగారు.

"అలాగా! నాకు తెలియదే. అయినా యివన్నీ అనవసరం. దాని విధి ఎట్లా ఉన్నదో అట్లా జరుగుతుంది" అని సర్దివేయటానికి చిదంబరరావుగారు ప్రయత్నించారు.

"ఏది ఎట్లా జరిగినా- మా యింట్లోనూ వద్దు. మీ యింట్లోనూ వద్దు, ఎక్కడయినా యిల్లు అద్దెకు తీసుకుని ఉండండి- అమ్మాయికి తగ్గిందాక" అని రంగారావుగారు సలహా యిచ్చారు.

"సరే-- ఆలోచిద్దాం. భోజనానికి లేవండి. వేళ అయింది" అన్నారు చిదంబరరావుగారు రాజీ ధోరణిలో.

"ఇప్పుడు భోజనం చేయనండి. త్వరగా వెళ్ళాలి. స్కూలు వేళ అయింది" అన్నారు రంగారావుగారు.

"అన్నం తినేపని ఎక్కడయినా తప్పదుగా"? అన్నది అమ్మ.

"ఈ పిల్ల చాలా అసాధ్యంగా ఉన్నదే?"

"ఔను. కొందరు అసాధ్యం అనుకుంటారు. కొందరు అమాయకం అనుకుంటారు. ఎవరు ఎట్లా అనుకుంటే అట్లా........" అన్నారు చిదంబరరావుగారు.

"వెళ్ళి వస్తాను బావగారూ-- రెండు మూడు నెలలు చూచి వాడికి పెళ్ళి చేస్తాను. చిన్నవాడు" అని రంగారావుగారు వెళ్ళారు.

ఆయన వెళ్ళగానే అన్నపూర్ణమ్మగారు "ఏమి సంబంధం? ఇది వద్దూ-- అని మొదట్లోనే చెప్పాను. దేశరాజు వారు భాగ్యవంతులని భ్రమపడి పిల్లనోట మట్టికొట్టాము" అన్నది.

"అబ్బబ్బా... అనవసరంగా మాట్లాడక లోపలకుపో........" అని చిదంబరరావుగారు కసిరారు.

"అయితే -తాతయ్యా- మన్నవ వెంకయ్యగారు మీకిచ్చి చేసి అత్తయ్య నోట్లో మన్ను కొట్టినట్టేగా?" అని అడిగింది అమ్మ.

"అరవకమ్మా - అందరూ నిన్ను కోప్పడుతారు. ఆయనకు చూడు - ఇందాక నీ మీద ఎంతకోపం వచ్చిందో........"

"కోపం వచ్చేదేముంది తాతాగారూ? అది వాళ్ళకు ఉన్నదేగా?" అన్నది అమ్మ నవ్వుతూ.

ఆ సాయంకాలమే చిదంబరరావుగారు యిల్లు ఖాళీ చేసి రైలుపేటలోని ఒక యింట్లో చేరారు.

రైలుపేటలోనే మరొక యింట్లో కనకమ్మ బామ్మగారు చేరింది.

అమ్మ అక్కడా యిక్కడా ఉండేది.

నరసింహారావుకు జబ్బు ఎక్కువయింది. అది క్షయే అని నిర్ణయింపబడి చికిత్స ప్రారంభింపబడింది. వ్యాధి క్రమంగా ప్రబలిపోయింది.

పాపత్తయ్యకు తలనిండా పుళ్ళు లేచినయ్. అయినా అమ్మ నడుం పుండు పడేటట్లు ఎల్లప్పుడూ అత్తయ్యను ఎత్తుకుండేది.

లోకనాథం బాబాయితో కథలూ కబురులూ చెబుతూ దిగులు పడకుండా చూచేది.

నరసింహారావుకు మందులూ మాకులూ కనుక్కుంటూ ఉండేది.

నాన్నగారికి ఎప్పుడు ఏం అవసరమవుతుందో అనుక్షణం విచారిస్తూ ఉండేది.

బామ్మకు యింటి పనుల్లో సహకారం అందిస్తూ ఉండేది.

సీతాపతి తాతగారింటిలో పారిజాతమై దివ్యసౌరభాలు విరజిమ్మిన అమ్మ, చిదంబరరావు తాతగారింటిలో రత్నదీపమై భవ్యకాంతులు వెదజల్లిన అమ్మ, కనకమ్మబామ్మ గారింటికి ప్రియబాంధవి అయింది.

44. అపాత్రదానం

రెండు నెలలు చికిత్స జరిగినా ఫలితం ఏమీ లేకుండా నరసింహారావు మరణించాడు.

భారతి అత్తయ్యకు ఎన్ని భూతవైద్యాలు చేయించినా వ్యాధినయం కాలేదు.

ఒకరోజున ఇంకొల్లు నుండి నారపరాజు నల్లబ్బాయిగారు వచ్చి- "ఇంకొల్లు పావులూరుల మధ్య ఆంజనేయస్వామి ఉన్నాడు. ఆయన చాలా మహాత్మ్యం కలవాడనీ, ఆ విగ్రహం వెలసినదనీ అందరూ చెప్పకుంటున్నారు. వారికి కావలసిన వసతులు మేము చూపిస్తాము. అక్కడ సత్రం కూడా ఉన్నది. పంపించండి-" అని చెప్పారు.

ఆ మరునాటి రాత్రి భారతిఅత్తయ్యకు ఆంజనేయస్వామి కలలో కనిపించగా- ఆమె చిదంబరరావు తాతగారిని కలమూ కాగితమూ యివ్వమని అడిగింది. ఆయన తడుముకుంటూ వెళ్ళి కలమూ కాగితమూ తీసుకొని వచ్చి యిచ్చి దీపం వెలిగించే ప్రయత్నంలో ఉండగానే అత్తయ్య అయిదారు పద్యాలు వ్రాసింది. దీపసహాయం లేకపోయినా చక్కగా వ్రాసింది. ఆపద్యాలు తాతగారు చదువుకొని చాలా ఆనందపడి నల్లబ్బాయి చెప్పినదంతా నిజమేనని నమ్మారు. ఆ వర్ణన వ్రాస్తేనే యింత బాగుంది అక్కడకు వెళ్ళి చూస్తే ఎంత బాగుంటుందో అనుకుని తప్పక పంపించటానికి నిర్ణయించుకుని అన్నపూర్ణమ్మగారిని లేపి ఆ పద్యాలు చదివి వినిపించారు. ఆమె కూడా తప్పక వెళ్ళవలసిందే నన్నది.

మూడవరోజున అమ్మనూ, బిజిబిళ్ళ రాఘవయ్యగారనే వంటవానినీ తీసుకుని చిదంబరావుగారూ, అన్నపూర్ణమ్మగారూ భారతిఅత్తయ్యా, ఆ పొలిమేర ఆంజనేయస్వామి ఆలయానికి వెళ్ళి సత్రంలో కాపురం ఉండి అత్తయ్య చేత ప్రదక్షిణాలు ప్రారంభం చేయించారు.

మిరియాలతో రెండు పూటలా 108 ప్రదక్షిణాలు చేసి పూటకు బిందెడు పానకం, 5 కొబ్బరికాయలు, తవ్వెడున్నర సోలెడు వడపప్ప చేసి రెండు పూటలా సహస్రనామార్చన చేయించుకుంటూ యిద్దరు బ్రాహ్మణులకు భోజనం పెడుతూ ఉన్నారు. నివేదన చేసిన పస్రాదమయినా యితరులకు పెట్టే అలవాటూ సంప్రదాయమూ లేవు.

రోజూ అమ్మ యీ వడపప్పు అన్నీ అట్టిపెట్టుకుని యితరులు ప్రసాదంగా పెట్టినవి కూడా దాచుకుని అన్నీ కలిపి మధ్యాహ్న సమయంలో వంట బ్రాహ్మణుడయిన రాఘవయ్యగారి నడిగి చింతపండూ, పచ్చి మిరపకాయలూ, ఉప్పూ తీసుకుని పచ్చడి రుబ్బి చెరువుకట్ట మీదనూ, చింతచెట్టు క్రిందనూ కూర్చునే బాటసారులకూ, పావులూరు నుంచి గుడ్డలుతకటానికి వచ్చే చాకలి వాళ్ళకూ, అక్కడ పనిచేసే వాళ్ళకూ, అక్కడ వుండి ప్రదక్షిణాలు చేసే బీద వాళ్ళకూ ఎందరికో పెడుతూ ఉండేది.

ఒక రోజున భారతి పిన్నికి కాళ్ళు పిసుకుతూ పచ్చడి రుబ్బటానికి అమ్మకు అవకాశం లేకపోయింది. ఆ రోజున అనేకులు యింటికి వచ్చి-

"అమ్మాయిగారున్నారా? అమ్మాయిగారున్నారా?" అని అడిగారు.

ఆ రోజున బాపట్ల నుండి చిదంబరరావుగారు వచ్చారు- ఆ నాడు ఆదివారం అయినందువలన. వారు అమ్మకోసం వచ్చేవారి సంఖ్యను చూచి ఆశ్చర్యచకితులై-

'మా అమ్మాయి పరపతి పెరిగిపోయిందే. పలుకుబడి ఎక్కువగా ఉంది యీ ఊళ్ళో, నాకు కూడా యింతగా లేదు'- అనుకున్నారు.

అంతలో పావులూరి చాకలి రామన్న అనే అతను వచ్చి తాతగారిని పిలిచి-

" అయ్యా-యీ పూట అమ్మగారు లేకపోతే బువ్వలోకి పచ్చడీ లేదూ, బువ్వాలేదు. ఆ తల్లి రోజూ పళ్ళెం అన్నం పెట్టేది...... పోనీ- ఊరికేచూచి అయినా వెళతాము-అమ్మాయి ఎక్కడున్నదో పిలవండీ-" అని అర్థించాడు.

దగ్గరకు వేసి వున్న తలుపు తెరచి అమ్మను చూపించారు.

మంచంమీద కూర్చుని భారతి అత్తయ్యకు పాదసంవాహనం చేసే అమ్మ కనుపించింది. రామన్నకు ఆశ్చర్యమూ కష్టమూ కలిగి-

"కొంచెం బయటకు రా అమ్మా" అని పిలిచాడు.

అమ్మ గబగబా లేచి వస్తూ తాతగారు తెచ్చిన అరటిపండ్లు తీసుకొని రామన్న ఒడిలో వేసింది.

క్షణంలో రామన్న రెండు కన్నులూ నీటికుండలయినాయి. ఆనందంతో

వివశుడై అమ్మ రెండుచేతులూ పట్టుకుని దగ్గరకు తీసుకుని చెక్కిళ్ళు పుణుకుతూ-

"ఇవ్వాళ ఎంతమంది అల్లాడిపోయినారమ్మా-" అంటూ అమ్మను చంకన ఎత్తుకుని బయటకు తీసుకువెళ్ళి-

కాళ్ళు పిసుకుతుంటే నీ చేతులు నొప్పి పుట్టలేదూ? అంత లేత చేతులు చూడూ - ఎంత కందిపోయినాయో..."

అని అమ్మ అరచేతులు చూస్తూ బాధ పడ్డాడు.

"మల - నేను మీ కోసం రుబ్బే పచ్చడో? అందుకు చేతులు కందిపోవడం లేదూ?"

"నీవా అమ్మా-పచ్చడి రుబ్బేది? అంత పచ్చడీ నీవేనా రుబ్బేది? నీ వొక్క దానివేనా? అయినా నీవా? నీవేనా..." రామన్న గిలగిలలాడిపోయాడు.

అంతలో రామన్న తమ్ముడు గోపన్న వచ్చి-

"నిజమే - అమ్మాయిగారే నూరటం" అని ధృవపరచాడు.

"అది కాదురా, కాస్తో కూస్తో నూరొచ్చు. అంతపచ్చడి ఎక్కడ రుబ్బుతుంది" రామన్నకు బాధకంటే ఆశ్చర్యం ఎక్కువయింది.

"నిన్న చూచాను. రోటినిండా చాలా పచ్చడి ఉంది. వత్రంతో కూడా అమ్మాయిగారు కూడా తిరుగుతూ ఉంది. అప్పడు అమ్మాయిగారిని చూస్తుంటే బలే ముద్దొచ్చింది" అని సాక్ష్యం చెప్పాడు గోపన్న

అంతలో పనిమనిషి అంకమ్మ వచ్చి-

"ఇవాళ బువ్వకు చంపారమ్మా-" అన్నాడు అమ్మతో. రామన్న అంకమ్మను ఆశ్చర్యంగా చూస్తూ-

"నీకూ అట్లాగే ఉన్నదీ? అందరికీ అంట్లు తోముతావు కదా. ఎవరూ యింత ముద్ద పెట్టరూ? నీవు కూడా అన్నానికి బాధ పడాలీ?" అని అడిగారు.

"పొరుగూళ్ళ నుంచి బియ్యం తెచ్చుకుంటారు కదూ? పని చేసి నందుకు డబ్బులు అణా ఎక్కువయినా యిస్తారు గానీ అన్నం మాత్రం మెతుకైనా పెట్టరు.

అన్నం మిగిలితే రాత్రిళ్ళు వారే తింటారు.

"మా తల్లి ఎంతమంది కడుపుల్లో మంట చల్లారుస్తున్నదో.... అన్నపూర్ణమ్మ తల్లి-" అన్నాడు రామన్న గద్గద స్వరంతో.

"ఇప్పడే యిట్లా ఉంది. ముందు ముందు ఎట్లా ఉంటుందో...." గోపన్న ఊహావిహంగం భవిష్యదాకాశంలో విహరించింది.

అంతలో అన్నపూర్ణమ్మగారు అక్కడకు వచ్చి-

"ఎక్కడికి వెళ్లావు? భారతిపిన్ని కాళ్ళు పిసకమంటే? ఏమిటి అక్కడ నీవు నిలుచుని చేసే పని?" అని అమ్మను మందలించింది.

ఆ మాటలు చిదంబరరావుగారు విని-

"భారతి స్నానంచేసి ప్రదక్షిణాలు వెళ్ళేవేళ అయింది గదా. అమ్మాయి ఇందాకటినుండి పిసికిందాయె. అయినా పిసికితే నొప్పలు తగ్గుతాయా? అన్నం తిన్నావా లేదా అని ఒక్కరూ అడగరు. పనులు మాత్రం అందరూ శాసిస్తారు. చెట్టున కోసుకు వచ్చినట్లుగా ఉన్నది" అని నొచ్చుకున్నారు.

ఆ మాటలు రాఘవయ్యగారు విని "బాగా చెప్పారు" అన్నారు మెల్లగా- చిదంబరరావుగారికి వినవడేటట్లుగానూ, అన్నపూర్ణమ్మగారికి వినవడ కుండానూ.

అమ్మ ఏమీ మాట్లాడకుండా వచ్చి భారతి అత్తయ్య పాదాలవద్ద కూర్చున్నది.

అది కాఫీవేళ. అందరికీ కాఫీలు యివ్వబడ్డాయి. కానీ అమ్మకు యివ్వలేదు.

"ఏమమ్మా-నీవుకూడా తీసుకో" అన్నారు చిదంబరరావుగారు అమ్మను.

"నాకు అలవాటు లేదు తాతగారూ.... కాఫీ సహించవు."

"నీకు సహించవా? వాళ్ళు యివ్వరా?"

"ఒక రోజున యివ్వవస్తే వద్దన్నట్లున్నాను. అప్పటి నుండి వాళ్ళు అడగరల్లే ఉంది."

చిదంబరరావుగారికి నవ్వు ఆగింది కాదు ఆ సమాధానానికి. గ్లాసులో కాఫీ చిందిపోయేటట్లు నవ్వి-

"రెండూ సందిగ్ధంగానే ఉన్నాయి. ఇప్పుడు నేను యిస్తాను, త్రాగు" అని గ్లాసు అందించారు.

అమ్మ కాఫీ అందుకుని త్రాగింది.

అన్నపూర్ణమ్మగారికి కష్టం కలిగి-

"దీనికి అన్నీ చంద్రమౌళివారి పోలికలు వచ్చినయ్" అన్నది.

" ఆ పోలికలు వస్తే బాగుపడేది" అన్నది భారతి అత్తయ్య.

తల్లీ కూతుళ్ళిద్దరూ కొద్దికాలం అమ్మ పోలికల గురించి వాదించుకున్నారు. మన్నవవారి పోలికలు వచ్చాయని భారతి అత్తయ్యా, చంద్రమౌళివారి పోలికలు వచ్చాయని అన్నపూర్ణమ్మగారూ తరుచుకుంటుంటే-

"నాకు ఎవ్వరి పోలికలు రాలేదు. మా అమ్మా నాన్న పోలికలు వచ్చినయ్" అన్నది అమ్మ.

చిదంబరరావుతాతగారు పకపకా నవ్వి-

"పిట్టపోరు పిట్టపోరు పిల్లి తీర్చిందంటారు- ఇదే కాబోలు. ఇది అట్లాలేదు. పిల్లిపోరు పిల్లిపోరు పిట్ట తీర్చింది. రెండు వైపులా పిల్లులను చేసింది" అని చమత్కరించారు.

ప్రొద్దుగూకింది. రామాచార్యులుగారు వచ్చారు.

"భారతమ్మా- త్వరగా స్నానం చేసి రావమ్మా, పూజచేయిస్తాను-" అని అమ్మవంక చూచి-

" ఈ అమ్మాయిని గురించి చాలా ప్రత్యేకంగానూ, ప్రశస్తంగానూ చెప్పుకుంటున్నారండీ. ఈ అమ్మాయికి బీదలంటే చాలా ప్రేమట, అందరికీ అన్నమూ వచ్చళ్ళూ దానం చేస్తుందట. అందుకని మా ఊరి చాకళ్ళు చాలా ఎక్కువగా చెప్పుకుంటున్నారు. అదీగాక అమ్మాయి ముఖంలో చక్కటి వర్చస్సు ఉన్నది. ఆ వర్చస్సులో ఎంతో ప్రశాంతత ఉన్నది" అని స్తోత్రం ప్రారంభించారు రామాచార్యులుగారు.

భారతి అత్తయ్య స్నానానికి వెళ్ళింది.

"ఎవరు ఎట్లా భావిస్తే అట్లా మూర్తీభవిస్తుంది ఆ తేజస్సు. మొన్నటివారం నేను వచ్చినప్పుడు కొండారెడ్డి అనే కుర్రవాడు యిక్కడ ఉన్నాడు. ఇప్పుడు లేనట్లున్నాడు. వాడు నాతో అన్నాడు-తాను ఉపాసించే ఆంజనేయస్వామి అమ్మాయిలా కనపడుతూ ఉంటాడని. ఆ అబ్బాయి మాటలు నమ్మటానికి అనేక నిదర్శనాలు కూడా చెప్పాడు" అన్నారు చిదంబరరావుగారు.

"అదంతా ఏమో కానీండి- ఆ అమ్మాయి దగ్గర చిన్న పిల్ల లక్షణాలు ఏమీ లేవు. మొన్న క్షయరోగి ఒకడు చేతిలో డబ్బులేక చాలాదూరం నుండి నడిచి వచ్చాడు. ఆ రోజున అతని చరిత్రనంతా విని అతనివద్ద ఒంటరిగా చాలాసేపు కూర్చుంది. తరువాత విచారిస్తే తన మెడలో ఉన్న కాసులు రెండు తీసి యిచ్చిందని తెలిసింది. అతను-యివి దొరికినయ్ అంతే చాలని ప్రదక్షిణాలు కూడా మానుకుని వెళ్ళి పోయాడు. అమ్మాయికి చిన్నతనం కదూ-పాత్ర యెరిగి దానం చేయటం తెలీదు." అన్నారు రామాచార్యులుగారు.

ఒక్కక్షణం వృథాకాకుండా వెంటనే అమ్మ అందుకుని-

"మీకు రోజూ యిక్కడ భోజనం పెట్టడం పాత్రతెలిసిన దానమేనా? అర్చకుల స్థానం ఎంతో ఉన్నతమయినది. మీరు దైవానికి ప్రతినిధులు. కనుక ప్రజలకు ఆదర్శవంతంగా వ్యవహరించాలి. అటువంటిది ఆ విగ్రహాలను చాటు చేసుకుని నిగ్రహంలేకుండా ప్రవర్తిస్తున్నారు. నీ విషయం చెప్పు - నీకు అక్కలూ, చెల్లెళ్ళూ, అమ్మా లేరూ? ఇతర స్త్రీలను ఎట్లా చూడాలీ? దైవాంశ కలవారని భావించే మీరే యిట్లా దిగజారితే యిక సామాన్యమైన మనుషుల సంగతి ఆలోచించే దేమున్నది?" అని గబగబా అడిగింది.

"ఏమిటమ్మా కోప్పడుతున్నావు?" అని చిదంబరరావుగారు అడిగారు.

"అది కాదు తాతగారూ- ఎవరికి వారు వారి సంగతి మరచిపోయి లేక వారి సంగతి వదిలిపెట్టి మిగతావారిని మాత్రమే దృష్టిలోకి తీసుకుని నిర్ణయాలు చేస్తారు. ఎవరిని వాళ్ళు విమర్శించుకోవటం వివేకం. ఇతరులను విమర్శించటం అవివేకం. నేను ఎవరికి ఏమి యిచ్చినా- అది దానం అనుకోవటం లేదు. వారి వస్తువే నా దగ్గర ఉన్నదీ, వారిది వారికి యిస్తున్నాను - అనుకుంటున్నాను. అందులో నా వదాన్యతా లేదూ, ఔదార్యమూ లేదు. అటువంటి

దేదయినా ఉన్నదనుకుంటే వారి యోగ్యతా యోగ్యతలూ, అర్హతార్హతలూ, పాత్రతా పాత్రతలూ విచారించాలి. వారిది వారికి యివ్వటంలో వారి మంచిచెడ్డల ప్రశ్నతో సంబంధం ఏమున్నది? ఒకవేళ నేనే యిస్తున్నానని మీరు అనుకుంటే- నాకు వారి అవసరమే కనిపిస్తుంది కానీ వారి అర్హత ప్రసక్తి రాదు."

"మా అమ్మ ఉపన్యాసం యిస్తున్నదే" అన్నారు చిదంబరరావుగారు.

ఇక ఆ మాటలు వినలేక రామాచార్యులుగారు. "నేను వెళ్ళి వస్తానండీ. డొక్కలో నొప్పి ఎక్కువగా ఉన్నది. అమ్మాయిగారిని నామాలు చెప్పకుని పూజచేసుకొనమని చెప్పండి-" అని కోరారు.

"శుభం" అన్నది అమ్మ.

"సరే-వెళ్ళిరా" అన్నారు చిదంబరరావుగారు.

భారతి అత్తయ్య స్నానంచేసి వచ్చి పూజ చేసుకున్నది.

అప్పటికి బారతి అత్తయ్య ప్రదక్షిణాలు ప్రారంభించి యిరవై అయిదు రోజులయింది. వచ్చినప్పటికంటే అప్పటికి ఆమె ఆరోగ్యంలో కొంత సుగుణం కన్పించింది.

ఎట్లాగో ఆ పదిహేను రోజులూ, అంటే మొత్తం నలభైరోజులు పూర్తిచేసుకుని బాపట్ల వెళ్ళుదాం- అనుకున్నారు వారు.

తెల్లవారగానే చిదంబరరావుగారు బాపట్ల వెళ్ళారు.

45. అభేద దృష్టి

భారతి అత్తయ్యకు కష్టంగా ఉన్నది.

"ఈ ప్రాంతంలో ఉంటే దోషం, ఇక్కడ ఉండకూడదు. ప్రక్క ఊరికి ఎక్కడయినా వెళ్లండి-" అని అక్కడి వాళ్లు సలహా యిచ్చారు.

ఆనాడు జోరున వర్షం. భారతిఅత్తయ్య లోపలకు రావటానికి వీల్లేదు; బయట నిలుచోటానికీ వీల్లేదు. చివరకు అందరూ కలిసి పావులూరు వెళ్లటానికి నిశ్చయించుకున్నారు. ఆ వెళ్లటానికయినా వాన వెలవాలి. అందాకా భారతి అత్తయ్య వర్షంలో నిలుచోక తప్పలేదు.

వర్షంలో తడుస్తున్న అత్తయ్యను చూస్తూ అన్నపూర్ణమ్మగారు-

"ఎంత కష్టం వచ్చింది?" అని దుఃఖించింది.

"ఎందు కత్తయ్యా ఏడుస్తావు- పిన్నిని లోపలకు వచ్చి కూర్చోమను. నిజంగా భారతిపిన్నికే దేవుడిని మైలపడేసే శక్తి ఉన్నప్పుడు- ఆ దేవుడికి ప్రదక్షిణా లెందుకూ?" అని అమ్మ అన్నపూర్ణమ్మగారిని ఓదారుస్తూ ప్రశ్నించింది.

"ఏడిచినట్లే ఉంది" అన్నది అన్నపూర్ణమ్మగారు.

"ఎవరు ఏడ్చినట్లు? భారతిపిన్ని రోడ్డుమీద వానలో నిలుచుంటే-ఇందాక నీవు ఏడిస్తివే-అట్లాగా?" అని నవ్వింది అమ్మ.

"నేను వంటచేసి తీసుకువస్తాను. మీరు అన్నీ సర్దుకుని పావులూరు వెళ్లండి. అక్కడ రామాచార్యులుగారు కూడా మనకు సాయపడుతారు" అని చెప్పారు వంటమనిషి రాఘవయ్యగారు.

రామాచార్యులుగారి సహాయం ఏమీ అక్కరలేదని అమ్మ ఖండించింది.

"సరేగాని అమ్మాయి-నేను రోజూ ప్రమాణంగానే వండుతున్నానుగదా, నీవు తీసుకుని వెళ్లేది ఒక్క ప్లేటు అన్నమేగదా- యింతమందికి ఎట్లా పెడుతున్నావు?" అని అడిగారు.

"ఇక్కడ ఉండేవాళ్ల అందరి యిళ్లల్లో కాస్త కాస్త అడిగి తీసుకు వెళ్లి పెడుతున్నాను" అన్నది అమ్మ.

"అంట్లుతోమే వాళ్ళకే పట్టెడన్నం పెట్టరే. నీకు పళ్ళాలతో ఎవరు అందిస్తున్నా రమ్మా?" రాఘవయ్యగారు సందేహం తీరక మళ్ళీ అడిగారు.

"నేను వెళ్ళి అడగంగానే యిస్తున్నారు. నన్ను చూస్తే వాళ్ళకు యివ్వాలని పిస్తున్నదేమో-"

"అయినా కనుక్కుందాం, పద-"

"నీవు బిజిబిళ్ళ రాఘవయ్యవలే లేవు; గుదిబండ రాఘవయ్యవలే ఉన్నావు."

"నేను నీకు గుదిబండనా?"

అంతలో అన్నపూర్ణమ్మగారు సామాను సర్దుకున్నారు. అందరూ కలిసి నడిచి షావులూరు చేరారు.

ఊరికి ముందరే రామాచార్యులుగారు ఎదురు వచ్చి-

"ఈ ఊరిలో కవి దేశయ్యగారని ఒకాయన ఉన్నారు. వారిది పెద్దయిల్లు. వారికి సంతానం లేదు. మంచివారు. మీవారే. నియోగులు......."

అని అంటూ ఉండగా అమ్మ అందుకుని-

"ఎవరైతే మనకేమీ? వినియోగపడితే సరి-" అన్నది.

రామాచార్యులుగారు వారిని దేశయ్యగారి యింటికి తీసుకువెళ్ళి వారికి పరిచయం చేశారు.

వెంటనే దేశయ్యగారు అమ్మను చంకన వేసుకుని వారందరినీ లోపలకు ఆహ్వానించారు.

"ఏమేవ్........ ఈ అమ్మాయిని చూచావూ, అంతా బాలాత్రిపురసుందరివలే ఉన్నది" అని దేశయ్యగారు అయన భార్యను కేక వేశారు.

ఆ పిలుపు విని ఆయన భార్య రుక్మిణమ్మగారు గబగబా పరుగెత్తుకు వచ్చి ఆయన చంక నుండి అమ్మను తాను తీసుకుని బుగ్గలు పుణికి పుణికి పదేపదే ముద్దులు పెట్టుకుంటూ-

"అంతా అచ్చు అమ్మవారే" నని ధృవపరిచింది.

అంతలో రాఘవయ్యగారు వచ్చి-

"పదార్థాలన్నీ తెచ్చుకున్నాం. వంట చేసుకుంటాం. చోటు చూపించండీ-" అని అడిగారు.

"వంట చేసి ఉన్నది. భోజనం చేద్దురుగాని రండి. రాత్రికి అందరకూ మీరే వంట చేయవచ్చును" అన్నది రుక్మిణమ్మగారు.

"అయితే మా అమ్మగారితో చెప్పి వస్తాను" అని రాఘవయ్యగారు వెళ్ల బోతుంటే-

"మీరు ఎందుకూ! నేను చెప్పివస్తాను" అని దేశయ్య గారు వెళ్లి-

"మన మందరం బంధువులమే. చిదంబరరావుగారు నాకు బాగా తెలుసును. ఈ కారణంగా మీరు యిక్కడకు వచ్చారు. మా కెంతో సంతోషంగా ఉన్నది. కడగా ఉన్న అమ్మాయికి గది ఖాళీగా ఉన్నది. అందులో ఉండమనండి. ముందు ఆ అమ్మాయికి అన్నం పెట్టించండి. ఏది ఎట్లా ఉన్నా యీ అమ్మాయి-" అని అమ్మను చూపిస్తూ "రావటం మాకు కన్నుల పండుగగా ఉన్నది. మా బ్రతుకులే పండినంత ఆనందంగా ఉన్నది. మా ఆవిడ శ్రావణశుక్రవారం వ్రతం చేసుకునేటప్పుడు అమ్మవారికి ఆకృతి కల్పించి అలంకారం చేస్తుంది. ఇవ్వాళ సాక్షాత్ ఆ అమ్మ వారే మా యింటికి వేంచేసి నట్లున్నది. మీ అమ్మాయికీ జబ్బు యిందుకోసమే వచ్చిందేమో. మరి ఆ కారణంగానే కదా- మీరు మాయింటికి వచ్చారు. నేటితో మాకు పిల్లలు లేరనే కొరత తీరుతుంది. యీ అమ్మాయిని మాకు పెంపుడు యివ్వండి"- అని అడిగారు.

"నాదేమున్నది? వాళ్ల నాయన నడగండి-" అన్నది అన్నపూర్ణమ్మగారు.

మూడు రోజులు అనుకున్నది దేశయ్యగారింటిలో పదిరోజులున్నారు. నిత్యమూ వారింటిలో పండగగా జరిగిపోయింది. వారు అక్కడ నుండి బయలుదేరే రోజున అందరికీ దేశయ్యగారి దంపతులు నూతన వస్త్రాలు పెట్టారు. ఆ రోజున భారతి అత్తయ్యకు తెరలు అధికంగా వచ్చాయి. అందువలన అన్నపూర్ణమ్మగారు విచారగ్రస్తయై "ఎందరు దేవుళ్లకు మ్రొక్కినా ఫలితం ఏమీ కనబడటం లేదు" అని బాధ పడ్డది.

"అత్తయ్యా-నేను ఒకమాట చెబుతాను. చేస్తావా?- పిన్నికి జబ్బు తగ్గిపోతుంది. నూరు కొబ్బరి కాయలు కొడతాననీ వెయ్యి మందికి అన్నం పెడతాననీ దణ్ణం పెట్టుకో- తగ్గిపోతుంది" అన్నది అమ్మ.

"నేనే పెట్టుకోకపోతే ఏమి? ఆ దణ్ణం నీవే పెట్టుకో. బాలవాక్కుని బ్రహ్మవాక్యం కదా- ఒక వేళ తగ్గుతుందేమో. తగ్గితే నీవు చెప్పినట్లే చేద్దాము" అన్నది అన్నపూర్ణమ్మగారు.

దేశయ్యగారు పకపకా నవ్వి-

"ఇంతకూ ఏ దేవుడికి మ్రొక్కుకోమన్నావో చెప్పలేదు"- అన్నారు.

"దేవుడన్నాను కానీ యింతమంది దేవుళ్ళుంటారని నాకు తెలియదు. అదేదో మనకు అర్థం కానిది, ఒక శక్తి ఉన్నది కదా. ఆ శక్తికి-"

అన్నపూర్ణమ్మగారు అంగీకరించింది. ఆనాటి నుండి ఆ ఊరిలో ఉన్నన్నాళ్ళూ భారతి అత్తయ్యకు తెరలు రాలేదు.

వారికి తిరిగి ఆంజనేయస్వామి ఆలయానికి వచ్చే రోజున ఎద్దుల బండి కట్టించి పంపారు దేశయ్యగారు.

ఒక రోజున రామాచార్యులుగారు ఆ ఆంజనేయస్వామి మహాత్మ్యం గురించి ఎంతో చెప్పారు. అక్కడున్న వారందరూ కూడా ఎన్నో అనుభవాలు వివరించారు. ఆ స్వామికి ప్రదక్షిణాలు చేస్తే ఎన్నో నిదర్శనాలు కనిపిస్తాయన్నారు. అందరూ అమ్మను కూడా చేయమని సలహా యిచ్చారు. అమ్మ సరే నన్నది.

ఆ ప్రయత్నంలో ప్రసాదంకోసం రాఘవయ్యగారిని పెసరపప్పు అడిగింది అమ్మ.

"అది సరే కానీ మనం పావులూరు వెళ్ళి వచ్చినప్పటి నుండి మీ అత్తయ్యగారు నామీద చాలా కోపంగా ఉన్నారమ్మా-" అన్నారు రాఘవయ్యగారు.

"ఎందుకూ?" అని అడిగింది అమ్మ.

"అక్కడ చాకళ్ళూ, పనివాళ్ళూ అనేకులు రోజూ నీవు వారికి అన్నమూ, పచ్చళ్ళూ పెడతావని చెప్పారట. అవేమో నేను నీకు దొంగతనంగా యిస్తున్నానని వారి అనుమానం" అన్నారు రాఘవయ్యగారు.

"అట్లాగునా?-"

"నీ మీద కూడా నమ్మా-"

"నామీదెందుకూ?"

"నిన్నేమో అక్కడ అందరూ అతి ప్రేమగా చూచారని"-

"ఈ మాటలు నాకెందుకుగానీ యింతకూనన్ను వెళ్లమంటారా? నా కేమయినా పెడతారా?" అని అడిగింది అమ్మ.

వెంటనే రాఘవయ్యగారు బెల్లమూ, కొంచెం పెసరపప్పూ తెచ్చి అమ్మ ఒడిలో వేసి- "వాళ్ళు నిద్రపోతున్నారు. దొడ్డిదారిని వెళ్ళు" అన్నారు.

అమ్మ పరుగెత్తింది.

భారతి అత్తయ్య నిద్రలేచి ఎదురు వచ్చి అమ్మను చెయ్యి పట్టుకుని ఆపి "అవి ఏమిటీ?" అని అడిగింది.

అమ్మ ఒడి చూపించింది.

"ఎక్కడికి తీసుకువెళుతున్నావు? ఎవరు పెట్టారు? బుద్ధిలేదా?" అని అమ్మచెంపమీద భారతి అత్తయ్య కొట్టింది.

"అమ్మాయి ఏమీ చేయలేదు. నేనే పెట్టాను. ఆ తప్పు నాది. అమ్మాయిని అనవసరంగా కొట్టబోకండి" అని విలవిలలాడేరు రాఘవయ్యగారు.

అంతలో అన్నపూర్ణమ్మగారు వచ్చి భారతి అత్తయ్యను మందలిస్తూ-

"దానిది అసలే మైదాపిండివంటి శరీరం. ఎట్లా కందిందో, చూడూ-" అన్నది.

అమ్మ మౌనంగా నిలుచున్నది. అన్నపూర్ణమ్మ గారు ప్రేమతోనూ, జాలితోనూ అమ్మను దగ్గరకు తీసుకుని లాలనగా అనునయిస్తుంటే భారతి అత్తయ్యకు కోపం వచ్చి-

"నెత్తిన ఎక్కించుకో - నీ కిష్టం అయితే సరి" అంటూ అమ్మ ఒడిలోని బెల్లం, పెసరపప్పూ లాక్కుని యిల్లంతా వెదజల్లింది భారతి అత్తయ్య.

ప్రదక్షిణాలు చేసే ప్రయత్నాన్ని అమ్మ ఉపసంహరించుకోలేదు. అయితే ఎట్లా ప్రదక్షిణాలు చేయటం?- అని ఆలోచిస్తుండగా ఎదురుగా వేరుశనగచేను కనిపించింది.

అమ్మ చేనుకు వెళ్ళి ఒకగిద్దెడు కాయలుకోసుకున్నది. అంతలో ఆ చేను

రైతు అమ్మను చూచి కేకవేశాడు.

అమ్మ ఆ కేకను విన్నది కాని కాయలు కోయటం విరమించలేదు. రైతు కోపంతో చేతిలోని కర్రను దూరాన్నుండే బలంగా విసిరాడు. అది అమ్మకు జానెడు దూరంలో పడ్డది. అతడు పరుగెత్తుకు వచ్చి అమ్మను సమీపించాడు.

అమ్మ అతడివి చూచింది కానీ తాను చేస్తున్న పని తప్పు అనుకొననూ లేదూ, ఆ పనిని మాననూలేదు. పైగా "ఇవ్వాళ ఎందుకో అందరికీ నన్నుకొట్టాలని అనిపిస్తున్నది' అనుకుంటూ చేతిలోని శనగకొమ్మను గల కాయలనులాగింది. అనుకోకుండా చెట్టు పూర్తిగా చేతిలోకి వచ్చింది.

వెంటనే అమ్మ తల పైకియెత్తి చూచింది. అతడు ఎదురుగా నిలుచుని తదేకంగా అమ్మను చూస్తున్నాడు. అమ్మ ఒడిలోని కాయలను నేలపై కుమ్మరించింది.

అతడు అమ్మవంక నిశ్చేతనంగా చూస్తున్నాడు.

అమ్మ ఆచెట్టు వేరున ఉన్న మట్టి గడ్డలను వలుచుకొని ఒడిలో వేసుకుని ముందుకుసాగింది.

అతని కన్నులు మూతపడలేదు. అతని నోరు తెరిచిడి పడలేదు.

అమ్మ కొన్ని గజాలు ముందుకు నడిచింది.

అమ్మ శిరస్సుపై పిట్టలనుండి పైరుల రక్షణకోసం కట్టే గిలక కనుపించింది. వెంటనే అతని మనస్సులో ఏవేవో భావాలు స్ఫురించాయి. నిత్యమూ తన చేనును కాచే వన దేవతయా యీ అమ్మాయి?- అన్న ఆలోచన కలిగింది. అతని గుండెలు గబగబా కొట్టుకున్నాయి. తాను అపరాధమో అపచారమో చేశానని బాధపడ్డాడు.

వెంటనే పరుగు పరుగున అమ్మ కెదురుగా వచ్చి ముకుళితహస్తుడై-

" ఆ మట్టిగడ్డలు పారబోయమ్మా- నీకు కావలసినన్ని శనగకాయలు నేను కోసి యిస్తాను. దుర్మార్గుడినీ, కృతఘ్నుడనీ, నీకు అపకారం తలపెట్టాను. ఇంకా నయం. ఆ కర్ర తగలలేదు కాబట్టి సరిపోయింది. లేకపోతే నేనేమై పోయి ఉండేవాడినో" అన్నాడు గజగజ వణుకుతూ మేనూ మాటా.

గబగబా అతను దోసెడు కాయలు కోసి-

"పట్టమ్మా- ఈ.కాయలు నీ ఒడిలో పోస్తాను. ఒడిలో మట్టిగడ్డలు పారబోయీ-". అని ప్రాధేయపడ్డాడు.

"వద్దు-మట్టిగడ్డలు పారబోయటం.ఎందుకూ? నాకు శనగకాయలు వద్దు. మట్టిగడ్డల్లో ఉండే గుణమే గొప్పది. మట్టిగడ్డలు నివేదన చేస్తే యిక్కడ పండే పంటలన్నీ నివేదన చేసినట్లే. నాకు అక్కర్లేదు నీ శనక్కాయలు, నేను మట్టినే నివేదన చేస్తాను" అన్నది అమ్మ స్పష్టంగానూ, నిర్మోహమాటంగానూ.

"ఛీ- తప్పు తల్లీ. మట్టిగడ్డలు నివేదన చేయకూడదు. శనగకాయలు స్వామి నివేదనకు తీసుకువెళ్ళుతున్నా వేమిటి? ఆ విషయం నాకు తెలీదమ్మా. ఇదేనా మొదలూ? ఇక్కడకు యిదివరకు ఎప్పుడయినా వచ్చావా?" అతని కంఠంలో శోకమూ, లాలనా వేడుకోలూ ముప్పిరిగొన్నాయి.

"నేను ఎప్పుడూ రాలేదు. అన్నింటికి యిదే మొదలు"

"అన్నీ అంటే?"

"పూజ చెయ్యాలనే భావం యీ రోజే కలిగింది. ఈ చేనుకు యీ రోజుననే వచ్చాను. ఈ రోజుననే దేవుడికి నివేదన చేద్దామనుకున్నాను. ఇప్పుడే మట్టిగడ్డలు మాత్రమే నాకున్నవీ. ఎవరూ అభ్యంతర పెట్టనివీ అవే కనుక-నివేదన చేద్దామనుకున్నాను."

"వద్దులే అమ్మాయిగారూ - ఆ మట్టిగడ్డలు పారబోయండి. ఈ శనగ కాయలు తీసుకొనండి, నన్ను క్షమించండి-" అని బతిమాలుతున్నా-

"వద్దు - వద్దు-" అంటూ ఒడిలో మట్టిగడ్డలతోనే అమ్మ పరుగెత్తింది.

అమ్మ పరుగెత్తుతుంటే అతడు చూస్తూ నిలుచుంటే అతనికి భాగవతంలో చెప్పబడిన బాలగోపాలుడు పరుగెత్తినట్లుగానూ, సౌందర్యలహరియై ప్రవహించినట్లుగానూ, తన అదృష్టమేదో తన నుండి దూరమవుతున్నట్లుగానూ ద్యోతితమయింది.

అమ్మ ఆ మట్టిగడ్డలతోనే నూట ఎనిమిది ప్రదక్షిణాలు చేసి ఆ మట్టిగడ్డలనే ఆంజనేయస్వామికి నివేదన చేసి తీసుకువచ్చి కనుపించిన వారికందరికీ ఆ

గడ్డలనే ప్రసాదంగా పంచింది.

ఎవరికి వారు ప్రసాదం అనగానే ఆశతో చేతులు చాచారు. చేతిలో పడ్డ మట్టిగడ్డను చూచి నివ్వెరపోయారు. అమ్మను చూచి మనస్సుల్లో 'పిచ్చిపిల్ల' అనుకుని పైకి "పొగరా ఏమన్నానా?" అని అడుగుతూ చేతిలోని మట్టిగడ్డ నుండి ప్రసారితమయ్యే పరిమళానికి ఆకర్షితులై ఆ మట్టిగడ్డలనే నోటిలో వేసుకుని ఆ రుచికి సమ్ముగ్ధులై పోయారు. ఆ అపూర్వ సంఘటనకు కొండారెడ్డి అనే అతడు విస్మితుడై.

"ఎక్కడనుండి తెచ్చావమ్మా యీ మట్టి?" అని అడిగాడు.

"ఆ మట్టి ఉన్నచోటనుండే" నన్నది అమ్మనెమ్మదిగా

అంతలో శనగకాయల రైతు దోసిలినిండా కాయలతో దేవాలయానికి వచ్చాడు. అమ్మ ప్రసాదం యివ్వటంకోసం చేయి చాపింది. అతడు మారుమాట్లాడకుండా తన చేతిలోని కాయలు క్రింద పారబోసి ఆ ప్రసాదం అందుకుని కన్నులకు అద్దుకుని స్వీకరించాడు.

అందరూ వింతగా చెప్పకుని ఆనందిస్తూ ఆ ప్రసాదం తీసుకువెళ్ళి భారతి అత్తయ్యకూ, ఇతరులకూ పెట్టారు.

"అందులో ఏమున్నది? ఆ మట్టికి సెంటూ బెల్లమూ పూసిందేమో? అందుకే అంత రుచీ, వాసనా-" అన్నది భారతిఅత్తయ్య.

"మా యెదుటనే మట్టిని తీసుకువచ్చిందీ, నివేదన చేసిందీ, ప్రసాదంగా పంచిందీ" అన్నారు కొందరు.

"పెరటిచెట్టు మందుకు పనికిరాదు" అన్నారు మరి కొందరు.

"నిజాన్ని గుర్తించటం చాలా కష్టం" అన్నారు యింకా కొందరు.

"అది కాదమ్మా - నీవు మట్టిని దేవుడికి నివేదన చేయటం ఏమిటీ? ప్రసాదంగా అందరికీ పంచటం ఏమిటీ? ఈ విమర్శలెందుకూ?" అన్నారు రాఘవయ్యగారు ఏమి అర్థంగాక.

"నివేదనకు నియమమేమి ఉన్నది? మనకు ఏది ఉంటే దేవుడికి అది సమర్పిస్తాము. దేవుడు పండ్లయితేనే పుచ్చుకుంటాను. లేకపోతే వద్దు అనలేదుగా.

బంగారం అయితేనే స్వీకరిస్తాను మట్టి అయితే నాకు పనికిరాదు అని చెప్పలేదుగా. మనకు కలిగిందేదో దానినే సంతోషంగా నివేదన చేస్తాము. నాకు ఉన్నది మట్టి, నాకు ఆ సమయంలో అందింది మట్టి. కనుకనే దానిని నివేదన చేశాను. దేవుడికి ఏది నివేదన చేస్తామో-మనకు అదే ప్రసాదం. అంతవరకే నాకు తెలుసు. మరి, యీవాసన లెక్కడ నుండి వచ్చాయో, దాని రుచి ఏమిటో నాకు తెలీదు. ఇక విమర్శ అంటారా? వింటే విమర్శకాని కంటే విమర్శలేదు. కన్నవాళ్ళు చెపుతున్నారు విన్నవాళ్ళు చప్పరిస్తున్నారు. కన్నవాడిది అనుభవం విన్నవాడికి.,అనుమానం...."

అమ్మ వివరిస్తుంటే ఆ క్షణంలో రాఘవయ్యగారికి అమ్మ రూపంలో అమ్మకంఠంలో ఏదో అతనికి అర్థం కాని విడమరిచి చెప్పలేని మార్పు గోచరించింది.

46. ప్రేమ నాకు సహజం

కొందరు అమ్మను స్తుతిస్తూ, కొందరు ఆశ్చర్యం ప్రకటిస్తూ ఎవరి దారిన వారు వెళ్ళారు.

అమ్మ యింటిలోకి వచ్చింది.

"ఇంతసేపూ ఎక్కడికి వెళ్ళావు? ఏమిటా వేషాలు?" అని అడిగింది భారతి అత్తయ్య.

అమ్మ ఏమీ మాట్లాడలేదు.

"మాట్లాడవేమి మొద్దూ-బూటకాలు నేర్చుకుంటున్నావు. ఇట్లా ప్రపంచాన్ని మోసంచేసే పనులు నేర్చుకోకు. చిన్నప్పడే యిట్లాంటి పనులయితే-పెద్దయితే, ఎట్లాఉంటావో..." అని భారతిఅత్తయ్య మందిలిస్తూ ఉండగానే-

"నేను వచ్చింది నాటకం కోసమే" అని నిశ్చయంగా పలికిన అమ్మ మాటలకు భారతి అత్తయ్యతోపాటు అక్కడ ఉన్న అందరూ ఆశ్చర్య పడుతుండగా బాపట్ల నుండి నాన్నగారు వచ్చారు.

"భారతిని చూచి చాలాకాలమయింది కదా, చూదామని వచ్చాను. పెదనాన్న కూడా చూచి రమ్మన్నారు. వచ్చి మండలమయింది కదా. ప్రదక్షిణాలు పూర్తి అయితే మిమ్మల్ని తీసుకురమ్మన్నారు" అని చెప్పారు నాన్నగారు.

"మీ అమ్మ ఎక్కడుందిరా" అని అన్నపూర్ణమ్మగారు అడిగింది.

"అందరూ మన్నవ వెళ్ళారు."

అంతలో రాఘవయ్యగారు అందరినీ అన్నానికి పిలిచారు.

అందరూ భోజనం చేస్తున్నా అమ్మ మాత్రం కంచంలో చెయ్యి పెట్టుకుని అట్లాగే కూర్చున్నది.

అందరూ అమ్మను అన్నం తినమని బతిమాలేరు. అమ్మ మాత్రం అట్లాగే కూర్చున్నది.

"లోపల స్వయంపాకం. మనం ఎన్ని అన్నా తనను కాదన్నట్లే ఉంటుంది.

తనకు ఎంత తోస్తే అంతే, ఎవరి మాటా సుతరామూ వినదు. పువ్వులా మెత్తగా కనిపిస్తుంది. గానీ రాతి కంటేకూడా కఠినంరా" అని భారతిఅత్తయ్య స్తోత్రపాఠం పఠనం చేస్తుంటే-

"నాకు యిదివరకే తెలుసు. ఏ భావం అయినా లోపల ఉండవలసిందే. క్రియలో కనపడవలసిందే. కానీ మాటల్లోకి రానివ్వదు. నాకు బాగా అనుభవమే"- అన్నారు నాన్నగారు.

"అయినా నీవు అడగరా అన్నయ్యా-నీవు చెపితేనయినా అన్నం తింటుందేమో. ఇదంతా నేను యిందాక కోప్పడ్డానని సాధింపు. అయినా........నేను ఏమనినా తన బాగుకోసమే కదా. తన బాగు తెలుసుకోలేని పిచ్చిపిల్ల అవుతున్నదే........" అంటూ భారతిఅత్తయ్య జరిగిన విషయమంతా వివరించింది.

"అయితే అదంతా మోసమే నంటావా భారతీ?" అని అడిగారు నాన్నగారు.

"కాకపోతే మంచిదే. అయితే మాత్రం తన్నులు తింటుంది."

"అవునో, కాదో - చెప్పగలిగే దెవరూ?"

"తానయితే యిప్పడే చెప్పవచ్చు. ఇతరులు తెలుసుకోవాలంటే కొంతకాలం పడుతుంది."

"కొంతకాలం అంటే?"

"ఎవరయినా ఎవరినయినా ఎంతకాలం మోసం చెయ్యగలరు? మోసం ఎన్నాళ్ళో దాగదు."

"మరి ఎన్నాళ్ళకూ మోసం అని బయటపడకపోతే?"

"అది సత్యమే ననుకోవాలి" అని భారతిఅత్తయ్య మోసాన్ని గురించి వివరిస్తుంటే నాన్నగారు కుతూహలంగా వింటూ-

"ఏం అనసూయా- భారతి అనేదేమిటి? నీవు ఏమంటావు?" అని అడిగారు.

అమ్మ ఏమీ మాట్లాడలేదు.

"సరే అవి తరువాత మాట్లాడుకుందాము. ముందు నీవు అన్నం తిను" అని నాన్నగారు చెప్పారు.

" ఆకలి కావటంలేదు" అన్నది అమ్మ నెమ్మదిగా.

"ఏం తిన్నావమ్మా - ఆకలి కాకపోవటానికి?" అని అడిగింది అన్నపూర్ణమ్మ గారు.

"తినే వన్నీ ఏమిటి?" అని చమత్కరించారు రాఘవయ్యగారు.

"నీకు ఎవరు కోసి పెట్టారు?" అని అన్నపూర్ణమ్మగారు అడిగింది.

భూమి మీదకు వచ్చేటప్పుడే తెచ్చుకున్నాను."

అన్నపూర్ణమ్మగారికి ఆ మాట అర్థంకాక "ఏమిటీ?" అని అడిగినా అమ్మ ఏమీ సమాధానం చెప్పలేదు.

"అంతేలెండి దాని అర్థం. బాల్యంలోనే అమ్మ లేకపోవటం చింతే కదా" అని సమన్వయం చేయటానికి రాఘవయ్యగారు ప్రయత్నించారు.

భోజనాలు పూర్తి అయిన పిదప-

"మీరు ఆలోచించి చెప్పండి. మీరందరూ వస్తే తీసుకువెళతాను. లేకపోతే- పాప దిగులు పడుతుందట-అనసూయను తీసుకురమ్మన్నారు-" అన్నారు నాన్నగారు అన్నపూర్ణమ్మగారితో.

"ఇంకా బాపట్లవారిని వెళ్ళమని చెప్పలేదట. దేవుని ఆజ్ఞ అయితే అర్చకునికే చెపుతారట. అనుమతి వచ్చేవరకు మేము ఉంటాము" అన్నది భారతిఅత్తయ్య

"అయితే నీవు ఉండు. నీకు తోడు వంటమనిషిని ఉంచుతాము. మేము వెళతాము" అన్నది అన్నపూర్ణమ్మ గారు.

రాఘవయ్యగారు అందుకు అంగీకరించక అందరినీ ప్రయాణం చేశారు. మరునాడు ఉదయం అందరూ కలిసి బయలుదేరి బాపట్ల వచ్చారు.

నాన్నగారు మన్నవ వెళ్ళి కనకమ్మబామ్మనూ, లోకనాథం బాబాయినీ,
57 పాపఅత్తయ్యనూ తీసుకువచ్చారు.

భారతి అత్తయ్యను అత్తవారింటికి పంపించారు. పదిరోజులు అక్కడ గడపగానే ఆమెకు మళ్ళీ తెరలు మొదలయినాయి. అందువలన తిరిగి ఆమెను పుట్టింటికి తీసుకువచ్చారు.

చిదంబరరావు తాతగారు ఆందోళితమనస్కులయినారు. భారతి అత్తయ్య ఆరోగ్య విషయంలో ఏమి చేయటానికీ తోచక బాధపడుతుండగా ఒంగోలు తాలూకా చందలూరు తీసుకు వెళ్ళమని ఒకరు సలహా యిచ్చారు.

అక్కడ "మహాలక్ష్మి అమ్మవారు" ప్రసిద్ధి. అర్చకుడు అమ్మవారి ఆదేశంగా తానే ప్రశ్నలకు సమాధానాలూ సమస్యలకు పరిష్కారాలూ అందిస్తూ ఉంటారు.

ఉదయం అక్కడకు వెళ్ళితే సాయంకాలానికి తిరిగి రావచ్చును. అందువలన చిదంబరరావుగారూ అన్నపూర్ణమ్మగారూ భారతి అత్తయ్యా అమ్మా-అందరూ కలిసి చందలూరు వెళ్ళారు.

అక్కడ అమ్మణ్ణిని భారతి అత్తయ్యను గురించి ప్రశ్నిస్తే -

ఆమె లక్షణాలూ, గృహ పరిస్థితులూ వివరించి గ్రహపీడన ఉన్నట్లు వాక్కు ప్రసాదింపబడింది.

చిదంబరరావుగారు నివారణోపాయం అర్థించారు.

కొన్ని నియమాలతో క్రమశిక్షణను నిర్దేశించి అర్చనా విధానమూ, నివేదన విషయమూ-అన్నీ వివరించబడ్డాయి. అమ్మణ్ణి ఆదేశానుసారంగా.

భారతి అత్తయ్యతోపాటు, ఆమె తల్లిదండ్రులను కూడ క్రిందనే పడుకోమని చెపుతూ రెండునెలలు గడిచిన తర్వాత మళ్ళీ వచ్చి ఎట్లా ఉన్నదీ చెప్పమన్నారు.

చివరకు ఆ అర్చకునికి అమ్మను చూపించి "ఈ అమ్మాయిని గురించి ఏమయినా చెపుతారా?" అని అడిగారు.

"అమ్మణ్ణికి ఏమీ వాక్కు రావటంలేదు" అన్నారు అర్చకులు.

చిదంబరరావుగారు పట్టలేని సంతోషంతో -"చూచారా- అమ్మాయే అమ్మణ్ణి అయితే మరి అమ్మణ్ణికి యిక వాక్కు ఏమి వస్తుంది?" అని అడిగారు అన్నపూర్ణమ్మగారిని.

ఆ రోజు సాయంకాలానికి అందరూ చందలూరు నుండి బయలుదేరి బాపట్ల వచ్చారు. ఆ నాటి నుండి భారతి అత్తయ్య చందలూరి మహాలక్ష్మమ్మ వారిని నిష్ఠగా పూజించటం ప్రారంభించింది.

సీతాపతితాతగారు అమ్మను తీసుకువెళ్ళి తెనాలిలో వారి తాతగారింటిలో

గానీ, నంబూరులో వారి పెదతల్లివద్దగానీ దించి అమ్మ బాధ్యతనుండి తాత్కాలికంగా నయినా విముక్తి పొందాలని ఉద్దేశపడి-

"తెనాలి తీసుకువెళతాను, బయలుదేరు" అని అమ్మతో చెప్పారు.

"పాప దిగులుపడుతుంది రాలేను" అన్నది అమ్మ.

"పోనీ ఉంచరాదూ? ఆ మాటా నిజమేగదా" అన్నది అన్నపూర్ణమ్మగారు.

"నేను పాపనూ లోకాన్నీ వదిలిపెట్టి ఉండలేను నాన్నా" అన్నది అమ్మ.

"వదిలిపెట్టి ఉండలేకపోతే ఎట్లా? నీకు తోడుగా నేనే నాలుగు రోజులు ఉంటాను. ఉండలేకపోతే అప్పడే వద్దువుగానీ, బయలుదేరు-" అని తాతగారు శాసించారు.

"పోనీ నాలుగు రోజులు యిక్కడనే ఉండనీ-తరువాత ఆలోచిద్దాము" అన్నారు చిదంబరరావుగారు.

సీతాపతితాతగారికి యిక తప్పలేదు. అమ్మ అక్కడనే ఉన్నది.

నాన్నగారు స్కూల్ ఫైనల్ ప్యాసయి కాలేజిలో చేరే ప్రయత్నంలో ఉన్నారు. అందుకు డబ్బు అవసరం కదా. ఆ విషయం నాన్నగారూ భారతి అత్తయ్యా మాట్లాడుకుంటూ ఉంటే అమ్మ విని వారి దగ్గరకు వెళ్ళి-

"నా మెడలోని నానుతాడు యిస్తాను. ఉపయోగపడితే వాడుకొనండి-" అని కోరింది.

భారతిఅత్తయ్య సమ్మతించలేదు.

" ఈ గొలుసుకు యింతకంటే సార్థకత ఏముంటుంది? తీసుకొనండి" అని అమ్మ గొలుసు తీసి యివ్వబోయింది.

నాన్నగారు సుతారమూ అంగీకరించలేదు. అమ్మ యిక మారు మాట్లాడలేక అక్కడనుండి వెళ్ళిపోయింది.

"అనసూయకు ఎందుకోగానీ మీ కుటుంబం అంటే చెప్పలేని ప్రేమ. అందరిని గురించీ ఎంతో దిగులు. తన వయస్సుకు మించి ఎప్పడూ ఆలోచిస్తూ ఉంటుంది. ఏది ఏమయినా నీవు అనసూయను చేసుకుంటే నీకు కొంతలో

కొంత హాయి దొరుకుతుందేమో అన్నయ్యా" అని భారతి అత్తయ్య నాన్నగారికి సూచన చేసింది.

"ఇటీవల ఒక సంబంధం వచ్చింది నాకు... ఆయన పోలీసు సర్కిల్ యిన్‌స్పెక్టర్. ఆయనకు మగపిల్లలు లేరు. అందువలన నన్ను ఇల్లరికం ఉండమన్నారు. వారికి చాలా ఆస్థి ఉన్నది. పలుకుబడి ఉన్నది. నాకు మంచి ఉద్యోగం యిప్పిస్తామన్నారు. మా కుటుంబానికి అన్ని విధాలా సహాయ పడవచ్చును.........." అని నాన్నగారు చెబుతుంటే.....

" మరి పిన్నిని అడిగావా?" అని భారతి అత్తయ్య అడిగింది.

"ఇట్లా అని చెప్పలేదుగానీ అట్లాంటి సంబంధం వస్తే చేసుకోమంటావా?- అని అడిగాను. అమ్మ ఒప్పుకొనలేదు." అన్నారు నాన్నగారు.

"ఏమయినా మీ కుటుంబానికి అనసూయ అయితేనే అనుకూలంగా ఉంటుంది. అయినా తెనాలి వాళ్ళు అంగీకరించాలిగదా. వాళ్ళకు భాగ్యవంతులకు యిచ్చుకోవాలని ఉన్నట్లున్నది."

"అట్లాగునా?"

"ఔను. మీ అత్తయ్య ఉంటే ఎట్లాగూ ఒప్పుకొని ఉండేదికాదు. మీ మామయ్య అంటావా-మా అమ్మ ఎట్లా చెప్పితే అట్లా వింటాడు. మరిడమ్మ నాయనమ్మకు ఎట్లాగూ యివ్వవేం... ఒకనాడు అనసూయను అడిగాను- ఎవరిని చేసుకుంటావు అని. బావనే అన్నది" అని భారతి అత్తయ్య వివరించింది.

నాన్నగారు తమ కుటుంబపు చిక్కులూ, యిబ్బందులూ చెపుతూ-

"ఏది ఎట్లా ఉన్నా మా అమ్మమాట తప్పను" అని తన అభిప్రాయాన్ని వ్యక్తం చేశారు నాన్నగారు.

ఆ మరునాడే అమ్మను తెనాలి తీసుకువెళ్ళటానికి సీతాపతి తాతగారు నిశ్చయం చేసుకున్నారు. సరిగా ఆరోజుననే తెనాలి నుండి అమ్మ అమ్మమ్మగారు జానకమ్మగారు వచ్చింది. ఎదురుగా వచ్చిన అమ్మను జూచి ఆమె చేతులు ముందుకు చాపింది, ఎత్తుకుందామని.

అమ్మ ఆమెకు అందక రివ్వున లోపలకు పరుగెత్తి లోకనాధం బాబాయి చెయ్యి పట్టుకుని దొడ్లోకి తీసుకుని వెళ్ళి-

"లోకం-నీతో రోజూ ఎవరు ఆడుకుంటారు? పాపనేమో అత్తయ్య సరిగా చూడదు. వేళకు పాలు పట్టదు....." అని బాధపడింది.

"మా మీద నీ కెందుకు అనసూయా యింత ప్రేమ. మేము నీకు ఏమీ చెయ్యటం లేదుగా?" అని అడిగాడు అమాయకంగా లోకనాథం బాబాయి.

"ప్రేమ నాకు సహజం, లోకం. ఎవరు కష్టపడుతున్నా నాకు అట్లాగే ఉంటుంది. మీరు నాకేదో చెయ్యాలని నేను ఎప్పుడూ కోరుకోను" అని బాబాయి చెయ్యి పట్టుకొని-

"నీవు దిగులు పడవద్దు. పాపను జాగ్రత్తగా చూడునీవయినా. నేను పోక తప్పేటట్లు లేదు" అని బుజ్జగించింది అమ్మ.

ఆ రోజుననే సీతాపతి తాతగారి ద్వితీయ కళత్రం కామేశ్వరమ్మగారు రజస్వల అయినట్లు శుభలేఖ వచ్చింది. 25వ రోజున శాంతిచేయటానికి నిశ్చయం చేశారు. అప్పటి దాకా జానకమ్మగారిని ఉండమని కోరినా "అసలే నా బిడ్డ బోయి ఏడుస్తుంటే నాకు పేరంటం ఏమి వచ్చింది?" అని ఆమె అంగీకరించ లేదు.

అమ్మ మాత్రం ఆ కబురు విని-

"ఇక మా పిన్ని మా యింటికి వస్తుంది." అని అమితంగా సంతోషించింది.

అమ్మ యీ సంతోషం కూడా జానకమ్మగారి కోపానికి కారణమయింది.

సీతాపతితాతగారు జానకమ్మగారితోపాటు అమ్మను తెనాలి తీసుకువెళ్ళి దింపి వెనక్కు ప్రయాణం కాగానే అమ్మ ముఖంలోని దిగులు చూచి వెంకట సుబ్బారావుగారు-

"అది దిగులు పడుతుందేమో. ఇంత బలవంతంగా యిక్కడ ఎందుకూ? అయినా అది చిదంబరాన్ని వదిలి ఉండగలుగునా?" అని అడిగారు.

"ఏం ఉండలేకపోవటాలూ? ఎంతవరకూ యివి? తల్లిచస్తే ఉండటంలేదూ? తల్లితోపాటు పోయిందా? ఇది పోయినా అది బ్రతికేదేమో...." అని తాతగారు దారితప్పి మాట్లాడుతుంటే వెంకటసుబ్బారావుగారు వినలేకనూ వారించలేకనూ అక్కడ నుండి తానే తప్పుకున్నారు.

47. మా అమ్మాయే

అమ్మ తన యిష్టానిష్టాలతో నిమిత్తం లేకుండా తెనాలిలో పది రోజులున్నది. తరువాత అమ్మను పినతల్లి భాగ్యమ్మగారు నంబూరు తీసుకువెళ్ళింది.

నంబూరులో యిరుగు పొరుగు వారనేకులు ఏదో విశేషం ఉన్నట్లుగా అమ్మను చూడటానికి వచ్చారు.

వాళ్ళు ఎంతసేపటికీ వెళ్ళక పోయేటప్పటికి భాగ్యమ్మగారికీ విసుగు కలిగింది-

"ప్రొద్దుగూకింది. ఇంటికి వెళ్ళండమ్మా-" అని హెచ్చరించింది.

"ఏమీ లేదు. విడిచిపెట్టి వెళ్ళలేకుండా ఉన్నాము." అన్నారు వాళ్ళు.

"ఎందుకు అంత వెళ్ళలేకపోవడం?" భాగ్యమ్మగారికి అర్థంగాక అడిగింది. "ఏమీ లేదమ్మా- రంగమ్మ కుమార్తె కదా అనీ, తల్లిలేని పిల్లకదా అనీ చూచి పోదామని వచ్చాము. కాని వచ్చినప్పటి నుండీ అమ్మాయి ముఖంలో ఏదో వివరించి చెప్పలేని శక్తి మమ్మల్ని బంధించి వేసిందమ్మా-" అన్నారు వాళ్ళు

అంతలో గోపరాజుగారు వచ్చారు, గోపరాజుగారు- నంబూరు కరణంగారూ, అమ్మ పినతల్లి భాగ్యమ్మగారి భర్తా.

వస్తూనే "తల్లీ సూరయ్యా-యిట్లారా....." అని పిలిచారు.

వారికి అమ్మను చిదంబరరావుగారికివలెనే 'సూరయ్యా' అని పిలవటం అలవాటు.

'ఇంతమంది పిల్లల్లో 'అమ్మా' అని దగ్గరకు పోవడానికి అవకాశం లేని పిల్లకదా -' అనుకుంటూ.....

"భాగ్యా -" అని భార్యను పిలిచి...........

"అమ్మాయిని ఎట్లా చూస్తావో? నే నెక్కడకూ రానూ, యిక్కడనే ఉంటాననేటట్లుగా చూడాలి. నేను యిక్కడ ఉండను కదా. అటూ ఇటూ తిరుగుతూ ఉండే వాడిని. మరి నీవే ఎట్లా చూచుకుంటావో?" అని హెచ్చరించి-

"సూరయ్యా- గుడ్డలున్నాయా కట్టుకోవటానికి?" అని అడిగారు.

కట్టుకునే ఉన్నానుగా, లేకపోతే ఎట్లా కట్టుకుంటాను?" అన్నది అమ్మ చిన్నగా

నవ్వుతూ.

"ఇవి కాదమ్మా, ఇవి విడిస్తే కట్టుకోను గుడ్డలున్నయ్యా?"

"ఆ ఉన్నయ్" అన్నది అమ్మ.

"అమ్మాయికి గుడ్డలు ఎన్ని ఉన్నాయ్యో తెలుసునా?" అని భార్యను అడిగారు.

"చూస్తాను. నాకు తెలియదు" అన్నది భాగ్యమ్మగారు.

"నీ పిల్లలకు ఎన్ని గుడ్డలుంటాయో నీకు తెలియదూ? అట్లాగే చూచుకోవాలి" అని గోపరాజుగారు భార్యను సలహా రూపంలో ఆజ్ఞాపించారు.

వెంటనే భాగ్యమ్మగారు అమ్మ సంచి తీసి చూచి-

"రెండే ఉన్నాయి" అన్నది.

"రెండు ఉంటే ఏమి చాలుతాయి? గుంటూరునుండి అరడజను కుట్టించి పంపుతాను. జాగ్రత్తగా చూడు అమ్మాయిని. మన గుఱ్ఱంమీద ఎక్కించి రోజూ సాయంకాలం షికారుకు పంపించు. మన మస్తానుకు చెబుతాను"

అని చెప్పి భోజనం చేసి గోపరాజుగారు గుంటూరు వెళ్ళారు. అక్కడనుంచి అమ్మకు గుడ్డలు కుట్టించి పంపారు.

భాగ్యమ్మగారు అమ్మను అతిశ్రద్ధగా చూస్తూ ఉన్నది. రోజూ గుఱ్ఱంపై ఎక్కించి షికారు పంపుతూ ఉన్నది. ఒక రోజున వారి అమ్మాయి, సావిత్రిని తనతో పాటు ఎక్కించుకుని కంతేరు వరకు గుఱ్ఱం స్వయంగా అమ్మ స్వారీ చేసింది.

అకస్మాత్తుగా అమ్మకు జ్వరం తగిలింది. శరీరమంతా పెద్దపెద్ద దద్దుర్లు ఎక్కాయి. డాక్టర్ నంబూరు పానయ్యగారిని పిలిపించి-

"ఈ పిల్లను చూడండి- లేనిపోనిది నేను తీసుకువచ్చాను. ఎప్పడూ వాళ్ళ నాన్ననూ తాతగారిని వదిలి పెట్టే ఉండలేదు, ఆ దిగులేమో......" అన్నది భాగ్యమ్మ గారు

"ఏదయినా ముందు చింతపండు పులుసును రాచి కొద్దిసేపు ఉంచి కడిగి వెచ్చని వెలిబూడిద రాచి గొంగడి కప్పి పడుకోబెట్టండి. ఎప్పడు చూచినా అమ్మాయి ఏదో ఆలోచిస్తూనే ఉంటుంది. ఆ పైత్యం చేతనయినా యిట్లా

రావచ్చు. విరోచనాలకు వేద్దామంటే జ్వరం ఉన్నది. ఇట్లాగే చేస్తూ ఉండండి-తగ్గుతుంది."

డాక్టరుగారు చెప్పినట్లుగానే అమ్మకు చికిత్స ఆరంభించారు. నాలుగు రోజులకు దాగర తగ్గిపోయింది, కానీ జ్వరం అట్లాగే ఉన్నది.

ఆ జ్వరం రెండు నెలల దాకా ఉన్నది. ఏనాడూ సామాన్య ఉష్ణోగ్రతకు రాలేదు. వైద్యుడు సన్నిపాత జ్వరమని భ్రమపడి కణికలు చాది పోశాడు. మందుల వేడివల్ల నోరంతా పొక్కింది. ఎన్నిమందులు పోసినా తగ్గలేదు కంఠంకూడా వాచింది. నాభి దగ్గరనుంచి గొంతు వరకు ఒకటే పుండయిపోయింది.

కంతేరులో అమ్మపినతండ్రి అంబారావుగారు పాఠశాల ఉపాధ్యాయులుగా పనిచేస్తుంటే-వారికి కబురు చేశారు. కాని వ్యవధి దొరకక ఆయన రాలేదు.

ఒక రోజున గోపరాజుగారికి గుంటూరులో రాఘవరావు మామయ్య కనుపిస్తే అమ్మజ్వరం సంగతి వారికి చెప్పారు.

వెంటనే రాఘవరావు మామయ్య అన్నారు-

"అనసూయ దిగులుపడ్డదేమో నాన్న కోసం, తాతమ్మ కోసం. అది జబ్బు కాదేమో. వాళ్ళను వదిలి యింతకాలం ఎప్పడూ ఉండలేదు. అప్పడే మూడవనెల కూడ వచ్చింది. నేను యింటికి వెళ్ళి నాన్నను పంపిస్తాను. మందులు వాడకండి-"

తరువాత వారం రోజులకు సీతాపతి తాతగారు నంబూరు వచ్చారు. తాతగారిని చూడగానే అమ్మ చివాలున లేచి కూర్చున్నది. జర్వం తగ్గకపోయినా తగ్గినంత తేలిగ్గా కనుపించి అమ్మ అందరినీ ఆశ్చర్యపరచింది.

తాతగారు వెళ్ళి అమ్మపడుకున్న మంచంమీద కూర్చున్నారు. అమ్మ తాతగారి పొట్టను కరుచుకున్నది.

"ఇంటికి వెళదాం వస్తావా?" తాతగారు అమ్మను అడిగారు.

"ఆ తీసుకు వెళ్ళితే వస్తాను"

భాగ్యమ్మగారు బావగారికి పాదప్రక్షాళనార్థం నీళ్ళు తెచ్చి యిచ్చింది. తాతగారు కాళ్ళు కడుగుకొని మంచినీళ్ళు త్రాగి-

"దీనికి ఎప్పటినుండీ జ్వరం భాగ్యం-?" అని అడిగారు.

"వచ్చిన తరువాత ఏ పదిరోజులు బాగున్నదో-అప్పటి నుంచీ జ్వరమే. ఇక్కడకు వచ్చి అప్పడే రెండునెలల పదిహేను రోజులయింది" అన్నది భాగ్యమ్మ గారు.

"మీ అక్కయ్యను కాపరానికి తీసుకురావాలి. అమ్మాయిని రేపు తీసుకు వెళతాను. మీ కేమయినా అలవాటు అయిందా? అయితే - పది రోజులుంచు కొని మళ్ళీ పంపిస్తాను" అన్నారు తాతగారు.

"అలవాటు ఏమి తెలుస్తుంది? వచ్చినప్పటి నుండీ జ్వరంతోనే ఉన్నది కదా-"

"సరే, రేపు తీసుకువెళతాను. ఇక దాని యోగ్యత ఎట్లా ఉంటే అట్లా అవుతుంది. మీకు అలవాటు అయితే మీ వైపున మంచి సంబంధం చూచి మీరే చేసుకుంటారు. నాకు బాధ్యత తప్పుతుందని అనుకున్నాను." అన్నారు తాతగారు నిరాశగా.

"వారు గూడా ఊళ్ళోలేరు. నడిచిపోవడం కష్టం. ఓపికలేని పిల్ల. అందులో జ్వరమూ, లంకణాలు....."

గోపరాజుగారి అబ్బాయి సుబ్బారావు అందుకుని "నేను బండిని పిలుచుకు వస్తాను" అన్నారు.

"ఇప్పుడు బండి దొరుకుతుందో లేదో గానీ మోతాదును పిలిపిస్తే చాలు, అమ్మాయిని ఎత్తుకుని తీసుకు వస్తాడు" అన్నారు తాతగారు.

"నేను నడుస్తానులే నాన్నా, మోతాదు ఎందుకూ? అతనికి మాత్రమూ నేను బరువు కాదూ?" అన్నది అమ్మ సన్నగా నీరసించిన గొంతుకతో.

అమ్మమాటలు వినగానే భాగ్యమ్మగారి కళ్ళు క్షణంలో అశ్రుపూర్ణమయినాయి.

"కాదులే. మోతాదును పిలిపించండి. వెంట ఉంటే అవసరమయితే ఎత్తు కుంటాడు. నడవగలిగితే నడుస్తుంది" అన్నారు తాతగారు.

మోతాదుకు కబురు చేశారు. తెల్లవారుజాముననే అమ్మ బయలుదేరటానికి నిశ్చయమయింది.

కాని ప్రయాణం సన్నాహం ఉదయం ఏడున్నరకు గానీ పూర్తి కాలేదు. ఎవరో ముఖ్యబంధువులు, పెద్దవారు ప్రయాణం అయినప్పుడువలే యిరుగు పొరుగు అనేకులు వాకిట్లో గుమికూడారు అన్నాళ్లనుంచీ జ్వరపీడిత అయినా నిరశన అయినా అమ్మ ముఖంలో తరగని తేజస్సును చూని వారందరూ అమితాశ్చర్యచకిత చేతస్కులయినారు.

అమ్మ నోటిపుండూ, గొంతువాపూ స్పష్టంగా కనిపిస్తుంటే చూచి-

"అసలు జబ్బు ఒకటి ముందు యింకొకటి అయినట్లున్నది. డాక్టరుగారికి మూలం అర్థకాలేదు" అని కొందరు అంటే-

"తల్లిలేని పిల్లను బాగుచేద్దామని తీసుకువస్తే యిట్లా అయింది" అని భాగ్యమ్మగారు కన్నీళ్లు పెట్టుకున్నది.

అమ్మ భాగ్యమ్మగారికి నమస్కారం చేసి బయలుదేరింది.

మోతాదుకు శ్రమ యివ్వకుండానే అమ్మ నడిచి రైల్వే స్టేషనుకు చేరింది. చేరగానే ట్రయిన్ వచ్చింది. ట్రయిన్ ఎక్కి మోతాదును దగ్గరకు పిలిచి, తనకు భాగ్యమ్మ గారు యిచ్చిన అయిదు రూపాయలూ అతని చేతిలో ఉంచి-

"ఏమయినా కొనుక్కోనాయనా.......... ఎవరికీ చెప్పకు-" అన్నది అమ్మ.

"నాకు వద్దు అమ్మాయిగారూ, నేను ఏమయినా నీ చేతిలో పెట్టవలసింది, నాకెందుకమ్మా?" - మోతాదు మొహమాటపడ్డాడు.

"అరవకుండా తీసుకో మోతాదూ పెద్దగా మాట్లాడకు"

సీతాపతిగారికి ఏమి అర్థంగాక "ఏమిటది?" అని అడిగారు.

ఏమి లేదు నాన్నా, బాగ్గిపిన్ని ఏదో యిచ్చిందీ అది అతనికి యిస్తున్నాను" అన్నది అమ్మ

ట్రయిన్ బయలుదేరింది. మోతాదు అయిదు రూపాయలూ తీసుకుని వెనక్కు వచ్చాడు.

తాతగారూ అమ్మా బాపట్లస్టేషనులో దిగి రోడ్డుమీదకు వచ్చేటప్పటికి చిదంబరరావు తాతగారు ఎదురు వచ్చారు. అమ్మను చూడగానే చిదంబర రావుగారికి దుఃఖం పెల్లుబికింది. అమాంతం అమ్మను ఎత్తుకుని యింటికి

తీసుకువచ్చారు.

అమ్మను అక్కడ దించి ఆ సాయంకాలమే సీతాపతి తాతగారు మన్నవ వెళ్ళారు.

అమ్మనోటిపుండుకు మందు యిప్పించటానికి ఆయుర్వేద వైద్యులు తుర్లపాటి సాంబయ్యగారిని పిలిపించారు.

"అసలు ఇది ఏమి పుండమ్మా?" తాతగారు అడిగారు అమ్మను.

" మిమ్మల్ని వదిలిపెట్టి నంబూరులో ఉండవలసివచ్చెనే అనే పుండు."

"మమ్మల్ని వదిలిపెడితే నీక్కూడా దిగులుటమ్మా?"

"నాకు అంత వాత్సల్యం లేకపోతే మీ దగ్గర ఎట్లా ఉంటాను?

"నీకు వాత్సల్యం కొంతమంది మీద ఉండి కొంతమంది మీద ఉండదా ఏమిటి? అక్కడున్నా ఒకటే ఇక్కడున్నా ఒకటే కదా నీకు?"

"అట్లా లేదు తాతగారూ. మా నాన్నే ఎక్కువ అనిపిస్తుంది మీ అందరికంటె. తరువాత తాతమ్మ. ఆ తరువాత మీరు........ మీ మీద వాత్సల్యం అట్టేలేదు. మీతో సహవాసం బాగుంటుంది."

"నేనేమయినా పసివాడినా నీవు సహవాసం చేయటానికి? ఒకటి చెప్పి మరొకటి చేస్తావు కదమ్మా! మీ నాన్నా నేనూ ఉన్నప్పుడు నా మీదనే ఎక్కువ ప్రేమ చూపిస్తావు. అయినా వాత్సల్యం అంటే తల్లికో తండ్రికో వర్తిస్తుంది. నీవేమో పసిపిల్లవు కదా, అమ్మాయివి కదా?"

"మాయి అంటే అమ్మ అనే."

"మరి ఈ పుండు గూడా అట్లాంటిదేనా?"

"కాదు".

"పోనీ అంత దిగులుగా ఉంటే వచ్చెయ్యకూడదూ- ఆపాడు మందులన్నీ మింగకపోతే."

"మింగవలసిన విధి ఉంటే ఎట్లా తప్పుతుంది? అప్పడే ఏమయిందీ నా పని?"

"డాక్టర్ సాంబయ్యగారు వచ్చి చిదంబరరావుతాతగారికి అభివాదం తెలియచేస్తూ-"

"మీరు మనిషిని పంపినప్పుడు ఇక్కడలేను. మౌనస్వామివారు చీరాల వచ్చారు. వారిని దర్శించటానికి వెళ్ళాను. వారు మా గురువుగారు కదా........"

"వారిని నేనూ ఎరుగుదును. వారు చీరాలలో ఎవరింట్లో ఉన్నారు?" అని అడిగారు తాతగారు.

"నూనె పానకాలుగారి తోటలో ఉన్నారు."

"ఇంకా ఎంతకాలం ఉంటారు?"

"చాలా కాలం ఉంటారుట"

అంతలో అమ్మ సంభాషణనందుకుని-

"అయితేవారు మాట్లాడరా తాతగారూ?" అని అడిగింది

"మాట్లాడరమ్మా" అన్నారు తాతగారు.

"మరి మనతో సంభాషణ ఎట్లా చేస్తారు?" అని అమ్మ సందేహం వ్యక్త పరచింది.

"కాగితం మీద వ్రాసి యిస్తారు."

" వారికి మన మాటలు వినపడతాయా?"

"వినపడతాయి."

"మనం అనేవి వినపడి మనకు సమాధానం వ్రాసి యిచ్చేటప్పుడు యింకా మౌనమేమిటి?"

"మౌనం అంటే మాధ్యప్తిలో అంతే. మరి నీవనే మౌనం ఎట్లా ఉండాలి?" అని చిదంబరరావుగారు కుతూహలంగా అడుగుతూంటే సాంబయ్యగారు విసుక్కుని-

"చిన్న పిల్లవు - నీ కేమి తెలుసు? నీవు మాట్లాడకు-" అని గద్దించారు.

కాని అమ్మ మాత్రం చలించకుండా చిరునవ్వులు చిందిస్తూ-

"నన్ను కూడా మౌనంగా ఉండమంటారా? కాని నాకు మరి చదువు రాదుగా వ్రాయటానికి" అని చమత్కరించింది.

ఆ చమత్కారానికి ఆయనా చకితులై-

"ఎవరండీ యీ అమ్మాయి?" అని అడిగారు.

"మా అమ్మాయే-" నని సమాధానం చెబుతుంటే తాతగారి సర్వేంద్రియలూ హర్షపులకితమైనాయి.

కాని సాంబయ్యగారిని యిక ఆ విషయం ఆకర్షించలేక పోయింది. కనుకనే వెంటనే అడిగారు- "మీరు నన్ను పిలిపించారట... ఎందుకూ?" అని.

"ఔను అమ్మాయి నోరు చూచారూ?"

"కనిపిస్తూనే ఉన్నదిగా."

"నోరు కనుపిస్తున్నదా? వినిపిస్తున్నదా?" అని అమ్మ దబాయించింది.

వెంటనే సాంబయ్యగారు చతికిలబడి-

"అది కాదమ్మా. పుండు కనుపిస్తున్నదీ- అన్నాను" అని అమ్మతో చెప్పి తాతగారిని ఉద్దేశించి-

"పంతులుగారూ- ఏమిటి యీ అమ్మాయి యింత వ్యాఖ్యానంగా మాట్లాడు తుంది?" అన్నారు.

"వ్యాఖ్యానం అంటే వివరించటమేగా. నేను వివరిస్తున్నాను. మీరు విమ ర్శిస్తున్నారు" అన్నది అమ్మ.

"చాలా గడుసుపిల్లవలే ఉన్నదే! ఈ అమ్మాయి మీకు వలే కవిత్వం కూడా నేర్చుకుంటున్నదా పంతులుగారూ?"

మధ్యలో అడ్డువచ్చి "నా గొంతులోనూ, అంగిట్లోనూ ఉన్న పుండ్లు కూడా చూచారా?" అని అడిగింది అమ్మ.

"నీవు నోరు తెరచి చూపిస్తేనేగా?" అన్నారు సాంబయ్యగారు.

"మరి యిందాక మీరు చూచానన్నది ఏమిటి?"

"పెదిమలమీద పక్కనున్న పుండ్లను చూచి-చూచానన్నాను."

"ఈ పుండ్లనుబట్టి లోపల ఉన్న పుండ్లు కూడా అర్థం చేసుకుంటారా?"

"పుండు యొక్క స్థానాలు వేరు కావచ్చును కానీ యీ పుండు స్వభావమూ ఆ పుండు స్వభావమూ ఒకటే. వ్యాధి అర్థంకాక రస సంబంధమయిన మందులేవో వాడి ఉంటారు"

"సహజంగా ఒక డాక్టరు చేసిన చికిత్సను మరొక డాక్టరు ఏదో రకంగా అంటూనే ఉంటాడు" అన్నది అమ్మ ముసిముసిగా నవ్వుతూ.

"యథార్థం చెప్పావమ్మా. నేనేమీ ఆ డాక్టరును అసమర్థుడని అనలేదు. అర్థంకాక రససంబంధం వాడారన్నాను. ఎవరయినా అంతే అర్థం కానప్పుడు" అని డాక్టరుగారు సంజాయిషీ యిచ్చుకుని అమ్మను నోరు తెరవమని అడిగారు.

అమ్మనోరు తెరిచి చూపింది. నోటిలోనూ అంగిట్లోనూ గులాబీరేకులంత వెడల్పున గులాబీరంగున పుండ్లు కనుపించాయి.

"పంతులుగారూ - గర్భంలో కూడా పుండు ఉండి ఉంటుంది." అన్నారు డాక్టరుగారు.

"దీని కేమయినా మందు వండి ఉన్నదా?"

"ఆ ఉన్నది. రేపటినుండి ప్రారంభిద్దాము."

డాక్టరుగారు వెళ్ళిపోయారు. వారి వెంట అమ్మా వెళ్లింది- వారి ఆలోచనా తరంగాలలో ఊయల లూగుతూ.

48. హోమియో

ఆ రాత్రి భోజనం చేసి అందరూ పడుకున్నారు. తెల్లవారి అమ్మ లేచేటప్పటికి అమ్మకు కాళ్ళూ చేతులూ ఉబ్బి ఉన్నాయి. చిదంబరరావుగారు చూచి "ఇదేమిటమ్మా" అని గుండెలపై చెయ్యివేసి కొట్టుకొని ఆదుర్దాగా కాళ్ళువత్తి చూచారు.

వారి ఆదుర్దా చూచి అమ్మ నెమ్మదిగా-

"నెత్తురులేనిమీదట ఉబ్బినయ్‌లే. కొంచెం సేపటికి అవే తగ్గుతాయి. ఎందుకు మీరట్లా గాభరాపడతారూ? ఇప్పుడప్పుడే నేనెక్కడకు పోతాను తాతగారూ? చేయవలసిన పనులు చాలా ఉన్నాయి" అన్నది.

"నిజమేననుకో అమ్మా-ఎదురుగా కనపడే బాధను చూచి మనస్సు నిబ్బరించుకోలేక పోతున్నాను. నీ స్థితి ఎక్కువ అనీ నాకు తెలుసు. నీ మనస్సు మా మనస్సు కంటే విశిష్టమయిందనీ నాకు తెలుసు. నీ శరీరం మా శరీరం కంటే విభిన్నమయిందనీ నాకు తెలుసు. నిన్ను ఎవరూ, ఏవీ ఏమీచేయలేరనీ నాకు తెలుసు. అయినా నీవు బాధపడుతూ కనుపించగానే అంతకు ముందున్న భావాలూ, విశ్వాసాలు కరిగిపోతున్నాయమ్మా. దీనికి కారణం మాత్రం నాకు తెలియటంలేదు..."

"ఇంత మాత్రానికే బాధపడితే, చలిస్తే ఎట్లా. ముందు ముందు ఉన్నదంతా అదే-"

"ఏమో కొన్ని సందర్భాల్లో నీవు సర్వ శక్తిమంతురాలవనీ, సర్వజ్ఞురాలవనీ ఎంత నమ్మకమో-కొన్ని కొన్ని వేళల్లో నీ కేమవుతుందోననీ, నీ వేమవుతావోననీ నేను బాధ పడుతుంటానమ్మా. మరి విశ్వాసానికీ, యీ భయానికీ సమన్వయం ఎట్లాగో నాకు అర్థం కావటం లేదు."

"ఏమీ లేదు తాతగారూ - మీకు నా మీద ప్రేమే యిందుకు కారణం. మరి, నేను మీ మనుమరాలినాయె. శరీరం కష్టపడుతూ ఉండెను. అది మీకు కనుపడుతూ ఉండెను. ఇక మీకు బాధ కలగకుండా ఎట్లా ఉంటుంది? మరి మీది గుండె కాని రాయి కాదుగా?

"అదేనమ్మా సున్నితమయిన ఈ హృదయమూ, యీ మమకారమే

అవరోధంగా తయారుయినాయి."

"తాతగారూ-మమకారం దేనికీ అవరోధం కాదు. ఒక చోట ఉండే మమకారమే విస్తృతమై సర్వత్రా వ్యాపిస్తే- అదే మాధవత్వం అవుతుంది."

"ఏమిటేమిటీ? - మళ్ళీ అనూ, మళ్ళీ అనూ--" అమ్మ పలికిన ఆ వాక్యం చిదంబరరావుగారిని చకితులను చేసింది.

"ఏమిటమ్మా? ఇప్పుడన్న మాట మళ్ళీ వినిపించూ-"

"పరిమితమయిన మమకారం మానవత్వాన్నీ, సర్వత్రా ఉండే మమకారం మాధవత్వాన్నీ గుర్తింపజేస్తాయి."

"ఎంత బాగా చెప్పావమ్మా!"

"బాగానో ఓగానో - నాకు అనిపించింది, చెప్పాను."

"అయితే - నా మమకారం నాలో మానవత్వాన్ని గుర్తింప చేస్తున్నదంటావా? లేక నా మమకారమే నీలో మానవత్వాన్ని చూస్తున్నదంటావా?"

"నాకు తెలీదు తాతగారూ-"

"లేక రెండూనా?"

"అది మీకే తెలియాలి; మీరే చెప్పాలి."

"ఎక్కడా చిక్కవు కదమ్మా-"

"అదేమిటి తాతగారూ- ఈ నెలలో బాగా చిక్కానని అందరూ అంటుంటే మీరు యిట్లా అంటారు. మామూలుగా బాగా ప్రేమ ఉన్నచోట ఎంత బాగా ఉన్నా చిక్కినట్లే కనుపడుతా రంటాను. పైగా మీకేమో నా మీద ఎక్కువ ప్రేమ అంటారు. మరి మీరే యిట్లా అంటే నేనేమి అనాలి?"

"ఎంత చమత్కారంగా మాట్లాడుతావమ్మా."

"మీరు నేర్పిందేగా-" అంటూ అమ్మ మెల్లగా వచ్చి చిదంబరరావుగారి ఒడిలో కూర్చున్నది.

చిదంబరరావుగారు వెల్లువలయిన మమకారపు పారవశ్యంలో అమ్మ తల నిమురుతూ-

"ఆస్పత్రికి వెళదామా అమ్మా?" అని అడిగారు.

"నే రాలేను తాతగారూ. కాళ్ళు పట్టుకుంటున్నాయి. ఎక్కడికీ రాలేను."

"కాళ్ళు పట్టుకుంటున్నాయి - కాదమ్మా. కాళ్ళు పట్టుకుంటున్నారు."

"ఎవరూ?"

"భక్తులు."

"నాకు భక్తులు ఎవరూ లేరు. అందరూ బిడ్డలే."

" ఈ విషయంలో నీకు ఎంత స్థిరమయిన భావం అమ్మా? ఒక్కక్షణంలోనూ ఏమరుపాటు కనుపించదు గదా-"

"అది నా స్వభావం తాతగారూ-స్వభావం మారనిది. భావం మారుతూ ఉండేది. అయినా తల్లికి బిడ్డల విషయంలో మరుపూ, ఏమరుపాటూ ఏముంటుంది?"

చిదంబరావుగారికి అమ్మ మాటలు వింటున్న కొలదీ ఆనందంగా ఉంటున్నా దినదినం క్షీణిస్తున్న అమ్మరూపం చూస్తుంటే దుఃఖం పెల్లుబికేది.

మందులు వాడుతూనే ఉన్నారు. కాలం పరుగెత్తుతూనే ఉన్నది-నెలా పదిహేను రోజులు గడిచాయి. అమ్మ తల వెంట్రుకలు అట్టకట్టాయి.

ఒక రోజున అమ్మకు తీవ్రమయిన జ్వరం వచ్చింది. ఆ రోజు అమ్మమ్మగారు పోయిన రోజు.

చిదంబరరావుగారు అమ్మపక్కలో కూర్చున్నారు. వారికి గతమంతా స్మృతిపథంలో మెదిలింది. కన్నీరు చెంపలమీదిగా ప్రవహించి అమ్మపై పడ్డాయి.

"ఏమిటి తాతగారూ?"అమ్మ అడిగింది.

"నాకేమిటో దిగులుగా ఉన్నదమ్మా."

"నా కేమీ ఫర్వాలేదు తాతగారూ. నేను చెప్పానుగా- నేను చేయవలసిన దెంతో ఉన్నది."

"మరి నాకు భక్తిలోపమా?"

"నేను ఒకటి అడుగుతాను చెబుతారూ?"

చిదంబరరావుగారు అంగీకారంగా తలపంకించారు.

"మీకు దిగులు దేనికి?"

"తీవ్రమయిన నీ జ్వరమూ, శుష్కిస్తున్న నీ శరీరమూ చూచి....."

"తాతగారూ - లోకంలో ఎంతమంది జ్వరంతో బాధపడే వాళ్ళులేరూ?"

"అసంఖ్యాకులు."

"వారిని గురించి మీరు ఆందోళన పడుతున్నారా?"

"లేదు."

"పోనీ నన్ను గురించి అందరూ బాధపడుతున్నారా?

"లేదు"

"మరి మీరు నా కోసం బాధ పడటానికి కారణం?"

"నా మమకారం అనుకుంటాను."

"ఔను."

"అయితే యీ మమకారాన్ని చంపుకోమంటావా?"

"అనను. ఈ మమకారాన్ని పెంచుకోమంటాను. ఈ నీ మనుమరాలును చూచినట్లుగానే అందరినీ చూడండి. నీ మనుమరాలికోసం దుఃఖించి నట్లుగానే అందరిని గురించీ దుఃఖించండి."

"అంటే అందరిలో నీవు ఉన్నానంటావా?"

"నా మీద మీకు గల ప్రేమను అందరి మీద చూపించగలిగితే- అందరి గురించీ యీ దుఃఖం పొందగలిగితే- మీకు యీ బాధ తొలుగుతుందేమోనని నా ఉద్దేశం."

"ఏమోనమ్మా-నాకు అది సాధ్యం అనుకోను. నీలో అందరూ ఉన్నారనుకుని నిన్ను మరింతగా ప్రేమించగలనేమో కానీ-నిన్ను అందరిలో చూచి అందరినీ నీ వలే ప్రేమించలేను. అది సరేగానీ నీకు గుర్తున్నదా? ఇవ్వాళ రంగమ్మతల్లి నిన్ను నా చేతిలో పెట్టిన రోజు. కానీ నీకు నయమయితే నన్నే నీ చేతిలో పెట్టిన రోజు."

"పిచ్చితాతగారూ నాకు నయం కాదనుకుంటున్నారా? నేను చేయవలసిన పనులు చాలా ఉన్నాయి."

"అదేనమ్మా-నేనూ కోరుకునేది."

"మీ కోరిక నెరవేరుతుంది తాతగారూ."

49. వాళ్ళు తింటే నేను తిన్నట్లే

చిదంబరరావుతాతగారు డాక్టర్‌ను పిలుచుకువచ్చారు. డాక్టర్ వచ్చి అమ్మను పరిశీలించి-

"ఈ జబ్బు చాలాకాలంనుండి ఉన్నట్లున్నది. జబ్బు సంగతి ఎట్లా ఉన్నా ముందు అమ్మాయిని శుభ్రంగా ఉంచండి. ఆ తల చూడండి-దువ్వి జడ వేయండి. ఇది తరుణవ్యాధి కాదు. దీర్ఘవ్యాధి......"

-అని చెప్పి క్వినైన్ ఇంజక్షను యిచ్చారు. ఆయన అమ్మకు మలేరియా అని ఊహించాడు. కాని మలేరియా కాదు. కనుక అమ్మకు జబ్బేమీ తగ్గకపోగా రోజురోజుకూ పెరిగింది.

అమ్మ మామూలుగానే బాధపడసాగింది.

మన్నవ నుండి సీతాపతితాతగారూ, మరిడమ్మగారూ వచ్చారు.

అన్నపూర్ణమ్మగారికి అమ్మ జబ్బు ఏమీ అర్థంగాక ఆమె చందలూరు మహాలక్ష్మమ్మ వారిని ప్రశ్న అడిగితే ఏమయినా నివారణ మార్గం ఉపదేశిస్తారే మోనని భావించి సీతాపతితాతగారిని చందలూరు పంపించింది.

అమ్మ జడుసుకున్నదనీ, ఎల్లినీళ్ళు దాటిందనీ -చెప్పి తాయెత్తుయిచ్చారు.

సీతాపతితాతగారు వెనక్కు వచ్చి విషయం చెప్పారు.

"ఆ డాక్టరుగారి యింజక్షన్ ఎట్లా ఉన్నదో యీ ప్రశ్నకూడా అట్లాగే ఉన్నది" అని చిదంబరరావుగారు విసుక్కున్నారు.

కనకమ్మబామ్మ తాయెత్తు అందుకుని అమ్మకు కట్టి సాంబ్రాణిధూపం వేసింది.

"ఇన్ని చేస్తున్నారు కానీ తలశుభ్రం చేయమంటే చేయరేమిటి?" అని అడిగారు చిదంబరరావుగారు.

"ఏమి చేస్తాం? ఆ జుట్టు అలివి అయ్యేటట్లు లేదు. తలలో రెండంగుళాల ఎత్తున ఉన్నాయి. పేలు" అన్నది కనకమ్మ బామ్మ.

ఒకరోజు చిదంబరావుగారు కోర్టుకు వెళ్ళిన తరువాత అమ్మ తలజుట్టు

కత్తిరించి హారతికర్పూరమూ, కొబ్బరినూనె కలిపి రాశారు.

సరి అయిన వైద్యం లేకపోయినా ఒకనెలా పదిహేను రోజులు అమ్మ బాధపడిన తరువాత అమ్మకు జబ్బు నయమయింది. మరిడమ్మ తాతమ్మ చాలా ప్రేమతో, శ్రద్ధతో అమ్మకు పథ్యంచేసి పెడుతూ ఉన్నది.

మూడునెలల గడిచాయి. అమ్మ ఆరోగ్యం కొంచెం కుదుటపడింది. జుట్టుకూడా తిరిగి పెరుగుతున్నది.

ఒకనాడు సీతాపతితాతగారు మన్నవ బయలుదేరగా-

"ఇంకా కొన్నాళ్ళు అమ్మాయికి మందులూ, టానిక్కులూ వాడితే బాగుంటుంది." అన్నారు చిదంబరరావుగారు

"ఔను" అన్నారు సీతాపతిగారు నిర్లిప్తంగా.

"మరి" యింకేమీ అనలేకపోయారు చిదంబరరావుగారు. కాని వారి ఉద్దేశం గ్రహించి సీతాపతితాతగారు "దాని గాజులు అమ్మి వాడండి-" అని చెప్పి వెళ్ళిపోయారు.

అమ్మ ఆ సలహా అప్పుడే విన్నా అప్పటికి మౌనంగా ఉండి మరునాడు చిదంబరరావుగారి దగ్గరకుచేరి లాలనగా-

"తాతగారూ-మానాన్న ఊరికి వెళ్ళేటప్పుడు మీరు అడిగారు. ఏమిటి?" అని అడిగింది.

"ఏమీ లేదమ్మా" అని తాతగారు తటపటాయించినా అమ్మ "నేను విన్నానులే తాతగారూ" అనే సరికి "మరి నీకు తెలియని దేమున్నదమ్మా?" అన్నారు బాధగానే.

"అవును లెండి నా కోసం ఎవరు చేయాలన్నా ఏమి చేయాలన్నా ప్రస్తుతం యిది తప్పదుగా. కాని మీ మీద మాట పడకుండా జాగ్రత్తగా ముందుగానే సలహా తీసుకున్నారు. మీరు ప్లీడరుకదా. మీ ఉద్దేశమూ అదే అయినా మీరు నేర్పుగా ఆయనను బయటపడేశారు. మీ ఎత్తుల ముందు వారెంత? అయినా మీ వృత్తితీరే అంతగదా!"

చిదంబరరావుగారు పకపకా నవ్వి-

"మీ వాళ్ళు ఎంత చేసినా వాళ్ళమీద అభిమానం పోదుగదా-" అన్నారు.

"నాకు ఎవరిమీదా దురభిమానం లేదు..........."

అభిమానమూ - దురభిమానమూ అన్న అంశంపై చిదంబరరావుగారు అమ్మతో చర్చచేద్దామని ఆలోచిస్తుండగానే - చీరాల నుండి అమ్మ పినతల్లి శేషమ్మగారి భర్త నారాయణరావుగారు వచ్చారు.

కాళ్ళు కడుక్కుని మంచినీళ్ళు త్రాగి కుర్చీలో కూర్చొని అమ్మను దగ్గరకు పిలిచి చిదంబరరావుగారితో-

"అనసూయను తీసుకురమ్మని మీ అమ్మాయి నన్ను పంపింది" అన్నారు.

"అమ్మాయి యిప్పుడిప్పుడే కొంచెం కోలుకుంటున్నది. ఇంకా బలానికి మందులు యిప్పించాలి" అన్నారు చిదంబరరావుగారు, అమ్మను వదిలి ఉండవలసి వస్తుంటేమోనన్న దిగులుతో.

"ఆ మందులు అక్కడనే యిప్పిస్తాము లెండి"-

ఇక అడ్డు ఏమి చెప్పటానికి తోచక-

"సరే - మరిడమ్మ పిన్నితో చెప్పి అమ్మాయి వస్తానంటే తీసుకు వెళ్ళండి... అయితే నాలుగు రోజుల్లో వెంటనే పంపించండి-"

నారాయణరావుగారు ఏమీ మాట్లాడక పోయేసరికి మళ్ళీ చిదంబర రావుగారే-

"పంపించకపోతే అమ్మాయి దిగులు పడుతుంది" అన్నారు.

"అమ్మాయి దిగులుపడుతుందా? అమ్మాయికోసం మీరు దిగులుపడతారా?" అని నవ్వారు నారాయణరావుగారు.

"ఏదయినా ఒకటేలే..." అని చిదంబరరావుగారూ నవ్వారు.

నారాయణరావుగారు లోపలకు వెళ్ళి అన్నపూర్ణమ్మగారినీ, కనకమ్మ బామ్మనూ, మరిడమ్మతాతమ్మనూ అందరినీ అడిగారు-అనసూయను చీరాల తీసుకువెళ్ళుతానని.

"దానికి చేసుకుపెట్టుకోవటానికి నేను కూడా రావలసివస్తుంది నాయనా-" అన్నది మరిడమ్మగారు.

"అంతకంటే కావలసిన దేమున్నది? ఆ మనుమరాలి దగ్గర కూడా నాలుగు రోజులు ఉన్నవారవుతారు. మా అందరికీ కూడా చేసిపెట్టవచ్చు. మీరు కూడా తప్పకరండి"- అని బతిమాలేరు నారాయణరావుగారు.

"సరే. అట్లాగే వస్తాలే నాయనా-" అని మరిడమ్మగారు తన అంగీకారం వ్యక్తం చేసింది.

"మరి ఆలస్యమెందుకూ? గుడ్డలు సర్దుకొనండి-" అంటూ అమ్మను దగ్గరకు తీసుకుని-

"చాలా పిచ్చిరూపమైపోయింది. జుట్టు తీశారేమిటి?" అని అడిగారు నారాయణరావుగారు.

"ఏమి చేసేది? జుట్టు అట్ల కట్టుకుని అలవికాలేదు" అన్నది కనకమ్మబామ్మ.

"జబ్బు పడ్డప్పుడు జుట్టు చిక్కుపడకుండా ఉంటుందా? చిన్నపిల్ల కాబట్టి సరిపోయింది. పెద్దవాళ్ళకు జబ్బుచేస్తే కత్తిరిస్తారా?" అన్నారు నారాయణ రావుగారు నొచ్చుకుంటూ.

"చేస్తే తెలుస్తుంది. మాటలు చెప్పటం కాదు" అని కనకమ్మబామ్మ విసుక్కున్నది.

"జరిగిపోయిన దానికి ఘర్షణ ఎందుకూ?" అని మరిడమ్మగారు సర్ది వేసింది.

అమ్మ చిదంబరరావుగారి దగ్గరకు వెళ్ళి-

"తాతగారూ-వాళ్ళు మందులు కొనివ్వటమెందుకూ, నేను తీసుకోవట మేమిటి? చేసే పని చేసి మీరే కొనివ్వండి- తీసుకువెళ్ళి త్రాగుతాను అన్నది.

చిందబరరావుగారికి యీ విషయాలు అమ్మకు చెప్పటమూ, అమ్మతో ఆలోచించటమూ యిష్టంలేదు కానీ తప్పని సరిగా-

"మీ అమ్మ నాచేతికి తొమ్మిది సవర్ల బంగారం యిచ్చింది. ఆ పైకం కొంత మీ నాన్న ఔపోసనకూ వగైరాలకు వాడాను. ఇంకా అందులో కొంత పైకం ఉన్నది. అది సర్దుతానులే" అని వివరించారు.

"అది ఉంటే సరి. లేకపోతే మా నాన్న చెప్పినట్లు చేయండి. నాకు యివేమీ ఉండాలని లేదు" అన్నది అమ్మ.

"నీ కోసం కాదమ్మా, మా కోసం".

"ఎవరికోసం ఎవరు చేసినా జరుగవలసిన పద్ధతి ఒకటేగా."

చిదంబరరావుగారు ఆనాడే వెంటనే బజారుకు వెళ్ళి మందులు కొని తెచ్చినా మరునాడు ఉదయం కానీ చీరాల ప్రయాణం సాగలేదు.

నారాయణరావుగారు, మరిడమ్మగారూ, అమ్మా- ముగ్గురూ కలిసి చీరాల వెళ్ళారు. అమ్మను చూడగానే అమ్మ పినతల్లి, శేషమ్మగారికి దుఃఖం పెల్లుబికింది.

వెంటనే అమ్మను కౌగిలించుకుని చంకన వేసుకుని వంటయింటిలోకి తీసుకువెళ్ళి పీటవేసి కూర్చోబెట్టి తాను కుంపటి రాజేసి కాఫీపెట్టే ప్రయత్నం ప్రారంభించింది.

మరిడమ్మగారు తానే దొడ్లోకి వెళ్ళి కాళ్ళూ చేతులూ కడుక్కుని లోపలకు వచ్చి-

"ఇదంతా ఏమిటి" అని అడిగింది కుంపటిని చూస్తూ.

"అమ్మాయికి కాఫీ పెడుతున్నాను" అన్నది శేషమ్మ గారు.

"నాకు వద్దు. అలవాటు లేదు" అన్నది అమ్మ.

"త్వరగా అన్నమే వండి పెట్టడం మంచిది" అన్నది మరిడమ్మగారు.

ఆనాటికి శేషమ్మగారే వండిపెట్టినా మరునాటినుంచీ మరిడమ్మగారే అందరికీ వండిపెట్టింది. నాలుగురోజుల్లో తిరిగి వెళుదా మనుకున్నా పదిరోజులు గడిచాయి.

తిరిగి బాపట్ల వద్దామని అనుకుంటూ ఉండగా యింటి పక్కవారు వచ్చి మౌనస్వామివారిని గురించి మరిడమ్మ తాతమ్మతో చెప్పారు. ఆ మధ్యాహ్నమే గుఱ్ఱపుబండి కట్టించుకుని నూనె పానకాలుగారి తోటకు వెళ్ళారు. అక్కడ స్వామివారు విడిది చేశారు.

స్వామివారిచుట్టూ అనేకులు ఉపవిష్టులై ఉన్నారు. స్వామివారేకాక అందరూ మౌనంగా కూర్చున్నారు. తాతమ్మగారు కూడా వారితోబాటు కొంచెంసేపు మౌనంగా కూర్చుని తిరిగి వచ్చింది.

మరునాడు కూడా అమ్మ అక్కడకు బయలుదేరింది. తొమ్మిది గంటలకు బయలుదేరినా అమ్మ అక్కడకు చేరేసరికి పదకొండు గంటలయింది. అందరూ అప్పడే భోజనాలకు వెళ్లటానికి సిద్ధంగా ఉన్నారు. ఆ ఉన్నవారిలో పిల్లలు కూడా చాలామంది ఉన్నారు.

బందా ఆదినారాయణగారు వెండిగిన్నెతో స్వామి వారికి పంచామృతాలు అందించి అక్కడున్న వారందరినీ బయటకు వెళ్లమని గదిమారు. పెద్దవాళ్ళు ఆ మాట ననుసరించినా పిల్లలెవ్వరూ అక్కడనుండి కదలలేదు.

నూనె పానకాలుగారి భార్యకు పిల్లలు లేకపోవటంతో పిల్లలకు ఎల్లప్పడూ ఏవో ప్రసాదాలు పంచుతూనే ఉంటుంది. అందువల్ల ఎవరూ అక్కడనుండి కదలలేదు.

చీరాల వెంకట్రావుగారు బెత్తం తీసుకుని పిల్లలను బెదిరించారు, వెళ్లమని. కొందరు భయపడి వెళ్లినా కొందరిలో ఏమాత్రమూ చలనం లేదు. నిలుచున్న వారిలో ముందువరసలోనే అమ్మ కూడా ఉన్నది.

"ఏ అమ్మాయ్ - మొద్దులా నిలుచున్నావు. కదలవేం?" అని వెంకట్రావుగారు అరిచారు.

జవాబేమీ యివ్వకుండా అమ్మ తలవంచుకుని నిలుచునే ఉన్నది.

"ఎన్నిసార్లు చెప్పినా కదలవేమి?" అని వెంకట్రావుగారు అమ్మ వీపుమీద బెత్తంతో ఒక దెబ్బ కొట్టారు.

అమ్మ తనను కాదు కొట్టింది అన్నట్లే నిశ్చలంగా నిలుచుని ఉన్నది. మరి ఆ దెబ్బ అమ్మకు తగలలేదా?

అంతలో హఠాత్తుగా అటు వచ్చిన నూనె పానకాలు గారు అది చూచి గబగబా అక్కడకు వచ్చి--

"అయ్యో... అయ్యో... చిన్నపిల్లను ఎంత దెబ్బకొట్టారు?" అంటూ అమ్మ వీపు చూచారు. వీపుమీద వెంటనే బెత్తంచార పొంగి ఉన్నది.

కానీ అమ్మ మాత్రం ఏమీ మాట్లాడలేదు.

పానకాలుగారు వెంకట్రావుగారినీ పిల్లలనూ మందలించి ఆయన దారిన

ఆయన వెళ్ళారు. అందరూ కూడా భోజనాలకు వెళ్ళిపోయారు.

అమ్మ దొడ్డివాకిలిన మెల్లగా లోపలకు అడుగుపెట్టింది.

మౌనస్వామివారు అమ్మను చూచారు. చుట్టూ చూచారు. ఎవరూ కనుపించలేదు.

"వాకిట్లో ఎవరూ లేరా?" రహస్యంగా అమ్మను అడిగారు.

"ఉహూఁ"

"దగ్గరకు రా-"

అమ్మ స్వామివారి దగ్గరకు వెళ్ళి మౌనంగా నిలుచున్నది.

క్షణాలు గడిచాయి.

"స్వామీ-మౌనం అంటే ఏమిటీ?" అమ్మ ప్రశ్నించింది.

"అనవసరమయిన మాటలు మాట్లాడకుండా ఉండటానికి యీ మౌనం ఆధారం."

"మీరు మన్నవలో వేసిన యంత్రం రాజరాజేశ్వరా? రాజ్యలక్ష్మా?"

"ఆ సందేహం నీ కెందుకు కలిగిందమ్మా?"

"ఆ ఊళ్ళో అనుకుంటున్నారు - ఒకరు రాజ్యలక్ష్మి అనీ, ఒకరు రాజేశ్వరి అనీ."

"రాజరాజేశ్వరీ యంత్రమే."

"మీరు అసలు మాట్లాడుతారో, మాట్లాడరో అనుకుంటూ వచ్చాను."

"నిన్ను చూడగానే మాట్లాడాలి- అనిపించిందమ్మా. ఇంకొకటి కూడా - నీ ముఖంలో నేనెన్నడూ చూడని శాంతి దేదీప్యమానంగా కనుపిస్తున్నదమ్మా. నేను ఎవరికీ చెప్పను కానీ...."

"అది సరేకానీ మీరు అందరికీ బాలమంత్రం యిస్తూ ఉంటారా?"

"నీ రాకను చాలా రహస్యంగా దాచుకుంటాను. నీవుకూడా అట్లాగే ఉంచు నీతో మాట్లాడినట్లు తెలిస్తే వీరంతా నా ప్రాణాలు తీస్తారు. నేను మౌనం ప్రత్యేక

సాధనగా పెట్టుకోలేదు. కొన్ని అవసరాలు మౌన వత్రాన్ని ప్రోత్సహించాయి."

స్వామి వారి అభ్యర్థనను పట్టించుకొనకుండానే అమ్మ,

"మీరు బాల చెప్పినవారందరికీ నేను అజపం చెబుతాను" అన్నది.

అమ్మను ఆనందంగా చూస్తూ, అమ్మ మాటలను ఆశ్చర్యంగా వింటూ

"ధన్యోస్మి.....ధన్యోస్మి......" అని జపమాల అటునుండి యిటూ యిటునుండి అటూ అనాలోచితంగా త్రిప్పతూ-

"అజపమంటే ఏమిటమ్మా" అని అడిగారు.

"నోటితో ఉచ్చరించనిది."

"అటువంటి దానిని ఎట్లా చెబుతావు?"

"చెప్పటమంటూ వచ్చినప్పడు మాటలతో చెప్పినా చేసేటప్పడు మాటలు లేకుండా చేసేది" .

అంతలో ఎవరిదో నడక చప్పడయింది.

"వెళ్లమ్మా.......వెళ్ళు-" అని స్వామివారు అమ్మను త్వరపెట్టారు.

"ఎందుకూ వెళ్లటం? నన్నేమయినా అంటారనా? మిమ్మల్నే మయినా అంటారనా?" అని అడిగింది అమ్మ.

ఆ ప్రశ్నకు సత్యమయిన సమాధానం చెప్పటానికి సిగ్గుపడి-

"ఎవరూ ఎవరినీ ఏమీ అనరు. నా నిష్ఠకు భంగం వస్తుందని..."

"నిష్ఠ అంటే ఏమిటి స్వామీ?"

"అది నీకేమి తెలుస్తుందమ్మా?

"నిష్ఠదరిద్రులు-అంటారే, అదేనా?" అన్నది అమ్మ గంభీరంగా-

"ఛీ.....ఛీ....."

"మరి మీరు చెప్పనన్నా చెప్పాలి. నేను చెప్పిందన్నా ఒప్పకోవాలి."

స్వామివారు ఒక నిమిషం ఆలోచించి-

"నిష్ఠ అంటే అనుష్ఠానం" అన్నారు.

"అంటే అనుష్ఠాన దరిద్రులా?"

ఆ ప్రశ్న విని ఆ స్వామివారు అమ్మముఖంలో దీప్తి మంతంగా వెలిగే జ్వాలను, మనస్సులోని అమాయకత్వాన్ని సమన్వయం చేసుకోవటానికి ప్రయత్నిస్తుండగా- బందా ఆదినారాయణగారు వచ్చి తలుపు కొట్టారు. స్వామి వారు మామూలుగా ఎప్పుడూ తలుపు లోపల గడియ పెట్టుకొనరు. కాని ఆనాడు తలుపులు తెరుచు కోవటంలో జరిగిన విలంబనానికి ఆయన ఆశ్చర్యపోయారు.

అంతలో అమ్మ దొడ్డివాకిలిగుండా నిష్క్రమించింది. స్వామివారు తలుపులు తెరిచారు.

అమ్మ సరాసరి యింటికి వచ్చింది.

"ఇంతసేపూ ఎక్కడికి వెళ్ళావు? ఇవ్వాళ ఉదయం నుంచీ అన్నం కూడా తినలేదు" అన్నది శేషమ్మగారు.

"మౌనస్వామిని చూద్దామని వెళ్ళాను. అక్కడ ఆలస్యమయినది."

"ఇంత బలహీనంగా ఉన్నావు. ఎట్లా నడిచావు?"

"ఒకపాదం వేస్తూ ఒకపాదం తీస్తూ వెళ్ళాను."

"అంతదూరం నడిచావా?" శేషమ్మగారు ఆశ్చర్యపోయింది.

"నడిచాను"

"తాతమ్మ నీ కోసం కనిపెట్టుకుని కూర్చుని కూర్చుని యిప్పుడే పడుకున్నది."

"భోజనం చేసి పడుకున్నదా?"

"ఆ అందరమూ చేశాము."

"నేనూ తినే వచ్చాను."

"నీ కెవరు పెట్టారమ్మా అక్కడ?":

"పెట్టకలిగిన వారే పెట్టారు. తినగలిగిన వారే తిన్నారు."

అంతలో మరిడమ్మగారు లేచి-

"అయ్యో - ఎక్కడికి వెళ్ళావమ్మా? నీకు సరిగా ఆహారం అందదని నేను

రావటమేమిటి? నీవు ఎక్కడికో చెప్పకుండా వెళ్ళితివి! మీ బాబాయి పోలీసులను పెట్టి వెతికిస్తానన్నాడు.. ఎక్కడకు వెళ్ళా వేమిటి?" అని అడిగింది.

"ఏమీ లేదు. నిన్న మనం వెళ్ళినచోటికే యివ్వాళా వెళ్ళాలనిపించింది, వెళ్ళాను. ఇంతసేపూ కూర్చుందామని అనిపించింది, కూర్చున్నాను."

"అన్నమయినా తిని పోగూడదూ?"

"ఇప్పుడు పెట్టరాదూ, తింటాను."

విస్తరి వేసి తాతమ్మ అన్నం పెట్టింది. అన్నం తింటూ ప్రయాణం ఎప్పుడని అమ్మ అడిగింది. మరునాడని తాతమ్మ చెప్పింది.

ఆనాడు శేషమ్మగారు అమ్మకు తలంటిపోసి క్రొత్త పరికిణీ, చొక్కా తొడిగింది. పూరీలు చేసి మరిడమ్మగారినీ, అమ్మనూ పిలిచింది పెట్టేందుకు.

"పిన్నీ - నాకు పెట్టేబదులు ఆ విస్తళ్ళలో ఏరుకుతింటారే వాళ్ళకు పెట్టరాదూ? వాళ్ళకు ఏనాడూ విస్తళ్ళలో యిటువంటి పదార్థాలు దొరకవు గదా. మనం ఎప్పుడయినా తిన వచ్చును" అన్నది అమ్మ జాలిగా.

"ఇంట్లో వాళ్ళకే చాలటం లేదు. వాళ్ళదాకా ఎక్కడ?"

"పోనీ మనతోబాటు వాళ్ళను కూడా లెక్కవేసుకు చేస్తే- మన యింట్లో యింకో నలుగురు ఉంటే మనం వాళ్ళకు కూడా సరిపడేటట్లు చేసుకోమూ?"

"మీ బాబాయి సంపాదన ఎంతమందికి సరిపోతుంది అనుకుంటున్నా వేమిటి?"

"అయితే - నాకు పెట్టండి. అవి నేను వాళ్ళకు పెట్టుకుంటాను."

"ముందు నువ్వు తినమ్మా. తరువాత వాళ్ళ విషయం చూద్దాము"

"వాళ్ళు తింటే నేను తిన్నట్లే పిన్నీ. ముందు వాళ్ళు తింటే తరువాత నా విషయం చూడవచ్చునులే-"

"అట్లాకాదులే మా అమ్మ మంచిది. చెప్పినమాట వింటుంది. ముందు ఇవి నువ్వు తినమ్మా..." అని శేషమ్మగారు రెండు పూరీలు అమ్మ చేతికి అందించింది.

"నాకు కడుపులో ఏమిటో నిండుగా ఉన్నది పిన్నీ, ఏమి తినాలని

అనిపించటంలేదు. పైగా కడుపులో నొప్పిగా కూడా ఉన్నది" అని పూరీలను పట్టుకుని లేచింది.

శేషమ్మగారు యింకేమీ మాట్లాడలేక యింకా నాలుగు పూరీలు అమ్మ చేతిలో పెట్టింది. అమ్మ సంతోషంగా గంతులు వేసుకుంటూ వెళ్ళి వాటిని యానాదులకు పెట్టి, యింట్లో ఉన్న తన చొక్కా, పరికిణీ కూడా తీసుకువెళ్ళి యిచ్చి వారు ఆ పూరీలు తింటూ ఉంటే వారి కళ్ళల్లో మెరిసే కృతజ్ఞతా పూర్వకమైన తృప్తినీ ఆనందాన్ని చూచి తాను కూడా మురిసిపోయింది.

50. ఆత్మదర్శనం

ఆ మరునాటి ఉదయమే మరిడమ్మ, తాతమ్మా అమ్మా బాపట్ల వచ్చినా ఒకరోజు మాత్రమే అక్కడ ఉండి మన్నవ వెళ్ళారు.

అక్కడకు వెళ్ళిన రెండు రోజులకే సుబ్బాయమ్మగారు పరమపదించినట్లు వార్త తెలిసింది.

సుబ్బాయమ్మగారు చేబ్రోలు వాస్తవ్యురాలు. బాల వితంతువు. చాలా తెలివయినది. సంస్కృత పండితురాలు. చిదంబరరావుగారికి చదువు చెప్పించుకుంటూ మరిడమ్మగారు గుంటూరులో ఉండగా, గుంటూరులోని తమ బంధువుల యింటికి వస్తూపోతూ ఉండేది సుబ్బాయమ్మగారు. ఇద్దరూ, జ్ఞాని అయిన మల్లెల రత్తమ్మగారివద్ద మంత్రోపదేశం పొందారు.

సుబ్బాయమ్మగారు కూడా సన్యాసినియై అనేకులకు మంత్ర ప్రదానం చేసింది. చిదంబరరావుగారి భార్య అన్నపూర్ణమ్మగారు కూడా ఆమె శిష్యురాలు. అందు వలన సుబ్బాయమ్మగారు తరుచుగా బాపట్ల వచ్చి వెళుతూ అక్కడనే ఉండే అమ్మను చాలా ప్రేమతోనూ, సానుభూతితోను చూచేది.

ఆ విషాదవార్త తెలియగానే మరిడమ్మగారు చేబ్రోలు బయలుదేరింది. అమ్మ తాను కూడా వస్తానన్నది.

"వద్దులే అమ్మా-తిరిగి తిరిగి వచ్చాము. నీకు ఆరోగ్యం కూడా సరిగా లేదు" అని వారించింది మరిడమ్మగారు.

కాని అమ్మ అంగీకరించలేదు.

"మీ పిన్ని చిన్నది- చేసుకోవటం చేతకాదు. ఇంటి దగ్గర ఉండమ్మా-" మరిడమ్మగారు బతిమాలింది.

"నేను ఉండి మాత్రం ఏమి చేస్తాను? అయినా సుబ్బాయమ్మగారికి నేనంటే చాలా ప్రేమ. అదీగాక ఆరాధన అంటే ఏమిటో చూస్తాను" అన్నది అమ్మ.

"అయితే మీ నాన్నను అడుగుదాము. ఏమంటాడో" అని సీతాపతిగారిని పిలిచి కబురు చెప్పి-

"నేను వెళుతున్నాను" అన్నది.

"అయితే అమ్మాయిని కూడా తీసుకువెళ్ళు-" అన్నారు సీతాపతి తాతగారు.

"కామేశ్వరికి తోడుగా ఉంటుందిగదా అని అమ్మాయిని ఉంచుదామనుకున్నాను. అమ్మాయి వస్తాననే అన్నది. నేను ఉంచి వెళదామనుకున్నాను" అన్నది తాతమ్మ.

"సరే. అమ్మాయి యిష్టం. వస్తానంటే తీసుకువెళ్ళు ఉంటానంటే ఉంచి వెళ్ళు - అన్నారు తాతగారు.

తాతగారి సమాధానంలోని ఉపేక్షతో తాతమ్మగారికి బాధ కలిగి అమ్మను పిలిచి-

"మరి, నీవు వచ్చేటట్లయితే నడవ గలుగుదువా?" అని అడిగింది.

"నడుస్తాను."

మరునాడు ఉదయం ఎనిమిది గంటలకే భోజనంచేసి తాతమ్మా, అమ్మా కాలినడకన బయలుదేరారు. తాతమ్మ వంగిన నడుముతో, ఒక చంకన గుడ్డలమూటతో, చేతిలో కఱ్ఱ ఆధారంతో ముందు నడుస్తుంటే అమ్మ చిట్టి చిట్టి అడుగులు వేస్తూ వెనుకనే సాగింది.

దారిలో కాలవలనూ, కట్టలనూ, చెరువులనూ, చెట్లనూ పైర్లనూ, పిట్టలనూ..... అన్నిటినీ చూస్తుంటే అమ్మకు అన్నిటిలో తన ప్రతిరూపమే కనుపించింది.

"అయితే యివన్నీ నేనేనా?' అని అమ్మ ప్రశ్నించుకుని-

"అవును యివన్నీ నేనే" అని తనకు తానే సమాధానం చెప్పకుని............

"మరి యిన్నిగా కనుపిస్తున్న దేమిటి?" అని మళ్ళీ తనను తానే ప్రశ్నించుకుని-

"ఒక్కటే యిన్ని అయింది కనుక" అని మళ్ళీ సమాధానం చెప్పకుని ముందుకు నడిచింది అమ్మ.

అమ్మ అడుగులు ముందుకు వేస్తున్నకొలదీ "ఇదంతా నేనే. ఈ కనుపించేదంతా నేనే" అనే భావం స్థిరమై బయట తాను చూచే సర్వమూ తనలోనే దృశ్యమానమయ్యే సరికి అమ్మ ప్రకృతితో తాదాత్మ్యం చెందుతూ, ఆనందంతో తన్మయమవుతూ మెల్లగా నడుస్తూ ఉన్నది.

మరిడమ్మ తాతమ్మ చాలా ముందుకు వెళ్ళి వెనక్కు చూచింది. అమ్మ

ఎక్కడో దూరంలో ఉన్నది. తాతమ్మ ఆగిపోయింది.

అమ్మ సమీపించింది.

తాతమ్మ అమ్మ చెయ్యిపట్టుకున్నది. అమ్మ నిలుచున్నది. అమ్మ నడకలో, చూపులో ఏదో అలౌకికతను తాతమ్మ స్పష్టంగా గమనించింది. అమ్మ కందోయి ఆర్ద్రమై పెదవులు దరహాసభాసురమై ఉన్నాయి.

తాతమ్మ అమ్మను పలుకరించింది. అమ్మలో ప్రతిధ్వనిలేదు.

తాతమ్మకు కూడా అమ్మను చూస్తున్నకొలదీ తనలో తనకే అకారణంగా ఆనందం తరంగితమవుతున్నట్లు అనుభూతమయింది.

కాని తాతమ్మ మాత్రం ముందుకువెళ్ళి దగ్గరలోకే వచ్చిన కొల్లిమర్ల లాకులదగ్గర విచారించి చేబ్రోలు వెళ్ళే పడవ అంతకు ముందే వెళ్ళిపోయిందని తెలుసుకొని అలసటతో నిరాశతో ఆ కాలవగట్టుననే ఉన్న చెట్టునీడన కూర్చున్నది.

అమ్మ కూడా మెల్లగా వచ్చి తాతమ్మ ప్రక్కనే ఆసీనురాలయింది.

కాలవలో ఒక పడవ లంగరువేసి ఉన్నది.

"దానిలో వెళదామా, తాతమ్మా-" అని అమ్మ అడిగింది.

తాతమ్మ వెళ్ళి కనుక్కున్నది. అది క్రొత్తదట. అంత వరకూ ప్రారంభోత్సవ మయినా కాలేదట. ఎక్కడకూ వెళ్ళదట.

ఇద్దరూ అక్కడనే కూర్చున్నారు.

పది నిమిషాలు గడిచాయి.

పడవమనిషి కేకవేశాడు "అమ్మాయి-మీరు ఏ ఊరువెళతా?" రని.

"చేబ్రోలు వెళ్ళాలనుకుంటున్నాము."

"మా పడవ చేబ్రోలు వెళుతున్నది. ఇదే మొదలు బోణీ కొడుదువు. రా-"

అప్పుడే ఒక మనిషి వచ్చి ఆ పడవయజమాని ఆజ్ఞను అందించాడు. అది ఆ పూట నుండే పని ప్రారంభిస్తుందట.

తాతమ్మ వింటున్నది కానీ లేవలేక పడుకున్నది.

అమ్మ అడిగింది- "నేను యెక్కితేనే బోణీయా, ఎవరు యెక్కినా బోణీయేనా?"

"ఎవరెక్కినా బోణీయే ననుకో. ఎక్కేవాళ్ళూ చాలా మంది ఉన్నారు. కాని నీవు ఎక్కితేనే బాగుంటుందమ్మా." అన్నాడు సరంగు.

"ఎందువలన?" అమ్మ అడిగింది.

అతను ఆలోచించాడు. అతని కేమీ కారణం కనుపించలేదు. అందువలననే "ఏమో" అన్నాడు.

అమ్మ తాతమ్మను పిలిచి "పడవ మనిషి పిలుస్తున్నా"డని చెప్పి "వెళదామా" అని అడిగింది.

"ఏదో ఒకరకంగా చేబ్రోలు చేరితే సరి" అని తాతమ్మ లేచి బయలుదేరింది.

ఇద్దరూ ఆ క్రొత్త పడవలో చేబ్రోలు వంతెన దగ్గరకు చేరి అక్కడ దిగి మెల్లగా నడిచి ఆ రాత్రి ఎనిమిదిన్నరకు యిల్లు చేరుకున్నారు.

మరిడమ్మ తాతమ్మ యింట్లోకి వెళ్ళింది. శోకాకృతి దాలిచి సుబ్బాయమ్మగారి తల్లి కనుపించింది. అంత తెలిసిన మరిడమ్మగారు ఆమెను కౌగలించుకుని వలవలా శోకించింది.

సుబ్బాయమ్మగారి అక్క సుందరమ్మగారు "ఇంతమంది పెద్దవారు ఉండగా అందరికంటే చిన్నదీ, ఎందరో కావాలనుకునేది దాటిపోయింది" అని వాపోయింది.

అంతలో హైదరాబాద్ నుండి చిన్నమ్మాయిగారు వచ్చింది. ఆమె సుబ్బాయమ్మగారి శిష్యురాలు. గురువు గారి ప్రాణోత్క్రమణ సమయంలో దగ్గరలేక పోయాననే విచారంతో సుబ్బాయమ్మగారి ఫోటోముందు కూర్చుని ప్రార్థన చేస్తూ ఏడుస్తూ ఉన్నది. కనుల వెంట నీరు కారుతూనే ఉన్నది.

సుబ్బాయమ్మగారికి యింకొక శిష్యురాలు ఉన్నది. ఆమె పేరు హను మాయమ్మ. ఆమె అనేక పర్యాయాలు ప్రసంగ వశాత్తూ సుబ్బాయమ్మగారికి ఆమె చనిపోతే తానూ మరణిస్తాననీ తాను గురువుగారిని అనుసరిస్తాననీ వాగ్దానం చేసింది.

ఆనాడు సుబ్బాయమ్మగారు పోతుందన్న మాట హనుమాయమ్మగారు విన్నది, పోయిందనే అనుకున్నది. గబగబా పరుగెత్తింది. దారిలోనే పడిపోయింది. సునాయసంగా ప్రాణం వదలింది.

సుబ్బాయమ్మగారి చుట్టూ అనేకులు ఉన్నారు. అందరూ ఆ కేక విన్నారు కానీ ఎవరూ అక్కడ నుండి కదలలేదు.

సుబ్బాయమ్మ విన్నది కానీ మాట పడిపోయినందు వలన సంజ్ఞ ద్వారా హనుమాయమ్మగారిని చూచి రమ్మని చెప్పింది.

వారందరూ అటు వెళ్ళారు. సుబ్బాయమ్మగారూ ప్రాణం వదలింది.

అక్కడ చేరిన అందరూ ఆ విచిత్ర సంఘటనకు విస్మితులయి హనుమాయమ్మగారిని ఉద్దేశించి-

"నీ మాట చెల్లించుకున్నావు. ఎంత ధన్యురాలివే-" అనుకున్నారు.

చిన్నమ్మాయిగారు పదిహేనుగంటలు శోక సమాధిలో ఉన్న తరువాత బాహ్యలోకంలోకి అరుదెంచి కళ్ళు తెరిచే సరికి ఎదురుగా ఎందరో ఉన్నారు. మరీ ఎట్టయెదుట దీపారాధన కుందిలో చమురుపోస్తూ అమ్మ కనుపించింది. అమాంతం అమ్మను కౌగిలించుకుని-

"నాకు చెప్పకుండా పోయినావా? నన్ను వదిలిపెట్టి పోయినావా?" అని విలపించింది.

అందరూ అమ్మను చాలా ఆసక్తితో తిలకించారు.

సీతాయమ్మగారు సుబ్బాయమ్మగారితో పాటు సాధన చేసిన మనిషి. ఆమెను ఉగ్రతపస్విని అనవచ్చును. ఆమె 12 సంవత్సరాలు భూగర్భంలో ఉండి తపస్సు చేసిందని చెప్పకుండేవారు కాని ఆమెకు క్షుద్రమంత్రాలయందు ఆసక్తి అధికం. కోపం మెండు. చీటికీ మాటికీ అందరినీ కనులెఱ్ఱకేసి కసురుతూ ఉండేది.

ఇప్పుడూ ఆమెముఖం వెంటనే ఎఱ్ఱబారింది. పెదవులు వణికాయి.

"నా శక్తి చేత సుబ్బాయమ్మగారిని యిక్కడ స్థాపించాను. అంటే యీ అమ్మాయి కూర్చొన్న చోటనే కూర్చోబెట్టటంతో ఆమె యీ అమ్మాయినే కౌగిలించుకున్నది. కాని చిన్నామ్మాయికి సుబ్బాయమ్మే కనుపిస్తున్నది" అన్నది సీతాయమ్మగారు. ఆమె కంఠంలో యీర్ష్యాసూయలు స్పష్టంగా ధ్వనించాయి.

"అటువంటప్పుడు నన్ను కౌగిలించుకున్నా ఆ స్పర్శ నాకు తగలకూడదుగా?" అమ్మ సన్నని గొంతులో అడిగింది.

వెంటనే సుబ్బాయమ్మగారి మరో శిష్యురాలయిన వరలక్ష్మమ్మగారు-

"నిజంగా మీరే కనుపరచేటట్లయితే, మీకే ఆ శక్తి ఉంటే మా అందరికి కూడా కనపర్చవచ్చును గదా. ఆ శరీరం కోసమే గదా మా యీ దుఃఖమంతా" అన్నది నిష్ఠురంగా.

సీతాయమ్మగారికి కోపం తారస్థాయి నందుకున్నది.

"అందరూ నోళ్ళుమూయండి-" అని ఆమె అరచింది.

అసలే అక్కడ అందరకూ సీతాయమ్మగారు ఏదో ప్రయోగం చేసినందువల్ల సుబ్బాయమ్మగారు హఠాన్మరణానికి గురి అయిందని ఒక అభిప్రాయం కలిగింది-అది ఋజువు పరచటానికి వీలుకలగకపోయినా అందువలన సీతాయమ్మగారు ఏమి చెప్పినా ఎవరికీ సదభిప్రాయం కలగలేదు.

క్రమంగా అందరూ ఎవరి దారిన వారు వెళ్ళినా సీతాయమ్మగారూ, మరిడమ్మగారూ, చిన్నమ్మాయిగారూ, అమ్మ మాత్రం మిగిలారు.

అమ్మ మెల్లగా సీతాయమ్మగారిని సమీపించి-

"నేనొక సంగతి అడుగుతాను చెబుతారూ?" అని అడిగింది.

సీతాయమ్మగారు అంగీకారసూచనగా తలపంకించింది.

"నాలో ఆమెను ఆరోపణచేసి శక్తిపాతం చేసినప్పుడు 'నేను, నా శరీరం' అనేది గుర్తు లేకుండా ఉండాలి. అప్పుడు నేను ఎక్కడ ఉంటాను? ఎట్లా ఉంటాను?" అని అడిగింది అమ్మ.

"చిన్న పిల్లవు - నీ కేమి తెలుస్తుంది?"

అమ్మ మళ్ళీ ఏదో చెప్పటానికి ప్రయత్నించే సరికి సీతాయమ్మగారు-

"అరవకు కూర్చో" అని గదిమింది.

"మీకు ఎవరో క్షుద్రమంత్రగాళ్ళు కోపం అనే గ్రహాన్ని పంపకం చేసినట్టున్నారు."

సీతాయమ్మగారు భూతవైద్యురాలు కూడా. కనుక అమ్మ తనను వ్యంగ్యంగా అంటున్నదని గ్రహించి-

సీతాయమ్మగారు కళ్ళు పెద్దవి చేసి చూచింది.

అమ్మ నిర్భయంగా ప్రసంగం సాగించింది-

"అదీగాకపోతే ఎవరో క్షుద్రమంత్రగాళ్ళు చచ్చిపోయి మీకు పట్టి ఉంటారు. ఇది మీకు ఇక నయంకాదు. మిమ్మల్ని పీల్చి పిప్పి చేస్తుంది. దీనిని కుదర్చటం ఏ భూతవైద్యుల వల్లనూ కాదు. ఏ డాక్టర్ల వల్లనూకాదు. ఆగ్రహాన్ని నయం చేయాలంటే నిగ్రహం గలవాలి వల్లనే కావాలి. కోపదారులను శాంతమూర్తులే జయించాలి."

అమ్మమాటల్లో దాగిన వ్యంగ్యవైభవం ముందు సీతాయమ్మగారు అప్రతిభు రాలయింది.

"ఇవన్నీ తెలిసిన మాటలా? తెలియని మాటలా? ఆమెకు ఏమి అనటానికీ తోచక అన్నది.

"ఎవరివి?" అని అడిగింది అమ్మ.

"నీకు తలతిక్క ఎక్కువల్లే ఉన్నదే అమ్మాయి?"

"నాకున్న అన్నిపాళ్ళూ నా కంటే ఏ కొంచెమయినా ఎక్కువ ఉంటేకానీ నన్ను తెలుసుకోలేరు" అన్నది అమ్మ.

మరిడమ్మగారు వారి సంభాషణ విని భయపడి అమ్మను వారించింది.

"కాదు తాతమ్మా-ఈమె సంగతి ఏమిటో యివ్వాళ తేలుద్దాము" అన్నది అమ్మ నిశ్చయం ధ్వనించేటట్లు.

"నీ కెందుకమ్మా? ఆమె అసలే కోపదారి" అన్నది తాతమ్మ.

"అదే తాతమ్మా ఆమెలో ఉన్నదే అది. అది మినహా మరేమి లేదు" అన్నది అమ్మ సీతాయమ్మగారు వినేటట్లుగానే.

ఆ మాటలు విని సీతాయమ్మగారు కళ్ళు పెద్దవి చేసి చూచింది అమ్మవంక.

అమ్మకూడా కళ్ళు మరింత పెద్దవిచేసి చూచింది.

సీతాయమ్మగారు కన్ను ఆర్పకుండా చూచింది.

అమ్మకూడా అనిమేషంగా చూచింది.

సీతాయమ్మగారు విసుగుతోనూ, ఏమీ చేయలేకనూ అక్కడినుండి లేచి

వినవినా వెళ్ళిపోయింది.

"చూడమ్మా-ఆమెతో నీకెందుకూ?" అన్నది మందలిస్తున్నట్లుగానూ, లాలనగానూ, మరిడమ్మగారు.

"ఏమీ లేదు తాతమ్మా. నాతో నేనే ఆడుకుంటున్నాను" అన్నది అమ్మ చిరునవ్వుతో.

అంతలో చిన్నమ్మాయిగారు బాహ్యస్మరణలోకి వచ్చి బరువెక్కిన కనురెప్పల మాటుగా అందరినీ అవలోకిస్తూ మరిడమ్మగారిని చూచి నమస్కరించింది.

ఆ క్షణంనుండీ అక్కడ అందరికీ ఒక విషాదబంధుర లోకం నుండి ఆనందమయలోకం లోకి వచ్చినట్లుగానూ, ఏదో అనిర్వచనీయమైన హాయిని అనుభవిస్తున్నట్లుగానూ, ఉంది.

అందుకు కారణం మాత్రం ఎవరికీ అర్థం కాలేదు. అమ్మ కూడా నిజం వెల్లడి చేయలేదు.

51. తులసిచెట్టు

సుబ్బాయమ్మగారి సమాధి సన్నిధిలో నిత్యమూ సహస్ర నామార్చనా, నిరంతరమూ నామ సంకీర్తనా జరుగుతుంటాయి. రోజూ వెయ్యిమంది భోజనం చేస్తూ ఉంటారు.

పదవరోజు సాయంకాలం కొందరు అక్కడకు అతి చేరువలో శ్రీ లక్ష్మీకాంతా నందయోగివర్యుల అధ్వర్యంలో నడపబడుతున్న ఆనందాశ్రమం చూచేందుకు వెళ్లటానికి నిశ్చయించుకున్నారు.

కోపగ్రస్తురాలై ఆనాడు సీతాయమ్మగారు నిరాహారదీక్ష వహించింది.

అమ్మ ఆమె వద్దకు వెళ్ళి-

"ఏమమ్మా సన్యాసమ్మగారూ-ఆహారం తీసుకోకుండా పడుకున్నారూ?" అని అడిగింది.

సీతాయమ్మగారు చికాకుగా "నేను సన్యాసిని కాదు" అన్నది.

"ఏమనాలో తెలియక అన్నాను. సన్నాసమ్మగారూ- అనాలా?" అని అడిగింది అమ్మ చిరునవ్వుతో.

"పో- అనవసరంగా మాట్లాడకు. అవతలకు పో-" అని అరిచింది సీతాయమ్మగారు.

"ఎవరు పోవలసి వస్తుందో...." అని ముసిముసి నవ్వులు నవ్వుతూ అమ్మ అడిగింది "ఓహో గురువుగారూ- అనాలా? అయితే మీకు ఎంతమంది శిష్యులున్నా రేమిటి?" అని

"కడతేర్చాలంటే ఒక్కరు చాలు. ఆడంబరంగా ప్రోగుజేసుకునే వాళ్లకు ఎందరున్నా చాలదు" అన్నది సీతాయమ్మగారు గర్వంగా.

ఆమెకు ఒక్కతే శిష్యురాలు. ఆమె బాపట్లలో కోనా వెంకట్రావుగారి భార్య సుభద్రమ్మగారు.

అకస్మాత్తుగా సుభద్రమ్మగారికి జబ్బు చేసినట్లుగా- కబురు వచ్చింది.

హడావుడిగా సామాను సర్దుకుని సీతాయమ్మగారు బాపట్ల ప్రయాణ

మయింది-తప్పనిసరిగా లోపల ప్రేమ ఉన్నా లేక పోయినా.

"అయ్యో.....అయ్యో............ గోరుచుట్టుపై రోకటిపోటు లాగా సీతాయమ్మగారికి ఎంతకష్టం వచ్చింది?" అని అందరూ ఆమెను పరామర్శించారు.

సీతాయమ్మగారు రాని కన్నీళ్ళు తుడుచుకుంటూ "నా బిడ్డ వంటిది" అని విలపించింది.

"బిడ్డ వంటిదా? బిడ్డా?" అని అడిగింది అమ్మ.

సీతాయమ్మగారు చఛ్ఛున వెనక్కు తిరిగి ఎఱ్ఱగా చూచింది. అమ్మ కూడా వెంటనే రక్తారుణ నయనాలతో చూస్తూ-

తప్పేదేమున్నది? ఎవరయినా అనుభవించవలసినదేగా? రాబోయే సంగతి ఎంతవారికీ తెలియదుగా! తెలియకపోతేనే యిట్లా ఉన్నది. తెలిస్తే యింకా ఎంత విఱ్ఱవీగుతామో......" అన్నది.

అంతలో గుఱ్ఱపుబండి వచ్చి ప్రాంగణంలో ఆగింది. బండివాడు సామాను బండిలో పెట్టాడు. వంచిన తల ఎత్తకుండా ఎవరితోనూ ఏ మాటా మంతీ లేకుండానే సీతాయమ్మగారు సరాసరి వెళ్ళి బండిలో కూర్చున్నది. సీతాయమ్మగారి ప్రయాణం సంగతితెలిసిన ఆ సమీపంలో ఉన్నవారంతా బిలబిలావచ్చి బండిచుట్టూ గుమికూడారు.

అమ్మకూడా దగ్గరకు వెళ్ళి బండిలోకి తల దూరిచి-

"ఏడవబోకండి - ఎందుకు ఏడుస్తారు?" ఒకళ్ళే శిష్యులయితే త్వరగా కడతేరవచ్చునుగా?" అన్నది పరిహాసంగా.

సీతాయమ్మగారు ఏమీ మాట్లాడక ప్రక్కకు తిరిగి కూర్చున్నది.

"కడతేరట మంటే ప్రాణం పోవటమేనా?" అని అడిగింది అక్కడనే ఉన్న బొడ్డుపల్లి సుందరమ్మగారు.

"ఇప్పడు ఆ మాట ఎవరన్నారు?" అన్నది అమ్మ అమాయకంగా ముఖంపెట్టి.

ఏవరేమి అంటున్నా సీతాయమ్మగారు మాత్రం పెదవి కూడా కదపలేదు. కన్నీటిధారతో ఆమె చెక్కిళ్ళు తడిశాయి.

ఎందుకో అమ్మకు ఆమెతో ఆడుకోనటం ఆనంద ప్రదమయింది.

"పాపం-మళ్ళీ రావాలనే దృష్టితో పోవటంలేదు సీతాయమ్మగారు" అన్నది అమ్మ.

సీతాయమ్మగారు మాత్రం ఏ మాటకూ కదలక అట్లాగే కూర్చున్నది.

బండి వెళ్ళిపోయింది.

అందరూ లోపలకు వచ్చారు.

ఆ సాయంకాలం పదిహేనుగురు కలిసి రెడ్డిపాలెంలోని ఆనందాశ్రమానికి వెళ్ళారు. వారిలో మరిడమ్మతాతమ్మా, అమ్మా కూడా ఉన్నారు.

దారి పొడుగునా మరిడమ్మగారు ప్రహ్లాదచరిత్ర గానంచేసింది. అందరూ ఆనందంగా వింటూ ఆశ్రమానికి చేరారు.

ఆశ్రమం ఎంతో ప్రశాంతంగా ఉన్నది. లక్ష్మీకాంతానందయోగిగారు పడక కుర్చీలో ఆసీనులై ఉన్నారు. అందరూ వెళ్ళిదూరంగా కూర్చుని వారిని చూస్తూ ఉన్నారు.

అక్కడ అందరూ వారిని బాబుగారు అంటారు.

అమ్మ బాబుగారి వద్దకు వెళ్ళి కూర్చున్నది.

వారు తంబురా తీసుకుని నామ సంకీర్తన ప్రారంభించారు. వారు సంకీర్తన ఎంతో ఆర్తితో చేశారు. వారి కంఠంలో ఎంతో మాధుర్యం ఉన్నది. వారు సంగీత సాహిత్యాల ఉభయత్రా పండితులు.

ఆ నామసంకీర్తనలోని మధురిమ అందరినీ తన్మయులను చేసింది.

ఆ సంకీర్తనలో బాబుగారుకూడా పరవశులై అశ్రుజలప్రపూర్ణనయనులై నిశ్చలత పొందారు. అక్కడ నుండి అందరూ లేచి భాగ్యమ్మగారి వద్దకు వెళ్ళారు.

భాగ్యమ్మగారు బాబుగారి శిష్యురాలు, సాహితీ సంపన్న

అమ్మ లోగడనే ఆమె వ్రాసిన పాటలు వినటం, చదవటం, పాడటం జరిగింది. అప్పటి నుండీ ఆమె అంటే అమ్మకు ఎంతో సదభిప్రాయం. అందువలన అమిత కుతూహలంతో అమ్మ ఆమె వద్దకు వెళ్ళింది. కాని భాగ్యమ్మగారు అమ్మవంక కన్నెత్తి అయినా చూడలేదు.

అమ్మయే ఆమెతో ఎట్లాగయినా మాట్లాడవలెనని అనుకుని-

"కొంచెం మంచినీళ్ళు యిస్తారూ?"- అని అడిగింది.

అయినా భాగ్యమ్మగారేమీ సమాధానం చెప్పలేదు.

అంతమందిలో ఆమెకు మాట్లాడటం అయిష్టమేమోననుకుని ఒంటరిగా ఆమెతో మాట్లాడటానికి అమ్మ నిర్ణయించుకుని ప్రయాణమయిన మరిడమ్మ తాతమ్మతో-

"నేను తరువాత వస్తాను. నీవు వీరందరితో వెళ్ళు-" అని చెప్పింది.

"ప్రొద్దు క్రుంకుతుంది. నీవు ఒక్కదానివీ రావాలికదా. మాతోనే రా"- అన్నది తాతమ్మ.

అమ్మ ఆ మాటలు వినిపించకోకుండా పరుగెత్తింది. తాతమ్మ వాళ్ళు చేబ్రోలు వెళ్ళారు. అమ్మ రెడ్డిపాలెం గ్రామంలోకి వెళ్ళి గ్రామమంతా చూచి తిరిగి ఆశ్రమానికి వచ్చింది.

అప్పటికి అందరూ వెళ్ళిపోయారు. ముగ్గురో నలుగురో భోజనంచేస్తూ ఉన్నారు. వాళ్ళు అమ్మను చూచినా అమ్మను భోజనానికి పిలవలేదు, పిలిచినా అమ్మ భోజనం చేయకపోవచ్చును గానీ అమ్మ కది ఆశ్చర్యకరమైంది.

అమ్మ ఒక్కతే ఆ ఆశ్రమమంతా కలయ తిరిగింది. అమ్మ ఆ వాతావరణం ఎంతో ఆహ్లాదకరంగానూ నేత్రపర్వంగానూ కనుపించింది.

మెల్లగా భాగ్యమ్మగారి దగ్గరకు వెళ్ళి పలకరించింది. ఆమె "ఎవరమ్మాయి?" అని అడిగింది.

"నేను అందరి మాయను" అన్నది అమ్మ.

"అబ్బో.....అబ్బో...." అని భాగ్యమ్మగారు అమ్మను దగ్గరకు తీసుకుని తల నిమురుతూ బాబుగారి దగ్గరకు తీసుకువెళ్ళి-

"ఈ అమ్మాయిని చూచారూ? ఎంత ముద్దుగా ఉన్నదో! మాటలు అంతకంటే ముచ్చటగా ఉన్నాయి!" అని చెప్పింది.

ఓహో .. అట్లాగా - ఎవరమ్మాయి?" అంటూ అమ్మ వంక చూచారు. మరి

అమ్మలో వారికి ఏమి సాక్షాత్కారమయిందో వారు అలాగే అనిమేషులయి నిశ్చేష్టులయినారు.

"ఇంకా వస్తా"నని అమ్మ బయలుదేరింది.

దారిలో అమ్మ తులసిచెట్టు దళాలు కోసుకుంటుంటే- "అమ్మాయి తులసిచెట్టును తాకకు" అని ఎవరో గట్టిగా కేకవేశారు.

"తులసిచెట్టు అంత అంటరానిదా?" అని బాబుగారి వంక చూచి నవ్వింది అమ్మ.

"అమ్మా-" అని బాబుగారు అరచి చేతులు చాచారు అప్పటికే అమ్మ పరుగెత్తి కనుమరుగయింది.

52. సంస్కరణ

ఆనందాశ్రమం నుండి అమ్మ చేబ్రోలు చేరేటప్పటికి రాత్రి పది అయింది. ఇంటివద్ద అందరూ భోజనంచేసి పడుకున్నారు.

ఆ మరునాడు అమ్మ, తాతమ్మ పెనుగుదలపాడు బయలు దేరారు. పదిన్నరకు భోజనంచేసి కృష్ణకాల్వవంతెన దగ్గరకు వెళ్ళారు. అక్కడ విచారిస్తే పడవ వెళ్ళిపోయిందని తెలిసింది. తాతమ్మ నడిచిపోవటానికే నిశ్చయించుకుని అమ్మతో చెప్పింది. అమ్మ అంగీకరించింది.

ఇద్దరూ కాల్వ గట్టున నడుస్తున్నారు. పదకొండున్నర అయింది. చిత్తయెండ చిటచిటలాడుతున్నది.

కొంతదూరం నడచిన పిమ్మట అమ్మకు దాహం అయింది. కట్టపొడుగునా చింతచెట్లు ఉన్నాయి గానీ పల్లంలో ఉన్నందున దారిలో వాటినీడ సోకటం లేదు.

మరిడమ్మతాతమ్మకు కూడా నడక చాలా శ్రమగానే ఉన్నది. అయినా అమ్మను నడిపిస్తున్నానని బాధపడుతుండగా అమ్మ అడిగింది-

"తాతమ్మా-నేను ఏ బాటన నడిచినా చింతలు కనపడుతూనే ఉన్నాయి. చింతలున్న బాటన నేను నడుస్తున్నానా? నేను నడిచే బాటలో చింతలు ఉంటున్నాయా? ఏదీ తేలటం లేదు. కానీ నా వెంట చింతలు మాత్రం తప్పవల్లే ఉన్నది."

"ఆ మాట అనటంలో నీ ఉద్దేశం ఏమిటి?" అని తాతమ్మ అడిగింది- ఆశ్చర్యంగా.

"ఇప్పుడు జరిగేదాన్నిబట్టీ, యిదివరకు జరిగినదాన్ని బట్టీ, జరుగబోయేదాన్ని బట్టిగూడ-అట్లాగే తోస్తున్నది..... ఎట్లాగయినా జరగనియ్యి - ముందు నాకు దాహం అవుతున్నది తాతమ్మా-"

"కూర్చోమ్మా చూస్తాను. కాసేపు కూర్చుంటే తీరుతుంది. ఈలోగా రేవు ఎక్కడన్నా ఉన్నదేమో కనుక్కుంటాను... పొరపాటు చేశాను. మరచెంబులో మంచి నీళ్ళు తేవాలిసింది. నిన్ను నడిపిస్తున్నాను. మల్లెపూవు వంటి శరీరం

చూడూ ఎట్లా కందిందో, ముఖం మందార పువ్వు అయింది. పాదాల్లో రక్తపుజీరలు కనుపిస్తున్నాయి."

తాతమ్మ కవిత్వాన్ని అమ్మ చిరునవ్వుతో అలకిస్తూ ఉంటే-మూటలో ఉన్న ఒకే ఒక్క నారింజపండును తీసి తాతమ్మ అమ్మ చేతికి యిచ్చింది.

అమ్మ దానిని వలుస్తుండగా జారి క్రిందపడింది. అది దొర్లుకుంటూ వెళ్లి ఒకచోట ఆగింది. అటు చూస్తే అక్కడ ఒక పెద్దపాము చుట్టుచుట్టుకొని పడుకొని ఉన్నది.

అంతలో ఒక అబ్బాయి తాబేటికాయ భుజాన తగిలించుకుని అటు వస్తూ కనుపించాడు, తాతమ్మకు ప్రాణం లేచి వచ్చింది.

ఆ అబ్బాయి సమీపించాడు. తాతమ్మ కనుక్కున్నది. అది కాళీదట. అంతకు కొన్ని క్షణాల క్రితమే అతడు అందులోని నీళ్లన్నీ త్రాగాడట.

అందుకు తాతమ్మ విచారపడుతుంటే అమ్మ నవ్వుతూ అన్నది-

"కాలవనిండా నీళ్లు ఉన్నా రేవు లేదు. ఇంత కాలవలో నాకు కావలసిన గుక్కెడు మంచినీళ్లు దొరకలేదు. నా మీద ప్రేమతో నారింజపండు యిస్తే అది జారిపోయింది. పడవకోసం వస్తే పడవ అందలేదు. ఎంత ప్రేమగల వాళ్లు ఉన్నా, ఎన్ని ఉన్నా బాధపడే యోగ్యత ఉన్ననాడు ఎవరూ తప్పించలేరు,"

ఇద్దరూ కలిగిన నష్టాన్ని నవ్వుతూ అనుభవిస్తూ రాత్రి ఎనిమిదిన్నరకు దారిలో శ్రీరంగపురం చేరారు.

"బ్రాహ్మల యిల్లు ఎక్కడ?" అని అడిగింది తాతమ్మ గ్రామంలోకి రాగానే ఎదురుపడ్డవారిని.

"ఎక్కడయితేనేమి తాతమ్మా - పడుకోటానికి?" అన్నది అమ్మ.

"కాస్త నీకు మెతుకు పెడతారేమో, అడుగుతాను."

"నాకు అక్కర్లేదు."

"కాసిని మంచినీళ్ళయినా తాగుదువుగాని."

"మెతుకుగానీ, మంచినీళ్ళుగానీ- ఏ యింటిలో నయితే నేమి తాతమ్మా?"

"అదేమిటమ్మా-ఎవరి వర్ణాశ్రమ ధర్మాలు వారు కాపాడు కోవద్దూ?"

అంతలో ఒకాయన అటు వచ్చి-

"ఏమిటవ్వా అడుగుతున్నారు?" అని అడిగాడు. ఆయన బ్రాహ్మణేతరుడు. వారి విషయం విని అమ్మను చూచి తమ యింటికి ఆహ్వానించాడు. భోజనానికి. తాతమ్మ అంగీకరించలేదు.

మరికొంతదూరం వెళ్ళారు. ఒకామె ఎంతో ఆదరంగా అప్యాయతతో ఆహ్వానించింది. తాతమ్మ విచారణ చేసింది. ఆమె బ్రాహ్మణ యువతి కాదు. తాతమ్మ నిర్మోహమాటంగా నిరాకరించింది.

చివరకు ఒక యిల్లు చేరారు. అది బ్రాహ్మణగృహమే. తాతమ్మ సంతోషపడ్డది. లోపలికి వెళ్ళి "మా అమ్మాయికి కొంచెం అన్నం పెడతారా!" అని అడుగు దామనుకుంటూ ఉండగానే ఆ యింటి యజమాని కసురుకున్నాడు- "వేళాపాళా లేదు. అర్ధరాత్రీ అపరాత్రీ వస్తే ఎవరు వస్తారని ఎవరు గుండెగలు వార్చుకుని ఎదురు చూస్తూ ఉంటారు!" అని.

తాతమ్మ అభిమానం గాయపడినా వెంటనే తేరుకుని "అన్నంకోసం రాలేదు నాయనా. ఈ రాత్రికి యిక్కడ పడుకుని, తెల్లవారుజామునే లేచి వెళదామని" అని బతిమాలుతున్నా ఆయన కంఠం యింకొంచెం పెంచి "దారిన పోయే వాళ్ళకోసం మేమేమీ భవంతులు కట్టలేదు." అని అరుస్తుంటే తాతమ్మ నిస్సహాయంగా అవమానభారంతో వీధిలోకి వచ్చి ఎటు వెళ్ళాల్సిందీ నిర్ణయించుకోలేక నిలుచున్నది.

అంతలో మరొకాయన ఆ బ్రాహ్మణవృద్ధని గావు కేకలు వినీ, ఆ ముసలమ్మనూ ఆ బాలికనూచూచి- మరిడమ్మగారి నడిగి జరిగిన ఉదంతం తెలుసుకుని వారి యింటికి పిలిచాడు. ఆయన బ్రాహ్మణుడే. తాతమ్మ సమ్మతించింది.

ఆయన పేరు రామయ్య, ఆయన భార్య పేరు రంగమ్మ. వారికి సంతానం లేదు. ఆస్తీ అంతగా లేదు. అందువలన వారికి పిల్లలమీద ఎంత ప్రేమ ఉన్నా ఎవరినయినా దత్తత తీసుకుందామనుకున్నా ఎవ్వరూ యివ్వలేదు.

రంగమ్మ అక్క రాజమ్మ. ఆమెకు చిన్నతనానే భర్త గతించి సంతానంలేక

చెల్లెలుతోనే కలిసి ఉంటున్నది. చెల్లెలు అమాయకత్వంవల్లనూ, మరిదిని లోబరుచుకునీ ఆ యింటిలో పెత్తనం రాజమ్మే చేస్తూ ఉన్నది.

అమ్మను చూడగానే రాజమ్మ ఆలోచన పరిపరివిధాల పరుగులెత్తింది.

"అమ్మాయి బంగారుబొమ్మ లాగున్నది. అడుగుదాము. అమ్మాయిని పెంపుడు కిచ్చినా సరే. లేకపోతే అమ్మాయి ఒంటినిండా బంగారమే. తెల్లవారేసరికి బంగారం ఊరు దాటిస్తే తరువాత ఆ డబ్బు చూపితే ఎవరయినా పెంపుడిస్తారు. ఇవ్వకపోయినా ఆ డబ్బుతో దర్జాగా బ్రతకవచ్చు..."

రాజమ్మ తన ఆలోచనను చెల్లెలుకు చెప్పింది. రంగమ్మ లబలబ లాడింది.

"క్రితం జన్మలో ఎంత దురితం చేసుకున్నామో- ఈ జన్మలో పిల్లలు కలగలేదు. ఈ జన్మలో యింకా యిటువంటి దురంతాలు చేస్తే భగవంతుడే మనల్ని క్షమించడు. ఆ అమ్మాయిని చూడు దేవతలా ఉన్నది. నీ మాటలు వింటే శపిస్తుంది."

తాతమ్మ అలసటతో నిద్రపోతూ ఉన్నా అమ్మ మెలకువగానే పడుకుని ఆ అక్కాచెల్లెలు సంభాషణ వింటున్నది.

రాజమ్మ పకపకా నవ్వి-

"రంగమ్మ పాపం పుణ్యం లెక్కలు వేస్తూ వచ్చిన అవకాశం జారవిడుచుకుంటే నిన్ను దేవుడుకూడా బాగుచేయలేడు. నీ కేదయినా ఒక అవకాశం లభిస్తే అది దేవుడే నీకిచ్చాడనుకో-"

అని హితబోధ చేస్తుంటే రంగమ్మ ఆ వేదాంతం అర్థం గాక-

"నాకీ అవకాశమూ వద్దూ, అందలాలూ వద్దూ-నన్ను నన్నుగా బ్రతకనీయండి. నీ మరిదీ. నీవూ కలసి ఒప్పకుంటే యిప్పడే నా దారిన నేను పోతాను. అడుక్కు తినయినా బ్రతుకు తాను" అని ప్రాధేయపడింది.

రంగమ్మ యిల్లు విడిచి వెళ్లితే రాజమ్మ రామయ్యతో కలసి ఆ యింటిలో ఒంటరిగా కాపురం చేయటం కష్టం. నలుగురూ విమర్శిస్తారు. అందుకనే మంచితనానికి మారుపేరయిన రంగమ్మ చాటున పాములాంటి రాజమ్మ సుఖంగా బ్రతుకుతున్నది. కడుపు చించుకుంటే కాళ్లమీద పడుతుందనీ, ఎక్కడ

తాను నోరు తెరిస్తే భర్తా, అక్కా బయటపడి భంగపడతారోననీ విషం లాంటి సత్యాన్ని కడుపులోనూ, కంఠంలోనూ మాత్రమే దాచుకుని పెదవి దాట నివ్వటం లేదు రంగమ్మ. తాను పాలు త్రాగాలి; అంతవరకే తెలుసు అవి ఆవుపాలో, గాడిదపాలో విచక్షణ అవసరం లేని మూర్ఖుడు రామయ్య. తన పొట్టకింత పదార్థం కావాలి- అది అన్నమయినా సరే, అశుద్ధమయినా సరే.

రాజమ్మ ఏమీ సమాధానం చెప్పకపోయేసరికి-

"ఈ అమ్మాయితో వెళ్ళిపొమ్మంటే హాయిగా వెళ్ళిపోతాను" అంటూ-

"ఏ దేవత అయినా అడ్డుపడి యీ బిడ్డకు యీ రాత్రికి ఏ గండమూ రాకుండా కాపాడితే బాగుండును" అని మనసులోనే వేయి దేవుళ్ళకు వేయి మ్రొక్కులు మ్రొక్కుకున్నది రంగమ్మ.

అంతలో రాజమ్మ నిద్రపోయింది.

రంగమ్మ మెల్లగా వెళ్ళి అమ్మపక్కలో కూర్చుని అమ్మను రాస్తూ అమ్మ ముఖంలోకి చూస్తూ ఉన్నది.

అమ్మ ముఖమండలం తేజోవంతమై మెరుస్తున్నది. అట్లా తాను అమ్మ ముఖంలోకి చూస్తుంటే అమ్మముఖంలో నుండి కాంతి రేఖలు తన హృదయం లోకి చొచ్చుకు పోతునట్లూ, తనలోని చీకటిరాసులు కరిగిపోతున్నట్లూ, తత్ఫలితంగా తనలో ఏదో అవ్యక్తానందం పొంగులువారుతున్నట్లూ రంగమ్మకు అనుభూతమయింది.

ఆనందతరంగిణిలో తేలిపోతున్న రంగమ్మకు రామయ్య గావుకేక వినిపించి త్రుళ్ళిపడింది. పరమానందంలో పరవశం చెందుతున్న రంగమ్మ మనస్సు అక్కడ నుండి లేవటానికి నిరాకరణతో జాగుచేసింది. అంతలో పిడుగుపాటులా మళ్ళీ పిలుపు వినిపించింది.

తప్పదనుకున్న రంగమ్మ లేచివెళ్ళింది. ఆ సమయంలో రామయ్య ఎందుకు తనను పిలిచాడో రంగమ్మకు తెలుసు. అందుకనే ఏమీ ప్రశ్నించకుండా పాదసంవాహనాని కుపక్రమించింది. చేతులు పాదసేవ చేస్తున్నా కన్నుల హృదయంలో పొంగులెత్తే ఆనందానికి చిహ్నంగా అశ్రుపూరితమయ్యాయి.

ఆ విషయం రామయ్యకు కెట్లా అర్థమవుతుంది?

"నీ మొహానికి ఎప్పుడూ ఏడుపే. ఇప్పుడేమయిందని" అని కాలి బలంకొద్దీ రంగమ్మను తన్నాడు.

అంతలో రాజమ్మ లేచి అమ్మదగ్గరకు వెళ్లి అమ్మ మెడలో ఉన్న కొంటె కొక్కెం మెల్లగా ఊడతీస్తున్నది. చటాలున అమ్మ లేచి కూర్చుని తన ఒంటిన ఉన్న నగలన్నీ తీసి దోసిట్లో పోసుకుని బయలుదేరింది. ఊహించని ఆ సంఘటనకు రాజమ్మ స్తబ్ధురాలై అమ్మను వెంబడించింది. అమ్మ రంగమ్మ దోసిట్లో తన నగలన్నీ క్రుమ్మరించి- "ఆయన దోసిట్లో పోసి నమస్కారం చేయమ్మా-" అని క్షణ మాగి రామయ్య నుద్దేశించి- "నాకు తల్లీ లేదు ఆమెకు పిల్లలూ లేరు. నాకు తల్లి మోజు, మీకు వదిన మోజు, ఆమెకు ధనం మోజు. ఈ రోజుతో అందరి మోజులూ తీరుతాయి. రంగమ్మగారిని నా వెంట తీసుకువెళతాను. రాజమ్మగారు మీతోనే ఉంటుంది. ఈ సొమ్ము సర్వమూ ఆమెకే అర్పణ చేయండి-" అన్నది.

పది సంవత్సరాలయినా సరిగాలేని చిన్నపిల్ల అయిన అమ్మ అట్లా చురుగ్గా పదునుగా మాట్లాడుతుంటే వారందరూ నిర్విణ్ణులై నిలబడి పోయారు.

కొద్ది క్షణాలకు రామయ్య తన దోసిలిలోని సొమ్మును అమ్మపాదాలపై క్రుమ్మరిస్తూంటే అమ్మ విచారించి అన్నది-

"నాకీ బంగారం అక్కరలేదు. నాతోకూడా రండి. ఇంతకు రెండింతలు బంగారం యిస్తాను. ముందు యీ మాట చెప్పండి. ఇందాక మీరు ఆమెను తన్నారే, దానికి ఏమి యిచ్చి ఋణం తీర్చుకుంటారు? ఋణంకాదు పొరపాటు. దానికి ఏమి శిక్ష వేసుకుంటారు? మీరు తన్నితే పడటం ఎట్లా ఆమెకు ధర్మమో, మీరు తన్నకుండా మీకూ ధర్మాలు అనేకం ఉన్నాయి."

భయమే ఎరుగని మొండి రామయ్య భయంతో గజగజ లాడుతూ-

"నీవు ఎవరమ్మా? ఇంతకాలం నేను చేసిన పాపాలన్నీ కలిసి రూపెత్తిన పిశాచానివా? దయ్యానివా?" అని అడిగాడు.

"దేవుడయితే నేమీ? దయ్యమయితే నేమీ?"

"అయితే, నన్ను దండించటానికే వచ్చావా?"

"కాదు - నీ తప్పును ఖండించటానికి-"

"దుష్టశిక్షణ, శిష్టరక్షణ చేసేదీ, చేయలిగేదీ- ఒక్కదైవమే నంటున్నారు. అందువల్ల నీవు దేవతవేమోననిపిస్తున్నది."

"కాదు. నేను మామూలు అమ్మాయినే."

"కాకపోవచ్చు. మామూలు అమ్మాయివేకావచ్చును"

"ఎందువల్ల? ఇందాక దేవతవేమోనన్నావు. ఇప్పుడు కాకపోవచ్చు నంటున్నావు. ఇంతలోనే ఏమయిందేమిటి?"

"ఏమీ కాలేదు. నా వంటి పాపాత్ముడికి దేవుడయితే యింత మాత్రంలోనే ప్రత్యక్షమవుతాడా? అందుకని కావనుకున్నాను."

"అయితే మీరు పాపాత్ములుగా పూర్తిగా అర్థం చేసుకున్నారా?"

"అనిపిస్తున్నదమ్మా. చేసేది తప్పని తెలుసు. తెలిసి కూడా చేయాలనిపిస్తున్నది."

"సరే... అవన్నీ పోనీయండి. మీరు నాతో కూడా రండి. పెనుగుదలపాడు వెళదాం. అమ్మాయిని కూడా తీసుకురండి. అమ్మాయి ఏమిటి? అమ్మాయి కాదు, పొరపాటు-అమ్మ. మీరు నాన్నా, ఆమె అమ్మా, అమ్మా నాన్నగార్లతో యెప్పుడూ ప్రయాణం అలవాటు లేదు. ఏ కారణంచేత నగలు తీసుకోవాలను కున్నారో, ఆ కొరత లేకుండా నేను మీ ముగ్గురినీ పోషిస్తాను, మీరు యీ రోజు నుండీ మీ వదిన గారిని మీ తల్లిగా చూచుకొనండి-"

అమ్మ చెబుతూ ఉండగా రాజమ్మ కలుగజేసుకుని "మన అందరినీ భరించవల్సిన అవసరం యీ అమ్మాయికి ఏం కలిగింది?" అని అనుమానాన్ని వెల్లడించింది.

"నోరుముయ్యి నీవు మాట్లాడవద్దు" అని రాజమ్మను కోప్పడి అమ్మను సంబోధించి-

"తరువాత ఏది ఎట్లా జరిగినా నా దురుద్దేశాలన్నీ మానుకుంటాను గానీ మా వదినగారిని మాత్రం అమ్మగా చూచుకోలేను" అని వినయంగా చెప్ప కున్నాడు రామయ్య.

"మానుకుంటే చూచినట్లే" నన్నది అమ్మ.

కొద్దిసేపు సంభాషణ జరిగిన తరువాత రామయ్య అమ్మతో-"నేను తరువాత

మన్నవ వస్తాను కానీ యిప్పుడు నీతో రాలేనమ్మా" అన్నాడు.

"మీరు నా వెంట రావటం విషయం తరువాత ఆలోచిద్దాము కానీ-మీరు యిందాక ఆమెను తన్నటంలో మంగళసూత్రం పెరిగింది. నేను గుచ్చి యిస్తాను. నా ఎదుట మీరు కట్టండి" అన్నది.

అంతలో రంగమ్మ దారమూ, పసుపూ, కుంకుమా తెచ్చి యిచ్చింది. అమ్మ దారం పేని పసుపు రాచి సూత్రాలు గుచ్చి రామయ్యకు అందించింది. ఇద్దరికీ కుంకుమతో బొట్లు పెట్టింది.

రామయ్య రంగమ్మ మెడలో పాతమంగళసూత్రాన్నే క్రొత్తగా కట్టాడు. గుడిలో గంటలు మంగళారావాలు వినిపించాయి.

రంగమ్మ రామయ్యకు నమస్కరించింది ఇద్దరూ కలిసి అమ్మ పాదాలపై మోకరిల్లారు. అమ్మ యిరువురి శిరస్సులపై కుంకుమ చల్లుతూ-

"నాయనా ఆమె నీకు దేవత. ఆమెకు నీవు దేవుడివి" అని వారి యిద్దరి శిరస్సులు తన చల్లని చేతులతో నిమురుతూ రాజమ్మ వంక తిరిగి-

"అమ్మా-వీరిద్దరినీ నీ బిడ్డలుగా చూచుకో" అని సలహా యిచ్చింది.

"బిడ్డలా? గడ్డలా?" అని ఉరిమింది రాజమ్మ.

"పోనీ నీవే వారి బిడ్డ వనుకో" అని అమ్మ సూచనలో మార్పుచేసి-

"మేము పెనుగుదలిపాడు వెళ్ళి వస్తాము. తిరిగి వెళ్ళేటప్పుడు మీయింటికి వచ్చి వెళతాము-మీరందరూ సక్రమంగా ఉన్నట్లు తోస్తే" అన్నది.

అమ్మ నగలన్నీ అమ్మకు రామయ్యే స్వయంగా అలంకరించి పాదాభి వందనం చేశాడు. సంతోషంతోనూ, సవినయంగానూ.

తెల్లవారగానే తాతమ్మా, అమ్మా పెనుగుదలపాడు వెళ్ళటానికి బయలు దేరారు. రామయ్యదంపతులు వారిని ఊరి బయట దాకా వచ్చి సమర్యాదగా పంపించారు.

అమ్మ ఆ దంపతుల వీడ్కోలు నందుకుంటూ- "నాయనా - మీ వదినగారికి కోపం వచ్చి వెళ్ళి పోతానంటుందేమో. మీరు భయపడకండి. వెళ్ళనివ్వండి. ఆమె ఎక్కడకూ పోదు. నా దగ్గరకే వస్తుంది. నేను బాగు చేసుకుంటాను.

ఆమె మనస్సును నేను మళ్లించుకుంటాను. ఆ పూచీ నాది-" అని అమ్మ బాధ్యతా యుతంగా పలుకుతుంటే వారి హృదయాలు కృతజ్ఞతాభారంతో అమ్మ పాదాలపై పున: ప్రణమిల్లాయి.

తరువాత పాదచారులయ్యే తాతమ్మా, అమ్మా పెనుగుదలపాడు చేరారు. అక్కడ తాతమ్మకు శిష్యులు అనేకులున్నారు. వారందరూ తాతమ్మను అనేక విధాల సత్కరించారు. తాతమ్మ అందరికీ అనేక వేదాంత రహస్యాలు అందించింది. చివరకు వచ్చేటప్పుడు తాతమ్మకు అందరూ హారతి యిస్తుంటే అమ్మ కూడా తాతమ్మ ప్రక్కనే ఉన్నా ఎవ్వరికీ అట్లా అనిపించలేదు. అమ్మ ప్రక్కనే తాతమ్మ ఉన్నదనిపించింది.

తిరుగు ప్రయాణంలో యిద్దరూ రామయ్యగారింటికి వచ్చారు.

అక్కడ వారిద్దరూ ఎంతో అన్యోన్యంగా పరస్పర అనురాగంతో కనుపించారు. కానీ రాజమ్మ మాత్రం ఆ యింటి నుండి నిష్క్రమించింది. అమ్మ మళ్లీ హామీ యిచ్చింది- "ఆమెను నేను బాగుచేసుకుంటాను. ఆమె కూడా నా బిడ్డే"నని

తాతమ్మా అమ్మా శ్రీరంగపురంలో ఒక రోజు ఉండి వెళ్లేటప్పుడు రామయ్య తమ కృతజ్ఞతా సూచకంగా అమ్మకు ఒక ఉంగరం చేయించి సమర్పించు కున్నాడు.

మరునాడు శ్రీరంగపురం నుండి పడవమీద చేబ్రోలు వచ్చి అక్కడ నుండి గుంటూరు చేరారు. తాతమ్మ, అమ్మ యిద్దరూ. అక్కడ అమ్మమేనత్త సుబ్బమ్మగారింటిలో పదిరోజులున్నారు.

53. అపూర్వాకాంక్ష

అమ్మా, తాతమ్మా పదిరోజులు గుంటూరులో ఉండి మన్నవ బయలుదేరారు. మధ్యలో పొన్నూరులో బస్సు దిగి మన్నవకు బండి కట్టించుకుంటూ ఉండగా మన్నవ నుంచి శ్రీ వాసుదాసుగారి దర్శనార్థం బ్రాహ్మణకోడూరు వెళ్ళుతున్న వాళ్ళు కనుపించారు. వాళ్ళు తాతమ్మను కూడా వారి వెంట రమ్మని కోరారు.

"నేను యిల్లు బయలుదేరి చాలకాలమయింది. అమ్మాయిని తీసుకువెళ్ళండి. నేను యింటికి వెళతాను" అన్నది తాతమ్మ.

అందరూ అందుకు అంగీకరించారు.

అమ్మను వారితో బ్రాహ్మణకోడూరు పంపించి తాతమ్మ మన్నవ వెళ్ళింది. వాళ్ళు అమ్మను తీసుకుని వెళ్ళారు కానీ ఎవరూ అమ్మ అన్నం తిన్నదీలేనిదీ కూడా కనుక్కొనలేదు. అందరూ ఎవరికివారు అమ్మ ఒక బిడ్డను దించితే మరొక బిడ్డను ఎత్తుకొనటానికి అందించారు. అమ్మకు వాళ్ళవాళ్ళ పిల్లలను ఎత్తుకొని ఆడించటమే సరిపోయింది. వాళ్ళందరూ స్వామివారి సన్నిధిలో మూడు రోజులున్నారు.

నాలుగవరోజున అందరూ బయలుదేరి ఒక్కొక్కరే స్వామివారికి నమస్కారం చేస్తూ ఉన్నారు. అమ్మ ఒక ప్రక్కగా నిలుచుని ఉండగా అమ్మ పినతండ్రిగారయిన రామబ్రహ్మంగారు అమ్మను కూడా నమస్కారం చేయమన్నారు.

అమ్మ నమస్కారం చేసింది. స్వామివారు అమ్మ శిరస్సుపై చేయి వేసి గోముగా నిమురుతూ "ఎవరీ అమ్మాయి?" అన్నట్లు రామబ్రహ్మంగారి వంక చూచారు.

రామబ్రహ్మంగారు "మా అన్నగారి కుమార్తె, తల్లి లేదు" అని పరిచయం చేశారు.

"అట్లాగునా, పాపం..." అని సానుభూతి ప్రకటిస్తూ అమ్మను తన దగ్గరకు తీసుకుని అమ్మ తలను తన గుండెలకు అదుముకొని-

"ఏమమ్మా-నీకు అమ్మ లేదుగా. అందరికీ నీ మీద ప్రేమ ఉండేటట్లు

ఆశీర్వదించేదా?" అని స్వామివారు అడిగారు.

"వద్దు నా మీద ఎవరికి ప్రేమ ఉన్నా లేకపోయినా నాకు మాత్రం అందరి మీదనూ ఎల్లప్పుడూ ప్రేమ ఉండేటట్లు ఆశీర్వదించండి-" అన్నది అమ్మ చిన్నగా.

"అదేమిటమ్మా?! నీ కోరిక బలే విచిత్రంగా ఉన్నదే! నీ మీద ప్రేమ అవసరం లేకపోవటమేమిటీ? నీకు అందరి పైనా ప్రేమ అనుక్షణమూ ఉండట మేమిటి?" అని అడిగారు అత్యాశ్చర్యంతో.

"ప్రేమ అంటే ఏమిటో తెలియాలంటే నాకు ఉంటేనేగా తెలిసేది. ఇతరులకు ఉంటే నాకేమి అర్థమవుతుంది.?" అన్నది అమ్మ ప్రశ్నార్థకంగా.

స్వామివారు అందుకు ఏమీ ప్రత్యుత్తరం యివ్వలేక మాట మారుస్తూ-

"పోనీ నీకేమి కావాలో చెప్పు" అని అడిగారు.

అమ్మ ఏమి ఆలోచించకుండానే వెంటనే "ఏమన్నా కావాలనేది అక్కర్లే కుండా కావాలి" అన్నది.

స్వామివారు దిగ్భ్రాంతి చెందారు. వారు ఎన్నో శాస్త్రాలు చదివారు. ఎన్నో వేదాంత గ్రంథాలు పఠించారు. వారి కెక్కడా ఆ మాట కనుపించలేదు. ఆ చిన్నపిల్ల హృదయంనుండి వెలువడిన ఆ పెద్ద కోరికకు విస్మయం చెందుతూనే వారు అమ్మను అడిగారు.-

"ఈ పండు తీసుకోవమ్మా-" అంటూ "అసలు నీకు ఏ పండు యిష్టం?" అని.

"ఏ పండయినా-"

"అంటే -అన్ని పండ్లూ తింటావా?"

"అందరి పళ్ళూ తింటాను."

పక్కగా నిలుచున్న అమ్మను స్వామివారు చెయ్యిపట్టుకుని ఎదురుగా నిలబెట్టుకున్నారు. వారు కన్ను ఆర్పకుండా అమ్మవంక అయిదు నిమిషాలు చూచి పెద్దపెద్ద కళ్ళుజేసి నాభి దగ్గరనుంచి ధ్వనిని లాగి షడ్జమస్థాయి అందుకునేటట్లుగా "రామబ్రహ్మం" అని కేక వేశారు.

ఆ పిలుపు మన్నవ రామబ్రహ్మంగారు విని స్వామి వారి యెదురుగా వచ్చి నిలుచున్నారు.

"నిన్ను గాదు నాయనా" అన్నారు స్వామివారు.

"మన్నవ రామబ్రహ్మం అని పిలిచినట్లు ఉంటేను."

"కాదు నాయనా-మన రామబ్రహ్మాన్ని

"అంటే ఎవరూ?"

స్వామివారు తమ కంఠసీమ నలంకరించిన పతకంలో ముద్రితమై ఉన్న రఘురాముని చూసి- " ఈ స్వామినే నాయనా" అన్నారు.

"మరి అమ్మాయినీ చూడగానే కేకవేశారేందుకూ? అని అడిగారు రామబ్రహ్మంగారు.

"అది నేను చెప్పేదీ కాదు, మీరు వినేదీ కాదు. ముందు ముందు అనుభవంలో మీకే అర్థమవుతుంది" అంటూ స్వామివారు అమ్మను పిలుస్తూ చేతులు చాపారు.

అమ్మకూడా రివ్వునవచ్చి వారిచేతుల్లో వాలిపోయింది. వారు అమ్మను పొట్టకు కరుచుకుని నొసటన ముద్దు పెట్టుకున్నారు. ఆ సమయంలో స్వామివారి బొట్టు చెదరి అమ్మ కళ్ళల్లో పడ్డది. అమ్మ కళ్ళుమూసుకుని చేతితో నలుచు కుంటూండగా స్వామివారు-

"కంటిలో నలకపడ్డదా అమ్మా-?" అని అడిగారు.

"కంటిలో నలకా లేదు. మనస్సులో కలకా లేదు. వెళ్ళివస్తాను" అన్నది అమ్మ.

రామబ్రహ్మంగారు "వాళ్ళను పంపించి మళ్ళీ వస్తాను" అని చెప్పి వెళ్ళారు.

స్వామివారు అమ్మను చూస్తూ-

"నాలుగురోజు లుండరాదూ?" అని అడిగారు.

"మా బాబాయిగారి నడిగి వారు ఉంటే నేనూ ఉంటాను" అన్నది అమ్మ.

కానీ మళ్ళీ వస్తానని చెప్పి వెళ్ళిన రామబ్రహ్మంగారు ఆ బండ్లతోబాటే వెళ్ళిపోయారు. అందువల్ల అమ్మకూడా బయలుదేరింది.

"మరి నీవు ఎట్లా వెళతావమ్మా?" అని స్వామివారు అడిగారు.

"ఎట్లా ఉంటే అట్లా వెళతా" నన్నది అమ్మ.

"దారిలో బండ్లు కనుపించకపోతే వెనక్కు వచ్చేయమ్మా. నడిచి వెళ్లకు-" అన్నారు జాలిగా స్వామివారు.

"వాళ్లబండిలోనే వెళ్లాలని ఏమున్నది? ఎవరు ఎక్కించుకున్నా ఎక్క వచ్చుగదా!"

"సరే" నంటూ స్వామివారు అర్ధనిమీలిత నేత్రులయ్యారు నమస్కార పూర్వకంగా.

అమ్మ గబగబా పరుగెత్తింది.

ఆ పరుగును చూస్తూ స్వామివారు "ఆ జానకీవల్లభుడే యీ బాలికై వచ్చాడా.." అనుకుంటూ కనులింత లింతలు చేసుకుని చూస్తుండగానే అమ్మ మలుపు తిరిగింది.

54. అందరూ మంచివాళ్ళే

అమ్మ వాసుదాసుగారి నుండి సెలవు తీసుకుని బయటకు వచ్చేటప్పటికే మన్నవనుంచి వచ్చిన బండ్లు చాలా దూరం వెళ్ళాయి.

అయినా అమ్మ కాలినడకనే బయలుదేరింది. అంతలో ప్రొద్దు గ్రుంకింది. దొప్పలపూడి వాస్తవ్యులయిన బ్రహ్మయ్యగారి బండి వెనుకనే బండి పట్టుకుని అమ్మ నడక సాగించింది.

"ఏయ్, అమ్మాయి-బండిలో చెయ్యిపెట్టకు-" బండిలో నుండి ఎవరో కసిరారు.

అమ్మ చెయ్యితీసి బండివెనుకనే, వారికి కనుపించుతూనే నడుస్తూ ఉన్నది.

"ఇంకా, యీ అమ్మాయి ఎవరో మనబండి వెనుకనే నడుస్తున్నదే" అని వారు వినుక్కుంటూ ఉండగానే వారికి క్రిందటి రోజున జరిగిన అమ్మా-స్వామివారల సంభాషణ ఘట్టం స్ఫురణకు వచ్చింది.

"ఆ అమ్మాయి ఎంత అదృష్టవంతురాలో..." నని ఒకరూ.

"చిన్నపిల్ల అయినా పెద్దలదృష్టి నాకర్షించింది" అని యింకొకరూ.

పలువురు పలురకాలుగా అనుకుంటూ ఉండగా ఒక చిన్నబ్బాయి "ఈ అమ్మాయేనమ్మా ఆ అమ్మాయి" అని అమ్మను చూపించాడు.

"కాదు ఆ అమ్మాయి చక్కగా జామపండురంగు, మంచి గిరజాలు. తెల్లవాళ్ళ పిల్లల్లే ఉంది" అన్నారు యింకొకరు.

బండి తోలే అతను వెనక్కుతిరిగి చూచి "ఆ అమ్మాయి లాగానే ఉన్నది. పిలుద్దాం" అన్నాడు. బండి ఆపారు.

అమ్మ బండి వద్దకు వచ్చింది.

"నిన్న వాసుదాసుగారు పిల్చింది నిన్నేనా?"

"అవన్నీ తరువాత మాట్లాడుకుందాము, ముందు లోపలకు ఎక్కనివ్వండి. పాపం చిన్నపిల్ల" అని ఒకరంటే "మనకే యిరుకుగా ఉన్నది" అని యింకొకరు నసిగారు.

"అమ్మాయి, యిటురా-నా దగ్గర కూర్చుందువుగాని" అని బండి తొట్టిలో కూర్చున్న వాళ్ల జీతగాడు ఆదరంగా పిలిచాడు.

"వద్దు-నాకు నడిస్తేనే హాయిగా ఉంటుంది" అన్నది అమ్మ.

వెంటనే ఆ జీతగాడు బండిని ఆపి తాను బండిలో నుండి క్రిందికి దూకి అమ్మను యెత్తుకుని బండిలో ఎక్కించుకున్నాడు.

"అమ్మాయి - మీది ఏ ఊరు?" అని బ్రహ్మయ్యగారు అడిగారు.

"మన్నవ" అన్నది బండిలోనే కూర్చున్న ఒకామె.

"మన్నవలో ఎవరి అమ్మాయివి?" అని మళ్లీ బ్రహ్మయ్యగారే ప్రశ్నించారు.

"ఎవరి అమ్మాయంటే ఏమని చెప్పాలి?" అని అమ్మ తిరిగి ప్రశ్నించింది.

"ఒట్టి పిచ్చిపిల్లలాగా ఉన్నది. అదిగూడా తెలియదూ?" అన్నాడు బ్రహ్మయ్యగారి కుమారుడు.

"మా నాన్నగారి పేరు తెలియదండి. నాన్న నాన్న అనటమే తప్ప పేరు అవసరం కలుగలేదు. నాన్న అనటమే తెలుసును" అన్నది అమ్మ.

"నీవన్నట్లు పిచ్చి అమ్మాయేరా" అని కుమారునితో అని, అమ్మనుద్దేశించి "పోనీ నీ పేరయినా నీకు తెలుసునా?" అని అడిగారు బ్రహ్మయ్యగారు.

"పేరంటే అసలు ఏమిటి?" అని అమ్మ అడిగింది.

"నిన్నేమని పిలుస్తారు?" అని అడిగారు బ్రహ్మయ్యగారు.

"ఇందాక మీరేమని పిలిచారు?"

" ఈ అమ్మాయి చాలా అసాధ్యపుపిల్లవలే ఉన్నదే!" అని బ్రహ్మయ్యగారు ఆశ్చర్యపోయారు.

"మీరప్పుడే రెండు పేర్లతో పిలిచారు-అమ్మాయి అనీ పిల్ల అనీ. అట్లాగే ఎవరికి వీలయినట్లు ఎవరికి తోచినట్లు వాళ్ళు పిలుస్తారు. నా పేరు యిదీ అని ఎవరూ చెప్పలేదు."

"స్కూల్లో నీ పేరు ఏమని వ్రాశారు.?"

"మీరయినా కష్టపడి బండి ఎక్కించుకున్నారుగానీ మా వాళ్ళు నన్ను బడికి పంపలేదు."

"ఇందాక బండిలో ఎక్కించుకునే విషయంలో తలా ఒక మాట

అన్నాముకదూ. అందుకని అట్లా అంటున్నది...

అర్థమయిందిరా అబ్బాయి?" అని బ్రహ్మయ్యగారి భార్య కుమారుని ప్రశ్నించింది.

" ఆ అమ్మాయికి అంత తెలివితేటలు లేవులే అమ్మా. అసలు తన అవయవాలనయినా గుర్తుపడుతుందో లేదో, అయినా చుద్దామూ" అంటూ వాళ్ళ జీతగాడిని పిలిచి అమ్మను తొట్టిలో నుండి లోపలకు పంపమన్నాడు.

"వద్దులెండి నా దగ్గరనే కూర్చోనివ్వండి. బలే ముద్దుగా ఉన్నది. ఈ వెన్నెల్లో ఆ ఒంటిరంగు చూడండీ ఎట్లా మెరిసిపోతున్నదో" అన్నాడు జీతగాడు.

" ఆ ముద్దూ మేమూ అనుభవిస్తాముగా" అన్నారు బండిలోని అందరూ.

జీతగాడు అమ్మను లోపలకు పంపించాడు.

"అమ్మాయిని - నీపొట్ట యేది.?"

అమ్మ మాట్లాడలేదు.

"నీ చేతు లేవి?"

"నా దగ్గరే ఉన్నాయి.

"నీ ముక్కేది?"

"ఏది ఉండేచోట అది ఉన్నది!

"అన్నీ ఉన్నాయి కానీ యీ అమ్మాయికి బుద్దే లేదు" అన్నాడు బ్రహ్మయ్యగారి కుమారుడు వికటంగా నవ్వుతూ.

"నీకుంటేనేగా తెలిసేది" అన్నది అమ్మ నిర్వికారంగా.

"ఇంకా అనుమానం ఏమున్నది? ఈ అమ్మాయితోనే వాసుదాసుగారు మాట్లాడింది ఔనా అమ్మాయి?" అని బ్రహ్మయ్యగారి భార్య అడిగింది.

"నిన్న చూచారు. యివ్వాళ చూస్తున్నారు. ఇంకా నన్ను అడగటం ఎందుకు?" అని అడిగింది అమ్మ.

"నిన్నటి పిల్లవలెనే ఉన్నావు కానీ స్పష్టంగా అన్ని పోలికలూ లేవు. అట్లా అని పోలికలు లేకుండానూ లేవు. ఇందాక క్రింద నడిచేటప్పటికీ ఇప్పటికీ తేడా

కనుపడుతున్నది. చూస్తున్నకొద్దీ క్షణక్షణానికీ మారి పోతున్నావు" అని బ్రహ్మయ్యగారి కుమార్తె అమ్మతో అంటూ వాళ్ళ అమ్మ నుద్దేశించి "ఇదిగో చూడు, యిప్పుడు చూడు, చూడవే-అమ్మా-చూడవే-ఆ అమ్మాయి ముఖం చూడవే- క్షణక్షణానికీ మారి పోతున్నది. నేను పూజ చేసుకుంటానే పటము, ఆ పటంలోని పోలిక ఉన్నదో లేదో చూడు" అన్నది.

"మార్పు కనపడుతున్నది గానీ నేను అంతగా గుర్తించలేకపోతున్నామ్మా."

అంతలో బ్రహ్మయ్యగారు కలుగజేసుకుని "ఏమీ టమ్మాయ్. నీ వంటున్నది. ఎవరి వంట?" అంటూ అమ్మ వంక చూచారు. చూస్తూ అనిమేషులై కొన్ని క్షణాలు ఉండి పోయి - "అమ్మా కనకదుర్గా - నువ్వేనా?" అని గద్గద కంఠంతో అంటూ కొడుకును పిలిచి "ఒరే పెట్టరా, దణ్ణం పెట్టరా-ఇకనయినా నీకు మంచిరోజులు వస్తయ్యేమో...." అన్నారు.

"ఎందుకూ పెట్టటం? మీకు కనుపించిందేదో నాకు కనపడవద్దూ?"

"తల్లీ ఒక్కసారి వాడివంక చూడు" అని అమ్మను బ్రహ్మయ్యగారు బతిమాలారు.

అమ్మ అతని వంక ప్రసన్నంగా చూచింది.

బ్రహ్మయ్యగారి కుమారుడు వెంటనే అమ్మ కాళ్ళపై వాలాడు. అందుకు బ్రహ్మయ్యగారికి అమితానందం కలిగింది. బ్రహ్మయ్యగారి కుమార్తె ఆనంద భాష్పాలతో నిశ్చలంగా ఉండి పోయింది.

తొట్లోనుంచి జీతగాడు కూడా గూడుక్రిందగా తలవంచి చూస్తూ తన్మయుడయినాడు.

అందరూ ఒక క్రొత్త ఆనందానుభవంతో పరవశం చెందారు. వారందరూ ఆ స్థితిలో ఉండగానే ఎద్దులు సరాసరి వారింటిముందుకు వచ్చి బండిని ఆపాయి.

అందరూ దిగి అమ్మనుకూడా వారియింటిలోకి వచ్చి కొంచెం మంచినీళ్ళు త్రాగి మళ్ళీ బండిమీదనే మన్నవ వెళ్ళమన్నారు. కాని అమ్మ నడిచే వెళతానన్నది. అయినా వారు అంగీకరించక బండిమీదనే తీసుకువెళ్ళి దించిరమ్మని జీతగాడికి చెప్పారు బ్రహ్మయ్యగారు.

"ఏమిటమ్మా నీవు నడిచేది. బుల్లిపాపాయివి" అని అమాంతం అమ్మను ఎత్తుకుని వెళ్ళి బండిలో కూర్చోబెట్టాడు జీతగాడు.

"చూడటానికి పొట్టిగా ఉన్నాను. కానీ నాకు చాలా వయస్సున్నది" అన్నది అమ్మ

"చాలా అంటే ఎంతమ్మా నీ వయస్సు?"

"ఇంత అని చెప్పలేను."

"ఏదీ చెప్పలేను, చెప్పలేను అంటా వేమిటమ్మా?"

"చెప్పేది కాదు గనుక. చెబితే తెలుసుకుండేది కాదు నాయనా."

బ్రహ్మయ్యగారు మొక్కజొన్న కండెల బుట్ట తీసుకుని అమ్మకు అందించాడు.

అమ్మను తనతోబాటే తొట్టిలో కూర్చోబెట్టుకుని జీతగాడు అమ్మను ఏవేవో అడుగుతుంటే-

"అవన్నీ సరేగానీ, మీ దేవూరు నాయనా?" అని అమ్మ అడిగింది.

"జడవల్లి. మా బంధువులు యిక్కడ ఉన్నారు. వాళ్ళు తీసుకువచ్చి నన్ను వీళ్ళ యింట్లో ఉంచారు. కమ్మవారి యింట్లో ఉంటే పని బాగా వస్తుందనీ."

"వాళ్ళు కమ్మవారంటున్నావూ, నీవు ఎవరివి?"

"నీకు తెలియదూ?"

"నా కేమీ తెలియదు నాయనా."

"ఇందాక బండిలో అన్ని మహత్మాలుచూపించావే- నీకు తెలియదంటే ఎట్లా?"

"మహత్మాలు నీకు కనుపించాయి? వాళ్ళు అనుకుంటుంటే విన్నావా?"

"వాళ్ళు అనుకోవటం నాకు తెలియదు కానీ బండి వెంట నీవు నడుస్తుంటే చందమామ నడచినట్లే ఉన్నదమ్మా.

"తేపా నీకు తెలియందేమున్నది- అంటున్నావు. ఏం చూచి అంటున్నావు? ఏం తెలుసుకుని అంటున్నావు?"

"ఎందుకో తెలియదుగానీ అట్లా అనాలనిపిస్తున్నది తల్లీ"

"అది సరేగానీ. నీకు అన్నం మూడుసార్లు పెడతారా?

"పెడతారమ్మా."

"జీతం ఎంత?"

"పదిహేను రూపాయలు".

"పదిహేను రూపాయల్లో జీవనం సాగుతుందా మీ వాళ్లకు?"

"అందరూ తెచ్చుకుంటారుగా అమ్మా- ఎవరి కూలి వాళ్ళు. ఈ పదిహేను రూపాయలతో యీ యేడు మా చెల్లులుకు పెళ్లి చేస్తారు."

అంతలో ఊరి బయటి మురుగుకాల్వ వచ్చింది.

"మనం దిగి కాసేపు కట్ట మీద కూర్చుందాం" అన్నది అమ్మ.

"నేను ఎద్దులకు మేతకూడా తేలేదమ్మా. ఆలస్యమయితే ఏమయినా అంటారు. నన్ను మీ యిల్లు గుర్తుపెట్టుకు రమ్మన్నారు."

"సరే మంచిదే. ఇల్లు గుర్తు పెట్టుకుంటే నీవప్పుడప్పుడు వచ్చి కనపడి పోవచ్చును.

"మేతకు పొలం వచ్చినప్పుడు రావచ్చును గానీ మీ యింటికి వస్తే మీ వాళ్లేమయినా అంటారేమో-"

"మా యింటికి రావద్దునాయనా. నేను సామాన్యంగా గంగరాజు పున్నయ్య గారి తోటలోగానీ, మురుగుకాలవ కట్టమీదగానీ, బల్లకట్టు వద్దగానీ ఉంటాను. అక్కడ లేకపోతే యింటికి రా. మీ చెల్లెలు పెళ్లికి పదిహేను రూపాయలేమి చాలుతాయి. ఈ ఉంగరం తీసుకో-" అని అమ్మ ఉంగరం తీసి యిచ్చింది.

"నాకు వద్దమ్మా. నీవు చిన్నపిల్లవు. మా కామందులు ఊరుకోరు."

"ఇందాకనేమో - నాకు తెలియంది లేదన్నావు. నేను మహత్యాలు చూపించానన్నావు. ఇప్పుడేమో చిన్నపిల్లను అంటున్నావు" అని అమ్మ ఆశ్చర్యం ప్రకటించింది.

"రెండూ అనిపిస్తున్నయ్యమ్మా. నన్ను అదే తికమకపెడుతున్నది."

కొద్దిక్షణాలు మౌనంగా గడిచిన పిమ్మట జీతగాడు అన్నాడు "నాకు ఎందుకో

నీ పాదాల దగ్గరనే పడి ఉండాలనిపిస్తున్నది. కాని, నేను చాలా చెడ్డవాడి నామ్మా. అన్నీ తప్పుడలవాట్లే నమ్మా."

"మంచి అలవాట్లు ఏమీ లేవా?" అని అమ్మ అడిగింది.

అతడు ఆలోచనలో పడ్డాడు. కొన్ని క్షణాలకు " ఒక్కటున్నదమ్మా. ఎవరు తినలేదన్నా సహించలేను. నేను మానుకుని అయినా వాళ్ళకు పెడతాను" అన్నాడు.

"అంతేనా? అని అమ్మ మళ్ళీ ప్రశ్నించింది. అతడు కొంచంసేపు ఆలోచించి "అబద్ధమాడనమ్మా-" అన్నాడు.

"ఇంకేం నీకు ఉన్నవన్నీ చెడ్డ అలవాట్లే నంటావేమిటి? లేక నీ దృష్టిలో యివి కూడా చెడ్డ అలవాట్లేనా? అని అడిగింది అమ్మ చిన్నగా నవ్వుతూ.

అతను అమ్మ మాటలకు పకపకా విరగపడి నవ్వాడు. మళ్ళీ అమ్మ అన్నది "మనుషులందరూ మంచివాళ్ళేనాన్నా. చెడ్డవాడు ఎవడయినా ఉన్నాడూ అంటే మనం అనుకునే యీ చెడ్డతనాన్ని మనకు యిచ్చిన ఆ భగవంతుడు మాత్రమే"

అతనికి అమ్మ మాటల్లోని అర్థం - అవగాహనకాక అమ్మ వంక చూస్తూ మౌనంగా నిలుచుండిపోయాడు.



అంబికాష్టోత్తర శతనామావళి

ఓం, ఐం, క్లీం, హ్రీం, శ్రీం

ఓం శ్రీ అనసూయాయై నమః
ఓం శ్రీ జగన్మాత్రే నమః
ఓం శ్రీ కేవలాయై నమః
ఓం శ్రీ సకలావన్యై నమః
ఓం శ్రీ నవ్యాయై నమః
ఓం శ్రీ నాగేశపత్న్యై నమః
ఓం శ్రీ సాధ్వ్యై నమః
ఓం శ్రీ మద్వ్యై నమః
ఓం శ్రీ వత్సలాయై నమః
ఓం శ్రీ మన్నవాన్వయజాయై నమః 10
ఓం శ్రీ మాయాయై నమః
ఓం శ్రీ మహితాయై నమః
ఓం శ్రీ లలితాకృతయే నమః
ఓం శ్రీ బ్రహ్మాండపావన్యై నమః
ఓం శ్రీ బ్రాహ్మ్యై నమః
ఓం శ్రీ బ్రహ్మణ్యాయై నమః
ఓం శ్రీ బ్రహ్మరూపిణ్యై నమః
ఓం శ్రీ రంగాంబికాసుతాయై నమః
ఓం శ్రీ రమ్యాయై నమః
ఓం శ్రీ రాజరాజేశ్వర్యై నమః 20
ఓం శ్రీ క్షమాయై నమః
ఓం శ్రీ చిదానందాయై నమః
ఓం శ్రీ చిదాకారాయై నమః
ఓం శ్రీ చిద్వేద్యాయై నమః
ఓం శ్రీ అర్కపురీస్థితాయై నమః
ఓం శ్రీ పాటలాంగ్యై నమః
ఓం శ్రీ పాపఘ్న్యై నమః
ఓం శ్రీ పురాణ్యై నమః
ఓం శ్రీ పుణ్యదర్శనాయై నమః
ఓం శ్రీ అగ్నిగర్భాయై నమః 30
ఓం శ్రీ ఆర్తిభారఘ్న్యై నమః
ఓం శ్రీ గమ్యాయై నమః
ఓం శ్రీ అగమ్యాయై నమః
ఓం శ్రీ శ్రుతిస్తుతాయై నమః
ఓం శ్రీ సర్వస్వత్యై నమః
ఓం శ్రీ జగద్ధాత్ర్యై నమః
ఓం శ్రీ భర్త్ర్యై నమః
ఓం శ్రీ హంత్ర్యై నమః
ఓం శ్రీ శివేక్షణాయై నమః
ఓం శ్రీ హృద్యాయై నమః 40
ఓం శ్రీ ఉదారహృదయాయై నమః
ఓం శ్రీ సదయాయై నమః
ఓం శ్రీ జగదీశ్వర్యై నమః
ఓం శ్రీ లక్ష్మ్యై నమః
ఓం శ్రీ లాలనాలోలాయై నమః
ఓం శ్రీ బాలాయై నమః
ఓం శ్రీ శ్రీలాయై నమః
ఓం శ్రీ నిశ్చలాయై నమః
ఓం శ్రీ మహోదర్యై నమః
ఓం శ్రీ మహాశక్త్యై నమః 50
ఓం శ్రీ మాధవ్యై నమః
ఓం శ్రీ మహోదయాయై నమః

ఓం శ్రీ దుర్గాయై నమః
ఓం శ్రీ దుర్గమచారిత్రాయై నమః
ఓం శ్రీ దుఃఖఘ్న్యై నమః
ఓం శ్రీ దౌష్ట్యవారిణ్యై నమః
ఓం శ్రీ ధీరాయై నమః
ఓం శ్రీ గభీరాయై నమః
ఓం శ్రీ గంభీరవచనాయై నమః
ఓం శ్రీ అపారశక్తిదాయై నమః
ఓం శ్రీ గుణాతీతాయై నమః
ఓం శ్రీ గుణాధారాయై నమః
ఓం శ్రీ కాంతిదాయై నమః
ఓం శ్రీ ధ్వాంతరూపిణ్యై నమః
ఓం శ్రీ సర్వస్థితాయై నమః
ఓం శ్రీ సర్వదృశ్యాయై నమః
ఓం శ్రీ సకలాయై నమః
ఓం శ్రీ సర్వభావితాయై నమః
ఓం శ్రీ ప్రేమార్ద్రాయై నమః
ఓం శ్రీ ప్రేమరూపాయై నమః 70
ఓం శ్రీ ప్రియాంబాయై నమః
ఓం శ్రీ ప్రియభర్తృకాయై నమః
ఓం శ్రీ ప్రేమర్షిజనన్యై నమః
ఓం శ్రీ ప్రేష్ఠాయై నమః
ఓం శ్రీ ప్రేమదాయై నమః
ఓం శ్రీ ప్రియపుత్రకాయై నమః
ఓం శ్రీ అన్నపూర్ణాయై నమః
ఓం శ్రీ జగత్పూర్ణాయై నమః
ఓం శ్రీ పూర్ణచంద్రాననాయై నమః
ఓం శ్రీ శివాయై నమః 80
ఓం శ్రీ సుధాపూర్ణాయై నమః
ఓం శ్రీ సువర్ణాభాయై నమః
ఓం శ్రీ వశిన్యై నమః
ఓం శ్రీ యశస్విన్యై నమః
ఓం శ్రీ అభిషేకప్రియాయై నమః
ఓం శ్రీ ఆద్యాయై నమః
ఓం శ్రీ ప్రసన్నాయై నమః
ఓం శ్రీ భర్తృసేవిన్యై నమః
ఓం శ్రీ ప్రశాంతాయై నమః
ఓం శ్రీ పరమర్షీడ్యాయై నమః 90
ఓం శ్రీ పరమాయై నమః
ఓం శ్రీ పరాత్పరాయై నమః
ఓం శ్రీ శ్రుతిసీమంతకలితాయై నమః
ఓం శ్రీ శుద్ధాయై నమః
ఓం శ్రీ బుద్ధాయై నమః
ఓం శ్రీ సుభాషిణ్యై నమః
ఓం శ్రీ విశ్వసమ్మోహిన్యై నమః
ఓం శ్రీ విద్యాయై నమః
ఓం శ్రీ విశిష్టాయై నమః
ఓం శ్రీ విశ్వరూపిణ్యై నమః 100
ఓం శ్రీ వాధాప్రియాయై నమః
ఓం శ్రీ అనలాశ్లిష్టాయై నమః
ఓం శ్రీ గదాభీష్టాయై నమః
ఓం శ్రీ అహిచుంబితాయై నమః
ఓం శ్రీ అపూర్వచారిత్రాయై నమః
ఓం శ్రీ అజ్ఞేయాయై నమః
ఓం శ్రీ విచిత్రాయై నమః
ఓం శ్రీ విశ్వవందితాయై నమః
ఓం శ్రీ ఓం, ఐం, క్లీం, హ్రీం, శ్రీం

ఓం

1. కీర్తన (హారతలు)

పరమాత్మనైన నా అమ్మా! నీరాజనమ్ము గైకొమ్మా!
సుడిగాలిలో సొక్కిసోలి సడిలేని నీ ఒడిలో వ్రాలి
జడప్రాయమైన జీవాళి దరిజేర్చు తల్లీ నీవాళి
పరమాత్మవైన నా అమ్మా! నీరాజనమ్ము గైకొమ్మా!
బేదమెరుగని నీ విధానాలు బోధించు నాకు వేదాలు
వేదాలు తెలుపు సారాలు నా నుదుట నీ చేతి వ్రాలు
పరమాత్మవైన నా అమ్మా! నీరాజనమ్ము గైకొమ్మా!

2. కీర్తన

మాతృదేవికి మంగళం మా మంగళానికి మంగళం
శ్రీకరంబై దివ్యమై భాసిల్లు తల్లికి మంగళం!
సాక్షియై పరమాత్మయై సద్రూపమై సత్యంబువై
సర్వకారణ శక్తియై శోభిల్లు తల్లికి మంగళం ॥మాతృ॥
సర్వజీవ ప్రేరణంబై సర్వాంతర్యామియై!
సర్వమంత్ర మయశ్శివంబై చెలగు తల్లికి మంగళం॥మాతృ॥
నిత్యమై నిస్తత్వమై నిర్వ్యాజమై నిర్లిప్తమై!
నిష్కళీ భూతంబునై విలసిల్లు తల్లికి మంగళం ॥మాతృ॥
అవ్యయంబై ఆద్వయంబై అవాఙ్మానస గోచరంబై!
సగుణ నిర్గుణ తత్వమౌ అనసూయ తల్లికి మంగళం ॥మాతృ॥

జయహోమాతా శ్రీ అనసూయ రాజరాజేశ్వరి శ్రీపరాత్పరి

సమాప్తం


ఓం అంత
మాతృశ్రీ
జీవిత మహోదధిలో
తరంగాలు